# రుక్మిణీ కల్యాణము

---

## మాస్టర్ కె. పార్వతీకుమార్ గారి ప్రవచనములు

### విజయవాడ గురుపూజలు

2012, 2013, 2014

# విషయసూచిక


| | |
|---|---|
| ప్రవచనము 1 | 5 |
| ప్రవచనము 2 | 29 |
| ప్రవచనము 3 | 55 |
| ప్రవచనము 4 | 85 |
| ప్రవచనము 5 | 119 |
| ప్రవచనము 6 | 145 |
| ప్రవచనము 7 | 151 |
| ప్రవచనము 8 | 181 |
| ప్రవచనము 9 | 215 |
| ప్రవచనము 10 | 237 |
| ప్రవచనము 11 | 259 |
| పద్యములు | 283 |

# రుక్మిణీ కల్యాణము

## మార్చి 3, 2012 సాయంకాలము – ప్రవచనము #1

బ్రహ్మావర్తము, ఆర్యావర్తము, భరతభూమి అని ప్రసిద్ధిగాంచినటువంటి ఈ పుణ్యభూమి యందు అనాదిగా మానవులు బ్రహ్మమును నిరాకరించక, బ్రహ్మోత్పాతముతో కూడినటువంటి నిత్యజీవితం సాగించినటువంటి నాగరికత మనది. బ్రహ్మమును చేరటమే జీవునికి నిజమగు విజయము. అలా బ్రహ్మమును చేరుట అనేటటువంటిది ఎవరికి సాధ్యపడిందో వారందరూ విజయమును సాధించినటువంటివారు. "విజయ" అన్నటువంటి నామము దైవమును చేరినటువంటి జీవునికి వర్తింపబడుతుంది. పుణ్యమయినటువంటి కృష్ణానదీ తీరంలో కనకదుర్గమ్మ వెలసినట్లుగా, విజయవాడ ఒకటి ఇక్కడ ఏర్పడి ఉన్నది. ఈ విజయవాడలో మాస్టరు సి. వి. వి. గురుపూజా మహోత్సవములు నిర్వర్తించుకుంటూ ఉన్నాము. మూడవ దశాబ్దంలో చేరాము. ఏ జీవుడైతే బ్రహ్మమును చేరేటటువంటి ప్రయత్నంలో ఉంటాడో, దాన్ని అతడు విజయమును సాధించడానికి చేసే ప్రయత్నంగా భావిస్తూ ఉండాలి. దైవము–జీవుడు, పరమాత్మ–జీవాత్మ, ప్రకృతి వీటి కథే మొత్తం సృష్టి కథ. జీవుడు దైవముతో కూడి సృష్టిని ఆనందముగా అనుభవించవచ్చును. దైవముతో కూడినటువంటి జీవునికి ప్రకృతి సౌందర్యములన్నీ కూడా మహత్తరమైనటువంటి ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాయి. దైవమును వీడి, జీవుడు ప్రకృతితో అనుసంధానం చెందినప్పుడు, ప్రకృతి తనకు అవగాహన కాక, తనదైనటువంటి చిక్కులు తాను ఏర్పరుచుకుని, క్రమంగా పశ్చాత్తాపం చెంది, మరల దైవమును చేరి, అటుపైన ఆనందదాయకమైనటువంటి జీవితాన్ని అనుభవించటం అనేటువంటి కథలు కోకొల్లలుగా మన వాఙ్మయంలో ఉన్నాయి. అలాంటి కథల్లో ఆణిముత్యాల్లాంటివి, రత్నాల్లాంటివి, మణుల్లాంటివి కొన్ని ఉపాఖ్యానాలు ఉంటాయి. అలాంటి ఉపాఖ్యానమే భాగవతమందు వివరింపబడినటువంటి ఈ రుక్మిణీకల్యాణ ఘట్టము.

ఈ రుక్మిణీకల్యాణ ఘట్టము అందరికీ తెలిసినటువంటి కథయే. ఈ కథలో చాలా లోతులు ఉన్నాయి. ఈ కథలో జీవాత్మ–పరమాత్మల అనుసంధానికి సంబంధించినటువంటి సమస్త సాధన ఉన్నది. భక్తి ఉన్నది, జ్ఞానం ఉన్నది, వైరాగ్యం ఉన్నది, యోగం ఉన్నది. దైవమును జీవుడు చేరేటువంటి ప్రయత్నంలో మనకు సహజంగా మనలో నుండి అడ్డుపడేటటువంటి అహంకార తత్వం ఉన్నది. ఇలా రకరకములైన విషయములన్నీ కూడా ఒక మధురమైనటువంటి ఘట్టంగా రుపొందించారు ఋషులు. జరుగుతున్న కథలో ఎన్నెన్నో రహస్యాలు చూపించి, సాధకునికి పనికొచ్చేటువంటి తీరులో ఆ కథని వర్ణించడమే ఋషులు చేసినటువంటి ఒక మహత్తరమైన

ప్రయత్నము. రమణీయమైనటువంటి కథ ఆధారంగా అనేకానేకమైనటువంటి సాధనా రహస్యాలు కుడా ఇమిడ్చి అందిస్తూ ఉంటారు. అలా మనకు ఈ రుక్మిణీకల్యాణం యొక్క వ్యాఖ్యానం గోచరిస్తూ ఉంటుంది. రుక్మిణీ కల్యాణము అనేటువంటి ఉపాఖ్యానము సర్వశుభకరము, మంగళప్రదము. ఇది కల్యాణ ఘట్టము కనుక దీనిని చదివినా, విన్నా, అప్పుడప్పుడూ పారాయణ చేసుకున్నా, చాలా శుభములు కలుగుతాయి అనేటువంటి అనుభవము దాదాపు భారతీయులందరికీ తెలిసి ఉన్నది.

కాకపోతే, మనకు ఉండేటువంటి జీవన విధానంలో ఇవన్నీ క్రమంగా మరుగున పడుతూ, ఇతరములైన విషముల యందు ఆసక్తి పెరుగుతూ, నాగరికులమనుకొనుచూ, అభివృద్ధి చెందుతున్నాము అనుకుంటూ, అనాగరికలుగా, ఇంద్రియలోలుగా, పశుప్రాయంగా, ప్రస్తుతం దాదాపు జాతి అంతా కూడా ఒక జారుడుబండ ఎక్కి, పతనమైనటువంటి స్థితిలోకి జరుగుతూ వస్తూ ఉంది. అయినప్పటికీ, భరతభూమి యందు ఋషులకు మక్కువ ఎక్కువ – వల్లమాలిన ప్రేమ, అభిమానం. ఎంచేతంటే, ఈ భూమి మీద అలాంటి దైవీపరమైనటువంటి ఘట్టములు ఎన్నో జరిగి ఉండడం చేత. "ఎందరో మహానుభావులు" అని కీర్తన ఉంది కదా! సిద్ధులు, తపస్వీజనులు, మహర్షులు, రకరకములుగా దైవపరమైనటువంటి విజయములు సాధించినవారు నడిచినటువంటి పుణ్యభూమి. అంచేత, ఈనాటికీ భూగోళం అంతా కూడా దివ్యదేహధారులై సంచరించేటువంటి సిద్ధులు అయినటువంటి పరమగురువులందరూ కూడా భరతభూమి యందు ఆకాశంలో సంచరించడానికి ఎక్కువ ఇష్టపడుతూ ఉంటారు. వారి సంచారంలో వారు భరతభూమికి సంబంధించినటువంటి ఎల్లలలో, ఆకాశంలో సంచరిస్తునప్పుడు వారికి తెలియకయే ఒక తేలికతనం అనుభవిస్తూ ఉంటారు. ఒక చల్లదనం అనుభవిస్తూ ఉంటారు. ఒక అనిర్వచనీయమైనటువంటి హాయిని అనుభవిస్తూ ఉంటారు. మూడు సార్లు ఇతర భూఖండములలో సంచరిస్తే, మూడువందల సార్లు భారతదేశంలో సంచరిద్దామనిపిస్తుంది వాళ్లకి. అలాంటి ఒక పవిత్రమైనటువంటి వాతావరణము ఇంకా మన దేశపు ఎల్లలను ఆశ్రయించుకొని ఆకాశంలో నిండి ఉంది. మనం ఎంత వాతావరణం కాలుష్యం చేస్తున్నా, ఆ కాలుష్యానికి అందనటువంటి ఒక స్థితిలో ఒక దివ్యత్వము ఈ భూమిని ఆశ్రయించి ఉంది. కాస్తోకూస్తో సంస్కారం ఉండేటువంటి పాశ్చాత్తులు కూడా భారతదేశం వచ్చినప్పుడు, ఇక్కడ గాలి పీల్చి, ఒక రకమైన తేలికదనాన్ని అనుభవిస్తూ ఉంటారు. భౌతికమైనటువంటి సౌకర్యములు అంతంత మాత్రంగాను, అసౌకర్యములు కోకొల్లలుగాను ఉన్నా, సామాన్యమైనటువంటి, సంస్కారవంతమైనటువంటి జీవులు ఎందరో ఈ దేశంలో ప్రవేశించడానికి ఉత్సాహం చూపిస్తూ ఉంటారు. "మాటిమాటికి ఈ దేశం ఎందుకొస్తారు? ఇక్కడ ఏమి కనిపిస్తుంది? ఏ సౌకర్యం ఉండదు కదా?" అని అడుగుతూవుంటే, "ఒక తెలియని ఆనందం, ఒక తెలియని ఉత్సాహం, మళ్ళీ మళ్ళీ రావాలి అనేటువంటి భావన

మాలో ఎప్పుడూ ఉంటాయి" అని చెప్తూ ఉంటారు మన పాశ్చాత్త సోదరులు అందరు కూడా. అలాంటి పుణ్యభూమిలో మనమున్నాము. మనం ఇందులోనే ఎప్పుడూ పుట్టి, పెరగడం చేత దీని వైభవం మనకి తెలియదు. పరవాన్నంలో పడ్డ ఈగలాగా గిలగిలలాడుతూ ఉంటూ ఉంటాము మనము! హిమాలయాల్లో పుట్టి పెరిగినటువంటి వారికి హిమాలయముల వైభవము తెలియదు. అలాగే భరతభూమిలో పుట్టి పెరుగుతున్నవారికి భారతభూమి వైభవము తెలియదు. కానీ, తనదైన ప్రత్యేకత కలిగినటువంటి ఏకైక దేశము ఈ భూమి. అది ముమ్మాటికీ నిస్సందేహము. ఈ దేశం ఎందుకీ విధమైనటువంటి పవిత్రత పొంది ఉన్నదంటే బ్రహ్మోపాసన చేసినటువంటి వారు, దైవోపాసన చేసినటువంటివారు లెక్కకు చాలా మిక్కిలిగా ఉన్నటువంటిది ఈ భూగోళం.

ఇక్కడ మనం గత కొన్ని గురుపూజలుగా చక్కని దైవీపరమైనటువంటి ఉపాఖ్యానములు చెప్పుకుంటూ వస్తున్నాము. దానికి ప్రధాన కారణం జగద్గురు పీఠము, విజయవాడ కేంద్రం గణపతి కృష్ణమూర్తి గారి యొక్క భాగవత మార్గ ఆసక్తి, భక్తి, దాని యందు జీవించేటటువంటి ఒక ప్రయత్నమే కారణం. వారు "రుక్మిణీకల్యాణం చెప్పుకుంటే బాగుంటుంది మన గురుపూజల్లో" అన్నారు. ఎందుకు బాగుండదు? బాగుంటుంది. అంతకుముందు కుమారసంభవం చెప్పుకున్నాము. అంతకుముందు బలిచక్రవర్తి కథ చెప్పుకున్నాము. అంతకుముందు ధ్రువోపాఖ్యానం చెప్పుకున్నాము. ఇలా ఏవో ఉపాఖ్యానాలు కొన్ని కొన్ని సీరియల్ గా నడిచినాయి మనకి. ఈ రుక్మిణీకల్యాణం అయినటువంటి ఉపాఖ్యానం దశమ స్కంధం పూర్వభాగంలో చిట్టచివరి ఘట్టం. ఆ తర్వాత ఉత్తరభాగం. రుక్మిణీకల్యాణం దశమ స్కంధం పూర్వభాగం అవుతుంది. కృష్ణ కథకి పరాకాష్ఠ. కృష్ణుని యొక్క కల్యాణ ఘట్టం అది. కృష్ణుడు కోరి పొందవలెనని ఆశించినటువంటి ఒక స్త్రీ మూర్తి యొక్క పుణ్య కథ. సీతాకల్యాణము, పార్వతీకల్యాణము అంటారు. మాములుగా liberation moments ఉన్నాయి కదా! "ఏవండీ! పార్వతీకల్యాణం అంటే శివుడికి కూడా కల్యాణం కదా! శివకల్యాణం అని ఎందుకు అనరు? కృష్ణకల్యాణం ఎందుకు అనరు? రామకల్యాణం ఎందుకు అనరు?" అంటే, ఎవరు ఎవరిని చేరుతున్నారు అనేటటువంటిది ముఖ్యం. ఎవరు ఎవరిని చేరడం వలన ఎవరికి ఎక్కువ అది కల్యాణప్రదమైనది? శిష్యుడు గురువును చేరితే గురువుకు కల్యాణప్రదమా, శిష్యునికి కల్యాణప్రదమా? జీవుడు దైవాన్ని చేరితే జీవునికి కల్యాణప్రదమా, దేవునికి కల్యాణప్రదమా? పరిపూర్ణతను చేరిన వారికి పరిపూర్ణత లభిస్తుంది. శిష్యుడు, జీవుడు ఇలాంటి వారికి పరిపూర్ణత లభిస్తుంది. అపరిపూర్ణులైనటువంటి వారు, పరిపూర్ణులు అవ్వాలని చేసే ప్రయత్నంలో వారికది కల్యాణప్రదమై నిలిచింది అని చెప్పడానికి నామకరణమే ఇలా ఉంటుంది.

రుక్మిణీకల్యాణ కథలో చాలా అద్భుతాలు ఉన్నాయి. ఈ కథలో ఒక భక్తురాలు భగవంతుని చేరే విధానము ఉంటుంది. ఆమె చేసిన సాధనము, ఆమెకి వచ్చినటువంటి విఘ్నములు ఉంటాయి. ఒక జీవుడు

దైవాన్ని చేరాలంటే చాలా విఘ్నములు ఉంటాయి. ఎక్కడ ఉంటాయి? తమలోనే ఉంటాయి. తమ పరిసరాల్లోనే ఉంటాయి. తమ ఇంట్లోనే ఉంటాయి. ఇవన్నీ అహంకార స్వరూపంగా అడ్డుపడుతూ ఉంటాయి. జీవుడు దైవం దగ్గరకు చేరకుండా ఉండేటువంటి కార్యక్రమం ఒకటి అహంకారం చేస్తూ ఉంటుంది. అందుకని ఆ కార్యక్రమాలకి అడ్డుపడుతుంది. అలా రుక్మిణికి అడ్డుపడే వాళ్ళు ఉంటారు. రుక్మిణిని ప్రోత్సహించే వాళ్ళు ఉంటారు. అంతరాయం కలిగించే వాళ్ళు ఉంటారు. దేహం లోపలా ఉంటారు, గృహం లోపలా ఉంటారు, సంఘం లోపలా ఉంటారు. జీవుడు అన్నిటినీ అధిగమించి, తన సాధనము ప్రధానంగా తన నిత్యాన్ని తానేర్పరుచుకొని, స్థిరము, ధైర్యముతో కూడినటువంటి కొన్ని నిర్ణయాలు చేసుకోవలసి వస్తుంది. ప్రతివారు చెప్పిన మాట వింటే ఎవ్వరూ పురోగతి చెందారు కదా! ఆత్మసాధనా మార్గంలో శ్రేయోభిలాషులమని అనుకుంటూ మమకారం చేత మనకు అడ్డుపడే వాళ్ళు ఉంటారు. మనకు రక్షకులమనుకుంటూ అడ్డుపడేవాళ్ళు ఉంటారు. మంచి చెయ్యాలనే ఉద్దేశ్యంతో అడ్డుపడేవాళ్ళు ఉంటారు. ఇతనికి మంచి జరగకూడదు అనేటువంటి ఉద్దేశ్యంతో అడ్డుపడేవాళ్ళు ఉంటారు. దేనికి లొంగుతాడు జీవుడు అనేటటువంటిది జీవుడి నిర్ణయమే. “ఆ! ఏం వెళ్తాం గురుపూజలకి, ఎప్పుడూ ఉండేవే కదా!” అని ఇంట్లో ఎవరన్నా అన్నారనుకోండి. నిజమే కదా అనిపిస్తుంది. అందుకని ఆగిపోవచ్చు. “ఎండలు ముదిరినాయి. చాలా గురుపూజలకి వెళ్ళాం కదా! దీనికి వెళ్ళకపోతే ఏమి?” అనే భావన కలగవచ్చు. శ్రేయస్సు కలిగించేటువంటి విషయమందు ఒక నిశ్చయం మనం చేసుకున్నప్పుడు, ఆ నిశ్చయానికి తోడ్పాటు గావించే అన్ని కార్యక్రమములకు అవరోధం కలగకుండా, వాటిని నిర్వర్తించుకోవడం అనేటువంటిది సాధన అవుతుంది తప్ప, ప్రతి చిన్న విషయానికి మనమే అడ్డు వేసుకొని, వాడు చెప్పాడని, వీడు చెప్పాడని, ఇందుకు వీలు పడలేదు, అందుకు వీలు పడలేదు అని చెప్పుకోవడానికి తల మీద వెంట్రుకలన్ని ఉంటాయి. చెప్పుకోడానికి ఎన్నైనా, ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇన్ని ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా అందులో కొనసాగడం అనేటువంటిది సాధన అవుతుంది. దాన్నే నిత్యమైనటువంటి సంకల్పం అంటారు. దాన్నే దృఢ సంకల్పం అంటారు.

అలాంటి సంకల్పానికి అప్పుడప్పుడూ అంతరాయాలు కలుగుతుంటే, అధిగమించడానికి అప్పుడప్పుడు ధైర్యం కూడా చెయ్యాలి. ధైర్యం చెయ్యనివారు తాము ఏర్పరుచుకున్న గీతలను తాము దాటలేరు. “ఎత్తుకుపో, వచ్చేస్తాను” అనడం అనేటువంటిది సామన్యమైన విషయం కాదు. ఒక సంస్కారవంతమైనటువంటి స్త్రీ కదా! “గుడికి వస్తాను, దార్లో నన్ను ఎత్తుకపో” అని పరిపూర్ణమైనటువంటి సంస్కారం ఉన్నటువంటి ఒక స్త్రీ చెప్పటంలో, ఆమె దేనికి ప్రాధాన్యత ఇచ్చింది? దైవమునకు ప్రాధాన్యత ఇచ్చింది. “ఒప్పుకుంటే మంచిదే, ఒప్పుకోకపోతే ఎత్తుకుపో” అని చెప్పింది. ఇలాంటి ఘట్టం ఎక్కడా ఉండదు. పార్వతీకల్యాణంలో అడ్డుపడతారు.

“ఉమ, ఉమ” అంటారు కదా! “వద్దు తల్లీ, అది వీలుపడే విషయమం కాదు. చాలా కష్టం. మహా మొండివాడు. ఏ దేవతలయినా దగ్గరికి వెళ్ళడానికి భయపడతారు. పైగా ప్రత్యేకంగా ఇప్పుడు మహత్తరమైన తపస్సులో ఉన్నాడు. ఎవ్వరు వెళ్ళినా ఆ తపస్సు అగ్నికి కాలిపోతారు. అలాంటి వాడిని వరించి, అతనిని వివాహమాడతాను అని నీవు అనుకోవడం పిల్లచేష్ట అవుతుంది” అని ఎంతమంది చెప్తారో, ఎన్నిరకాలుగా చెప్తారో! ఎన్నిరకాలుగా చెప్పినా, ఆమె పర్వత రాజు పుత్రి. పర్వతం అంత స్థిరమైనటువంటి సంకల్పం కలిగి ఉంటుంది.

“పార్వతి” అని పేరుపెట్టుకొని స్థిర సంకల్పం లేదనుకోండి, “శైలజ” అని పేరు పెట్టుకొని స్థిర సంకల్పం లేదనుకోండి, పేరు మార్చుకుంటే మంచిది! పేర్లేమో మనం అందానికి పెట్టుకుంటాం తప్ప, ఆ పేరు మనకి అర్థవంతము కావాలి కదా! అర్థవంతమైనటువంటి నామమే మనం పెట్టుకునేది. మిగతా నాగరికతల్లాగా “స్టోను”, “బిల్లు”, “మిల్లరు”, “ముల్లరు”, ఇట్లా పెట్టుకోముగా మనము! అందరికీ దైవనామములే ఉంటాయి. లేకపోతే, దైవము యొక్క కల్యాణ గుణములు నామముగా ఉంటాయి... అంచేత, స్థిరమైనటువంటి సంకల్పం. ఆ సంకల్పం లోపల స్థిరపడుతున్న కొద్దీ మౌనం పెరుగుతుంది. మొండివాడు మౌనంగానే ఉంటాడు కదా! అంతేకాదు, అవసరమైతే ధైర్యం చెయ్యాలి. తాను చేస్తున్నటువంటి నిర్ణయానికి సంబంధించిన గమ్యాన్ని చేరటానికి వలసినటువంటి సమస్త జ్ఞానమూ తాను పొంది ఉండాలి. కృతనిశ్చయము, జ్ఞానము, మౌనము, సాహసము – ఈ నాలుగు లేకుండా చేసేటువంటి సాధనంతా కూడా అదేదో సరదాగా చేస్తున్నట్టే. మనం చాలా పనులు సరదాగా చేస్తుంటాం. ఇది (సాధన) కూడా అలాగే ఒక సరదాగా చేసేటువంటి కార్యక్రమంగా అయిపోతుంది. సరదాగా చేస్తే దైవం ప్రతిస్పందించడు. ఎంచేతంటే, నీ లోపలినుంచి అన్నీ చూస్తూ ఉంటాడు. నీ బయట నుంచీ అన్నీ గమనిస్తూ ఉంటాడు. బయటకన్నా లోపలే ఉంటాడు కాబట్టి గమనించడం సులభం. ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడు అన్నారు. బయటవాళ్ళ కన్నా ఇంట్లో వాళ్ళే మన విషయాలు బాగా గమనించగలరు. నీ లోపలే ఉంటూ, నీలో కలిగేటువంటి భావ సంచలనం అంతా గమనిస్తూ ఉంటాడు.

ఈ రుక్మిణీకల్యాణంలో కథానాయిక రుక్మిణి. ఆమె చేసినటువంటి సాధన, ఆమె కృష్ణుని పొందిన విధానం కథగా ఈ రుక్మిణీకల్యాణ ఘట్టం ఉన్నది. నెమ్మదిగా చెప్పుకుంటాం మనం. ఎందుకంటే, భాగవతము మూడు రోజుల్లో చెప్పేస్తాను, నాలుగు రోజుల్లో చెప్పేస్తాను అనుకోకూడదు. ఎందుకంటే, భాగవతము తెలిసి పలుకుట చిత్తం – “శూలికైనను తుమ్మిచూలికైనను”. భగవంతుని స్మరించి, భాగవతం వ్యాఖ్యానం చేస్తూ ఉంటే, భగవంతుడు తానే చెప్పుకుంటూ ఉంటాడు. చెప్పేవాడు కూడా వినడమే!

“పలికెడిది భాగవత మట

పలికించు విభుండు రామభద్రుం డఁట నేఁ
బలికిన భవహర మగు నఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?"

భాగవత పద్యాలు మనం చదువుకోవడం, ఇతరులకు చెప్పటం చేత, మన మధ్య అదృశ్యంగా దైవం కూడా ఉండి, ఆయనే బాగా వివరణ ఇస్తూ ఉంటాడు. ఆదివారం పూట భాగవత పారాయణం చేస్తున్నాం చాలా కాలంగా. అందులో వచ్చేటువంటి విశేషాలు, రహస్యాలు, చాలా సంభ్రమాశ్చర్యాలతో కూడి ఉంటాయి. ఒక వాఖ్యంలో ఒక పుస్తకం ఉన్నట్టుగా ఉంటుంది. "ఎంత చెప్తారు? ఎంతసేపు చెప్తారు? ఎన్నాళ్ళు చెప్తారు?" అంటే, "ఎన్నాళ్ళైనా నువ్వు చెప్తూ ఉండు, మేము వింటూ ఉంటాము. అంతకన్నా మాకు ఇంకేమీ అక్కర్లేదు" అన్నారు శౌనకాది మునులు సూతునితో. ఇంతకన్నా ఇంకేం కావాలి? ఇది ఒక్కటి ఉంటే చాలు. దీన్ని వింటూ ఉంటే, తెలియకనే మనం బ్రహ్మానుభూతిలో ఉంటాం. ఇతరములేవి మనకి స్ఫురణకు రావు. అన్నీ కరిగి, ఇది మిగిలిన స్థితి ఉంటుంది. ఎన్నో సాధనలు చేసి పొందవలసినటువంటి స్థితులను, భక్తితో తెలియకయే మధురంగా ఆ స్థితులు పొందడం, అనుభూతి చెందడం ఉంటుంది. అలాంటిది భాగవతం. క్రమంగా జన్మ పరంపరను తగ్గిస్తూ వస్తుంది.

అందరిలోనూ లోపల దివ్యమైనటువంటి పురుషుడు లేక పురుషోత్తముడు ఉన్నాడు. పురుషుడుగా మనం ఉన్నాం. క్షరపురుషుడుగా మనకు మన శరీరం, మన స్వభావం ఉంది. పురుషోత్తముడు ఉన్నాడు మనలో. పురుషుడుగా, అతనికి ప్రతీకగా మనం ఉన్నాం. పురుషోత్తముడు నుంచి పురుషుడు పుడితే, పురుషుడు ఆధారంగా అతని దేహం, అతని స్వభావం పుడుతూ ఉంటుంది. అంటే, మన తొడుగు మనం ఏర్పరుచుకుంటూ ఉంటాం. నత్త గుల్ల ఎట్లా ఏర్పరుచుకుంటూ ఉంటుందో, అలా మన గుల్ల మనం ఏర్పరుచుకొని, ఆ గుల్లలో మనం ఉంటూ ఉంటాం. ఆ గుల్లే గృహం. దేహం అనేటువంటి ఒక గృహాన్ని ఏర్పరుచుకొని పురుషుడు, అందులో పురుషోత్తముడుతో కూడి జీవిస్తూ ఉంటాడు. మనం three-in-one అంటారు. పురుషుడు, పురుషోత్తముడుతో కూడి ఈ దేహమందు జీవిస్తూ ఉంటాడు. ఈ కనపడేటువంటి దేహము మాటిమాటికీ మారుతూ ఉంటుంది, స్వభావము మారుతూ ఉంటుంది. జీవుడు, దేవుడు ఎప్పుడూ కలిసే ఉంటారు.

జీవుడు దైవంతో కూడి, తన స్వభావాన్ని ఆసరాగా తీసుకొని, దేహంతో బయట ప్రపంచంలో అనుభూతిని పొందవచ్చును. దైవంతో కూడక, స్వభావంతోను, శరీరంతోను కూడితే, స్వభావము జీవుడిని చిక్కులు పెడుతుంది. చిన్నప్పుడు మనం కథలు చదువుకునేవాళ్ళం: బ్రాహ్మణుడు, పులి, మేక, గడ్డివాము బ్రిడ్జి దాటాలి.

రెండుకన్నా ఎక్కువ అంశాలు ఒక్కసారి బ్రిడ్జి మీద నుంచి అవతలకు దాటడానికి వీల్లేదు. బ్రాహ్మణుడు లేకపోతే పులి మేకను తినేస్తుంది. బ్రాహ్మణుడు లేకపోతే మేక గడ్డిని తినేస్తుంది. ఆ బ్రాహ్మణుడు లేకపోతే ఈ మూడిటిలో ఏదీ దానంతట అది దాటలేదు. ఒక్కసారి రెండు వస్తువులే దాటగలవు. ఏట్లా దాటిస్తారు అనేది ఈ కథ. నా దృష్టిలో అది నిజానికి ఉపనిషత్తు కథ, ఎంచేతంటే బ్రహ్మముతో కూడి దాటవచ్చు. అందుకని, ప్రతిసారి బ్రాహ్మణునితో కూడే – ముందు మేకను తీసుకెళ్ళి అక్కడ కట్టేసి, పులిని, గడ్డివామును వదిలేస్తాడు. పులి గడ్డి తినదు కదా! ఆ తర్వాత మళ్ళీ వస్తాడు. మళ్ళీ వెళ్లి ఏం తీసుకెళ్తాడు? మేక అక్కడుండి కదా! ఈ సారి గడ్డివామును తీసుకెళ్ళి అక్కడపెట్టి, మేకను తెచ్చేస్తాడు. అటునుంచి మళ్ళీ పులిని తీసుకొని అటుపక్క చేర్చి, మళ్ళీ అటునుంచి వెనక్కి గడ్డివామును తీసుకెళ్ళిపోతాడు. ఇట్లా బ్రహ్మానికి శ్రమ లేదు. జీవులని చేర్చుకోవడంలో ఒకటికి నాలుగు సార్లు దిగివస్తూ ఉంటాడు. అట్లా దిగి వచ్చి, కథ నడిపిస్తూ ఉంటాడు. ఆయనే గురువు. “గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షా త్పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః”. మాటిమాటికీ వచ్చి, ఏదో రకంగా జీవుల్ని తనలో చేర్చుకునే కార్యక్రమమే సద్గురువు కార్యక్రమం.

ఈ విధంగా పురుషుడు తనలోని దివ్య పురుషుడితో అనుసంధానం చెంది జీవితాన్ని అనుభవం చెందితే ఆ జీవితం వైభవోపేతం అవుతుంది. పురుషుడంటే మగవాడు అని కాదు అర్థం ఇక్కడ. పురమునందు వసించేవాడు పురుషుడు అయి ఉండడంచేత స్త్రీలు కూడా పురుషులే. స్త్రీమూర్తి అయినా పురుషరూపం అయినా విరాట్రూపుని యొక్క అవతార రూపమే. లోపల దైవం ఉన్నాడు. “May the light in me” అనంగానే ఆగిపోవాలి. ఎందుకంటే, “May the light in me” అన్నప్పుడు నీలో దైవం ఉన్నాడు అనే భావన నీలో ఉందా? ఆలోచించావా? చూశావా? నేనే ఉన్నాను కదా అనుకుంటూ ఉంటాడు ప్రతివాడు. నేను “నేను”తో కూడి ఉన్నాను అనుకుంటాడు భక్తుడు. భక్తుడు “నేను” అనే దేవుడుతో కూడి ఉంటాడు. They are two-in-one. నేను అనే స్వభావాన్ని, శరీరాన్ని పట్టుకొని పని చేస్తుంటాడు. ఎప్పుడూ తన లోపలి దైవాన్ని వీడనివాడు భక్తుడు. ఆయన్ని గూడులో పెట్టేసి, మనం ఊరికే తిరిగొచ్చేసి, అప్పుడప్పుడు మనకు బాగుండకపోయినప్పుడు, కష్టం వచ్చినప్పుడు, బారుబారుమనటానికి కాదు. లోపల గూడులో ఉన్నాడు కదా! నువ్వు ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తూనే ఉంటాడు. నీ దేవతా మందిరాన్ని ఎక్కడికి పడితే అక్కడికి పట్టుకెళ్తావా? గర్భగుడిలో కూర్చొని అడ్డమైన మాటలు మాట్లాడతావా? అడ్డమైన పనులు చేస్తావా? అడ్డమైన తిరుగుళ్ళు తిరుగుతావా? పూర్వకాలంలో దేవతార్చన పెట్టెని ఏ ఊరు వెళ్ళినా అది పట్టుకెళ్తూ ఉండేవాళ్ళు. వాళ్ళ వాళ్ళ పరిస్థితినిబట్టి ఇత్తడిపెట్టో, వెండిపెట్టో, రాగిపెట్టో, బంగారుపెట్టో. పెట్టె ఏదైనా లోపల పెట్టే కదా! నీ లోపల దేవతార్చనా పెట్టె ఉన్నది. అది పట్టుకెళ్ళి తిరుగుతూ ఉంటావు. అక్కడ అర్చన లేకపోతే ఆయన వెళ్ళిపోతాడు. వెళ్ళిపోతాడంటే నిద్రపోతాడు.

ఈ బయట ఉన్నటువంటివి ఎప్పటికప్పుడు మారిపోయేవి – స్వభావము, శరీరము ఇవి మారుతూ ఉంటాయి. "లావయ్యారండి, సన్నబడ్డారండి, కొంచెం నల్లబడారండి, తెల్లబడ్డారండి," ఇవన్నీ చెప్పుకుంటూ ఉంటాం కదా! అవన్నీ దేనివి? క్షరపురుషుడివి. మారే దాంట్లో మారని వాడిగా నువ్వు ఉండాలి. మారని వాడుగా నువ్వు ఉండాలంటే, నిన్ను పుట్టించినవాడు నీలో ఉన్నాడు కాబట్టి వాడితో నువ్వు కూడి ఉంటే నీకు పురుషోత్తమ ప్రాప్తి యోగం ఉంటుంది. వాడితో నువ్వు కూడి ఉండక, ఏదేదో చేస్తూ ఉంటే, పురుషోత్తమ ప్రాప్తి యోగము అధ్యాయము కంఠోపాఠంగా వచ్చినా ఉపయోగము లేదు. మామూలుగా భగవద్గీతలో పురుషోత్తమ ప్రాప్తి యోగాన్ని బాగా కంఠోపాఠం చేయిస్తారు. ఎందుకో తెలుసా? మొత్తం పద్దెనిమిది అధ్యాయాల్లో అతి చిన్నదైన అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తి యోగం – ఒకటి. రెండు, శ్లోకాలు సరళంగా ఉంటాయి. కానీ, చిన్నదైనా, సరళంగా ఉన్నా, అదొక పెద్ద తాళం చెవి. నీ లోపల దైవము, నీవు, నీ స్వభావము అనే మూడు ఉన్నాయి. నీ స్వభావం నీ తోక వంటిది – అదెప్పుడూ ఆడుతూనే ఉంటుంది. నీవు దైవంతో కూడి ఉంటే, నీ స్వభావం నిన్ను ఇబ్బంది పెట్టదు. నీవు దైవాన్ని వదిలేస్తే స్వభావం చాలా ఆడించేస్తుంది. స్వభావం చేత మనం తిప్పలు పడకూడదు అనుకుంటే దైవాన్ని ఆశ్రయించి ఉండాలి. ఇదే కథ.

దైవం ఎక్కడ ఉన్నాడు? లోపల ఉన్నాడు. లోపల చూడటం మొదలుపెడితే, ఇతరుల లోపల కూడా ఎట్లా ఉన్నాడో తెలుస్తుంది. ఇతరుల లోపలే కాదు, మొత్తం అంతా వ్యాపించి ఎట్లా ఉన్నాడో తెలుస్తుంది. అసలు ఆరాధన అప్పుడే పట్టుకోలేము మనల్ని! ఆరాధన అప్పుడే వాడొచ్చాడా? వీడొచ్చాడా? సరిగ్గా దీపాలు వెలుగుతున్నాయా? అగరత్తులు ఆరిపోయాయా? రోజు వచ్చేవాడు రాలేదే ఇవాళ? ఇవన్నీ గుర్తుండేవాడికి ఆరాధన ఏం జరుగుతుంది? పొద్దున ఆరాధన చేసుకుంటూ, పాలవాడొచ్చాడా? పనిమనిషి వచ్చిందా? అనుకుంటే, అక్కడే అయిపోతుంది! సాయంత్రం ఆరాధన ఎలాగూ చేయము మనము! ఎప్పుడూ బిజీ కదా! లోపల దైవము ఉన్నాడు అనే భావముతో ఉండి, కన్నులు మూసుకొని, నీ కిష్టమైనటువంటి, అందమైనటువంటి, దేదీప్యామైనటువంటి ఒక రూపాన్ని దర్శనం చేసుకుంటూ, "ఆయనతో" కూడే తిరుగు. ఆయన్ని వదిలేసి తిరగకు. ఆయన్ని వదిలేసి తిరిగితే ఏమి లేదు కదా! ఆయనతో కూడి తిరుగు. ఆయనతో కూడి పార్కుకు వెళ్ళచ్చు. ఆయనకు ఏం అభ్యంతరం లేదు పార్కుకు రావడానికి. ఆయన ఏర్పరచినవే పార్కులు, సినిమాలు, అన్నీ కూడా. ఆయనతో కూడి సినిమాకెళ్ళు. ఆయనతో కూడే ట్రైన్ ఎక్కు. ఆయనతో కూడే విమానం ఎక్కు. ఆయనతో కూడి ఏది ఎక్కినా, నువ్వు ఎక్కింది ఏమైపోయినా, నువ్వు ఆయనతో ఉంటావు. ఆయనతో కూడి బోటు ఎక్కావనుకోండి, బోటు మునిగితే నువ్వు మునగవు, ఆయనతో ఉంటావు. నీ శరీరం మునిగిపోవచ్చు, కానీ నువ్వు తేలిపోతావు. అంచేత, దేనితో కూడి ఉండాలి? నీకు, నీ ఆస్తిత్వానికి, నీ బతుకుకి ఆధారమైనటువంటిది నీ యందే

ఉంది. అది ఉండడం బట్టే నీకు ఉచ్ఛ్వాస, నిశ్వాసలు జరుగుతున్నాయి. అది ఉండడం బట్టే నీకు ఆలోచన, తెలివి అనేది ఒకటి పనిచేస్తుంది. అది వెళ్ళిపోతే తెలివిలేదు, ప్రాణం లేదు. రెండూ లేకపోతే నువ్వేం ఉన్నావు?

నీలో ఉన్న వాడు అది "వాడు" కాదు, "అది" కాదు. ఈ "స్త్రీ నపుంసక పురుష మూర్తియును గాక" అంటుంది భాగవతంలోని గజేంద్ర మోక్షం. నపుంసకమూర్తి కాదట, పురుషమూర్తి కాదట, స్త్రీమూర్తి కాదట. వాటన్నిటికీ ఆధారమైనది అది. అలాంటిది నీ లోపలే నీవలే ఉంటుంది. దానిని నీవు ఆరాధన చేసుకోవడానికి కనులు మూసుకొని, లోపల చూసుకుంటూ ఆరాధన చెయ్యాలి అని భాగవత మార్గం చెప్తుంది. దాన్నే దర్శించుకుంటూ, దాంతోనే కూడి, బయట ఇంద్రియములతో మనం పనులు చేసినా, వాక్కును వినియోగించి మాట్లాడినా, ఏం చేసినా, దాంతో కూడి ఉండి చేస్తుంటే, క్రమంగా అతనితో కూడిక పెరుగుతూ, యోగం జరుగుతూ ఉంటుంది. యోగం చేయటమంటే ఏమిటి? అతనితో కూడటమే యోగం. మనకు నిజంగా భాషించడానికి వీలులేదు కాబట్టి "అతను" అంటూ ఉంటాం. వేదాలు "అది" అంది, "తత్" అన్నారు. దాంతో కూడి ఉండాలి. ఏ సాధన అయినా కూడి ఉండనిది సాధన కాదు. కూడి ఉండడం చేత లక్ష్మణుడు ఎప్పుడూ క్షేమంగా ఉంటాడు. కూడి లేకపోవటంచేత అమ్మ కొంచెం ఇబ్బంది పడ్డది. ఇబ్బంది పడ్డప్పుడు లోపల మళ్ళీ పెంచుకుంది. ఎంతలా పెంచుకుందంటే, రావణుడు గడ్డిపోచలా కనిపించాడు ఆవిడకి. ఎందుకని? తాను రాముడితో కూడి ఉన్నది కాబట్టి. నీవు రాముడుతో కూడి ఉండి ఎదుట వ్యక్తితో మాట్లాడుతుంటే, వాడికన్నా నీవు పెద్దవాడివే. వాడు కూడా కూడి ఉన్నాడనుకో, ఓహో! వీడు మన సోదరుడు అని నీకు తెలుస్తుంది. ఇంకో రామబంటు కదా! అందుకే కదా, "వీరంతా నా సహోదరులు అన్నాడు" త్యాగరాజు! "వారందరూ నా సహోదరులు" అని ఎలా అనగలిగాడండి? తాను ప్రస్తుతము లోపల ఉన్నటువంటి రాముడుతో కూడి ఉండడం చేత, అలా కూడి ఉన్న వారి దర్శనాలు జరిగినాయి ఆయనకి. ఆహా! అందుకని వీళ్ళందరూ ఇలా శాశ్వతులైనారు అని తెలిసింది. ఈ రోజు మనం కూడా అదే కాబట్టి, వాళ్ళు మనకు అన్నయ్యలు – కాబట్టి "సహోదరులు మాకు" అని పాడతాడు. అలా సహోదరత్వం ఉంటుంది తప్ప, ఏం బ్రదర్! అనుకుంటే ఉండదు. వాడు వెళ్ళంగానే, వాడి గురించి వేరే మాట్లాడుకుంటూ ఉంటాం కదా! వాడేం బ్రదరు? వాడి ముందొక మాట, వెనుకొక మాట మాట్లాడేవాడు బ్రదర్ ఎట్లా అవుతాడు? ఇదంతా ముందు మాటగా చెప్దాం అనుకుని మొదలుపెట్టలేదు. పుస్తకం పక్కనే ఉంది, తియ్యాలి. ఈ లోపల ఇంతైపోయింది!

రుక్మిణికల్యాణంలో ఒక భక్తుడు భగవంతుని చేరడంలో ఉండేటువంటి ఎన్నో సాధనాపరమైనటువంటివి రహస్యాలు మనకి మళ్ళీ గుర్తు చేయబడతాయి. మనకు తెలిసి ఉన్నవి గుర్తు చేయబడతాయి. తెలియనివి తెలియజెప్పబడతాయి. అంచేత, మళ్ళీ, మళ్ళీ చదువుకోవాలి. ఎంచేతంటే, అదే రుక్మిణీకల్యాణం ఇంకో ఐదేళ్ళ

తర్వాత మళ్ళీ చదువుకుంటే మరి కొన్ని విషయాలు తెలుస్తాయి. నీలో వికాసం కలుగుతున్న కొద్దీ, గ్రంథంలోంచి రహస్యాలు తెలిసి వస్తాయి. కేవలం అక్షరములు తెలియటం వలన అంతా తెలియదు. మనలోని దైవము మనం భాగవతం చదువుతుంటే సంతోషించి, తను కూడా కూడి చదువుతాడు. అందుకని "పలికించు విభుండు రామభద్రుం డఁట". ఆయన రాసాడా అన్ని పద్యాలు? ఆయన రాయలేదుగా. కొన్ని పద్యాలు ఆయన చేతుల్లోంచే లోపలివాడు రాసాడు. లోపలివాడు రాసిన తర్వాత, మళ్ళీ చూసుకొని పద్యం నేనే రాసానా అనుకున్నాడు. మనవాళ్ళు మందులేస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి అద్భుతంగా తగ్గిపోతూ ఉంటాయి కదా! మనమే వేశామా ఈ మందు అనిపిస్తుంది. అలాంటివి ఎన్ని సార్లు వెయ్యలేదు? ఎవడికి తగ్గింది కనుక! వీడికెందుకు తగ్గింది? ఒక్కొక్కసారి ఈ చేతుల్లోంచి ఆ చేయి పనిచేస్తుంది. ఈ వాక్కులోంచి ఆ వాక్కు వ్యక్తం అవుతుంది. ఈ చూపులోంచి ఆ చూపు వ్యక్తమౌతుంది. ఈ స్పర్శలోంచి ఆ స్పర్శ వ్యక్తమౌతుంది. అది భక్తుడి పరిస్థితి. ఎక్కువగా దైవం ఉంటూ ఉంటాడు, వీడు తక్కువగా ఉంటూ ఉంటూ, ఆయనలో ఉండిపోతాడు. మధ్యమధ్యలో వీడు కూడా కాసేపు బయటకు వస్తూ ఉంటాడు. మళ్ళీ లోపలికి వెళ్లిపోయి, ఆయన బయటకు వస్తుంటాడు. ఇలా ఒకళ్ళు లొపలికెళ్ళిపోతే, ఒకడు బయటకు వస్తూ ఉంటాడు. నరుడు లోపలికి వెళ్ళిపోతే, నారాయణుడు బయటకు వస్తాడు. నారాయణుడు లోపలికి వెళ్ళిపోతే, నరుడు బయటకు వస్తాడు. అదే నరనారాయణుల గుహ. గుహలోకి మనం వెళ్ళిపోతే, గుహలో ఉండే నారాయణుడు బయటకు వచ్చి, మన రూపంతోనే పనిచేస్తూ ఉంటాడు. మనం మళ్ళీ బయటకు వచ్చేసరికి, ఆయన అప్పటికే చేసేసి ఉంటాడు మన పని. భక్తులకు ఇలా పని చేసి పెడతాడండి భగవంతుడు. నువ్వు చేస్తున్నావనేటువంటి కొంచెం మెరమెర తప్ప, ఆయనే అంత పనీ చేసిపెడ్తుంటాడు.

సక్కుభాయి కథలు, మీరాభాయి కథలు, రకరకాల కవిత్వాలు రాసిన వాళ్ళ కథలు, అంతా ఇంచుమించు ఒక మధుర భక్తిలో రాసిన కథలు. అది చదువుకుంటే వాళ్ళకే ఆశ్చర్యమేస్తుంది. అలా ఉంటాయి. లోపలి భగవంతుడు బయటకి వ్యక్తం అవ్వాలంటే మన వాడితో అనుసంధానం చేసుకుని, వాడికి మనం సమర్పణ చెందుతూ ఉంటే, వాడు మనలోకి మనల్ని అనుగ్రహించడానికి వస్తూ ఉంటాడు. ఇలాంటి కథలు భాగవత గ్రంథంలో చాలా ఉంటాయి. అందులో ఇది ఒకటి. ఇది చాలా బాగుంటుంది. ఒక్కొక్క పద్యం చదివి చెప్పుకుంటూ ఉంటే, ఎన్నాళ్ళు పడుతుందో మనం చెప్పలేము. కృష్ణమూర్తి గారికి ఒక వారం రోజులు ముందు ఫోను చేశాను, "ఇదేదో అయిపోతుంది అనుకోబోకండి" అని. ఆయనకీ తెలుసు. ఏదో అవీ, ఇవీ అని పక్కదారి పట్టి, పార్వతీకుమార్ గారు ఏవేవో మాట్లాడకుండా, ఈయనకి ప్రతిసారి ఒక assignment ఇచ్చేస్తే, అందులో ఆయనా ఆనందిస్తాడు, మనల్ని ఆనందింపచేస్తాడని బహుశా కృష్ణమూర్తి గారి ఆలోచనో, కృష్ణమూర్తిగారి లోన

ఉన్నటువంటి మాస్టరు గారి ఆలోచనో! ప్రత్యేకంగా విజయవాడలోనే ఇట్లా మనకి భాగవతపరమైనటువంటి ఉపాఖ్యానాలు చెప్పుకోవడం అవుతోంది. ఈ ముందు మాటతో ఈ ఉపాఖ్యానం మొదలు పెడుతున్నాను.

## శ్రీ రుక్మిణీకల్యాణ కథా ప్రారంభము

"ఆ వనజగర్భు పంపున
రైవతుఁడను రాజు దెచ్చి రాముని కిచ్చెన్
రేవతి యనియెడు కన్యను
భూవర ముని వింటి కాదె బుద్ధిం దెలియన్."

రుక్మిణీకల్యాణంలో మొట్టమొదటి పద్యం కంద పద్యం. ఈ కంద పద్యం ఏం చెప్తుందంటే, బలరాముడు వివాహం. శుకమహర్షి పరీక్షిన్ మహారాజుతో చెప్తున్నాడు: "ముందు చెప్పాను కదా నీకు, మళ్ళీ ఇప్పుడు బలరాముడి కథ ఒకసారి గుర్తుపెట్టుకో" అని. ఆ వివాహం అయిన తర్వాత కృష్ణుడి వివాహం. వనజగర్భుడంటే ఎవరు? చతుర్ముఖ బ్రహ్మ. "పద్మభూ" – నాభి కమలంలోంచి పుట్టినటువంటివాడు. ఆయన దగ్గరకు రైవతుడనేటువంటి మనువు వెళ్ళాడండి. మనువులందరూ రాజులు. ప్రజాపతులందరూ ఋషులు, బ్రాహ్మణులు. ప్రజాపతి అంటే సలహాదారు లేక పురోహితుడు. మనువు అంటే నిర్వహణధికారి లేక రాజు. ఆ ప్రజాపతులు, మనువులు మన్వంతరాళ్ళపాటు పరిపాలిస్తూ ఉంటారు. ఈ రైవతుడనేటువంటి మనువు ఎప్పుడు ఉంటాడు? ఇప్పుడు వైవశ్వత మన్వంతరం. దీని ముందు చాక్షస మన్వంతరం. అప్పుడు మనందరికీ మూడు కళ్ళు ఉండేవి. మనం బాగా నాసిగా అయితే ఒక కన్ను మూసేసారు, మట్టితో కూరేసారు. కోరికలు పెరిగినకొద్దీ మూడో కన్ను మూసుకుపోతుంది. ఇప్పుడు అది తెరవాలంటే నానాబాధా పడాల్సి వస్తోంది. ఒకప్పుడు మూడో కన్నుతో ఉండేవాళ్ళం. చాక్షస మన్వంతరం ముందు వైవశ్వత మన్వంతరం. ఈ రేవతుడనేటువంటి మనువు బ్రహ్మమును గూర్చి తపస్సు చేశాడు. అప్పుడు మన యొక్క మానవ జాతి stature కూడా ఇంతకన్నా చాలా ఎక్కువగా ఉండేది. ఎక్కువ ఎత్తుగాను, ఎక్కువ పుష్టిగాను, ఎక్కువ ధారుఢ్యంగాను ఉండేవారు. మంచి seven footers, ten footers, twelve footers, fourteen footers, twenty eight footers. ఇరవై ఎనిమిది అడుగుల ఎత్తు ఉన్న వాళ్ళు ఉన్నారు. ఇప్పటికీ ఒకడు ఉన్నాడట భూమి మీద sample. మనం sample ఉంచుతాం కదా! మన మాస్టరు ఫోటో samples, ఎప్పుడో మొట్టమొదట గురుపూజలు ఫోటోలు కూడా ఉంటాయి కదా! ఇట్లా ఇరవై ఎనిమిది అడుగుల ఎత్తు sample ఉంది భూమిమీద – "యతి" అంటారు. ఆయన పాదం ఏడు అడుగులు ఉంటుందట. హిమాలయాల్లో తిరుగుతూ ఉంటాడట. మంచులో ఆయన పాదముద్ర కనిపిస్తే

మైత్రేయాది మహర్షులందరూ కూడా అక్కడ సాష్టాంగ నమస్కారం చేస్తారు. మన్వంతరాలు దాటుతున్న కొద్దీ మనుషులు అట్లా పొట్టివాళ్ళు అయిపోతూ ఉంటారు. మళ్ళీ పొడుగువాళ్ళు అవుతూ ఉంటారు. కొంచమైపోతోంది కదా బుద్ధి! లిల్లిపుట్ వరకు కూడా ఉన్నాయి కదా కథలు! గలివర్ ట్రావెల్స్ అనే పుస్తకం అదే చెప్తోంది.

ఈయన తపస్సు కెళ్లాడండి ఆ (చాక్షుస) మన్వంతరంలో. ఇంట్లో ఆడపిల్ల ఉంది. బ్రహ్మను గురించి తపస్సు చేసి, బ్రహ్మానుభూతి పొంది, తిరిగివచ్చేసరికి అన్నీ మారిపోయినాయి. మన్వంతరం అంతా మారిపోయింది. అంటే, ఎంత తపస్సు చేసాడో మహానుభావుడు! మధ్యలో ఒక మన్వంతరం అయిపోయి, మరో మన్వంతరం వచ్చేసింది. మనుషులంతా ఇంతింతగా కన్పిస్తున్నారు. ఆయనికి ఇంట్లో చూస్తే అమ్మాయి ఉందిట అంత ఎత్తున. మరి అమ్మాయికి పెళ్లి చేయాలి కదా! ఎలా చెయ్యాలి? అంత అమ్మాయిని ఎవరు చేసుకుంటారు చెప్పండి! పిల్ల ఏదో కొంచెం పొడుగ్గా ఉంటే సర్దిపెట్టుకుంటాం కదా! మనకి ఆలస్యమైపోతుంటే పెళ్ళిళ్ళు, "ఏదో adjust చేసుకోరా" అని చెప్పేయం మనం! "నీకూ ముప్పై ఏళ్ళు వచ్చేసాయి. మరింక దొరకరేమో? ఏదో దొరికింది కదా. కానిచ్చేసై" అని చెప్పేస్తుంటారు! కానీ, ఇంత ఎత్తు ఉంటే ఏట్లా చేసుకుంటాం? ఎవరూ రాజకుమారుల్లో ఆ మాత్రం ఎత్తు ఉండేవాళ్ళు కాదు అప్పుడు. సరే ఇది ఎక్కడ గోలని మళ్ళీ కళ్ళు మూసుకొని చతుర్ముఖ బ్రహ్మను తపస్సు చేసాడు. ఇలాంటి కన్యను నా కిచ్చినప్పుడు ఒక వరుడిని ఎక్కడో సృష్టించకపోకుండా ఉంటాడా? ఉండే ఉంటాడు. అసలు పుట్టిందంటే వెంటనే ఎక్కడో మొగపిల్లవాడు పుట్టే ఉంటాడు పెళ్ళిచేసుకోడానికి అని కదా మన విశ్వాసం! వెతకటమే మన పని. ఎక్కడ వెతుకుతావు? వెతికితే కనపడదు. తారసపడాలి. లేదా ఇదిగో ఈయన చేసినట్టు చెయ్యాలి. కళ్ళు మూసుకుని ఆరాధన చేస్తుంటే ఎవరో చెప్తారు, "వాళ్ళింట్లో మంచి అబ్బాయి ఉన్నాడు. వెళ్ళండి." "వీళ్ళింట్లో మంచి అమ్మాయి ఉంది చేసుకోండి." అట్లా బ్రహ్మదేవుడిని ఆయన కళ్ళు మూసుకొని తపస్సు చేసి, "సృష్టికర్తా! నాకిలా ఒక అవివాహిత అయినటువంటి కూతురుంది. ఈమెకు వివాహం ఎట్లా జరిపించాలి? చూడబోతే రాజకుమారులందరూ అర్భకుల్లాగా కనిపిస్తున్నారు. చూస్తూ చూస్తూ నా కూతుర్ని ఒక అర్భకుడికిచ్చి చేయలేను కదా!" అని చెప్పి మొరపెట్టుకుంటాడు. ఎక్కడ? లోపలే మనసులో. మొరపెట్టుకుంటే వినిపిస్తుంది, "కంగారు పడక, ఏర్పాటు చేసాను" అని. ఎవరంటే, బలరాముడు.

బలరాముడు చాలా ఆజానుబాహుడైనటువంటివాడు. ఆ రోజుల్లో అందరికన్నా పొడుగైనటువంటివాడు, గుణసంపదగలవాడు. ఒక మనువు కుమార్తెను పెళ్లిచేసుకునేటువంటి చైతన్య స్థితి కలిగినటువంటివాడు. "వెళ్ళు, అడుగు. దైవము యొక్క అంశావతారము. తప్పక చేసుకుంటాడు. వెళ్ళు" అని చెప్తాడు. ఈ కథ నవమ స్కంధంలో వస్తుంది. నవమ స్కంధంలో అప్పుడు చెప్పాను కదా నీకు అని అంటున్నాడు శుకమహర్షి. "మున

వింటి కాదె" – విన్నావు కదా అప్పుడు చెప్పినప్పుడు, గుర్తుంది కదా అంటే మనం అయితే అలా పెడతాం మొహం! మనకేం గుర్తుండదు కదా! ఎన్ని సార్లు చెప్పినా మళ్ళీ అట్టాగే పెడతాం మొహం, వింతగా! కానీ, పరీక్షిన్ మహారాజు అలాంటివాడు కాదు కదా! "ఆ వనజగర్భు పంపున రైవతుఁడను రాజు దెచ్చి రామున కిచ్చెన్" ఎవరు రాముడు? బలరాముడు. "రేవతి యనియెడు కన్యను భూవర మున వింటి కాదె బుద్ధిం దెలియన్." ఇది ఊరికే ముందు prelude అన్న మాట. దీనికి అనుపానమైనటువంటి ఒక పూర్వ ఘట్టం. అన్నగారి పెళ్లి అయిన తర్వాత కదా తమ్ముడిది! అన్నగారి పెళ్లి, ఆయన కన్య కథ నవమ స్కంధంకు సంబంధించిన కథ. రేవతి వయస్సులో బలరాముడు కన్నా చాలా పెద్దది. ఎక్కువగా ఏళ్ళు ఉన్న ఆడపిల్లని పెళ్లి చేసుకోవచ్చాండి అంటే ఈ కథ చెప్పాలి. గభాలున, "చేసుకోకూడదమ్మా" అని చెప్పకూడదు. నీకేం తెలుసు? భారతీయుల దగ్గర ఉండే ఒకే ఒక జబ్బేంటంటే మనకు తెలియకపోయినా సలహా చెప్తామండి! అడిగిన వారిది పాపం! అయ్యో! వాడు అడిగాడు, మనకది తెలుసా, మనకిది తెలీదా అని ఏమి లేదు. ఎదో ఫోను చేసి, "ఏవండి, గాంధీనగర్లో కందుకూరి వారి కల్యాణమండపం దారేంటి?" అంటే ఏంటో చూపిస్తాడు. వాళ్ళు కృష్ణాబ్యారేజికి వెళ్ళిపోతారు! ఇలా ఉంటాయి మనం చేసే పనులన్నీ కదా! ఎందుకు చేసుకోకూడదు? చేసుకుంటాడు. సీతమ్మ రామునికన్నా ముందు పుట్టింది తెలుసా! ఏం తెలుసు నీకు? ఏం తెలియదు. ఒకరికొకరు స్వాభావికంగా నచ్చితే... షేక్స్పియర్ అలాగే చేసుకున్నాడు తెలుసా! వాళ్ళు వద్దు లెండి, వాళ్ళందరూ అదే. ఇక అటుపోవద్దు, మన దేశ ఉదాహరణలే మనకు. అంచేత, దేహదారుఢ్యము, భావముల పొత్తిక కావాలి. పెళ్ళికొడుకు పాతికేళ్ళ వాడయినా వాడి భావాలు చాలా ముసలి భావాలుగా ఉండవచ్చు కదా! ఇరవైలో అరవై వయసుందనుకోండి వాడికి, వాడికిచ్చి పెళ్లి చేసామనుకోండి, ఏం సుఖపడుతుంది ఆడపిల్ల? సుఖపడుతుందా చెప్పండి? అది అలాగే రివర్స్ చెప్పండి. ఇప్పుడు మొగపిల్లవాడికి వైరాగ్యం, ఆడపిల్లకి అన్నీ కావాలి. ఇద్దరికీ ఇచ్చి పెళ్ళి చేస్తే ఏం సరిపోతుందండి? లేదూ, ఆడపిల్లకి వైరాగ్యం, మొగపిల్లవాడు చాలా ఉత్సాహవంతుడు. వయస్సు కుదిరిందని చేసేస్తే అయిపోతుందా? ఏం చూడాలి? మనోభావాలు ఎలా ఉన్నాయి అని చూడాలి. మనోభావాలకు వయస్సుతో సంబంధం లేదట. అంచేత, ఆ విధంగా చేసుకున్నాడండి వాడు. ఆ తర్వాత చెప్తున్నాడు.

"ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్."

బలరాముడుకి ఆ విధంగా పెళ్లి అయ్యింది. కృష్ణుడు "ఖగనాథుం దమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్". అంటే, ఆకాశంలో గమనించే వాళ్ళందరికీ కూడా రాజు గరుత్మంతుడు. గరుత్మంతుడు, హనుమంతుడు వారిద్దరినీ సరిపోల్చి చెప్తారు. వాళ్ళు ఏడో ఆకాశమార్గం వరకూ కూడా విహరించగలరు. అంటే, సహస్రారం వరకూ కూడా చాలా సులభంగా ఇట్లే వెళ్లి, అట్లే వచ్చేయడం. ఏడో అకాశంలో ఎగరటమంటే సహస్రారం చేరడం, ఏడో ప్రజ్ఞా కేంద్రం. వెళ్ళిపోయి, అక్కడ ఉండిపోయేవాళ్ళు చాలా మంది ఉంటారు. వీళ్ళు అన్ని ఆకాశాల్లోనూ భగవత్ కార్యంగా చరిస్తూ ఉంటారు. అందుకనే, పిలిస్తే పలుకుతూ ఉంటారు. పిలిస్తే పలికేవాళ్ళు ఎవరయ్యా ఏ లోకంలోనైనా అంటే, ఇలాంటి మహా యోగులు, భగవత్ ప్రతినిధులు. అలాంటి గరుత్మంతుడు అమరేంద్రుడిని గెల్చి, అంటే ఇంద్రుడిని గెలిచి, అమృతాన్ని తెచ్చాడు కదా ఇంతకముందు! అది కూడా ఎప్పుడైనా చెప్పుకోవాలి. తొంభైఐదులో ఒకసారి గరుడోపాఖ్యానం చెప్పాను మన గురుపుజల్లో. ఆయన అమృతాన్ని తీసుకురావడం అంటే మనం అమృతత్వ విజయం పొందినట్లు, అమరులమైనట్లు, బ్రహ్మత్వం చెందినట్లు. అక్కడంతా ఉంటుంది. ఇంద్రుడిని కూడా నిర్జించి, అమృత భాంఢాన్ని తీసుకొస్తాడు గరుత్మంతుడు. ఎలా నిర్జిస్తాడంటే ఇంద్రుడు ఆశ్చర్యపోయి, భయపడిపోయి, ఎందుకైనా మంచిది, ఇంత బలవంతుడితో స్నేహం చేసుకుంటే మంచిదని, స్నేహం కోరతాడు గరుత్మంతునితో. అలాంటి వాడు గరుత్మంతుడు. అలా ఏ విధంగా అమృతాన్ని పట్టుకొచ్చాడో, అట్లాగే "జగతీనాథులఁ జైద్యపక్షచరులన్" – రాజులున్నారు కదా! మన దేశం నిండా రాజులే అప్పుడు. దేశం నిండా బుల్లి, బుల్లి రాజ్యాలు. ఏ ఇద్దరికీ పడదు కాబట్టి, ఒకడికొకడికి తగువుపెట్టేసి అందరినీ గెలిచేసారు తెల్లవాళ్ళు. ఇట్లా బుల్లి, బుల్లి రాజ్యాలు బోల్డు ఉన్నాయి.

అట్లాగే, "జైద్యుడు" అంటే శిశుపాలుడి రాజ్యం. వాడు ఒకడు ఉన్నాడు! వాడికి ఒక బృందం ఉంది, followers ఉన్నారు. వాళ్ళూ రాజులే! "జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి." సాళ్వుడు కూడా ఆయనకి స్నేహితుడు. "గెల్చి భ ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్". చాలా క్షేమంగా తెచ్చేసారటండి. గరుత్మంతుడు ఎట్లా ఇంద్రాదిదేవతలను, దిక్పాలకులను ఎదిరించి అమృత భాంఢాన్ని ఎలా ఎత్తుకొచ్చాసాడో, అలా చక్రాయుధం ధరించినటువంటి శ్రీకృష్ణుడు... "భీష్మకసుతన్" – రుక్మిణీదేవి తండ్రి పేరు భీష్మకుడు. ఆమెను ఆ విధంగా చాలా క్షేమంగా తీసుకొచ్చాడట.

ఆవిడ గుణాలు ఏమిటి? "రాజీవగంధిన్ రమా భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్." మరి ఇవన్నీ చెప్పుకోవద్దండీ? ఆ రుక్మిణిని అలా తెచ్చేసాడు అంటే అయిపోదు. అ పదాలు వేశారంటే అందులో మనం నేర్చుకోవాలసింది చాలా ఉంటుంది. పద్యం చదువుకోవడమంటే mind speed గా ఉంటే ఇలా వెళ్ళిపోతుంది. తర్వాత పద్యంలో ఐదు పేజీలు fast గా వెళ్ళిపోతాయి. ఇక్కడ చూడండి, భీష్మకుని

కూతురు. "రాజీవగంధిన్" – పద్మము యొక్క సువాసన ఎట్లా ఉంటుందో, రుక్మిణీదేవి శరీరం యొక్క వాసన అలా ఉంటుందట. అంటే, సువాసనలతో కూడినటువంటి దేహము. అంటే, అది ఎంత పవిత్ర దేహం అయి ఉండాలి? పవిత్రమైన వస్తువు అంతే పవిత్రత లేక అంతకన్నా ఎక్కువ పవిత్రత ఉండే చోటుకు చేర్చాలి కదా! అంతకన్నా తక్కువ పవిత్రత ఉండే చోటుకు చేర్చకూడదు. పవిత్రమైన వస్తువు జాగ్రత్తగా శుచి అయిన ప్రదేశంలో పెట్టుకుంటాం కదా మనం కూడా! అందుకని ఎక్కడపడితే అక్కడ పవిత్రమైన వస్తువులు పెట్టకూడదు. పెడితే, వాటికి అపవిత్రత వస్తుందని కాదు, మనకి మంచి జరగదు. "రాజీవగంధిన్" – గంధం అంటే సువాసన – పద్మము వంటి వాసన కలిగినటువంటి శరీరము రుక్మిణీదేవి. ఎంచేతంటే, "రమా భగవత్యంశ భవన్" ఆమె. సాక్షాత్తూ లక్ష్మీదేవి అంశతో పుట్టింది. లక్ష్మీదేవి పుట్టిందే కమలంలో కదా! కనపడడమే చేతులలో కమలముతో కనబడుతుంది. ఆమె ముఖము పద్మము. కనులు పద్మదళములు. అన్నీ పద్మములే కదా! పద్మాక్షి, పద్మముఖి, పద్మసంభవ్య, పద్మ పాదములు, పద్మ హస్తములు – అన్నీ పద్మాలే. పద్మంగా శ్రీసూక్తం ఫలశ్రుతిలో వస్తుంది, లక్ష్మీ అష్టోత్తరములో వస్తుంది. ఇట్లా పద్మమయము. అంటే, బాగా వికాసం చెందేటువంటి వస్తువుల్లో అత్యద్భుతమైనటువంటి వస్తువు పద్మము. అది చైతన్య వికాసము. చైతన్యం పరిపూర్ణంగా వికసిస్తే దాన్ని పద్మంతో పోలుస్తారు. అలా పద్మముల చెరువులో ఉంటుంది అమ్మవారు. పద్మంలో కూర్చుంటుంది. పద్మం చేతిలో ధరిస్తుంది. హస్తములు కూడా పద్మములంత సున్నితంగా ఉంటాయి. కనులు పద్మదళాల్లాగాగ ఉంటాయి. ముఖమంతా కూడా ఒక పద్మమల్లే ఉంటుంది. అందానికి, పవిత్రతకు, ఆకర్షణకు, శుద్ధచైతన్యానికి, ఆత్మతత్వానికి, వికసించేటువంటి విధానానికి, అన్నిటికీ పద్మాలే. అందుకని, అలాంటి వారందరూ కూడా శ్వేతపద్మ వాసులు అని చెప్తూ ఉంటారు. The White Islanders, శ్వేతపద్మ వాసుల గూర్చి మనకి మంత్రజాలంలో మాస్టారు రాస్తారు – వారు సహజంగా సహస్రారంలో ఉంటారు. పద్మాలన్నిటిలోకల్లా సహస్రారపద్మం వెయ్యి దళములతో అత్యద్భుతంగా ఉంటుంది. అంచేత, "ఈ మొత్తం సృష్టి అంతా తలక్రిందులైనా, వారి తలలు పిందులు కావు" అని రాశారు మాస్టారు మంత్రజాలంలో.

అసలు సృష్టి పద్మమే అమ్మవారు. ఎందుకంటే, ప్రతీ గోళము ఒక పద్మమే. ఈ పద్మాలయం అంటే దాన్నిండా అనేకానేక మండలాలు ఉంటాయి – గ్రహమండలాలు, సూర్యమండలాలు, సవిత్రుమండలాలు – అవే పద్మాలు. ఆ పద్మాల సరస్సు "సమిధి పద్మాలయ". అలాంటి మహలక్ష్మి యొక్క అంశతో పుట్టినటువంటిది రుక్మిణిదేవి. ఆమె సహజంగా పద్మగంధి. మనం కూడా అమ్మవారిని పూజించాలంటే, శుచియై పూజించాలి. అమ్మవారినే కాదు, దైవారాధన చేసుకుందాం అనేటువంటివారు ఎప్పుడూ ఒకటి గమనించుకోవాలి. శరీరముగాని, ముఖముగాని అంటే నోరు వాసన ఉండకుండా చూసుకోవాలి. శరీరంలో అగ్నికార్యం

జరుగుతుండడంచేత వాసన పడితే, మళ్ళీ స్నానం చెయ్యడమే. ఆరాధనకి శుచియైనటువంటి మనస్సు ప్రధానం. శుచియైన శరీరము కూడా ప్రధానం. శుచియైన ప్రదేశము ప్రధానము. అంతర్ శుచి, బాహ్యశుచి ఎక్కడ ఉంటే అక్కడ క్రమంగా వికాసానికి అవకాశం కలుగుతుంది. అంచేతే, మలినం లేకుండా చూసుకునేటువంటి పద్ధతి సాధనలో ఒక ప్రధానమైన అంశమై ఉంటుంది. వేసవికాలం వచ్చిందనుకోండి, ఒకటికి నాలుగు సార్లు స్నానం చేయ్యడమే. బద్ధకించకూడదు. ఒక్కసారి దంతధావన చాలదనిపిస్తే, రెండు సార్లు చేసుకోవచ్చు. రెండు సార్లు చాలదంటే మూడు సార్లు చేసుకోవచ్చు. మనం మాట్లాడుతుంటే, ముందున్న వాడు మూడు అడుగులు వెనక్కి వేసాడట అంటే అర్థమేంటో తెలుసా? అంత దుర్గంధం మనలోంచి వ్యక్తమౌతోందని. మన వలన దుర్గంధము వ్యాప్తి కాకూడదు. సుగంధ వ్యాప్తి కావాలి. సుగంధం ఎక్కడుంటే అక్కడ అమ్మ తలుపులు తెరుచుకుని వచ్చేస్తుందట. గంధమే ఆమెకు ద్వారం – “గంధద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్” – ఎక్కడ వాసన ఉంటుందో అక్కడ పుష్టి కలిగిస్తూ ఉంటుంది. అందుకనే, ఇళ్ళు, ఒళ్ళు, రెండు కూడా ఎప్పుడూ దుర్వాసన లేకుండా ఉండాలి.

ఆమె పద్మగంధి. లక్ష్మి అంశతో పుట్టింది. మహాగుణమణి. మహాగుణములని కొన్ని చెప్తారు. మనుషుల్లో మామూలుగా ఉండవు. కలియుగంలో తరువు. అందులో మొట్టమొదట చెప్పేది శమము. “శం నో మిత్ర శ్శం వరుణః”. “శం” అంటే మనసు యందు ఒక  సామ్యము, సమస్థితి – ప్రశాంతత కలిగి ఉండడం. శమమే జీవితమంతా మనకి విజయానికి కారణమవుతుంది. కంగారులో పనిచేస్తున్నవారికి ఏం పనులూ అవ్వవు. అయినా, అవన్నీ పాడయిపోతూ ఉంటాయి. కంగారుగా ఉండేవాడు ఏ పని సవ్యంగా చెయ్యగలడు? తప్పులు చేస్తుంటాడు కదా! మొట్టమొదట గుణము శమము.

రెండవ గుణము దమము. దమమంటే ఎదుటివారి యందు ఉండేటువంటి రజస్సు, తమస్సు వంటి గుణాలు ప్రకోపించినప్పుడు, మనం శాంతం వదలకుండా, క్రమంగా ఆ తమోగుణాన్ని, ఆ రజోగుణాన్ని చక్కదిద్దటం. మంచివారి సాన్నిధ్యంలో ఢాం, ఢూం అనేవాళ్ళు కూడా మెత్తగా ఉంటారు కదా! ఆ సన్నిధిలో కోపిష్టి వారికి కోపం రాదు, చిరాకు మనుషులకి చిరాకు రాదు, తొందరపాటు మనుషులికి శాంతత వస్తుంది. ఋషుల ఆశ్రమాలకి వెళ్తే అలా జరుగుతుంది. అక్కడ పులులు, లేళ్ళు అన్యోన్యంగా ఉంటాయి. సాధారణంగా పులి, లేళ్ళు అన్యోన్యంగా ఉంటాయా? ఉండవు. పరస్పర విరుద్ధ భావం ఉండే వాళ్ళందరు కూడా అక్కడ కలిసిమెలిసి ఉంటారండి. అలా ఉంటే అది దమము అంటారు. దమన శక్తి అంటే ఇతరుల యొక్క రజస్సులు, తమస్సు దమింపబడతాయి. అంటే, వారిని చూడగానే అవతలవాళ్లకి వాళ్ళలో ఉండే ప్రకోపాలన్నీ చల్లారి పోతాయి. చాలాసార్లు చెప్తూ ఉంటాను – మొట్టమొదటిసారి రావణుడు రాముడిని యుద్ధంలో చూసినప్పుడు...

అదే మొదటిసారి చూడడం. చాలా క్రోధంతో వస్తాడు, సంహరించాలని. కానీ రాముడిని చూడగానే మొత్తం రజోగుణం, తమోగుణం అన్నీ పోయి, సత్వగుణం ఆవరించేసి, అదేదో పులిపిల్లల్లే తోకాడిస్తునట్టుగా స్వభావంలో పూర్తిగా మార్పు వచ్చేస్తుంది. కేవలం చూపు అలా ఉంటుందా? అలా ఉంటాడు రాముడు. అలా ఉంటాడు కృష్ణుడు. దుర్యోధనాదులకి లోపల ఎంత ద్వేషం ఉన్నా, కృష్ణుడిని చూడగానే అవన్నీ కరిగిపోయి, జీవుని సత్వశుద్ధమైనటువంటి సత్వగుణం ప్రకటింపబడి, అట్లా పెంపుడు కుక్కలాగా తోకాడిస్తూ, వింటూ ఉంటారు చెప్పింది. ఆ రాయబారంలో కృష్ణుడు అందరిని కఠినమైనటువంటి మాటలు మాట్లాడినా, ఎవ్వరూ చోటు వదలక, అట్లా గుడ్లు అప్పగించి, నోళ్ళు తెరిచి, చెప్పింది వింటారు.

రుక్మిణీకల్యాణంలో కూడా అంతే జరుగుతుంది: "ఆయన వస్తాడు. ఆయుధాలు పట్టుకుని మనమంతా జాగ్రత్తగా ఉండాలి. ఏ క్షణంలోనైనా రావచ్చు. అసలే మాయగాడు. జాగ్రత్తగా ఉండండి. అప్రమత్తంగా ఉండండి." అని అందరికి హెచ్చరికలు జారీ చేసి, అందరూ సాయుధులై సంసిద్ధంగా ఉంటే, ఒకసారి చక్కగా నవ్వుతాడు వాళ్ళను చూసి, "ఏంరా! వెర్రివెధవల్లారా!" అన్నట్టు. నవ్వంగానే, అందరూ అట్లా నిశ్చేస్టులైపోతారు. అలా గుడ్లు అప్పగించి చూస్తూ ఉంటారు. అలా వెళ్ళి, redcarpet మీదుగా వెళ్ళినట్టుగా వెళ్ళి, ఆమె చేయి తన చేతిలోకి తీసుకుని, చక్కగా వచ్చి రథమెక్కిచ్చి, ఆ తర్వాత బయలుదేరి వెళ్తూ, వీడ్కోలు చెప్తాడు. అప్పుడు వాళ్ళకి తెలివొస్తుంది. అది దమము అంటే – మహా గుణము.

శమమే లేనివాడికి దమము ఎట్లా వస్తుంది? "ఏమిటోనండి! ఎదుటివారిని బోల్డు అందాం అని వెళ్ళాను. ఏమీ అనలేకపోయాను. వచ్చేసాను" అంటాడు కదా! "ఆయన్ని చూస్తే ఏమీ మాట్లాడ బుద్ధికాలేదండి" అంటాడు. "నీకెందుకు? నేను మాట్లాడతాను, పద" అంటాడు, ఎవడ్నో వెంటేసుకొని. ఒక సత్పురుషుడు చూడంగానే నవ్వుతాడు. అంటే, జీవుడిని పలకరిస్తాడు "బాగున్నావా" అని. పలకరిస్తే, ఇంత వకాల్తా పుట్టుకొచ్చినవాడు మాట్లాడలేదు. "ఇదేంటయ్యా! బోల్డు చెప్పావు మాట్లాడతానని. ఏం చెప్పలేదు" అంటే, "ఏంటో! ఆయన్ని చుస్తే ఏం చెప్పబుద్ధి కాలేదండి" అంటాడు. "అయినా, మీరు కూడా కొంచెం ఆలోచించుకోవాలి" అని వీడు చెప్పేస్తుంటాడు ఇంక! దమము ఒక అద్భుతమైన శక్తి. ఎవరికుంటుంది? బాగా శమమునందుండి, సమభావం కలిగినటువంటి వాళ్ళకి దమము ఉంటుంది.

తర్వాత, మూడో గుణము ఉంది – దేనికైనా వేచి ఉండటం, Ability to wait, తితీక్ష. తితీక్ష అనేటువంటి ఒక గుణంఉంది. వేచి ఉండుట. వేచి ఉన్నవారి దగ్గరకి అన్నీ వస్తాయి. తొందర పడేవాళ్ళ దగ్గరకి ఏమీ రావు. వేచి ఉన్నవారికి అన్నీ కలిసివస్తాయి. Ability to wait అనేది పెద్ద గుణం అది. ఈ గుణాలన్నీ

శనిగ్రహం ఇస్తాడండి. శనైశ్చరుడు దగ్గర ఉంటాయి శమము, దమము, తితీక్ష. ఎక్కడికన్నా వెళ్ళామనుకోండి, మన మీటింగ్లు పెట్టామనుకోండి, లోపల అలా, అలా ఒక రకమైనటువంటి unrest వస్తూంటుంది మనిషికి. ఎంతసేపు కూర్చుంటామండి! ఎంతసేపు wait చేస్తాం? అసహనం వస్తుంది. పూర్వకాలం రైళ్ళ కోసం అట్లా కూర్చునేవాళ్ళు. ఇప్పుడలా లేవు మన రైళ్ళు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా, ఈ లోపలే చిరాకు పడిపోయే బుద్ధి ఉంటుంది చాలా మందికి. ఐదు నిమిషాలైనా, పది నిమిషాలైనా, ఇరవై నిమిషాలైనా అలా వేచి ఉండగలిగినవాళ్ళు. ధర్మరాజుకి గుణాలన్నీ ఉన్నాయి. అందుకనే అన్నీ శుభ్రంగా జయించేసాడు. తితీక్ష మూడో గుణం.

శమము, దమము, తితీక్ష, శ్రద్ధ. అన్నీ విషయాల్లో శ్రద్ధ ఉండేవాడే అవసరమైనప్పుడు వాడికి శ్రద్ధ పనికొస్తుంది. General గా అశ్రద్ధగా ఉండి, important పనుల్లో శ్రద్ధగా ఉందామనుకుంటే కుదరదు. ఎందుకంటే, నీకు మాములుగా స్వభావంలో అశ్రద్ధ ఉన్నప్పుడు, శ్రద్ధ అవసరమైన చోట అది నీచేతికి అంది రాదు. శ్రద్ధ ఎలా ఉండాలంటే చిన్నచిన్న పనుల దగ్గరనుంచి, అన్ని పనులవరకు కూడా, ప్రతి పనిని చాలా శ్రద్ధగా చెయ్యాలి. తీసిన ఒక వస్తువుని తీసిన చోట పెట్టగలిగుండాలి. పెట్టంగా! తీసిన వస్తువు తీసినచోట పెట్టడం అనేటువంటిది ఈ రోజుల్లో ఎక్కడా చూడము. ఎక్కడో పెడతాం! మనకి గుర్తు ఉండదు కదా! ఎలా తీసావో, అలాగే పెట్టగలిగుండాలి. ఇప్పుడు ఈ పుస్తకం ఇక్కడనుంచి తీసామనుకోండి, తీసేటప్పుడు ఇలా ఉందనుకోండి, చదివిన తరవాత అలా పడేయకూడదు. ఎలా తీసామో అలాగే పెట్టాలి. మంచి నీళ్ళు తాగి, మూత పెట్టాలి. మూత తీసి, మంచి నీళ్ళు తాగావుగా? మళ్ళీ మూత పెట్టాలి. Everything has to be restored to its original order. అది శ్రద్ధ. కళ్ళజోడు ఉందనుకోండి. ఇది ఎక్కడ నుంచి తీసావో, దాన్నెక్కడ పెట్టాలో అక్కడ పెడితే, మళ్ళీ వాడుకోవడానికి అందుబాటులో ఉంటుంది. మాములుగా డొక్కు ఒకచోట, కళ్ళజోడు ఒకచోట, రోజుకొక చోట పెట్టుకున్నామనుకోండి. అలాంటి వాళ్ళకి ఏ పని అప్పజెప్పరు పెద్దవాళ్ళు. ఇంకో అశ్రద్ధాపరుడు అప్పజెప్పచ్చు. వీడిలాంటి వాడే వాడూ కదా! చాలామంది నా చేతులో ఏదన్నా ఉంటే, భక్తిగా నా చేతులోంచి తీసేసుకుంటారు. మళ్ళీ వాడినడిగితే, వాడు ఇంకొకడికి ఇచ్చేసుంటాడు. ఇంకొకడికి ఇచ్చేసేవాడివయితే నువ్వు తీసుకోవడమెందుకు? ఇంకొకడికి ఇవ్వడానికి ఎందుకు తీసుకున్నావు? పోనీ ఇచ్చావనుకో, మరి నాకు చెప్పావా? చెప్పలేదు! ఇలా మనం శ్రద్ధ తీసుకుంటే, చెప్పులు వదలడం దగ్గరనుంచి ఉంటుంది శ్రద్ధ. దుస్తులు వేసుకోవటం, దుస్తులు తీయడం దగ్గరనుంచి ఉంటుంది శ్రద్ధ. చిన్న చిన్న విషయాల్లో శ్రద్ధ లేకుండా, అలా ఒక డంభాచారంగా భాగవతం తీసి చదువుకున్నామనుకోండి ఏమీ అర్ధం కాదు. చదివేస్తే అది భాగవతం కాదు.

మొన్న ఒక ఊరు వెళ్తే, పది స్కంధాలు చదివేశాను భాగవతం, దశమ స్కంధం వరకూ వచ్చేసానన్నాడు ఒకాయన. ఎట్లా వస్తుంది? దశమ స్కంధం వరకు భాగవతం వస్తే ఇక తెలియందంటూ ఏమీ ఉండదు సృష్టిలో. ఏమంటావు అప్పుడు? "చాలా సంతోషం" అన్నాను. ఏమీ అనకూడదు కదా! కాస్త ఏమన్నా అంటే ఇబ్బంది వచ్చేస్తుంది! అంతా అయిన తర్వాత "నాకో డౌటుంది" అన్నాడు. ఏమి డౌటు అది? ముప్పై సార్లు అంతకుముందు చెప్పిన విషయాలు ఉన్నాయి అందులో. భాగవతం దశమ స్కంధం వరకూ చదువుకున్నవాడికి ఇంకే doubt ఉండకూడదు. సృష్టి ఎలా వస్తుందో తెలియాలి, జీవులెందుకొస్తారో తెలియాలి, ఈ మన్వంతరాలు ఏమిటో తెలియాలి, ఈ గోళాలు అన్నీ ఎట్లా పుడతాయో, ఎట్లా వెళ్ళిపోతాయో తెలియాలి, యుగాలు తెలియాలి, కల్పాలు తెలియాలి, అన్నీ తెలియాలి. ఏం తెలియవు! మనకు అక్షరాలు వచ్చు, అంతే గభగభా అక్షరాలు చదువుకుంటూ వెళ్ళిపోయావు, పుస్తకం అయిపోయింది!

మొన్న ఎవరో అడిగారు బెంగుళూరులో, "ఏవండీ! ఇంగ్లీషులో చిన్నదిగా ఉంది. తెలుగులో పెద్దదిగా ఉంది మీరు రాసిన బుక్?" అంటే, గభాలున ఒకావిడ సమాధానం చెప్పింది – "ఇంగ్లీషు భాషలో ఇరవై ఆరు అక్షరాలే కదా. తెలుగు భాషలో ఎక్కువ అక్షరాలు కదా. అంచేత, ఇది చిన్నదిగా ఉంది. అది పెద్దగా ఉంది", అంటే వాళ్ళు సమాధానపడిపోయారు. చాలా ఆశ్చర్యం తెలుసా! తక్కువ అక్షరాలుంటే తక్కువలో అయిపోతుందా అట్లా? మనకు ఇంగ్లీషులోనే ఎక్కువ చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే తెలుగులో ఒక పదం వాడితే ఆ ఒక్క పదంలో మూడు వాఖ్యలు చెప్పేస్తాం. ఇంగ్లీషులో మూడు పదాలు పడతాయి. కానీ ఆవిడ చెప్పిన సమాధానం వాళ్ళకీ నచ్చింది. Quantitative understanding తప్ప qualitative understanding ఉండదు కదా! అందుకని, ఆవిడ చెప్పిన సమాధానం టక్కున నచ్చింది. "అబ్బా! ఎంత బాగా చెప్పారు" అని అందరూ అన్నారు. అంటే, నిజమే కావచ్చు అనుకుంది ఆవిడ. చూస్తూ ఊరుకున్నాడు ఎందుకొచ్చిన గోల మనకి అని! చదవటం అంటే అక్షరాలు తెలిస్తే చదువొచ్చినట్టాండి? అందుకని మాస్టరు గారు గోలపెట్టేస్తూ ఉండేవారు, "Literacy is not education" అని. Literacy వేరు, education వేరు. ఒక పద్యం చదువుకోటమంటే, చదివే ప్రతి పదం చూసుకొని, వెతుక్కొని చదువుకోవాలి.

రుక్మిణిదేవికి ఇలాంటి మహాగుణాలు ఉన్నాయండి. శమము, దమము, తితీక్ష, శ్రద్ధ, సమాధానము. సమాధానం అంటే ఆధానము, సమము. ఉన్న పరిస్థితిని చక్కగా అవగాహన చేసుకొని, తదనుగుణంగా మన ప్రయత్నం చేసుకుంటూ ఉండడం. సమాధాన పడ్డాను అని అంటే అర్థం ఏమిటంటే అర్థం చేసుకుని, తదనుగుణంగా నా కర్తవ్యాన్ని మలుచుకుని, నేనేం చెయ్యాలో అది నిర్వర్తించుకుంటూ ఉండడం. అంతేగాని

వెచ్చబడ్డడం, వాడిమీద, వీడిమీద కోపపడడం, వాడి వల్లే కాలేదు, వీడి వల్లే కాలేదు, వీడి వల్లే మనకి ఇబ్బందులు, ఇట్లా ఏమీ ఉండవు. ఇలాంటి గుణాలు ఉన్నాయండి ఆవిడకి. ఆవిడ మహాగుణమణి.

ఆమె "రాజీవగంధిన్ రమా భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్". అంటే బాలులలో బాలామణి. అంటే ఆ వయస్సు వారందరికన్నా ఎక్కువ ప్రకాశంగా ఉంటుంది. స్వయంప్రకాశం కలది. మణి అంటే స్వయంప్రకాశం. "రుక్మిణిన్" – రుక్మిణి అంటే చాలా సార్లు నావాణిలో రాసాను, ప్రవచనాలలో చెప్పాను. రుక్మము అంటే బంగారము. రుక్మిణి అంటే బంగారు దేహము గలది అని అర్థం. రుక్మిణి పుట్టుకతోనే బంగారు దేహం కలిగినటువంటిది. అంటే, బంగారు దేహపు నిర్మాణం చేసుకోవలసిన పరిస్థితి లేదు. బంగారు దేహం కలిగి ఉండడం బట్టే ఆమె అంతకన్నా ఉన్నతమైనటువంటి విషయములందు ఆసక్తి కలిగి ఉన్నది తప్ప, పదార్థమయమైనటువంటి విషయములందు ఆమెకి ఆసక్తి లేదు. పరమార్థమందు ఆసక్తి కలిగిన జీవి రుక్మిణి. ఆమె కృష్ణుని భార్యలలో ప్రత్యేకమైనటువంటిది. నిజానికి కృష్ణుడు వరించినటువంటి కన్య. మిగతావాళ్ళందరినీ కొంతమందిని గెలుచుకున్నాడు, కొంతమంది భయం చేత వాళ్ళే తెచ్చి ఇచ్చేసారు. వారు కృష్ణుని వరించి ఉండవచ్చు. కృష్ణుని వరించడానికే, ఎవరైనా వరిస్తారు. కానీ, కృష్ణుడు వరించిన కన్య రుక్మిణి. ఎంచేతంటే, ఆమె పుట్టుకతోనే అలాంటి పరిస్థితులో ఉంది. అమరత్వం కలిగి ఉన్నటువంటి స్త్రీ, జీవి. అంటే, అమరలోకం నుంచి దిగి వచ్చిన జీవి. కారణ జన్మురాలు అయి ఉండటం చేత అలాంటి గుణాలు ఆమెకి కలిగి ఉన్నాయి. ఇలాంటి సద్గుణాలతో కూడినటువంటి మూర్తి రుక్మిణి అని ఈ పద్యం చెప్తుంది.

> "అనిన రా జి ట్లనియె. మున్ను రాక్షసవివాహంబున స్వయంవరంబునకు
> వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయె నని పలికితివి కృష్ణుం డొక్కరుం
> డెవ్విధంబున సాళ్వాదులం జయించి తన పురంబునకుం జనియె
> నదియునుంగాక."

ఈయన ఇంతకముందు రాముడు కథ ఒక కంద పద్యంలో చెప్పేసాడు కదా! కృష్ణుడు ఎట్లా పెళ్ళి చేసుకున్నాడు అనేది ఇంకో మత్తేభంలో చెప్పేసాడు. అలా గెల్చుకుని, తెచ్చుకున్నా డన్నాడు. అంటే, మనబోటి వాళ్ళు "ఆహా! సరే తర్వాత, ఆ next!" అంటాము. అలా అనకుండా, "అలా కాదమ్మా! గురువుగారు! కొంచెం వివరంగా చెప్పండి" అని అడుగుతున్నాడు. ఎలా తెచ్చాడు? ఒక్కడే వెళ్ళాడు అని ఇది వరుకు చెప్పావు. ఒక్కడే వెళ్ళి, రాక్షస వివాహం ఉన్నది కదా! ఎత్తుకుపోవటం కదా! "రాక్షసవివాహంబున స్వయంవరంబునకు వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయె నని పలికితివి కృష్ణుం డొక్కరుం డెవ్విధంబున సాళ్వాదులం జయించి తన

పురంబునకుం జనియె” అట్లా ఎట్లా వెళ్ళాడు? ఆ సాహసోపేతమైనటువంటి కృత్యం, అది కూడా కొంత వివరించమన్నాడు. ఎందుకంటే, ఈయన క్షత్రియుడు కదా! భగవంతుని యొక్క సాహస గుణాలు మనం చదువుకుంటే మనకి కూడా లోపల కొంత ధైర్యం వస్తుంది. ఇలాంటి వాడు మనకి తోడై ఉంటాడు కదా! “తక్కువే మనకు రాముండొక్కడు వరకు” – ఒక్క రాముడుంటే చాలు, ఇంకేమీ వద్దు మనకి. అవతల పక్క ఎంతమందున్నా ఫర్వాలేదు. ఇలా పాట మనం గట్టిగా అర్థం చేసుకుంటే రాముడు ఒక్కడుంటే ఈ సృష్టిలో ఇంకేం కావాలి చెప్పండి? ఇంక దేనికీ కొదవ లేదు. అలాగా ఇంకొకటి చెప్పు సుమా అన్నాడు!

“కల్యాణాత్మక మైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై
కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు సా
కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్.”

అడిగేవాడిని బట్టి చెప్పేవాడు ఉంటాడు. అడిగేవాడు చెప్తున్నవాడిని ఉత్సాహ పరచాలి. ఇంకొంచెం వివరం అడిగితే, ఇంకొంచెం వివరం చెప్తాడు. “వీడికిది చాల్లే” అని మూసేస్తున్నాడనుకోండి, “అమ్మమ్మ! కాదు. ఈ ఈ విషయాల్లో ఇంకొంచెం వివరం కావాలి” అని అడగడంలో శ్రోతయొక్క ఉత్సుకత, శ్రద్ధ, కుతూహలము, భక్తి ఇవన్నీ కనిపిస్తాయి. అంచేతే, పెద్దవాళ్ళు చెప్పేటప్పుడు ముందు టూకీగా చెప్తూ ఉంటారు. టూకీగా చెప్తున్నప్పుడు, ఆయన్ని ఆపి, ఇంకొంచెం వివరించండి అని అడిగేవాళ్ళు ఉంటే వివరిస్తాడు. లేకపోతే వివరించడు. తనకి తెలిసిందంతా చెప్పేద్దామనే కుతూహలం ఉండేటువంటి వారు వేరు. వినేవాడిని బట్టి చెప్పటం అనేటువంటిది వేరు. ఇప్పుడు ఇదే రుక్మిణీకల్యాణం మనం ఏ రైల్వేప్లాట్ఫారం మీదో చెప్పుకున్నాం అనుకోండి. చెప్పేవాడికీ ఏ ఉత్సాహం ఉండదు. అలాగే, వినేవాడికి అటూఇటూ పోయే బళ్ళు, అనౌన్సుమెంట్లు, అక్కడా, ఇక్కడా వీళ్ళు అమ్ముకునేవి, ఇవే కదా! అంచేత, శ్రద్ధ బట్టి ఈయన అడిగాడు. ఏమడిగాడు? “కల్యాణాత్మక మైన విష్ణుకథ లాకర్ణించుచున్” – ఎప్పటినుంచో వింటున్నాడు పరీక్షిత్తు విష్ణుకథలు. దశమ స్కంధం వరకూ వచ్చింది భాగవతం. శుకమహర్షి చెప్తూ వస్తున్నాడు కదా! అవి వింటూ ఉంటే “ముక్తవై కల్యుం డెవ్వఁడు” – వైకల్యాల నుంచి ముక్తి వచ్చేస్తూ ఉంటుందటండి. భాగవతం వింటున్నప్పుడు, మనకుండేటువంటి వికారాలు కాస్త అట్లా బయటకి వెళ్తాయి. వాటి నుంచి మనం ముక్తి పొందుతాము. భగవత్ కథలు వింటున్నప్పుడు, అందులో జీవుడికి కలిగినటువంటి ఆకర్షణ చేత, ఇతర సమస్యలు, దేహ బాధలు, కుటుంబ బాధలు, ఉద్యోగ బాధలు, మిగతా పీడలు, ఇవన్నీ ఏముండవట. అవి గుర్తుండవు. ఆ వైకల్యాల నుంచి ముక్తి పొందుంటాడు.

"విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ" – తృప్తి ఉండదట. ఎన్నిసార్లు చెప్తున్నా, ఇంకా చెప్పండి, ఇంకా చెప్పండి అంటారట. అట్లా ఉంటాయట విష్ణుకథలు. అందుకనే నారదమహర్షి మొదట్లో చెప్తాడు వేదవ్యాసుడికి, "విష్ణుకథలుగా నువ్వు సృష్టి ధర్మాలన్నీ చెప్పుంటే అది ఎక్కువ బాగుండేది నీక్కూడా. నువ్వు అట్లా చెప్పకపోవటంవల్ల నీకే లోపల కొరతగా ఉంది." మహాభారతం అంతా చెప్పిన తర్వాత వేదవ్యాసునికి కొరత ఉండిపోయింది – "ఏదో సరిగ్గా చెప్పలేదు నేను" అని. ఏదో చెప్పలేదంటే, అంతా ధర్మపరంగా చెప్పాడు భారతం. దైవపరంగా చెప్పలేదు. దైవపరంగా ధర్మ సూక్ష్మాల్ని చెప్తూ ఉంటే, ధర్మమూ తెలుస్తుంది, దైవము నందు ఆకర్షణ చెంది జీవుడూ ఉద్ధరింపబడుతూ ఉంటాడు. ఇప్పుడు యోగం ఉందనుకోండి, అది ఒక శాస్త్రంగా చదువుకొని యోగం చేసేవాళ్ళకి ఏం యోగం అబ్బదు. చూస్తుంటాను, ఈ యోగాసనాలు, ఈ అష్టాంగ యోగాలు చెప్పేవాళ్ళు ఏదో ఎండిపోయినట్టు ఉంటారు. ఒక ఆకర్షణ కూడా ఉండదు వాళ్ళల్లో. అనుభూతి ఉండదు. ఎంచేత అని అంటే భక్తి లేకపోవడంతో. భక్తితో కూడి అష్టాంగ యోగం చేసుకుంటే ఆ కథ వేరు. భక్తి లేక శాస్త్రం, శాస్త్రంగా చదువుకుంటే ఆ కథ వేరు. శాస్త్రానికి రాణింపు అది దైవపరంగా నేర్చుకుంటేనే ఉంటుంది. ఏ విద్యైనా రాణించాలంటే అది దైవపరంగా నేర్చుకోవాలి. యోగ విద్యైనా అంతే, ధర్మాలైనా అంతే. అట్లా ధర్మసూత్రాలన్నీ రోజూ చదువుకుంటూ ఉంటే బోరు కొడ్తూ ఉంటుంది. ఆ ధర్మాలని రాముడు ఎట్లా నిర్వర్తించాడు? కృష్ణుడు ఎట్లా నిర్వర్తించాడు? ధర్మరాజు లాంటి వారు ఎలా నిర్వర్తించారు? భాగవతుడు ఎట్లా నిర్వర్తించాడు? అట్లా కథల్లో చెప్పుకుంటూ వెళ్ళామనుకోండి, అప్పుడు నిలిచిపోతాయి. దానికొక రాణింపు ఉంటుంది. ఒక సంతృప్తి ఉంటుంది. చెప్పేవాడికీ బాగుంటుంది, వినేవాడికీ బాగుంటుంది.

కొంతమంది లెక్చరెర్స్ కాలేజీలో పాఠాలు చెప్తూ ఉంటే, పిల్లలు నిద్రపోతూ ఉంటారు. కానీ కొంతమంది పాఠాలు చెప్తూ ఉంటే, సెలవు రోజుల్లో చెప్పినా వస్తారు. చిన్నప్పుడు మాకు మిగతా క్లాసుల కన్నా తెలుగు క్లాసులు ఎక్కువ interesting గా ఉండేవి. ఎందుకంటే, తెలుగు పాఠాల్లో ఇటువంటి ఘట్టాలన్నీ ఉండేవి. ఆ చెప్పే తెలుగు మాస్టార్లు కూడా చాలా భారత, భాగవత, రామాయణ గ్రంథాలు తెలిసినటువంటివాడై ఉండేవారు. అద్భుతంగా వివరిస్తూ వుండేవారు. అలా చిన్నతనంలో విన్నవి ఎక్కడికీ పోవు. పెద్దయిన తర్వాత వాటిని పెంచుకుందాం అనిపిస్తుంది. "నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్" అనే పద్యం ఉందనుకోండి. ఇది వరకూ ఇది పాఠ్య భాగం. ఇప్పుడు లేదుగా! అవి విని తయారైన వాళ్లకీ, ఇలా (వినకుండా) తయారైన వాళ్లకీ మనుషులలో తేడా ఉంటుంది. ఎంచేతంటే, దైవపరమైనటువంటి కథలో భాగంగా ధర్మాలు చెప్పుకుంటూ ఉంటే ధర్మాలూ తెలుస్తాయి, దైవము యొక్క అనుభూతీ మిగులుతుంది.

"విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు" – ఇంకా కొత్తగా, ఇంకా తెలుసుకుందాం, ఇంకా తెలుసుకుందాం అని ఉంటుంది. "సా కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే" – సాకల్యంగా, అంటే చాలా వివరంగా చెప్పుకున్నవి. టూకీగా కొట్టెబోకుండా, చాలా వివరంగా చెప్పు అన్నాడు. "సా కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్." పాఠం చెప్పేవాడు, వినేవాడికి కుతూహలం పుట్టించాలి, వాడిని ఊరుస్తూ చెప్పాలి. అలా ఊరిస్తూ, ఊరిస్తూ అన్నం పెట్టిన దారి వేరండి. ఇట్లా పారేసి, తినమంటే వేరు కదా! అందుకనే, భోజనం పెట్టేముందు ఊరించడానికే విస్తర్లో అన్నీ ఇంతింత వడ్డిస్తారు. చూడంగానే, ఓహో! అని మనకు ముందు కుతూహలం కలుగుతుంది. అందులో నీకు నచ్చేవి కొన్ని కనిపిస్తాయి కదా! దాంతో ఉత్సాహం వస్తుంది. ఆ ఉత్సాహం నుంచి వాడింకా అడుగుతూ ఉంటాడు, వీడు వేస్తూ ఉంటాడు. వాడు అడుగుతూ ఉంటాడు, వీడు వేస్తూ ఉంటాడు. అట్లా దేంట్లో అయినా ఓ సార్థకత ఉండాలి. ఒక సాఫల్యం ఉండాలి. ఆ సాఫల్యం ఉండాలంటే సాకల్యంగా చెప్పుకోవాలి. అంచేత, అక్కడ చెప్పమన్నాడు.

"భూషణములు చెవులకు బుధ
తోషణములు లనేక జన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్."

రేపు చెప్పుకుందాం. ఎనిమిదిన్నర అయ్యింది. మనకింకా ఒక కార్యక్రమం ఉంది. ఇలా చదువుకుంటాం మనం రుక్మిణీకల్యాణం. అయినప్పుడవుతుంది. కానీ, ప్రతి పద్యంలోనూ మనకి చాలా మంచి మంచి విషయాలు తెలుస్తాయి. కథ కూడా తెలుస్తుంది. అంచేత, మంచి రసవత్తరంగా సాగుతుంది భాగవతం. కృష్ణమూర్తిగారు మంచి ఉపాఖ్యానాలు మనకిచ్చారు. కొన్నాళ్ళ పాటు దీంతో మనం కాలక్షేపం చెయ్యచ్చు. అనుభూతి పొందుతూ చదువుకుందాం. ఊరికే చదివేశామనుకోవద్దు!

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## మార్చి 4, 2012 ఉదయము – ప్రవచనము #2

జగద్గురు పీఠము, విజయవాడ కేంద్రము, సోదర బృందం నిర్వర్తిస్తున్నటువంటి మాస్టర్ సి. వి. వి. గురుపూజా మహోత్సవములకు ప్రాతఃకాలమునే శుచియై, ప్రార్థనకేతెంచి, పాల్గొన్నటువంటి సోదరబృందానికి నా హృదయపూర్వక నమస్కారములు. శిశిరఋతువు, ఫాల్గుణమాసము, శుక్లపక్షము, ఖరనామ సంవత్సరము, ఆదివారము, ఏకాదశి ఘడియలు – ఇలా ఎన్నో రకాలుగా కాలం మనకి శుభలక్షణాలని ఒక చోట చేర్చి, సద్గోష్టికి అనుకూలమైనటువంటి వాతవరణాన్ని కల్పిస్తూ ఉంటుంది. దాన్ని మనం గమనిస్తూ ఉండాలి. శిశిరఋతువు యొక్క ముఖ్య ఉద్దేశ్యము ఉన్నవి కొన్ని పోవటం. శిశిరఋతువులో ఉన్నవి కొన్ని పోతే, వసంతఋతువులో కొన్ని కొత్త చిగుళ్ళు వస్తాయి. మనలోనే మన వృద్ధికి, మన పురోగతికి అవరోధం కల్పించేటువంటి భావములు, భాష, అలవాట్లు ఉంటాయి. ఏదైనా వదిలించుకుందాం అంటే వదలదు. వదిలించుకోవాలి అనే ప్రయత్నం కన్నా, లోపల దైవమును బాగా ఆవాహనం చేసుకుంటూ ఉంటే కొన్ని పడిపోతూ ఉంటాయి. శిశిరఋతువులో చక్కటి గాలి ఒకటి వీస్తూ ఉంటుంది. ఆ గాలి ప్రభావం చేత చెట్లకి ఆకులు రాలిపోతూ ఉంటాయి.

అలాగే మనలో కూడా ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా వాయువు నిర్వర్తించే కార్యక్రమాన్ని మనం చక్కగా నిర్వర్తించుకోగలిగితే... ప్రాణం పీల్చినప్పుడల్లా దైవాన్ని మనలోకి ఆవాహనం చేస్తునట్లు, అపానం వదిలినప్పుడల్లా మనలో వర్జనీయమైనటువంటి విషయాలని మనం విసర్జిస్తున్నట్లు ఇలా భావం చేసుకోవచ్చును. ఒక పక్క దైవమును ఆవాహనం చేయడం, ఆయన బలం మనలో చేకూరుతున్నకొద్దీ మనలో ఉండేటువంటి వర్జించతగిన అవరోధములన్నీ కూడా రాలిపోతున్నట్లు, ఇలాంటి భావనతో బాగా శ్వాసను పీల్చవచ్చును.

మాఘమాసము, ఫాల్గుణమాసము, ఈ రెండూ శిశిరఋతువుకు సంబంధించినటువంటి మాసములు. ఈ ఋతువులో వాతావరణంలో ఒక రకమైనటువంటి గాలి ఏర్పడి ఉంటుంది. దాని వలన ప్రకృతిలో కొన్ని రాలి, మళ్ళీ కొత్త చిగుళ్ళు వేయటం జరుగుతూ ఉంటుంది. మనం గమనిస్తే నిజానికి శిశిరఋతువులోనే మామిడిపూతలు, కోకిలమ్మ కూతలు కూడా వినిపిస్తూ ఉంటాయి, సందేశం అందుతూ ఉంటుంది. ఎప్పుడు కొత్త

చిగురు వేస్తుందంటే, కొంత ఆకు రాలి, కొంత బలహీనమైనటువంటి పువ్వులు, పూత కూడా రాలినప్పుడు, బలమైన పూత ఒకటి ఏర్పడుతూ ఉంటుంది.

ఇలా మనం ఋతువులని, మాసాలని, పక్షాలని, తిథులని గమనిస్తూ ఉంటే ప్రకృతి ఇచ్చే సందేశం మనకు అందుతూ ఉంటుంది. ప్రకృతితో మనం అనుసంధానం చెంది, క్రమంగా మనం వసంతఋతువు అందించేటువంటి అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోగలిగితే, ఆ విధంగా ఈ శరీరము చక్కగా వ్యవసాయం చేయబడినప్పుడు, అందులో నుంచి మంచి పంటగా మనకి మంచి సంస్కారములు ఏర్పడి, ఆ మంచి సంస్కారముల ఆధారంగా ఈ శరీరంలోంచే ఒక తేలికైనటువంటి శరీరం క్రమంగా పుట్టుకుంటూ వస్తుంది. ఏ విధంగా బరువైనటువంటి వృక్షం నుంచి తేలికైన పుష్పం వస్తుందో... వృక్షం బరువుకి, పుష్పం బరువుకి చాలా తేడా ఉంది. అలాగే ఈ రక్తమాంసాదులతో కూడినటువంటి శరీరంలో చక్కని వ్యవసాయము చేసినట్లయితే.... విశిష్టమైనటువంటి పరిశ్రమ చేయటమే వ్యవసాయం. అలా చేస్తే ఇందులోంచి పంట పండుతుంది. సారవంతమైనటువంటి భూమి మానవ శరీరం. దాన్ని చవిటి నేలగా గాని, చివక నేలాగా గాని చేసుకోవచ్చును. ఉన్న సారాన్ని పాడు చేసుకుంటూ ఉండవచ్చు. లేకపోతే, అదే సారవంతమైన భూమి నుంచి చక్కని పంటను తీయవచ్చును. రైతు ఏ విధంగా సారవంతమైన భూమిని తన పరిశ్రమ చేత పండించుకుని, ఎట్లా వృద్ధి చెందుతాడో, అలాగే ప్రతి యోగసాధకుడు, ఆత్మసాధకుడు, భక్తుడు, జ్ఞాని తన శరీరమైనే క్షేత్రమందు చక్కని వ్యవసాయం చేయవలెను. ఆ వ్యవసాయానికి తోడ్పడ్డానికి వలసినటువంటి ప్రజ్ఞలన్నీ కూడా శరీరంలోనే ఉన్నాయి – ప్రాణము ఉన్నది, తెలివి ఉన్నది, వినియోగించుకోవటానికి మార్గం చూపించేటువంటి సద్గురువు పరంపర ఉన్నది. వినియోగించుకోటానికి కావలసినటువంటి ఆసక్తి ఉన్నప్పుడు, ఆ ఆసక్తిని పెంపొందించుకోవటానికి ఈ విధంగా మనం మరల, మరల ఒక సహజీవనాన్ని ఏర్పాటుచేసుకొని, సహనంతో దాన్ని నిర్వర్తించుకుంటూ ఉంటాం. అలా నిర్వర్తించే సందర్భంలో దైవమును ఆశ్రయించటమే కాకుండా, దైవమును వరించడం అనేటువంటి ఒక స్థితిలోకి క్రమంగా జీవుడు ప్రవేశిస్తాడు.

దైవాన్ని ఆశ్రయించటం అనేటటువంటిది మనలో రకరకములైనటువంటి సమస్యలు ఉండటం చేత, వీటన్నిటికీ పరిష్కారము దొరకక, దైవమే దిక్కు అనే భావన చేత ఆశ్రయించి, కొన్ని వ్యక్తిగతమైనటువంటి సమస్యలకు పరిష్కారం అందుకుంటూ ఉంటాము. ఇలా కొన్ని జన్మలు సాగగా, మరికొంత దూరం ప్రయాణం సాగినప్పుడు, క్రమంగా దైవమును ఆశ్రయించడం నుండి, దైవమును వరించుట అనేటువంటి దాంట్లోకి చేరతాము. "తత్సవితుర్వరేణ్యం" అని గాయత్రి మంత్రం చేస్తుంటాం. అంటే, ఏ వెలుగైతే సూర్యుడిని, సూర్యమండలాన్ని వెలిగిస్తోందో ఆ వెలుగు నన్ను వరించడం కోసం వెలుగులన్నిటికీ పుట్టినచోటుకి దైవము

అయినటువంటి తత్త్వాన్ని నేను ధ్యానం చేస్తున్నాను. “భర్గోదేవస్యధీమహి” దేని కోసం? “అస్యదేవః భర్గః”. ఎంతోమంది సూర్యులు ఉన్నారు, ఎన్నో వెలుగు పుంజాలు ఉన్నాయి, ఎన్నో సూర్య మండలాలు ఉన్నాయి. వాటన్నిటినీ వెలిగించేటువంటివాడు ఎవరైతే ఎలా ఉంటాడో మనకి తెలీదు కదా! భర్గుల యొక్క దేవుడే మనకు మూలం. వెలుగుల పుట్టుక స్థానం, దాన్ని ధ్యానిస్తున్నాం. దేనికోసం? ఆ వెలుగు మనలను ఆలింగనం చేసుకోవాలని. మనం వెలుగును ఆలింగనం చేసుకోలేము. దైవం మనలను చేరాలి, మనం దైవాన్ని చేరలేము. సూర్యుని కిరణం మన దగ్గరకు చేరవచ్చు. మనం సూర్యుని కిరణం పట్టుకుని సూర్యుడి దగ్గరకు చేరలేము. సూర్యుని కిరణము ద్వారా సూర్యుడు మనల్ని స్పృశిస్తాడు. మనం సరాసరి సూర్యుడ్ని స్పృశించలేము.

అతడు వచ్చి, మనలను గైకొని, మనలను తన అక్కున చేర్చుకోవటం అనేటువంటిది ఒక జీవుని “విజయము” అనేటువంటిది కథగా చెప్పుకుంటూ ఉంటాం. ఇలాంటి కథలు ఎన్నో ఉన్నాయి. ఈ కథలన్నిటిలో కూడా ఒక్కటే మనం చూడాలి: ప్రేమ వలన దైవమునందు ఆరాధన కలగాలి, దైవమునందు ఆసక్తి పెరగాలి, రుచి పెరగాలి. ప్రేమ ఉన్నచోట అహర్నిశలు అతనిని గూర్చిన భావన మనలో ఎట్లా ఉంటుందో... మనకేదైనా ఒక వస్తువుయందుగాని, ఒక వ్యక్తియందుగాని ప్రేమ ఉన్నప్పుడు వారిని గూర్చి మనం సతతం భావిస్తూ ఉంటాం. అలా దైవమును గూర్చినటువంటి భావన మనలో పెంపొందించడం దైవాన్ని వరించటం అవుతుంది. భక్తుల కథలన్నీ కూడా దైవమునే ప్రధానంగా వరించినటువంటి కథలుగా ఉంటాయి. “నీవు వచ్చి నన్ను గైకొని వెళ్ళు. నేను నిన్నే నమ్ముకొని ఉన్నాను. నిన్నే నేను వరించి ఉన్నాను. నీ కన్నా ఇతరములైనటువంటి విషయముల యందు నాకు ఆసక్తి అంతంత మాత్రమే” – ఇలాంటి భావనలలోకి క్రమంగా పరిణామంలో జీవుడు చేరతాడు. అలా చేరినవారి కథలే మనకి భాగవతంలో భక్తుల కథలుగా ఇస్తారు. భక్తుల కథల్లో వారికి ప్రధానమైనటువంటి అంశము దైవము తమను చేరి, తమను గైకొని, తన అక్కున చేర్చుకొని తనతో తీసుకుపోవటంగా ఉంటుంది. ఇది ఒక గోధ కథైనా, ఒక సీత కథైనా, ఒక రుక్మిణీదేవి కథైనా, ఒక అంబరీషుని కథైనా, ప్రహ్లాదుని కథైనా, బలిచక్రవర్తి కథైనా అంతే. అతను వచ్చి, మనలను అనుగ్రహించి, మనలను తోడ్కొని వెళ్ళటం అనేటువంటిది కథ. ఎంచేతంటే, దైవమే జీవుని వద్దకు వచ్చి, అనుగ్రహించి, తన తోడుగా తనతో పాటు తీసుకువెళ్లటం అనేటువంటి కథ. అది జీవునికి కల్యాణ ప్రధమైనటువంటిది. అదియే “విజయము”. ఈ కథనే రకరకాలుగా, రకరకాలుగా మహాత్ముల జీవితాల్లో మనం గుర్తిస్తూ ఉంటాం, మహర్షుల జీవితాల్లో గుర్తిస్తూ ఉంటాం, భక్తి పరంగా ఉన్నటువంటి కథలన్నిటిలోను గుర్తిస్తూ ఉంటాం.

జీవుడు, దైవము యోగము చెందుట అనేటువంటిది యోగము. దైవము నుండి దిగివచ్చినటువంటి జీవుడు దైవముతో కూడి ఉన్నట్లయితే ఈ మొత్తం సృష్టి అంతటినీ కూడా ఒక దివ్యమైనటువంటి అనుభూతిగా

దర్శిస్తూ, చక్కగా ఆనందిస్తూ, అతనితో కూడి ఉంటాడు. ఇలా దైవంతో కూడి ఉండటమే యోగము. రకరకాల పేర్లు పెట్టుకుంటాం. కానీ ప్రధానమైనటువంటి ప్రయోజనము, ఆశయము ఏమిటంటే జీవాత్మ-పరమాత్మ ఐక్యస్థితి. ఈ ఐక్యస్థితిలో ఆయనలో కలిసిపోవడం, ఆయనలోంచి మళ్ళీ బయటకు వచ్చి, ఆయన్నే ఆరాధించుకుంటూ ఉంటాం. తాను దైవముగా ఉండడం, దైవమే తాను అవుతూ ఉండడం, ఇలా జరుగుతూ ఉంటాయి. ఇహ అవన్నీ రకరకాలుగా అనుభూతి పరమైనటువంటి విషయాన్ని సిద్ధాంతీకరించారు. సిద్ధాంతాలు ఎలా ఉన్నా జరగవలసిందొకటే – మనలో మన ఉనికి, మన ప్రాణము, మన తెలివిగా ఉన్నటువంటి దైవముతో మనము కూడి ఉన్నట్లయితే, మన స్వభావము ఎంత వ్యతిరేకంగా ఉన్నా, ఎన్ని అవరోధాలు కలిపిస్తూ ఉన్నా, వాటిన్ననిటిని మనం దైవము యొక్క అనుగ్రహం చేత అధిగమించవచ్చును. అలాంటి కథను మనం నిన్న ప్రారంభం చేసుకున్నాం. రుక్మిణీదేవి ఎలాంటి సద్గుణములు కలిగి ఉన్నది అనేటువంటి విషయములు తెలుపుకున్నాం. రుక్మిణి అనే పదానికి ఉండేటువంటి అర్థాన్ని తెలుపుకున్నాం. ఈ రోజున మనం అక్కడనుంచి ముందుకు సాగుతాం. నెమ్మదిగా సాగుతాం. ఇప్పటికి మనకు రెండు రెండు పద్యాలే జరిగినాయి.

> "ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్
> జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
> ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
> భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్."

ఈ పద్యంలో ఉండేటువంటి అమ్మవారి గుణాల్ని నిన్న వివరించాను. ఈ రోజున మరొక భావం, ఇప్పటికిప్పుడు నాకుగా చెప్తున్న విషయమే ప్రస్ఫుటంగా ప్రకటింపబడింది, మరొక్కసారి చెప్తున్నాను. జగతీనాథులైనటువంటి వారినందరినీ – శిశుపాలాది రాజుల సమూహం ఉంది – వారినందరినీ భగవంతుడే గెలిచాడట. ఈమె వాళ్ళను జయించి, ఆయనను చేరటం కాదు. ఆమె కొరకు ఆయన వారందరినీ జయించి, ఆమె దగ్గరకు వచ్చాడు. ఇది కథ! మనం కూడా చాలా అనుకుంటూ ఉంటాం కదా, "మనలో ఇది పోవాలి. అది పోవాలి. మరొకటి పోవాలి. ఇవన్నీ పోతే మనకి దైవం దగ్గర అవుతాడు" అని! మనకిగా మనం అవన్నీ పోగొట్టుకోగలిగితే సమస్యేముంది! ఒక్కటి తెలియాలి – మనకన్నా అవి బలమైనవని. రుక్మిణీదేవి అబల. జీవుడు అబలుడే. తనకూ, దైవానికి మధ్య చాలా అవరోధాలు ఉన్నాయి. చేరాలన్న కోరిక ఒకటి ఉంటే చాలా? చాలా అవరోధాలు ఉన్నాయి. ఈ అవరోధాలు తానుగా తీసేసుకోగలదా? ఐదుగురు అన్నదమ్ములున్నారు. ఎవరూ మాట వినరు. వాళ్లకి స్నేహితులున్నారు. వాళ్ళందరు కూడా అలాంటి వాళ్ళే. వారందరూ కలిసి ఒక నిర్ణయం చేసేశారు, ఈమెను శిశుపాలునికిచ్చి వివాహం చెయ్యాలని. తండ్రి మనోభావం మరొకరకంగా ఉన్నా, తండ్రి

మాట వీళ్ళు గెలవనివ్వరు. వృద్ధుడైన తండ్రి క్రమంగా కొడుకుల చేతుల్లోకి వెళ్ళిపోతూ ఉంటాడు. "ఎందుకీ చివరిదశలో వీళ్ళతో మనకి ఇబ్బంది. ఏదో సుఖంగా ఇక్కడే ఉండి, దేహత్యాగం చేస్తేపోయె. వీడిని కాదని, ఇప్పుడు మనం ఏం చేస్తాంలే" అనుకుంటూ ఉంటారు కదా! తండ్రి మనోభావాలు తెలియని కొడుకులు ఉన్నారనుకోండి, ఆ తండ్రికది దురదృష్టమే. తండ్రి మనోభావం ఎరిగిన కొడుకులు ఉన్నారనుకోండి, అతని జీవితం విజయమే.

ఈ సమూహాలన్నీ కూడా అహంకారం యొక్క తేనలు. మనలో ఉండేటటువంటి అవరోధం ఏమిటయ్యా అంటే మనకుండేటువంటి అహంకారమే. మన గూర్చి మనకుండేటువంటి అహంభావం ఉన్నదే... అహంభావం అంటే నన్ను గూర్చిన భావన – "నేను ఇంతటివాడిని. నేను అంతటివాడిని. నా మాట వినని వాళ్ళంతా నశించాలి. నా మాట వినే వాళ్ళంతా వృద్ధి చెందాలి. నేగీసిన గీటు ఎవ్వరు దాటకూడదు" – ఇలాంటి భావనలన్నీ ఉంటాయి కదా మనిషిన్న తర్వాత! ఇలా మనలో మనకి మనం దాటలేనటువంటి అహంకారమూర్తి మనముగానే ఉన్నాం. అంటే, మనలో కొంత భాగం మనల్ని దాటనివ్వదు. జీవుడి అహంకారం ఆధారంగానే ఆరాధనలు చేస్తాడు కదా! అహంకారం ఆధారంగానే ఆరాధనలకు అవరోధనలు వస్తూ ఉంటాయి. అంచేత, తనకి తానే అవరోధం. సాధకుడికి ఏమిటయ్యా అవరోధం అంటే, తనకి తానే అవరోధం. వేరే ఎవ్వరూ అవరోధం ఉండరు. ఏదో ఇంట్లో వాళ్ళు అవరోధం అని, ఉద్యోగాలు అవరోధం అని, ఏవో సమస్యలు అవరోధం అని, ఇవన్నీ కాదు. నీకు నువ్వే అవరోధం. నీవు సాధన చెయ్యలేకపోతున్నావట అంటే కారణాలు బయట వెతకకు. నీలో నిన్ను సాధన చెయ్యనీయనటువంటి ఒక స్వభావం నీ కన్నా బలంగా ఉంటుంది. అదీ తమాషా! అది చేరనివ్వదు. నీకెంత చేరాలని ఉన్నా, నీ కన్నా అది బలమైనది కాబట్టి అది నిన్ను చేరనివ్వదు. అది ఎవరో కాదు నువ్వే, కనుక అదీ తమాషా! మనల్ని మనమే కృతకృత్యులు కాకుండా జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటాం. ఇంత కన్నా puzzle ఏముంది చెప్పండి! కొంత భాగం మూలాన్ని చేరాలని ఉంటుంది. కొంత భాగం చేరనివ్వదు. ఈ చేరనివ్వని భావం, చేరుద్దామనేటువంటి భావం కన్నా చాలా పెద్దది. ఎందుకు పెద్దదంటే, దాన్ని నువ్వు అట్లా చాలా జన్మలు పెంచి పోషించి, ఈ రోజున నువ్వు దాన్ని విసర్జించి దైవాన్ని చేరదాం అనుకుంటే, నీవు పెంచి పోషించిందే నీకు అడ్డుపడిపోతుంది.

సాలెపురుగు, సాలెగూడు అందంగా అల్లుకుంటూ, ఇటల్లి, అటల్లి, దశ దిక్కులా అల్లేసి, అందులో ఇరుక్కుపోతుంది. అల్లినప్పుడు అంతా అందంగానే ఉంటుంది. అలాగే మానవుడు రకరకాలుగా అల్లుకుంటాడు తన జీవితాన్ని. వివశ్వతుడి కుమారులం మనమంతా. సూర్యుడు పేరు వివశ్వతుడు. ఆయన సూర్య మండలాన్నంతా అల్లాడట. దాని మీద జీవులని తన అంశలుగా చేర్చాడట. కానీ అతను వెలుగొందుతున్నాడు

కాబట్టి అర్థమేంటంటే, ఆతను దాన్ని అధిష్ఠించి ఉన్నాడు. మనం అల్లుకున్న దాంట్లోనే మనం చిక్కుకుపోతూ ఉంటాం. వ్యాపారాలు పెట్టుకుంటాం, అందులో ఇరుక్కుపోతూ ఉంటాం. ఉద్యోగాలు పెట్టుకుంటాం, అందులో ఇరుక్కుపోతూ ఉంటాం. వృత్తిని పెట్టుకుంటాం, అందులో ఇరుక్కుపోతూ ఉంటాం కదా! గృహాలు కట్టుకుంటూ ఉంటాం, అందులో ఇరుక్కుపోతూ ఉంటాం. "ఇల్లు ఎట్లాగండీ?" అంటాడు! "ఇంట్లో ఎవరు లేరు కదండి. తాళం పెట్టి రావడం అంత safe కాదండి" అంటాడు. ఎందుచేత? ఊరు బయట ఉందట! ఎవడు కట్టుకోమన్నాడు ఊరు బయట? ప్రశాంతంగా ఉంటుందని కట్టుకున్నాడట! మనం ఏది బాగుంటదని చేసుకుంటామో, దాని వెనకాలే ఒక ఉచ్చు ఉంటుంది. ఆ ఉచ్చు పట్టేసుకుంటుంది. అట్లాగే, శరీరాన్ని కూడా రకరకాలుగా పోషిస్తూ ఉంటాం కదా! అంచేత, అది సాధనకు వ్యతిరిక్తంగా పనిచేస్తూ ఉంటుంది.

ఈ కృష్ణమూర్తిగారు పొద్దున్న 5:15 కే సి. వి. వి. గారి పల్లకీసేవ అన్నారు. "ఎలా రాగలం?" అని కోపం వస్తుంది కదా మనకి! కృష్ణమూర్తి గారా పెట్టేది? సి. వి. వి. గారే పెడ్తారు ఎవరెవర్లో ఎలాంటి ప్రకోపాలు వస్తాయో చూద్దామని. ఉన్న సమయం కన్నా పది నిమిషాలు ముందేదన్నా కార్యక్రమం అన్నామనుకోండి, లోపల నుంచి ప్రకోపం వస్తుంది. ఏమిటి కార్యక్రమం? మంచి కార్యక్రమమే కదా! ఎందుకు ప్రకోపం? శరీరానికి ఇబ్బంది. అంతేగా! శరీరానికి ఇబ్బంది కలిగేది రాగానే, ఇక మరి అహంకార పురుషుడు తారాజువ్వలాగా లేచిపోతాడు! లేవంగానే నీళ్ళు లేవనుకోండి. వేడినీళ్ళు అలవాటు ఉండేటువంటి వాడికి వేడి నీళ్ళు రాలేదనుకోండి, అసలు నీళ్లే రాలేదనుకోండి, కరెంటే పోయిందనుకోండి, బయలుదేరదామని స్కూటరు కిక్కు కొడితే అదేదో కాలు బెణికిందనుకోండి, వెంటనే మనలో వచ్చేది చిరాకు, కోపం, విసుగు, ప్రపంచం మీద ఒక విధమైనటువంటి తిరుగుబాటు, ఇలా అన్ని వచ్చేస్తాయి కదా!

ఆ మధ్యన ఒకాయన చెప్పారు, "ఇలా పొద్దున్నే లేచి కార్యక్రమాలు చేసుకుంటారట ఋషులు. వాళ్ళు మూడు గంట్లకే నిద్ర లేస్తారట. లేచి, నాలుగున్నరకే మొదలు పెట్టేస్తారట అన్నీనూ. మనం లేచి, మనం రెడీ అయ్యే సమయానికి వాళ్ళ కార్యక్రమాలు అయిపోతాయట". అంటే, శ్రోతలో ఒకాయన పక్కాయనతో చెప్పాడట, "వాళ్ళకి నిద్ర పట్టి చావదు! అందరూ Nuxvomica patients!" అని. అంటే, అర్థమేంటంటే వాళ్ళు శరీరం మీద ఒక జయం సాధించారు, స్వభావం మీద ఒక జయం సాధించారు. మనం ఒక్క గురుపూజల నాడే నిక్కి, నీలిగి, ఎట్లా అట్లో చేరతాం కదా ఇక్కడ! మిగతా అప్పుడు అలా లేస్తామా? లేవము. ఇంకో అరగంట పడుకుందాం అనిపిస్తుంది. ఎవరు చూడకపోతే స్నానం చెయ్యకుండానే ప్రార్థన చెయ్యొచ్చులే అనుకుంటాం! అంతేకాదు, ఇవాళ ప్రేయర్ మానేస్తే మాత్రం ఎవడికి తెలుసు గనుక అనిపిస్తుంది!

ఇలా మన స్వభావంలో మనకి రకరకాల అంతరాయాలు వచ్చేస్తూ ఉంటాయి. ఇంతమంది వస్తే ఏం చేయ్యాలండి? ఎప్పుడూ అడ్డులే. లేచిన దగ్గర నుంచి ప్రతిది అడ్డు. ముందు శరీరం అడ్డు. “నాకు తలకాయ నెప్పి. పడుకో” అని చెప్తుంది. అందుకు దానికి తలకాయ నెప్పి? మన కార్యక్రమమే దానికి తలకాయ నెప్పి! పొద్దున్నే లేస్తే తలకాయ నెప్పి వచ్చేస్తుంది కదా! మాములు కన్నా ఒక అరగంట ముందు లేచామనుకోండి, తలకాయ నెప్పి వస్తుంది. ఏమిటి అర్థం? నీ కార్యక్రమమే నాకు తలకాయ నెప్పి అని చెప్తోంది శరీరం! తలకాయ నెప్పి నీకా, శరీరానికా అన్న భావన అప్పుడెవరన్నా చెప్పారనుకోండి, వాడిని కొడదామనిపిస్తుంది! లేచి ready అయిపోయి, జయించిన తర్వాత ఈ విధంగా కూర్చుని దాని గురించి చెప్పుకుంటే వినడానికొక నవ్వుగా ఉంటుంది, హాస్యంగా ఉంటుంది. కానీ ఆ సమయంలో? అది చాలా భయంకరంగా ఉంటుంది. నిన్న రాత్రి గురుపూజల్లో పెట్టింది మనకి అంతంత మాత్రంగా అరిగిందనుకోండి. మనకింకో ఇబ్బంది ఉంది – మన గురుపూజల్లోగాని, మన యోగంలోగాని తిండి బాగా పెడతారు. తిండి బాగా పెడ్తే, అది యోగానికి అవరోధం అవుతూ ఉంటుంది. ఎన్నింటికి పెడతారు? మన కార్యక్రమాలై, మనం పదింటికి తింటాము. మళ్ళీ పొద్దున్నే 5:15 కే గణపతి పూజ అంటే ఎలా ఉంటుందండి? పడుకునే సరికి తిన్నది అరగదు. లేవాలంటే ఇలా మనకెన్నో అవరోధాలు వస్తాయి.

ఈ అవరోధాలు దాటాలంటే ఎలా? ఇక్కడ చూడండి, ఎవరు దాటించారు? ఇవన్నీ ఆయన దాటి వచ్చేసాడు. కథ మొదటి పద్యంలోనే మహత్తరమైనటువంటి సందేశముంది. దైవానికి అవరోధాలు దాటి మన దగ్గరికి వచ్చేయ్యదడం సులభం. మనం అవరోధాలు దాటి, దైవాన్ని చేరడం అసాధ్యం. ఎందుకంటే, అవరోధాల్ని అన్నీ ఏర్పరుచుకొని ఉంచుకుంటాం కదా! సీతమ్మని ఎక్కడికో తీసుకెళ్ళి, లంకలో దాచేసి, ఎట్లా వస్తాడో చూద్దాం అనుకున్నాడు అహంకార పురుషుడు. సీతమ్మ లంకలో ఉన్నదిను, రుక్మిణీదేవి రాజగృహంలో ఉన్నది ఒకటే. ఏది ఒకటి? దూరం కాదు. దూరం ఏముంది భగవంతునికి? ఆత్మకు దూరం లేదు. కానీ, సన్నివేశం చూస్తే ఎట్లా ఉంటుంది? చుట్టూ అన్నీ అవరోధములే. నిన్ను చేరటానికి నాకు అన్నీ అవరోధములే. ఎందుకు అవరోధాలు ఏర్పడ్డాయి? తెలివి తక్కువగా నేనే ఏర్పరుచుకున్నాను. ఇప్పుడు నా తండ్రిని కోప్పడనా? నా అన్నదమ్ములను కొప్పడనా? వాళ్ళ స్నేహితులను కోప్పడనా? ఎవరిని కోప్పడను? అలా ఏర్పడ్డాయి.

జీవికి దైవాన్ని చేరదామనేటువంటి భావం రాగానే, అంతా ప్రతికూలమైనటువంటి వాతావరణమే ఉంటుంది. ఎందుచేత అంటే, అంతకుముందు అదే అనుకూలం అని ఏర్పాటు చేసుకోవడం చేత. అనుకూలమని ఇళ్ళు, వాకిళ్ళు, పొలాలు, స్థలాలు, పరిశ్రమలు, ఏవేవో చాలా పెంచేసుకుంటారు కదా! అనుకూలమనే పెంచుకుంటాం అవన్నీ. తర్వాత అవి ప్రతికూలంగా కనిపిస్తాయి. ఎందుకంటే, మన ఆశయం మారేసరికి అవి

ప్రతికూలం అయిపోతాయి. “నువ్వు ఇట్లా ఆశయం మారుస్తావని మేము అని అనుకోలేదు కదా!” అంటాయి. “మమ్మల్నందరినీ ఎందుకు కన్నావు, నువ్వు ఇప్పుడు సన్యాసం పుచ్చుకుందాం అనుకుంటే?” అని అడుగుతాడు కొడుకు. ఒక పదిమందిని కని, వాళ్ళని పోషించలేక సన్యాసం అన్నామనుకోండి, వాడు ఒప్పుకుంటాడేంటి? కాళ్ళూ, చేతులు కట్టేసి ఇంట్లో పడేస్తారు!

ఇలా ప్రతికూలమైనటువంటి వాతావరణం సహజంగా ఉంటుంది. ఉంటే ఏం చేయాలి? నీ వరకూ ఆరాధనే. ఇది మార్చుకొని, అది మార్చుకొని, ఇంకోటి మార్చుకొని, ఇవన్నీ మార్చుకొని సాధనం చేద్దాం అనుకునే లోపల చచ్చిపోతావు. నువ్వు ఎప్పుడో ప్రశాంతంగా ఉండి పుస్తకాలన్నీ చదువుకోవాలని, ఊరు బయట ఒక farm house కట్టి, అందులో భారతం, భాగవతం, రామాయణం, ఉపనిషత్తులన్నీ పెట్టుకొని, మనం అక్కడ వెళ్ళలేని పరిస్థితులో ఉన్నాం అనుకోండి. ఎప్పుడో వెళ్దామని కదా! నీకు చెప్పి వస్తుందా మరణం! ఉన్నచోటే ఆరాధన చేసుకొని “నాయనా! చాలా తెలివిగా ఎన్నో అవరోధాలు ఏర్పరుచుకున్నాను. ఇవన్నీ నువ్వే తీసేసి నీ దగ్గరకు చేర్చుకో,” అనే ఆరాధన కావాలి మనందిరికీ.

మాస్టర్ సి. వి. వి. గారు మనందరికీ “అమరత్వం ఇచ్చి, బ్రహ్మత్వం ఇస్తాను. నా అంతటి వాడుగా చేస్తాను” అని అన్నప్పుడు ఒక్కటే మనకి గతి – ఏవిటయ్యా అంటే “ప్రార్థన”. “నువ్వే చేసుకో. నాకు చేతనయింది ఇంతే. నేనిదే చేయగలను. మిగతావన్నీ నువ్వు చేసుకో. నువ్వు వచ్చి నన్ను కడ తేర్చు” అని అడగడం అనేటువంటిది మార్గం గుర్తుపెట్టుకోండి. “నేను వస్తాను” అని అనకూడదు. నువ్వు వస్తానంటే, నువ్వు దాటి రాలేవు. కారణమేమిటంటే, నీకన్నా బలమైనవి నీకు శత్రువులుగా ఉంటాయి. వాళ్ళు నీలోంచి పుట్టినవాళ్ళే. వాటికన్నా బలమైనవాడు ఉన్నాడు. వాడిని నువ్వు ఆరాధన చేస్తున్నాన్నావు కాబట్టి, అతన్ని లోపలకి ఎంత ఆవాహనం చేసుకుంటూ ఉంటే.... అదేగా వరించడమంటే! ఒక గురువుగాని, ఒక ప్రేమికుడుగాని, దైవంగాని వచ్చి, మనని కౌగిలించుకోవాలంటే చెయ్యవలసిందేముందండి? ప్రేమను పెంచడమే. ప్రేమ ఎట్లా తెలియచేస్తావు? ఆరాధనా పూర్వకంగా, ప్రార్థన పూర్వకంగా తెలియచేస్తావు. అది ఎంత పెంచుకుంటే అంత మంచిది. అదీ మార్గం.

ఆ విధంగా ఈయనే అన్ని దాటుకుంటూ వచ్చేసాడు. మొట్టమొదట పద్యంలోనే చాలా చెప్పారు. మనం స్టెప్పులేసుకుంటూ ఏడుకొండలవాడిని చేరడం కన్నా, ఏడుకొండలవాడు దిగిరావడం ఎంతసేపండి? క్షణంలో దిగివస్తాడు. “నీ కొండకు నీవే రప్పించుకో” అను. “నేనెక్కుతాను కొండ,” అంటే దార్లోనే కాలు బెణకవచ్చు, మోకాలు నొప్పి రావచ్చు. పెద్ద పెద్ద వాళ్ళకీ మధ్య చాలా మోకాళ్ళ నొప్పులొచ్చేసి, సగంలో కారు తెప్పించుకొని

వెళ్ళిపోయారు కదా కొండ మీదకి! అలా వెళ్తే, "దర్శనం లేదోయ్! ఇప్పుడు మూసేశారు" అని చెప్పేశారు. వాడు తలుచుకుంటే నీ లోపల నుంచే దిగి వస్తాడు. ఎక్కడో (దూరంగా) లేడుగా, లోపలే ఉన్నాడుగా! లోపల నుంచి దిగి వచ్చి, నిన్ను ఎత్తుకెళ్తాడండి. నిన్ను ఎత్తుకొని తీసుకొని వెళ్ళాడనుకోండి, అదేంటో అప్రయత్నంగా అయిపోయినట్టుంటుంది దర్శనం. భాగవతంలో దశమ స్కంధంలో చెప్తారు – మహాసముద్రాన్ని కూడా భగవంతుని యొక్క భావనలో ఉండేటువంటి ప్రేమచేత, ఒక చిన్నపిల్లవాడు అలా ఒక గ్లాసు నీళ్ళు పోస్తే ఎట్లా దాటేస్తాడో, అట్లా దాటేస్తాడు సముద్రాన్ని అని. మూడేళ్ళ పిల్లాడు, అప్పుడే నడక నేర్చినవాడు, అలా నీళ్ళు పోస్తే, దాన్ని చిన్న అడుగు ఇటునుంచి అటువేసేసి దాటేస్తాడే, అట్లా ఎంతో పెద్ద సముద్రాలన్నీ కూడా దాటేయచ్చు నీ యొక్క ఆసరా ఉంటే. దానికి చెయ్యవలిసినటువంటిది ఆరాధన. రుక్మిణి గుణాలు నిన్న చెప్పుకున్నాం. ఆయన వచ్చిన రీతి ఇవాళ ఆ పద్యంలో పూర్వ భాగంలో ఉంది. నిన్న ఇంకొక రకంగా చెప్పుకున్నాం. ఇవాళ్ళ ఈ రకంగా చెప్పుకున్నాం.

ఆ విధంగా "తొందరగా అలా చెప్పేసేయక. వివరంగా చెప్పు." అన్నాడు పరీక్షిత్తు. సాకల్యంబుగా చెప్పమన్నాడు కదా! "సా కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే" అన్నాడు. ఎంత విన్నా బాగుంటుంది కాబట్టి, వింటున్న కొద్దీ రుచి పెరుగుతుంది. రుచి పెరిగితే ఆరాధన పెరుగుతుంది కదా! రుచి అంటూ పెరిగినవాళ్ళు ఇది వద్దనేవాళ్ళు ఎవరన్నా ఉంటారా! వాళ్లిదే కోరతారు కదా! నేనిదే కోరుకుంటున్నాను కదా! నువ్వు నాకు చాలా వివరంగా చెప్పమని పరీక్షిత్తు అడగడం జరిగింది. అంతవరకు చెప్పుకున్నాం.

"భూషణములు చెవులకు బుధ
తోషణములు లనేక జన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్."

"గరుడగమను రారా మమ్మేలు కోరా" అని చెప్పి పాడాడు కదా! "నువ్వు వచ్చి ఏలుకో" అని. ఇక్కడ ఏమని చెప్తున్నాడు? చెవులకి ఏమిటయ్యా భూషణాలంటే, రవ్వ దుద్దులు కాదట. రవ్వ దుద్దులు పెట్టుకునే చెవులు అలంకరించుకొనే చెవులు. ఏవో రకరకాల ఆభరణాలు పెట్టుకుంటారు. మొగవాళ్ళు కూడా పెట్టుకుంటారు బాగా ఉంటే కదా! ఈ మధ్య మొగవాళ్ళు కూడా ఎడం చెవికి రంధ్రం పెట్టుకుని, దుద్దులు పెట్టుకుంటున్నారు. ఏవో పెట్టుకుంటూ ఉంటారు. ఏమిటి భూషణాలు చెవులకంటే, భగవంతుని గుణభాషణములు. దైవం గూర్చి వినాలి అనేటువంటి తపన ఉండేటువంటి ఇంద్రియముగా నీ చెవిగా మారితే అదృష్టం. అలాంటి చెవి కాని చెవి

ఎందుకు? చాటంత చెవి ఉందనుకోండి? అంతమాత్రంచేత విజ్ఞాని అవ్వక్కర్లేదు. చెవిని దేనికి వాడుతున్నావు? దేనివలన చెవి యందు ఉండేటువంటి ప్రజ్ఞ విప్పారుతుంది? వినికిడే అంతా. ఇంద్రియాల్లో ఆకాశగుణం కలిగినటువంటిది చెవి. పంచభూతాల్లో అత్యుత్తమైనటువంటిది ఆకాశం. వినికిడి ఉన్నవారికి చూపు చాలా సులభం. చూపు లేక పోయినా ఫర్వాలేదు, వినికిడుంటే చాలు. వినికిడున్నవాడు, చూడకుండానే "అదిగో కృష్ణుడు వస్తున్నాడు. అదిగో పరమగురువు వస్తున్నాడు" అని చెప్పగలడు. సూరదాసు ఎట్లా నడిచాడండి? ఇట్లా గాలిలో కర్ర పట్టుకొని వెళ్తుండేవాడు, నేల మీద పెట్టేవాడు కాదు. పుట్టిగుడ్డి వాడు. పాడుకుంటూ, అన్నిచోట్లకి కళ్ళున్నవాడికన్నా చక్కగా నడిచి వెళ్ళిపోయేవాడు. "ఈ కర్ర ఇట్లా (గాలిలో) ఎందుకు పెట్టావు? నేలమీద పెట్టుకుంటూ తడుముకుంటూ వెళ్ళాలి కదా?" అంటే, "ఆయన పట్టుకున్నాడు. ఆయన ముందు కర్ర పట్టుకుని, నన్ను వెనకాల నుంచి నడిపిస్తున్నాడు. నేను ఆయన గుణకీర్తనం చేస్తూ, నడిచి వెళ్లిపోతున్నాను. ఆయన నాకు వినిపిస్తూ ఉంటాడు. ఆయన అందెల సవ్వడి వినిపిస్తుంది." అని అంటాడు. వినిపిస్తే కనిపిస్తుంది. అంచేత, చూపు కన్నా వినికిడి ఎక్కువ ముఖ్యమండి. చూపు అనేటువంటిది అగ్ని. పంచభూతాల్లో – ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి –మధ్యస్థమైనటువంటిది కన్ను. వినికిడి చాలా ప్రధానం.

అలా భగవంతుని యొక్క గుణగణములను బాగా వింటూ ఉండేటువంటి వాళ్ళు ఎవరైతే ఉంటారో, వారికి గ్రహింపు శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఏకసంధాగ్రాహులంటారు కదా! ఒక్కసారి వింటే మరచిపోనివాళ్ళు ఉంటారు కదా! వాడే ఒక గురువుకి చాలా ఆనందం కలిగించేటువంటి శిష్యుడు. ఒక్కసారి వింటే మర్చిపోడు. అలాంటి వాడికి ఎన్ని విద్యలైనా చెప్పచ్చు. ఎన్నిసార్లు చెప్పినా మర్చిపోయేవాళ్లకి ఓపిగ్గా చెప్తాడుగాని, వారిని చూస్తే ఒక్కసారి చెప్తే విని నేర్చుకునేటువంటి వాడియందు ఉండేటువంటి సంతోషం ఉంటుందా గురువుకి? "మనిషికో మాట, పశువుకో దెబ్బ" అన్నారు. మనిషన్న వాడికి ఒక్కసారి చెప్తే చాలట. అంచేత, మళ్ళీ మళ్ళీ చెప్పడానికి ఏమి సందేహించడట, ఓపికుండేటువంటివాడు.

పరీక్షిన్ మహారాజు బాగా వినడం నేర్చుకున్నాడు కదా! ఎప్పటినుంచి వింటున్నాడు? చిన్నప్పుడు ధర్మరాజాది తాతలు చెప్పారు. అటుపైన కొలువులో గురువులు చెప్పారు. తనకే స్వతఃసిద్ధంగా కృష్ణుని యందు ప్రేమ. చెప్తున్నాడు. "టూకీగా చెప్పవద్దు" అని శుకమహర్షితో అంటున్నాడు. "తొందరగా కానిచ్చేయండి సార్!" అంటూ ఉంటాం కదా మనం! "ఇలా సాగతీసుకుంటూ ఏమి చెప్తారు? తొందరగా కానిచ్చేయండి," అంటారు కదా! అలా వద్దంటున్నాడు. ఎందుకంటే, ఈయన వినగలడు కాబట్టి. "బుధతోషణములు" – తోషణమంటే సంతోషం. ఎవరికి భగవంతుని యొక్క కథలు, గుణగణములతో కూడినటువంటి విశేషములు వినడం అనేటువంటిది దాని వలన సంతోషం కలుగుతుందో, వాళ్ళే బుధులు, తెలిసినవారు. ఎవరు తెలిసినవారంటే,

దివ్య కథలను వినగోరుట తెలిసినవాళ్ళు. వాళ్ళే తెలిసినవాళ్ళు. "ఒరేయ్! భక్తి ఛానల్ పెట్టరా" అంటే, ఇప్పుడు కాదంటాడు కదా! ఒకే టెలివిజను, ఇంట్లో నలుగురు. అందులో ఒకడు భక్తి ఛానల్ అని మొర పెడుతూ ఉంటే, ఇంకోళ్ళు కార్టూన్ అంటారు. మరొకళ్ళు సినిమా అంటారు. ఇంకొకళ్ళు స్పోర్ట్స్ అంటారు. ఎట్లా చెప్పండి? ఏది వినడానికి చెవు ఉత్సాహపడుతుందో, ఏది వినాలని ఎప్పుడూ మనసు ఉత్సాహపడుతుందో, అలాంటి వాళ్ళే బుధులు, తెలిసినవారు. వాళ్ళ గురించి, వీళ్ళ గురించి చెప్తుంటే వినటానికి ఉత్సాహపడదు బుధుడు. దైవం గురించి చెప్తే విని సంతోషిస్తారు. మరీ పిచ్చి మాటలు ఎక్కువగా ఉంటే "అవన్నీ ఎందుకులెండి. ఏదైనా మంచి మాటలు మాట్లాడుకుందాం" అనగలిగిన సాధకుడు సత్సాధకుడు. ఇద్దరు సాధకులు కలిసి, ఒక లేని మూడో సాధకుడి గురించి మాట్లాడుకుంటూ ఉన్నారనుకోండి... మామూలుగా జగద్గురు పీఠంలో సాధక సమూహాల్లో ఏం జరుగుతుందంటే, ఇద్దరు కలిస్తే, అక్కడ లేని మూడో వాడి గూర్చి మాట్లాకుంటారు. వాడు లేకపోతే, వాడి గురించి, వాడి అవగుణాలన్నీ మాట్లాడుకుంటూ, అవగుణ కీర్తనం చేస్తూ ఉంటారు కదా! అది సహజం. అది యుగప్రభావం. మామూలుగా మనుషుల్లో ఉండేటువంటి స్వభావం అయిఉండటం చేత, ఎంతసేపూ పనికిరాని మాటలు మాట్లాడుకోటానికి నాలుక ఉత్సహిస్తూ ఉంటుంది. పొద్దున్నే పేపర్ తీసి అందులో విషయాలన్నీ కూడా కూలంకషంగా చర్చించుకునేవాళ్ళు లేరు? ఉంటారు! వాళ్ళు కూడా ఈ మధ్య వార్తలు serials గా వేస్తున్నారు! అవన్నీ కూర్చుని చర్చించుకుంటుంటే ఎంత టైము అయినా అయిపోతుంది.

"బుధతోషణములు" – ఎవరు తెలిసినవారు, ఎవరు బుద్ధిమంతులంటే, భగవంతుని యొక్క గుణగణములు వినడమందు ఆసక్తి చూపించేటువంటివాళ్ళు బుధులు. "బుధ తోషణములు లనేక జన్మ దురితౌఘ విని శ్శోషణములు". ఈ భగవత్ కథలు వింటూ ఉంటే, మనలో ఉండేటువంటి కల్మషాలన్నీ కరుగుతాయండి. అందుకనే పూర్వకాలంలో సాయంత్రం అయ్యేసరికల్లా పురాణ కాలక్షేపం అని గుడికెళ్ళి పోయేవాళ్ళు. ఆర్య ధర్మంలో పురాణ కాలక్షేపం చాలా ముఖ్యం. ఇప్పుడు పురాణ కాలక్షేపం టెలివిజన్ ద్వారా మనింటికే వచ్చేస్తోంది కదా! భారతమో, భాగవతమో, రామాయణమో, ఏదో ఒకటి. చెప్పేవారు ఎవరైనా కానీయండి, చెప్తున్న విషయం దైవం గూర్చేగా! ఏదో వారి పైత్యం కొంత ఉన్నా, అందులో సన్నివేశం, సందర్భం, దైవచింతన ఉంటాయి. అట్లాంటి కార్యక్రమాలు రోజు సాయంత్రం చూడడం నేర్చుకున్నవాళ్ళు, మిగతా కార్యక్రమాలకి రమ్మంటే రారు. ఏ విధంగా ఇది వరకు మనం ETV, Zee TV, Gemini TV, ఇలాంటి TV లో సాయంత్రం విషపూరితమైనటువంటి నాటకములు, సీరియల్స్ చూస్తూ, అవి ఎప్పుడూ miss కాకూడదని, ఏ ఊరెళ్ళినా ఆ time కి టెలివిజన్ on చేసి చూస్తూ ఉండేవారు కదా! ఇప్పటికీ ఉన్నారు మన వాళ్ళల్లో అలా చూసేవాళ్ళు! వాళ్ళు బుధులు కాదు. ఎవరు బుధులు? ఏ ఊరేళ్ళినా, ఆ సమయానికి టెలివిజన్ on చేసుకొని

రామాయణమో, భారతమో, భాగవతమో, తెలుగో, హిందీయో ఏదైతే అది. ఇంత కలియుగంలో కూడా అలాంటివి ఒక పక్క భగవంతుడు ఏర్పాటు చేస్తూనే ఉన్నాడు. అది విందామనుంటుందా? లేదు సినిమా చూద్దాం అనిపిస్తుంది! టెలివిజన్ లో బోల్డు సినిమాలు వస్తుంటాయి, బోల్డు పాటలు వస్తుంటాయి, బోల్డు కార్టూన్లు ఉంటుంటాయి, బోల్డు స్పోర్ట్స్ ఉంటాయి, వార్తా ఛానెల్స్ ఉంటాయి. అన్నీ ఇబ్బిడిముబ్బిడిగా బోల్డున్నాయి. సాయంత్రం అయ్యేసరికి ఏమి వింటావు? నిద్రలోకి వెళ్లేముందు ఏది విని పడుకుంటే బాగుంటది నీకు?

భగవత్పరమైనటువంటి విషయములు బాగా కూలంకషంగా విని, ఆనందిస్తూ అటుపైన నిద్రకు ఉపక్రమించినటువంటి వాడు పుణ్యక్షేత్ర దర్శనములు, సద్గురువు ఆశ్రమములు, ఇలాంటి వాటిల్లో నిద్రలో ప్రయాణించి ప్రవేశించవచ్చును. ఒక్కొక్కసారి స్వప్నానుభూతులు కలుగుతాయి. స్వప్నానుభూతి కలగకపోయినా, ప్రతి నిత్యం ఒక దైవాశ్రమానికో, ఒక దివ్యక్షేత్రానికో వెళ్తున్నట్లుగా భావన చేసుకొని నిద్రలోకి వెళ్ళాలి. అలా వెళ్ళడం రోజు ముగింపుకి చాలా శుభప్రదం. సినిమా అంతా అయిపోయిన తర్వాత శుభం అని వేస్తారే, మంగళమని వేస్తారే, అట్లే ఏ విధంగా రాత్రి నువ్వు conclude చేశావు? ప్రతి రాత్రి ఒక మరణం వంటిది. ప్రతి పగలు ఒక జననం వంటిదే. ప్రతి రోజు కథ ఒక జన్మ వంటిదే. చిట్ట చివరికి ఎక్కడ చేరదాం అనుకుంటున్నావు? బాగా విపరీతమైనటువంటి, హింసాత్మకమైనటువంటి ఒక కార్యక్రమం చూసి పడుకున్నామనుకోండి. అలా పడుకుంటే నిద్రలో కూడా హింసే వస్తుంది. స్పర్ధలతో కూడినటువంటి విషయాలన్నీ బాగా విని, చూచి పడుకున్నామనుకోండి, అలాంటిదే వస్తుంది స్వప్నంలో. అందుకనే పూర్వకాలం పురాణంను చదివి, అటుపైన మూసి, గదిలో ఒక అగరత్తును వెలిగించి, ఒక దీపం వెలిగించి పడుకోమని చెప్పేవారు. దైవస్మరణ చేస్తూ పడుకోవాలి. దైవస్మరణ చేస్తూ పడుకున్నటువంటివారు నిద్రలో దివ్య అనుభూతిని పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దానికి ముందు preparation గా ఇలాంటి శ్రవణం చేశామనుకోండి, అద్భుతంగా ఉంటుంది. తెలియటమంటే అది.

దినచర్యలో రోజు ఎలా ప్రారంభించవన్నది ఎంత ముఖ్యమో, రోజు ఎలా ముగించావు అనేది కూడా అంతే ముఖ్యం. నీవు రోజు ముగించే విధానంలో నీవు జీవితం ముగించే విధానం ఉంది, గుర్తుపెట్టుకోండి. రాత్రి పదకొండు వరకు, పదకొండున్నర వరకు, పన్నెండు గంటల వరకు పనికిరానటువంటి విషములన్నీ చూసి నిద్రపోయేవాడు, అతని జీవితం చిట్టచివరికి అంత బాగా ముగియదు. ఎంచేతంటే, నువ్వు ఎలా మలిస్తే అలా మలచబడుతుంది జీవితం. నీ దినచర్య ముగింపు ఎలా ఉన్నదనేది చాలా ముఖ్యం. ముగింపుని బట్టి మళ్ళీ ప్రారంభం ఉంటుంది. నిన్న సరిగ్గా ముగిస్తే, ఈ రోజు ఉదయం బాగుంటుంది. నిన్న సరిగ్గా ముగించలేదనుకోండి. సరిగ్గా ముగించకపోవడం ఎట్లా ఉంటుంది? రాత్రి పూట ఎక్కువ తిన్నామనుకోండి. ఆ

తర్వాత ఏవో కాలక్షేపం చేసామనుకోండి. నిద్ర చాల్లేదనుకోండి. తిన్నదరక్క, నిద్ర చాలకపోతే, మరురోజు ఉదయం మొహం అదో మాదిరిగా ఉంటుంది. క్లుప్తంగా, త్వరగా భోజనం చేసి, సత్కాలక్షేప్పం చేస్తూ ముగించి, చివరికొక ప్రార్థన చేసి పడుకున్నామనుకోండి. మర్నాడు ఉదయం చాలా పెందలకడనే మెలుకువ వస్తుంది. అల్లారం అక్కర్లేదు. వికసించి ఉంటుంది ముఖపద్మం. అంతేగానీ, పొద్దున్నే చిటపటలాడుతూ ఉండదు. ఇవన్నీ ఎక్కడ నుంచీ వస్తాయి? మనకి దినచర్యలో భాగంగా ఏర్పరుచుకుంటే వస్తాయి.

తెలిసినవారు ఎక్కువగా కోరుకునేది దివ్య విషయముల యొక్క శ్రవణమే. ఇతర విషయముల యందు ఆసక్తి అంతంత మాత్రమే. బుధతోషణములు అలా చేస్తూ ఉంటే పాపములన్నీ కరిగిపోతాయి. వినిశ్రోషణములంటే ఇలా చెరువులు ఎండిపోయినట్లు, సముద్రమంత పాపాలు మనకన్నీ ఉన్నా, అవన్నీ కూడా అట్లా ఇంకిపోతాయటండి. "దురితౌఘ విని శ్శోషణములు మంగళతర ఘోషణములు". ఎందుకు మంగళవాయిద్యాలు వింటూ ఉంటాం? అవి మంగళకరమైనటువంటి ప్రజ్ఞల్నే వాతావరణంలో మిగిల్చి ఇతరములైన వాటియన్నిటిని ప్రారద్రోలుతుంది. ఒక సన్నాయిగాని, ఒక వీణగాని, ఒక మృదంగంగాని, ఒక వేణువుగాని, వీటి ధ్వని వల్ల అసుర శక్తులన్నీ కూడా పారిపోతాయి. "ఆఘమార్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసాం ఘంటారంకురు". ధ్వని వల్ల వాతావరణంలోకి అసుర శక్తులు రావచ్చు, దేవతా శక్తులు రావచ్చు. గురుమూర్తులు, యోగులు, సిద్ధులు, మహర్షులు కూడా రావచ్చు. ధ్వనిని బట్టి. రోజంతా నువ్వు చేసే ధ్వని ప్రధానంగా ఎలా ఉంది? మంగళకరమైన ధ్వనులు చేస్తున్నావా? అమంగళకరమైనటువంటి విషయములు మాట్లాడుకుంటూ ఉన్నావా? ఆ ధ్వనిని బట్టే నీలో అసుర శక్తులు పెరుగుతున్నాయో, దేవతా శక్తులు పెరుగుతున్నాయో తెలుస్తూ ఉంటుంది.

"గరుడగమను గుణభాషణముల్" – అతని యొక్క భాషణ. గరుడగమనుడు ఎలా ఉంటాడో తెలుసా? గరుత్మంతుడెక్కి వస్తాడు కదా! గరుత్మంతుడు ఎక్కడున్నాడు? మనలో స్పందనాత్మక చైతన్యమే గరుత్మంతుడు. అతన్ని అధిష్ఠించి సహస్రారం నుంచి హృదయం వరకూ దిగివచ్చి నీకు దర్శనం ఇవ్వగలడు. అక్కడ నుంచి చెయ్యి అందించి, నిన్ను పైకి తీసుకెళ్తాడు. యోగంలో స్పందన క్రమంగా నిన్ను ఉద్ధరించేట్టుగా తీసుకెళ్తుంది. ఆ స్పందనమే గరుత్మంతుడు. అది ఎక్కి, దిగివచ్చి, బొడ్డులో ఉండే జీవుడ్ని అలా చెయ్యిచ్చి అందుకుంటాడండి. అక్కడ బొమ్మ వేశారు చూడండి, రథంలో కూర్చునట్టు. అలా నడుము పట్టుకుని తీసుకెళ్తాడు. అంచేత, "గరుడ గమన రారా" అంటే వచ్చేస్తాడు. ఎక్కడ నుంచి వస్తాడు? ఏడు లోకాల అవతల ఉంటాడట. ఎక్కడ? మనలో సహస్రారం పైన. ఒక్కసారి నువ్వు ఉచ్ఛ్వాస చేస్తే, అలా దిగి వచ్చేస్తాడు. అన్నీ ఏదో చేస్తూవుంటాం తప్ప, ఒక్కటైనా తెలిసి చేస్తామా? తెలిసి ఒక్కటీ చెయ్యం! ఒక ఓంకారం చేయ్యడానికి ఎంత గాలి పీలుస్తావు?

మాములుగా పీల్చిన దానికన్నా ఎక్కువగా పీలుస్తావు కదా! ఇదే గరుడుని యొక్క ముక్కు – మన ముక్కే. ప్రాణవాయువు ఇలా వెళ్లి, సహస్రారం నుంచి అలా మనలోకి దిగివస్తున్నట్టు, కంఠం లోంచి, హృదయంలోకి అట్లా దిగి వచ్చి, ఉదర వితానం వరకు కూడా వెళ్లి, అక్కడ నుంచి మళ్ళీ అలా పట్టుకొని నిశ్వాస వాయువు... "ఓం" అంటే జరిగేదేమిటంటే ఆయనతో పాటు వెళ్లిపోవటం సహస్రారం వరకు. ఒక ఉచ్ఛ్వాస తీసుకొని, ఒక నిశ్వాసలో వాచికంగా కాని, మౌనంగా గాని ఓంకారం చేసుకుంటూ, దాంతో కలిసి వెళ్లిపోవచ్చు. ప్రతి ఉచ్ఛ్వాసతోను దైవం నీలో ప్రవేశిస్తునట్టు భావన చేయాలి. ప్రతి నిశ్వాస లోంచి నువ్వు దైవంతో కూడి సహస్రారం చేరినట్లు భావన చెయ్యాలి. అప్పుడు గరుడ గమనుడు ఎంత సున్నితంగా హాయి గొలుపుతూ, మనని తనతో తీసుకెళ్తాడో అర్థమవుతుంది. అలాంటి వాడు మన లోపలే, మన యందే వసించి ఉన్నాడు కాబట్టి, అతనిని గూర్చిన భాషణ చేస్తే ఆ ప్రజ్ఞ మనలో బాగా మేల్కాయిస్తుంది.

మనం చేసేవి చాలా చేస్తాంగాని, అందులో ప్రతి చిన్నది కుడా పరిపూర్ణమే. ఓంకారము పరిపూర్ణమే. ఏడుసార్లు ఓంకారం చేస్తే అర్థమేంటి? ఒకసారి కాకపోతే మరొకసారైనా ఆ దిగి వచ్చే దారితో, ఈ వెళ్ళే దారితో కలిసి వెళ్తున్నట్లు భావన చేస్తే... ఒక్కసారి ఓంకారం చెప్పి, ధ్యానంలో కెళ్ళి, సమాధి స్థితి కెళ్తారు యోగులు. "నిత్యం ధ్యాయంతి యోగినాం." ఒక్క ఓంకారమే చాలు. ఇలా కూర్చొని, కన్ను మూసుకొని, గట్టిగా గాలి ఒక్కసారి పీల్చి, "ఓం" అని కూర్చుంటారు. ఎంత సేపు? వారి వారి స్థితిని బట్టి. అది తొంభై నిమిషాలు కావచ్చు, మూడు గంటలు కావచ్చు, ఒక జామంతా కూర్చోవచ్చు. మరి ఆ గరుత్మంతుడు ఆ విధంగా మనలో దైవాన్ని కొనిరావడానికే ఉన్నాడా అన్నట్లుగా ఉంటుంది ఆ శ్లోకం. అలా ఆయన వచ్చి మనల్ని పట్టుకెళ్తాడు మనం భాషణం చేస్తూ ఉంటే.

"వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొక దొడ్డరాజు గలఁ డాతని కేవురు పుత్రు లగ్రజుం
డనఘుఁడు రుక్మి నాఁ బరఁగు నందఱకుం గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై."

విదర్భ దేశం అంటే? మళ్ళీ అందులో కూడా పెడతారండి! మనవాళ్ళు మహా... ఒకరకంగా చెప్పాలంటే చిలిపి! పెద్ద పెద్ద విషయాలు, చిన్న చిన్న పదాల్లో పడేస్తారు. విదేహ దేశమొకటుంది. విదర్భ దేశం కూడా అలాంటిదే. నిరుత్తరమైనటువంటి ఒక తాళం చెవి ఉంది. అది పట్టుకొని కొన్ని కొన్ని పదాలు మనం అన్వయించుకుని, విప్పుకుంటే, అది విశిష్టమైనటువంటి దేహముతో కూడినటువంటి జీవుల నగరం అని కూడా

వస్తుంది. ఎందుకంటే, మరి రుక్మిణి అక్కడ పుట్టింది కదా! రుక్మిణి అంటే ఏమిటో చెప్పాను కదా నిన్న: పుట్టుకతోనే బంగారు శరీరం ఉన్నటువంటి వ్యక్తి ఆమె – the golden robe. సహజంగా అమరత్వంతో కూడి ఉన్నటువంటి జన్మ. కారణ జన్మురాలు ఆమె. కృష్ణుని గూర్చి, లక్ష్మీదేవి తన అంశావతారంగా ఉద్భవించింది. మరి ఆమె ఉండేది విదర్భ దేశమే. అదొక అర్థం ఉంది.

అందులో భీష్మకుడనేటువంటి రాజు. భీష్మకుడంటే చాలా ధృడమైనటువంటి, నిశ్చలము, స్థిరమైనటువంటి సంకల్పము కలవాడు, సత్పురుషుడు. "భీష్ముడు" అంటాం కదా ఆయన్ని, ఆయన పేరు దేవరాతుడు. శంతనుడు కుమారుడు. ఆయన భీష్మమైన ప్రతిజ్ఞ చేశాడు కాబట్టి భీష్ముడు అన్నాము. ఈయన పేరే భీష్మకుడు. ఆయన "దొడ్డ రాజు", అంటే పెద్ద రాజు, అంటే రాజ్యం పెద్దదని అర్థం.

"ఏవురు పుత్రులు" – ఏవురంటే ఐదుగురు. ఐదుగురు కుమారుల తర్వాత ఒక కుమార్తె పుట్టిందండి ఆయనకి. ఐదుగురు కుమారుల తర్వాత కుమార్తె పుట్టడం ఎలా ఉంటుందంటే, పంచపాండవులు, ద్రౌపతి అన్నాకూడా అట్లాగే ఉంటుంది. ఐదు ఇంద్రియములు, అటుపైన చిత్తముతో కూడి ఉన్నటువంటి బుద్ధి, మనస్సు. ఆమె ఆరవది, ఆరవ సంతానం. ఐదుగురు మొగ సంతానం తర్వాత ఆరవ సంతానం స్త్రీ అయితే అది ఒక యోగం. అలాంటి వారికి యోగం అబ్బే అవకాశం ఎక్కువ ఉంటుంది. నువ్వు ఎన్నో సంతానమో దాన్ని బట్టి కూడా నీ యోగం ఎలాంటి స్థితిలో ఉందో పుట్టుకతో తెలుస్తుంది. అంచేత, ఈమె ఆరవదిగా పుట్టింది. ఐదు తర్వాత ఆరోదంటే ఇంద్రియముల పైన ఉన్నటువంటిది. మనసు ఇంద్రియముల ద్వారా పనిచేస్తుంది. ప్రత్యేకమైన అస్తిత్వం ఉన్నది కాదు. ఆ మనస్సును అధిష్ఠించిన బుద్ధిని ఆరవ దానిగా చెప్తారు. అంటే ఆమె బుద్ధి లోకంలో ఉంటే ఇంకా ఐదుగురున్నారు మనస్సుతో కూడి, పంచేంద్రియాలు నిర్వహించటానికి. మన శరీరమనే రథానికి ఐదు ఇంద్రియాలు, ఐదు గుర్రాలు లేక ఐదుగురు కొడుకులు. అందులో పెద్దవాడు "అనఘుడ" ట. అది చూడండి! ఏ పాపం తెలియనివాడు. అంటే, పుట్టుకతో పాపి కాదు. "రుక్మి" అనే పేరుతో ఉంటాడు వాడు.

మనసు అద్దం లాంటిది, నువ్వేం చూపిస్తే అది చూస్తుంది. అద్దానికి ఏమీ అంటదు కదా! కానీ సహవాసం దోషం చేత రుక్మి ఆ విధంగా తయారవుతాడు. సహవాస దోషం చేత అహంకారి అవుతాడు తప్ప సహజంగా అహంకారి కాదు. మనస్సు సత్వగుణంలోంచి పుట్టింది. కావాలంటే తృతీయ స్కంధం భాగవతంలో చూసుకోండి. మహత్తు లోంచి మూడు అహంకారములు పుడితే – రాజశిఖము, తామశిఖము, సాత్వికము అనే అహంకారాలు – అందులో సాత్విక అహంకారంలోంచి పుడుతుంది మనస్సు. అంటే, సహజంగా మనస్సు సత్వగుణ ప్రధానమైనటువంటిది. అది దేనితో కలిస్తే అది అవుతూ ఉంటుంది. పాలలో యాలుకలు, పంచదార

వేసుకుంటే పరవాన్నం అవుతుంది. ఇంత డికాషన్ పోస్తే చేదు కాఫీ అవుతుంది కదా! అలాగే, మనసు దేనితో చేరితే, దాని గుణములను ప్రతిబింబింప చేస్తుంది. స్వభావము వేరు, మనస్సు వేరు. మనసు ఆకాశము వైపు చూపితే, అది ఆకాశాన్నే ప్రతిబింబింప చేస్తుంది. చంద్రుని వైపు చూపితే చంద్రుని చూపిస్తుంది. సూర్యుడి వైపు చూపిస్తే సూర్యుడిని చూపిస్తుంది. కలుషితమైన విషయాల వైపు తిప్పితే వాటినే చూపిస్తుంది. నువ్వేమి చూడమంటే అది చూపిస్తుంది, నువ్వేమి చూపిస్తే అది చూపిస్తుంది. దర్పణం కదా అది!

మనసు దర్పణం అందువలన దానికి ప్రత్యేకంగా దానిదైన పాపమేమీ లేదు. సంగదోషం వలనే అంతా. మన మనస్సుకు కూడా ఇట్లా సంగదోషమే కలుగుతూ ఉంటుంది. మన చుట్టూ చేరిన వాళ్ళు ఎలాంటి వాళ్ళో, వాళ్ళని బట్టి ఉంటుంది మన మనస్సు. ఎంతసేపూ చిల్లర విషయాల్లో ఉండే వాళ్ళంతా చుట్టూ చేరిపోయారనుకోండి, మనం కూడా చిల్లరయిపోతాం కదా! సద్గురువు సమాశ్రయంలో ఉన్నామనుకోండి. సద్గురువు అడ్డమైన మాటలు మాట్లాడడుగా! ఎవరి సాన్నిధ్యంలో మన మనస్సుకు ప్రశాంతత లభిస్తుందో, అలాంటి వారి సాన్నిధ్యంలో ఉండటానికి ప్రయత్నం చేయాలి తప్ప, నేను కూర్చున్న చోట అంత సద్విషయాలు లేవని complaint చేయకూడదు. నువ్వున్న చోట బాగుండక పోతే, బాగున్నచోటకి వెళ్ళు. కాళ్ళిచ్చాడుగా దేవుడు! ఎప్పుడూ ఇంట్లో ఏదో రణగొణ ధ్వనిగా ఉందనుకోండి, "రణగొణ ధ్వని, రావణ కొంప" అనే సామెత అంటూ ఉంటారు కదా! అంటే, ఇంట్లో రణగొణ ధ్వనిగా ఉంటే, ప్రశాంతంగా ఉండే ప్రదేశం ఉంటుంది కదా ఊళ్ళో, అక్కడకిపోయి కూర్చో. "గుళ్ళో కెళ్ళినా ప్రశాంతత లేదండి, అక్కడ కూడా గొడవ గొడవగా ఉంటుందండి," అంటే, అక్కడికి వెళ్ళకు, కొండెక్కి కూర్చో. లేకపోతే సాయంత్రం వెళ్లి ఒక చెట్టు కింద కూర్చో. "అక్కడ చీమలు కదండి" అంటే, railway station కి వెళ్ళు. ఎటువంటి railway station? ఏ రైలూ రాని railway station లు ఉంటాయి కదా, అక్కడికి వెళ్లి, అక్కడ బెంచి మీద కూర్చో, బాగుంటుంది. ఏదో ఒకటి! నీకు బుద్ధి ఉండాలి గాని ప్రదేశం కనపడదా! అసలు నీ లోపలే ఇలాంటి ప్రదేశం ఒకటి ఉంటే, ఇంక ఏ గొడవ లేదు, ఎక్కడకీ పోవనక్కర్లేదు, అక్కడే ఉండవచ్చు. మట్టిలో మాణిక్యంలాగా ఉండరు? ఉంటారు. అందులోనే, అదంతా అంటకుండా అట్లా ఉండే ఉత్తమమైన సాధకులు ఉంటారు. అన్నీ అంటించుకుంటూ, అదే పరమార్థం అనుకునే వాళ్ళు ఉంటారు. రెండూ ఉంటాయి కదా!

ఇక్కడ ఈ పద్యం చూస్తే ఏం అనిపిస్తుందంటే, మనకి మామూలుగా రుక్మి అంటే సినిమాలో ఒక విలన్ గా ఒకడిని చూపించేస్తారు కదా! పైగా సత్యనారాయణ! మన జ్ఞానం అంతా కూడా సినిమా జ్ఞానమే కదా! రుక్మిని సంహరించలేదు కృష్ణుడు, గొరిగొదిలేసాడు అంతే! రుక్మి దుస్సాంగత్యాన్ని గొరిగి వదిలేస్తాడండి కృష్ణుడు. మాములుగా ఎక్కడో కోటిలో పదిమంది దుష్టులు ఉంటారు. మిగతా వాళ్ళంతా సాంగత్య దోషం చేత, బలహీనం

చేత, అలా తయారైన వాళ్ళే ఉంటారు. అంచేత, మహాత్ములు ఈ సాంగత్యం దోషం చేత కదా వీళ్ళిలా ఉన్నారని, అందర్ని మన్నిస్తారు, అందర్ని గౌరవిస్తారు, అందర్ని ఆదరిస్తారు. వాళ్ళు చేసేటువంటి తప్పులు ఎంచడము ఉండదు. కేవలం దుష్టుల విషయంలోనే కఠినంగా ఉంటారు. మిగతా వాళ్ళ విషయంలో కఠినంగా ఉండరు. ఎందుకుండరంటే, ఊసరవిల్లిలాగా ఎవరితో కూడి ఉంటే వాళ్ళ స్వభావం అంటేస్తూ ఉంటుంది మనకి కదా! ఎప్పుడూ రాజకీయాలే మాట్లాడుతున్న వాళ్ళతో ఉంటే, మనకీ అవే అంటేస్తాయి కదా! ఎప్పుడూ పదవులు, అధికారాలు వీటి గురించిన యావ ఉండే వాళ్ళతో ఉంటే, మనకీ అదే అనిపిస్తుంది. ఎప్పుడూ డబ్బు గురించి మాట్లాడుకునే వాళ్లతో ఉంటే, మనకీ అదే అంటేస్తుంది.

అంటని స్థితులో ఉన్నది రుక్మిణి. ఆరు బుద్ధి. ఆమె బుద్ధి లోకంలో ఉంటుందటండి. బుద్ధి లోకంలో ఉండే వాళ్లకి ఎన్నిట్లో కూర్చున్నా ఏమీ అంటవు. అది తేడా. సద్గురువులు బుద్ధి లోకంలోనే ఉంటూ, ఈ లోకంలో తిరుగుతూ ఉంటారు, దిగిరారు. దైవము బుద్ధి లోకము దిగి క్రిందకి రాడు. అక్కడ నుంచి చేయి ఇస్తాడు. అందిస్తాడు చేయి, “అందుకో” అని. దైవీస్వభావం ఉండేటువంటి వారు హిరణ్య ప్రాకారము దాటి దిగిరారు. అందుకనే దేవతల్ని నేలమీద నిలబడలేరు అని చెప్తూ ఉంటారు. నేలమీద వరకూ రావచ్చు గాని అంటుకోలేరు. అలా ఒక insulation.

రుక్మిణి పరిస్థితి ఏమిటంటే, ఆమె ఇన్ని ప్రాకారాల మధ్య ఉన్నా... ఈ మధ్య అందరికి విరివిగా “మణిద్వీప వర్ణం” అని చిన్న చిన్న పుస్తకాలు విపరీతంగా ఇచ్చేస్తున్నారు. కంచు ప్రాకారం, ఇత్తడి ప్రాకారం, ఆ ప్రాకారం, ఈ ప్రాకారం, తర్వాత నెమ్మదిగా ఉత్తమమైన ప్రాకారాలు చెప్పుకుంటూ, చింతామణి వరకూ తీసుకెళ్తారు. ఈమె ఉండేటువంటిది హిరణ్య ప్రాకారము. అంటే, బుద్ధిమయ లోకము. ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, బుద్ధిమయ లోకంలోనే ఉంటూ, మిగతా లోకాలకీ ప్రసరిస్తూ ఉండేటువంటి వాళ్ళు మహాత్ములు. వారు ఈ మనోమయ లోకాల్లోకి జారరు. మనసు బుద్ధితో కూడి ఉంటే, అప్పుడు మనసు వెలుగుతూ ఉంటుంది. అద్దాన్ని దీపం వైపుకి చూపిస్తే, అది దీపాన్ని చూపిస్తుంది. దీపాన్ని ఇంకా ఎక్కువ కాంతివంతం చేస్తుంది కదా! చీకటి వైపు చూపిస్తే, అసలు ఉన్నట్టు కూడా అనిపించదు, ఏం చూపించదు. అపరిశుద్ధమైన విషయం వైపు చూపిస్తే, మనసు అదే చూస్తుంది. రుక్మి, రుక్మిణి వారిద్దరి మధ్య వ్యత్యాసం అది. రుక్మి మనస్సు. రుక్మిణి మనస్సు పైన ఉన్నటువంటి బుద్ధి. బుద్ధి వెలుగే మనస్సు మీద పడుతూ ఉంటుంది. బుద్ధి ఎక్కడ నుంచి వచ్చింది? జీవుని యొక్క సహజమైన వెలుగది. జీవుడు స్వయం ప్రకాశకుడే. మనమందరమూ స్వయంప్రకాశకులమే. అంటే, మణుల వంటి వాళ్ళమన్నమాట. మణి సహజంగానే ప్రకాశిస్తుంది. అలా స్వయంప్రకాశకుడైనటువంటి జీవుని

బుద్ధి వెలుగది. ఆ వెలుగు మనసు మీద పడాలంటే మనసు బుద్ధి వైపు ఉన్ముఖమై ఉండాలి. మనస్సును బుద్ధి వైపుకు ఉన్ముఖం చెయ్యటమే సాధనం అంతా.

Aristotle అనేటువంటి ఒక మహాత్ముడుదగ్గరకు శిష్యుడొకడు వచ్చి అడిగాడు, "నేను దైవాన్ని ఎలా చేరుకోగలను? నేను దివ్యమైనటువంటి వెలుగుని ఏ విధంగా అనుభూతి పొందగలను?" అని. ఆయన అప్పుడు ప్రశ్నకు ప్రశ్నే సమాధానమని, "అద్దాన్ని మట్టి వైపు చూపిస్తే మట్టిని చూపిస్తుంది, ఆకాశం వైపు చూపిస్తే ఆకాశం వెలుగును ప్రతిబింబింపచేస్తుంది. నువ్వు ఎటు చూడదలుచుకుంటే అటు కనిపిస్తూ ఉంటుంది నీకు" అని చెప్తాడు. నీ మనస్సు ఆకాశం వైపు పెడితే, ఆకాశం యొక్క నీలపు కాంతిని ప్రతిబింబిస్తుంది. అంచేతే, ప్రార్థనలో మనసుని వెలుగు యందు ఉంచడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాం. దేవతా మూర్తులంటే ఏమిటి అర్థం? వెలుగు మూర్తులు అని అర్థం. దివము అంటే వెలుగు. ఆ దివమునకు రూపం లేదు. కాని దాన్ని నువ్వు ఒక రూపంలోకి తెస్తే, అది మూర్తి అవుతుంది. మూర్తిగా లేకుండా ఈ వెలుగు మూర్తిలో కూడా వెలుగుతుంది. మనస్సుని బుద్ధి అనేటువంటి వెలుగు మీద లగ్నం చేశామనుకోండి, అప్పుడు మనస్సులో వెలుగు నిండుతుంది. అంతమాత్రం చేత ఉండిపోతుందా? అద్దాన్ని ఇట్లా ఆకాశానికి రోజంతా పెట్టి, సాయంత్రం ఇటు చూపించామనుకోండి? అది ఏం చూపిస్తే అది చూపిస్తుంది? మనసుకి ప్రతిబింబము సహజగుణం అవ్వటం చేత, మనసు ఇంద్రియముల వైపు ఎక్కువ మొగ్గుతూ ఉండటం చేత, ఇంద్రియార్థముల వైపు జీవుడు పరిగెత్తడంగా ఉంటుంది. ఈ మనస్సు, బుద్ధితో అనుసంధానం చెందితే గొడవ లేదు.

ఇక్కడ కథలో రుక్మి భావాలు వేరు, రుక్మిణి భావాలు వేరు. రుక్మిణి కృష్ణుని కోరుకుంటుంది. అంటే, దైవాన్ని కోరుకుంటుంది. రుక్మి ప్రపంచాన్ని కోరుకుంటూ ఉంటాడు. అంచేత, రుక్మి రుక్మిణికి ఒక అవరోధం. అతడు సహజంగా అనఘుడే. "లగ్రజుం డనఘుఁడు రుక్మి నాఁ బరఁగు". రుక్మి అని పిలుస్తారు వాడిని. అతను అనఘుడే, పెద్దవాడు. అందరికన్నా చిన్నది "గడగొట్టు చెల్లెలై మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై". ఆమె రుక్మిణి అని పుట్టింది అని చెప్తున్నారు.

"బాలేందు రేఖ తోఁచిన
లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను
బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్".

"ఇందు రేఖ" అంటే చంద్ర రేఖ. "బాలేందు రేఖ" అంటే, అమావాస్య తర్వాత మొట్టమొదట చంద్ర దర్శనం ఉంటుందే, అలా పుట్టింది. ఎంతైనా చంద్ర కాంతి ఆహ్లాదంగా ఉంటుంది, లాలిస్తుంది. సూర్య కాంతి లాలించేదేముండదు కదా! తాపం ఎక్కిస్తుంది! కేవలం ఉదయించేవరికే, ఇంక అక్కడ నుంచి దేహానికి తాపమే కదా! ఆయన మార్తాండుడు. సూర్యుడు పెరుగుతున్న కొద్దీ ఏం జరుగుతుందండి? గూళ్ళల్లో దాక్కోడమేగా? కానీ చంద్రుడు పెరుగుతూ ఉంటే? చంద్రుడు చాలా పెరుగుతూ ఉంటే, జీవుడు లాలింపబడుతూ ఉంటాడు కదా! చంద్ర కళలు పెరుగుతుంటే ఆహ్లాదం కలుగుతుంది. సూర్యుడు తేజస్సు పెరుగుతూ ఉంటే తాపం పెరుగుతుంది కదా!

"బాలేందు రేఖ తోఁచిన లాలితయగు నపరదిక్కు లాగున". అపరిదిక్కు, పశ్చిమ దిక్కు. మనం ఈ పట్టణాల్లో ఉండి, ఈ శుక్ల పక్షం ఎలా ఉంటుంది? చంద్రుని కళలు ఏ విధంగా పెరుగుతూ వస్తుంటాయి? కృష్ణ పక్షం ఎలా ఉంటుంది? ఇవన్నీ మనకేమి తెలీదు. అష్టమి నాడు సాయంత్రం చంద్రుడు కనిపిస్తాడా? అది కృష్ణ పక్షమా, శుక్ల పక్షమా అనేదాన్ని బట్టి ఉంటుంది. పదిహేను తిథుల్లో చంద్రుడు ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ ఉంటాడు? శుక్ల పక్షంలో ఎప్పుడెప్పుడు కనపడకుండా ఉంటాడు? ఇవన్నీ తెలియాలంటే ఊరు బయట ఉండాలండి. సూర్యోదయము, సూర్యాస్తమయము, చంద్రోదయము, ఇవన్నీ చూడగలిగేట్టుగా ఉండేటువంటి ప్రదేశంలో ఉండటం కూడా ఒక అదృష్టమే. మనకిప్పుడు ఏం తెలియదు కదా! మామూలుగా చంద్రుడు ఉండేటువంటి రూపాన్ని బట్టి తిథిని చెప్పవచ్చు. చవితి చంద్రుడు, తదియ చంద్రుడు, విదియ చంద్రుడు, పంచమి అట్లా చెప్పేసేయచ్చు. ఒక్కొక్క కళ ఒక్కొక్క విధమైనటువంటి అద్భుతమైనటువంటి అనుభూతినిస్తుంది. "పంచమి, పంచభూతేశి, పంచశంఖ్యోపచారిణి" – అట్లా రాట్నం వేసేయమంటే వేసేస్తాము! పంచమి తిథి ఎందుకంత ప్రసిద్ధమో? ఇట్లా మన చంద్రుడు పదహారు కళలను సంచరిస్తూ ఉంటే, వాటికి తదనుగుణమైనటువంటి అనుభూతి మనోలోకాల్లోకి కూడా దిగివస్తుంది. ఎంచేత? చంద్రకాంతి ఏమిటి? సూర్యుని యొక్క ప్రతిబింబించినటువంటి కాంతే కదా! ఆత్మతత్త్వం రకరకాల కోణాల్లో మనసు మీద పడుతూ ఉంటే, ఆ మనసు వెలుగుతూ ఉంటుంది. సూర్యుని కాంతి పరిపూర్ణంగా చంద్రబింబం మీద పడ్డప్పుడు పూర్ణమి, రాఖ ఇటువంటి తిథులు చెప్తాము. అప్పుడు ఆ మనసు పరిపూర్ణంగా ఆత్మతత్త్వంతో నిండి ఉంటుంది. మిగతా సమయాల్లో కొంచెం కొంచెంగా ఉంటుంది. అమావాస్య నాడు చంద్రుడు, మనసు ఏమీ ఉండదు కాబట్టి అది సరాసరి ఆత్మతత్త్వాన్ని పొందే అవకాశం ఉంది. ఇలా రకరకాలుగా తిథుల యొక్క అవగాహన ఉన్నది, సాధన ఉన్నది.

ఇక్కడ ఏం చెప్తున్నారు? ఒక చంద్రరేఖ ఏ విధంగా ఆపర దిక్కు నుంచి అట్లా పెరుగుతూ పూర్ణిమ తిథికి చేరుతుందో, "బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్". పెరుగుతున్న కొద్దీ కళలు పెరుగుతున్నాయటండి. పిల్లలు పెరుగుతున్న కొద్ది కళలు పెరుగుతూ ఉన్నాయా లేదా? పిల్లలంటే పసి పిల్లలు, పిల్లలంటే మనం. మనలో కళ పెరుగుతూ ఉన్నదా? కళ తరుగుతూ ఉన్నదా? దేన్ని బట్టి కళ పెరుగుతూ ఉంటుంది? దేన్ని బట్టి కళ తగ్గుతూ ఉంటుంది? మనసు ఆత్మకు ఎంత ఉన్ముఖంగా ఉంటే అంత కళ పెరుగుతుంది. ఎంత విముఖంగా ఉంటే అంత కళ తగ్గుతూ ఉంటుంది. మనలో కళ ఆత్మతత్త్వమే లేక సూర్యతత్త్వమే. అబల అట్లా పెరుగుతూ పదహారేళ్ళు వచ్చేసరికి, బాగా ప్రతిపత్తి నుంచి రాఖాంతం వరకు ఏ విధంగా చంద్రకాంతులు పెరుగుతూ పదహారేళ్ళకి పరిపూర్ణమవుతుందో అలా పరిపూర్ణంగా తయారయ్యింది ఆమె.

కళతో, అందముతో, ఓర్పుతో ఉండేటువంటి ఒక పిల్ల ఇంట్లో పెరుగుతూ ఉంటే చాలా మంది బంధువులు, మిత్రులు గమనిస్తూ ఉంటారు. మొగపిల్లవాడిని కన్నా ఆడపిల్లని ఎక్కువగా గమనిస్తూ ఉంటారు. ఎంచేతంటే, పిల్లని బట్టి తగిన వరుడు కదా! అంతకన్నా మించిన కళ కలవాడు, సంస్కారము కలవాడిని ఇవ్వకపోతే ఆ స్త్రీ జన్మ చాలా దుఃఖ పూరితమైపోతుంది. వరహీనం అంటారే, ఎప్పుడు వరహీనం అవుతుందంటే తన పురుషుడు తనకన్నా సమర్థుడు కాకపోతే ఆ స్త్రీకి జీవితం ఆనందంగా ఉండదు, పురుషుడు కూడా ఆనందంగా ఉండడు. తన కన్నా తన భార్యకు ఎక్కువ తెలిసిందనుకోండి ఏం జరుగుతుంది? ఆవిడ చెప్పినట్లు వినాల్సొస్తుంది కదా! అది తనికీ మర్యాద కాదు, ఆమెకీ మర్యాద కాదు. అన్ని విషయాల్లోనూ ఆవిడ ముందుంటే సంఘంలో మర్యాద ఉండదు. సలాహాధారిగా ఉండటమే తప్ప, ముందుండి నడిపించారనుకోండి అంత బాగుండదు. పిల్లలు పెరుగుతూ ఉంటే, తల్లితండ్రులకి లోపల బాధ్యత పెరుగుతూ ఉంటుంది, ఈ పిల్లకి సరైనటువంటి వరుడిని తేగలనా అని. జనకుడికీ అదే బాధ, భీష్మకుడికీ అదే బాధ. ఎవరికైనా అంతే. సంస్కారమంతమైనటువంటి ఒక కన్యను పొందటానికి ఆశపడేవాళ్ళు చాలా మంది ఉంటారు. ఆశ కాదు కదా, సంస్కారం కావాలి. ఈమె ఎలా పెరుగుతోంది?

"వేర్వేర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు
నబలలతోడ వియ్యంబు లందు
గుజ్జెనగూళ్ళను గొమ రొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెఱసి
రమణీయ మందిరారామ దేశంబులఁ
బువ్వుఁదీగెలకును బ్రాది వెట్టు

సదమల మణిమయ సౌధభాగంబుల
లీలతో భర్మడోలికల నూఁగు"

ఒక రోజు సీతాకళ్యాణం అంటుంది, ఒకరోజు పార్వతీ కళ్యాణం అంటుంది. చిన్నపిల్లలు, ఆడపిల్లలు సహజంగా అట్లేవో పెళ్ళిళ్ళ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. సంస్కారాలు పెరగాలంటే ఇలా ఉండేవి కార్యక్రమాలు. ఇప్పుడు ఇవి (ipad) వచ్చేసిన తర్వాత ఎవరూ ఏంచేయలేరు! "నబలలతోడ వియ్యంబు లందు". అంటే, ఆ బొమ్మనే కాసేపు "మా అమ్మాయి", "మా అబ్బాయి" అంటుంది. ఆడుకుంటూ ఉంటారు. వియ్యమందుకుంటూ ఉంటారు. "గుజ్జెనగూళ్ళను గొమ రొప్ప వండించి చెలులకుఁ బెట్టించు". చిన్న చిన్న లక్క పిడకలతో వంట సామాగ్రి చేసి, ఇవాళ్ళ మా ఇంట్లో భోజనం, మీరందరూ రండి, ఇట్లా పిలుస్తూ ఉంటారు, ఆడపిల్లలు కదా! ప్రస్తుతం అదే ఘట్టం జరుగుతూ ఉంటుంది మా ఇంట్లో. మా మనవరాలొచ్చి, "తాతయ్య నీకేం కావాలి? పెసరట్టా, ఉప్మాయా, ఇడ్లియా, దోసా?" అంటుంది. "ఏముంటాయి తల్లీ?" అంటే, "అన్నీ ఉన్నాయి" అంటుంది. ఏం కావాలంటే అది వండి తెచ్చేస్తుంది. ఏమిటి వండుతుంది? మానసికమే. అదీ గుజ్జనగూళ్ళు.

ఇవన్నీ సహజమైనటువంటి స్త్రీ గుణాలు. వండి, వడ్డించి, ఆనందించడమనేటువంటిది లేని స్త్రీ స్త్రీయే కాదు. అది స్త్రీ ఆకృతి గాని స్త్రీ కాదు. వండడం, వడ్డించడం, అందరూ తింటుంటే చూసి ఆనందించడం, ఇలాంటివి లేని స్త్రీ, స్త్రీ కాదండి పురుషుడే. సందేహం లేదు. ఇప్పుడు ఈ రోజుల్లో మనుషులెలా తయారవుతున్నారంటే, కొన్నాళ్ళుపోతే ఇప్పుడు అందరూ పాంట్లు వేసుకుంటారు కాబట్టి నడుస్తూ ఉంటే స్త్రీయా, పురుషుడా అన్నది తెలియదు. పాశ్చాత్త దేశాలలో ఇప్పుడదే బాధ. మగ పన్లు చేస్తుంటే, ఆడ వాళ్లకి మగతనం వచ్చేస్తుంది. మీసాలు కూడా వచ్చేస్తాయి. మనతో పాటు (మగవాళ్ళతో పాటు) సమానంగా వాళ్ళు రేజర్లు వాడుతూ ఉంటారు ఆ దేశాల్లో! మొట్టమొదటసారి వెళ్ళినప్పుడు ఆశ్చర్యపోయాను ఇదేమిటని! మాస్టరు గారిని అడిగాను, "ఇదేంటి మాస్టరు గారు?" అంటే, "అవునోయి! వాళ్ళు మొగవాళ్ళు కదా!" అన్నారు. ఏవిటి మొగవాళ్ళు? ఉద్యోగాలు చేస్తారు, పాంట్లు వేసుకుంటారు. అన్నీ మొగ పనులు చేస్తే మొగతత్త్వం వస్తుంది. మూర్తిభవించినటువంటి స్త్రీ పురుషుడైపోతే భవిష్యత్తుల్లో జాతి ఎట్లా ఉంటుందో? ఎందుకంటే సృష్టికాధారమే స్త్రీ. సృష్టి సౌందర్యమే స్త్రీ. సృష్టి అనుభూతియే స్త్రీ. ఎందుకంటే అమ్మే అంతాను. అందుకనే మాస్టరు గారు కొంతమంది ఆడవాళ్ళు వస్తూ ఉంటే, "How are you my boy?" అంటుండే వారు వాళ్ళని. "ఎందుకిట్లా అంటారు మీ మాస్టారు?" అంటే "నీ నడక అట్లా ఉంది" అని చెప్పేవాడ్ని. "ఒక మొగ బాలుడు నడిచినట్టుగా నడుస్తుంటావు, అందుకని how are you my boy అని అన్నారు" ఇప్పుడు నెమ్మదిగా మనకీ అదే అవుతోంది. ఎందుకంటే మోజు కదా! పురుషుని వలె ఉండాలని స్త్రీ. పురుషులూ పురుషుల్లాగా ఉండి, స్త్రీలూ పురుషుల్లాగా

ఉంటే ఇంకెందుకండి? అందుకనే కదా పురుషుడు, పురుషుడు పెళ్లిచేసుకోవచ్చా, అది చట్టం చేయచ్చా అని అడిగేటువంటి పరిస్థితులు వస్తున్నాయి. అంటే, స్త్రీత్వంలో ఇలాంటివివి సహజంగా ఉంటాయి.

"రమణీయ మందిరారామ దేశంబులఁ బువ్వుఁదీగెలకును బ్రాది వెట్టు". చిన్నతనంలో పూలతీగలు పెంచాలి అనేటువంటి భావన ఉండేటువంటి స్త్రీలో స్త్రీత్వం చాలా ఎక్కువ. పువ్వులు పెంచటం, పూల తీగలు పెంచటం, వాటికి దారాలు కట్టడం... మీరందరూ ఒక్కసారి చదువుకోండి, పురాణపురుషుడులో రాధను పరిచయం చేయడానికి మాస్టరు గారు శతగోపుదుండేటువంటి గ్రామాన్ని వర్ణిస్తారు. అందులో ఉండే ఆడపిల్లలంతా ఊరు బయట ఉండేటువంటి కొండ మీద ఏ విధంగా చక్కగా తీగలెక్కించి, చెట్లకి దారాలు కట్టి, వాటన్నిటికీ మల్లెతీగలెక్కించి, ఆ మల్లెపూలు ఊర్లో అంతా... ప్రతి ఇంటి దొడ్లలోనూ, ఇంటి ముందూ మల్లె పూల పందిరి, జాజి పందిరి, రాధామాధవం అనేటువంటి పువ్వుల పందిరి, ఇట్లా సువాసనలతో కూడిన పూల పందిరిలంతా ఉంటే, ఆ వీధిలో నడిచి వెళ్తుంటే అటుపక్కనుంచి, ఇటుపక్కనుంచి ఎంత సువాసనలు వస్తాయండి? ఇలా మురికి వాసనలు వస్తాయా? ఎక్కడ పువ్వుకి ప్రాధాన్యత ఉన్నదో అక్కడ స్త్రీకి ప్రాధాన్యత ఉన్నది. మా విశాఖపట్టణంలో పువ్వులు దొరకవు. ఇప్పుడు కొంచెం దొరుకుతున్నాయి. రోడ్డు మీద వెళ్ళే వాళ్ళు మన ఇంట్లో compound wall దగ్గర పువ్వులు తీసుకెళ్ళిపోతూ ఉంటారు! పెంచడం నీ వంతు, కోసుకోవటం వాళ్ల వంతు! మాస్టరు గారు అంటుండేవారు, "విశాఖపట్నంలో మనకేముందోయ్! ఇక్కడ పండంటే చింతపండే కదా!" అనేవారు ఆయన. "పండా పాడా, చింతపండే! అదే తినాలి" అంటుండేవారు. ఈ పువ్వులు ప్రత్యేకంగా స్త్రీత్వానికి సంబంధించినవి. అందుకనే పూల తీగలు పెంచడం, పువ్వులు కోసుకోవడం, పూల మాలలు కట్టడం, ముగ్గులు వెయ్యటం, ఇలాంటివన్నీ స్త్రీ సహజగుణాలు. ఈ రోజు ఎవ్వరూ ముగ్గులెయ్యలేరు కదా! పూల మాలలు కట్ట లేరు. ఆ పనులన్నీ మొగవాళ్ళు చేసుకుంటున్నారు కదా! కానీ, అందులో జీవన మాధుర్యం వేరు. చిన్న పనులు అనుకోబోకండి. ప్రతి నిత్యం నువ్వు పువ్వుతో ప్రతిస్పందిస్తుంటే, నీలో ఎంత సంస్కారం పెరుగుతుందో తెలుసా! పూలతోట పెంచటంలో చాలా సంస్కారం పెరుగుతుంది. మహాత్ములు సైతం పూలతోటలు పెంచుతారు. శిరిడి సాయిబాబా పూల తోట పెంచారు. మనం పెంచితే పువ్వే రాదు కదా! కొంతమంది పూల మొక్కలు వేస్తే పువ్వులు రావు తెలుసా! కొంతమంది పూల మొక్కలు వేస్తే విరివిరిగా పూస్తాయి. ఎందుకని? విత్తనాల్లో తేడా కాదు, పెంచే వాడిలో ఉంది. పెంచే వాడిని బట్టి పువ్వు వికసిస్తుంది. పూల మొక్క ఆనందంగా పువ్వులిస్తుంది. ఏముందండి ఇప్పుడు? ఎంతసేపూ డబ్బు కోసం పరిగెత్తటం తప్ప ఏమీలేదుగా? వస్తు సంపద తప్ప, ప్రకృతి సంపద ఏదీ లేదుగా? అలాంటి ప్రకృతి సంపద ఉన్న రాజకుమారి రుక్మిణి. "రమణీయ

మందిరారామ దేశంబులఁ బువ్వుఁదీగెలకును బ్రాది వెట్టు". ఆ పువ్వులు పెంచడం, వాటి కన్నిటికీ అక్కడ మళ్ళు తీయడం...

"సదమల మణిమయ సౌధభాగంబుల లీలతో భర్మడోలికల నూఁగు". చక్కగా ఉయ్యాలలు ఉండేవి ఇదివరకు ఇళ్ళల్లో! ఆహ్లాదమైన సమయంలో, అంటే సాయంకాలం సమయంలో, చక్కగా ఉయ్యాల్లో కూర్చుని, ఊగుతుంటే ఎంత బాగుంటుందో ఎవ్వరికన్నా తెలుసా ఈ రోజుల్లో? తెలియదు. సాయంకాలం ఎప్పుడు ప్రశాంతంగా ఉంటుందో తెలుసా? తెలియదు. అట్లతదియకి పొద్దున్నే ఉయ్యాల్లో ఊగుతారు ఎందుకో? మధ్యాహ్నం ఎందుకు ఊగరో? అనుభూతి, ఆనందము, ప్రకృతి సౌందర్యము, ఇవన్నీ తెలిసే రోజులు పోయినాయండి. ఎంత సేపూ manufacturing, multiplying, money making, ఇందులో మునిగిపోయారు. నిజానికి ఇది జీవనం అనడానికి వీల్లేదు. రుక్మిణి అట్లా ఉయ్యాలలు ఊగుతూ ఉండేదట. మనకు సాయంత్రం చదువు, రాత్రి చదువు, ప్రొద్దున చదువు, తెల్లవారుఝామున చదువు, ఎప్పుడూ చదువే! ఏమిటయ్యా అంటే ఇంజనీరింగ్, MBBS. మా రోజుల్లో BA, BSc లు ఎంత భయంకరంగా ఉన్నాయో, ఇప్పుడు BTech లు, BE లు అట్లా అయిపోయినాయి – ఎవ్వడికీ ఉద్యోగాలు లేవు! బతకడానికి ఇంతకన్నా మార్గాలు లేవా? ఇరవై ఏళ్ళుగా చెప్తున్నాను ఇంజనీరింగ్ చెయ్యకపోతే చచ్చిపోతావా అని? అందరూ ఇంజనీర్లు అయితే దేశమేమైపోతుంది? మిగతా పనులు ఎవరు చేస్తారు? జీవితం అనుభవించడం అనే మార్గమొకటి ఉంది. జీవితాన్ని వైభవోపేతంగా చేసుకోవడానికి మార్గం ఉంది.

ఇలా పద్యం చదివి అర్థం చేసుకునే రోజులేవి లేవు కదా! భాషే రాదు కదా! తెలుగు జాతి, తెలుగు భాష మరిచినప్పుడు తెలుగు వైభవం వాడికి లేదంతే. "నసీబ్ మే నహీ లిఖాహువా" అని వాడి ముఖాన రాసి పెట్టిలేదు! దేశ భాషలందు తెలుగు లెస్స. మన దేశ భాషలు చాలా సంస్కారం కలిగినటువంటి భాషలు. అందులో ఎంతో కవిత్వం ఉంది. అసలు languages కి importance ఏముంది? ఏమి లేదుగా. భాషే కదండి మనిషిని బ్రతికించినా, చంపినా! చక్కగా మాట్లాడగలిగినవాడు ప్రపంచాన్ని జయించవచ్చును. మాటలతో ప్రపంచాన్ని జయించుకొచ్చినవాళ్ళు ఉన్నారు. మంచి మాటలు చెప్పి రాజ్యాన్ని కాపాడినటువంటి వారున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ విధంగా ఉంటుందండి ఆవిడ జీవితం.

"బాలికలతోడఁ జెలరేగి బంతు లాడు
శౌరికా కీర పంక్తికిఁ జదువు సెప్పు
బర్హి సంఘంబులకు మురిపములు గఱుపు

మదమరాళంబులకుఁ జూపు మందగతులు."

అంటే, పావురాలకి, చిలకలకి, వాటికేవో పద్యాలు చెప్పటం, పాటలు చెప్పటం, మాటలు చెప్పటం, వాటికి చదువు చెప్పుకుంటూ ఉండేదటండి. "బర్హి సంఘంబులకు మురిపములు గఱుపు". నెమళ్ళకు వయ్యారాలు నేర్పేదటండి రుక్మిణి. అంటే ఏమిటి? నెమళ్ళతో ఆడుకునేది. "నెమలికి నేర్పిన నడకలివి" అని మనం ఈ మధ్య పాట విన్నాం కదా! నెమలికే నడకలు నేర్పినటువంటి వాళ్ళు ఉన్నారు. దమయంతి లాంటి స్త్రీల కథలు మన పురాణాలలో ఉన్నాయి. ఋషిపత్నులు ఎంత మేధా సంపత్తి గలవారో! ఋషులే చెప్పుకుంటాం, కానీ ఋషిపత్నులు ఋషులతో సమానమైనటువంటి ప్రతిభ కలిగినటువంటివారు. చదువు రాని మొద్దులు కాదు. అక్షరాలు రాకపోవచ్చు. నిన్న చెప్పాను కదా – అక్షరాస్యత వేరు, చదువు వేరు. ఋషుల భార్యలందరికీ కుడా వేదవేదాంగములు, ఉపనిషత్తులు, ధర్మములు, సృష్టి రహస్యములు, అన్నీ తెలుసు. అవసరమైతే వాళ్ళే పూనుకునేవాళ్ళు పనికి – గోళగమనాలని ఆపేయగలిగినటువంటి శక్తివంతులండి ఋషుపత్నులు. "రేపు సూర్యోదయం లోపల నీ భర్త చచ్చిపోతాడు" అని శాపమిస్తే, "రేపు సూర్యోదయం అయితే కదా!" అంది ఒక ఆవిడ. "రేపు సూర్యోదయం లోపల నా భర్త చచ్చిపోతాడు కదా, కాబట్టి ఇక రేపటికి  సూర్యోదయమే లేదు" అని చెప్పింది ఆవిడ. ఏం చేస్తారు చెప్పండి! తెలుగు సినిమా భాషలో చెప్పాలంటే, "బాబు! బాబు!" అని అందరూ దిగివచ్చి బతిమాలితే, "తల్లీ! ఎంత పొరపాటున ఇచ్చాడు శాపం, ఆయన చచ్చిపోతే మేం బతికిస్తాము" అని మాట ఇస్తారు.

నిశాని వేసేవాడికుండే లోక జ్ఞానం చదువుకున్న వాడికి లేదు. చాకలి వాడికి తెలిసినంత పద్దు చదువుకున్న వాడికి ఈ రోజుల్లో తెలుసా? చదువుకున్న వాళ్ళు కంప్యూటర్ల మీద ఇన్నేసి చొక్కాలు, ఇన్ని లాగులు, ఇన్ని చీరలు, ఇన్ని పరికిణీలు అని లెక్కేసి చెప్తే, వాడు "కాదమ్మా!" అని చెప్పేస్తాడు. వాడి దగ్గర ఏమీ ఉండవు, కంప్యుటర్ ఉండదు. చదువుకున్న వాడికన్నా చాకలి వాడు మేలు అనే సామెత లేదూ! మీరెన్ని లెక్కలన్నా వేసుకోండి, పుస్తకాలు పెట్టుకోండి, కాల్కులేటర్లు పెట్టుకోండి, మీరు వేసిన లెక్క అవునో కాదో పాలవాళ్ళు, చాకలివాళ్ళు టక్కున చెప్పేస్తారు. "ఇన్ని రోజులు ఇన్ని శేర్లు పోయించుకున్నాం. ఈ రోజు రాలేదు. ఊళ్లో లేము, మాకొద్దని చెప్పాం." ఇట్లా మనం రోజుకో రకంగా పాలు పోయించుకొని, చివరకి వాడికి పేమెంట్ చేసే రోజున ఇంతయిందయ్యా అంటే, "లేదమ్మా! ఒక్కసారి చూడండి" అంటాడు వాడు. మా ఇంటి చుట్టూ ఇంకా ఉన్నారు ఇలాంటి వాళ్ళు. "లేదు తల్లి! ఒక్కసారి చూడండి" అంటాడు. అంటే ప్రతి దానికి పుస్తకాలు పెట్టుకొని... మన బాబాయ్ హోటల్ ఉందనుకోండి. మన పాత హోటళ్ళలో పది మంది రకరకాలుగా ఆర్డరు చేస్తే, కొంతమంది ఉల్లిపాయలు కావాలని, కొంత మంది వద్దని, కొంత మంది మిరపకాయలు కావాలని, కొంత మంది జీలకర్ర

కావాలని, కొంచెం అదెక్కువ కావాలి, ఇదెక్కువ కావాలి, నూనెక్కువ కావాలి, ఇన్ని ఆర్డర్లు వాడు తీసుకొని లోపలికెళ్ళి టకటక చెప్పేసి, మళ్ళీ అట్లా అన్ని ప్లేట్లు పట్టుకోచ్చేసి, అందరికి వడ్డించిన రోజులు పోయి, ప్రతి దానికి ఇట్లా రాసుకొని, ఒకటి చెప్తే, ఒకటి తెస్తూ ఉంటారు. ఏమయ్యింది? మేధస్సు పోయింది. మేధస్సు పెరగడం ముఖ్యం. మనిషి బాగా జీవించాలంటే మేధస్సు పెరగాలి. "మేధాంమే ఇంద్రోదదాతు మేధాం దేవి సరస్వతి మేధామే అస్వినాభవౌ". ఇట్లా వేరే మార్గాలున్నాయండి మేధస్సు పెరగడానికి. బట్టీ పడితే వస్తుందండి మేధస్సు? రాదు.

"మదమరాళంబులకుఁ జూపు మందగతులు". హంసలకు నడకలు నేర్పేదటండి. అసలే చాలా మదంగా నడుస్తుంటాయి రాజహంసలు. అంటే, హంసలతో, నెమలులతో, పావురాలతో, చిలకలతో, రామచిలకలతో, గోరువంకలతో, పూల మొక్కలతో, ఇట్లా జ్ఞానం సంపాదించుకున్నారండి. లక్ష రూపాయలు కట్టి, ఎల్. కే. జి నుంచి ఏ. సి. లో వేసి, వాడికి ఏ. సి. స్కూలు, ఏ. సి. బస్సు కదా! వాడింటికి రాంగానే "అమ్మా, బెడ్రూంలో ఏ. సి. ఉంది గాని, టాయిలెట్లో లేదే!" అని అడుగుతాడు వాడు? అక్కడ ఉండాలి కదా మరి ఏ. సి. ? ఎక్కడకెళ్ళినా ఏ. సి. పట్టుకొని తిరుగుతావా ప్రపంచంలో? అది నాసి జీవితం.

ఎందుకీ పద్యం చదివానంటే, అసలు వైభవోపేతమైనటువంటి ఒక జీవనం ఉన్నది. అది మనము అసలు ఉందని గుర్తిస్తే, ఒక పక్కన పడి ఉంటుంది. ఏదో రోజు ఇట్లా ఏమన్నా బతగలమేమో చూసుకోండి. మాస్టరు గారు ఎప్పుడూ చెప్తుండేవారు, "ఈ పట్నాల్లో ఉండద్దు. దూరంగా పొలాల్లో చక్కగా పూల మొక్కలు పెంచుకొని మనం ఉంటూ, ఏదో వూళ్ళో కొచ్చి పనిచేసుకొని వెనక్కి వచ్చేస్తే, పొద్దున్నా, సాయంత్రం, ప్రార్ధనలు, ఏవన్నా ప్రవచనాలు, కాలక్షేప్పాలు చక్కగా చేసుకోవచ్చు. అదేదో తప్పదు కాబట్టి సంఘంలో సేవ చేసి గభాల్న ఇంటి కొచ్చేసి ఎనిమిది గంటలు..." అట్లా చెప్తూ ఉండేవారు ఆయన. ప్రయత్నం కూడా చేశారు. కాకపోతే మనుషులు అలాంటి వాటికి అంత సంసిద్ధులు కారు.

ఆ విధంగా ఆవిడ పెరుగుతూ వచ్చిందండి. మనం రుక్మిణి కల్యాణం కథ ఇలా చెప్పుకుందాం అని నా ఉద్దేశ్యం. ఆవిడ ఏ విధంగా పెరుగుతూ ఉంటే, అక్కడ ఆయనకి ఏ విధంగా లోపల మార్పులు వచ్చినాయో తర్వాత పద్యం. అంటే, ఒక సంస్కారవంతమైనటువంటి స్త్రీ, ఒక పుణ్యమైనటువంటి స్త్రీ పెరుగుతూ ఉంటే, ఇక్కడ ఈమెలో వచ్చేటువంటి మార్పుల్ని బట్టి, అక్కడ ఆమెని వివాహం చేసుకునేటువంటి భర్తలో మార్పు వస్తుంది. అంటే సంబంధం ఉంది. అదీ ఇద్దరు ఒక్కటే. ఒకరే ఇద్దరుగా పెరుగుతున్నారు. ఇద్దరూ ఒక్కటే రీతి. అందుకని, ఇట్లా కథ ఇద్దరిదీ కలిసి నడుస్తుంది, తరువాత ఒకచోట చేరుతుంది, కళ్యాణం. అక్కడనుంచి ఒకటే నడుస్తుంది.

ఇలా ఉంటాయి భార్యాభర్తల జీవితాలు. మరిలాంటివి మరి ఇటువంటి గ్రంథాల్లోనే కనపడతాయి. ఎందుకంటే, ఇది ఋషి దృష్టి. సృష్టి రహస్యాలు ఎరిగినవాళ్ళ రహస్యాలు కాబట్టి అవి అలా ఉంటాయి.

మనకిప్పుడికే కొంచెం, ఎప్పటి మాదిరిగానే కొంచెం కాలాతీతం అయింది కాబట్టి, ఇదో సీసపద్యం. చక్కగా చెప్పుకోవాలి. ఎందుకంటే వీరిద్దరి మధ్యా అనురాగం ఎట్లా పెరిగింది అనేది తెలియాలి కదా! ఇది రుక్మిణీ కల్యాణం కదా! మహాభారత సంగ్రామం కాదిది, రావణవధా కాదు. కాబట్టి సౌభాయమానంగా వాళ్ళు రాసింది చెప్పుకుందాం. మనమేమి క్రొత్తగా సృష్టించక్కర్లేదు. మన పైత్యం కూడా అక్కర్లేదు!

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## మార్చి 4, 2012 సాయంకాలము – ప్రవచనము #3

"దేవకీసుతుకోర్కి తీగెలు వీడంగ
వెలఁదికి మైదీగె వీడఁ దొడఁగెఁ
గమలనాభుని చిత్త కమలంబు వికసింపఁ
గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ
బొలఁతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై దయ్యంగ
జలజాక్షి మధ్యంబు సన్న మయ్యె."

"హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మనయనువలనఁ బ్రమదంబు నిండార
నెలఁతయౌవనంబు నిండి యుండె."

శ్రీకృష్ణుడికి క్రమంగా దివ్య ప్రణాళికననుసరించి వివాహము, సంతానము అనేటువంటి కార్యక్రమము తనలో ప్రారంభం కాగా... వాసుదేవుని "చిత్తకమలం". వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అను నాలుగు స్థితులలో, నాలుగు వ్యూహములుగా దైవముంటాడు. వసుదేవుడి కుమారుడైనటువంటి శ్రీకృష్ణుడు వాసుదేవ మూర్తియే. అతడు ఒక దివ్య ప్రణాళికను, యుగప్రణాళికను అనుసరించి, ఒక దివ్య ప్రయోజనాన్ని నిర్వర్తించడానికి భూమికి దిగివచ్చినటువంటి సర్వాత్మకుడైనటువంటి నారాయణుడు. అతని అవతార ప్రయోజనాల్లో గృహస్తు ధర్మము, సత్సంతానమును వడయుట, ఇలాంటి కార్యక్రమాలు కూడా నిర్వర్తింపబడ్డాయి. "యద్యదాచరతిశ్రేష్ఠః" అని. రామావతారమునందు, కృష్ణావతారమునందు, వర్ణాశ్రమ ధర్మాల్ని చక్కగా – బాల్యము, కౌమారము, గార్హ్యపద్యము, వానప్రస్థము – ఈ నాలుగు ఆశ్రమధర్మాల్ని చక్కగా నిర్వర్తించి వారు చూపించారు. అందులో భాగంగా ఆమెకు వయసు పదహారేళ్ళు నిండి, యవ్వనవతి

అవుతుండగా, ఇక్కడ దేవకీసుతునికి వివాహం చేసుకుందాం అనేటువంటి ఒక సంకల్పం, కోరిక కలిగింది – తక్కువ సంజాతి అయినటువంటి ఒక స్త్రీని మనం వివాహం చేసుకోవాలి అని. దేనికి అలా వివాహం చేసుకుంటాం అంటే, ప్రజాపతి కార్యము అది. తాను దేహం ధరించినందుకు, తాను జీవులకు దేహం కలిపించడం అనేటువంటిది యజ్ఞార్థము. అంచేత, సంతానమును పొందవలయును. అలా పొందటం వలన ప్రజాతంతువు విచ్ఛిన్నం కాకుండా ఉంటుంది. "ప్రజాతంతుమాం వ్యవస్థేః" అని చెప్పి ఉపనిషత్తు వాఖ్యము ఒకటి ఉంది. తన జీవన ప్రయోజనాన్ని తాను నిర్వర్తించుకోటం కోసం తనకి తల్లితండ్రులు దేహాన్ని సమకూర్చారు. ఆ ఋణం తీరాలంటే తాను కూడా సంతానాన్ని కనాలి. ఏవేవైతే మనం జీవితంలో అందుకున్నామో, అవన్నీ ఇతరులకు మనం తిరిగి అందించినప్పుడు కృతకృత్యులమవుతాము. అలాంటి జీవ కథను దైవము అవతార పురుషుడై దిగివచ్చినప్పుడు తదనుగుణంగా తాను కూడా అలాగే నిర్వర్తిస్తూ ఉంటాడు. రాముడైనా, కృష్ణుడైనా చేసిన పని అదే.

ఆయన చిత్తకమలం అంటే సహస్రారము నందు, ఆజ్ఞ యందు, హృదయము నందు, మణిపూరక మందలి ఊర్ధ్వ భాగము నందు నాలుగు స్థానములలో భగవంతుని వ్యూహాలు ఉన్నాయి. అతడు సంతానం కోరినప్పుడల్లా ఆ వ్యూహంలోకి దిగివస్తాడు. సత్పురుషుడు కూడా ఎప్పుడూ కామవాంఛతో, కామదృష్టితో చిత్తము నందు వశించరు. బుద్ధి యందు వశిస్తూ ఉంటారు. కేవలం సంతాన ప్రాప్తి కొరకే ఆ చిత్తకక్షలోకి దిగివచ్చి, మనస్సు ఆధారంగా పంచేంద్రియములు, శరీరము ఆధారముగా సంతానాన్ని అందించి, మరల తాము పోయి బుద్ధి లోకాల్లోకి చేరి స్థిరపడతారు. అంతేకాని, అదే పనిగా బాహ్యమునందు, ఇంద్రియముల యందు, మనస్సు యందు, కామవ్యాపారము నందు తిరుగుతూ ఉండరు. కాని తానిప్పుడు వివాహం చేసుకోవాలసినటువంటి సమయం వచ్చింది కాబట్టి తన యందు ఆ కమలం వికసింపగా, తాను సంసిద్ధుడౌతున్నాడు.

తనకు తగిన కన్య ఎవరు? రామునికి తగిన కన్యను విశ్వామిత్ర మహర్షి తీసుకెళ్ళి చూపిస్తాడు. కృష్ణ కథంతా కూడా "ఏకో నారాయణో హరి"! ఆయనే అంతా కదా! సర్వదేవతామూర్తి, సర్వగ్రహమూర్తి. అన్నీ స్వయంగా చూసుకోవాలసిందే. కృష్ణుడిని నమ్మాముట అంటే అంతా స్వయంగా చూసుకోవటానికి సిద్ధపడాలి. అంతా స్వయంగా చేసుకోవడం, do it your self అంటారు చూసారా, అదీ కృష్ణుడు! రామ కథ ఎట్లా ఉంటుందంటే, ఆయన వెళ్తూ ఉంటే ఋషులు, దేవతలు, ఆయన ఎరుకకి అందకుండానే ఆయనకి సహాయం చేసి పెడ్తూ ఉంటారు. అది రామ కథ. కృష్ణుడు అన్నీ తెలిసినవాడు కదా, అందుకని ఆయనే చేసుకొచ్చాడు! ఎవరూ కోరి వచ్చి, సహాయం చేసింది లేదు. అందరికీ ఆయన సహాయమ చేయటమేగా! మన కృష్ణ కథ లాంటిదే

మన మాస్టర్ సి. వి. వి. యోగం కూడా! మనమే చేసుకుంటూ ఉండాలి. మాస్టరు గారు ఒక వాక్యం రాశారు: కృష్ణానుభూతి పొందిన తర్వాత మాస్టర్ సి. వి. వి. స్పర్శ కలిగిందట ఆయనకి. రెండిటికి తేడా ఏమీ లేదు అని ఆయనకి తెలిసిందట. అంటే ఏంటంటే, కృష్ణ తత్త్వంలో ఉండేటువంటి ఒక విధమైనటువంటి మాధుర్యంతో పాటు సాధక బాధకాలు కూడా మాస్టర్ సి. వి. వి. యోగంలో ఉండేవారికి ఉంటుంది. మన పని మనమే చేసుకుంటూ ఉండాలి. అదీ పద్ధతి.

కృష్ణుడు ఆ విధంగా భావించగానే అక్కడ ఏం జరిగిందంటే ఆమె ముఖము “నింతికి ముఖకమల మొప్పె”. ఈయనలో వివాహం చేసుకుందామనేటువంటి భావన కలిగేసరికి, అక్కడ పెళ్ళి చేసుకునే యువతి మొహంలో కాంతి ఒకటి ఏర్పడుతూ ఉంటుంది. “పిల్లకి ముఖంలో కాంతి ఏర్పడుతుందమ్మా! పెళ్ళి చేయాల్సిన సమయం వచ్చింది” అని పెద్ద వాళ్ళు చెప్తూ ఉంటారు కదా! ఇంట్లో పిల్ల కాంతివంతంగా వికాసం చెందుతూవుంటే అర్థం ఏమిటంటే ఈ కన్యను పెళ్ళి చేసుకునేటువంటి పెళ్ళికొడుకు ఉంటాడే అతడిప్పుడు పెళ్ళి చేసుకుందాం అనేటువంటి భావనలో ఉన్నాడు అని. గుడ్డివాడు వెతుకున్నట్టుగా ఉండదు. గుడ్డి మనుషులు వెతుక్కుంటూ ఉంటారు కదా ఈ రోజుల్లో! బొత్తిగా ఏమీ తెలియనటువంటి జాతి మనది. పిల్లకి పెళ్ళీడు వచ్చి, పెళ్ళి కళ ముఖంలో కనిపిస్తోందంటే అర్థం ఏమిటంటే, ఈమెను గూర్చి విధి వ్రాసిన వ్రాతలో ఒక పెళ్ళికొడుకు ఉంటాడు కదా, ఆ పెళ్ళి కొడుకు పెళ్ళి చేసుకుందాం అనుకుంటే, ఈ అమ్మాయికి ముఖంలో కళ వస్తుంది. అలా ఉంటుంది ప్రకృతిలో.

“వెలఁదికి మైదీఁగ వీడఁ దొడఁగెఁ” – ఆయన పెళ్ళి చేసుకుందాం అని భావన కలగంగానే ఈమెలో అంగ సౌష్ఠవము, శరీర సౌష్ఠవమంతా కూడా వివరంగా ఏర్పడుతూ వచ్చింది. ఆయన చిత్తకమలం వికసింపగానే, ఆమెకు ముఖ కమలం వికసించిందట. అంటే, కళ పెరిగింది. “మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ బొలఁతికి జనుదోయి పొడవుసూపె”. అంటే, ఇంక వివాహం దగ్గర పడుతుంది అనేసరికి అది పూర్ణమైనటువంటి అంగ సౌష్ఠవమంతా తయారవుతూ ఉంటుంది.

“శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ”. ఇంక లాభం లేదు, పెళ్ళి చేసుకోవాలనేటువంటి భావన. ఇంక మరి ఈ సంవత్సరంలో నేను పెళ్ళి చేసేసుకోవాలనుకున్నాడనుకోండి, అంటే ఇంక ధైర్యం తగ్గిపోతోంది పెళ్ళి చేసుకోకుండా ఉండడం అనేటువంటి విషయంలో. ఈ కార్యక్రమం ఈ సంవత్సరంలో పూర్తి అయిపోవాలంటుంది. పెళ్ళి చేసుకునే సమయం వచ్చిందో లేదో చెప్పండి అని జ్యోతిష్కుడి దగ్గర తిరుగుతూ ఉంటాం కదా! పెళ్ళి చేసుకునే సమయం పెళ్ళికొడుకుకి వచ్చిందా లేదా అది జ్యోతిష్కుడిని అడగకూడదు,

పిల్లవాడిని అడగాలి. “ఏరా! నువ్వు పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నావా? అలాంటి భావం ఏమన్నా ఉందా?” అని అంటే, ఉన్నదని చెప్తాడు మొగవాడు. అంతేగాని, అట్లా గోడ చాటు కెళ్ళి నిలబడి ముసిముసి నవ్వులు నవ్వడు కదా! కన్య అయితే “మీ ఇష్టం నాన్నా!” అంటుంది. అంటే, పెళ్లి చేసుకుంటానని అర్థం. “మీ ఇష్టం నాన్నా! మీ ఇష్టం అమ్మా!” అన్నదనుకోండి, అంటే పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉందని అర్థం. పెళ్లి చేసుకోటానికి ఒక కన్య సిద్ధంగా ఉన్నప్పుడు, పెళ్లి చేసుకోవడానికి ఒక యువకుడు సిద్ధంగా ఉన్నప్పుడు... జాతకంలో ఉండకపోతే అట్లా అనిపించదు. అనిపిస్తే, జాతకంలో ఉంటుంది. సరైన జ్యోతిష్కుని దగ్గరకు వెళ్ళకపోతే ఇంకో రకంగా ఉంటుంది. “అబ్బెబ్బె! ఇప్పుడు కాదండి” అంటాడు. వాడికి తెలిసీ తెలియనటువంటి మిడి మిడి జ్ఞానం. ఈ మధ్య ప్రతి దానికీ జ్యోతిష్యం అంటున్నారు కదా! ఇది వరకు ఏ జాతకాలు చూసి చేసుకున్నారండి? లో భావం ఎక్కువ ముఖ్యం. అంతా వాడి మీద, వీడి మీద, జ్యోతిష్యం మీద, వాస్తు మీద... మంచి భావన కలిగితే, అదే సుమూహుర్తం తెలుసా! ప్రతి దానికి ముహూర్తమా! నిద్ర లేవడానికి ముహుర్తం, కాలు కింద పెట్టడానికి ముహుర్తం, దంతధావనకి ముహుర్తం, మంచినీళ్ళు తాగటానికి ముహుర్తం. మంచినీళ్ళు తాగే లోపల యమ గండం అన్నాడనుకోండి, మానేస్తాడు తాగడం! రాహుకాలం, యమగండం, దోషం, వర్జ్యం, ఇవన్నీ తీసేస్తే రోజులో మిగిలింది చాలా తక్కువ ఉంటుంది. అది చాలా అసౌకర్యమైనటువంటి సమయాలుగా ఉంటూ ఉంటాయి తెలుసా! నీ భావము నందు శుద్ధి ఉంటే, నీ సంకల్పము శ్రేయోదాయకమైతే, నువ్వనుకున్నదే ముహుర్తం. మాస్టరు గారు అలాగే పెట్టేవారు ముహుర్తాలు. మాటిమాటికీ తారాబలం, చంద్రబలం ఏం లేవు, “ఎందుకోయ్! మంచి ఆలోచనకి. అంతా మంచి సమయమే!” అనేవారు. ప్రతి దానికి మంచి చూసుకొని, సరిగ్గా టైంకి పప్పులో కాలేసావంటారు చూశారా... ఎక్కువ శాస్త్రాన్ని నమ్మితే... వాళ్ళెవరో మహాశాస్త్రరీత్య పెళ్లి చేసుకొని సంతానం కందామనుకున్నారట. అంటే, ప్రతి విషయం... సంతానోత్పత్తికి కూడా ముహుర్తాలే, అంతా శాస్త్రమే. శాస్త్ర ప్రకారం చేస్తే కుక్క పిల్లలు పుట్టినాయి అని సామెత ఉంది. అంత మరీ తాకట్టు పెట్టేయకూడదు మనం. ఎందుకు అలా తాకట్టు పెట్టేస్తామంటే, ఇలాంటి గ్రంథములు వలన ఇది వరకు ప్రతి ఇంట్లో కూడా ఇవన్నీ సహజంగా తెలిసి ఉండేవి, ఇలాంటి ఆచారం ఉండేది. ఇప్పుడంతా అనాచారమే, ఏమీ తెలీదు. అందుకని ఈ పద్యం ఇలా చెప్పుకోవాల్సి వస్తోంది మనం! పూర్వ కాలంలో ఇటువంటి పద్యానికి ఎక్కువ వ్యాఖ్యానం ఉండేది కాదేమో! మనమిప్పుడు కలియుగంలో ఉన్నాం కాబట్టి ప్రతి చిన్న విషయం వ్యాఖ్యానమే కదా!

ఇంక పెళ్లి చేసుకుందాం అని ఆయనకి దృఢ నిశ్చయం అయిపోయింది. ఆవిడ కూడా చాలా పరిపూర్ణంగా తయారైపోయింది. ఆమె నడుము సన్నగా అయిపొయింది. “హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ బంధ మధిక మగుచు బాల కమరెఁ” — బాలకు కేశబంధం అధికమయ్యింది. అంటే, జుట్టు బాగా

పెరిగిందటండి. స్త్రీకి శిరోజములు అందానికి, అలంకారానికి ఒక ప్రధానమైనటువంటి వస్తువు. ఆ విధంగా జరిగిందట.

"తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచునున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూప బల గుణాదులు
విని కృష్ణుఁడు తనకుఁ దగిన విభుఁ డని దలఁచెన్."

రాజులిళ్ళకి వచ్చే అతిథి జనులు అక్కడ, ఇక్కడ తిరిగి వస్తుంటారు కదా! మనిళ్ళకి కూడా వస్తుంటారు. ఆ ఊర్నించి, ఈ ఊర్నించి వచ్చి, ఇంట్లో ఆడపిల్ల ఉన్నదని తెలిస్తే, ఫలానా చోట మంచి సంబంధముందండి అని చెప్తూ ఉంటారు. మీ అమ్మాయికి ఆ అబ్బాయి సరిపోతాడు అని చెప్పే ముత్తైదువులు ఉంటారు, పెద్దవాళ్ళు ఉంటారు. అందుకనే, ఏ ఇంటికి బంధువులు రాకపోకలు ఉంటాయో, ఆ ఇల్లుకి చాలా శుభాలు జరుగుతాయి. ఎందుకంటే, మంచి సమాచారం ఆ ఊరు నుంచి, ఈ ఊరి నుంచి, పక్క ఊరి నుంచి, పక్క రాష్ట్రాల నుంచి వస్తూ ఉంటాయి. వచ్చి పోయేట్లుగా ఉండాలి ఇల్లు. నన్ను ముట్టుకోకు, నా మాలకాకి అన్నట్టుగా ఉన్నామనుకోండి! మేము ఎవ్వరింటికి వెళ్ళం, మా ఇంటికి ఎవ్వరు రారు, ఇప్పుడు మనకి ఇది fashion కదా! మనం ఎవ్వరింటికి వెళ్ళము. ఎందుకని? వెళ్తే, వాళ్ళు మనింటికి వస్తారేమో కదా! పది ఇళ్ళకి మనం వెళ్ళాలి, పది ఇళ్ళ వాళ్ళు మనింటికి రావాలి. అప్పుడే ఇంటికి కళ. వైభవము డబ్బుతో రాదు, జీవన విధానం లోంచి వైభవం వస్తుంది. ఎవ్వరిళ్ళకీ మనం వెళ్ళము, మనింటికి ఎవ్వరు రారు, అలా ఉందనుకోండి, ఆ ఇల్లు ఎందుకూ పొరగాని ఇల్లు అది. మనం పది ఇళ్ళకు వెళ్ళాలి, పదిమందిని మనింటికి పిలవాలి. అదీ పద్ధతి.

ఆ వయసుకి కృష్ణుడు వచ్చేటప్పటికి కృష్ణుని రూపం, కృష్ణుని బలం, కృష్ణుని యొక్క గుణములు అప్పటికే చాలా మోతమోగిపోతూ ఉండుండాలి కదా! చాలా అల్లరి చేసాడు. చాలా మంది రాక్షసులను సంహరించాడు. అతని అందం గురించి ఆ నోట, ఆ నోట, ఏదో నోట్లో నుంచి అలా పాకుతూనే ఉంటుంది. ఆమె విన్నది. విని, ఆలోచించుకొని, అతను నాకు భర్త అయితే బాగుంటుంది అని అనుకుందటండి. రాముడు మిథిలలో ప్రవేశించినపుడు అలా నడిచి వెళ్తూవుంటే, అందరూ "అదిగో! ఆ విశ్వామిత్ర మహర్షితో వస్తున్న ఆ పసిబాలురలాగా కనిపిస్తున్నారే, వీళ్ళే ఆ మారీచుడు, సుభాహువులను చంపేసి, యజ్ఞం కాపాడారు" అని చెప్పుకున్నారు. అందరూ మేడలు, మిద్దల మీద నుంచి చూసి మిథిలా నగరంలో, "అబ్బ! ఎంత బాగున్నాడో" అని చెప్పుకున్నారు. ఆ నోటా, ఈ నోటా అంతఃపురంలో ఉన్న అమ్మవారికి తెలిస్తే, ఆమె బాల్కనీలోంచి

చూస్తుంది. రాముడిని చూచి చూడంగానే, “ఇతను నాకు పెనిమిటి అయితే బాగుండును” అని అనుకుంది. అలాగా ఒక్కొక్కరకంగా అనిపిస్తుంది.

అందుకే చెప్తుంటాను గబ్బిళ్ళాల్లాగా జాతకాలు పట్టుకొని వేలాడకండి, ఒకర్నొకరు చూసుకున్నప్పుడు అనిపించే భావానికి చాలా ప్రాధాన్యత ఇవ్వండి అని. ఒకర్నొకరు చూసుకున్నప్పుడు ఒకరి యందు ఒకరికి కలిగిన భావన ఉంటుందే, ఆ భావన నీకు జ్యోతిష్య పండితులు చెప్పలేరు. ఏదైనా దివ్య స్పర్శ ఉన్నటువంటి శాస్త్రజ్ఞులు చెప్పగలరు. అందరూ చెప్పలేరు. “జాతకాలు బాగా కుదిరినాయి అండి”, మళ్ళా “కుదిరనట్టు లేదండి” అంటూ ఉంటాడు కదా! “మూసుకో! నువ్వు మాట్లాడద్దు” అని చెప్తాలి. జాతకమే కాదు, చాలా విషయాల్లో కూడా. జాతకంలో అంతా ఉంటుంది. చూడగలిగే వాడు ఎలాంటివాడో? చూడగలిగేవాడి దృష్టిని బట్టి, అతని సంస్కారమును బట్టి జ్యోతిర్ విద్య భాసిస్తుంది. అవన్నీ దివ్య విద్యలు. నీలో దివ్యమైనటువంటి సంస్కారం ఉంటే అన్నీ బాగుంటాయి. జాతకాలు కుదిరినట్టుగా కనబడకపోయినా, వివాహాలు చేస్తే హాయిగా ఉన్నారు. “ఏం గురువుగారు! కుదిరిందా?” అంటే, “బాగా కుదిరినాయి. ముందు పిల్లవాడిని, పిల్లని చూడనివ్వండి. చూసి వాళ్ళేమన్నారో చెప్పండి” అని చెప్తాను. వాళ్ళిద్దరికి చూడంగానే, “ఈమె నాకు భార్య అయితే బాగుండును” అని దృఢమైనటువంటి భావన ఆ పిల్లవాడికి, అలాగే పిల్లకి కలిగిందనుకోండి, ఇంక శాస్త్రం అక్కర్లేదు. సర్వసాక్షి జీవుడు. జీవుడికి దృఢంగా అనిపించిందానికి మనం విలువ ఇవ్వకుండా కేవలం శాస్త్రానికే విలువ ఇచ్చాము. శాస్త్రం ఎంత నిష్కర్షగా చెప్పగలిగినా, చూడగలిగినవాడిని బట్టి కదా దర్శనం! ఒక్కొక్కసారి జాతకాలు కుదరకపోయినప్పటికీ “ఫర్వాలేదు. ఒకర్నొకరు పెళ్ళికొడుకు, పెళ్లికూతుర్ని చూసుకోనివ్వండి” అని చెప్తూ ఉంటాను. ఎందుకు అలా చెప్పాను? అలా అనిపించింది కాబట్టి చెప్పాను. అలా చూసుకుంటే వాళ్లకి బాగానే నచ్చింది. చూడండి మరి! “జాతకాలు బాగా కుదిరినాయి అండి. కాని, పిల్లవాడు ఒప్పుకోలేదండి” అని... ఇవన్నీ వస్తూ ఉంటాయి. జాతకాలు బాగా కుదిరితే ఒకళ్ళకొకళ్ళకి నచ్చాలిగా? నచ్చలేదే! బొత్తులు, బొత్తులు  జాతకాలు చూడడంకన్నా, పిల్లని పిల్లవాడు, పిల్లవాడు పిల్లని చూస్తే ఎలా ఉంటుంది. ఇక్కడ ఈమే తెలుసుకుందండి.

“ఆ లలన రూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ, జేకొందు ననుచు హరియుం దలఁచెన్.”

ఆయన విన్నాడటండి. ఆయనకి వినపడ్డాయి. ఈమెను గూర్చి వినిపిస్తే, ఆమె రూపము, ఆమె బుద్ధి, ఆమె శీలము, ఆమె గుణము వాటిని గురించి చింతించి, "బాలారత్నముఁ దన కి ల్లాలుగఁ, జేకొందు నను చు" అని అనుకున్నాడట. అని ఆ విధంగా ఒకళ్లోకళ్ళకి చూడక ముందే భావాలు. వినికిడి వల్ల. అంటే, చెప్పిన వాళ్ళనుబట్టి లెండి. కొంతమంది చెప్తే వినకూడదు. కొంతమంది చెప్తే తటస్థంగా ఉండాలి. కొంతమంది చెప్తే తప్పకుండా దాన్ని ఆచరించడానికి ప్రయత్నం చేయాలి. మన అనుభవంలోంచి ఇది మనకి తెలుస్తుంది. కొంత మంది మంచివాళ్ళే గాని instinctive గా wrong suggestions ఇస్తారు. వాళ్ళు చెప్పినట్టు చేస్తే, తల గోడకు కొట్టుకున్నట్టు అయిపోతుంది. కొంతమందివి అలా జరుగుతూ ఉంటాయి. కొంతమందివి కాస్త అటు ఇటుగా ఉంటాయి. కొంతమందివి కళ్ళు మూసుకొని వెళ్ళిపోవచ్చును. ఇలా ఎందుకు ఉంటారంటే, అది వారి వారిలో తలపుకు వచ్చేటువంటి పద్ధతిలో ఉంటుంది. అమ్మ అనుగ్రహం ఉన్నచోట ఏదైతే జరుగవలసిందో, దానికి సంబంధించిన సంకల్పమే వస్తుంది, మిగతావి రావు. అంచేతే, మనకనిపించినవన్నీ నిజం అనుకోకుండా, ఆరాధన పెంచుకుంటూ, అమ్మ పలికించినవల్లా కుడా తెలుసుకుంటూ ఉండాలి. అంబ పలుకు వేరు కదా! "అంబ పలుకు జగదంబ పలుకు" అంటుంటాడు కదా! అంబ పలుకుకన్నా మించిందేముంది? మన బుద్ధి వికాసం ఎలా ఉంటుందంటే, "వినదగును ఎవ్వరు చెప్పినా వినినంతనే వేగపడక వివరింపదన్". అంటే, by experience. చుట్టూ ఉండేవాళ్ళు కొంతమంది చెప్పేవి అవి బాగానే ఉంటాయి, అవుతూ ఉంటాయి. కొంతమంది చెప్పేవి అవ్వవు. కొంతమంది చెప్తే confusion అవుతూ ఉంటారు కదా! అది వాళ్ళకుండేటువంటి పరిస్థితి. వాళ్ళు దుర్జనులు కాదు, సజ్జనులే, అది గుర్తు పెట్టుకోండి! కొంతమందికి తట్టవు, కొంతమందికి తడతాయి. కొంతమందికి వికెట్టు మీద బంతులు పడతాయి, కొంతమందికి పడవు. అందుకని, వింటూ ఉంటే తెలుస్తూ ఉంటాయి. వినే ఓపిక లేదు కదా! ఎంత సేపు మాట్లాడేద్దామని తప్ప, విందామని ఎవడికీ లేదు ఈ రోజుల్లో!

ఈ విధంగా ఆయనా విన్నాడు, ఆవిడా విన్నది. వాళ్ళు ఎవరి దగ్గర్నుంచి విన్నారో, వాళ్ళు ఎలాంటి వాళ్ళో దాన్ని బట్టి కదా! ఏదో తంత్రమైతే తప్ప అందరూ కూడ పలుక్కుని చెప్పరుగా! తంత్రమైతే కూడ పలుక్కుని చెప్తారు అందరు. ఊళ్ళో పిచ్చివాడిని ఒకడిని ఏరి, అతడు చాలా తత్త్వవేత్త, రాజకుమార్తెకి అతనే తగిన వరుడని ఒక తంత్రం చేస్తారు. ఆ పిచ్చివాడే కాళిదాసు అవుతాడు తర్వాత. ఎందుచేత? ఆ రాజకుమార్తె భక్తి వలన. పిచ్చివాడేం చేసినా అతనిని ఒక మహా అవధూతగా మనం వ్యాఖ్యానం చేయవచ్చు, భాష్యం చెప్పవచ్చు. నీ దగ్గర జ్ఞానం ఉంటే, జరిగే ప్రతి పిచ్చి పనిని తత్త్వపరంగా దానికొక వ్యాఖ్యానం చెప్పచ్చు, ఒక భాష్యం చెప్పచ్చు, ఒక వివరం చెప్పచ్చు. అట్లా పిచ్చివాడు సభలో ప్రవేశించి ఏవేవో పిచ్చి పిచ్చి పనులు చేస్తూ ఉంటే, వాటన్నిటికీ

తత్త్వపరమైనటువంటి వివరణ, పండితులందరు కుతంత్రం చేస్తే, తన కుమార్తె అమ్మ భక్తురాలు కాబట్టి ఇలాంటి వాడే తగిన వరుడు అని పెళ్లి చేస్తాడు తండ్రి. కుమార్తెకి తెలిసిపోతుందట రెండు రోజుల్లో ఇతను నిజంగా పిచ్చివాడు అని. పిచ్చివాడని తెలిసి, బాధ పడి అమ్మనడుగుతుంది "చిన్నపట్నుంచి నిన్ను నమ్ముకున్నాను. ఎందుకిలా చేశావు తల్లి?" అని. ఎందుకిలా చేసిందో, తర్వాత ఘట్టంలో తెలుస్తుంది. మరి అలాంటి వాడిలోంచి వేదవ్యాసునితో సమానంగా అమ్మ పలికిందట.

అమ్మ పలుకు తెలియాలంటే అమ్మ ఆరాధన ఒక్కటి బాగుంటే చాలదు, స్త్రీ యందు నీకుండే దృష్టి బట్టి ఉంటుంది. అమ్మ అనుగ్రహం కావాలంటే, సృష్టిలో స్త్రీ యందు నీకున్న దృష్టిని బట్టి ఉంటుంది. తల్లి, సోదరి, భార్య, కుమార్తె – ఈ నలుగురు రూపాల్లోను –నీకు జీవితంలో తారసిల్లే ఇతర స్త్రీ రూపాల యందు నీవు ఎలాంటి భావన కలిగి ఉన్నావు అనేదాన్ని బట్టి అమ్మ నిన్ను అనుగ్రహిస్తుందా, అనుగ్రహించదా అనేది తెలుస్తుంది. అంతే కాదు, సత్సంతాన్ని ఇస్తుందా? ఇవ్వదా? వంశాన్ని కొనసాగిస్తుందా? సాగించదా? ఇలాంటివన్నీ ఉన్నాయండి. అన్నీ ఇటువంటి పుస్తకాల్లోన్నే ఉంటాయి. స్త్రీ మూర్తి యందు చాలా పవిత్రమైన భావన ఉన్నవారికే పురోగతి, ఇతరులకు ఉండదు. భక్తుల కథలు చూసుకుంటే అన్నీ అలాగే ఉంటాయి, అమ్మ ఆరాధన, సాధన, ధ్యానము, జపము, తపమే గాక, సంఘంలో స్త్రీ యందు నీ దృష్టి, నీ ప్రవర్తనను బట్టి ఉంటుంది. ఇది ప్రాతిపధికగా అవి కూడా చెప్తున్నాను. ఆ విధంగా, వారిద్దరికీ ఒకరియందు ఒకరికి మనసు ఏర్పడింది.

"బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై."

రాజు చాలా సత్పురుషుడు. కాకపోతే ఇలాంటి కన్య పుట్టదు కదా! లక్ష్మి అంశతో కూడినటువంటి ఒక అమ్మాయి మనింట్లో పుట్టిందంటే, ఆ తండ్రి ఎలాంటి వాడు అయ్యుండాలండి? ఎంతటి వాడు అవ్వకపోతే, అంత మంగళప్రదమైనటువంటి స్త్రీ అతనింట్లో పుడుతుంది. సంతానం కనాలంటే చాలా ఆలోచించాలి. స్త్రీ శిశువుని ఇచ్చేట్టయితే, నీలాంటి నీ కళలున్న పిల్లనివ్వు తల్లీ, పురుష శిశువుని ఇచ్చేట్టయితే రాముడు లాంటి పిల్లవాడిని అని ప్రార్థన చేసుకోవాలి. ఆరాధనా ఫలితంగా నీ దయ ఎలా ప్రసరించినా నాకు ఆనందమే. కానీ, నీ యొక్క ఆరాధకుడై ఉంటే చాలు ఆ జీవి, అలాంటి వాళ్ళు కావాలి సంతానం. అంతేగాని, మిగతా విషయముల యందు ఆసక్తి కలిగి, పశుప్రాయులై జీవించే వాళ్ళు ఎంత మంది పుడితే ఏమి లాభం తల్లితండ్రులకి? ఉత్తమ సంతానం

మనకి ఉత్తమమైనటువంటి గతుల్ని కలిగిస్తుంది. అధమమైనటువంటి సంతానం మనల్ని కాళ్ళు పట్టి కిందకి లాగేస్తుంది. ఒక్క జన్మతో కాదు, మూడు తరాలు తర్వాత కదా! మానవ జీవితం ఎంత ఆనందదాయకమో, అంత బాధ్యతయుతం కూడా. ఈ జీవితం మనకి కలిగినందుకు, మన వంశం యొక్క సంస్కారాన్ని మనం ఇంకా పెంచాలి. మన తల్లితండ్రుల కన్నా, ఇంకా మనం ఉత్తమంగా తయారవుతే వాళ్ళకి ఉత్తమ గతులు బాగుంటాయి. అన్ని విధాలా ఇంక నుంచి రాబోయే సంతానం ఇంతకన్నా గొప్పగా ఉండేట్టుగా ఉండాలి. ఏదైనా మన స్పర్శ వలన దానికి ఉన్నతి రావాలి. ఏ పని నీ దగ్గరకి వస్తే, ఆ పని నీ ద్వారా అది జరిగినప్పుడు ఇంకొంచెం ఉన్నతి రావాలి. ఇక పడిపోవడం, నాశనమైపోవడం, మన కళ్ళ ముందే బొత్తిగా నశించడం జరగకూడదు. ఒక పూల చెట్టు నీ చేతిలో పెడితే, అద్భుతంగా పూలు పుసేట్లుగా చూడాలి. ఒక ఉద్యానవనాన్ని అప్పచెప్పితే దాన్ని పెంచాలి. ఒక బాధ్యత అప్పజెప్పితే దాన్ని అలా పెంచాలి. అన్ని రకాలుగా అన్నిటినీ పెంచిన వాడి జీవితం ధన్యం. వాడు సృష్టిని చక్కగా నిర్వర్తింపచేసినవాడు అవుతాడు. అన్నిటినీ నాశిగా తయారు చేసి, అన్ని పాడు చేసి చేసుకున్నవాడు, వాడు పాడైపోవటమే గాక, వారి పూర్వీకుల్ని, వాడి తర్వాత వాళ్ళను కూడా పాడు చేసేస్తాడు. అల్లాంటి వాళ్ళు ఉన్నచోట వంశం కూడా కొనసాగదు, ఋషుల వంశంగా. అన్నీ ఋషుల వంశాలే.

వీళ్ళంతా "శేముషీ సింధువులై" అన్నాడు. శేముషీ సింధువులంటే, బుద్ధి ప్రధానంగా కలిగినటువంటి గుంపులట వాళ్ళందరు. ఏది ఇంటికొచ్చే బంధువులు? తంపులు, తగువులు పెట్టేటువంటి వాళ్ళు కాదు. ఇంట్లో వచ్చి అత్తకి, కోడళ్ళకి లేకుండా చేసి తండ్రికి, కొడుక్కు కాకుండా చేసి ఇట్లా పోతుంటారు, కొంతమంది ప్రత్యేకంగా పనికట్టుకొస్తుంటారు కదా! తగువులు పెంచి వెళ్లిపోతుంటారు ఇంట్లో. అలా కాకుండా, వచ్చిన వాళ్ళంతా మీ అమ్మాయిని కృష్ణునికివ్వు బాగుంటుది అని చెప్పి ఆ రాజుకి చెప్పారందరూ. ఏంతో మంది చెప్పారు.

"విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి" – అక్కడొక దుర్యోధనుడు ఉన్నాడు. ప్రతి చోట ఒకడు ఉంటాడు కథలో ఖల్నాయక్ కదా! నాయకుడికి వ్యతిరేకంగా ఎవడు వాడు? అహంకార పురుషుడు. "నేను చెప్పినట్టు వినాలి. ఈ ఇంట్లో ఏదైనా నేను చెప్పినట్టే జరగాలి. వినండి. అమ్మ, నాన్న కూర్చోండి". "జో మే కహూ వో కర్నాహై" అనరు? అంటారు. ఏమిటది? కరుడు కట్టిన అహంకారం. వాడొకడున్నాడు, పెద్ద బండరాయి. Boring వేస్తుంటే పెద్ద బండరాయి అడ్డుపట్టుగా పడ్డాడండి వాడు. డ్రిల్ బిట్లు అన్ని విరిగి పడ్డాయి తప్ప, దానికి bore పడదు. అలాంటి వాడు ఒకడు వచ్చేసాడు అడ్డంగా. "దుస్సంధుడు రుక్మి" వాడితో ఎవరూ ఏమి మాట్లాడ్డానికే వీల్లేదు, మూర్ఖుడు. చేరి మూర్ఖుని మనసు రంజింపరాదు. వాడితో ఏమి మాట్లాడ్డానికి వీల్లేదు. ఒక మాట చెప్పడానికి వీల్లేదు. అలా కాదురా అంటే "ఆ!" అంటాడు. మాట్లాడనివ్వడు, గయ్, గయ్ మని అరుస్తాడు.

నేను ఇలాంటి వాళ్ళను చూస్తూ ఉంటాను. ఓహో! అనిపిస్తుంది. అంటే వీళ్ళ తలకాయ ఎక్కడో ఏ గోడకో, ఎప్పుడో ఫడీమని తగులుతుంది. అంతవరకు అలాగే ఉంటారు. అహంకారి కోరి తెచ్చుకుంటాడు కష్టాలు. ఏం సందేహం లేదు. తన అహంకారం వలనే తనకి కష్టాలు.

"కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి" – ఎందుకు విరోధము? ఎన్నడు అంతకముందు కలుసుకోలేదు వాడు. కృష్ణుడు ఈయన్ని ఒక మాట అన్నది లేదు, అపహస్యం చేసింది లేదు, అవమానం పరిచింది లేదు, హేళన చేసింది లేదు. ఎప్పుడూ కలుసుకోలేదు. ఎందుకంటే వీడి friend ఒకడు ఉన్నాడు, వాడు శిశుపాలుడు. వాడికి పుట్టుకతోనే కృష్ణుడంటే ద్వేషం. మరి వాడితో వీడు చేరితే వాడు ఎంతసేపు కృష్ణుని గురించి ఏవో చెత్త మాటలన్నీ చెప్తూ ఉంటాడు. వాడు పచ్చి దొంగ. వాడు కాముకుడు. వాడది, వాడిది. వాడు నల్లగా ఉంటాడు. వాడికసలు stature లేదు మనిషిలో. వాడికో అందం చందం లేదు. ఒక కిరీటం పెట్టుకోడు, నెమలి పించం పెట్టుకుంటాడు. వికారంగా ఉంటాడు. ఇలాంటివన్నీ నూరు పోస్తూ ఉంటే వాడికి వాడి చెల్లెలిని ఇవ్వ బుద్ధి కాదు. వాడు మనకొద్దు అని decide అయిపోయాడు. అంటే వీడి information అట్లా ఉంది. ఎన్నడూ అంతకముందు రుక్మి కృష్ణుడిని కలిసిన సందర్భమే లేదు. శిశుపాలుడికి ఎందుకు ద్వేషం? కృష్ణుని మేనత్త కొడుకే శిశుపాలుడు. ఆ శిశుపాలుడు పుట్టినప్పుడు మహావికారంగా పుట్టాడు. రెండు తలకాయలు, నాలుగు చేతులు, నోట్లో రెండు కోరలు, మిడిగుడ్లు, నల్లగా పుట్టాడు వాడు. తల్లితండ్రులు అలాంటి వాళ్ళా? కాదు. చాలా సంస్కారవంతులు. దుఃఖపడ్డారు. ఋషుల్ని, యోగుల్ని, సిద్ధుల్ని ఇంటికి పిలిపించి, "ఏమిటి మాకీ బాధ? వీడెవడు? వీడెందుకు వచ్చాడు? ఎందుకు పుట్టాడు? వీడిలాగే ఉంటాడా?" అని అడిగితే వాళ్ళు చూసి కారణజన్ముడని చెప్పారు. ఉందిగా వాడికి పుట్టడానికి కారణం! జయవిజయులలో ఒకడేగా వాడు! "కారణజన్ముడు. కాని ఇలా ఉండడు. ఇతన్ని ఎవరు స్పృశిస్తే, ఇతనికి సుందరమైన ఆకారం వస్తుందో, అతడి చేతిలోనే ఇతడు మరణిస్తాడు" అని చెప్తారు. శిశుపాలుడు సహజంగా సుందరుడే. ఈ వికారం కొని తెచ్చుకున్నాడు వాడు. "మేము కూడా చిన్నప్పుడు బాగానే ఉండేవాళ్ళం అండి" అని చెప్పుకుంటుంటాం కదా! మరిప్పుడు ఎందుకు బాలేదండి అంటే వికారాలు చేరిపోయినాయి మనలో. ఎందుకు వికారం చేరింది? పనులు, చేతలు, భావాలు, మాటలు. ఇప్పుడు ఎలా అంటే, "ఎవరన్నా వచ్చినవాళ్ళు, బంధువులు, వాళ్ళు, వీళ్ళు వస్తుంటారు కదా! ఎవరింటికి వస్తే వాళ్ళు చేతుల్లో పిల్లవాడ్ని ఇవ్వండి. ఎవరి స్పర్శ వల్ల మరి ఇలా అవుతాడో, బాగుంటాడో తెలియదు" అంటారు. సరే అలా, అలా, వస్తూ అత్త ఇంటికి వస్తాడు కృష్ణుడు. కృష్ణుడంటే అత్తకి చాలా ఇష్టం. "నాన్నా! ఇదిరా వీడి పరిస్థితి. నీ చేతులో ఒకసారి తీసుకోరా" అంటుంది. "ఇయ్యి అత్త" అంటాడు. చేతిలో పెట్టుకోగానే మారిపోతాడు. మారిపోతే అత్తకి ఆశ్చర్యం, ఆనందం, దుఃఖం అన్ని వస్తాయి. ఆశ్చర్యం ఎందుకంటే కృష్ణుని లీలలు తెలుసు. కృష్ణుడు ఎంతటి వాడో తనకు తెలుసు.

అలాంటి వాడి చేతుల్లోకి వాడి వల్ల మరి ఇలా జరిగింది. పిల్లవాడు అందగాడయ్యాడు, మామూలు రూపం వచ్చింది అని ఆనందం. తన మేనల్లుడి చేతులోనే తన కొడుకు చచ్చిపోతాడు అని దుఃఖం. “నాయనా! ఇలాంటి శాపం ఉందిరా వీడికి. నువ్వే చంపేస్తావా నా కొడుకుని?” అని అడుగుతుంది. “నేనెందుకు చంపుతానత్తయ్యా? నేను చంపను” అంటాడు. “లేదురా! అలా చెప్పారు” అంటుంది. “అలా చెప్పారంటే మరి ఆలోచించాలి. వీడేమన్న తప్పులు చేస్తే నేను ఊరుకుంటూ ఉంటాను. ఒక్కసారి వంద తప్పులు చెస్తే మాత్రం నేను ఊరుకోను అత్త” అని చెప్తాడు. ఆ రాజసూయలో ఒక్కసారి వంద తప్పులు చేసేస్తాడు శిశుపాలుడు. ఎందుకంటే, అది Nuxvomica పేషంటు! కృష్ణుణ్ణి చూడంగానే బోల్డు వచ్చేస్తుంది లోపల నుంచి. అసలు కృష్ణుడ్ని చూస్తే చాలు వచ్చేస్తుంది తారాజువ్వ వల్లే. అందుకని, అక్కడ ఒక్కొక్కటి ఒక్కొక్కటి వేస్తుంటే, కృష్ణుడు లెక్క పెడ్తూ ఉంటాడు. తొంభై తొమ్మిది అవ్వంగానే పంపించేస్తాడు. పంపించేస్తే, ఆ జ్యోతి తనలోకి వచ్చేస్తుంది. తన సేవకుడే కదా! అలాంటి వాడు శిశుపాలుడు.

మరి శిశుపాలుడితో సావాసం రుక్మికి. అందుకని వాడు మాట్లాడేవన్నీ వీడికి నచ్చుతాయి. ఎందుకంటే, జయవిజయులు వాళ్ళు. రావణకుంభకర్ణులు, హిరణ్యాక్షహిరణ్యకశిపులు ఎంతటి వాళ్ళు? వాళ్ళు మాట్లాడితే వశీకరణ శక్తి ఉంటుంది. పక్కవాడు easy గా నమ్మేయాల్సిందే! వాడు మాటిమాటిగా చిన్నప్పటి నుంచి కృష్ణుని గురించి ఇలా బోధ చేస్తూ ఉంటాడు. వాళ్ళతో కూడి ఉండటం చేత ఈయన కృష్ణునికి ఇవ్వను అంటాడు. మనమంతా కుడా ఒక సద్గురువు సమాస్రయంలో ఏదో సత్సాధన మొదలు పెడితే... అసలు మనమే లోపల అంతంత మాత్రంగా ఉంటాం. దానికితోడు మనకి సాంగత్యం బాగా లేదనుకోండి. రుక్మి అంటే మనస్సేగా? సాంగత్యం బాగా లేదనుకోండి, బాగా లేకపోతే ఏం జరుగుతుందంటే, దీని నుంచి దూరమైపోతాం, దానికి మనమే అడ్డయి పోతాం. చిన్నప్పుడు metropolis వెళ్ళి మూడు నాలుగు రోజులు పని చేసుకొస్తే, విశాఖపట్నం రాంగానే, వస్తూ ఉంటేనే ఏదో చాలా చేసెయ్యాలనే అనే భావన విపరీతంగా వస్తూ ఉండేది. ఒక్క మూడు రోజులు అవ్వంగానే పోయేది. ఎందుకంటే, మనకి సహజంగా ఆ భావన లేదు. మళ్ళీ వెళ్తే, మళ్ళీ వస్తూ ఉంటుంది. ఏమిటిది అంటే, మహానగరంలో విపరీతమైన రజస్సు. ఎందుకంటే, అందరూ తుర్రు బుర్రు అని తెగ తిరుగుతూ ఉంటారు, ఏవేవో చేసేస్తూ ఉంటారు, హడావిడిగా ఉంటారు, పొద్దున్నే పరిగెడ్తూ ఉంటారు, రాత్రి వరకు చేస్తూ ఉంటారు. ఇవన్నీ చూస్తే మనం కూడా అట్లా ఉండాలేమో అనిపిస్తుంది. రజోగుణ సంపత్తి ఉండేవాళ్ళతో చేరామనుకోండి, మనలో రజస్సు పెరుగుతుంది, తమోగుణ సంపత్తి ఉండేవాళ్ళతో చేరామనుకోండి, మనలో తమస్సు పెరుగుతుంది. ఏం చేయక్కర్లేదు, పొద్దున్నే లేవక్కర్లేదు, ప్రార్థన ఆరింటికే చెయ్యక్కర్లేదు, పూజ అసలే చెయ్యక్కర్లేదు, స్నానం చెయ్యక్కర్లేదు, ఇట్లా అన్ని టక టక వచ్చేస్తాయి.

నీలో జీవ సంస్కారంలో దైవమును చేరాలనే భావన ఉన్నా, ఆ భావన ఈ సాంగత్యదోషం చేత నీలో ఉండేటువంటి అహంకార పురుషుడు నీకే అడ్డుపడ్తాడు. అంటే, నువ్వే నీకు అడ్డు పడతావు. అదే చెప్తాడు కృష్ణుడు ఆరో అధ్యాయంలో: ఆత్మకి ఆత్మకి శత్రువు, ఆత్మకి ఆత్మ మిత్రుడు, ఆత్మ చేత ఆత్మ ఉద్ధరించుకోవచ్చు, ఆత్మ చేత ఆత్మ పతనం చేసుకోవచ్చు. అదేంటి ఇన్ని ఆత్మలు ఉన్నాయా మనలో అంటే, బహుపాత్రాభినయం మనది. చిత్తంలో ఉంటాం, అహంకారంలో ఉంటాం, బుద్ధిలో ఉంటాం – మూడు చోట్ల ఉంటాం మనం. నాలుగవ వాసుదేవుడి సంగతి దేవుడెరుగు! సంకర్షణుడు, అహంకారపురుషుడు. ప్రద్యుమ్నుడు, ఏదో కాస్తో కూస్తో ఇంతుంటుంది కదా బుద్ధి, అది పిల్లి బుర్ర అంటూఉంటాం కదా! ఇంతైనా ఉంటుంది కదా మనిషి అన్న తర్వాత బుద్ధి. Zero watt bulb లాగా వెలుగుతూ ఉంటుంది. అప్పుడప్పుడు ఎప్పుడో ఒకసారి, "అపుడో ఇపుడో ఎపుడో" అంటూ ఉంటాంగదా! అపుడో, ఇపుడో, ఎపుడో ఒకసారి బుద్ధి వెలుగుతూ ఉంటుంది మనకి కదా! అప్పుడు మనం ప్రద్యుమ్నుడు. ఈ ఇంద్రియాల్లో పట్టుకొని అట్లా ప్రపంచంలో అట్లా తిరిగేస్తూ ఉంటాం కదా! గ్రామసింహాల్లాగా అప్పుడు చిత్తంలో ఉన్నప్పుడు అనిరుద్ధుడు. తిరుగుడే కదా మనకి. తిరుగులేని తిరుగుడు తిరుగుతూ ఉంటాం! ఇలా మూడుగా ఉంటాం మనం. జీవుడు అప్పుడప్పుడు కొంచెం పోనీ ఏదన్న దేవుడ్ని చేరదాం అనిపిస్తే, "ఛీ నోర్ముయ్" అని చెప్తాయి మిగతావి. సాయంత్రం ప్రేయర్ చేసుకుందాం అంటే, ఫస్ట్ షో సినిమా ఎప్పుడు ప్రేయర్ time కే ఉంటుంది కదా! ఫస్ట్ షోనా, ప్రేయరా చెప్పండి? ప్రేయరు ఎప్పుడూ ఉండేదే అని logic చెప్తాడు పక్కనుంచి. ప్రేయర్ ఎప్పుడు ఉండేదే, సినిమా వుండదు కదా అంటాడు! అంటే సినిమా ఎప్పుడు ఉండదా? ఇది కాకపోతే ఇంకోటి ఉంటుంది. ఆ ప్రేయరు ఎప్పుడు ఉండేదే! నిజమే అనిపిస్తుంది. అట్లా వీడు రుక్మిగాడు పక్కన చేరి పాడు చేసేస్తూ ఉంటాడండి. సీనియర్ సాధకులని ఉంటారు. వారు సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకి పది నిమిషాలు పావుగంట ముందు బయటకు వెళ్లి పోతారు. అంతవరకు కూర్చున్న వాళ్ళే, అప్పుడెళ్ళి పోతారు, ప్రేయర్ చెయ్యాల్సి వస్తుందేమో అన్నట్టుగా! వాడు సీనియర్ సాధకుడు! చూస్తూ ఉంటాను. "ఏరా! ప్రేయర్ చేసుకెళ్ళచ్చు కదరా!" అని అడిగితే వాడికి ఇబ్బందిగా ఉంటుంది.

బుద్ధి, చిత్తము, అహంకారము, ఈ మూడిటిలో దేని బలం ఎక్కువగా ఉంది? వీడిట్ల అడ్డుపడిపోతే "మత్తపు షృంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై" అన్నాడు. ఇందులో రహస్యార్థమది. మన సాధనలో ప్రతి సాధకుడికి కాస్తోకూస్తో బుద్ధి వెలుగుతూ ఉంటే, ఇంద్రియ వ్యాపారములలో ఇరుకున్న చిత్తం దాన్ని ఆర్పేస్తూ ఉంటుంది. ఇంకొంచెం ఏమన్నా ఉంటే అహంకారం అణిచేస్తూ ఉంటుంది. ఈ ఇద్దరినే పురాణపురుషుడి కథలో కంసునికి, కేశి, దుర్యోధనుడుగా చెప్తూ ఉంటారు. నీ పైవాడు లంచాలు తింటాడు, నీ కింద వాడు లంచాలు తింటాడు. నువ్వు ఒక్కడివి ఏం బాగుంటావ్? నువ్వు కూడా తినెయ్! ఇది కదా ఇప్పుడు

సిద్ధాంతం. అట్లా ఉన్నా ఇబ్బంది కదా! ఊరంతా లంచాలు తింటుంటే నీవు మడి కట్టుకొని ఏం చేస్తావయ్యా? ఇబ్బందులు పడక. తినేసెయ్! అదే అరిగిపోతుంది! అట్లా బుద్ధికి బోధ చేయటానికి చిత్తం నుంచి, అలవాట్లు ఒక పక్కనుంచి బోధన చేస్తుంటాయి. అహంకారం ఒక పక్కనుంచి ఈ సాధనలో వీడు పడితే తన సౌకర్యాలన్నీ పోతాయి అని ఆపేస్తుంది. అలా కంసుడు దేవకిని ఆపినట్టు, ఈ రుక్మిగాడు ఇంట్లోనే ఉంటాడు కదా! వాడు అట్లా ఆపాడు.

> "అన్న తలంపు దా నెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
> పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
> ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁ
> డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే."

పిలిచింది ఓ సద్బ్రాహ్మణుడుని. ఆయన పేరేమిటో తెలుసా? అగ్నిద్యోతనుడు. అగ్నిద్యోతనుడు అనే బ్రాహ్మణున్ని పిలుస్తుంది. అగ్నిద్యోతనుడంటే సద్గురువు లాంటివాడు, హనుమంతుడు లాంటివాడు. జీవుడ్ని దేవుడు దగ్గరికి చేర్చేటి వంటివాడు. జీవుడు గురించి దేవుడుకి చెప్పేటువంటివాడు. వార్తలు జీవునికి చెప్పేటువంటివాడు. కట్టెలో నిప్పుంది, కట్టెలో అగ్ని ఉంది కదా! జ్వాలలో అగ్ని ఉంది. ఈ కట్టెలో ఉండే అగ్ని ఆ జ్వాలను చేరాలంటే, కట్టెలో ఉండే పదార్థం అడ్డేగా? హోమం చేస్తూ ఉంటాంగా? ఆ సమిధల్లో అగ్ని ఉందండి. "సమిధాధానం కరిష్యే" అంటాము. అధానము చేయటం. అందులో అగ్ని ఉంది. ఆ అగ్ని తన మూలమైనటువంటి జ్వాల గురించి తపన చెందుతూ ఉంటుంది. ఎవరు గనుక ఆ జ్వాల స్పర్శ తనకిస్తే, తను అందులో చేర్తుంది కదా! ఓ జ్వాల స్పర్శ సమిధలో ఉండే అగ్ని కందిస్తే, సమిధలో ఉండే అగ్ని, ఒక్కసారి ఉద్భృతం అంతేగా! అదేగా హోమంలో చూస్తాం, అదే యోగం కూడా! తేజో సంపన్నుడైనటువంటి అగ్నిస్వరూపుడైనటువంటి జీవుడు పదార్థము నందు ఇమిడి ఉన్నాడు. సమిధి యందు ఉన్నటువంటి అగ్ని వలె ఇమిడీకృతమై ఉన్నాడు. ఈ నిమిడీకృతమైన అగ్ని జ్వాలగా మారదామని తపన చెందుతూ ఉంటుంది. అంతంత జ్వాలలు మనం పొద్దున చూసామంటే, ఎక్కడనుంచి వచ్చినాయి అవన్నీ? మనం పెట్టిన కర్పూరంలోంచి వచ్చేస్తాయి ఏంటి అన్నీ? కాదే. ఎంతసేపొస్తుంది? అలా వస్తుంది. సమిధలో ఉన్న అగ్ని అది. అది జ్వాలయై ప్రజ్వలించి... మనం అందరం అట్లా నోళ్ళు తెరిచి చూస్తూ ఉంటాం. ఓ తెగ ఫోటోలు తీసేస్తూ ఉంటాం కదా! ఎందుకు తీస్తారు కెమెరాలో ఫోటోలు? నాకు సైతం కొన్ని దేవతా మూర్తులు కనిపించినాయి అని చూపించడానికి. అది వాళ్లకి ఆనందం. కానీ ఆ జ్వాలని చూస్తేనే అనందం కదా! కట్టె పుల్లల్ని చూస్తే ఆనందమేముందండి? జ్వాలను చూస్తే ఆనందం. ఎక్కడ నుంచి వచ్చింది అది? కట్టెపుల్ల నుంచేగా? ఎవరి

వలన? ముట్టించేవాడు ఒకడు ఉండద్దు? ద్యోతనం చేసేవాడు ఒకడు ఉండద్దు అగ్నిని? వెలిగించే వాడు ఒకడు ఉండద్దు? సెనగలు నానేసుకొని తింటే బాగుంటాయి కదా! సెనగలు ఉన్నాయి, నీళ్ళున్నాయి, శెనగలు నీళ్ళల్లో వేసేవాడు ఒకడు ఉండాలి కదా! అని రాశారు మాస్టరు గారు. అలాగే సమిధలు ఉన్నాయి. జ్వాల, దానిలో ఉండే అగ్నిని ద్యోతనం చేసేటువంటి వాడు ఒకడు కావాలి. శెనగలు నీళ్ళల్లో వేశేవాడు ఒకడు ఉండాలిగా! రామాయణంలో వాడు హనుమంతుండు, అగ్నిస్వరూపుడు శివుడు కదా! వేదంలో అగ్నినే పురాణాల్లో శివుడంటారు.

అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుడ్ని పిలుస్తుంది ఆవిడ. పిలిచి ఆయనకి ఏం చెప్పిందంటే, "అన్న తలంపు దా నెఱిఁగి యన్నవనీరజ" అంటే అప్పుడే వ్యక్తమైంది కదా! కొత్తగా పద్మం. అలాంటి స్త్రీ మూర్తి "కన్యకామూర్తి, కన్యకాపరమేశ్వరి" అంటుంటాం. "యన్నవనీరజగంధి లోన నా పన్నత నొంది" మనందరికి ఆపద ఎక్కడ నుంచి వస్తుందంటే, అహంకారం. అసలు మన అహంకారం మనకి సాధనకి అడ్డుపడుతోంది అని మనకి తెలియటమంటే, ఆ బుద్ధి బాగా ప్రచోదనం చెందిన బుద్ధే కదా! ఎప్పటికప్పుడు అహంకారమే పరిపాలిస్తుంది కదండి, భక్తులము అనుకునే వాళ్ళను కూడా! రోజూ నేను దైవం దగ్గరగా ఉండాలి, అహంకారం నన్ను కమ్మేయకూడదు, అనుకునేవాళ్ళు ఎంతమంది ఉంటారండి సాధకులు? "అసలు మాకు అహంకారం ఏముందండి?" అనుకుంటూ ఉంటాడు ప్రతివాడు కదా! ఉన్నదే అదిరా అని చెప్పాలి! ఎందుకంటే, కొంచెం పొడుస్తే వచ్చేస్తుంది! చూసారా, మనం "ఏమయ్యా! ఆనపకాయ లేతేనా?" అంటే "లేతేనమ్మా! కావాలంటే చూసుకోండి." అంటాడు. ఇలా గిల్లుతాం కదా! గిల్లితే మన లేత గోరు ఊడిపోతుంది, అట్లా ఉంటుంది. కొబ్బరిపెంక్కల్లే ముదురు కదా! అందుకని ఎవర్ని ఎవ్వరు ముట్టుకోరు. మర్యాదగా ఉంటారు. ముట్టుకుంటే తేలిపోతాయి కదా!

మనకింత అహంకారం ఉందే అని నీకుగా నీవు భావించగలిగితే, అప్పటికి నువ్వు కొంచెం ఎల్. కే. జీ లోంచి మామూలు స్కూలుకి వచ్చినట్లే! మనలో మనకి అహంకారం ఉందని గుర్తుంచాలి అసలు ముందు. ఎందుకంటే, ఎవరన్నా మాటంటే పడం. ఉన్నది అంటేనే పడం. నిష్కారణంగా అంటే అసలు పడం. ఇంకా పది అంటాం. వాడు ఒకటంటే మనం పది అంటాం కదా! లేకపోతే, పది రోజులు గింజుకుంటాం కదా! అది అంతా అహంకారం. ఏదైనా అంటే పది రోజులు గింజుకున్నాడట అంటే, ఆ పదిరోజులు వాడు అహంకారేగా! అందుకని నిత్యం అహంకారంలో జీవిస్తూ ఉంటాం మనం. బుద్ధిలో జీవించేటువంటి వాడికి అహంకారం కలగాలంటే... అసలు అహంకారం ఒకటి మనకుంది, మన నిండా అదే నిండి ఉంది నిలువంతా, ఇది తగ్గాలి అన్న భావన మనలో పెరిగితే.. క్రమంగా ముందు గుర్తిస్తే, first you recognise, ఆ తరువాత అలా నెమ్మదిగా

ఆరాధన భగవంతుని దగ్గర చేరుకోవటానికి పెంచుతూను ఈ అవరోధాన్ని నాకు తీసెయ్ తండ్రి అని కోరుకోవాలి. నీలో ఉండే అహంకారమనే అవరోధాన్ని తీసేయమని కోరుకోవాలి. తను తీయలేదు. తనంతట ఏం చేయగలదు? ఎగబడి పోట్లాడలేదు కదా! కొంచెం extra గా కనిపిస్తే గదిలో పెట్టి తాళం వేసేస్తాడు అంతే! తాళం వేసేసి, రేపు పెళ్లి అంటే బయటకి తీస్తాడు, అంతేగా! ఏమిటి ఉపాయం అహంకారంలో అవసుడైపడి ఉన్నటువంటి జీవుడికి? సద్గురువు. ఆయనే ఉపాయం, ఎందుకని? అతడు అది నిర్మూలించుకున్నటువంటివాడు. అహంకారాన్ని నిర్మూలించుకొని, దైవమే తానుగా ప్రకాశిస్తున్నటువంటివాడు. కర్పూరం లాంటివాడు. అలా తగిలించగానే వచ్చేస్తుంది లోపలి నుంచి. “ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు, చూడ చూడ రుచుల జాడవేరు,” రుచులంటే వెలుగులని కూడా అర్థం. ఉప్పుని మంటలో వేస్తే చిటపట, చిటపట లాడుతుంది. కర్పూరాన్ని వేయండి, అట్లా జ్వాల వస్తుంది.

అంచేత, ఆయన్ని పిలిచింది. పిలిచి, “నా పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి”. ఎవరు ఆప్తుడంటే, నిరహంకారి అయినటువంటి ఒక సత్పురుషుడు ఆప్తుడు. ఇంకో అహంకారిని తెచ్చుకుంటే లాభం లేదు. అహంకారుల వలన పనులు పాడైపోతాయి. అందుకనే diplomats అందర్ని గూడా వాడిని తిట్టినా వాడికేం చలనం ఉండదు. అలాంటి వాళ్ళని పెట్టుకుంటూ ఉంటారు. “ఛీ! పో” అన్నా కూడా తుడిచేసుకొని వచ్చేటట్టుగా ఉంటాడు. ఆయన రాయబారి కదా! రాయబారంటే ఎవరు ఉండాలి? రాయబారిగా హనుమంతుడు ఉండాలి, లేకపోతే కృష్ణుడు ఉండాలి. చెప్పాల్సింది చెప్తాడు, ఎమన్నా అంటే పడ్తాడు, మరీ అతిగా చేస్తే చూపిస్తాడు. అట్లా ఉంటుంది కదా! “యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి” ఇది సద్గురువు యొక్క ప్రవేశం. రామాయణంలో హనుమత్ ప్రవేశం లాగా రుక్మిణి కల్యాణంలో ఈ బ్రాహ్మణుడు అలాంటి వాడే! ఎంచేత? ఈమె గుణగణాలన్నీ ఆయనకు చెప్తాడు. ఆయన ఉన్ముఖతను సంపాదిస్తాడు. ఉందిగా అక్కడ మాట తెచ్చి ఈవిడకి చెప్తాడు. హనుమంతుడదే చేస్తాడు. అక్కడికి వెళ్తాడు, రాముడు పరిస్థితిని వివరిస్తాడు, ఆమె పరిస్థితి తిరిగి వచ్చి రాముడికి వివరిస్తాడు. అనుసంధానం చేస్తాడు. సీత రాముడ్ని చేరేట్టుగా చూస్తాడు. అంతేగా! అలాగే బ్రాహ్మణుడు. నువ్వు వెళ్లి స్వామి ఈ విషయం కృష్ణునకు చెప్పమని చెప్తుంది.

“అయ్యా! కొడుకు విచారము
లయ్యయు వారింపఁజాలఁ డటు గాకుండన్
నెయ్య మెఱిఁగించి చీరుము
చయ్యన నిజ సేవకానుసారిన్ శౌరిన్.”

అయ్యా! అంటే ఎదురుగా ఉండే ఆయన. “అయ్యా! కొడుకు విచారము లయ్యయు వారింపఁజాలఁ డటు”. వాడు తండ్రి మాట వినే కొడుకు కాదు. ఆ తండ్రా ఇతడిని వారించలేడు. తేడా వస్తే ఈయన్ని జైల్లో పెట్టేస్తాడు. అలాంటి కొడుకులుంటారు కదా! నిన్నే ట్రైన్లో వస్తుంటే ఒకాయన చెప్పాడు. “పెద్దవాళ్ళం అయిపోయాం నాన్నా! ఇంక మేము ఇవన్నీ చూసుకోలేము” అని ఆయన ఆస్తిపాస్తులన్నీ కొడుకు పేరు రాసేస్తే, రెండు రోజుల్లో పంపించేసాడటండి. “తమరిక దయ చేయచ్చును” అని చెప్పాడట. వాడేం కొడుకో? దిగ్భ్రాంతి చెంది ఆయన నెల రోజుల్లో చచ్చిపోయాడట. అంటే, అలా ఉంటుందండి? నేనూ అనుకోలేదు, నిన్నే విన్నాను. ఇలా ఉన్నాయి. ఉంటారు అలాంటి వాళ్ళు. కాబట్టి ఆయన మా నాన్న మా అన్నయ్యకి ఏం చెప్పలేదు. అది పరిస్థితి. “డటు గాకుండన్ నెయ్య మెఱిఁగించి చీరుము” అది అలా ఉండగా నేను ఆయన యందు ప్రీతికొని ఉన్నాను అనేటువంటి విషయాన్ని తెలుపు ఆయనకి. “చయ్యన నిజ సేవకానుసారిన్ శౌరిన్”. తన్ని చాలా ఆరాధిస్తున్నటువంటివాళ్ళని, తన్ని ఆశ్రయించినవాళ్ళని, తన్ను కోరుకున్నవాళ్ళని అతడు తానుగా రక్షించుకుంటాడు కదా! అతడు శౌరి కదా! అతడు నిజ సేవక అనుసారి – అది కృష్ణుడు. తన్ని సేవించే వారిని తాను అనుసరిస్తాడు. ఎంతటివాడండి! అలాంటి వాళ్ళని సేవించాలి. ఎవర్ని సేవించడం చేత, వారు మనకు అనుకూలులై, మనలను కడతేరుస్తారో అలాంటి వారు సత్పురుషులు కదా! ఆయనకి వెళ్లి వెంటనే చెప్పు పరిస్థితి అని చెప్పింది రుక్మిణీదేవి.

> “అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకా
> నగరంబునకుం జని ప్రతిహారులవలనఁ దనరాక యెఱింగించి యన్నగ
> ధరుం డున్న నగరు ప్రవేశించి యందుఁ గనకాసనాసీనుం డయి యున్న
> పురుషోత్తముం గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవించిన ముసిముసి
> నగవులు నగుచు బ్రహ్మణ్యదేవుం డైన హరి తన గద్దియ దిగ్గిన డిగ్గి
> బ్రాహ్మణుఁ గూర్చుండ నియోగించి తనకు దేవతలు సేయు
> చందంబునం బూజలు చేసి సరస పదార్థసంపన్నంబైన యన్నంబుఁ
> బెట్టించి రెట్టించిన ప్రియంబున నయంబున భాసురుం డైన భూసురుం
> జేరి లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు
> మెల్లన యి ట్లనియె.”

“అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన” – తనకు కృష్ణుని గూర్చి ఉన్నటువంటి ప్రేమ విషయాన్ని కూడా ఆయనకు చెప్పిందండి. రహస్యవచనాలు చెప్పటమంటే అదే అర్థం. అందరికీ చెప్పుకోరు కదా అన్నీ విషయాలు!

అందులో ఉత్తమ కుల సంజాతి, దైవాంశ సంభూతి. తనకి ఆయన గూర్చినటువంటి భావనలు, తనకి ఆయన గూర్చినటువంటి అనుభూతులు, ఇలాంటివన్నీ కొన్ని ఆయనకి చెప్పింది.

ఆయన వెళ్లాడట. కబురుపెట్టాడట. ఆయనని ప్రసాదంలోకి, పెద్ద ఇల్లు palace లోకి తీసుకెళ్ళాడట. తీసుకెళ్ళితే, అక్కడ మంచి ఆసనం మీద కూర్చున్నాడట కృష్ణుడు. రావటం రావటం ఆశీర్వదించాడట "కళ్యాణమస్తు" అని. కళ్యాణమస్తు అని దీవించేశాడండి. అలా అంటే ఆయనకి అర్థమైపోయింది. అంతా మేధాసంపత్తి పుష్కలంగా ఉన్నవాళ్ళు కదా! "కళ్యాణమస్తు" అన్నాడండి వచ్చి బ్రాహ్మణుడు. అంటే అర్థమైంది. వచ్చినవాడు ఎక్కడ నుంచి వచ్చాడో తెలుసు కదా! చెప్తాడుగా లోపలికి వచ్చేటప్పుడే. ఇట్లా విదర్భదేశం రాజధాని కుండిననగరం నుంచి వచ్చాను, కృష్ణుని చూడడానికి వచ్చానని చెప్తాడు. అంతేగాని, అక్కడే ఆ కాపలా వుండేవాళ్ళకి అన్నీ విషయాలు చెప్పేయలేరు కదా! కృష్ణుని చూడ్డానికి వచ్చాను, ఫలానా నగరం నుంచి వచ్చాను, ఫలానా రాజ్యం నుంచి వచ్చాను, నా పేరు ఫలానా, ఆయన దర్శనం కోరి వచ్చాను ఈ మాట చెప్పండంటే వాళ్ళు లోపలికెళ్ళి చెప్పారు. లోపలికెళ్ళి చెప్తే, ఈయన రమ్మన్నాడు. అక్కడనుంచి వచ్చారంటే, మనకీ interest కదా! మనం ప్రేమిస్తున్నటువంటి అమ్మాయి ఉన్న పేటలోంచి ఒక ఆయన వచ్చాడనుకోండి, ఆ అమ్మాయి గురించి తెలిసే ఉంటుంది, పోని కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు అని పిలవచ్చుగా! ఆ రోజుల్లో అసలెవరైనా బ్రాహ్మణుడు వచ్చాడంటే పిలుస్తారుగా! ఆ రోజుల్లో బ్రాహ్మణులు అలా ఉండేవాళ్ళు, పిలిచేవాళ్ళు అలా ఉండేవాళ్ళు. ఈ రోజుల్లో బ్రాహ్మణులు అలా ఉండరు, పిలిచే వాళ్ళు కూడా అలాగే ఉండరు. ఎందుకంటే, వీడొచ్చాడంటే అన్నీ అబద్ధాలే మాట్లాడతాడు బ్రాహ్మణుడు కదా! ప్రతి రోజు పెళ్లికుమార్తె అని ఒక invitation పట్టుకొస్తాడు, వివాహం మీరు సహాయం చేయండి అని అడగడానికి. ఎన్ని సార్లు చేస్తాడు? ఎన్ని మంది పెళ్లికూతుర్లుంటారు? మొన్న ఇదే పట్టకొచ్చారు, మర్చిపోయారేమో అని చెప్తూ ఉంటాను అప్పుడప్పుడు. మొన్న ఇదే పట్టకోచ్చారు, వంద రూపాయలు ఇచ్చాను, మర్చిపోయారేమో, మళ్ళీ అదే కార్డు పట్టుకొచ్చారు, ఏంటి పెళ్లి అవ్వలేదా అని అంటే, నవ్వుతాడు వాడికీ తెలుసు, మనకీ తెలుసు. చెప్పేవన్నీ అబద్ధాలు. అలా కదా పోగొట్టుకుంటారు విలువ!

సరే ఈయన లోపలికి రాంగానే, ఆశీర్వదిస్తే ఆయన ముసిముసి నవ్వులు నవ్వేశాడటండి. కృష్ణుడు కుచేలుడొచ్చినప్పుడు ఏం చేశాడో ఈ బ్రాహ్మణుడు వచ్చినప్పుడూ అదే చేశాడు. కనుక సత్పురుషుడు వస్తే ఆసనం దిగాడు, చేయి పట్టుకున్నాడు, తీసుకొచ్చాడు కూర్చోపెట్టాడు. ఒక దేవుడ్ని ఆరాధన చేసినట్టుగా ఆరాధన చేశాడు. ఆయన కిష్టమైన పదార్థలన్నీ ఆయనకి భోజనం పెట్టాడు, దగ్గరికి చేరాడు. కాళ్ళు వత్తుతున్నాడు. వత్తుతూ నెమ్మదిగా పలికాడట. అంటే, ఈ పెళ్ళనే కాదు, మాములుగా ఏ బ్రాహ్మణుడు వచ్చినా అదే చేస్తాడు కృష్ణుడు.

సద్బ్రాహ్మణుడు వస్తే తానేం చేస్తాడో చెప్తాడు ఇప్పుడు కృష్ణుడు. బ్రాహ్మణుడు సద్బ్రాహ్మణుడైతే అతను ఏ విధంగా నిర్వర్తిస్తాడో ఇప్పుడు చెప్తాడు.

> "జగతీసురేశ్వర! సంతోషచిత్తుండ
> వైయున్న నీ ధర్మ మతిసులభము
> వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ
> బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
> తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు
> గోరిక లతనికిఁ గురియుచుండు
> సంతోషి గాఁ డేని శుక్రుఁ డైన నశించు
> నిర్ధనుండైనను నిద్రవోవు"

"జగతీసురేశ్వర" – జగతికి, సూరులకు ఈశ్వరుడు. బ్రహ్మమును ఎరిగినటువంటి వాడు బ్రాహ్మణుడు. బ్రహ్మమును ఎరిగినవాడు బ్రహ్మమే కదా! అంచేత, ఈయన జగతికి, దేవతలకు కూడా పూజనీయుడు. ఈయన రావటం రావటమే సంతోషంగా లోపలికొచ్చాడు. అంటే, ఏడుపు మొహం పెట్టుకురాలేదు. అడుక్కుతింటానికి రాలేదు అనేటువంటిది ముఖంలోనే కనిపించింది కదా! అంతే కాదు, గదిలో ప్రవేశించంగానే అలా కృష్ణుడు కూర్చుని ఉంటే ఇలా ఆశీర్వదించాడట. అంటే, వాడికేమి అక్కర్లేదుగా! "ప్రభో! పాహిమాం, పాహిమాం" అంటూ రాలేదు కదా! అలా రాకుండా, ఇలా ఆశీర్వదించాడండి – "కళ్యాణమస్తు. పెండ్లి కొడుకువు కమ్మ" అని ఆశీర్వదించాడంటే... అంటే, వచ్చిన విధానం stature, ఆ ఠీవి. అర్థమైపోయింది. ఏం అర్థమైపోయింది? ఈయన మన దగ్గర ఏదో కోరడానికి రాలేదు అని అర్థమైపోయింది. కోరడానికి వచ్చేవాళ్ళు ఒక రకంగా వస్తారు కదా! మంచి వార్త తీసుకొచ్చేవాళ్ళు ఇంకోరకంగా నడిచివస్తారు. దుర్వార్త తీసుకొచ్చేవాళ్ళు మరొక రకంగా నడిచి వస్తారు. నడకలోనే ఉంటుంది. అందుకని, ఏమంటున్నాడు, "సంతోషచిత్తుండ వైయున్న నీ ధర్మ మతిసులభము". నీ ధర్మం నాకు అర్థమైపోయింది. నువ్వు సంతోషివి ఈయనకు ఏమీ అక్కర్లేదు, వచ్చింది నా కోసం. పెద్దవాళ్ళ దగ్గరికి కేవలం దర్శనం కోసం, ఇతరమైనటువంటి అర్థ కామాలు లేక రావటమనేటువంటిది వాడికి చాలా సంతోషం కలిగిస్తుంది. ఏం ఎలా వచ్చారంటే, కేవలం మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను అంటే సంతోషం కదా! పైగా రాజు. అతని దగ్గరికి వచ్చేవాళ్ళందరూ అవి ఇవి అడగడానికేగా వస్తారు. "సంతోషచిత్తుండ వైయున్న నీ ధర్మ మతిసులభము". సంతోషి మూడు లోకాల్లోను పూజ్యుడే అని చెప్తాడు రామావతారంలో. "సంతోషికాకుంట సంసార హేతువ్". సంతుష్టుడు ఈ మూడు జగములకి పూజ్యుండు.

సంతోషికెప్పుడు కలుగు శుభము" అని వామనుడు బలిచక్రవర్తికి చెప్పాడు. నాకేం అక్కర్లేదు, ఊరికే వచ్చాను. ఏదో నువ్వు అందరికి ఇస్తున్నావని తెలిసి చూసిపోదామని వచ్చానంటాడు కదా! చూసిపోవడానికి వచ్చేవాళ్ళు తక్కువ మంది ఉంటారు. ఇవ్వడం కృష్ణునికి అలవాటు. ఆసనం మీద అందుకే కూర్చుంటాడు. కృష్ణుడి సభ పేరు సుధర్మ. అద్భుతమైన సభ అది. అందులో కనక సింహాసనాసీనుం డయి ఉన్నాడు. అప్పుడు వెళ్ళాడు ఈ బ్రాహ్మణుడు. ఏం అడగలేదు, ఆశీర్వదించాడు. "వృద్ధసమ్మత మిది". వృద్ధులంటే తెలివిలో బాగా పండినటువంటి వాళ్ళు. తెలివంటే పిచ్చి తెలివి కాదు, దైవమును గూర్చిన తెలివి.

"వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు". నిజమైన బ్రాహ్మణుడు ఎవరట అంటే, ఏం దొరికితే దాంతో సంతోషించి బతుకుతాటాడండి. ఈ గుణం ఎవరికుంటే వాళ్ళకు బ్రాహ్మణ గుణం ఉన్నట్టే! "యదృచ్ఛాలాభ సంతుష్టో" అంటాడు కృష్ణుడు. కోలాటమాడే వాళ్ళు ఆ మాట అంటానికి ఎంత దర్జాగో అన్నాడో? దేనికి ఆసింపము, దొరికిన దాంతో సంతోషబడుదుము, తృప్తిపడుదుము అని. టక్కు టక్కున కొట్టారు కదా! జీవితం అంటే అలా ఉండాలి తప్ప, బొచ్చపట్టుక్కుని అడుక్కుని, ప్రపంచమంతా తిరుగుతూ, ప్రతి చోట వేయించుకుంటూ, అటు ఇటూ తిరేగేవాళ్ళు ఉంటారు. ఎంత తిన్నా చాలక, దేశాల్ని తినేసి, రాష్ట్రాల్ని తినేసి, భూమిని తినేసి, పొలాల్ని తినేసి, ఇల్లు తినేసి, ఎంత తింటే ఏముంటుంది దరిద్రులకి? కోలాటం వాళ్ళ గురించి వాళ్ళ గురించి పేపర్లో.

"బ్రాహ్మణుండు తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు". ఎవడు బ్రాహ్మణుడు? తన ధర్మమునందంటే, బ్రహ్మమునందే ఉంటాడు. లావాదేవీలు, కోర్టు కేసులు, లిటికేషన్లు, ఈ గొడవలుండే బ్రాహ్మణులు ఎంతమందుంటారండి? చాలా మందుంటారు కదా! ఆశ్రమాలే అట్లా ఉన్నాయి కొన్ని కొన్ని. కుర్తాళం ఆశ్రమానికి పిఠాపతిగా ఎప్పుడు లాయర్నే పెట్టుకుంటారు తెలుసా! ఈ మధ్యే మార్చారు. ఎప్పుడూ లాయరే పీఠాధిపతి. అదేమిటంటే, "బోల్డు లిటికేషన్సు ఉన్నాయి సార్. ఎవడు చూస్తాడు?" కుర్తాళం పీఠం, అగస్త్య పీఠం అది. అగస్త్యుడికి లావాదేవీలేంటి? అంచేత ఇలా ఉంటాడట. "తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు గోరిక లతనికిఁ గురియుచుండు". వాడికి కావాలసిన వన్నీ జరిగిపోతూ ఉంటాయి. కొంతమందికి జీవితం జరిగిపోతూ ఉంటుంది. వాళ్ళు వెత్తుకోరు దేనికీ. కొంతమంది వెత్తుకుంటూ, అడుక్కుంటూ బతుకుతూ ఉంటారు. "సంతోషి గాఁ డేని శుక్రుఁ డైన నశించు నిర్ధనుండైనను నిద్రబోవు". అలాంటి బ్రాహ్మణుని యొక్క కోపం రుచి చూసినటువంటి వాడు ఇంద్రుడైన పడిపోతాడు. ఎన్ని కథల్లేవు? నీలాంటి బ్రాహ్మణుడు సంతోషించకపోతే, ఎవరి వలన నీకు సంతోషం కలగలేదో, వారు నశిస్తారు. అందుకే కదా, దుర్వాసు డొస్తాడంటే గజగజ లాడి పోతుంటారు అందరు, వారి బాబోయ్ అని! ఎందుకంటే, అందులోనే తిరుగుతూ ఉంటాడు.

అప్పుడప్పుడు పదేస్తూ ఉంటాడు అందరికీ! కానీ ఏం చేసినా, అది జగత్ కల్యాణంగా ఉంటూ ఉంటుంది, శివాంస సంభూతుడు.

"సంతోషి గాఁ డేని శుక్రుఁ డైన నశించు నిర్ధనుండైనను నిద్రవోవు సంతసించెనేని". నిజమైన బ్రాహ్మణునకు అది లేదే, ఇది లేదే అని ఉండదు. బ్రహ్మములో ఉండేవాడికి లేకపోవడమేమిటి? ఇలాంటి వాళ్లైనటువంటి వాళ్ళు బ్రాహ్మణులంటే.

"సంతసించనేని సర్వభూత సుహృత్త
ములకుఁ బ్రాప్తలాభ ముదితమాన
సులకు శాంతులకును సుజనులకును గర్వ
హీనులకును వినతు లే నొనర్తు."

అలాంటి వాళ్ళ కాళ్ళు పట్టుకుంటాడు కృష్ణుడు. ప్రతి వాడి కాళ్ళు పట్టుకోడు సుమా! కాళ్ళు పట్టుకుని వత్తుతూ, ఈ మాట చెప్పాడండి ఆయన:

"ఎవ్వనిదేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు వాఁడు మత్ప్రియుం
డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య! నీవు లే
నవ్వులు గావు నీతలఁపునం గలమే లొనరింతు ధీమణీ!"

అప్పుడు అడిగాడు, "ఏ దేశం నుంచి వచ్చారు? ఏ పని మీద వచ్చారు? ఏం చేస్తారు? మీకు ఎవరి వల్ల మేలు కలుగుతుందో చెప్పండి. మీరు ఏ రాజ్యంలో ఉన్నారో ఆ రాజు నాకిష్టుడు" అని చెప్తున్నాడు. నువ్వే రాజ్యంలో ఉంటే ఆ రాజు నా కిష్టుడు. నీ బోటి వాడు అలాంటి రాజ్యంలో ఉన్నాడంటే, ఆ రాజు అర్హత కలిగి ఉన్నాడన్నమాట. కాబట్టి ఆయనకేమన్నా ఆపద ఉంటే చెప్పు, చేసిపెడ్తాను. అలా ఉంటుంది పన్నా. ఆయన కోసం రాలేదని తెలిసిపోయింది కదా! "ఈ సముద్ర మధ్యము నందు ప్రవేశింప శఖ్యము కాని పట్టణమునకు ఏల వచ్చితిరి?" అని అడిగాడు. ద్వారకా నగరం ఎక్కడుంది? ఆయన సముద్రంలో కట్టుకున్నాడు. "ఇక్కడకొచ్చి నన్ను కలవాల్సిన అవసరం మీకేమొచ్చింది? చెప్పండి" అని అడిగాడు.

"అని ఇట్లు లీలాగృహీతశరీరుం డైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ
సురవరుం డతనికి సవినయంబుగా ని ట్లనియె. దేవా! విదర్భదేశాధీశ్వరుం

డైన భీష్మకుం డను రాజు గలం డా రాజు కూఁతురు రుక్మిణి యను
కన్యకామణి గల దయ్యిందువందన నీకుం గైంకర్యము సేయం గోరి
వివాహమంగళ ప్రశస్తం బయిన యొక్క సందేశంబు విన్నవింపు మని
పుత్తెంచె నవధరింపుము.”

“లీలాగృహీతశరీరుం” – కృష్ణుడు లీలకి ధరించాడు శరీరం. కృష్ణుడు అడిగితే, ఆయన సూటిగా చెప్పేసాడు. మరి వచ్చిన వాడు నిప్పు కదా! ఎంత సూటిగా చెప్పాడు!

“ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
దేహతాపంబులు తీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
కఖిలార్థంబు కలుగుచుండు
నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో
న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ
దడవిన బంధసంతతులు వాయు.”

ఏమిటి రుక్మిణీదేవి సందేశం? “ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు తీఱిపోవు”. ఇది నా పరిస్థితి. నిన్ను చూడడానికి నా కన్నులున్నాయి అని చెప్పింది. అన్ని అఖిలమైనటువంటి అర్థములు చేకూరినట్టే నిన్ను చూస్తే. నీ పాద సేవ చేసుకుంటే మొత్తం సృష్టికంతటికీ కూడా పొందినంత ఆనందం. భగవంతుని చరణసేవ.. అంటే భగవంతుడు అని కదా ఆమె దృష్టి! కృష్ణుడంతటి వాడని తాను గమనించి, గ్రహించి తానెలాంటి ఆరాధన చేసి తన కోసం జీవిస్తుందో, సందేశం పంపించిందండి. మరి ఈ పద్యాలు మనం బట్టీ పట్టద్దు! ఎప్పుడో తొమ్మిదో క్లాసులో చదువుకున్నాము ఈ పద్యాలు. అది ఇలాంటి పద్యం ఒకటి ఉన్నదని తెలియదు కదా మనకి! నీ నామంతో తలుచుకుంటే... “అలక్ నిరంజన్” అంటారు చూశారా! ఏమీ ఒక్క బంధము కూడా ఉండదు. కేవలం నీ నామంతో, “కిమ్మిన్ నాస్తి” అంటారు చూశారా! “Nil, None, Not level” అంటాం కదా! Style గా అంటాం మనం! భక్తిగా అంటామా, పాడా! ఆవిడ ఆ మాట భక్తిగా అన్నది. ఎందుకంటే, అట్లా రుచి చూస్తుంది రోజూ. “కృష్ణా” అనుకుంటే ఏ విధమైన బాధ లేదు, ఏదీ బంధమున్నట్టు

అనిపించదటండి. ఆయన్ని తలుచుకుని, చరణ సేవ చేస్తున్నట్టుగా, పాదసేవ చేస్తున్నట్టుగా భావిస్తుంటే మొత్తం భువనం అంతా గూడా దాని మీద ఒక ఆధిపత్యం, ఉన్నతత్త్వం. ఇలా పలికిందండి ఆవిడ:

"నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీచిత్తచోర!"

నమ్మి ఉన్నది కాదు, నచ్చి ఉంది. చిత్తము "నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది నీయాన నాన లేదు". ఇంకో మార్గం లేదు. ఇంకో గతి లేదు. వచ్చే సంవత్సరానికి బట్టీ కొట్టుకురండి! నేను కూడా చూడకుండా చదువుతానులెండి! ఇలాంటి పద్యం ఒకటి చదువుకుంటే, లోపల కృష్ణుడు మూర్తిని దర్శిస్తూ, ఎంత శమము కలుగుతుందో తెలుసా! ఉపశమనం అంటామే. అలాంటి ఓ దివ్యమంగళమైనటువంటి ఓ రూపాన్ని లోపల దర్శనం చేసి, అట్లా చూస్తుంటే ఎలాంటి భావం రావాలో కూడా తెలీదు కదా! ఇలాంటి భావాలు వస్తాయి నిజంగా ఉన్నతోన్నతమైనటువంటి భక్తిలో ఉండేటువంటి వారికి. ఎంత బాగుంటుందండి పద్యం! చెవుల పరిస్థితేమిటి? కన్నుల పరిస్థితేమిటి? చరణ సేవ చేస్తే పరిస్థితేమిటి? నామస్మరణం వల్ల ఏం జరుగుతుంది? దాని వలన తన చిత్తం ఏ విధంగా అంకితమైపోయిందో! ఇంకింతకన్నా ఇంకేం లేదు. ఒకటి నచ్చితే, ఇంకోటి మళ్ళీ నచ్చడం అనేది ఉండదు కదా! పరిపూర్ణంగా ఒక దాని యందు నచ్చుట అనేటువంటిది జరిగితే ఇంక ఆ చిత్తం ఎటూ పోదు. "నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది నీయాన నాన లేదు"

"కరుణఁ జూడుము కంసారి!" – కంసుడిని వధించావు కదా! "ఖలవిదారి!" – ఖలులుని సంహరిస్తావు. "శ్రీయుతాకార!" శ్రీయుతమైనటువంటి ఆకారం కృష్ణునిది. అంటే, పరమ శుభంకరమైనటువంటి మూర్తి అది. అంతకన్నా అందమైన మూర్తి అంతకుముందు లేదని ఋషులు వర్ణించారు. ఇంతకు ముందు కూడా ఉండదేమో అని వాళ్ళు ఒక అనుమానం కూడా వ్యక్తం చేశారు. అలాంటి మూర్తి కృష్ణమూర్తి. కృష్ణమూర్తి అంటే అలా అనిపిస్తుంది. కృష్ణమూర్తి గారు, బెజవాడ గణపతి కదా! "శ్రీయుతాకార! మానినీచిత్తచోర!". ఎవరి మనస్సు నిర్మలము, శుద్ధము, సౌందర్యము, సున్నితము, సుకుమారము అయి ఉంటుందో అలాంటి వారందరూ కూడా మానినిలే! ఆ చిత్తాన్నన్నిటినీ కూడా ఆయన హరిస్తాడు. మానిని చిత్తచోరుడు శ్రీకృష్ణుడు. తనకి అర్పణ చేసినటువంటి చిత్తాన్ని, తాను చక్కగా హరించేటువంటి ఒక గుణం కలిగినటువంటి వాడు శ్రీకృష్ణుడు అయి

ఉండడటం చేత, నా పరిస్థితి ఇది. నేను ఈ విధంగా నీ యందు మరులు కొని ఉన్నాను, నచ్చి ఉన్నాను అని చెప్పి ఒక భావన వ్యక్తం చేసింది.

> "ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యా రూప తారుణ్య సౌ
> జన్య శ్రీ బల దాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే
> కన్యల్ గోరరు కోరదే మును రమా కాంతాలలామంబు రా
> జన్యానేకప సింహ నావలననే జన్మించనే మోహముల్."

ఇప్పుడు నేను ఈ విధంగానే నేను కోరుకుంటున్నానంటే, ఆ! దానికేముందిలే చాలామంది కోరుకుంటారు, అని ఇది నాకు తెలుసు అని చెప్పింది రుక్మిణీదేవి. ఇన్ని గుణాలున్న వాడిని నిన్ను ఏ కన్యలు కోరరు? అందరూ కోరతారు. ఎన్ని గుణాలు చెప్పింది? ధన్యుడువు నువ్వు. లోకమనోభి రాముడివి. లోకాల్నే మోహింప చేసేటువంటి వాడివి కదా! కులమా, ఉన్నత కులం. విద్యాయా, చతుష్షష్టి విద్యలు పరిపూర్ణంగా తెలిసినటువంటివాడు. రూపమా, వర్ణింపరానటువంటి అంత అందమైన రూపం. వయస్సా, ఇప్పుడే ఇంక కదా! సౌజన్యమా, చాలా సౌజన్యుడు శ్రీ కృష్ణుడు. ఎంత సౌజన్యుడో అంత కఠినుడు కూడా శ్రీకృష్ణుడు. బలము ఎలాంటి బలం? చిటికిన వేలు మీద కొండను నిలబెట్టిన బలం కదా! బలమొక్కటేనా, "శ్రీ బలము". అంటే సరస్వతి, లక్ష్మి, దుర్గ మూడు బలాలు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తి బలమంతా ఉంది. దానము, రాజ్యం జయించి తను తీసుకోలేదు కదండి. "తాతా! నువ్వేలుకో" అని ఇచ్చేసాడు. ద్వారకా నగరానికి నిజానికి స్వామి కృష్ణుడే. కానీ, ఆసనం మీద ఇంకొకడిని కూర్చో పెడ్తాడు కదా! తను కూర్చోడు. అతడు రాజు కాని రాజు. రాముడు సింహాసనం ఎక్కుతాడు. కృష్ణుడు రాజసింహాసనం ఎక్కడు. "మనకేలా?" అంటాడు. అవసరమైతే ఉందాం. ఎప్పుడూ రాజ్యపాలన గురించి కాంక్షించిన వాడు కాదు. ఎన్నెన్ని సామ్రాజ్యాలు జయించాడో, ఎవర్నో కూర్చో పెడతాడు. అంతే దాని మీద! అది కృష్ణుడు. తన తండ్రి వసుదేవుడు రాజ్యం వదిలేసి ప్రజలతో ఉన్నాడు కదా! తనకెందుకు రాజ్యం? జీవుల హృదయములే ఆయన పరిపాలించచే రాజ్యం. కృష్ణుని రాజ్యం మట్టి, ఇటుక, భవనాలు, కోశాగారాలు ఇవి కావు. మనుషులు అతని రాజ్యం. మనుషుల హృదయాల్లో ఉండి, మనుషుల్ని ఏలుకునేటువంటివాడికి ఇంక రాజ్యాలెందుకండి? వాళ్ళవన్నీ ఈయనవేగా! "నా వన్నీ ఇంక నీవేలే అనేస్తుంటారు" మరి అంతేగా. అలా అని వాళ్ళని కోరతాడా? కోరడు. వాళ్ళకే ఇస్తాడు. ఎవర్నీ ఏమీ కోరడుగా? అందరికి అన్నీ ఇవ్వటానికే. అందరి హృదయాలు పరిపాలిస్తాడు. అదే అంటాడు ఏసు కూడా. "నువ్వు రాజాదిరాజువటకదా?" అని అడుగుతాడు రోమన్ సైన్యాధికారి. అవునంటాడు. "ఏదీ నీ రాజ్యం?" అంటాడు. ఇది మట్టితో కూడిన రాజ్యం కాదు, భూమి కాదంటాడు. It is not of earth. ఇది భూమి కాదు నా రాజ్యం

అంటాడు. అయితే ఏమిటి అని ఆయన అడగదు, ఈయనా చెప్పాడు చెప్పదు. భూమి కాకపోతే చాలు ఆయనకి. రోమన్ వారు అందరి భూములన్నీ ఆక్రమించారు. అన్నీ రాజ్యాలవి. అది కాకపోతే, ఇంక ఆయనకి ఏ ఇబ్బంది అనిపించదు. ఏమిటాయన రాజ్యం? జీవుల హృదయమే ఆయన రాజ్యం. వాటికాయన రాజు. ఈ రోజు మానవ జాతిలో ఎనభై శాతం మంది ఆయన సేవకులే కదా! అది దివ్యతత్త్వమది. అలాంటిదే కృష్ణ తత్త్వం.

కృష్ణుడు సౌజన్య మూర్తి, అమితమైన శౌర్యము, కరుణ. ఒకటుండి ఒకటి లేకపోవడం కాదు. ఇటువంటి వాడితో శోభిస్తుంటావు కదా నువ్వు! "నిన్ను నే కన్యల్ గోరరు". అసలు ఒక కన్య పెళ్లి చేసుకుందామంటే ఒక మోడల్ ఏమిటంటే అదే! It is an ideal model. అందరికీ దొరకదుగాని, మనకర్హత ఉండోద్దు అనుకుంటారంతే కదా! అర్హతని బట్టి కదా దొరుకుతాయి! ఆశ్సిసులు దొరుకుతాయా? దొరకవవు. ఎవరు ఎవరికి ఏ విధంగా లభ్యమయ్యారంటే, వారి వారికి అదే ప్రాప్తం అని అర్థం చేసుకోవాలి. అంతే కదా! ఇంకొంచెం ప్రాప్తించాలంటే ఇంకొంచెం సంస్కారాలు పెంచుకుంటూ ఉండాలి. ఈ జన్మకింతే, ఈ మొగుడే అనుకోటమే! పై జన్మకి better luck! Viceversa కదా! సంస్కారములు బట్టి.

నిన్ను కోరుకోని వాళ్ళు ఎవ్వరు ఉండరు అని చెప్తాడు. మొగవాళ్ళే కోరుకుంటారు ఆయన్ని. మొగవాళ్ళే ఆడవాళ్ళై పోతుంటారు ఆయన దగ్గర కదా! అందుకని ఆ సంగతి నాకు తెలుసిందని చెప్పిందావిడ రుక్మిణీదేవి. నిన్నే కోరడం వింతేం కాదులే, అది సహజమే అని! "మును రమా కాంతాలలామంబు రా జన్యానేకప సింహ నావలననే జన్మించనే మోహముల్". నిన్ను ఏ కన్య కోరదు? లక్ష్మీదేవే నిన్ను కోరుకొని వచ్చి నిన్ను చేరింది కదా! నువ్వు ఈ రాజుల మధ్య ఒక సింహం లాంటివాడివి. నీ యందు నాకు మోహం కలగటంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు అని చెప్పింది.

"శ్రీయుతమూర్తి యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్".

శ్రీయుతమూర్తి అయినటువంటి మూర్తి కలిగినటువంటివాడు. "పురుషసింహమ! సింహము పాలి సొమ్ము?" నేను సింహము పాలి సొమ్ము. నన్ను వాడు కోరుకుంటున్నాడు. "గోమాయువు" అంటే నక్క. టాకా తాత్పర్యము book తెచ్చుకున్నాడండి! నాకు అంత తెలుగు రాదు, మీలాంటి వాడినే! కాకపోతే, భక్తి భావం చేత చెప్తూ ఉంటాను అంతే. సింహం సొమ్మును నక్క కోరుకుంటే ఎట్లా ఉంటుందండి? "సింహము పాలి సొమ్ము గో

మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు". వాడు బాగా మత్తెక్కి ఉన్నాడు. వాడికి ఉచ్చం, నీచం విషయం తెలియదు. ప్రతీది కోరుకుంటూ ఉంటాడు. నా సంగతి వాడికి తెలియదు. నేను నీ సొమ్ముని. ఎవరు ఎవరి సొమ్మో తెలియకుండా ప్రతీది ముట్టుకోకూడదు కదా! ద్రౌపతి స్వయంవరానికి కృష్ణుడు కూడా వెళ్తాడు స్నేహితులుతో. ఎవరూ కొట్టలేకపోతారు. గురువు అడుగుతాడు "నువ్వు కొట్ట లేవా అది?" అని. అప్పుడు కృష్ణుడు చెప్తాడు "మనం ఇక్కడ చూడ్డానికి వచ్చాను. ఏమన్నా తేడాలు పడితే సర్దవలసి ఉంటుంది.". తేడా పడ్తుంది, సర్దుతాడు. ఎవరు ఎవరి సొమ్మో కదా! అన్నిటికీ ఆశ పడకూడదు. తక్కువ సంస్కారం ఉన్నటివంటివాడు ఎక్కువ సంస్కారం ఉండేటువంటి స్త్రీకి ఆశ పడడం మూర్ఖత్వం. బలవంతం చేయటం మరీ మూర్ఖత్వం, పశుత్వం. అంటే, తక్కువ సంస్కారం ఉండే వాడిని, ఒక ఎక్కువ సంస్కారం ఉండే స్త్రీ మోహించదు. మోహించిందిట అంటే దాని సంస్కారం కూడా అంతే ఉంటుంది. ఏం సందేహం లేదు. సంస్కారాలు సమంగా సమతూకంగా సరిపోతేనే ఒకరి యందు ఒకరికి మోహం కలుగుతూ ఉంటుంది. "ఇలా అయిందేంటండి? అలా అయిందేటండి?" అంటే అది అంతే!

వీడు "యధమాధముండు" అంటోంది రుక్మిణి. అధములలో అధముడు. నీ ప్రతాపం తెలియక, ఏమిటేమిటో వాగుతున్నాడు ఇక్కడ చేరి. ఇంట్లో చేరాడు. అన్నయ్య friend కదా! వెకిలి వేషాలన్నీ వేస్తూ ఉంటాలి ఇంట చేరి కదా! ఈవిడకి ఛీ అని అనిపించేట్టుగా ఉండి ఉండాలి కదా! ఒక సంస్కారవంతమైనటువంటి ఒక కన్యను ఏ సంస్కారం లేనివాడు, వెకిలిగా చూస్తూ, వెకిలిగా నవ్వుతూ, వెకిలిగా కన్నుకొడ్తూ, ఆ మాటంటూ, ఈ మాటంటూ ఉంటే, ఏమి మాట్లాడకుండా, వీడొక నీచుడు అనుకుంటుంది. అంతేకదా! అంతేగాని, వాడి జోలికి పోదు. ఎందుకంటే, "అశుద్ధము మీద రాయేస్తే నా మొహం మీదే చిందుతుందని" సామెత కదా! ఉన్నాడు, పైగా అన్నయ్య friend. వాడొక అన్నయ్య, ఏం చేస్తుంది చెప్పండి? అట్లా ఒకడు తగలడ్డాడు ఇక్కడ. వాడు నాకోసం ఆశ పడుతున్నాడు. వాడొక నక్కలాంటి వాడు. నువ్వు సింహం లాంటివాడివి. అంచేత, నీకు చెప్పుకుంటున్నాను అని చెప్తోందండి.

"వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరిన్ జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్."

ఎంత మాట చెప్పిందో! పూర్వ జన్మల్లో నేను కనుక ఎన్నో వ్రతాలు చేసి ఉంటే... దేని గురించి? జగత్కళ్యాణుడైనటువంటి హరిని కాంక్షించి. అందుకనే, పెళ్లీడువచ్చినటువంటి అమ్మాయిని విష్ణుపూజలు చేసుకోమని చెప్తూ ఉంటారు. అందుకనే వరుడు కూడా విష్ణు స్వరూపుడుగా భావన చేసి కన్యాదానం చేస్తూ ఉంటారు. సర్వశుభప్రదమైనటువంటి మూర్తి విష్ణుని యొక్క మూర్తి. జగత్కళ్యాణమూర్తి అయినటువంటి హరిని కాంక్షించి నేనే గనక వ్రతములు చేసి ఉండి ఉంటే, "దేవ గురు ద్విజన్మ బుధ సేవల్" – దేవతలకు సేవలు చేసి ఉంటే, గురువులకు సేవలు చేసి ఉంటే, బ్రాహ్మణులకు సేవలు చేసి ఉండి ఉంటే, పెద్దవారిని గౌరవించి, మన్నించి, పూజించి వారికి సేవలు చేసి ఉంటే, దానధర్మాదులు చేసి ఉంటే.... ఎప్పుడు? ఇది వరికిటి జన్మలో. ఇలాంటివేమైనా చేసి నేను ఉంటే, ఇవన్నీ హరిని కాంక్షించి నేను చేసి ఉండి ఉంటే "వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక". అంతే!

అలా ఉండాలండి. మన బట్టే కదా మనకు దొరికే బంగారం. అంతేనా! మనం ఇత్తడై, పుత్తడి కోరుకుంటే కుదరదు కదా! అందుకని, నేనీ విధంగా చేసి ఉంటే... చేసానని ఆవిడకి చాలా నమ్మకం. ఎంచేత? ఆమె అప్పటికే రుక్మిణి. అలాగే మనమంటుంటాం, "ఏం పూల పూజ చేసిందో? అంత మంచి భర్త దొరికాడు" అంటుంటాం కదా! హరిన్ కాంక్షించి నేగనక పూజలు చేసి ఉంటే నా పూర్వ జన్మలలో, దేవతలకు, గురువులకు, పెద్దవారికి, తెలిసినవారికి సేవలు చేసి ఉంటే, దానములు, ధర్మములు చేసి ఉండి ఉంటే నాకు "వసుదేవనందనుఁడు నా చిత్తశుఁ డౌఁ గాక నిర్జితులై పోదురు గాక సంగరములోఁజేదీశ ముఖ్యాధముల్."

ఈ చెత్త gang అంతా ఉంది కదా! ఈ చెత్త gang అంతా యుద్ధంలో వధింపబడుదురుగాక. నన్ను దేవకీనందనుడు చేకొని, వెళుదురు గాక అనేటువంటి పద్యం చెప్పిందండి.

> "అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో
> పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
> వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే
> యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్."

రాక్షస వివాహం ఆవిడే చెప్పింది. ఈ దరిద్రంలోంచి నన్ను ఎత్తుకుపో అని చెప్పిందండి. మనం అదే కోరుకోవాలి. మన చుట్టూ ఉన్నది అదే కదా! అహంకార పురుషుడు, వాడి సైన్యం, వాడి భావాలు, వీటి మధ్య కూరుకుపోయి శ్లేష్మంలో ఈగల్లా కొట్టుకునేవాళ్ళం. ఈ నాలుగు పద్యాలు మనం కంఠోపాఠం చేసి రోజు రాత్రి చదువుకున్నామనుకోండి... రుక్మిణి అలా కోరింది, ఓహో! ఆహా! అనుకోడం కాదు. అంతకన్నా చాలా ఘోరం

మన పరిస్థితి కదా! ఇప్పుడు ఆవిడలాగా అంతకు ముందు జన్మలో వ్రతాలు చేశామా? పూర్వ జన్మల నుంచి కృష్ణుడిని కాంక్షించామా? ఏమో? దాన్ని బట్టి కదా! కృష్ణుని మీద కాంక్ష స్త్రీలకే ఉండక్కర్లేదు, ఎవ్వరికైనా ఉండవచ్చు. పరమేశ్వరుడు మీద జీవులందరికీ కాంక్ష ఉండవచ్చు. నా పూర్వపుణ్యము, ఇది వరకు చేసిన కృత్యములు, ప్రస్తుతమున్నటువంటి మథనము, నీ యందు చేరవలెను అన్నటువంటి తపన. ఇవన్నీ సత్యం కావాలని కోరుకునే ప్రార్థన ఇది. రుక్మిణి చేసిన ప్రార్థన కృష్ణుని గూర్చి ఎలా కోరుకుంది? ఇలా కోరుకొని వీళ్ళందరిని తీసేసెయ్యి అని చెప్తోంది. రేపు వచ్చేసెయ్ అని చెప్తోంది. అంతేకాదు, తర్వాత ఇంకా చెప్తుంది. "రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే యంకువ సేసి." నాకు తెలుసు నువ్వు ఒక్కడు చాలు కదా! "నువ్వు నీ బలగాన్ని తెచ్చుకో. ఎందుకైనా మంచిది" ఇట్లా చెప్పలేదు. అలా చెప్తే తక్కువ చేసినట్టు అవ్వదండి ఆయన్ని? బలరాముడు "నేను కూడా రానా?" అంటే వద్దంటాడు. "వెళ్లి, ఒక్కడినే అన్నీ చూసుకొని వస్తాను" అని చెప్తాడు కృష్ణుడు తెలుసా! ఎందుకైనా మంచిది తమ్ముడు కదా అని బలరాముడు వెనకాల వస్తాడు గాని అవసరమేముండదు కదా! ఆయనకి తమ్ముడు మీద ప్రేమ. ఆ విధంగా రాక్షసవివాహం ప్రతిపాదించింది.

Most modern lady అండి రుక్మిణి! నువ్వు రావటమే తరువాయి, నీతో వచ్చేస్తాను అంది. ఇంకా ఉంది, చదువుదాం. ఏంటి urgent మనకి! కొంచెం రుచి కల్పించి, వదిలిస్తే బాగుంటుంది కదా! సమయం కూడా దాటుతోంది కదా! తర్వాత పద్యంలో చాలా విశేషాలుంటాయి. అలా ఉంటుంది రుక్మిణీ కల్యాణం. భక్తి ప్రధానం అని చెప్పాను కదా! ప్రేమ భక్తి అంటే భక్తి బాగా ముదిరితే అది ప్రేమ భక్తి అవుతుంది. అలాంటి రుక్మిణీ కల్యాణం పై సంవత్సరం కొనసాగిద్దాము. పై సంవత్సరంలో పూర్తి చేయకూడదని ఏమి లేదు గాని చాలా ఉంది. అందుకని 3 ఏళ్ళు ఆనవాయితీ అవుతుందేమో అని అనిపిస్తోంది, అయిపోతే చేసేస్తాం. పొద్దున నాలుగు పద్యాలు అయితే, ఇలా నడిస్తే ఎట్లా అని కొంతమంది జీవులు వాపోయారు! ఇప్పుడు చూడండి, ఎన్ని పద్యాలు అయిపోయాయో! దాని నడక దానికుంటుంది కదా! దాని నడక బట్టి మనం వెళ్ళాలి. మనం నడిపించేయకూడదు కథ కదా! "పలికెడు వాడు రామభద్రుండట" అని నమ్మాలి. అలా చదువుకుంటే బాగుంటుంది. ఆ పద్యాలు ఈ లోపల కంఠోపాఠం చెయ్యండి. "చేకొని పొమ్ము వచ్చెదన్".

ప్రతి రాత్రి నన్ను లేపుకుపో అని అడగాలండి. మంచో, చెడో ఆయన లేపుకుపోతే సరిపోతుంది. అదే కదా integration అంటారు పరమగురువులు. నిన్ను పరమాత్మలో ఐక్యం చేసుకున్నట్లుగా భావం చేసుకుంటూ నిద్రపొమ్మంటారు వాళ్ళు. అది theory, సిద్ధాంతం. ఇది మధురమైనటువంటి మార్గం. అందుకనే, సూత్రాలు ఉంటాయి, ఇట్లా కమనీయంగా చెప్పుకోవటం ఉంటుంది. ఈ కమనీయంగా చెప్పుకోవడం కోసమే ఇది రాశాడు

వేదవ్యాసుడు. ఇందులో ఉండేటువంటివి ధర్మసూత్రాలే, జీవుడు దైవాన్ని చేరేటువంటి సందర్భాలే. ఆ విధంగా ఇలాంటివి చదువుకుంటే మనలో తెలియకుండానే కొన్ని మంచి సంస్కారాలు కూడా ఏర్పడతాయి.

రాబోయేది నందన సంవత్సరం, చాలా బాగుంటుంది. పేరే బాగుంది కదా! రమణకు చాలా బాగుండాలి! ఇన్నాళ్ళు జరిగిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఎక్కువ బాగుంటుంది. నిజాయితీ పైకి వస్తూ ఉంటుంది. అవినీతి బాగా ఎండకట్టబడుతుంది, ఇంక ఆగదు. నేను చెప్తున్నాను రెండేళ్ళ నుంచి, ఇంక అవినీతికి కాలం చెల్లు అని. అది జరిగితేనే 2014 నుంచి మంచి రోజులు రావాలి మనకి. 2020 కి మన దేశం ఉన్నతమైనటువంటి స్థితిలోకి రావాలి. రావాలంటే ఈ మార్పులు త్వరితగతిన రావాలి. దేశపరిస్థితులు కూడా మనసులో పెట్టుకొని భరతమాత చల్లగా ఉండాలని పార్థన కూడా చెయ్యాలి మనం. భరతమాత, భరతభూమి క్షేమంగా ఉంటే మానవ జాతి, భూగోళం చాలా బాగుంటుందండి. నిస్సందేహం. అది మనం గొప్పగా చెప్పుకోకూడదు. ఋషులు సత్యం అని చెప్తూ ఉంటారు. అది ఎంత నాటకీయంగా జరుగుతుందో మన చెప్పలేము. ఎంత నాటకీయంగా జరుగుతుందంటే, ఇంత మంది చెడ్డవాళ్ళం మనముండగా ఒక మంచి పని ఎట్లా జరుగుతుందని వాళ్ళంతా చేరారు కదా విదర్భదేశంలో! అయినప్పటికీ మంచి పని జరిగి, వాళ్ళ కుట్ర, కుతంత్రం అంతా ఎగిరిపోయింది కదా! అలా 2014 కి ఇది కూడా అయిపోతుందేమో! మనకి దానికి అనుసంధానంగా చెప్పుకుంటున్నామేమో! అంటే, మనం చదవటం వల్ల అది అయిపోతుందని కాదు. మనకి ఈ 3 ఏళ్ళు ఈ రుక్మిణికల్యాణం అలాంటి వైభవాన్ని దేశానికి కూడా కట్టపెడుతూ ఉంటే, చూస్తూ ఉంటే సంతోషంగా ఉండచ్చు. లోపల నిజమైన భారతీయుడికి ఒక క్షోభ ఉంటుంది. మన దేశం, మన సంస్కృతి, మన నాగరికత, మన ధర్మం, అలా పాతాళం లోకి వెళ్ళిపోతుందేమో అనే సందర్భంలో ఒక మంచి మార్పు వచ్చింది. అవినీతిని నిర్జించి, నిరోధించేటువంటి ఒక పరిస్థితి క్రమంగా వస్తూ ఉంది. దానికి బలం చేకూరాలి. మనం చేసే పనులన్నీ అలాంటి కార్యక్రమానికి బలాన్నివ్వాలి. అందుకనే చేసిన మంచి పనులన్నీ కూడా విష్ణువుకి బలం ఇస్తే, విష్ణువు వల్ల మళ్ళీ ధర్మం నిలకరింపబడుతుంది అని చెప్పి ఆచార్యులు చదువుతూ ఉంటారు శ్లోకాలు.

మనం ఈ విధంగా కొత్త సంవత్సరం చక్కగా పార్థన, మాస్టర్ యోగమునకు సంబంధించినటువంటి పార్థన, ఆరాధన బాగా చేసుకోండి. నా దృష్టిలో అందరికి గణపతి పూజ రావాలి, నిత్య పూజ, లక్ష్మినారాయణ పూజ రావాలి. సామూహికంగా రుద్రాభిషేకం చేసుకోవాలి. దీని వలనే కల్మషాలు బాగా హరింపబడతాయి. ప్రార్థన మాస్టర్ గారు చేసే మార్పులకి ఇది చేదోడుగా ఉంటుంది. మధురంగాను, రసభరితంగాను సాధన సాగాలంటే ఈ ఆరాధనలు వైవిధ్యంతో కూడినవి, మనం నిర్వర్తించుకున్నటువన్నీ కూడా మరింత శ్రద్ధతో, భక్తితో నిర్వర్తించుకుంటూ ఉంటే మనకీ బాగుంటుంది, వాతావరణంలో కూడా మార్పు వస్తుంది, దేశం బాగుపడ్డానికి

కూడా దోహదం చేస్తుంది. Healing అంటూ ప్రత్యేకంగా ఏం చేయక్కర్లేదు! ఇది సామూహికమైనటువంటి healing. ఇలా గురుపూజలు నిర్వహించి, ఓంకారం చేసి, గాయత్రి గానం చేసి, సద్గ్రంథ పఠనం చేస్తే, దాని వలన ఈ ప్రాంతాలన్నిటికి మంచి జరుగుతుంది. రాబోయే సంవత్సరాల్లో మనందరి దృష్టిలో దేశం కూడా ఉండాలి. మన దేశం బాగుండాలి. మన పాలన బాగుండాలి. మన పాలన బాగుంటే, మన ప్రభుత్వం బాగుంటే, సగటు భారతీయుడు హాయిగా ఉండగలిగితే, భూగోళానికే శాంతి లభిస్తుంది. అలాంటి ఒక చిత్రమైనటువంటి అనుసంధానం ఉంది.

భారతదేశం బాగుంటే ఈ ప్రపంచం బాగుంటుంది, భూమి అంతా బాగుంటుంది. అంచేత, పరమగురువులు, ఋషులందరూ అలాంటి ప్రయత్నంలో ఉన్నారు. అంటే, మళ్ళీ మిమ్మల్ని అందర్నీ నేను కొత్త సంవత్సరంలోనే చూస్తాను. అంచేత, నూతన సంవత్సర సందేశం కూడా ఆ విధంగా ఒకటి వ్యక్తమైంది. చక్కగా నిర్వర్తించుకోండి. రాబోయే సంవత్సరం శ్రీనందన సంవత్సరం కాబట్టి మనకి ఆనందం కలిగేట్టుగా ఉంటుందని భావన చేసుకుందాం. ఖర కూడా అది "శ్రీ"ఖర సంవత్సరం అని భావన చేయమని చెప్పాను. అది ఖరైనా "శ్రీ"ఖరమౌతుంది మంచి పనులు చేసే వాళ్ళకి. అలాగే నందనం అందరికి అన్ని రకాలుగా వృద్ధి ఉండాలి, తుష్టి ఉండాలి, పుష్టి ఉండాలి, శ్రేయస్సు ఉండాలి, యోగంలో స్థిరపడాలి, పురోవృద్ధి చెందుతూ ఉండాలి. అన్నిటికీ మించి భగవత్ అనుగ్రహం అన్ని విషయాల్లోనూ ఉండాలి.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 9, 2013 సాయంకాలము – ప్రవచనము #4

శ్రీ గురుభ్యోనమః

గురుపూజా మహోత్సవములకు విచ్చేసినటువంటి సోదర సోదరీమణులకు మరొక్కమారు హృదయపూర్వకమైనటువంటి నమస్కారములు. మాస్టరు గారి యోగము నందు తమ తమ జీవితాల్ని వ్యవసాయం చేసుకొని, తదనుగుణమైనటువంటి పంటలు పొందేటువంటి కృషిలో భాగంగా ఉత్సాహాన్ని అనుసరించి పలుచోట్ల నుంచి ఈ జగద్గురు పీఠము నిర్వర్తిస్తున్నటువంటి మాస్టరు సి. వి. వి. గురుపూజా మహోత్సవములలో పాల్గొందామని వస్తూ ఉంటారు. విశాఖపట్టణం నుండి, రాజమహేంద్రవరం నుండి, బెంగుళూరు నుండి, హైదరాబాద్ నుండి, మంగళగిరి నుండి, ఇట్లా అనేకమైనటువంటి ప్రాంతాల నుండి ఈ విజయవాడ గురుపూజల్లో పాల్గొందాం అనేటువంటి ఒక సదాశయంతో మీరందరు ఇక్కడ చేరి ఉన్నారు. నూతన ప్రాంగణంలో మనం ఈ సారి గురుపూజలు నిర్వర్తించుకుంటూ ఉన్నాం. గణపతి అయినటువంటి కృష్ణమూర్తి గారు పొద్దున్నే చెప్పారు, “సాయంత్రం, పొద్దున కొంచెం దోమలు ఉండేటువంటి అవకాశం ఉంది సార్!” అని. ఈ పూట మీరు కార్యకర్తలు అందించినటువంటి సౌకర్యాల్ని అందుకోండి. రేపు మీరు మీ అవకాశం మేరకు మేజోళ్ళు వేసుకుంటే కొంత దోమలను తప్పించుకోవచ్చును. ఒంటి నిండా బట్టలు వేసుకుంటే మరి కొంత తప్పించుకోవచ్చును. సాంప్రదాయాల్లో కూడా పొట్టి చొక్కాలు, పొట్టి లాగులకన్నా, పొడుగు చొక్కాలు, పొడుగు లాగులు, అలాగే ఒంటి నిండా బట్ట అనేటువంటిది ఉన్నది. బహుశా, మాస్టరు గారు ఈ గురుపూజల్లో మనకది నేర్పుతున్నారేమో! ఈ రోజు half shirts వేసినవాళ్ళు రేపు తప్పకుండా full hands shirt వేసుకుంటారు. ఎంచేతంటే, దోమల రూపంలో అంతర్యామి ఈ విధమైనటువంటి ఒక శిక్షణ ఇస్తాడు –మణికట్టు వరకు పొడుగు చొక్కా వేసుకో, దోమకుట్టదు అని. లేదా, కొంతమంది తెలివైన నగర వాసులు ఉంటారు, వాళ్ళ దగ్గర పేస్టులు ఉంటాయి. ఆ paste ఒంటికి రాసుకోవచ్చు. అలా కూడా కొంత తప్పించుకోవచ్చును.

పరిస్థితుల్ని దూషించకుండా, తదనుగుణంగా మనం సర్దుబాట్లు చేసుకోవడమే యోగం. జీవితంలో అనేకానేకమైనటువంటి పరిస్థితులు మనకు వస్తుంటాయి. అన్నీ అంత సౌకర్యంగా ఉండవు కదా! అప్పుడు మనం ఏం చేయాలి? సర్దుబాట్లు చేసుకోవాలి. యోగం అంటే ఇలాంటి సర్దుబాట్లు నేర్చుకోవటమే – బాహ్యంలోనూ,

అంతరంలోనూ. "Masters own adjustments" అంటుంటాం కదా! Adjustments అంటే ఏమిటి? సర్దుబాట్లే కదా! ఈ విధంగా నేను కూడా ఇక్కడ కొంత సర్దుబాటు చేసుకుంటాను. ఎంచేతంటే, వేరే దేశాల్లోను, ప్రాంతంలోను ఉండే మనవారు వినడానికి అనువుగా ఉండాలని ఇక్కడ ఊరికే engine చప్పుడు రాకుండా ఆ fan ఆర్పించేసాను. అంటే, నా వంతు సహకారం కూడా ఉంది సర్దుబాట్లు విషయంలో అని. "మీకేం సార్! మీరు వేదికెక్కి కూర్చుంటారు" అని అనుకుంటారేమో అని చెప్తున్నాను! ఏది ముఖ్యమో దాని యందు మనం మనసు లగ్నం చేయాలి. ఏది అంత ప్రాధాన్యం కాదో, దాని యందు మనం వసించకూడదు.

మాస్టరు గారి యోగం ప్రధానంగా మనం ఈ గురుపూజల్ని నిర్వర్తించుకుంటున్నాం. మనసుకు చాలా ఆనందం కలిగించేటువంటి పద్ధతుల్లో చక్కని తెల్లని పందిళ్ళు వేసి, మనకి దీపాలు ఏర్పాటు చేసి, నడవటానికి మట్టికూడా అంటకుండా పరదాలు ఏర్పాటుచేసినటువంటి విజయవాడ జగద్గురు పీఠము కార్యకర్తలందరికీ నా కృతజ్ఞతలు. ఒక దివ్య కార్యాన్ని అందంగా ఏర్పాటు చేసుకోవటంలోనే మనలో ఉండేటువంటి భక్తి ఏర్పడుతుంది. మనలో భక్తి పెరగటానికి ఇలాంటి కార్యక్రమాలు చేసుకుంటూ ఉన్నప్పుడు అందులో మనం చూపించేటువంటి వెలుగులోంచే మనకి భక్తి అనేటువంటిది ఏర్పడుతూ వస్తూ ఉంటుంది. ఎలా ఉంటే ఏంటి? వాళ్ళే కూర్చుంటార్లే అనుకుంటే అది భక్తి పెరిగినట్టు కాదు కదా! నేనీ ప్రదేశం అంతకముందు వచ్చి చూశాను. అటుపైన ఇవ్వాళ్ళ చూశాను – చాలా మార్పు. ఈ విధంగా మన వారందరూ వస్తారు, మనం శతవిధాల ప్రయత్నం చేసి సౌకర్యాలు ఏర్పరచాలి అనేటువంటి భావం. ఇంటికి బంధువొస్తే ఏ విధంగా చూడాలో కూడా మన సాంప్రదాయం చెప్పింది. ఈ రోజుల్లో ఎవ్వరూ చూడడం లేదులెండి! బంధువు వస్తే ఎప్పుడు వెళ్ళిపోతాడా అని చూస్తూ ఉంటారు. అసలు ఎందుకొచ్చాడు, తిండి ఖర్చు అన్నట్టుగా ఉంటారు.

మనమంతా ఆత్మ బంధువులం. ఎంచేతంటే, ఒక సద్గురు యొక్క మార్గంలో పయనం చేయడం కోసం తెలిసో తెలీకో సంకల్పం చేసుకోవటంచేత మనల్నందరినీ సద్గురువు జన్మ జన్మలు నడిపిస్తాడు. ఈ ఒక్కసారితో అయిపోతుందని అనుకోబోకండి! ఆత్మానుభూతి పొందేంతవరకు మాస్టరు గారి అనయులందరూ అలా మళ్ళీ మళ్ళీ వచ్చి, మళ్ళీ మళ్ళీ గుంపులు గుంపులుగా చేరి, మళ్ళీ మళ్ళీ గురుపూజలు నిర్వర్తించుకుంటూ ఉంటారు. ఇది నిస్సందేహం. అంచేత, మనకోసం ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసారు. అందరు ఎక్కడో దూరంగా lodge ల్లోనూ, అడ్డమైన చోట్ల ఉండకుండా, చక్కని సంస్కారవంతమైనటువంటి ఒక సంస్థకి సంబంధించినటువంటి భవనం, భారతీయ ప్రాంగణం. ఆ ప్రాంగణంలో మనం ఈ గురుపూజలు నిర్వర్తించుకోవడానికి కార్యకర్తలు చాలా శ్రమకోర్చి ఉంటారు. వారందిరికి మాస్టరు గారి యోగం తప్పక మరి కొంత సిద్ధిస్తుంది. ఎంచేతంటే, ఎంత మనం ఇతరుల కోసం పరిశ్రమిస్తుంటే అంత యోగం సిద్ధిస్తూ ఉంటుంది.

ఎంత మన కోసం మనం చూసుకుంటూ ఉంటామో, అంత యోగానికి దూరంగా వెళ్ళిపోతూ ఉంటాం. ఎంత స్వవిషయమందు ఆసక్తి ఎక్కువగా ఉన్నప్పుడు అంత యోగముండదు. మొత్తం ఒక బృందం యొక్క హితము గూర్చినటువంటి భావన నీ యందు ఎక్కువగా ఉన్నప్పుడు మన యందు యోగం జరిగేటువంటి అవకాశం ఏర్పడుతుంది. పదిమంది గూర్చి ఆలోచించి, పది మంది యొక్క క్షేమాలు చూస్తూ, పదిమందికి వచ్చేటువంటి కష్ట నష్టాల్ని భరిస్తూ ఉండేటువంటి వాడికి యోగం తప్ప, మనం దాచుకుంటూ యోగం చేసుకునేవాళ్లకు యోగం ఏమి లేదు. పరహితం లేనిచోట యోగం లేదు. అది నేర్పడానికే ఈ గురుపూజలు. ఇప్పుడు బెజవాడలో ఉండేటువంటి కార్యకర్తలు ఆ విధమైనటువంటి ఉత్సాహం చూపించి, ఎంతో భక్తిగా ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసారు, ఒక మార్పు ఒకటి చేసారు. మార్పుకు కూడా సంసిద్ధత అనేటువంటిది యోగంలో ఒక భాగం. జీవితంలో కొన్ని తప్పనిసరి మార్పులు వస్తాయి. కొన్ని మనం బుద్ధిని వినియోగించుకొని మార్పులు చేసుకుంటూ ఉంటాం. అలాంటి మార్పుకి సంసిద్ధత లేని వాడు శరీరంలోంచి మార్పు వచ్చిన సమయంలో దాని సంసిద్ధుడై అందుకోలేడు.

ఈ విధంగా ఈ మార్పులు అంగీకరించి మనం ఇవాళ్ళ, రేపు ఇక్కడ నిర్వర్తింపబడేటువంటి గురుపూజల్లో మాస్టరు గారి యొక్క చైతన్యము నందు మన చైతన్యాన్ని సమర్పణ చేసి... అంటే, ఒక మహానదిలో పిల్ల కాలువలాగా మనమంతా వెళ్లి చేరిపోయి, ఒకే ఒక స్రవంతిగా మనమంతా ఇందులో తరించి, ఆ నూతనమైనటువంటి ఆ చైతన్యాన్ని మనతో మన మన స్వస్థాన్నాలకి గొనిపోయి, మరల గురుపూజలు వరకు... మరల గురుపూజలంటే? ఎవరెవరికి ఎప్పుడెప్పుడు అవకాశం ఉంటుందో ఆ గురుపూజలు, ఎందుకంటే ప్రతి నెల జరుగుతూ ఉంటాయి. అంతవరకు దీన్ని పదిల పరుచుకొని యోగం నందు పురోగతి చెందుతూ ఉండచ్చు. భక్తి లేని యోగానికి విలువలేదు, అది జరగదు కూడా. ఎందుకంటే, శ్రద్ధ లేని వాడికి ఏ విద్య అబ్బే అవకాశం లేదు. శ్రద్ధ మరి కొంత బాగా విస్తృతంగా లోపలా, బయటా ఏర్పడుతూ ఉంటే, దాన్ని భక్తి అంటారు. ఇతరులకు కైంకర్యంగా, తన కొరకు కాక, ఇతరులందరి కొరకు అనేటువంటి భావనతో చేసేటువంటి కార్యక్రమాలు భక్తి ప్రధానమై ఉంటాయి. భక్తి లేకుండా యోగం జరగదు. ఉత్త పతంజలి యోగ సూత్రాలు చదువుకొని నేను ఆ సూత్రాలు ప్రకారం సాధన చేసుకుంటాను అనుకునేవాడికి అంతగా యోగం జరగదు. ఎంచేతంటే, భక్తిలేని చోట నిర్లక్ష్యం ఉంటుంది. భక్తిలేని చోట అశ్రద్ధ ఉంటుంది. భక్తి లేని చోట వినయం ఉండక అహంకారం ఉంటుంది. ఇవన్నీ యోగానికి చాలా అడ్డుగా నిలబడిపోతాయి. భక్తి ప్రపత్తులతో యోగమును నిర్వర్తించుకోవటమే మనకి భాగవతం చెప్పేటువంటి విధానం. నారద భక్తి సూత్రాలు కూడా అందుకే ఇచ్చారు. భగవద్గీతలో కూడా భక్తి యోగము అలాంటి విషయాలని తెలియపరుస్తూ ఉంటుంది.

మనము నిర్వర్తించుకునేటువంటి "భృక్త రహిత తారక రాజయోగ" మార్గానికి మన మాస్టరుగారైనటువంటి మాస్టర్ ఇ. కె. గారు కొంత భక్తి జోడించటం కోసమై కొన్ని పూజలను ప్రవేశపెట్టారు. ఎంచేతంటే, ఎవరైతే నిత్యము షోడస ఉపచారాలతో పూజ చేసుకుంటారో, వాని యందు సంస్కారములు తప్పక మారతాయి. ఎవరైతే నిత్యము షోడస ఉపచారములతో తాను నమ్మిన, తాను ఇష్టపడ్డ ఒక దైవరూపమునకు ఉపచారములు చేస్తూ పూజ చేస్తాడో అలాంటి వాని యందు సంస్కారములు క్రమముగా మార్పు వస్తాయి. అలా చేసేటువంటి పూజల్లో కల్లా అతి ప్రాముఖ్యమైనటువంటి పూజ మన సాంప్రదాయమును అనుసరించి గణపతి పూజ. ఎంచేతంటే, గణపతి సకల దేవతా మూర్తి. అతడు అంతర్యామి దైవము. అతని యందు అందరు దేవతలు ప్రీతితో అంగీకరించినట్టుగా మన పురాణాలు, శాస్త్రాలు చెప్తూ ఉంటాయి. గణపతి యందు అందరికీ అంగీకారమున్నది. కేవలం అంగీకారమే కాదు, అందరికీ ప్రీతి ఉన్నది. అంచేతనే అతనిని ప్రథమ పూజ్యుడుగా దేవతలు అందరు ఏర్పాటు చేసుకున్నారు. ఋషులు, దేవతలు, రాక్షసులు లేక అసురులు, పితృదేవతలు, యక్షులు, కిన్నెరులు, గంధర్వులు, కింపురుషులు అందరు ఒక సమావేశం పెట్టుకుని ఏదైనా ఒక క్రతువు చేయాలన్నా, ఒక యజ్ఞం చేయాలన్న, ఒక ఆరాధన చేయాలన్నా మొట్టమొదటిగా ఎవరికి దణ్ణం పెట్టాలని వచ్చింది. మొదటి పూజ ఎవరికి అనేటువంటి ప్రశ్న వచ్చింది. దేవతలందరూ "సందేహం ఎందుకు, విష్ణువు" అన్నారు. అంటే, అసురులు మేము ఒప్పుకోమన్నారు. "ఏం? ఎందుకు ఒప్పుకోరు?" అంటే, "అతడు సురపక్షపాతి అవ్వటం చేత అతడిని మేము ఒప్పుకోం" అన్నారు. అంటే, అప్పుడు "మరి మీరు ఎవరు చెప్తారు?" అంటే, మహాదేవుడని చెప్తారు. శివుడు దేవతలకి, అసురలకి, అందరికీ కూడా ప్రీతిపాత్రుడు, అందరిని అనుగ్రహిస్తాడు. కోరిన వారందరినీ అనుగ్రహిస్తాడు. అంటే దేవతలు "అది నిజమే కాని, ఆయన అలా అనుగ్రహించటం వలన కొన్ని ఇబ్బందులు వస్తూ ఉంటాయి" అని అంటారు. ఋషులని అడుగుతారు. ఋషుల్నడిగితే, ఋషుల్లో పెద్దవాడైనటువంటి అత్రి మహర్షి అంటాడు, "మనమందరం ఏం తేలుస్తాం? బ్రహ్మదేవుడిని అడుగుదాం" అని చెప్తాడు. ఇంత మంది దేవతలు, ఆదిత్యులు, రుద్రులు, పితరులు, యక్షులు, కిన్నెరలు, కింపురుషులు, గంధర్వులు, అసురులు, దానవులు, యక్షసులు, రక్షసులు, సమస్త ఋషి గణం అందరూ కలసి బ్రహ్మదేవుడు దగ్గరికి వెళ్తారు. వెళ్లి, "మాకొక సమస్య వచ్చింది. ఏ యజ్ఞం చేయాలన్నా, ఏ హోమం చేయాలన్నా, ఏ ఆరాధన చేయాలన్నా మొట్టమొదట ఎవరితో మొదలు పెట్టాలి?" అని అంటే, అప్పుడు బ్రహ్మదేవుడు అంటాడు, "నేను మాత్రం ఏం చెప్పగలను? పదండి, ఆయన్నే అడుగుదాము" అని నారాయణ లోకంలో విష్ణుమూర్తి దగ్గరకు వెళ్తారు. వెళ్లి, "ఇలా సమస్య వచ్చింది. నీవేం నిర్ణయిస్తావు" అంటే, "ఈ విషయంలో మీకు సందేహం ఎందుకొచ్చింది? మహాదేవుడే అగ్రపూజకు అర్హుడు, మొదటి పూజకు అర్హుడు. ఆయన తర్వాతే అందరు" అని చెప్తాడాయన. అలా అనేసరికి అందరూ మహాదేవుడు దగ్గరికి వెళ్తారు. వెళ్తే,

"మీకు సందేహం అసలు రానే కూడదు. మీరు నారాయణుడిని అడగనే అడక్కూడదు అట్లా. ఎవరికి చెయ్యాలి పూజ అంటే నాకు చెయ్యాలని చెప్తారా ఎవరైనా?" అంటాడు. మీలో ఎవరికి పూజ చేయాలంటే, నాకే చేసేయండి మరెందుకు అటు ఇటు తిరుగుతారు అని చెప్తారండి ఎవరైనా! అంచేత, మహాదేవుడన్నాడు "నారాయణుడే! ఆయన అట్లా మాయ చేసాడు మిమ్మల్ని" అంటాడు. అంటే, నారాయణుడు దగ్గరికి వెళ్తే, "నాదే ముంది? అసలు ఆయనే బ్రహ్మము. అంతా ఆయన నుంచే దిగి వచ్చింది" అంటాడు ఆయన. "బాబు! మీరిద్దరూ మాకు ఇబ్బంది పెట్టేస్తున్నారు. కొంచెం తేల్చి చెప్పండి." అంటే, అప్పుడు పరమశివుడు చెప్తాడు, "ఎందుకిదంతా అని..."

వినాయక చవితి రోజు చదువుకునే పందెం అది కేవలం కుమారస్వామికి, గణపతికి పందెం కాదది. సమస్త సృష్టిలో ఉండేటువంటి సమస్త ప్రజ్ఞలు ఎవరు ఈ కార్యాన్ని చక్కగా నిర్వర్తించగలరు అనేటువంటి పందెముందే అది చాలా టూకీగా రాస్తారు. కాని అందులో చాలా విశేషమెందుకంటే ఎవరు యోగియో, ఎవరు వైరాగియో, ఎవరు మహాజ్ఞానియో, ఎవరు మహాభక్తుడో, ఎవరికీ అందనంతటి విచిత్రమైన రూపంలో అంటే... అందమా అంటే కుమారస్వామి ముందు కుదరదు కదా! ఏ విషయంలో చూసినా గణపతి ముందు ఎలా ఉంటాడు? ఉండడు కదా! కానీ అతడి యొక్క మహిమ ఎలాంటిదంటే, అన్నీ విషయాల్లోను ఆయనే ముందు. అది తేలినప్పుడు అప్పుడు విష్ణుమూర్తి చెప్తాడు, "అందరం గణపతి ప్రార్థనతో మొదలు పెట్టుకుందాం. సర్వశుభములు కలుగుతాయి" అని. ఆ విధంగా మనకీ గణపతి కథ వస్తుంది పురాణాల్లో.

ఎందుకిది చెప్తున్నానంటే, కుటుంబాల్లో సాంప్రదాయాలు తెలియకుండానే అలా వెళ్లిపోతున్నాయి. కుటుంబంలో ఇప్పుడు ఇక్కడ కూర్చున్నవారి సంగతి వదిలేయండి. వారి పిల్లల సంగతి తీసుకుంటే వారికెవ్వరికి అసలు గణపతి ఎవరో కూడా తెలియని పరిస్థితి, తెలిసినా పూర్తిగా తెలియని పరిస్థితి. పూజ అనేది అసలు వాళ్ళకి మృగ్యం కదా! ఎప్పుడైతే ఈ దేవతా ఆరాధన అనేటువంటిది ఇంట్లో ఉండదో అప్పుడు ఆ ఇల్లు తప్పకుండా రెండు తరాలకి భ్రష్టు పట్టడం అనేటువంటిది నేను కాయితం మీద రాసిస్తాను, మీ ఇళ్ళల్లో పెట్టుకోండి కావాలంటే. రెండు తరాల్లో ఆ ఇంట్లోంచి ఉన్న మొత్తం దైవీసంపతంతా వెళ్ళిపోతుంది. అసుర సంపత్తి అంతా ఇంట్లో చేరుతుంది. ఇక్కడ గురుపూజల్లో కూడా గట్టిగా గణపతి పూజ చేయగలిగిన దంపతి ఎక్కడా కనపడదు. ఉదాహరణకి విజయవాడ గురుపూజలకొస్తే ఎప్పుడూ కృష్ణమూర్తి దంపతే చేస్తూ ఉంటారు కదా! గణపతి పూజ చేసే ఇంకో దంపతి ఏరి? భర్తకి వస్తే భార్యకి రాదు, భార్యకి వస్తే భర్తకి రాదు, లేకపోతే ఇద్దరికీ కలిసి రాదు. ఇలాంటి పరిస్థితుల్లో మనం యోగం, యోగమంటూ... మన సాంప్రదాయంలో యోగం సహజంగా ఇమిడి ఉన్నది. గుర్తుపెట్టుకోండి, అది వేరుగా ఎక్కడా లేదు.

ఇప్పుడు మనం రుక్మిణీ కల్యాణం కదా ఇప్పుడు ఉదంతం చెప్పుకుంటాము. అది అద్భుతమైనటువంటి ఒక యోగమునకు సంభందించినటువంటి ఒక ఉపాఖ్యానంగా మనకి గోచరిస్తుంది. దైవాన్ని చేరే కథలన్నీ యోగ విద్యకు సంబంధించినటువంటి కథలే. జీవాత్మ పరమాత్మను చేరడమే యోగం. రెండూ ఒకటవటమే యోగం. అలాంటి యోగంలోకి చేరేటువంటి ప్రయత్నంలో, మన దగ్గర ఉన్నటువంటి సాంప్రదాయంలో అత్యద్భుతమైనటువంటి మార్పులు జీవుల్లో సక్రమంగా జరుగుతాయి. అలా జరిగితే అటువంటివాడు యోగం చేసినా అది ఫలిస్తుంది తప్ప అహంకారంగా, నిర్లక్ష్యంగా, అశ్రద్ధగా, తమోగుణంతో ఎలా పడితే అలా, ఎప్పుడు పడితే, ఏ స్థితులో పడితే ఆ స్థితుల్లో నిర్వర్తిస్తే అప్పటికప్పుడు సద్గురువు దిగివచ్చి అనుగ్రహిస్తాడనేటువంటి భ్రమ వద్దు. అది చాలా దురదృష్టమైనటువంటి విషయం. భక్తి ఉండాలి, శ్రద్ధ ఉండాలి. జ్ఞాన సముపార్జన అనునిత్యం జరుగుతూ ఉండాలి. జ్ఞానం ఎంత బాగా మన యందు ఆకళింపౌతుంటే, అంత సహజంగా మనలో వైరాగ్యం వస్తుంది. వేరే వైరాగ్యం తెచ్చుకోక్కర్లేదు. ఎంత వెలుగు పెరిగితే అంత చీకటి తగ్గుతుందో, ఎంత జ్ఞానం పెరిగితే అంత వైరాగ్యం వస్తుంది, మమకారం తగ్గుతూ ఉంటుంది, సమదృష్టి ఏర్పడుతూ ఉంటుంది.

భక్తి ప్రధానంగా మనం ఇక్కడ ఈ భాగవత కథల్ని చెప్పుకుంటుంన్నాము. మన విజయవాడ గణపతి అయినటువంటి సోదరులు కృష్ణమూర్తి గారి నుంచి ఆ సంకల్పం అలా వస్తోంది. ఆయన చెప్తున్నారు అనేటువంటి భావన కూడా నేను తీసుకోవట్లేదు ఎంచేతంటే, అది భగవత్సంకల్పం. ఆయన ఆ విధంగా కోరుతూ వుంటే మనకి ధృవోపాఖ్యానం, అంబరీషోపాఖ్యానం, కుమార సంభవము, రుక్మిణీకల్యాణం, ఇలాంటి ఉపాఖ్యానాలన్నీ ఇక్కడ చెప్పుకున్నాం. ఇవన్నీ యోగపరంగానే మనకి అవగాహన చేసుకున్నాం. ఇంత చక్కగా ఈ విధంగా ఈ విజయవాడలో ఈ భాగవత ఉపాఖ్యానములు మనం నిర్వర్తించుకున్నప్పటి నుంచి మనం గమనించినట్టయితే విజయవాడ ఒక ఆకర్షణీయమైనటువంటి కేంద్రంగా తయారై... నేను అనుకోలేదు ఈ పూట ఈ సాయంత్రం ఈ సభకి ఇలా అంతా నిండిపోయి, కుర్చీల కోసం వెతుక్కునే పరిస్థితి వస్తుందని. మీకు తెలీదు ఎందుకంటే, మీరు ఇటు చూస్తుంటారు కదా! ముందు కూర్చున్నటువంటి వాళ్లకి సభలో ఇంకా వెనకాల ఎంతమంది చేరారో తెలియదు కదా! నిండిపోయి, కుర్చీలు ఖాళీలేనంతగా అన్ని చోట్లనుంచి మనుషులు వచ్చారు. ఎందుకిలా జరుగుతుంది అంటే, మనకి తెలియందొకటి జరుగుతూ ఉంటుంది. అదృశ్యమైన లోకాల్లో కొన్ని కొన్ని దైవీపరమైనటువంటి విషయములు మనలో ఉండే పవిత్రత ఆధారంగా దిగి వస్తూ ఉంటే, ఆకర్షణ పెరిగి, అత్యద్భుతంగా కార్యక్రమాలు నిర్వర్తింపబడతాయి.

మరొక విశేషమేమిటంటే ఈ గురుపూజల్లో ఈ మధ్యనే మనకి మన సోదరులైనటువంటి బాబురావు గారు దేహత్యాగం చేసారు. మన మాస్టరు గారి యోగంలో ఉంటూ, ఈ విజయవాడ గురుపూజలకి మూల

స్తంభంలాగా నిర్వర్తిస్తూ, జీవించినటువంటివారు. వారు సరిగ్గా ఒక మూడు నెలల క్రితం, నాలుగు నెలల క్రితం ఇష్టాగోష్టిలో ఒక ప్రశ్న అడిగారు నన్ను, "ఈ యోగంలో ఉంటూ ఇది పూర్తి గాక వెళ్లిపోయామనుకోండి ఏమౌతుంది అని?" "తప్పక మళ్ళీ యోగంలోకే వస్తారు" అని చెప్పాను నేను. అది జరిగిన మూడు నెలలకి ఆయన ఏదో ఒక జ్వరం ఒకటి నిమిత్త కారణంగా వెళ్ళిపోవటం జరిగింది. ఆయన్ని మనం స్మరించాలి. వారు కూడా ప్రజ్ఞా పరంగా ఈ గురుపూజల్లో ఉన్నారని మనం భావించాలి. అంతకన్నా గొప్ప విశేషమేమిటంటే వారి శ్రీమతి శశికళ గారు పట్టుమని సంవత్సరం కూడా కాలేదు, అయినా గురుపూజలకి వచ్చారు ఈ రోజున. ఎంతమంది అలా రాగలరో నేను చెప్పలేను. ఎంచేతంటే, ఏవేవో మన సాంప్రదాయంలో పనికిరానివన్నీ మనం అడ్డుపెట్టుకొని, మంచి విషయాలు మానేస్తూ ఉంటాం. మంచి విషయాలు మానేయటానికి కాదు. మన సాంప్రదాయాల్లో ఏది అడ్డురాదు. సద్విషయమునందు మన సాంప్రదాయాలు ఎప్పుడు అడ్డుపడవు. వారు ఈ రోజు మధ్యాహ్నం నేను ఇక్కడ చూసినప్పుడు చాలా ఆనందించాను. నాకుగా నేను చెప్పలేదు ఆవిడకి, "మీరు తప్పకుండా రావాలి సుమా!" అని. ఆవిడిని చూసినప్పుడు చాలా ఆనందం కలిగింది. అలాగే మరొక సందర్భం ఉంది. నాగర్ కర్నూలు నుంచి రామేశ్వరయ్యగారు వచ్చారు. వారి శ్రీమతి కాలం చేసి పదిహేను రోజులు కూడా కాలేదు. విశాఖపట్టణంలో గురుపూజలకి వచ్చారు. ఆ గురుపూజలో చిట్టచివరి రోజున ఇద్దరూ పాదనమస్కారం చేసుకున్నారు. తర్వాత పదిహేను రోజులకి ఆవిడ కాలం చేసారు. ఆయన ఈ గురుపూజలు కొచ్చారు, ఇంకా నెల రోజులు కూడా కాలేదు. మాస్టరు గారు ఎవర్ని అనుగ్రహిస్తారు? మనకి ఏ అడ్డంకులు లేకపోతే, మనం అనుకున్న పనులన్నీ పూర్తి అయిపోయి, ఇంకా ఏదన్న కాస్తో కూస్తో వీలు మిగిల్తే అప్పుడు గురుపూజలకి వచ్చే పద్ధతి ఒకటి ఉంటుంది. ఇలా సతీమణి వెళ్ళి మూడు వారాలు కాలేదు. ఒక భర్త వెళ్ళిపోయి ఒక స్త్రీ మూర్తికి మూడు నెలలు కాలేదు. వాళ్ళు గురుపూజలకి వచ్చారు. మనకి హృదయాన్ని హత్తుకునేటువంటి సన్నివేశం కదా!

ప్రతి చిన్న దానికి, ఏదో అడ్డుపెట్టుకొని, అన్ని మానేస్తూ, నాకీ యోగం జరగట్లేదు అనేటువంటి వాళ్లకి ఏం చెప్తాం? యోగానుశాసనమంటే ఇంక ఇదే నాకు ప్రధానము, ఇతరములన్నీ అప్రధానములు. ఏ రోజున నువ్వు మాస్టరు సి. వి. వి. లేక ఒక సద్గురువు యొక్క పాదములు పట్టుకున్నావో, అప్పటి నుంచి నీకు ఆ సద్గురువే అదే అన్నిటికీ ప్రధానం. అతడి కార్యములలో పాలు పంచుకోవటమే ప్రధానం. అతని సాన్నిధ్యంల్లో బ్రతకటమే ప్రధానం. ఇతరములన్నీ అప్రధానములే. ఎంచేతంటే, అవన్నీ తప్పక సరిదిద్దబడతాయి. మాస్టరు యోగంలో అత్యద్భుతమైనటువంటి విషయమేమిటంటే... పొద్దున్నే మాట్లాడుకున్నాం. ఎన్నెన్ని కుటుంబాల్లో ఎంతెంత కష్టాల్ని ఏ ఏ విధాలుగా మాస్టరు గారు దాటించేసారో నాకు భౌగోళికమైనటువంటి ఒక అవగాహన ఉంటుంది. ఎంచేతంటే, అన్ని దేశాల్లోను, అన్ని బృందాల్లోను కష్టాల్లో ఉండేవాళ్ళు నాకు చెప్పుకుంటూ ఉంటారు కదా! మరి

వారు ఆ కష్టాల్ని ఎట్లా దాటుతున్నారో చూస్తూ ఉంటే అత్యాశ్చర్యం. మామూలుగా దాటగలిగేటువంటి విషయములు కానివి కూడా దాటారు. ప్రతి నిత్యం ఇలా దాటుతూ దాటుతూ ఉన్నప్పుడు, ఒక్కొక్క కథ మనం వింటూ ఉన్నప్పుడు సద్గురువు యొక్క మహిమ ఎలా ఉంటుందో తెలుస్తూ ఉంటుంది. సద్గురువు దృష్టిలో మన జీవితం చాలా చిన్నది దాన్ని నిర్వర్తించడానికి. ఆ విధంగా మాస్టరు గారే తనని చూసుకుంటారు అనేటువంటి భావన. "Master is the head of my family" అని బాబురావుగారి ఇంట్లో ఉంటుంది ఒక వాక్యం. అది సత్యమని ఆయన సతీమణి ఈ రోజున ధృవీకరించారు. వారి అబ్బాయి, అమ్మాయి ఎలాగు వచ్చారు. ఆవిడ కూడా రావడం నాకు చాలా ఆనందం కలిగించి. అంచేత, సంసిద్ధత గూర్చి చెప్తున్నాను.

యోగానికి సంసిద్ధత చాలా కావాలి. ఎంత సంసిద్ధత ఉండాలో అంత పవిత్రత కూడా ఉండాలి. ఎంత పవిత్రత ఉండాలో అంత ధైర్యం కూడా ఉండాలి. ఎంత సంసిద్ధత, పవిత్రత, ధైర్యముండాలో అంత మౌనం కూడా ఉండాలి. ఈ నాలుగు లేని వాడు యోగంలో పనికిరాడు అని పరమగురువు జ్వాలాకూలుడు చెప్పాడు. నేను చెప్తున్నాను అనుకోబోకండి. "To will, to dare, to know, and to be silent." ఈ నాలుగు లేకపోతే మా శిష్యరికానికి నువ్వు పనికిరావు అని చెప్తారు. To will – యోగంలో చేరాలని నిర్ణయం చేసావు కదా, ఇంక అంతే! అదే సత్యసాయి అంటూ ఉంటారు, "పట్టిన పట్టు పట్టనే పట్టావు కొత్త దాక....." అని. ఒక మార్గంలో ప్రవేశించిన తర్వాత ఇంక ఆ మార్గంలో నడకే ముఖ్యం, ఇంక మిగతావన్నీ ప్రధానం కాదు. అలాంటి యోగమిత్రులు మనకి మనలో గోచరిస్తున్నప్పుడు మనకెంత ఆనందంగా ఉంటుంది. అంచేత, ఈ రోజున మనం ఈ విజయవాడ గురుపూజల్లో బాబురావు గారిని, అంతకముందు కాలంచేసినటువంటి గోపాలాచారిని గారిని, అంతకముందు కాలం చేసినటువంటి సూర్య అప్పయ్యగారిని ఒక్కసారి... మరి వీరందిరితో కలిసి మనం ఇక్కడ గురుపూజలు చేసుకున్నాం. వారి ఆతిథ్యం స్వీకరించాం, వారందించిన సేవలందుకున్నాం. అలాగే రాజమండ్రి వెళితే రఘురామ్ కుమార్, కస్తూరి వెంకటరత్నం గారు, ఇలా గోచరిస్తూ ఉంటారు.

భక్తి ప్రధానంగా నిర్వర్తింపబడేటువంటి ఈ గురుపూజల్లో మనం రుక్మిణీకల్యాణం అనేటువంటి ఒక ఉపాఖ్యానం చెప్పుకుంటున్నాము. అత్యద్భుతమైనటువంటి ఉపాఖ్యానమది. ఈ రుక్మిణీకల్యాణం ఒక రోజులో చెప్పచ్చు, రెండు రోజుల్లో చెప్పచ్చు, మూడు రోజుల్లో చెప్పచ్చు, నెల రోజులు చెప్పవచ్చు. ఎందుకంటే, చాలా చక్కని పద్యాలున్నాయి. అది కథగా చెప్పుకోవచ్చు. అందరు టెలివిజన్లో పురాణాలు వింటూ ఉంటారు కదా! కథగా చెప్పుకోవటానికి ఏముంది అద్భుతంగా చెప్పుకోవచ్చు. మనకెంత భాషణం వస్తే, ఎంత సాహిత్యముంటే, అంత బాగా దాన్ని వివరించుకోవచ్చు. అది చాలా రసవత్తరంగా ఉంటుంది. పామరుల మనసును చక్కగా ఆకర్షించి, భక్తి యందు నిలబెడుతుంది. యోగ పరంగా దాన్నే కూడా దర్శనం చేయవచ్చు. అది మన కథల్లో

గొప్పతనం. మాస్టర్ సి. వి. వి. గురుపూజల్లో మనం ధ్రువోపాఖ్యానం చెప్పుకున్నా అలాగే చెప్పుకున్నాం, అంబరీషోపాఖ్యానం చెప్పుకున్నా అలానే చెప్పుకున్నాం. అంతరంగమందు జరిగేటువంటి కథగా గుర్తించండి. పురాణాల్లో ఉండేటువంటి ప్రతి కథ మానవుని అంతరంగమందు జరిగేటువంటి కథగా కూడా గుర్తించవచ్చు. రుక్మిణీదేవి దైవాన్ని ఆశించి, ఆయన సాన్నిధ్యాన్ని కోరుతున్నటువంటి ఒక జీవాత్మగా తీసుకుంటే, శ్రీకృష్ణుడు పరమాత్మయై ఉన్నప్పుడు, వారిద్దరినీ అనుసంధానం చెయ్యడానికి ఏర్పడినటువంటి బ్రాహ్మణుడు సద్గురువు అయివుంటే మరొక సుందరకాండ కథ అవుతుంది కదా! సుందరకాండ కూడా యోగమే! అలా యోగపరమైనటువంటి విషయములు మన మహర్షులు లోపల ఇమిడ్చి, బయటకి కథ రాస్తూ ఉంటారు. ఒక జరిగిన కథ ఆధారంగా ఒక రసవత్తరంగా అందులో ఉండేటువంటి బాహ్యమైనటువంటి భక్తి ప్రధానము, ధర్మ ప్రధానమైనటువంటి విషయాలు బోధిస్తూ ఉంటారు. ఏది ధర్మం, ఏది అధర్మం? భక్తి ఎలా ఉంటుంది? భగవంతునిని ఎలా చేరుకోవటానికి ఎలా మనిషి యొక్క ప్రవర్తన ఉండాలి అనేటువంటి ఒక కథ నడవగా, లోపల ఒక కథ ఉంటుంది. లోపలి కథ, బయట కథ, రెండు కథలు తెలుసుకొని... మన యోగ మార్గమందు నడుస్తున్నాం కాబట్టి లోపల ఈ కథను చక్కగా నిర్వర్తించుకుంటూ, బయట ఆ కథను ఆనందిస్తూ ఉంటే, అది ఉభయకుశలోపరిగా ఉంటుంది. అది ఇహానికి బాగుంటుంది, పరానికి బాగుంటుంది.

ఆ విధంగా మనం దీన్ని క్రిందటి సంవత్సరం ప్రారంభం చేసుకున్నాం. ఇందులో మనం కిందటి సంవత్సరం ఒక పది పద్యాలు మాత్రం చెప్పుకున్నాం. ఆ పది పద్యాలు ఒక్కసారి టూకీగా చదివేస్తే, కొంత మనకి మెదడుకి మళ్ళీ ఒక స్పష్టత వస్తుంది. ఒక్కసారి గుర్తుతెచ్చుకోటం వల్ల ముందుకు సాగటానికి ఎక్కువ స్ఫూర్తి కూడా కలుగుతుంది. అంచేత, ఈ పద్యాలు ఒకసారి చదివేస్తాను. మనకి ఈ కథ అయిపోవాలనేటువంటి ఒక దుర్బుద్ధి వద్దు. అయినప్పుడు అవుతుంది. మనం ఈ కథ చదువుకోవడంలో ఉండేటువంటి భగవత్ స్వరూపమైనటువంటి ఆ రసాన్ని ఆనందించ గలిగితే మనకి అదే ఫలశ్రుతిగా మిగులుతుంది.

"ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్."

ఇది మొదటి పద్యం. ఏ విధంగా అమరేంద్రుని గెలిచి, గరుత్మంతుడు అమృత భాండాన్ని తన తల్లి దాస్యము నుంచి విముక్తి కలిగించడం కోసం తీసుకొని వచ్చాడో, అదే విధంగా భూమి మీద ఉండేటువంటి

రాజులందరు కూడా చేధి రాజైనటువంటి శిశుపాలునికి అండగా నిలిచి, రుక్మిణిని కృష్ణుని దగ్గర చేరకుండా ఉండేటువంటి ఒక అవరోధాన్ని కల్పించిన సందర్భంలో, గరుత్మంతుడు దేవేంద్రుని గెలిచినట్టుగా శ్రీకృష్ణుడు ఒక్కడు రాజులందరిని నిర్జించేశాడు. నిర్జించేసి, రుక్మిణీదేవిని తీసుకొని చక్కగా వివాహం చేసుకున్నాడు అనేటువంటి ఉదంతంతో మొదలు పెడ్తూ ఉంటే, “అలా చెప్పేస్తే ఎలా? కథంతా అన్నాడు?” వినే ఆయన. వాళ్ళందరిని నిర్జించి, ఒక బాలామణి... ఎవరావిడ? “రాజీవగంధిన్” చక్కని కమలములతో కూడినటువంటి సువాసనలు కలిగినటువంటి దేహముట ఆవిడది. “భీష్మకసుత రమాభగవత్యంశ భవన్”, లక్ష్మీదేవి అంశతో పుట్టినటువంటి ఆవిడ. “మహాగుణమణిన్”, గుణములలో అత్యద్భుతమైనటువంటి గుణములన్నీ కూడా పోతపోసినట్టుగా రుక్మిణీదేవిలో ఉన్నాయి. ఇవన్నీ చెప్పుకున్నాం కాబట్టి, మళ్ళీ మళ్ళీ ఎక్కువ వివరించను. లేకపోతే, మళ్ళీ అక్కడే అయిపోతుంది ఈ సారి గురుపూజల్లో కూడా! అంటే అప్పుడన్నాడు “అంత సులభంగా చెప్పేస్తే ఎలా కథ? కొంచెం వివరంగా చెప్పు” అని అడిగాడు వినే శ్రోత చెప్పేటువంటి భాగవతోత్తముడుని.

> “కల్యాణాత్మక మైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై
> కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు సా
> కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ
> కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్.”

కల్యాణాత్మకమైనటువంటి కథలు విష్ణు కథలు. ఎంచేత? చిట్టచివరికది చాలా సర్వశుభప్రదంగాను, మంగళప్రదంగాను పర్యవశానం చెందుతుంది. అలాంటి కథలు వినేటువంటివాడు “ముక్తవైకల్యుండు”. అంటే, వైకల్యాలన్నీ ఇక పోయి, వాడు శుద్ధమై ఉంటాడన్నమాట. అలా శుద్ధుమైనటువంటివాడు ఎవడు తృప్తుడౌతాడు, “ఇంక చాలు, ఇది ఇంతే” అని చెప్తే? మళ్ళీ మళ్ళీ విష్ణు కథలు వింటూ ఉంటే, కొత్త కొత్త రుచులు పొందుతూ, ఆనందంగా అందులోనే ఉండొచ్చు కదా! “సాకల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే”. శుకమహర్షితో పరీక్షిత్తు మహారాజు చెప్తున్నాడు “చాలా వివరంగా అసలు ఎలా జరిగింది? ఎలా ఏ విధంగా మొత్తమంతా వివరంగా చెప్పండి” అని

“యెఱుంగం బల్కవే రుక్మిణీకల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్” నాకు లోపల ఉత్సాహం కలుగుతోంది వినాలని, వివరంగా చెప్పమన్నాడు. ఇది మామూలుగా ఒక భక్తుడైనటువంటి వాడికి ఒక కళ్యాణగుణం. ఏమిటంటే, విష్ణుకథ చెప్తుంటే విందామనేటువంటి ఒక ఆసక్తి. “ఎప్పుడాపేస్తారండి ఇవన్నీ?” అని అడిగేటువంటి వాడి కాదు విష్ణు కథలు. ఎంత చెప్పినా “ఇంకా చెప్పండి, ఇంకా చెప్పండి” అనే వాళ్ళకి విష్ణు

కథలు. మనకి చెప్తూవుంటారు, నైమిశారణ్యంలో శౌనకాది మునులు సూతమహర్షిని పెట్టుకొని అప్పటి నుంచి ఇప్పటి వరకు, కలియుగం ప్రారంభం నుంచి ఈనాటి వరకు ఆయన చెప్తూనే ఉన్నాడట, వీళ్ళు వింటూనే ఉన్నారటండి కళ్ళార్పకుండ. ఏంచేతంటే, అంత రుచిగా ఉంటాయి. "ఈ కలియుగం అయిపోయేంతవరకు ఇట్లా ఈ కథలే వింటూ ఉంటాం. ఇది అయిపోయిందని తెలిసిన తర్వాత మళ్ళీ మా మా కర్తవ్యాల్లోకి వెళ్తాం" అన్నారు. రోజంతా వింటారా అంటే, ప్రతిరోజు సాయంత్రం వింటారిట్లా. పగలంతా పనులు చేసుకుంటూ, సాయంత్రం భాగవతం వినడం అనేటువంటిది భారతదేశంలో ఒక అత్యద్భుతమైనటువంటి, పవిత్రమైనటువంటి ఆచారమది. అది ఈ రోజున మనకి అదృష్టవశాత్తు టెలివిజన్ ను సద్వినియోగం చేసుకుంటూ కొన్ని ఛానల్స్ వాటినన్నిటిననీ చక్కని విశ్లేషణ కలిగినటువంటి పండితుల ద్వారా మనకి వినిపిస్తూ ఉన్నారు. వాటిని పొర్లుపోకుండా వినేటువంటి భక్తులు ఉన్నారు. ఎక్కడెక్కడ ఏ ఏ ఛానల్ లో ఎప్పుడెప్పుడు ఏ విధమైనటువంటి పురాణం, ఏ విధమైనటువంటి కథ నడుస్తుందో చూసుకొని, తదనుగుణంగా వాళ్ళ దినచర్యను మలుచుకున్నటువంటి వాడు ఎంత అదృష్టవతుడండి! "మాకు కుదరదండి!" కుదరదంటే, నీకది ప్రధానమైతే ఎందుకు కుదరదు? నీకది అప్రధానమైతే కుదరదు.

ఈయన చూడండి, "వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్." చాలా కుతూహులంగా ఉన్నాడు విందామని. అలా నువ్వు టూకీగా కట్టె, కొట్టె, తెచ్చె అని చెప్పకు. "ఆదౌ రామ తపోవనాధి గమన్ తత్వాముఖం కాంచనమ్" అంటూ ఒకే ఒక శ్లోకంతో రామాయణమంతా చెప్పిన ఒక శ్లోకముంది. ఇరవై నాలుగు వేల శ్లోకాలతో రామాయణం ఉంది. మరి అలా చక్కగా శ్రద్ధగా చదువుకుంటే రామాయణంలో ఉండేటువంటి కరుణారసము, భక్తి నిన్ను మనిషినే మార్చేస్తుంది. ఎంచేతంటే, నీలో ఉండేటువంటి సమస్త కల్మషాల్ని హరించేటువంటి కథ రామ కథ. అది వినగలిగేటువంటి అదృష్టం ఉండాలి, చదువుకోగలిగేటువంటి అదృష్టం ఉండాలి.

"నేను ఈ విష్ణుకథలు వింటూ, వింటూ ప్రాణం వదిలేస్తాను" అని చెప్పాడు కదా పరీక్షిన్ మహారాజు! ఏడు రోజులుంది. ఈ ఏడు రోజులు ఏం చెయ్యాలి? అనే ప్రశ్నకి ఈ ఏడు రోజులు విష్ణు కథలు వింటూ, ఆ సమయం రాంగానే వెళ్ళిపోతాను ఏముంది? అని పెట్టుకున్నాడు తప్ప, ఇంక వేరే ఏం పెట్టుకోనటివంటివాడు శ్రోత కదా అక్కడ ఉన్నది. అంచేత, అలాంటి కుతూహలం ఉంది. "భూషణములు చెవులకు", చెవులకి ఏమిటయ్యా అలంకారము అంటే, సద్భాషణములు వినడమే భూషణం చెవులకు. ఆ చెవులకి రవ్వల దుద్దులు పెట్టుకున్నా, మాబోటి వాళ్ళు ఏవేవో... ఇప్పుడు పండితులు కూడా పెట్టుకుంటూ ఉంటారు కదా! ఏం పెట్టినా, అవి కాదు భూషణాలు. ఊరంతా ఏవో ప్రతి వాడు ఇంకొకడి గురించి చెప్పడానికే పుట్టినట్టుగా ఉంటుంది

కలియుగంలో అంతా కదా! ప్రతి ఒక్క మనిషి ఇంకొక మనిషి గురించి విమర్శ చెప్తూ ఉంటే మనం వింటూ ఉంటాం ఈ చెవులతో. అది ఏమైనట్లు? అలాంటి చెవులు నోచుకునే చెవులు కాదు. ఏ చెవులైతే విష్ణు కథలు, భగవత్ కథలు వినడానికి ఉత్సాహపడేటువంటి చెవులు, అంటే శ్రవణేంద్రియము, అవి అలంకారమటండి తలకి. అలా లేనప్పుడు ఆ చెవి లేకపోయినా ఇబ్బందేం లేదు. ఎప్పుడూ సద్భాషణములు, భగవత్ సంకీర్తనములు, భగవత్ కథలు, భక్తుల కథలు, ఇలాంటివి వినడానికి ఉత్సాహపడతారే, అంటే చెవి కోసుకుంటారు అంటారు చూసారా, అలా ఉండే చెవుల వల్ల లోపల సంస్కారాలు మారతాయి తప్ప, ఎప్పుడు ఏవో పిచ్చి పిచ్చి మాటలు లోకంలో ఉంటాయి కదా!

పది మంది ఒక చోట కలిస్తే politics పుడతాయి కదా! ముగ్గురు చాలు, పది మంది దాకా ఎందుకు! ముగ్గురు చాలు, ముక్కలు చెక్కలు చేయాడానికి అంటూ ఉంటారు. మనకు లోపల ఉత్సాహం ఉండ బట్టే కదా వాటి గురించి, వీటి గురించి చెప్తూవుంటే వింటూ ఉంటాం! ఒకావిడ “అదండీ!” అని చెప్తుంటే ఇంకో ఆవిడ “అలానా! ఆ! ఆ!” అన్నట్టుగా వింటుంది! ఆడవాళ్లే కాదు, మొగవాళ్ళు కూడా అంతే. విమర్శ వినడానికి ఉండే ఉత్సాహం కీర్తనము చేసినప్పుడు వినడానికి ఉండదు. ఇంకొకడిని కీర్తిస్తుంటే విసుగ్గా ఉంటుంది. ఎందుకంటే, మనని కీర్తిస్తే బాగుంటుంది గాని, ఎవడినో మన ముందు కీర్తిస్తుంటే మనకేం బాగుంటుందండి? బాగుండదు కదా!

అలా కాకుండా ఉందటండి ఇక్కడ పరీక్షిత్తు మహారాజుకి. “భూషణములు చెవులకు బుధ తోషణములు”. బుధులంటే తెలిసినవారు. వాళ్ళకి సంతోషం కలిగించేటువంటి కథ లేవిటయ్యా అంటే దైవ కథలే. ఒక భగవత్ భక్తుడి దగ్గరకు వెళ్లి, మన ఊళ్లో రాజకీయాలన్నీ మాట్లాడామనుకోండి, వాడికి చాలా విసుగ్గా ఉంటుంది, ఏంటి భగవంతుడా! ఇలా పంపించావ్ వీడిని నా దగ్గరకు అని. రామకృష్ణ పరమహంస దగ్గరకు వెళ్లి మనం అవి ఇవి మాట్లాడామనుకోండి, “మా ఊళ్లోనండి...” అని మొదలు పెడితే ఆయనకి interest ఉండదు కదా! అంటే రామకృష్ణ పరమహంస అని ఎందుకు చెప్పానంటే, ఈ కాలంలో భక్తులలో అగ్రగణ్యులు. ఎవరన్నా ఇంకొకళ్ళ గురించి పిచ్చి పిచ్చి మాటలు, విమర్శలు, చెడు మాటలు చెప్తుంటే వినడానికి ఉత్సహించేటువంటి వాడు యోగమునందు ఉన్నానుకుంటే అది భ్రమే. ఎంచేతంటే, నీవు బుద్ధి లోకాల్లోకి పెరగాలంటే బుద్ధి లోకాల్లో ఉండేవాళ్ళు ఏం చేస్తారో అది చెయ్యాలి. బుద్ధి లోకాల్లో ఉండేవాళ్ళు ఎంత సేపు వారి సంతోషాన్ని బాగా ఇనుమడింపచేసుకోవడం కోసం భగవత్ కథలు చదువుకోవటమో, వినడమో, భగవత్ స్తోత్రములు చేయడమో, ఇలా చేసుకుంటూ ఉంటారు. గట్టిగా భాగవతంలో భక్తి ప్రధానమైనటువంటి పద్యాలు చదువుకుంటూ ఉంటే లోపల చాలా వికారాలు పోతూఉంటాయి. అలా కానప్పుడు అవన్నీ లోపల మిగిలిపోతూ

ఉంటాయి. "మంగళతర ఘోషణములు గరుడగమను గుణభాషణముల్'. గరుత్మంతుడ్ని ఎక్కి దిగేటువంటి విష్ణుమూర్తి యొక్క కథలు వింటూ ఉంటే మంగళకరంగా ఉంటాయి అంచేత, చెప్పమన్నాడు. అప్పుడు ఆయన చెప్తున్నాడు. మొత్తం book చాలా బరువుగా ఉంటుందని ఆ ఉపాఖ్యానం మాత్రం తీసుకొని ఇట్లా చేసుకొచ్చానులేండి!

"వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుండను నొక దొడ్డరాజు గలఁ". భీష్మకుడనేటువంటి రాజు ఆయన వీరుడట. విదర్భదేశం రాజధాని కుండిన నగరం. ఆ కుండిన నగరం నుంచి వచ్చినటువంటి ఋషినే కౌండిన్య మహర్షంటారు. "కుండిన" అంటే అర్థమేమిటంటే, హృదయము అని ఒక అర్థం ఉంది. భారతదేశానికి హృదయం లాంటిదే. Central India విదర్భ. ధర్భలే చాలా పవిత్రమైనటువంటివి కదా! విదర్భ అంటే విశిష్టముగా పవిత్రమైనటువంటి రాజ్యము అని అర్థం. అలాంటి రాజ్యంలో ఎవరున్నారటయ్యా అంటే "కుండినభర్త" అంటే హృదయాన్ని అధిష్ఠించినటువంటి వాడు అని అర్థం, అంటే యోగి అని అర్థం. బ్రహ్మతత్త్వము తెలిసినవాడు అని అర్థం. "వీరుడు" – ఎవరు వీరుడంటే బాగా కత్తి యుద్ధం చేసినవాడు, రాజ్యాలు ఆక్రమించినవాడు కాదట, అహంకారమును జయించి, ఆత్మస్వరూపమును దర్శనం చేసినటువంటి వాడు వీరుడు. ప్రపంచాన్ని జయించటానికి అహంకారాన్ని జయించక్కర్లేదు! అహంకారి అవ్వటం వల్లే ప్రపంచ జయం చూస్తూ ఉంటాడు. ఆత్మజయం అన్నిటికన్నా ఎక్కువ వీరత్వముతో కూడినటువంటిది. అందుకని అమ్మవారి నామాల్లో కూడా "వీరా" అనేటివంటి నామం ఉంటుంది. ఎంచేత? తనను తాను తెలిసినది, తన ఎరుక తనకు కలిగినటువంటిది, తాను పరమాత్మయే అని తెలిసినటువంటి ఒక స్థితి. బ్రహ్మమే తానుగా ఉన్నాను అని సర్వకాలసర్వావస్థలయందు ఎవరి యందు ఒక స్థిరమైనటువంటి జ్ఞానముంటుందో, అలాంటి వారిని వీరులంటారు. అలాంటి వాడు భీష్మకుడనేటువంటి రాజు. ఆయన ఉన్న దేశం విదర్భదేశం. ఈ పదాలన్నీ వాటిలో ఉండేటువంటి అర్థం తీసుకుంటే మనకింకొక రకమైనటువంటి జ్ఞానం అబ్బుతుంది. విదర్భదేశం – దర్భలు మీకు తెలుసు కదా! విదర్భదేశము అంటే అత్యంత పవిత్రమైనటువంటి దేశం. ఎమిటా దేశం? శరీరమే దేశం. విదర్భదేశంలో అంటే పవిత్రమైన సప్తధాతువులతో కూడినటువంటి శరీరము నందు కుండిన నగరము, హృదయము రాజధాని. హృదయ స్పందనం వల్లే కదా ఈ దేశమంతా (శరీరమంతా) కూడా చక్కగా పరిపాలింపబడుతుంది. దానికి దెబ్బ తగిలితే ఏముంది, రాజ్యానికి దెబ్బ తగిలినట్టే. అంచేత, దాన్ని పరిపాలిస్తున్నాడట ఆయన, ఆయన వీరుడు. అంటే ఆత్మజ్ఞాని. ఇలా అర్థం చేసుకోవాలి. ఆయన ఒక దొడ్డరాజు. దొడ్డరాజంటే నిజంగా ఎట్లా దొడ్డ అవుతాడండి? కురు సామ్రాజ్యంలో

భాగంగా ఉన్నదేగా! దొడ్డెందుకు అయ్యాడు? అంతరంగంలో బ్రహ్మమును అనుభూతి చెందుతూ, వశిస్తూ ఉన్నటువంటివాడు.

అతడికి ఏవురు పుత్రులు. ఏవురు పుత్రులంటే ఐదుగురు అని అర్థం. ఐదుగురు పుత్రులు పుట్టారటండి. "పుత్రు లగ్రజుండనఘుఁడు రుక్మిఁ నాబరఁగు". పెద్దవాడి పేరు రుక్మి. "నందఱకుం గడగొట్టు చెల్లెలై మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణి నాఁ బ్రసిద్ధయై". ఆవిడకి రుక్మిణి అని పెట్టారు. ఈయనకి రుక్మి అని పెట్టాడు. మధ్యవాళ్ళ పేరుతో అంత సందర్భం కాదన్నమాట, irrelevant, అందుకని చెప్పలేదు పురాణంలో కూడా! ఒకడేమో ఒక రకంగా చాలా ప్రాముఖ్యం పొందాడు. చిట్టచివర పుట్టిన కుమార్తె మరొకరకంగా ప్రాముఖ్యం పొందింది. మధ్యలో వాళ్ళు, they matter not. దేవుళ్లైనా matter not గా ఎంత మందుటారండి? చాలా మందుంటారు. ఫలానా సమయంలో విజయవాడలో ఎవరెవరు ఉన్నారంటే, ఎన్ని పేర్లు చెప్తారండి? అట్లా ఐదుగురు పుట్టారటండి ఈ ఐదుగురు గురించి చెప్పాను, ఐదు మలములని. ఐదు మలములు తర్వాత ఏతెంచినటువంటిది రుక్మిణి. ఐదు మలములు, పంచమలములు. ఈ మధ్య పంచ మలముల మీద భాగవతంలో చాలా సార్లు, చాలా విధాలుగా చెప్పుకుంటూ వస్తున్నాం. అదేమిటంటే, అహంకార మమకారం ఒక మలం. అహంకారం అంటే మమకారం. రాగద్వేషములు ఒక మలం. కామక్రోధములు ఒక మలం. ఈర్షా అసూయలు ఒక మలం. మద మాత్సర్యాలు ఒక మలం. ఐదు మలాలు. మొట్టమొదట ఈయన మహాజ్ఞాని కదా! మహాజ్ఞానికి కొడుకు పుడితే చాలా ఆనందంగా తనంతట వాడవుతాడని చాలా అద్భుతమైన పేరుపెట్టుకుంటాం మనం. కాని కొంతమంది ఆ పేరుకి వికృతంగా, అంటే వ్యతిరేకంగా ఉంటారు. అందుకని "రుక్మి" అని పెట్టుకున్నాడంటే బంగారు కాంతి అని పెట్టుకున్నాడు. ఏది ఎందుకని? రాజుగారి హృదయం యొక్క కాంతి బంగారు కాంతే. ఆయన బంగారు కాంతితో కూడినటువంటి నగరంలో వశిస్తూ ఉన్నటువంటి ఆత్మచైతన్యం అది. ప్రతివాళ్ళకు మరి కొడుకు పుడితే... పడతారుగా! ఇంద్రుడు, చంద్రుడు అని అనుకుంటాంగా తప్పేముంది! తర్వాత వాడు చూపిస్తాడు, వాడేమిటో మనకి! అంచేత, ఇంద్రుడు, చంద్రుడు అయితే మంచిదే! కాని ఇక్కడ కాలేదు. పేరైతే రుక్మి తప్ప వాడు సత్తు కన్నా అన్యాయంగా ఉన్నటువంటివాడు. వాడి తర్వాత నలుగురు అలాంటి వాళ్ళే. ఆ పైన పుట్టింది రుక్మిణి. ఆ పేరుకి సరైనటువంటి గుణవిశేషములు కలిగినటువంటి ఆవిడ. అలాంటి ఆవిడ పుట్టింది. ఆవిడకి చాలా ప్రసిద్ధి కలిగింది అని చెప్తున్నాడు.

"బాలేందు రేఖ తోఁచిన
లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను

బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్."

ఈమె పుట్టి పెరుగుతూ ఉంటే ఆ రాజు గారి దశంతా బాగా తిరిగిందటండి. కిందటి సారి చెప్పుకున్నాం. అపరదిక్కంటే పశ్చిమ దిక్కని, చంద్రోదయం అనేటువంటి దాంట్లో ఉండేటువంటి వైభవమంతా జ్యోతిష్యపరంగా చెప్పుకోటం జరిగింది. ఇప్పుడు మళ్ళీ అది చెప్పుకోము. ఈమె పెరుగుతూ ఉంటే "లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ పాలుని గేహము మెఱసెను". అందుకని, ఇంట్లో అమ్మాయి పుడితే లక్ష్మి పుట్టిందని అంటాం. అవునో కాదో తర్వాత తెలుస్తుంది. పుట్టిన తర్వాత ఉన్నది కూడా పోయిందనుకోండి, జేష్ఠాదేవి పుట్టిందనుకోవాలి. కొంత మంది పుడితే కొన్ని కొన్ని ఉన్నవి పోతాయి. కొంత మంది పుడితే కొత్త కొత్తవి బోల్డు వస్తాయి. ఒక కొడుకు పుట్టినా, ఒక కూతురు పుట్టినా, ఇంట్లో ఆవుకి ఒక దూడ పుట్టినా, లేదా ఇంటికి ఒక అల్లుడు వచ్చినా, ఒక కోడలు వచ్చినా... అంటే, అల్లుడు మనింటికి ఎందుకొస్తాడు? కాకపోతే, అల్లుడు కుటుంబంలో ఒక సభ్యుడు అవుతాడు. అవ్వటం చేత, అల్లుడుగారు అడుగుపెట్టారు, కలిసొచ్చింది అనే సందర్భాలుంటాయి కదా! అలాగే, అమ్మాయి పుట్టిందనుకోండి. అమ్మాయి పుట్టింది కలిసొచ్చింది అనే పరిస్థితి ఉంటుంది. ఇంక ఈ రుక్మిణీదేవి పరిస్థితి ఏమిటంటే, ఈవిడ పుట్టి పెరుగుతుంటే ఆ రాజుకి విపరీతంగా ఒక పక్క ఆత్మానుభూతి పెరుగుతూ వచ్చిందటండి. అంతే కాదు, మొత్తం రాజగృహమంతా కూడా శోభాయమానంగా వెలుగుతూ ఉందిట. ఇంట్లో ఆడపిల్ల పెరుగుతూ ఉంటే, ఆ ఇంట్లో ఒక రకమైనటువంటి కాంతి ఉంటుంది. అందుకని, ఆడపిల్ల ఇంట్లోంచి వెళ్ళిపోతే ఇల్లు చిన్నబోయిందనిపిస్తుంది తల్లితండ్రులకి. అలాగ కొన్ని సత్యాలు ఉన్నాయి మనకి. అవి మనకి ఇలాంటి పుస్తకాలు చదువుకున్నప్పుడు తెలిసొస్తాయి. ఆ విధంగా ఆవిడ పెరిగి పెద్దదయ్యింది. ఆ తర్వాత ఆవిడ బొమ్మల పెళ్ళిళ్ళు చేయిస్తూ ఉండేది, పావురాలకి మాటలు నేర్పుతూ ఉండేది. తర్వాత నెమళ్ళకు నృత్యాలు నేర్పుతూ ఉండేది, హంసలకి ఎట్లా నడవాలో నేర్పుతూ ఉండేది. వీళ్ళందరితో ఆడుకుంటూ ఉండేది. ఆడపిల్లలతో ఉయ్యాలలు ఊగుతూ ఉండేది. అవన్నీ చదవను ఎందుకంటే, మరి ఇవాళ్ళ ఉపన్యాసం అంతా అదే అయిపోతుంది!

ఈ విధంగా ఈవిడ పెరుగుతూ ఉంటే అక్కడ శ్రీకృష్ణునికి కూడా తదనుగుణమైనటువంటి పురుష లక్షణాలన్నీ ఆయనలో వికసించడం మొదలుపెడుతూ ఉంటాయి. ఈయనలో ఏమి వికసిస్తుంటే, తదనుగుణమైన ఆవిడలో వికసిస్తున్నట్లు! ఆయనలో ఏవేవి వికసిస్తున్నాయో, తదనుగుణమైనటువంటి అంగసౌష్ఠవములు ఎట్లా ఏర్పడుతున్నాయో ఒక సీస పద్యం క్రిందటి సారి చదువుకున్నాం. అవి ఒక వధూవరుల మధ్య ఉండేటువంటి అంతర్లీతము, అదృశ్యమైనటువంటి ఒక సూక్ష్మమైనటువంటి ఒక ప్రక్రియ. ఒక పిల్ల పెళ్ళికి ఎదుగుతూ ఉంటే, పెళ్లి సమయం వస్తుంటే, ఆ పిల్లను పెళ్లిచేసుకునేటువంటి పెళ్లి కొడుకు ఎక్కడున్నా

సరే, అతనిలో కూడా అలాంటి శుభప్రదమైనటువంటి మార్పులు కలిగి, ఇద్దరు కూడా వివాహానికి ఉన్ముఖులమవడం అనేటువంటిది అది అంతర్గతముగా జరుగుతూ ఉంటుంది. ఆ పద్యం చెప్పుకోటం జరిగింది.

> "తన తండ్రి గేహమునకుం
> జనుదెంచుచునున్న యతిథిజనులవలనఁ గృ
> ష్ణుని రూప బల గుణాదులు
> విని కృష్ణుఁడు తనకుఁ దగిన విభుఁ డని దలఁచెన్."

ఇంటికి అతిథులు వస్తే అదొక అదృష్టం. ఎంచేతంటే, వాళ్ళు చాలా చాలా దేశాల నుంచి ఎన్నో రకాలుగా, ఎన్నో విశేషాలు తీసుకుని మనకింట్లో కూర్చున్నప్పుడు చెప్తూ ఉంటారు. అందులో ఇంట్లో ఆడపిల్ల ఉందనుకోండి, "ఫలానా ఊళ్ళో ఫలానా మంచి సంబంధం ఉంది" అని చెప్తారు. ఇంట్లో ఆడపిల్ల ఎదిగి, పెళ్ళికి సిద్ధంగా ఉందిట అంటే, ఇంటికొచ్చిన బంధువు అడక్కుండానే ఏదో ఒకటి చెప్పి వెళ్తాడు కదా! మిత్రుడైనా, బంధువైనా, ఒకటికి పది మంది మన ఇంటికి వస్తూ ఉంటే, మన క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అలాంటివి చెప్తూ ఉంటారు. ఎవరూ మనింటికి రాకుండా మనం ఏర్పాటు చేసుకున్నాం అనుకోండి, ఇంక మనకి వార్తలేముంటాయి? ఎక్కడ వెతుక్కుంటావు అల్లుడు గురించి? ఫలానా చోట ఉన్నాడంటే, వెళ్లి తెచ్చుకుంటావు. ఎక్కడున్నాడో తెలియదు కదా! మనింటికెవ్వరు రారు, మనమెవరింటికి వెళ్ళం! మనకి ఏం తెలుస్తాయి? అందుకని ఏం చేయాలి? అవేవో పెట్టారు కదా! అక్కడికి పోతావు. అదీ మన పరిస్థితి. అక్కడికి వెళ్తే మనం ఏం చూస్తాం? వాడి ఎత్తెంత? వాడి చదువేమిటి? వాడు ఎంత సంపాదిస్తున్నాడు? ఇవేగా చూస్తావు! ఈ మూడూ వాడి గుణాల్ని చూపిస్తాయా? వాడి సమర్థతను చూపిస్తాయా? సమర్థవంతుడై గుణములు లేకపోతే? గుణవంతుడై సమర్థత లేకపోయినా ఫర్వాలేదుగాని, సమర్థవంతుడై గుణములు లేనివాడని తెచ్చుకున్నావనుకోండి, తెచ్చుకున్నది మానవ రూపంలో ఉన్నటువంటి ఒక జంతువు వస్తుంది కదా! ఇంకోటి వస్తుందా? ఎంతసేపూ ఎంత సంపాదిస్తున్నాడు, ఏం చదువుకున్నాడు? height ఎంత? తెల్లగా ఉంటాడా? నల్లగా ఉంటాడా? బట్టతలా? కాకపోతే జుట్టుందా? ఉంగరాల జుట్టా? silky hair ఇవి చూసుకుంటున్నారు. ఇవన్నీ physical features. వాడి తత్త్వమేమిటి? లోపల ఏమిటి వాడు? వాడు దొంగా? వాడు మోసగాడా? వాడు జబ్బుల పుట్టా? మనకేం తెలుసు? ఏం కనుక్కున్నారు? ఏం కనుక్కోలేదు? అందుకని, నీకు హితం చేసేటువంటివారు నీ ఇంటికి చాలా మంది వస్తున్నప్పుడు వాళ్ళందరు చెప్పారండి.

రుక్మిణి అట్లాగా ఈయన నాకు తగిన భర్త అనుకుంది. ఆ గుణ సంపద వల్ల, బల సంపద వల్ల, రూప సంపద వల్ల, మూడూ ఉన్నాయి కదా! అలాగే శ్రీకృష్ణుడు:

"ఆ లలన రూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ, జేకొందు ననుచు హరియుం దలఁచెన్."

ఆయన చాలా దృఢంగా నిర్ణయించేసేసుకున్నాడట. ఈయన విన్నాడు. మరి వాళ్ళింటికి వస్తారు కదా! పదిమంది వచ్చి పోయే ఇళ్ళు, ఇళ్ళు కదా! అంటే ఏమిటంటే, మనిళ్ళు కూడా పది మంది వచ్చి పొయేట్టుగా ఏర్పాటు చేసుకుంటే మనకి చాలా రకాలుగా శుభవార్తలు, మనయందు ఉండేటువంటి శ్రేయస్సు యందు అభిలాష చేత, శ్రేయోభిలాషలు మనకి చెప్పి వెళ్తూ ఉంటారు. లేకపోతే, ఏదీ తెలియవు. మనకి తెలిసిందే మనకి మిగిలిపోతుంది. ఇది సాంప్రదాయం. అలా తెలుసుకున్నారటండి. పెళ్లి సంబంధాలు అలా తెలుసుకోవాలి. ఇంకోలాగా తెలుసుకుంటే ఇబ్బందులుంటాయి. "ఇలా అనుకున్నామండి. America ఇచ్చామండి. మోసం అయిపోయిందండి" అనే సందర్భాలు నా దగ్గర ఉన్నవి పది ఉన్నాయి. "బాగా సంపాయిస్తాడు. America లో ఉన్నాడు. America లోనే ఉండిపోతాడట" అని మొహం ఇట్లా వికసింపచేస్తూ చెప్తాడు. అమెరికాలో ఉండిపోతే ఏమిటి? స్వర్గంలో ఉన్నట్టుగా ఇప్పుడు మన భారతీయుల భావన. "చాలా బాగుందండి అంటాడు" చుట్టూ ఉండేవారు కూడా. వెళ్తుంది పాపం, అక్కడికెళ్తే అంతా అయోమయంగా ఉంటుంది, వాడి సంగతి తెలుస్తుంది. సంవత్సరంలో విడాకులు, వెనక్కి రావటం. "ఇప్పుడేం చేద్దామండి?" అంటారు. నువ్వేం తెలుసుకోవాలో అది తెలుసుకోకుండా పెళ్లి చేస్తే అలా ఉంటుంది.

"బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై."

బంధువులందరు కూడా "శేముషీ సింధువులై" అంటే సముద్రమంత బుద్ధి కలిగినవారట. వాళ్ళందరూ కూడా ఏం చెప్పారంటే, కృష్ణునికి ఇద్దాం పిల్లని బాగుంటుంది అన్నారట. అదేం కుదరదు అన్నాడు వాడు. ఒకడు ఇంట్లో ఉన్నాడు కదా! ఇంట్లో ఓ మూర్ఖుడు, అహంకారి, బలవంతుడైనటువంటి కొడుకొకడు ఉన్నాడనుకోండి,

వాడు నాన్న ఏం చెప్పినా కొట్టేస్తాడు, "నీకేం తెలుసు. నేను చెప్పినట్టు విను" అనే కొడుకులంటారు కదా! "మా నాన్నకేం తెలుసు?" అనే కొడుకు, కొడుకు కాదండి. నువ్వు వాడికి పుట్టావు కదా! వాడికి నీకన్నా ఎక్కువ తెలుసనే భావన నీకుండదు. పైగా ఈయన బ్రహ్మజ్ఞాని. బ్రహ్మజ్ఞాని అలా అంటే ఏమి అనడు, ఊరికే అట్లా చూస్తూ ఉంటాడు అంతే! "నాకు తెలియకపోవటం ఏమిటిరా వెధవ" అని అనడు బ్రహ్మజ్ఞాని. ఈమెను నేను శిశుపాలుడికిస్తాను అని చెప్పి, ఎవడొచ్చినా వీల్లేదని చెప్పేవాడు. మీరు అక్కర్లేని పెత్తనాలు చెయ్యకండి అంటుంటారు చూశారా కొడుకులు? వారింటికొచ్చిన వాళ్ళు ఇలా చేస్తే బాగుండని సలహా చెప్తే, మీరు అక్కర్లేని పెత్తనాలు ఏం చెయ్యద్దు, నా చెల్లెల్ని నేను శిశుపాలుడికిచ్చి పెళ్లి చేసుకుంటాను, వాడు నాకు friend అంటాడు. చిన్నప్పటినుంచి వాడు నాకు friend కాబట్టి వాడికిచ్చి పెళ్లి చేసుకుంటాను. ఇంకెవ్వరు ఏం చేయటానికి వీల్లేదని చెప్పేశాడండి.

"అన్న తలంపు దా నెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే."

ఏ విధంగానైనా సరే నేను వాడికే ఇచ్చి పెళ్లి చేస్తాను అన్నాడు. "జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే". ఒక బ్రాహ్మణుడిని పిలించిందట. ఆయన సామాన్యుడు కాదు. ఆయన పేరు అగ్నిద్యోతనుడు. అగ్నిని ప్రజ్వలింపచేయటమంటే యోగ ప్రక్రియది. జీవాత్మకి, పరమాత్మకి అనుసంధానం చెయ్యగలిగినటువంటి ఒక సద్గురువు. అలాంటి వాడిని ఒకాయన్ని పిలిచిందండి ఆవిడ.

ఏమిటండి ఇది? పలకదే! మనలో అహంకారం ఏం చెప్తుందంటే, ఈ పూజలు, ఈ ప్రార్థనలు, ఈ గురుపూజలు... "ఏవిటండి? ప్రతి ఊళ్లోను గురుపూజలు? మీరు కొన్ని మార్చాలి మాస్టారు. కొన్ని చోట్ల తీసేయ్యాలి గురుపూజలు" అని చెప్తూ ఉంటారు నాకు కొందరు. వాళ్ళుపెట్టుకుంటే నేను వాళ్ళను మార్చలేను. వాడు గురువుగారు ప్రార్థన చేసుకోవడానికి గురుపూజలు ఏర్పాటు చేసుకొని, "నువ్వు వస్తే రా. లేకపోతే, నేను చేసుకుంటాను" అంటాడు. నువ్వు రాకపోతే వాడికి ఏంటి? "ఎందుకండి? ఇన్ని గురుపూజలు?" అంటుంటాం కదా! "ఈ పూజలేంటండి? ఇన్నిన్ని పూజలు పెట్టేస్తూ ఉంటారు?" అంటాం. "ఈ ప్రేయర్ ఇలానే చేసుకోవాలాండి? ఇంకో రకంగా చేసుకోకూడదా?" అని అడుగుతారు కదా! ఏమిటిలా అడిగేవాడు? ఎవడు వాడు? నీలో ఉండే అహంకారి. వాడే రుక్మి. రుక్మిణీదేవి జీవాత్మ. అంటే, మనలాంటి భక్తుడన్నమాట. యోగంలో

బ్రహ్మాన్ని పొందాలని కదా మనం ఇందులో చేరాం. అంటే బ్రహ్మమో, గిమ్మమో నాకేం తెలియట్లేదు ఇప్పుడు అనేటువంటి పరిస్థితుల్లోకి వచ్చేసాం కదా! ఉన్నాడో, లేడో అన్నట్టు కదా! అసలున్నావా నువ్వు అనేటువంటి ప్రశ్నల్లో పడిపోయినటువంటి యోగ సాధకుల్లేరు? "ఈ సి. వి. వి. గారు చెప్పిందంతా సత్యమేనంటారా?" అని అడిగిన వాళ్ళున్నారు నన్ను! యం. యన్. గారికి నిజంగానే ఇట్లా జరిగిందంటారా అంటాడు? ఇ. కె. గారు ఇన్ని పెట్టారెందుకండి అని అడుగుతాడు? ఎందుకడుగుతాడు? వాడికి అజ్ఞానం ఒకటి. అజ్ఞానానికి తమ్ముడు అహంకారం. అది ఇందాక చెప్పాను.

పంచమలాలు ఇలా కూడా చెప్తారు: అజ్ఞానం, అజ్ఞానం వల్ల అహంకారం, అహంకారం వల్ల కోరకూడనిది కోరటం, కోరదగిన విషయములందు ద్వేషము, అటుపైన దేహపోషణము, ఈ ఐదిట్లో ఉంటారు. ఆజ్ఞానం, అహంకారం, మితిమీరిన కోరిక, మితిమీరిన ద్వేషం. కోరుకుంటే ద్వేషం ఉంటుంది. ఆపైన ఈ దేహాన్ని ఎట్లా రక్షించుకోవాలనేటటువంటి తపన. ఇందులోనే ఉండిపోదామని మనకొక తాపత్రయం ఉంటుంది కదా! నువ్వు ఉండిపోదామంటే అది ఉండనివ్వదు. ఎప్పుడు గుఱ్ఱం ఎక్కే కూర్చుంటానంటే గుఱ్ఱం ఊరుకుంటుందాండి! ప్రయాణం అయిన తర్వాత కూడా దాని మీద అట్లా కూర్చొని, అన్నీ చేస్తుంటే అదొక్కసారి వెనక కాల్తో తన్నదు? కిందపడేస్తుంది. అట్లాగే దేహంలో నువ్వు ఎప్పుడు అప్పస్సంగా ఉండిపోదాం అనుకోవటం కూడా అజ్ఞానమే. అది మన ప్రయాణానికి ఇవ్వబడినటువంటి ఒక వాహనం. కాబట్టి మనం ప్రయాణంలో ఉన్నామా? లేదా? ఉన్నంత కాలం అది మనకు పని చేసి పెడ్తూ ఉంటుంది. మనం ప్రయాణం లేకుండా ఊరికే దాని మీద కూర్చొని ఉంటానంటే అది ఒప్పుకోదు. అదొక అజ్ఞానం. ఇంకా కొన్నాళ్ళు బతికితే బాగుండు అని ప్రతి వాళ్ళు అనుకుంటాం కదా! "అదేంటండి? మాకింకా పాతికేళ్ళే కదా?" అంటే అది వేరే సంగతి. అరవై వచ్చినా, డెబ్బై వచ్చినా, ఇంకా ఉందామని కదండి ప్రతివాడు అనుకుంటాడు. "మా మనవడి పెళ్లి చూద్దాం అనుకుంటున్నానండి" అంటుంది ఒకావిడ. "ఓ మునిమనవడ్ని చూడొద్దండి?" అంటుంది ఇంకో ఆవిడ. ఏవో ప్రతివాడికి వెళ్ళిపోదామనేటువంటి తపన ఎప్పుడూ ఉండదు. వెళ్లిపోతామేమో అనేటువంటి తపనుంటుంది కదా! ఈ వెళ్లిపోయేలోపల కొన్ని కొన్ని పనులు చేసెయ్యాలి అనుకుంటుంటాం కదా మనం! నేను వెళ్లిపోయే లోపల, నువ్వు వెళ్ళిపోయే లోపలేంటి? నీకు తెలుసా? రేపే వెళ్ళిపోవచ్చు, ఈ రాత్రే వెళ్లిపోవచ్చు. ఎవడికి తెలుసు? అదొక అజ్ఞానం. ఎవరిమీదైనా మనకి ద్వేషముందిట అంటే, అదొక అజ్ఞానం, అదొక మలం. విపరీతమైన కోరిక ఉన్నవాడికి ద్వేషముంటుంది. కోరిక ఉన్న చోట ద్వేషముంటుందండి. ధర్మబద్ధం కానటువంటి కోరిక ఉన్నచోట ద్వేషం కూడా దాన్ని ఆనుకునే ఉంటుంది. ఇవన్నీ మూల కారణం అహంకారం చేత ఉంటాయి. అహంకారానికి కారణం అజ్ఞానం. అజ్ఞానం, అహంకారం, కోరిక, ద్వేషము, బతకాలనేటువంటి ఆశ — ఈ ఐదు, ఐదు

మలములు. ఇందులో వీడు పెద్దవాడు రుక్మి అహంకారం. మహా అహంకారి వాడు. మనలోనే మనకి అహంకారం ఉందా, లేదా? ఎప్పుడు నా గురించి నేను మాట్లాడుతున్నానో, అప్పుడు నేను అహంకారి అని అర్థం. "నేనింతంటి వాడిని. నేనంతటివాడిని. నేను ఇది చేశాను. నేనది చేశాను. నేను ఇది ఇచ్చాను" ఇట్లా మాట్లాడుతుంటారు కదా! అదెవరు తెలుసా అట్లా మాట్లాడుతోంది? వాడిలో ఉండేటువంటి అహంకారం మాట్లాడుతుంది. "నేను హైదరాబాద్ నుంచి రోడ్డు మీద చాలా కష్టపడి వచ్చాను" అన్నాడనుకోండి, నువ్వు రావటమేమిటి? నీకు వీలుపడింది అట్లా రావడం కదా! దార్లో ఏదన్నా అడ్డొచ్చిందనుకో? చెట్టు పడిపోవచ్చు, truck అడ్డంగా తిరిగి పడిపోవచ్చు. లేదా నీ car కే ఏదో puncture అవ్వచ్చు, ఏదో రిపైర్ రావచ్చు. లేదా నీకే కడుపు నెప్పి వచ్చి వెనక్కెళ్ళిపోదాం అనుకోవచ్చు. ఏదైనా రావచ్చు కదా! జరిగిందల్లా నేను చేశానంటాడు అహంకారి. ఆత్మజ్ఞానానికి సాధన చేసేటువంటి వాడికి ప్రధానమైనటువంటి అవరోధం అహంకారము.

దేవకీదేవికి కంసుడెట్లాగో... పురాణపురుషుడు తనయందు పుట్టకుండా ఉండటానికి వాడు చేసే ప్రయత్నం ఇంత అంత కాదు కదా! ఎట్లా వస్తుందో అష్టమ గర్భం నేను చూస్తాను అంటాడు. రానే వచ్చాడు. అట్లా రుక్మిణీదేవి పరమాత్మను చేరుకోవాలనేటువంటి తపన చెందుతున్నటువంటి జీవాత్మ. అంచేత, ఈ రుక్మి అనేటువంటివాడు ఆ జీవాత్మ పరమాత్మను చేరకుండా అడ్డుపడేటువంటి అహంకారం. ఎక్కడుంది? మనలోనే ఉంది కథ. మనకిప్పుడు ఈ prayer లు ఇవి చెయ్యకపోతే ఏం అనిపిస్తుంది ఒకొక్కసారి? ఈ prayer లు చెయ్యకపోతే ఏం అని? రోజు షోడశోపచార పూజ చెయ్యకపోతే ఏం అని అనిపిస్తుంది. ఎందుకనిపిస్తుంది తెలుసా? తమోగుణం చేత, తామసిక అహంకారం. పది మందికి తెలిసేట్టుగా చేద్దాం అనిపించేటువంటిది రాజసిక అహంకారం. నేను సైతం పూజలు చేస్తున్నాను, నేను సైతం అభిషేకాలు చేస్తున్నాను, నేను సైతం హోమాలు చేస్తున్నానని చక్కగా ప్రచారం చేసుకుంటూ, వీలుంటే టెలివిజన్లో కూడా చూపించుకుంటూ చేసే పూజలు, క్రతువులు, అభిషేకాలు, హోమాలు ఉంటాయి. అవంతా రాజశిఖమైనటువంటి అహంకారం. పూజ చేస్తున్నది దేని కోసం అంటే అది నీకు భగవంతునికి మధ్య ఉండేటువంటి అనుసంధానం కోసం. ఊళ్ళో వాళ్ళందరికి తెలియటం కోసమా? దంభాచారమంతా రాజశిఖ అహంకారం. ఎందుకు చెయ్యాలి అనేటువంటిది తామశిఖ అహంకారం. చెయ్యటంలో అశ్రద్ధ, నిర్లక్ష్యం, ఎట్లా పడితే అట్లా చేయటం అది తామశిఖ అహంకారం. భక్తితో, శ్రద్ధతో విధి విధానంగా పూజలు నిర్వర్తించుకుంటూ, తన ఆర్ద్రతను శ్లోకములలో నింపి స్తోత్రం చేస్తూ ఉంటే భగవంతుడు పరితృప్తుడౌతాడు. అలా జరగకుండా నీలో మూడు రకాల అహంకారాలు నీకు అడ్డుపడ్తూ ఉంటాయి.

తామసిక అహంకారం అడ్డుపడ్తుంది, రాజశిఖ అహంకారం అడ్డుపడ్తుంది, సాత్త్విక అహంకారం కూడా అడ్డుపడ్తుంది. ఎందుకని? “అంతా బాగా సవ్యంగా చేస్తున్నాను. నేను చేస్తున్నాను. ముప్పై ఏళ్ళుగా చేస్తున్నాను” అంటే చాలు, అహంకారం! సాత్త్విక అహంకారం. ముప్పై ఏళ్ళుగా జరుగుతుంది. “సార్! మీరు చక్కగా విజయవాడ గురుపూజలు రాగలిగారండి” అంటే, “ఇహిహి” అనకూడదు. “వీలుపడ్డదండి, వీలైంది” అని చెప్పాలి. నీలో సరైనటువంటి సంపత్తి, మాస్టరు గారికి నచ్చిన సంపత్తి నీలో లేకపోతే ఊళ్లో ఉండేవాళ్ళు కూడా గురుపూజలకు రాలేరు తెలుసా! అప్పుడు ఊళ్ళోంచి ఎళ్ళిపోయే కార్యక్రమం వస్తుంది. ఊళ్లో ఉండేవాళ్ళు ఆ time లో వాడు ఊళ్లోంచి వెళ్ళిపోయే కార్యక్రమమొకటి వస్తుంది వాడికి. “అదేంటయ్యా! మీ ఊళ్లో గురుపూజలు. నువ్వు రాలేదు?” అంటే, “మా వేలు విడిచిన మేనమామ కొడుకు పెళ్ళాం పోయిందండి. వెళ్ళాల్సి వచ్చింది” అంటాడు. ఏదైతే ఏంటి, నువ్వు రావటానికి మాస్టరు గారు ఒప్పుకోలేదు. ఒక దేవాలయానికి వెళ్ళటానికి గాని, ఓ యాత్ర చేయటానికి గాని, ఓ మాస్టరు గారు ప్రార్థన చేయటానికి గాని, ఓ పూజ చేయటానికి గాని వీలుపడుతూ ఉంటే అది దైవానుగ్రహం. నేను బాగా చేస్తున్నాను అనే భావన నీకు కలిగితే మర్నాడే ఏదో ఒక అవరోధం వచ్చేస్తుంది. అది అహంకారం.

“ఇప్పుడు ఈ అహంకారం ఎన్ని రకాలుగా అడ్డుపడుతుందో తెలుసా?” అని చెప్తోంది రుక్మిణీదేవి బ్రాహ్మణుడితో. ఎప్పుడైతే మన అహంకారమే మనం దైవం దగ్గరకు చేరాలనేటువంటి ఇచ్ఛకు అడ్డుగా నిలిచిందో, అప్పుడు నీకూ ఒకటే గతి ఉన్నది – సద్గురువు. వాడే దారి. ఇంకెవ్వరూ ఏం చేయ్యలేరు. ఈ అహంకారమనేటువంటిది మనకి తెలియకుండానే మొలుస్తూ ఉంటుందండి, క్షణంలో వచ్చేస్తుంది. ఏదో ఒక ప్రవచనం అయిన తరువాత ఎవరనా “బాగా చెప్పారండి” అని ఒక్క మాట అంటే చాలు, లోపల తట్టిడొస్తుంది. చెప్పడం ఏమిటి? వాడు చెప్పుకున్నాడు అనేటువంటి భావన ఉందనుకోండి, మనమా చెప్పేది అనుకోవాలి. ప్రవచనం నేను కాదు ఇచ్చేది, ప్రార్థన నేను కాదు ఇచ్చేది, ఆయన ఇచ్చుకుంటాడు మనం కూర్చుంటే. అలాగే నేను కాదు గురుపూజలకు వచ్చేది, మాస్టరు గారు పంపించగలగడం వలన నేను వచ్చాను అనేటువంటి భావన. ఇలా passive voice అంటారు ఇంగ్లీష్ లో. It has happened. I did it అనకుండా it has happened. ఇట్లా జరిగింది. అందుకనే మాస్టర్ గారు అంటుండేవారు ఏం జరిగినా. “ఇట్లా జరిగింది మాస్టారు” అంటే “మాస్టరు గారి అనుగ్రహమోయ్! మనమా!” అనేవారు. Europe లో మొట్టమొదట సారి land అవుతున్నప్పుడు నేనన్నాను మాస్టరు గారితో “First landing for me on the land of Europian continent by your grace, Master” అని చెప్పాను ఇంగ్లీషులో. అదో స్టైలు! “మీ అనుగ్రహం చేత నేను మొట్టమొదట సారిగా ఐరోపా ఖండంలో కాలు మోపుతున్నాను మాస్టర్ గారు” అని చెప్పాను. అంటే ఆయన

వెంటనే కొట్టేశారు దాన్ని. "నా అనుగ్రహం కాదు, మాస్టరు గారు అనుగ్రహం. మాస్టరు గారు అనుగ్రహించటం చేత నువ్వు, నేను దిగుతున్నాం" అని చెప్పారు ఆయన. ఇప్పుడు మన్నెవరన్నా "మీ అనుగ్రహం చేత నాకిలా జరిగింది" అంటే మనమేమంటాం? "గుర్తుపెట్టుకో" అంటాం కదా! అది లేదు ఆయనకి. వెంటనే ఆయన zero error గా పెట్టేసుకున్నారు. ఎవరన్నా పొగిడితే, మన్ని మనం zero rrror గా వెంటనే పెట్టేసుకోవాలి. లేకపోతే ఇబ్బంది పడిపోతాము. ఎందుకంటే, చిన్న కలుపు మొదలయితే, అది పెద్ద పెద్దదైపోతూ ఉంటుందండి.

ఇక్కడ చూడండి ఎంత బాగా చెప్పిందో? నాకేం నచ్చిందంటటే ఇందులో"ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁడెన్ని విధంబులం."ఎన్ని విధాలుగా అహంకారం అడ్డు వస్తుందో మనిషికి! ఎన్ని విధాలుగా మనం చెప్పలేం! మనకి తెలియకుండానే మనం అహంకారపూరితలమైపోతాం. అంతా బాగుంటే అహంకారమేనండి. మా చిన్నతనంలో ఒక సినిమా ఉండేది. ఆ సినిమాలో ఒకాయనుంటాడు విదూషకుడు. అంతా బాగుంటే "వీరభద్రయ్య" అంటాడు. ఇలా మీసాలుంటాయ్ ఆయనకి. మీసం తిప్పి "వీరభద్రయ్య" అంటుంటాడు. ఏది బాలేని పరిస్థితి వస్తే, "ఉట్టి భద్రయ్యనే" అంటూ ఉంటాడు. అట్లా మనకి కష్టాలొస్తే, ఉట్టి భద్రయ్యల్లం. అంతా బాగా జరుగుతుందనుకోండి, వాడు వీడు గుర్తించట్లేదు అని ఒక బాధ వస్తూ ఉంటుంది. ఇంత బాగా నేను చేస్తుంటే ఎవ్వడు గుర్తించడు అంటే, ఎవడు గుర్తించాలి? వాడు గుర్తించాలి కదా! రుక్మిణీదేవికి ఇది అర్థమయ్యింది. మనక్కూడా అర్థం కావాలి.

లోపల కథ – ఎప్పుడూ భగవత్ భక్తునికి ఒక పెద్ద ఆటంకం ఒకటుంటుందండి. దానికి లొంగిపోయి పడిపోతావా? దాన్ని దాటి వెళ్తావా? అనేది ముఖ్యం. దాటితేనే కథ. దాటకపోతే మళ్ళీ మాములే – కథ కంచికి మనమింటికి. ఈవిడ తెలిసిన వ్యక్తి కాబట్టి ఏం చేసింది? సద్గురువే ఉపాయం. అగ్నిద్యోతనుడనే పేరు ఎంతటి అద్భుతమైన పేరండి! "అగ్నిద్యోతనుడు", "జ్వాలాకూలుడు" అంటే ఎలా ఉంది? అగ్నిద్యోతనుడు అలాంటి పేరు పెట్టాలన్నా ఎవరికి మనం పెట్టుకోలేం. ఎందుకంటే, వాడిలో అగ్ని ప్రజ్వరిల్లుతుందో లేదో! వాడికే ప్రజ్వల్లింపలేని వాడు, ఇంకొకడికి ఏమి అంటిస్తాడు? ఎవరు తన యొక్క కుండలిని చైతన్యాన్ని, కుండలిని అగ్నిని ఊర్ధ్వముఖం చేసి, సహస్రారానికి చేర్చుకొని, అటుపైన అదే కార్యం ఆసక్తికరమైనటువంటి సాధకులకు అందించగలుగుతాడో అలాంటి వాడిని అగ్నిద్యోతనుడు అంటారు. గదిలో వెలిగించాలంటే అక్కడ ఏదన్నా ఉండాలి కదండి! మన వరకు ఆ దీపం వెలిగించడానికి అగ్గిపెట్టె అగ్నిద్యోతనుడు. అగ్గిపెట్టె లేదనుకోండి, దీపం ఎట్లా వెలిగిస్తావు నువ్వు? అగ్ని చేతనే అగ్ని వెలిగింపబడుతుంది. కర్పూరం దానంతట అది కాల్తుందా, మండుతుందా? మండదు. దీపం దానంతట అది వెలుగుతుందా? వెలగదు. నీలో చైతన్యం ఆ విధంగా అగ్నిస్వరూపాన్ని దాల్చాలంటే మరి యొక అగ్నిస్వరూపుడు దానికి స్పర్శనివ్వాలి. అగ్గిపుల్ల స్పర్శచేత కదా దీపం వెలిగింది! అగ్గిపుల్ల ఎలా వెలిగింది? మూడు

సార్లు రాపిడి చేస్తే టక్కున అందులోంచి అగ్ని పుడుతుంది. అట్లా అన్నింటిలోంచి పుడుతుందా? ఈ జేబులో pen ఉంది. ఈ pen ఇట్లా అంటే అగ్ని వస్తుందా? రాదు. దేని వలన అగ్ని ప్రజ్వలితమౌతుందో, అది ఎంత సంసిద్ధిత కలిగి ఉన్నది.

అలాంటి అగ్ని స్వరూపులై ఉంటారు యోగులు. యోగాగ్ని ఉంటుంది వారి యందు. ఆ యోగాగ్ని చేత వారు పరిపూర్ణంగా పునీతం చేసుకొని ఉంటారు వారు. యోగాగ్ని దగ్ధ కర్మలు యోగీశ్వరులు. యోగీశ్వరుడైనటువంటి వాడు, తన సద్గురువు యొక్క అనుగ్రహం చేత తనలో రగుల్కొపబడినటువంటి అగ్ని చేత తనలో ఉండేటువంటి సమస్తమైనటువంటి కల్మషాల్ని దగ్ధం చేసుకుంటాడు. అలా చేసుకుందాం అనేటువంటి అమితమైనటువంటి ఆసక్తి కలిగినటువంటి వారికి దాన్ని అందించటానికి అగ్గిపెట్టెలో పుల్లలాగా సంసిద్ధంగా ఉంటాడు. తగుదునమ్మా అని అందరికి అంటించడు. మనం కూడా అంటించుకోవాలి అని ఎవరెవరు తపన చెందుతారో, వారందిరికి అంటించగలడండి. అలాంటి బ్రాహ్మణుడటండి ఆయన. వచ్చిన ఆయన సామాన్యుడు కాదు. అంచేత, అలాంటి బ్రాహ్మణుడ్ని డొక్కని జీరి ఈ విధంగా చెప్పి, ఇప్పుడు నా పరిస్థితేంటి? నా గురించి కొంచెం నువ్వు... హనుమంతుడు అమ్మవారి గురించి రాముడికి చెప్పినట్టుగా... హనుమంతుడు అగ్నిస్వరూపుడేగా! ఏకాదశ రుద్రులు రూపుకట్టుకొని హనుమంతుడిగా దిగి వస్తాడు రామునికి కార్యానికి సహకారం అందించటానికి. సీతమ్మ ఏ విధంగా రామునికి, హనుమంతుని ద్వారా విన్నవించుకుంటుందో అలా రుక్మిణీదేవి, అగ్నిద్యోతనుడిని ద్వారా శ్రీకృష్ణునికి విన్నవించు నా పరిస్థితి అని చెప్పింది. “అయ్యా!” ఇంకో మాట చెప్తోంది. “కొడుకు విచారములయ్యయు వారింపఁజాలఁడు.” ఆయనేం చేస్తాడు? ఆయన శుద్ధ సత్త్వం. కొడుకేమో మహా అహంకారి. సరే కాని అని ఊరుకున్నాడు. బ్రహ్మజ్ఞానికి ఏంటంటే, జరుగుతున్న దాన్ని జరిపిస్తూ ఉంటాడండి. “కానీ. అలాగే చేయరా” అంటాడు. “అలా నువ్వు అనుకుంటున్నావుగా, అలానే చేయి” అంటాడు. ఏం చేసినా, జరగవలసింది జరుగుతుంది తప్ప వీడనుకున్నది జరుగుతుందా? జరగదు. అలా తెలిసివుంటాడు జ్ఞాని. అందుకని జ్ఞాని అడ్డుపడడు, proceed అంటాడు. అటు కొడుకుకీ, కూతురుకీ proceed అంటాడు. ఆవిడ రాజకన్య – ఆవిడ ఎవ్వరికి చెప్పలేదు, తల్లికి కూడా చెప్పలేదండి.

నా యొక్క స్నేహం, కృష్ణుని యందు నాకు కలిగినటువంటి స్నేహపూర్వకమైనటువంటి భక్తి, ప్రేమ కృష్ణునికి చెప్పు. “చెయ్యన” – చాలా వెంటనే వెళ్ళిపోయి చెప్పు. “నిజ సేవకానుసారిన్ శౌరిన్” –తన సేవకుడిని తాను అనుసరిస్తాడటండి కృష్ణుడు. అర్జునుడు కోసం కూర్చోలేదా రథంలో. తన భక్తుడికి తానే సేవకుడై ఉంటాడుట భగవంతుడు. తన భక్తుడికి తానే సేవకుడై ఉంటాడట సద్గురువు కూడా. తన సేవకుల్ని

అనుసరించేటువంటి వాడు కదా ఆయన! తానెవరు? అతని సేవిక. తనని ఒక సేవిక స్థితిలో పెట్టుకుంది. "నేను రాజకుమార్తెని, నాకేంటి?" అన్నట్టుగా లేదు. గుణవతి, రూపవతి, జ్ఞానవతి, బంగారు కాంతి గల శరీరం కలిగినటువంటిది. మామూలుగా ఎలా ఉండాలండి? వినయంగా, భక్తిగా, అణుకువగా నేను కృష్ణునికి నా జీవితాన్ని కైంకర్యం చేసుకుందాం అనుకుంటానన్నుట్టుగా కబురు పెడుతుంది. అంతేగాని, నీతో నేను సరిసామనము అంటూ మాటిమాటికి rights oriented గా ఉండదు రుక్మిణీదేవి. నువ్వెంతో నేనూ అంతే అన్నట్టుగా ఉండదు రుక్మిణీదేవి. తనకు తెలుసు అతడెంతో. ఆవిడ ఏమి కబురు పెట్టి పంపిందో చెప్తాడు బ్రాహ్మణుడు. ఇవాళ్ళ కనీసం చదువుకుంటాం అనే అనుకుంటున్నాను! శౌరి అతడు, శౌర్యం కలిగినటువంటివాడు. అలాంటి వాడికి ఈ విధంగా విన్నవించమని చెప్పింది.

> "అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకా
> నగరంబునకుం జని ప్రతిహారులవలనఁ దనరాక యెఱింగించి యన్నగ
> ధరుం డున్న నగరు ప్రవేశించి యందుఁ గనకాసనాసీనుం డయి యున్న
> పురుషోత్తముం గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవించిన ముసిముసి
> నగవులు నగుచు బ్రహ్మణ్యదేవుం డైన హరి తన గద్దియ దిగ్గిన డిగ్గి
> బ్రాహ్మణుఁ గూర్చుండ నియోగించి తనకు దేవతలు సేయు
> చందంబునం బూజలు చేసి సరస పదార్థసంపన్నంబైన యన్నంబుఁ
> బెట్టించి రెట్టించిన ప్రియంబున నయంబున భాసురుం డైన భూసురుం
> జేరి లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు
> మెల్లన యి ట్లనియె."

రహస్య వచనాలంటే? తాను, ఆయనా cellphone లో మాట్లాడుకున్నవన్నీ చెప్తుందా? లేవుగా cell phone లు! ఆవిడ చెప్పిన విషయాలన్నీ తర్వాత చెప్తాడు బ్రాహ్మణుడు. కుచేలుడిలా వెళ్ళలేదు అగ్నిద్యోతనుడు. ఏవో ద్వారపాలకులు మన్ని పంపిస్తారో, పంపించరో, ఇవన్నీ ఆయనకి లేవు. ఆయన మహాధీరుడు. సినిమాల్లో అంచనా పెట్టుకోబోకండి సుమా! సినిమాల్లో కూడా ఒక బ్రాహ్మణుడు వెళ్లి కృష్ణునికి సందేశమిస్తాడు. ఇలాంటి వాడు కాదు ఈయన, చాలా ధీరోదాత్తుడు. ఎంతటి వాడండి? "బ్రాహ్మణుండు ద్వారకా నగరంబునకుం జని ప్రతిహారుల వలనఁ దనరాక యెఱింగించి" – తనెవరో, ఎక్కడి నుంచి వచ్చాడో చెప్పాడు. "యన్నగ ధరరుం డున్న నగరు ప్రవేశించి" – ఆయనుండేటువంటి భవనంలోకి ప్రవేశించి, "యందుఁ గనకాసనాశీనుం డయి యున్న పురుషోత్తముం గాంచి" కూర్చున్నాడు. బంగారు సింహాసనం మీద కూర్చున్నాడటండి. అసలే

అందగాడు, జగన్మోహనుడు కదా! చూచాడు, చూసి చూడంగానే ఆ వచ్చినవాడు కళ్యాణమస్తు అన్నాడండి. వచ్చిన పని అది కదా! ఎంతటివాడు అయి ఉంటే శ్రీకృష్ణుడు కనపడంగానే అలా చెయ్యి పెట్టి కళ్యాణమస్తు అన్నాడు. అలా అంటే, "ముసి ముసి నగవులు నగుచు" – ఆయన అందుకే చూస్తున్నాడు ఈయన ఎప్పుడొస్తాడా అని. కృష్ణునికి జరుగుతున్నదంతా తెలిసే ఉన్నట్లుగా చెప్తుంది ఉపాఖ్యానం. అక్కడ విదర్భదేశంలో కుండిన నగరంలో రాజప్రసాదంలో ఏం జరుగుతోందో, అంతా శ్రీకృష్ణుడు తనకు తెలిసినవాడిలాగానే మనకి ఈ ఉపాఖ్యానంలో కనిపిస్తుంది.

బ్రాహ్మణుడు ఎప్పుడైతే కళ్యాణమస్తు అని దీవించాడో ఆయనకి చక్కగా ఒక చిరునవ్వు, పెళ్ళికొడుకులాగా నవ్వాడన్నమాట. "నవ్వి బ్రాహ్మణ్యదేవుం డైన హరి తన గద్దియ దిగ్గన డిగ్గి" – అంటే గబాల్న దిగాడట. సింహాసనం దిగి కింద కొచ్చాడు. ఆయన బ్రాహ్మణులకు దేవుడు కదా! బ్రాహ్మణులకు దేవుడు అంటే నిత్యం ఆరాధిస్తుంటారు. ఎవరు బ్రాహ్మణులు? బ్రహ్మమును ఎరిగిన వారు బ్రాహ్మణులు. జంధ్యము వేసుకున్న ప్రతి వాడు బ్రాహ్మణుడు కాదు. అలాంటి బ్రహ్మమును ఎరిగినటివంటి వారందరు నిత్యము ఆరాధన చేసేటటువంటివాడు. ఆయన గబాల్న గద్దె దిగి వచ్చాడటండి. "బ్రాహ్మణుఁ గూర్చుండ బెట్టి" – ఆయన్ని తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. మన కుర్చీలో ఇంకొకళ్ళని కూర్చోబెడ్తామాండి మనం? గురువుగారు వచ్చారనుకోండి, అప్పుడు "ఇక్కడ కూర్చోండి సార్!" అంటారు. ఎందుకంటే, కలిసిరావాలని! మనకెంత సేపు ఒకటే commercial attitude కదా! ఇందులో కూర్చుంటే ఏదో అంటుతుందని, ఆయన ఏమంటిస్తాడో తేలీదు! ఆయన గురువుగారు రకరకాలుగా అంటించగలడు, కొంత కర్మను ముట్టించగలడు, ఏదైనా చేస్తాడు సద్గురువు. ఎందుకంటే, నువ్వు బాగుండటం ఆయనకి కావాలి.

ఈ మహానుభావుడు వచ్చాడు, శుభవార్త తెచ్చాడు. పైగా సద్బ్రాహ్మణుడు. చూడంగానే అర్థమైపోతుంది కదా! తీసుకొచ్చి కూర్చోపెట్టాడటండి. "తనకు దేవతలు సేయుచందంబునం బూజలు చేసి" – దేవతలు తనకు ఎట్లా పూజ చేస్తారో, అట్లా తాను ఆ బ్రాహ్మణునకు పూజ చేసాడు శ్రీకృష్ణుడు. దైవము నేర్పడం అంటే అట్లా నేర్పుతాడు, అట్లా చెయ్యాలి పూజ ఒక సద్గురుమూర్తికని. నేను అందరికి చేయనురోయ్! అని కూడా తర్వాత వస్తుంది ఒక పద్యం. వచ్చినవాడెవడో తెలుసు తనకి. అంటే, తనకి పెళ్లి చేయించటానికి వచ్చినవాడు అని కాదు అక్కడ అర్థం. వచ్చినవాడు ఎలాంటి వాడో తెలిసినవాడు శ్రీకృష్ణుడు. అంచేత, కూర్చోబెట్టి "దేవతలు సేయుచందంబునం బూజలు చేసి సరస పదార్థసంపన్నంబైన యన్నంబుఁ బెట్టించి" – చాలా రుచికరమైనటువంటి ఆహారం, భోజనం పెట్టించాడట. "రెట్టించిన ప్రియంబున నయనంబు" అంటే చాలా ప్రీతితో కూడినటువంటి వినయం చూపించాడటండి శ్రీకృష్ణుడు. "రెట్టించిన ప్రియంబున నయంబున భాసురం

డైన భూసురుం జేరి" – కూర్చోబెట్టి భోజనం పెట్టించాడు. "లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున" – లోకరక్షణకు ఆ చెయ్యే కదా! ఆ హస్తంతో "నతని యడుగులు పుడుకుచు" – కాళ్ళు ఒత్తాడటండి. వత్తి, "మెల్లన అతనికి ట్లనియె". అదండి శ్రీకృష్ణుడంటే! ఇంకెవరూ అలా చేయలేదు. చేస్తే అలాంటిది కృష్ణుడే చెయ్యగలడు. మెల్లన మెత్తగా నొక్కుతూ వాటిని పిసుకుతూ నెమ్మదిగా మాట్లాడట.

"జగతీసురేశ్వర! సంతోషచిత్తుండ వైయున్న నీ ధర్మ మతిసులభము" అన్నాడు. నువ్వు చూస్తుంటే చాలా సంతోషంగా ఉన్నావు. ఒక రాజసభకో, దైవసభకో, సాక్షాత్తు పద్నాలుగు భువనాల్ని పరిపాలించేటువంటి దైవం దగ్గరకు వచ్చినవాడు ఏదో ఒకటి కోరి వస్తాడు కదా! చూడంగానే ఈయన తన కోసం రాలేదని తెలిసిపోయింది. తన కోసం రాలేదు గాని కృష్ణుని కోసం వచ్చాడు. వచ్చే వాళ్ళల్లో వారి పనుల కోసం వచ్చేటువంటి వారుంటారు కదా! అలా కాకుండా పనులు ఏమి లేకుండా కృష్ణుడు దగ్గరకు వచ్చే వాళ్ళుంటారు. ఎవరెక్కువ ప్రియులైయుంటారు? పనిచేయించుదామని వచ్చిన వాడి యందు కన్నా కేవలం తన దర్శనం కోరి, తనను కోరి వచ్చినవాళ్లంటే ఎక్కువ ప్రీతి ఉంటుంది. అది అర్థమైపోయింది చూడంగానే. "జగతీసురేశ్వర" అంటే జగతీసురులకు ఈశ్వరుడు. జగతీసురులంటే బ్రాహ్మణులు. జగత్తులో తిరిగేటువంటి దేవతలకి ఈశ్వరుడు, చాలా శ్రేష్ఠమైనటువంటివాడు. "సంతోషచిత్తుండ వైయున్న నీ ధర్మ మతిసులభము" అన్నాడు. నువ్వు చాలా సంతుష్టుడవు, సంతోషివి నీకేమి అక్కర్లేదు, అయినా వచ్చావు. కృష్ణుడు దగ్గరకు రావాలసినటువంటి అవసరం కూడా లేనటువంటి వాడు ఆయన. అది నాకర్థమైందటున్నాడు శ్రీకృష్ణుడు.

"వృద్ధసమ్మత మిది". వృద్ధుడు అంటే తెలిసినవారు అని అర్థం. నిష్కారణంగా దైవాన్ని ఆరాధన చేసేటువంటి వాళ్ళంటే దైవానికి ప్రీతి. ఏదో ఒక కారణం చేత దైవాన్ని మనం ఆరాధన చేస్తున్నామనుకోండి, "నాకు మోక్షమివ్వవా" అంటే కుడా ఆయనకి ప్రీతిగా ఉండదు. నన్నే కొరుకుంటే అన్ని ఉంటాయి కదా! నన్ను నీతో ఉండనివ్వవా అని అడిగితే? "నీవారై తనువారులలో నేనొకడనై" అని కోరతాడు ఒక భక్తుడు. ఇంకో భక్తుడు కోరతాడు "నీ పాదకమలసేవయుని నీ పాదాక్షకులతోడినయై వితాంత అపార భూతదయ తాపస మంధార నాకు దయచేయగదే."

ఈ వచ్చిన ఆయనికి ఏమి అక్కర్లేదండి. అయినా వచ్చాడు. అది వృద్ధసమ్మతం. అంటే, తెలిసినవాళ్ళు మెచ్చుకునేటువంటి విధానమిది. భక్తుడు భగవంతుని చేరుకోవటానికి వేరే కారణమంటూ ఏమీ లేదు – భగవత్ సామీప్యము, సాయుధ్యము, సారోఖ్యమే. సాలోఖ్య, సామిప్య, సారుధ్య, సారోఖ్యం కోసం దైవాన్ని ఆరాధన చేసేటువంటి వాడు వేరు, తనకేదో కావలసి ఉండి చేసేటువంటివాళ్ళు వేరు. పాండవులు కూడా ఏవో కోరే

వెంటపడ్డారు. అందుకనే, నాకు గోపికలంటే ఎక్కువ ఇష్టం, వాళ్ళేం కోరలేదు అని చెప్పాడు శ్రీకృష్ణుడు. గోపికల్లాంటివాళ్ళు కృష్ణుడు జీవితంలో ఉన్నారు. ఒక్క గోపికలే అనుకోబోకండి. రుక్మిణి అలాంటిదే. నీ కైంకర్యం కోసం ఉన్నాను నేను అంది. అందుకనే, అష్టభార్యలలో రుక్మిణియే కదా అత్యంత జ్ఞాని అయినటువంటిది, భక్తి కలిగినటువంటిది, సాక్షాత్తు మహాలక్ష్మి.

"విత్త మెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు". బ్రాహ్మణుడు లక్షణాలు చెప్తాడు ఇక్కడ. ఎవరయ్యా బ్రాహ్మణుడంటే, "యదృచ్ఛా లాభ సంతుష్టో". ఏది లభిస్తే జీవితంలో, అంటే డబ్బని అనుకోబోకండి. నీ దగ్గరికి ఏది వస్తే అది భగవత్ కృప అని భావించి దాని యందు తన కర్తవ్యం నిర్వర్తించటం తప్ప ఇంకోటి లేనివాడు. "యదృచ్ఛా లాభ సంతుష్టో" అలా అని ఏడవడు. నాకిదిచ్చాడు దైవం, ఇది నిర్వర్తిస్తాను. యాధృచ్ఛికంగా తన దగ్గరకు వచ్చింది. అది సంతోషం పెట్టేది అవ్వచ్చు, దుఃఖపెట్టేది అవ్వచ్చు, ఏదైనా కావచ్చు. "యదృచ్ఛా లాభ" అంటే ఏదైనా అవ్వచ్చు. "యదృచ్ఛా లాభ సంతుష్టో" అన్నట్టుగా "విత్త మెయ్యది యైనఁ బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు". అంటే, బ్రాహ్మణుడు అనేవాడు మనం చూసేటువంటి వాళ్ళల్లో చాలా తక్కువ మంది ఉంటారు. ఇలా మనం ఒక గ్లాసు బియ్యమేస్తే, అలా మన పక్క చూసి ఇంకా ఏవో అడుగుతు ఉంటారు కదా! అమ్మాయి పెళ్ళండని వస్తే, మనకి తోచిందిస్తే, ఇంకా ఏవో అడుగుతూ ఉంటారు. దక్షిణ ఇస్తే ఆ తర్వాత ఇంకేవో అడుగుతూ ఉంటారు. వాళ్ళు బ్రాహ్మణులు కాదు. అట్లాగే మనకెవరన్నా ఏదన్నా ఇచ్చినప్పుడు ఇంకొంచెం ఇవ్వండి అని అన్నామనుకోండి... కూర వేసారనుకోండి, ఇంకొంచెం వెయ్యండి అని అడగరు. అంతే తినమంటున్నాడు దేవుడు. నువ్వింకోసారి తినాల్సిన యోగం ఉంటే వాడు మళ్ళీ వస్తాడు నీ దగ్గరికి. ఇంకొంచెం నెయ్యి వెయ్యవా, ఇట్లా అడుక్కు తినక్కర్లేదండి. చిన్న చిన్న విషయాల్లోనే అడుక్కుతింటూ ఉంటాం. ఆ బుద్ధి నీలో ఉంటే ప్రతి దానికి అడుక్కుతింటావు. ప్రతి చోట ఎవర్ని ఏమీ అడగక్కర్లలేదు. నీకు భగవంతుడి యందు ధ్యాస ఉంటే, నీకేం కావాలో ఆయన చూసుకుంటాడనేటువంటి ఒక అచంచలమైనటువంటి విశ్వాసం ఉండాలి. అట్లా ఎన్ని సార్లు భగవంతుని కరుణ చూస్తుంటావు?

నువ్వు ఎవ్వర్ని ఏమి అడిగేవాడివి కాదు, ఇక్కడికి ఎందుకొచ్చావు? నీకేం అవసరం లేదు రావాల్సింది, నీకున్న దాంతో నీకు సంతృప్తుంది. "తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు" – నీవా ధర్మం నుంచి బయటకొచ్చినటువంటి వాడివి కాదు. సర్వజన శ్రేయస్సు కోరేటువంటి వాడివి తప్ప నీకోసం అనేటువంటి భావము లేనటువంటి వాడివి నువ్వు. "గోరిక లతనికిఁ గురియుచుండు" – నువ్వు సిద్ధసంకల్పుడివి. నువ్వేమనుకుంటే అవన్నీ అయిపోతాయి. గుర్తుపెట్టుకోండి, ఎవరు సిద్ధసంకల్పులంటే, దరిద్రం లేనివాడు

సిద్ధసంకల్పుడు. ఉన్న దాంతో తృప్తిగా ఉండేవాడు సిద్ధసంకల్పుడు. సిద్ధసంకల్పుడంటే వాడేదనుకుంటే అది అయిపోతుందని అనుకోబోకండి. ఏం జరుగుతుందో, అదే వాడికి అనిపిస్తుంది, ఇంకోటి అనిపించదు.

ఆ విధంగా సంతోషినీలాంటి వాడు. నీలాంటి వాడు వచ్చినప్పుడు నిన్ను సంతోష పెట్టకపోతే నేను కాదు ఇంద్రుడైనా సరే నశిస్తాడు. ఎవరైనా highest చెప్పాలంటే ఇంద్రుడటారండి. "సంతోషి గాఁ దేని శుక్రుఁ డై నశించు నిర్ధనుండైనను నిద్రవోవు సంతసించెనేని". అంటే, ఏ విధమైనటువంటి ధరలు లేకుండా ఉన్నటువంటి వాడు కూడా బ్రాహ్మణుడ్ని సంతోషపెడ్తే, వాడికి చక్కగా ప్రశాంతమైనటువంటి... ఎలాంటి బ్రాహ్మణుల్ని? ఇలాంటి బ్రాహ్మణుడిని. అందుకనే, సత్పురుషులకు ఇచ్చిందల్లా universal bank లో deposit అది. శ్రీకృష్ణుడు శ్రద్ధాత్రయ విభాగంలో చెప్తాడు, దానం సత్పురుషుడికిస్తే దానికి వెయ్యి రెట్లు నీకు సంతోషం తిరిగి వస్తుంది. అందుకని సత్పురుషులకి దానం చేసుకోవటానికి చూసుకుంటూ ఉంటారు. ఆ విధంగా నిన్ను సంతోషపెడితే, వాడు పరమ దరిద్రుడైన హాయిగా నిశ్చింతగా నిద్రపోతాడట. అట్లాంటి ధర్మాలు చెప్పారండి. "నిర్ధనుండైనను నిద్రవోవు సంతసించనేని" అని చెప్పి ఇప్పుడు చెప్తున్నాడు, "సర్వభూత సుహృత్త ములకుఁ" – అందరి జీవులకు, పుట్టినవారి అందరి యొక్క మంచిని కోరేటువంటి వాడు. "బ్రాప్తలాభ ముదితమాన" – దొరికిన దానికి సంతోషపడి, ఆనందంగా ఉండేటువంటివాళ్ళకి, "శాంతులకును సుజనులకును గర్వ హీనులకును వినతు లే నొనర్తు" అన్నాడు. అలాంటి వాళ్లకి నేను దణ్ణం పెడతానని చెప్పాడు.

ఇక్కడికి తీసుకొచ్చాడు, సింహాసనం మీద కూర్చోపెట్టాడు, కాళ్ళు కడిగాడు, భోజనం పెట్టాడు, కాళ్ళు వత్తుతూ కూర్చున్నాడు. కాళ్ళు వత్తుతూ, ఎలాంటి వాళ్ళకి నేను కాళ్ళు వత్తుతానో చెప్తాడాయన. ఏం చెప్పాడు? "సర్వభూత సుహృత్త ములకుఁ" – అందరికి హృదయము రంజించేటువంటి విధంగా ప్రవర్తించేటువంటివారు. "బ్రాప్తలాభ ముదితమాన సులకు" – దొరింకిందానికి సంతోషించి, ఆనందంగా ఉండేవాళ్ళు. "శాంతులకును" – ఎప్పుడు శాంతంగా ఉండేటువంటివారు. "సుజనులకును" – చెప్పక్కర్లేదు కదా! "గర్వ హీనులకును వినతు లే నొనర్తు" – అలాంటి వాళ్ళను నేను ఈ విధంగా సేవ చేసుకుంటూ ఉంటానని చెప్పాడండి శ్రీకృష్ణుడు.

> "ఎవ్వనిదేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
> కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు వాఁడు మత్ప్రియుం
> డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య! నీవు లే
> నవ్వులు గావు నీతలఁపునం గలమే లొనరింతు ధీమణీ!"

"ఎవ్వనిదేశమం దునికి" – ఎక్కడుంటారో తమరని అని అడుగుతున్నాడు, తెలియనట్టు కదా! "ఎవ్వనిదేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ" – ఎవరి వల్ల మీకు మేలు కలుగుతుంది? "కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు" – నువ్వే రాజ్యంలో ఉంటే ఆ రాజ్యంలో ప్రజలందరు సుఖిస్తారో ఆ రాజ్యమేది అని అడుగుతున్నాడు. "మత్ప్రియుం డి" – నువ్వున్నావు కాబట్టి ఆ దేశంలో ఆ రాజు నాకు చాలా ప్రియుడై ఉంటాడు అంటున్నాడు. ఎంత గొప్ప విషయం! ఒక దేశంలో ఒక మహాత్ముడుంటే అలాంటి మహాత్ముడు ఉన్నటువంటి రాజ్యానికి అధికారి నాకు చాలా ప్రియుడని చెప్తున్నాడు. లేకపోతే ఉండరుగా వాళ్ళు!

ఈ "డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య!" – ఈ నీళ్ళ మధ్యలో ఉంటుంది కదా ద్వారక! జరాసంధుడి బాధ పడలేక సముద్రంలో కట్టుకున్నాడాయన. వాడు మాటిమాటికి వస్తే, తనవి చాలా పనులుంటాయి తనకి, ఎప్పుడూ తను available గా ఉండకపోవచ్చు కదా! ఈయనుంటే ఇబ్బంది లేదు. ఈయన పనిమీద వెళ్ళినప్పుడు జరాసంధుడు వస్తే? అందుకని, తనవారందరికి సురక్షితంగా ఉండటానికి ఒకటి ఏర్పాటు చేసాడు. అక్కడికి రావాలంటే నీళ్ళు దాటి వెళ్ళాలి. ఇప్పుడు మనకు చూపించే భేట్ ద్వారక కాదు. ఇప్పుడు satellite ద్వారా కనిపించే ద్వారక ఒకటి సముద్రంలో ఉందని తేల్చారు. మొన్నమొన్నటివరకు Indians గాస్ కొడ్తున్నారు అన్నారు. ఇప్పుడు ఒప్పుకుంటున్నారు ఉందని. ఇక్కడి కెందుకొచ్చారు మీరు? "లే నవ్వులు గావు" – నేనూరికే తమాషాకి అడగట్లేదు సుమా! "నీతలఁపునం గలమే లొనరింతు ధీమణీ!" అన్నాడు. నీ మనసులో ఏముంటే దానిని తప్పక నేను నిర్వర్తిస్తాను అని మాటిచ్చాడు.

> "అని ఇట్లు లీలాగృహీతశరీరుం డైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ
> సురవరుం డతనికి సవినయంబుగా ని ట్లనియె. దేవా! విదర్భదేశాధీశ్వరుం
> డైన భీష్మకుం డను రాజు గలం డా రాజు కూఁతురు రుక్మిణి యను
> కన్యకామణి గల దయ్యిందువందన నీకుం గైంకర్యము సేయం గోరి
> వివాహమంగళ ప్రశస్తం బయిన యొక్క సందేశంబు విన్నవింపు మని
> పుత్తెంచె నవధరింపుము."

"అని ఇట్లు లీలాగృహీతశరీరుం డైన యప్పరమేశ్వరుం డ" – ఎంత మంచి మాటండి! లీల కోసం దేహంలో ఉంటాడట ఆయన. అంతేకాని, దేహంలో ఉండాల్సినటువంటి అవసరం కూడా లేనటువంటివాడు. సరదాగా కార్లో వెళ్లినట్టు, సరదాగా కారు ఎక్కినట్టు, ఆయన సరదాగా దేహంలో ఉంటూ ఉంటాడు. దేహం వెలుపలా ఉంటాడు, దేహంలోనూ ఉంటాడు. కొంత దేహంలోను, మిగతాదంతా చుట్టూ వ్యాప్తి చెందితూ

ఉంటాడు. మహా లీలతో కూడినటువంటివాడు ఆయన. ఆయన లీలగా దేహం తీసుకున్నాడు. "శరీరుం డైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ సురవరుం డతనికి సవినయంబుగా ని ట్లనియె".

అప్పుడు ఆయన చెప్పాడు. "దేవా! విదర్భదేశాధీశ్వరుం డైన భీష్మకుం డను రాజు గలం డా రాజు కూఁతురు రుక్మిణి యను కన్యకామణి గల దయ్యిందువందన నీకుం గైంకర్యము సేయం గోరి". నిన్ను పెళ్లి చేసుకుందాం అనుకుంటోంది అనలేదు, నీకు సేవలు చేద్దాం అనుకుంటోంది అన్నాడు. "నీకుం గైంకర్యము సేయం గోరి వివాహమంగళ ప్రశస్తం బయిన యొక్క సందేశంబు విన్నవింపు మని పుత్తెంచె నవధరింపుము." – పంపింది నన్ను. గోదావరి భాష అయితే పురమాయించింది అంటారు. ఏమని? వివాహ ప్రశక్తి ఇది, కాని ఆవిడ కోరుకునేది నీ కైంకర్యము, నీ సేవ, విను అని చెప్పాడు. అవధరింపుము. ఆవిడ చెప్తోందండి!

ఈ రుక్మిణీదేవి చేసినటువంటి ఈ స్తోత్ర పద్యాలు అందరం కంఠస్తం చేయవలసిన పద్యాలు. అంటే ఎవరైతే, భగవంతుని మనసా వాచా కర్మణా అతని యొక్క సామీప్యము, సాలోఖ్యము, సారూప్యము, సాయుధ్యము, ఈ నాలుగు ఉన్నవే... కనీసం దర్శనం అన్నా అవ్వాలి కదండి స్వప్నంలో! కనీసం సాలోఖ్యం, చూడగలగాలి కదా! చూడగలిగితే సరిపోతుందా? దగ్గరిగా వెళ్ళగలగాలిగా! వెళ్తే సరిపోతుందా? ఆయన్ని బాగా అతుక్కొని ఉండాలని అనిపించదూ. అతుక్కొని ఉంటే సరిపోతుందా? ఆయనలో కలిసిపోతే... ఇట్లా నాలుగు స్థితులుంటాయి భక్తునికి. దగ్గరగా కూర్చున్నా ఇంకా తోచదట, కలిసిపోదాం అనిపిస్తుందట. అట్లా కదా అమ్మవారు, పార్వతీదేవి, ఆయనలో కలిసిపోతే సగం తీసి పక్కన పెట్టుకున్నాడు కదా! అర్థనారీశ్వరుడు. అంతలా ఉంటుంది భగవంతుని యందు భక్తి రసం. భక్తి చాలా గొప్పది. భక్తి అంటే కూడిక. విభక్తంటే విడిపడడం. ఎంతలా కోరుకుంటోందో రుక్మిణీదేవి, అంతలా మనం కోరుకోవాలండి భగవంతుని.

ఈ ఒక్క పద్యం మాత్రం చదివి ఆపి రేపటి నుంచి ముందుకెళ్దాం.

"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
 దేహతాపంబులు తీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
 కఖిలార్థంబు కలుగుచుండు
నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో
 న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ

దడవిన బంధసంతతులు వాయు."

నీ గుణాలు వింటేనే కర్ణేంద్రియములు సోఁక దేహంలో ఉండే అన్నీ తాపాలు... అంటే, ఒంట్లో బాలేదనుకోండి, భగవత్ ఆరాధన, ప్రార్థన, గుణవిశేషములు వింటాము. ఆ కన్నులు చూస్తే చాలు. ఇంక ఈ ప్రపంచంలో ఏవీ చూద్దాం అనిపించవటండి. అలాంటి కన్నులు. పొద్దునే నీ పాద సేవ చేసుకుంటే "భువనోన్నతత్త్వంబుఁ బొందఁ గలుగు". కేవలం భగవంతుని పాదసేవ చేసుకుంటే, ఈ మొత్తం భువనంలో ఉన్నతమైనటువంటి స్థితి పొందవచ్చు. "నే నీ లసన్నామ మేప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు". నీ ప్రీతికరమైనటువంటి నామం ఒక్కసారి నేను స్మరణ చేసుకుంటే నాకీ దేహంతో సహా సమస్త బంధములన్నీ ఏమీ ఉండవు అని చెప్తుంది. అది ఆవిడ భక్తి.

"నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీచిత్తచోర!"

అంటే, ఎప్పుడూ అనన్యంగా, అనుస్యూతంగా నచ్చి ఉన్నది. "నీయాన" – అలా ఉంది స్వామి నా పరిస్థితి, నీ మీద ఒట్టు అని చెప్తుంది. "నీయాన నాన లేదు". ఇట్లా చెప్పుకోవడానికి నాకు లజ్జ లేదంటున్నది. ఇట్లా, ఇంతలా నాకు నీ మీద ఉన్నదని చెప్పుకోటానికి నాకు లజ్జ, సిగ్గు, మొహమాటం ఏం లేకుండా చెప్తున్నాను స్వామి అని చెప్తుంది.

"కరుణఁ జూడుము కంసారి"! అని అంది. ఎందుకు కంసారి? అహంకారికి లోపల ఉంది ఈవిడ కూడా! రుక్మి అహంకార స్వరూపం. ఈ అహంకారమైనటువంటి కొండను దాటి, ఈ అవరోధాన్ని దాటి దైవాన్ని చేరాలి. తన భక్తి చేత తన మనస్సు బుద్ధిలోకి చేరి, బుద్ధినుంచి పరమాత్మని చేరడానికి మనకి అడ్డు వచ్చేటువంటిది అహంకారమే! మరి ఈ అహంకారాన్ని తనలో తానుగా తను తీసెయ్య లేదు. అతడొస్తే పోతుంది, అతడు రాకపోతే అలాగే ఉంటుంది. అందుకని, దైవం కనపడితే అహంకారం నిర్మూలింపబడుతుంది. దైవ సాన్నిధ్యంలో అహంకారం ఉండదు. కానీ, దైవ సాన్నిధ్యం రావటానికి తనకు అడ్డు తన అహంకారమే. అందుకని, అప్పుడు తను ఏం చేయాలి? ఇహ మన వల్ల కాదు కాబట్టి ఒక మధ్యవాసి ద్వారా కబురు పెట్టించి, ఆయన్ని రప్పించుకోవాలి. దైవం మనలోకి రావాలి, మనలోకి దిగిరావాలి. ఎక్కడ్నుంచి? సహస్రారంలోనే

ఉంటాడు. దిగి వచ్చేస్తాడు. ఈ దిగి రావడానికి అహంకారం అడ్డుపడకుండా ఉండాలి కాబట్టి నీవు కంసుడ్ని చంపినటువంటి వాడివి కదా అని చెప్తోంది "కంసారి" — కంసుడు అహంకార స్వరూపుడే.

"ఖలవిదారి" — మూర్ఖుల్నందర్ని ఏరెయ్య గలవు కదా! అజ్ఞానాన్ని ఏరెయ్య గలవు కదా! అహంకారాన్ని తీసెయ్య గలవు కదా! "శ్రీయుతాకార! మానినీచిత్తచోర!" అంది. శ్రీయుతమైనటువంటి ఆకారం నీది. మా బోటి వాళ్లందరు నిన్ను చూస్తే we are lost, మమ్మల్ని మేము కోలిపోతాం అంది. "మానినిచిత్తచోరుడు" శ్రీకృష్ణుడు. ఎవరు మానిని అంటే జీవులందరూ మానినిలే. ఒక్క కృష్ణుడే పురుషుడు. అందరు జీవులూ స్త్రీలే. ఎంచేతంటే, ఆయన ఆధారంగా బతుకుతున్నటువంటి వాళ్ళం కాబట్టి ఆయన్ని కోరుకునేటువంటి వాళ్లకి వాళ్ళ మనస్సును ఆయనే హరిస్తాడు. నీవు "మానినిచిత్తచోర" అంటే, ఈవిడ చిత్తాన్ని ఎప్పుడో హరించేశాడు. హరించినటువంటి సందర్భంలో తనను అవరోధం నుంచి ఆయనే విడిపించి తనని తీసుకువెళ్ళాలి. ఈ విధంగా ఒక సీస పద్యం. ఒక విషయంగా బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుడు శ్రీకృష్ణుడికి విన్నవించాడు.

ఇలాంటివి ఇంకో నాలుగు పద్యాలుంటాయండి. అవి రేపు పొద్దున మంచి ప్రభాత సమయంలో, చల్లని వాతావరణంలో అది చదువుకుందాం. ఈ పద్యాలలో కూడా, ఇందులో ఉండేటువంటి కొన్ని విశేషాల్ని వివరించి మీకు తెలియ పరుస్తాను. కుదిరితే అలాంటి భక్తి కుదరాలండి. ఊరికే మనకి మనమే భక్తులమనుకొని చంకలు గుద్దుకుంటే ఏం లాభం చెప్పండి? మనకి మనమే "నేను ఇప్పటికే చాలా భక్తుడ్ని కదా!" అనుకుంటూ ఉంటే ఉపయోగమేముంది?

ఆ విధంగా రుక్మిణీదేవి she started her pleadings. అంటే, ఆమె భావాల్ని ఆ విధంగా బ్రాహ్మణుడి ద్వారా ఆవిష్కరింపజేస్తోంది కృష్ణుడు దగ్గర. అది మనం చదువుకుంటాం. రేపు ఉదయం బహుశా ఆమె భావమంతా ఆవిష్కరింపబడుతుంది. ఆ తర్వాత కృష్ణుడు ఏమన్నాడో మనకి తెలుస్తుంది. ఈ కథ అలా నడుస్తుంది రుక్మిణికల్యాణం. రుక్మిణీకల్యాణం మన కథే! మనకిలాంటి భక్తి పుట్టించమని కూడా భగవంతుని ప్రార్థించాలి. ఎందుకంటే, భక్తి పుట్టించాలన్నా ఆయన అనుగ్రహం కావాలి. పొద్దున కాసేపు విచారణ చేస్తే పురుష ప్రయత్నం, దైవానుగ్రహం రెండు ఉంటాయి కదా! నిజానికి పురుష ప్రయత్నం చెయ్యటానికి కావాలసినటువంటి సంకల్పం కూడా భగవంతుని అనుగ్రహంగా మనకి దక్కితేనే జరుగుతుంది. పురుష ప్రయత్నం స్ఫూర్తితో జరగటానికి కావలసినటువంటి సంకల్పము, దానికి బలం కూడా దైవానుగ్రహంగానే లభించాలి. అలా లభిస్తేనే శుభముగ అవుతుంది కార్యక్రమం. అలా కాకపోతే ఏమి లేదు. ఈ విధంగా

బ్రాహ్మణుడు చక్కగా స్పష్టంగా కృష్ణుడికి రుక్మిణీదేవి అందించినటువంటి రహస్యపూరితమైనటువంటి సందేశాన్ని అందిస్తూ ఉన్నాడు.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 10, 2013 ఉదయము – ప్రవచనము #5

సోదరబృందానికి హృదయపూర్వకమైనటువంటి నమస్కారములు. పుష్యమాసం, కృష్ణపక్షం, చతుర్దశి, ఆదివారం. మనసు సన్నగిల్లి, బుద్ధి వికసించి, భగవత్ తత్త్వమునందు ప్రవేశించటానికి అనువైనటువంటి, ప్రభాతమైనటువంటి సమయం ఆదివారం ఉదయం. మొత్తం వారంలో అత్యద్భుతమైనటువంటి సమయంగా పెద్దలు చెప్తారు. సృష్టి ప్రారంభం ఆదివారం జరిగింది కాబట్టి, ప్రతీ వారం కూడా ఆదివారంతోనే ప్రారంభమవుతుంది. సూర్యోదయానికి ముందే నిద్రలేచి, దేహాన్ని శుచి కావించుకొని, దైవమును ఆరాధించటమనేటువంటిది ఒక అదృష్టము. అది అందరివల్ల అయ్యే పని కాదు. ఈ రోజున ఈ విధంగా పొద్దున్నే నిద్రలేచి, ప్రాతః సమయానికి ముందే గురుపూజా ప్రాంగణం చేరి, భక్తితో గణపతిని ఆరాధన చేసుకొని, అటుపైన సద్గురుమూర్తి యొక్క ప్రకాశంలో ప్రవేశించి, అందు వశించి, దాదాపు మనం ఒక ముప్పావుగంట సేపు అందులో తనివితీరా ఆనందం చెంది, భగవత్ పరమైనటువంటి విషయాలు తెలియ చెప్పుకోవటమనేటువంటి దానికన్నా శుభదినము, పర్వదినము మరొకటి ఆశ్రిత జనులకు ఉండదు. గణపతి మనకి కుదురునిస్తాడు. గుర్తుపెట్టుకోండి, గణపతిపూజ పన్నెండు నిమిషాలకన్నా ఎక్కువ పట్టదు. షోడశోపోచారాలలో మనకుండేటువంటి భక్తి ఆవేశం చేత అందులో ఉపనిషత్తు, స్కంధుని స్తోత్రం చేసుకుంటాము. లేకపోతే, గణపతిపూజ పది, పన్నెండు నిమిషాలకన్నా పట్టదు. మనసారా గణపతిని రోజు ఆరాధన చేసుకునేటువంటి వాడికి ముందు మనసుకి, మనిషికి కుదురు వస్తుంది. ఎక్కడ కూర్చున్నా మనసు గెంతదు, మాట గెంతదు, శరీరము గెంతదు.

అక్కడ నుంచి సమస్తాన్ని అధిష్ఠించి ఉంటాడు. గణపతి ఎక్కడ ఉన్నా సరే "తం మూలాధారాస్థితోసినిత్యం". నైఋతి బలంగా ఉండాలంటారు కదా! నైఋతి బలంగా ఎప్పుడుంటుంది? గణపతి కూర్చుంటే ఉంటుంది. కూర్చున్నాడు కాబట్టి శరీరంలో మనం ఉండగలుగుతున్నాం. "త్వం మూలాధారస్థితోసి నిత్యం" నైరుతిలో ఆ విధంగా మన మూలాధారంలో గణపతి అనేటువంటి ప్రజ్ఞ ఉండడం చేత మనం ఈ శరీరంలో ఉండగలుగుతున్నాం. లేకపోతే, ఈ శరీరంలో ఉండలేము. దేహాత్మ భావన నుంచి జీవుడికి మనసేంద్రియములు, శరీరములతో బయట ప్రపంచంలో చక్కని అనుభూతిని పొందటానికి గణపతి కావాలి. అలాగే, దేహాత్మ భావం నుంచి విడదీసి, జీవుని ఉధ్యాత్మ భావనలో ప్రవేశపెట్టాలన్నా కుడా గణపతి కావాలి.

అతడు బుద్ధినిస్తాడు, సిద్ధినిస్తాడు. అతడు బ్రహ్మణులకే బ్రహ్మణ్యమైనటువంటివాడు. "బ్రహ్మణస్పత" అంటూ ఉంటాం కదా! అతను ఇవ్వని విద్యలేదు. అలాంటి గణపతి దేవుడ్ని రోజు ఆరాధన, ఒక పది నిమిషాలు చేసుకోవటంలో మన జీవితంలో ఎన్ని రకములైనటువంటి శుభములు లోపలా, బయటా... లోపలంటే, మన లోపల, మన ఇంటి లోపల, మన బయట. వీటన్నిట్లో కూడా ఎంత చక్కని వైభవాన్నిస్తాడో గణపతి! ఎంచేతంటే, ఒకటి కుదురు, రెండు నిండుతనం, మూడు ప్రశాంతత.

ఎందుకు చెప్తున్నానంటే, మన జగద్గురు పీఠము అన్ని కేంద్రాల్లో కూడా ఎవరింట్లో గణపతి పూజ రోజూ జరుగుతుందో, ఆ ఇంట్లో సర్వశుభములు జరుగుతాయి. మన సాంప్రదాయంలో ఉన్నటువంటి విలువలు మనకు తెలియక, ఏవో రకరకాలుగా విన్యాసాలు చేసుకుంటూ బతుకుతూ ఉంటాం. ఒక గణపతి ఆరాధన జరగటం మొదలుపెట్టిన దగ్గర నుంచే జగద్గురు పీఠానికి కూడా కుదురొచ్చింది. ఏమనుకోబోకండి ఇలా చెప్పానని! కుదురావాలంటే గణపతి ఉండాలి. గణపతి లేనిదే కుదురు లేదు. అతడు సర్వవ్యాపకుడు, అంతా వ్యాపించి ఉంటాడు. అలాంటి గణపతిపూజ నిన్న సాయంత్రం గావించుకుని, ఈ రోజు మనం పొద్దున గావించుకున్నాం. వచ్చే సంవత్సరం విజయవాడలో కనీసం విజయవాడ బృందం నుంచి ఒక పన్నెండు మంది గణపతి పూజను శ్రావ్యంగా చదవగలిగి ఉండాలి. అలా ఏదన్న జరిగితే, మనం ఏదో నేర్చుకుంటున్నాం అనేటువంటి ఒక ఆధారం మనకి దొరుకుతుంది. ఇలా ఎంత కాలం పోయినా అట్లా కృష్ణమూర్తి గారు, ఆయన భార్య, నిలబడలేకపోయినా నిలబడి, ఈ పూజలు చేయటం కన్నా, కుర్రవాళ్ళు మరి ధర్మపత్నులతో, మాట వినకపోయినా ఆ పూటకి బతిమాలుకొని, గణపతి పూజకి దంపతిగా ఎంత మంది ఏర్పడితే అంత వారికి శుభం ఒకటి, వారి కుటుంబమునకు శుభము రెండు, మన సంఘమునకు శుభము మూడు, మన దేశమునకు, మన రాష్ట్రమునకు కూడా శుభము. ఆ విధంగా చేసుకోవాలి.

ఉదయమే మనం ఇలాంటి వాతావరణం ఏర్పాటు చేసుకోవడానికి ఎంతో కృషి జరిగింది కదా! ఆ ఏర్పాటులోనే భగవంతుడు అనుగ్రహించటం అనేటువంటిది ఉంటుంది. ఆ ఏర్పాట్లు చేసేటువంటివారు ఆ విధమైనటువంటి ఏర్పాట్లు చేస్తూ ఉన్నప్పుడు, వారు పొందేటువంటి అనుభూతే నిజమైనటువంటి అనుభూతి. అలాంటి అనుభూతి కార్యకర్తలందరికీ దక్కాలి. వారందరియందు యోగము బాగా ద్యోతనం కావాలి. అగ్ని ప్రచోదనం కావాలి. మాస్టరు గారు వారందరిని అనుగ్రహించాలి. కుర్రవాళ్ళు ఎంతో చక్కగా ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించుకుంటూ ఉన్నారిక్కడ. వారికి చక్కని ప్రోత్సాహం మాస్టరు గారు ఎలాగు ఇస్తారు. మనం ఈ రోజున మనకివ్వబడినటువంటి అంశాల్లోకి క్రమంగా ప్రవేశం చేద్దాం.

రుక్మిణీదేవి సాక్షాత్తు మహాలక్ష్మి అంశ. ఆమె దేహధారణ చేసింది. ఆమె రుక్మిణి ఎందుకైందంటే, ఆమె లోపల బంగారు కాంతితో కూడినటువంటి శరీరంలో వసిస్తూ, అది ఆధారంగా మరొక మృన్మయమైనటువంటి, అంటే రక్తమాంసములతో కూడినటువంటి మరో శరీరాన్ని ధరించి ఉన్నటువంటి ప్రజ్ఞ. శ్రీకృష్ణుని అష్టభార్యలలో రుక్మిణియే పట్టమహిషి, ఒకటి. ఆమెతో సరిసమానమైనటువంటి భార్యల్లేరు. ఎదో పదేవాళ్ళు చాలా మంది ఉండచ్చు కాని, అణుకువగా అన్నీ తెలిసి, భర్తకి సరిసమానమైనటువంటి ప్రజ్ఞ కలిగినటువంటి మహాసాధ్వి ఆమె. "సమాలలామ" అని చెప్తారు ఇక్కడ భాగవత పద్యంలో. లక్ష్మి అంశలో పుట్టినటువంటి మహా తల్లి ఆమె. ఆమె కృష్ణుని గురించి చెప్తోందండి. మనకది ఎంత ముఖ్యమైనటువంటి విషయం! ఇంటావిడ కన్నా ఇంటాయన గురించి ఇంకెవరికెక్కువ తెలుస్తుంది? తెలుసనుకుంటారు. తెలిసి మాట్లాడినటువంటి వాళ్ళే కదా మన ఇంటి ఆడవారందరు కూడా!

"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
దేహతాపంబులు తీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
కఖిలార్థంబు కలుగుచుండు
నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో
న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ
దడవిన బంధసంతతులు వాయు."

నీ గుణములు ఒక్కసారి చెవిలలో పడితే, ఈ దేహానికి ఇంక తాపమే ఉండదు. తాపము మూడు రకాలుగా ఉంటుంది. అసలు భగవంతుని గుణాలు ఏమిటి? భగవంతుని గుణాలు ఎన్ని చెప్పుకుంటే అవుతుందండి? ఎంత చెప్పుకుంటే అంత మన లోపల కల్మషములన్నీ కూడా హరింపబడతాయి. కృష్ణ కథలో ఉండేటువంటి మహత్తరమైనటువంటి విషయమేమిటంటే, మనసారా ఆయన గుణవర్ణం చేసుకుంటూ ఉంటే, ఆయన రూపవర్ణన, గుణవర్ణన చేసుకుంటే లోపలుండేటువంటి కల్మషాలన్నీ కూడా... "కలిమల నాశక కేశవ కృష్ణా" అంటారు. కలికల్మషం చాలా భయంకరమైనటువంటి కల్మషం. ఆ కల్మషం మనల్ని తాకకుండా ఉండాలంటే కృష్ణ కథలు, కృష్ణుని యొక్క గుణముల యొక్క ప్రశంస, అది అనునిత్యం వింటానికి ప్రయత్నం చెయ్యాలి. అలా చేస్తే లోపల ప్రపంచంలో మనకి దైనందిన దినచర్యలో మనకి తెలియకుండా మనలో ప్రవేశిస్తున్నటువంటి మలములన్నీ కూడా నిర్మూలింపబడతాయి.

కృష్ణుని యొక్క గుణములు ఎలా ఉంటాయిట అంటే, “సర్వజ్ఞత్వము”, సర్వజ్ఞుడతడు. అతడికి తెలియందేమీ లేదు. ఎక్కడ ఉన్నా మొత్తం సృష్టిలో జరుగుతున్నటువంటి సమస్త విషయములు తెలుసుకొనగలిగినటువంటి ప్రజ్ఞ అది. అంటే, అంతటా వ్యాప్తి చెంది ఉండటం చేత. గురువు దగ్గర విద్యనభ్యసించి గురువుగారికి గురుదక్షిణ చెల్లిస్తాను అని అడిగినప్పుడు, అసలు శ్రీకృష్ణుడు తన దగ్గర విద్య నేర్చుకోవటమే గురుదక్షిణగా భావించినటువంటి వాడు సాందీపుని మహర్షి. కృష్ణునికి విద్య నేర్పినవాడుగా చిరస్తాయిగా సృష్టి కథలో మిగిలిపోవటం కన్నా ఇంక కావాల్సింది ఏముందండి? ఆయన “నాయన! నువ్వు నా దగ్గర విద్య నేర్చుకోవటమే నాకు మహా గురుదక్షిణ” అని అంటాడు. అసలు అలాంటి గురుదక్షిణ ఇంకెవరికి దక్కుతుంది? విద్య నేర్చుకునేటువంటి నెపం చేత సాందీపునుని అనుగ్రహించినటువంటి మహాత్ముడు శ్రీకృష్ణుడు. సాందీపునికి ఎప్పుడు కూడా తాను శ్రీకృష్ణునికి విద్య నేర్పుతున్నాననేటువంటి వ్యామోహం లేదు. శిష్యుడిగా వచ్చినటువంటి వాడు సర్వ సృష్టికి కర్త, భర్త, హర్త అయినటువంటివాడు. నేను ఈయనను అనుగ్రహించటానికి వచ్చాను కాబట్టి ఇంక మరి గురుదక్షిణ ఏంటి, నేనే గురువును కదా అని అనుకోలేదు కృష్ణుడు. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడైనప్పటికి కూడా ఒక సద్గురువు దగ్గర విద్యనభ్యసించటానికి పూనుకున్నాడండి. అది ఎంత మహత్యం! మనమనుకుంటాం “ఆ! వాడి దగ్గర నేర్చుకునేదేమిటిలే. వీడి దగ్గర నేర్చుకునేదేంటి!” మనకే చాలా తెలుసు అనిపిస్తుంది. అన్నీ తెలిసినవాడు విద్య నేర్చుకున్నాడండి, అణుకువగా విద్య నేర్చుకున్నాడు.

“తండ్రి! నీవు నా దగ్గర ఈ విధంగా విద్య నేర్చుకోవటమే నాకు గురుదక్షిణ అని భావన చేసి, నాకే గురుదక్షిణ నువ్వు చెల్లించవలసిన అవసరం లేదని” అని గురువు అన్నప్పుడు, గురుపత్ని దగ్గరికి వెళ్లి శ్రీకృష్ణుడు “తల్లి! గురుదక్షిణగా నేనేదైనా మీకు వలసినటువంటి సహాయం చేస్తాను” అన్నట్లుగా విన్నవించుకుంటాడు. ఆమె ఏమడిగిందండి? ఎప్పుడో వెళ్లిపోయినటువంటి తన కుమారుడ్ని అడిగింది. ఎప్పుడో వెళ్ళిపోయిన తన కుమారుడ్ని తెచ్చించేటువంటి వాడని తెలియకపోతే అట్లా అడుగుతారా? అట్లా మనెవరన్నా అడిగారనుకోండి? ఇప్పుడు ఇక్కడ కూర్చొని బోల్డు చెప్తూ ఉంటాం కదా! వీళ్ళందరు గురువు గారు అంటూ ఉంటారు నన్ను కదా! “ఇలా తెచ్చివ్వండి సార్! మాకు పదేళ్ళ క్రితం కలగక కలగక ఒకడు కలిగాడు. వాడు మూడేళ్ళ క్రితం పోయాడు. ఎక్కడున్నాడంటారు? మళ్ళీ పుట్టాడా?” అని అడిగాననుకోండి, గురువుగారికి తెలీదు అనుకుంటారేమో అని ఏదో గాస్ కొడతాడు! నిజంగా సత్యవంతుడైతే “నాకు తెలీదు నాయన” అని చెప్పాలి, తెలిస్తే చెప్పాలి. అలాంటిది ఎప్పుడో వెళ్ళిపోయినటువంటి ఒక కుమారుడు, అతన్ని కొని తెమ్మని చెప్పిందండి. అంటే, తీసుకు రమ్మని చెప్పిందండి. “అదొక్కటే నాకు లోటు కనిపిస్తుంది జీవితంలో, ఇంకేలోటు లేదు” అన్నది ఆవిడ. ఒక జీవుడు ఈ పద్నాలుగు లోకాల్లో ఎక్కడున్నాడని ఎట్లా తెలుస్తుందండి? ఆలోచించండి. ఇప్పుడు అక్కడ వంటింట్లో ఏం

జరుగుతుందో మనకు తెలుసా? తెలీదు. వంటింట్లో ఏం జరుగుతుందో తెలీదు, మన వెనకాల ఏం జరుగుతుందో తెలీదు, మనకేమి తెలియదు కదా! ఇక్కడుంటే అక్కడేం జరుగుతుందో తెలీదు, అక్కడుంటే ఇక్కడేం జరుగుతుందో తెలీదు, ఇక్కడుంటే ఇక్కడేం జరుగుతుందో కూడా తెలియని వాళ్ళం మనం. అలాంటిది పద్నాలుగు లోకాల్లో ఒక జీవుడు... కోటానుకోట్ల జీవుడుంటారు. అసలు ఎట్లా ఉన్నాడో? జంతువుగా ఉన్నాడో? చెట్టుగా ఉన్నాడో? పక్షిగా ఉన్నాడో? ఏ లోకంలో ఉన్నాడో? ఎట్లా తెలుస్తుందండి? "అలాగే తల్లి!" అన్నాడు. వెళ్లి, తీసుకొచ్చాడంటే, ఎంత సర్వజ్ఞుడు కాకపోతే తీసుకు రాగలడండి?

భగవంతుడి గుణాలు ప్రధానంగా ఏడు చెప్తారు. అవి మీకు చెబుదామనుకుంటున్నాను. అవి తెలిసినటువంటి మూర్తి రుక్మిణీదేవి. నీకు తెలియందేముంది? నువ్వు వచ్చి, నన్ను అందుకోమని నేను నీకు చెప్పాలా? అయినప్పటికీ నేను చెప్పాలి కాబట్టి చెప్తున్నాను. అలాంటి గుణాలు గల నువ్వు సర్వజ్ఞుడవు, మొదటిది. రెండోది సర్వ ఈశ్వరత్వము. అంటే, సమస్తమునకు, సృష్టి మొత్తానికి అతడే ఈశ్వరుడు. సృష్టి పుట్టక ముందున్నాడు, సృష్టి పుట్టినప్పుడు, సృష్టికి ఈశత్వము కలిగి ఉన్నాడు, సృష్టి నడిపిస్తూ ఉన్నాడు. అందరి యందు కూడా తానే ఈశత్వము వహించి ఉన్నాడు. మనయందు ఉన్నాడు. మనయందేమిటి, అలా రోడ్డు మీద వెళ్ళేటువంటి ఒక జంతువు యందు కూడా ఉంటాడు. దాన్ని నడిపిస్తూ ఉంటాడు, దానికి ఆహారం చూపిస్తూ ఉంటాడు, దానికి నిద్రా మైదములు కలిగిస్తూ ఉంటాడు. ప్రతి జీవుడ్ని నడిపిస్తున్నటువంటి సర్వేశ్వరుడు కదా! సర్వజ్ఞత్వమే కాదు, సర్వమునకు ఈశ్వరత్వము, సర్వభౌక్తత్వము. సమస్తమును భుజించేవాడు ఆయనే. ఇలా చూపిస్తాడు విశ్వరూపం. విశ్వరూపం చూపించి, చూడండి ఎలా వచ్చేస్తున్నారో అందరూ నాలోకి అని చూపిస్తాడు. అందర్ని నేనే భుజిస్తున్నాను. సర్వేశ్వరత్వము. బ్రహ్మదేవుడికే చూపించాడు తానే ఈశ్వరుడని. తాను భూమి మీద ఉన్నప్పుడు తానే ఈశ్వరుడని సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మకు తెలియపరిచాడు. సృష్టికి ప్రతిసృష్టి చేసి, ఒక్కసారి బ్రహ్మదేవుడికి గుర్తు చేసాడు. నీవు కాదు చేస్తున్నది, నీ నుండి జరుగుతోంది తప్ప. నీవు చేస్తున్నావనేటువంటి భ్రమ నీకు మంచిది కాదు అని తెలియచేయటానికా అన్నట్లుగా బ్రహ్మదేవునికి చూపించాడు తన యొక్క సర్వేశ్వరత్వం.

ఇంద్రుడికి చూపిస్తాడు తన సర్వేశ్వరత్వం – "నీవు కాదు వర్షములు కురిపించేది. నువ్వు వర్షాలు కురిపించడం ఏమిటి? ధర్మానన్నుసరించి ఆయా ఋతువుల్లో, ఆయా కాలముననుసరించి ప్రజల యొక్క ధర్మాధర్మ అనుసరణనుబట్టి వర్షములు కురవటం, కురవక పోవటం ఉంటుంది తప్ప, నువ్వు కురిపిస్తాననేటువంటి వ్యామోహంలో ఉన్నావా?" అని. లోకాల్ని పాలించేటువంటి వాడు ఇంద్రుడు. సృష్టిని మొత్తాన్ని పరిపాలించేటువంటి వాడు ఇంద్రుడు. "ఇందంద్రా ఇంద్రా" అంటారు. "ద్రా" అంటే రక్షించడం.

రక్షించి, పోషించడం అనేటువంటిది. దీనిని రక్షించి పోషించేటువంటి, దీనిని అంటే సృష్టిని అని అర్థం. "ఇందంద్రా ఇంద్రా" అన్నారు. సృష్టిని ఈ విధంగా పోషిస్తున్నటువంటి వాడు... నువ్వు పోషిస్తున్నావు అనుకుంటున్నావా? నువ్వా పోషించేది?

ఒక కుటుంబానికి యజమాని తనే పోషిస్తున్నా అనుకుంటుంటాడు తన భార్యని, తన పిల్లల్ని. తను పోషించే తన భార్యా పిల్లలు, ఏ ఏ పుణ్యకార్యములు చేయటం వలన ఇక్కడ దేహధారులై వచ్చారో, వారి వారి పుణ్యమే ఇతని ద్వారా వారికి అందుతూ ఉంటుంది. పిల్లలు గాని, భార్యకు గాని అంది వచ్చేవి ఎలా ఉంటాయంటే, వారు చేసుకున్న పుణ్యం ప్రకారం వారికి అంది వస్తాయి. నువ్వు వాహిక మాత్రమే. నేను పోషిస్తున్నాను అనుకోవటం, నేనే సమస్తం నిర్వర్తిస్తున్నాను, నేను లేకపోతే కష్టం అనేటువంటి భావన ఉంటాయి కదా! మనం చేసే ఇంత పనికి, మనం లేకపోతే ఎవరు చేస్తారు అనిపిస్తూ ఉంటుంది కదా! మనం లేకపోతే మన కన్నా బాగా చేసేవాడు వస్తాడని మాస్టరు గారు చెప్తూ ఉండేవారు. ఎవరు లేకపోయినా సృష్టికి ఇబ్బందేమి లేదు. ఉండడం నీ అదృష్టం అంతే! ఉండడం అదృష్టం, ఒకటి. రెండు, నీ చేత నిర్వర్తింపబడినటువంటి కార్యమున్నదే అది నీకు అనుగ్రహంగా ఇవ్వబడినటువంటి విషయం. ఇట్లా గురుపూజల్లో కూర్చొని ప్రవచించడం గొప్పతనం కాదు. అదొక అదృష్టం. ఏంచేత? అది ఒక బాధ్యత. అది మనం నిర్వర్తించకపోతే మనకన్నా బాగా నిర్వర్తించేటువంటివారు తప్పక వస్తారు. మనం నిర్వర్తించి వెళ్ళిపోయిన తర్వాత కూడా నిర్వర్తింపబడుతూనే ఉంటాయి. సృష్టి దేనికోసం ఆగిందండి? ఎవరి కోసమాగింది? జిల్లా కలెక్టర్ గారు వెళ్ళిపోతే ఇంకో జిల్లా కలెక్టర్ గారు రారా? ముఖ్యమంత్రి వెళ్ళిపోతే ఇంకో ముఖ్యమంత్రి వస్తాడు, ప్రధాన మంత్రి వెళ్ళిపోతే ఇంకో ప్రధాన మంత్రి వస్తాడు. ఆగుతుందా? ఏమి ఆగదు. మీరు లేకపోతే ఎలా అండి అని ఎవరన్నా అంటే నమ్మబోకండి. వాడు మనల్ని ప్రశంసించడానికి మీరు లేకపోతే ఎలా అండి అంటుంటారు కదా! ఎలా ఏంటి? మనం రాక ముందు ఇంతకన్నా బాగుందేమో! మనమెళ్ళిపోయిన తర్వాత ఇంతకన్నా బాగుంటుందేమో! మనమే ఉండటం వల్ల కొంచెం నాసిగా ఉందేమో? ఉండచ్చుగా!

ఈశ్వరత్వం అనేటువంటిది దైవమునకు మాత్రమే సంబంధిస్తుంది. యోగులు, యోగీశ్వరులు కూడా తామే సమస్తమని అనుకోరు. యోగేశ్వరేశ్వరుని ఆరాధన చేస్తూ ఉంటారు. "యత్ర యోగేశ్వరః కృష్ణో". యోగేశ్వరేశ్వరుడతను, యోగేశ్వరులకే ఈశ్వరుడు. ఆయనది సర్వ ఈశ్వరత్వము, సర్వభౌక్తృత్వము. "కాలం రూపంలో మొత్తం తినేస్తాను, చూడండి" అని చూపించాడు కదా! కురుసభలో ఏ విధంగా అందరూ తనలోకి వచ్చేస్తున్నారో చూపించాడు, అందరూ ఏ విధంగా తనలోంచి వ్యక్తమై వస్తున్నారో, అందరూ తనలోకి ఏ విధంగా జొరబడుతున్నారో చూపించాడు. అర్జునుడు యుద్ధం చేసే అప్పుడు భయపడిపోయి, ఆందోళణ పడి, ఇంత

సైన్యాన్ని వీళ్ళందరినీ నేను ఎలా చంపను, ఇటువంటి భావాలన్నీ కలిగినప్పుడు చూపించాడు "ఇదంతా అయిపోయిందిరా, ఒక్కసారి చూడు" అని! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, దుర్యోధనుడు, అతిరధులు, మహారధులు, ఇట్లాంటి వాళ్ళందరు వారి వారి సైన్యాలతో గుర్రాలతో, ఏనుగులతో ఆయనలోకి అట్లా ఆహూతై పోతూ వెళ్ళిపోతూ ఉంటారు. అర్జునిడికి కనిపించింది. చెప్తాడు అర్జునుడుకి. ఇంక వ్యామోహమేముంది? నువ్వా చేసేది యుద్ధం? నువ్వు చేసినా, చెయ్యకపోయినా అది అలా వెళ్ళిపోతుంది. కాకపోతే, ఇది నిర్వర్తించేటువంటి అదృష్టం నీకు లభించింది. ఈ రోజున మనం అర్జునిడిని ఎందుకండి అంతగా తలుచుకుంటూ ఉంటాం? పాండవుల్లో కూడా అర్జునుడినే ఎక్కువ ఎందుకు తల్చుకుంటాం? అలాంటి అదృష్టం అతనికి అబ్బింది అనుగ్రహంగా.

ఎవరెవరికి ఏ ఏ కార్యములు వారి వారి జీవితములందు అంది వచ్చినాయో, అవి అదృష్టంగా భావించి, ఈశ్వరుడే భర్తగా భావించి నిర్వర్తించుకోవటం అనేటువంటిది భక్తి. అలా కానప్పుడు అతడు అహంకారియై పాడు చేసుకుంటాడు. తనకొచ్చినటువంటి అవకాశాన్ని పాడు చేసుకుంటాడు. సర్వకర్తృత్వము, సర్వభోక్తృత్వము, సర్వనియంత్రుత్వము ఆయనదే.

ఎవరినైనా నియమించేయగలడు. ఆయనకి ఎలా తోస్తే అలా! ఈ రుక్మిణీకల్యాణ సందర్భంలోనే, ఈయన తప్పకుండా వస్తాడు అనేటువంటి భయం చేత రుక్మి, రుక్మిణీదేవి అన్నగారు, శిశుపాలుడు, జరాసంధుడు, సాళ్వుడు, ధంతవర్తుడు, ఇలాంటి మహా వీరులందరూ కూడా ఎట్టి పరిస్థితుల్లోను ఈ సారి ఇతన్ని మనం నిర్జించాలి. తప్పకుండా వస్తాడనేటువంటి అనుమానం వాళ్ళకున్నది. కృష్ణుడు వస్తాడనేటువంటి అనుమానము ముందుగానే పసికట్టినటువంటి వారందరూ కూడా సైన్యాలతో వస్తారండి. ఎంతటి వాడు జరాసంధుడు? ధంతవర్తుడు, జయవిజయంలో ఆయన ఒకడు. ధంతవర్తుడు, సాళ్వుడు, శిశుపాలుడు, రుక్మి, ఇలాంటి వారందరూ, వారి వారి సైన్యాలు వారి వారి రాజ్యాల నుంచి తీసుకొచ్చారట. ఎందుకంటే, వస్తాడు, దక్కనివ్వకూడదు, వీలుంటే వేసెయ్యాలి. జయించి, హతమర్చాలనేటువంటి ఉద్దేశ్యంతో అంతటి మహావీరులు, అంతటి వైరంతో కూడినటువంటి వాళ్ళు, వాళ్ళందరిట్లా చూస్తూ వుంటే అలా నడుచుకుంటూ వెళ్ళి, వాళ్ళు చూస్తుండగానే ఒకసారి వాళ్ళ పక్కకు చూసాడు, అందరి పక్క. చూసి ఒక్కసారి hi అన్నట్టుగా నవ్వాడనమాట! అమెరికా భాషలో మనమందరం hi, hi అంటుంటాం కదా! హాయిగా ఉండాలని కదా! ఏరా! బాగున్నారా అన్నట్టుగా ఒకసారి చూసి నవ్వాడు. మాట్లడలేదు. చూసి, నవ్వాడు. అంతే, అయిపోయింది. అలా బొమ్మల్లాగా నిలబడిపోయారు. నియంతృత్వం statue అంటుంటారు చూశారా చిన్నప్పుడు? ఇట్లా statue అన్నాడు వాళ్ళందర్ని ఒక్కసారి, అంతే అలా నిలబడిపోయారు. ఎంత కంగారుగా తెచ్చేసుకోవాలండి ఆయన రుక్మిణీదేవిని

వీళ్ళందరి మధ్యల్లోంచి? ఏం లేదు, హాయిగా రథం దిగాడు, ఎంత వయ్యారంగా నడవాలో అంత వయ్యరంగాను నడుచుకుంటూ వెళ్ళాడు, ఎంత సున్నితంగా చేయి పట్టుకోవాలో అంత సున్నితంగాను చెయ్యి పట్టుకున్నాడు. చక్కగా తీసుకొచ్చాడు. పలకరించాడు, ఆవిడని చూసి నవ్వాడు. ఇద్దరు ఒకళ్లకొకళ్ళు చూసుకున్నారు. రుక్మిణి చూడంగానే తన్మయం చెందింది. అలా తీసుకొచ్చాడు రథమెక్కించాడు. అలా వెళ్ళిపోతూ, సందు తిరిగే ముందు ఒకసారి ఇలా చెయ్యి ఊపాడు వస్తానని. అప్పుడు వీళ్ళకి తెలివొచ్చింది.

అందరిలో ఉండేటువంటి తెలివి ఎవరు? తెలివి మనది కాదు, మనదనుకుంటాము. మనదనుకోవటం వల్ల తిప్పలు పడుతూ ఉంటాం. మనది కానిది మనం అనుకోవటం వల్ల చాలా తిప్పలు ఉంటాయి. తెలివి మనలో ఉన్న అయ్య యొక్క అమ్మది కదా! ఆమె ఎరుక, ఆయన ఆమెకి ఆధారం. ఆ ఎరుక తనదే అందరి యందు ఉన్నది. అందరి యందు ఉన్న తన ఎరుకను తను ఒక్కసారి పలకరిస్తే, ఆ ఎరుక తనదే కదా! తను ఎట్లా చెప్తే అట్లా వింటుంది, సందేహం లేదు. అంచేత, ఎవర్ని నియమించలేదు? అప్పటికే వీళ్ళందరు మాటలు మాట్లాడేసారు ఆ జ్యూదం ఆడే అప్పుడు. లేకపోతే, ఈ భారత యుద్ధం ఇంతగా రాసుకోవడానికి, చెప్పుకోడానికి ఏమి లేదు. యుద్ధ బలమే ఉండేది కాదు. పది రోజులు పాటు భీష్ముడుతోను, ఐదు రోజుల పాటు ద్రోణుడుతోను! ఒక్కొక్కరోజు ఒక్కొక్కడు. ఇట్లా ఉండేది కాదు. పద్దెనిమిది రోజులు యుద్ధమేమిటి కృష్ణుడికి? చేతగానోడిని ఒకడిని పెట్టుకొని... శిష్యుడు చేతగాని వాడు, కాని అట్లా ఆ మాట చెప్పకూడదు. అందుకని, పద్దెనిమిది రోజులు. లేకపోతే, అరణ్య పర్వంలోనే చెప్తాడు. మీకు వాక్కు ఒక సమస్య అని చెప్తాడు శ్రీ కృష్ణుడు అరణ్య పర్వంలో. అప్పుడే పాండవులందరూ వనవాసం వెళ్తారు. అప్పుడు లేడుగా! ఆపదలో ఉన్నటువంటి ఆమెకి వస్త్రాలు బహూకరించి ఉన్నాడు తప్ప, ఆ సమయంలో అక్కడ లేడు కదా! వీళ్ళందరూ వనవాసం చేస్తూ ఉంటే చూడటానికి వెళ్తాడు ఒకసారి. మనవాళ్ళు కష్టాల్లో ఉంటే వెళ్ళాలి కదా! వెళ్తే, జరిగిందంతా తనకు తెలియదా, అయినప్పటికీ వాళ్ళు చెప్పినా విన్నాడు. విని వాళ్ళ దుఃఖం చూసాడు. జరిగిన అధర్మమంతా కుడా... దానికొక్కటే మాటన్నాడు. “ఈ క్షణంలో అందరిని క్షణకాలంలో హతమారుస్తాను, కానీ” అన్నాడు? ఎందుకు “కానీ”? వీళ్ళందరూ ప్రతిజ్ఞలు చేసేసారు. నేను వాడి తొడ పగలగొడ్తాను, వీడి గుండె చీల్చి రక్తం తాగుతాను, యుద్ధ భూమిలో వీళ్ళందరినీ ఈ విధంగా... ఏవేవో మాటలు చెప్పేశారు. అంతే కాదు! పన్నెండు ఏళ్ళు అరణ్య వాసం చేస్తాము, ఒక ఏడు అజ్ఞాన వాసం చేస్తాము. అన్నీ మాటలేగా! ఇన్ని మాటలు మీరు మాట్లాడినప్పుడు ఆ మాటలు చెల్లించుకోవాలిగా! గుర్తు పెట్టుకోండి, జీవితంలో మన నుంచి వచ్చిన ప్రతి మాట మనం చెల్లించు కోవాల్సి ఉంటుంది. మాట పెద్ద అప్పు. తప్పించుకోవడానికి వీలుండదు. అందుకనే మాటకు ప్రాణము సత్యము అన్నారు. నువ్వు మాటిచ్చి, అది నిర్వర్తించకపోతే అది నీ వెంట పడ్తుంది. నీ వెంట పడి, నిన్ను పీడిస్తుంది.

అందుకే కదా దశరధుడు అంత బాధ పడ్డాడు! భార్యకి మాట ఇచ్చాడు ముద్దుల భార్యకి. మాట చెల్లించమని ఆవిడ అడిగింది. అడిగిన విషయం తనకంత ఇష్టమైనటువంటి విషయం కాదు, సహించరానటువంటి విషయం. కానీ చెల్లించవలసిన బాధ్యత ఉన్నది. చెల్లించకపోతే తన యొక్క ధర్మం చెడుతుంది. చెల్లించినా ధర్మం చెడుతుంది. రాముడిని ఏ విధంగా వనవాసాన్ని పంపించగలడు? అలాంటి సంకటనలో పడిపోతే, రాముడు దశరధుని యొక్క సంకట మెరిగిన వాడు కాబట్టి తండ్రి మాట చెల్లించటం కోసం వనవాసానికి వెళ్తాడు తప్ప, లేకపోతే వనవాసానికి వెళ్ళాల్సినటువంటి అవసరం రాముడికి లేదు. ఆ విధంగా మనకి మాట. మీరందరు రకరకాలుగా మాట ఇచ్చారు మాట మీద కట్టు పడ్డారు. కాబట్టి, ఈ పన్నెండు ఏళ్ళు నేను మిమ్మల్నిలా చూస్తూ నేను ఉండవలసి వస్తోంది అని చెప్తాడు. కృష్ణుడికి తన ఆశ్రితులు, తన ఆప్తులు అలా ఆ విధంగా ఉండటం ఖర్చుబాటు అయ్యేటువంటి విషయం కాదు. ఇంక ఏం చేస్తాడో తెలుసా శ్రీకృష్ణుడు? ఆ పన్నెండు సంవత్సరాలు తపస్సు చెయ్యమంటాడు. పాండవులు వనవాసం చేస్తున్న పన్నెండు సంవత్సరములు శ్రీకృష్ణుడు తపస్సులో ఉంటాడండి. ఎంత గొప్ప విషయం. ఒకేఒక్కసారి తపస్సులోంచి ద్రౌపదీదేవి పిలిస్తే బయటకి వస్తాడు. అది కూడా ఏమిటి, మళ్ళీ వీళ్ళకి ఆపద వచ్చే పరిస్థితి వచ్చింది. దుర్యోధనాధులు ఒక కపట ప్రవృత్తి చేత ధర్మరాజుని పరీక్ష చెయ్యటానికని దుర్వాసుని పంపిస్తారు. దుర్వాస మహర్షి ముక్కోపి. సరిగ్గా జరగకపోతే ఎలాంటి శాపమైనా ఇవ్వగలడు. అలాంటి సందర్భంలో ఆయన వచ్చి భోజనం చేస్తాను అనటం, అప్పటికే అక్షయపాత్ర ఆ రోజుకి చెయ్యవలసిన కార్యం పూర్తి చెయ్యటం, అలాంటి పరిస్థితుల్లో ఇంక ఎవరు దిక్కు? అప్పుడు మళ్ళీ తాను అంత తపస్సులో ఉన్నా కూడా సర్వజ్ఞత ఉన్నటువంటి వాడు.

మరి ఈ తపస్సెందుకు చెప్పండి? తపస్సు వల్ల ఏ ఫలం పొందాలో అది ఆయనే అయినప్పుడు తపస్సు ఎందుకు చేశాడు? ఇది రాబోయేటువంటి యుద్ధంలో ప్రాణహాని, ఆ ధర్మ నిర్వహణ కార్యక్రమముందే దాంట్లో మహత్తరమైనటువంటి ప్రాణహాని ఉన్నది. దాన్నంతటిని చక్కగా శివపరంగా హరించడానికి, జీవులకి ఇబ్బంది కాకుండా ఉండటానికి... ఎందుకంటే, వీళ్ళు వీళ్ళు ఆ సైనికులంతా ఏం చేసారండి? వాళ్ళే పాపం చేసారు? పద్దెనిమిది లక్షల మంది సైన్యం. మరి వాళ్ళందరినీ సంహరించాలి. వాళ్ళే కదా ముందు నడిచేది. అంచేత, ఆ విధంగా తపస్సు చేస్తాడు. ఎందుకివన్నీ చెప్తున్నానంటే, అతడు తలుచుకుంటే మహాభారత యుద్ధం ఇదుగో ఇందాక ఐదుగురు ఉద్దండమైన మహావీరులు వారి వారి సైన్యాలతో కూడి అక్కడ ఉన్నా, వారి కళ్ళ ముందే ఏ విధంగా ఎవ్వర్ని కొట్టకుండా, ఎవ్వర్ని తన్నకుండా, ఎంతో సుకుమారంగా తనదైన వస్తువును తాను ఈ విధంగా తీసుకెళ్ళాడో, అంత సుకుమారంగాను పద్దెనిమిది లక్షల మందిని హరించేసాడు. అంత ఉండేది కాదుగా! దుష్టచతుష్టయం నలుగురే కదా! ఇంత ప్రాణ హాని ఉండేది కాదు కదా! అయినప్పటికీ, అక్కడ చేరినటువంటి

సైనికుల్నందర్నీ కూడా ఒక్కసారి చూసి, వారికి నెప్పి లేకుండా వాళ్ళ ప్రాణాల్ని తీసి, ఆ జీవుల్ని తనలోకి తెచ్చుకున్నాడండి. ఎంత గొప్ప విషయం తెలుసా! ఈయనేం యుద్ధం చెయ్యడు కదా! ఎదురుగుండా వచ్చిన సైన్యాన్నంతాను చూస్తూ ఉంటాడు. ఎవరికీ ఏ నొప్పి కలగకుండ, ఆయా జీవులు, ఆయా దేహముల నుండి విడిపడి తనలోకి వచ్చేట్టుగా తాను ఒక విధమైనటువంటి పరహిత కార్యం చేస్తాడు శ్రీకృష్ణుడు. ఎందుకిది చెప్తున్నానంటే, నియంతృత్త్వము అనేటువంటి పదానికి మరి ఇలాంటి గుణాల్ని ఏవో కొన్ని చెప్పుకుంటే తప్ప "ఏ నీ గుణములు" అని ముందుకు వెళ్లిపోయామనుకోండి? ఎందుకు చదువుకోవటం?

భాగవతం చదువుకోవటం అంటే, ఒక పద్యంలో ఒక పదం పోతనామాత్యుల వారు వేసాడంటే, ఏ గుణముల గురించి రుక్మిణి మాట్లాడి ఉండి ఉండాలి? ఆవిడ ఎంత చూసి ఉంటుంది? ఆవిడకి కేవలం ఆ జన్మ స్మృతే కాదు. ఎందుకంటే, బంగారు దేహము కలిగినటువంటిది రుక్మిణి. భగవంతుని యొక్క గుణవిశేషములు తెలిసినటువంటిది కాబట్టి నీవు సర్వజ్ఞుడవు, నీవు సర్వేశ్వరుడవు, నీవు సర్వభొక్తవు అంది. మనం తింటున్నాం అనుకుంటూ ఉంటాం కదా! అన్నీ మనం తింటూ ఉండటం వల్ల మనకి జబ్బులొస్తాయి. తినటం నువ్వు ఎలా చేయగలుగుతున్నావు? నీలో తినాలనేటువంటి సంకల్పం ఎవడిచ్చాడు? తినడానికి చెయ్యి కలపడానికి శక్తి ఎవడు ఇచ్చాడు? ఈ వేళ్ళు బాగా వాచిపోయినాయి అనుకోండి, ఏం కలుపుతారు? spoon పట్టుకోవడానికి కూడా వేళ్ళు పనిచేయట్లేదనుకోండి ఏం తింటారండి? నోట్లో పెట్టుకుంటే నమలాలి కదా! నవలడం అందరికీ వీలు పడుతుందా? పళ్ళు లేని వాళ్లకి వీలుపడదు. పోని, నవమిలావు, మింగాలి కదా! బాగా throat infection వచ్చినవాడు ఏమీ మింగలేడు కదా! మింగడం చాలా పెద్ద ప్రక్రియ. అట్లా వూరికే దడదడా వేసేస్తుంటాం కదా మనం! ఇక్కడ pressure తీసుకొచ్చి, ఇటు pressure పెట్టి, అటు release చేసి, లోపలకి పంపించేస్తుంది అది. గుటకెట్లా వేస్తున్నారండి ఒకసారి ఆలోచించండి? చివరి దశలో అట్లా నీళ్ళు పోసి మింగమంటే వాడికి మింగుడు పడదు. మింగుడు పడడానికి ఇక్కడ గొంతు దగ్గర చాలా పెద్ద ప్రక్రియ ఉన్నది. నువ్వే తింటున్నావా? సరిగ్గా తినకపోతే నాలుక ఆ పంటి కిందో, లేక ఈ పంటి కిందో నాలుక కొరుక్కొని, లేకపోతే పళ్ళతో పెదవులు కొరుక్కుని, ఇట్లా చేసుకుంటూ ఉంటాం కదా! మనలో అన్నీ తింటున్నది అతడే. ఎందుకని? ఈ శరీరాన్ని పోషించి, జీవుడ్ని సురక్షితంగా ఉంచాలి కాబట్టి అతడు సర్వభోక్త.

కాలం రూపంలో ఆయన మనల్ని తినేస్తూ ఉంటాడు. "ఇంకెన్నాళ్ళండి? మహా ఉంటే పది ఏళ్ళు ఉంటానేమో" అంటుంటాడు ఒకొక్క ఆయన కదా! అంటే ఏంటి? డబ్బై ఏళ్ళు వచ్చాయనుకోండి, మహా అయితే ఎనభై ఏళ్ళు దాకా అనుకుంటాడు కదా! ఎనభైలో ఉన్నాయన ఇంక ఏముంది రేపో, మాపో అన్నట్టుగా ఉంటాడు కదా! ఏమిటది? కాలం రూపంలో ఉన్న మహాకాలుడు. పుట్టిన దగ్గరనుంచి మనని తింటూనే ఉంటాడు. పుట్టిన

వాడికి next station ఏమిటంటే మరణమే కదా! "జాతస్య మరణం ధృవం". పుట్టగానే date of birth ఉందంటే, date of death కూడా ఉంటుంది. ఈ లోపల ఇక్కడ నుంచి అక్కడి వరకు ఏం జరుగుతోంది? నువ్వు తినబడుతూ ఉంటావు కాలం చేత. ఈ లోపల నిన్ను ఎన్ని ఆలోచనల రూపంలో తినేస్తూ ఉంటాడో కదా! ఒక ఆలోచన వచ్చిందంటే ఇక్కడ నుంచి అక్కడికి పరిగెత్తి, అక్కడ నుంచి ఇంకో చోటికి పరిగెత్తి, అక్కడ నుంచి మరో చోటికి పరిగెత్తి... ఒక్క ఆలోచన కదా ఈ జగద్గురు పీఠాన్ని నడిపిస్తోంది! ఇంతమంది ఇన్ని చోట్ల, ఇన్ని రకాలుగా ఏవేవో చేస్తూ ఉన్నాం కదా! ఒకటేగా ఆలోచన అది! మరిందులో జీవితం పండిందో, ఎండిందో, పుచ్చిందో, ఎవడి గోల వాడిదే! అలా ఒక్కొక్క భావం చాలు... వివాహం చాలు! వివాహం అనుకుంటే, అక్కడ్నుంచి నలభై ఏళ్ళ కార్యక్రమం మొదలైపోతుంది.

ఇట్లా మనని తినడమే కాదు, మనం కూడా తినేస్తూ ఉంటాం కదా! జంతువులని, చెట్లని, వృక్షాలని, జంతువులని మన రూపంలో తినేస్తాడట. వృక్షాలని మన రూపంలోను, పశువుల రూపంలోను తినేస్తూ ఉంటాడట. వృక్షాలు ఖనిజాల్ని తినేస్తూ ఉంటాయి. మనం జంతువుల్ని, వృక్షాల్ని, ఖనిజాల్ని అన్నీ తినేస్తూ ఉంటాం కదా! మీకు కొంచెం minerals తగ్గినాయండి అని చెప్తే, మనం తినేస్తూ ఉంటాం కదా! ఇట్లా అందరూ అన్నిలోకాల్లోనూ, క్రింద లోకము, పై లోకం వాడికి ఆహారం. ఆ పై లోకం, ఆ పై లోకం వాడికి ఆహారం. ఇది అన్నమంటే! వేదంలో చెప్పబడినటువంటి అన్నం ఏమిటంటే పై లోకానికి క్రింద లోకం ఆహారం. ఇప్పుడు మీరందరూ నాకు ఆహారమే కదా! ఇలా తినేస్తున్నాను కదా! "అబ్బా! తినేస్తున్నాడ్రా ఈయన! వదలట్లేదు" అంటాము కదా! అంటే, చిన్న జీవి, పెద్ద జీవికి ఆహారం. ఈ మొత్తం సూర్య మండలానికి ఆహారం ఇచ్చేవాడు, పుచ్చుకుపోయేవాడు సూర్యుడు. ఆయన్నీ తినేవాడున్నాడు.

ఇట్లా ఒకొళ్లకొకళ్ళు, ఎవర్లోంచి ఎవరొచ్చారో, వారిని వారు వాళ్ళల్లోకి మళ్ళీ సంగ్రహిస్తారు. ఇట్లా సమస్తము ఆయన భోజనమే! ఈయన బ్రహ్మము. కృష్ణ బ్రహ్మము కదా! బ్రహ్మము నుండి మహా చైతన్యం పుట్టి, ఆ చైతన్యం నుంచి అష్ట ప్రకృతులతో లోకాలన్నీ పుట్టినాయి – మూడు గుణాలు, ఐదు భూతాలు. ఈ అష్ట ప్రకృతులను మూల ప్రకృతి భోజనం చేసేసస్తుంది. ఆవిడ (మూల ప్రకృతి) లోంచే ఇవన్నీ వచ్చినాయి. ఆవిడ ఆయనలోంచి వచ్చింది, ఆయనలోంచి వ్యక్తమైంది. పొద్దున్నే తెలివొచ్చింది కదా! రావడం బట్టి కదా ఇక్కడికొచ్చాం! వచ్చాం కాబట్టి కదా ఇవ్వన్నీ చేస్తున్నాం! ఆ తెలివే అమ్మ. అలాంటి మొత్తాన్ని తనలోకి హరించగలడు. అందుకని అతడు సర్వభౌక్త.

సర్వభౌక్తృత్వము, సర్వనియంత్రుత్వము, సర్వాంతర్యామిత్వము. మనం కూడా చాలా సృష్టి చేస్తాం తప్ప.... మనం కూడా ఒక ఇల్లు కట్టచ్చు, ఒక school కట్టచ్చు, ఒక ఉద్యానవనం తయారు చేసుకోవచ్చు, ఏదైనా చెయ్యచ్చు. అందులో అన్నిట్లోనూ మనం ప్రవేశించి ఉన్నామా? ఇప్పుడు ఇల్లు కట్టుకున్న వాళ్ళం కొంతమంది ఉన్నాం కదా, లేదా ఇల్లు కొనుక్కున్న వాళ్ళం కొంతమంది ఉన్నాం కదా! కానీ ఇప్పుడిక్కడ గురుపూజల్లో వున్నాం కదా! మన ఇంట్లో ఏం జరుగుతుందో మనకు తెలుసా? ఇంట్లో మనం ఇప్పుడు లేముగా! మీ ఇంట్లో ఇప్పుడు మీ వాళ్ళు ఏం చేస్తున్నారో మీకు తెలుస్తుందా? అంతర్యామిత్వము అంటే తను సృష్టించిన దాంట్లో తాను ప్రవేశించి, అందులో ఉంటాడు. తను ఉన్నంతసేపే అదీ ఉంటుంది, తను లేకపోతే అదీ లేదు. మన పరిస్థితి చూడండి. మనం సృష్టించిన వాటి చుట్టూ మనం తిరగాలి కదా! ఆయనకా బాధ లేదండి. అందుకనే అతడు అంతర్యామి. ఆయనే యజమాని అంటారు. అ అంతర్యామి ఇందులోంచి నిష్క్రమిస్తే ఇంక అది ఉండదు. భూమి నుంచి నిష్క్రమిస్తే భూమి ఉండదండి. దైవం శరీరం నుంచి నిష్క్రమించాడనుకోండి, ఇంకేముందదక్కడ. అన్నిటినీ సృష్టించడమే కాక, వాటిలో ప్రవేశించి ఉన్నటువంటి వాడు దైవం. నీవు దైవం అన్నప్పుడు అతడు సర్వజ్ఞుడు అని తెలుసుండాలి, సర్వేశ్వరుడని తెలుసుండాలి, సర్వభౌక్త అని తెలుసుండాలి, సర్వమును నియంత్రించేటువంటివాడు అని తెలుసుండాలి. సర్వమునందు ప్రవేశించి ఉన్నవాడు కాబట్టి మన యందే ఉన్నాడు. మన యందే ఉండే దైవాన్ని మనం లోపల దర్శించక, బయట ఎంత వెతుక్కున్నా కనిపించడండి!

తన యందు తాను వెతుక్కొని, తనకి తగిన భర్త ఇతను అని ఆమె నిర్ణయం చేసుకుందట కదా రుక్మిణీదేవి! ప్రతి జీవుడికి తన యందున్నటువంటి ఈశ్వరుడే భర్త. తన అహంకారము తన భర్తను తాను చేరనీయకుండా చేస్తూ ఉంటుంది. భక్తునికి భగవంతుని చేరడానికి అడ్డం ఏమిటయ్యా అంటే, తనలోనుంచి పుట్టినటువంటి అహంకారమే. సర్వ అంతర్యామిత్వము, అటుపైన సర్వపాలకత్వము, సర్వసంహారత్వము ఇట్లా ఏడు మహా గుణములు భగవంతునికి ఉన్నాయండి.

ఇలాంటి గుణాలు, “ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక”. ఇటు మనం వింటున్నామనుకోండి, ఎవర్ని వింటున్నాం? ఎవరు మాట్లాడుతున్నా, ఎక్కడ ఏ చప్పుడు జరుగుతున్నా, దైవమే అనేటువంటి తెలిసిన స్థితి ఉన్నవాడు ప్రహ్లాదుడు. ఎంచేతంటే, అది ఆ విధంగా అక్కడ నుంచి ఆ శబ్దం పుట్టటానికి లోపల ఎవరు మూలము అనేది ప్రహ్లాదుడు తెలుసు. దేనినుంచయినా సరే దైవాన్ని గ్రహించేటువంటి బుద్ధి మనకుందనుకోండి, మనకి లోపల ప్రతి నిత్యం అన్నీ పక్కలనుంచి దైవమే వినిపిస్తున్నాడని అనుకోండి... అంటే, రాజమండ్రి వాళ్ళు మాట్లాడినా, విశాఖపట్టణం వాళ్ళు మాట్లాడినా, బెజవాడ వాళ్ళు మాట్లాడినా, ఇంటావిడ మాట్లాడినా, నువ్వు

దైవాన్ని వినగలవా? సాధన, సాధన అని ఊరికే మనం వెర్రిలో పడిపోతుంటాం. మొన్నే మంగళగిరిలో నేను ఇది ఊరికే routine అయిపోతూ ఉంటుంది, జాగ్రత్త సుమా అని చాలా ఆక్రోశించాను, ఆవేదన తెలియపరిచాను. ఇది routine అయిపోతుంది. మనం ఈ routine లో తలతిరిగేట్టు, ఇలా గిరగిరా తిరుగుతున్నాం. అట్లా routine అయిపోయిందనుకో ఏం జరగలేదే అని చివరికి దుఃఖమొస్తుంది.

మనం ప్రతి నిత్యం ఎవరిని విన్నా, వాడిని వింటున్నామా? వాడు లేనిదే ఆ పక్కవాడు ఎట్లా మాట్లాడతాడండి? ఆ మాట్లాడేవాడిలో అంతర్యామి ఉన్నాడు కదా! వాడుండ బట్టి కదా వీడు మాట్లాడుతున్నాడు! వాడే వీడు కదా! పరమాత్మే, జీవాత్మ రూపంలో ఇంద్రియాలు ఆధారం చేసుకొని మాట్లాడుతూ ఉంటుంది. నువ్వు పరమాత్మవి. ఇలా చెప్పినప్పుడు "అబ్బా! ఎంత బాగుంది. నిజమే కదా!" అనిపిస్తుంది. కానీ, ఇప్పుడు ఇక్కడ నుంచి breakfast కి వెళ్ళిన తర్వాత చూడండి ఎలా ఉంటుందో? ఉండదు! అదే ఆశ్చర్యం. మరి ఎక్కడ చేస్తారు సాధన? అక్కడే చేయాలి. ఎవరు మాట్లాడుతున్నా, వాడే మాట్లాడుతున్నాడు అని తెలిసినప్పుడు మనకి చెప్పేవాడిని వినాలి అని ఒక ఆదరమైనటువంటి దృక్పథం ఉంటుంది. లేకపోతే, అసలు వినబుద్దే కాదు మనకి కదా! మనకంటూ కొన్ని ఇష్టాఇష్టాలు ఉంటాయి. కొంతమంది మాట్లాడితే వినబుద్ధి అవుతుంది, కొంతమంది మాట్లాడితే మొట్టబుద్ధి అవుతుంది కదా! ఎందుకని? పొరలు. లోపలి ఈ పొరలన్నీ చీల్చుకొని, అవతలి వాడు చెప్పేది సూటిగా నీకు వినపడాలంటే, నీవు చెప్పేవాడిలో ఉన్నటువంటి ఈశ్వరుడిని జ్ఞప్తి తెచ్చుకోవాలి. "ఉతత్వ శృన్వన్న శృనోతీయేనాం" — నేను ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉన్నాను. నువ్వే వినడం లేదు. "క్రుతత్వ దర్శన్ నరదర్శవాచన్" — చూస్తూనే నువ్వు నన్ను చూడవు రా! వింటూనే వినవు రా! వర్మ వచ్చాడు, నవనీతం వచ్చాడు అనుకుంటే కాదు కదా! అవన్నీ తొడుగులేకదండి.

జీవుడు ఒక తొడుగేగా దేవుడికి! అందరి జీవులు కూడా దేవుడికి తొడుగులండి. జీవుడికి తొడుగు వాడి గుణాలు, ఇహ వాడి మనసేంద్రియ శరీరాలు. జీవుడికి ఎనిమిది తొడుగులున్నాయి. ముందు మూడు గుణాలతో వాడికి రంగు ఒకటుంటుంది — రజస్సు, తమస్సు, సత్త్వము. అంటే ఏమిటి? ఒక నీలం రంగు, ఒక ఎరుపు రంగు, ఒక పసుపు రంగు. ఈ మూడు రకాల రంగుల హెచ్చు తగ్గుల్లో జీవుడికి ఒక రంగు ఉంటుంది. ఇంక వాడు దాని మీద ఐదు రకాల బట్టలేసుకుంటాడు — పంచభూతాత్మకమైనటువంటి శరీరం. ఈ జీవుడే అసలు తొడుగు దేవుడికి. దేవుడు పదో వాడు, జీవుడు తొమ్మిదో వాడు. వాడికి మూడు గుణాలు, ఐదు బట్టలు. మొత్తం పది. ఇట్లా ప్రతీ దాంట్లో ఆ పదో వాడిని చూస్తూ ఉండాలండి. లేదా, తొమ్మిది వింటూ ఉండచ్చు, తొమ్మిది చూస్తూ ఉండచ్చు. పది, తొమ్మిది వరకు ఫరవాలేదండి. ఇహ ఆ పైనంతా కూడా కొంచెం మనకి వికృతి చెందుతూ ఉంటుంది.

"గుణములు కర్ణేంద్రియంబులు సోఁక". కర్ణేంద్రియములు భగవంతుని యొక్క సర్వజ్ఞత్వము. దైవము సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వభోక్త, సర్వనియంత్రుడు, సర్వనియంత. ఇలాంటి గుణాలు ఉండేటువంటివాడు అందర్లోనూ ఉన్నాడని గుర్తించావు అనుకో, నీకు రోజు లేచిన దగ్గరనుంచి with whom are you interacting? నువ్వు ఎవడితో ప్రవర్తిస్తున్నావంటే, నాతోనే ప్రవర్తిస్తున్నావు అని చెప్తుంది భగవద్గీత. ఇది వేరుగా చూడక దీన్ని. అదే ఇదిగా ఉంది. నేనే వీరందరి రూపాల్లోను ఉన్నాను. నన్ను ఆ విధంగా చూస్తే నీకు నా విశ్వరూపం దర్శనమవుతుంది. అలా కాదు, నువ్వు కోరుకున్నదేదో చిన్నది పెట్టుకున్నావనుకో, అది నీకు దక్కీదక్కకుండా ఉంటుంది. అలా కనుక నువ్వు అందరిలో అతడిని చూస్తూ ఉంటే దేహతాపాలు పోతాయటండి.

"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు". ఏవిటి దేహతాపాలు? మాములుగా మనకి శరీరం రకరకాల తాపాలు కలిగించదు! ఇప్పుడు ఇట్లా కూర్చుని వింటుంటే ఏ తాపం ఉందని, హాయిగానే కూర్చుందిగా! కాసేపు కూర్చుంటుంది, ఆ తర్వాత ఇంక చాల్లే పద తిందాం అనిపిస్తుంది. ప్రస్తుతం దేహతాపం లేదు కదా! అధిభౌతికము. ఇప్పుడు ఏ భౌతికమైనటువంటి బాధ ఉంది? ఇలా పొద్దున్నే మనం వచ్చి కూర్చొని ఒక దివ్యమైనటువంటి విషయాన్ని చక్కగా మనం వివరించుకుంటూ ఉంటే మనకి ఏ బాధుంది? కళ్ళప్పగించి అట్లా వింటూ ఉంటాం కదా! దేహ తాపమేముంది? అధిభౌతికమనేటువంటి తాపం. ఇక్కడ నుంచి దిగాం అనుకోండి, కాలు నెప్పి, మోకాలు నెప్పి, ఇంకో నెప్పి, ఆ నెప్పి ఏవేవో గుర్తు చేస్తాయి కదా! "ఏవిటో రాత్రి సరిగ్గా నిద్రకూడా పట్టలేదు" ఇట్లా... ఇవన్నీ ఇప్పుడు లేవు కదా! ఇప్పుడు నేను గుర్తు చేస్తే గుర్తొస్తాయి, లేకపోతే గుర్తు రావు కదా! పొద్దున్నే తిట్టుకొని వచ్చినవాడు కూడా వింటున్నప్పుడు అవన్నీ మర్చిపోతాడు. "ఏం గోల! ఈ గురుపూజలంటే పొద్దున్నే ఇంకో అరగంటో, గంటో ముందు లేవాలి." ఇంట్లో రోజు ప్రార్థన చేసుకునేవాళ్ళకి కూడా గురుపూజల్లో కొంచెం key ఇస్తారు మాస్టరు గారు. Key frame good అని, మన frames బాగా తయారు చేయాలనే ఆయన ఇంకో గంట ముందు లేవరా గురుపూజలు అంటారు! నా బోటి వాడికి ఫరవాలేదనుకోండి, నేను ముందే లేస్తాను గురుపూజల్లో. మిగతావాళ్ళకు bathroom దొరుకుతుందో, దొరకదో – అదొక భయం. రకరకాల భయాలుంటాయి కదా! మరి అవన్నీ జరుగుతున్నప్పుడు, పొద్దున్నే ఏం గురుపూజలు అనిపిస్తుంది. ఇక్కడ వచ్చి కూర్చున్న తర్వాత అన్నీ మరచిపోతాం అండి. ప్రతిసారి మనకు విశాఖపట్టణంలో గురుపూజలు వస్తున్నాయంటే భయం. జరుగుతున్నప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది కదా! వస్తున్నాయంటే భయంగా ఉంటుంది. ఎంచేత? దేహతాపం అనేటువంటిది మనుషులకి. ఎక్కడ తింటామో? ఎక్కడ పడుకుంటామో? అది ఎట్లా ఉంటుందో? ఈ భయాలు కదా! అసలు ముందే

ఆలోచించుకుంటే చాలా మందికి గురుపూజలకి వెళ్ళ బుద్ధే కాదు. ఎవరొస్తారండి గురుపూజలకి? దేహతాపము దాటిన వాడే వస్తాడు, దేహతాపము నందు ఉన్న వాడు రాడు. ఈ దేహానికి ఏ సౌకర్యం లేదుగా! అధిభౌతిక తాపం ఉన్నదటండి. భగవత్ చింతన ఉన్న చోట అధిభౌతిక తాపం.

"నువ్వేమి ఎక్కుతావు కొండ ఊరికే" అని పక్కవాళ్ళు చివాట్లు పెడ్తుంటే, నెప్పున్నా సరే అట్లా గోవిందా అనుకుంటూ తిరుపతి కొండ ఎక్కిన వాళ్ళున్నారండి! నువ్వా ఎక్కేది? కాదే. ఇన్ని కొండలెక్కిన తర్వాత చాలా సార్లు ప్రయత్నం చేశాను వెంటనే కాసేపు నిద్రపోదామని, కానీ నిద్ర కూడా రాదు. ఇరవై ఒక్క సార్లు తిరుపతి కొండ ఎక్కాను. బయల్దేరేముందు మనకు చాలా program, దేహ భావం ఉంటుంది కదా! సాయంత్రం కొంచెం సన్నబడ్డాకా ఎక్కితే, రాత్రి ఏ తొమ్మిదింటికో వెళ్ళంగానే ఇహ శుభ్రంగా పడుకోవాలనుకుంటే, చచ్చినా నిద్రరాదు! ఎందుకని? అంత చైతన్యవంతమైపోతుంది శరీరం. ఎన్నడూ తిరుపతి కొండ ఎక్కిన తర్వాత నిద్ర అనే ప్రశక్తే ఉండదు. అంత తేలిక అయిపోతుంది శరీరం. ఎందుకంటే, తమస్సంతా కూడా దార్లో శుభ్రంగా కాల్చేస్తాడు ఏడుకొండలవాడు. ఏడుకొండలు ఎక్కాలేకాని అండి, అందులో ఉండే ఆనందం అంత ఇంత కాదు. ఎక్కలేను, ఎక్కలేను అనుకునేవాళ్లు ఏం చేయలేరు. దేవుడెక్కిస్తాడు అనుకునేవాడు, మాములుగా ఎక్కలేము అనుకునే వాళ్ళు ఎక్కేస్తూ ఉంటారు. ఎక్కగలము అనుకునేవాళ్ళు కొంచెం అలసట పొందుతూ ఉంటారు. నేను చాలా fit అనుకునేవాడికి చాలా అలసట వచ్చేస్తుంది. అందుకనే, ఎక్కకముందే, దేవుడు పాదాలు నెత్తి మీద పాదాలు పెడ్తాడు, "నువ్వు కాదు రా ఎక్కేది, దేవుడు పాదాలతో ఎక్కు" అని. నీవి కాదుగా ఇవి, మనవైతే బాగుండవు. ఆయనవైతే ఆయన చూసుకుంటాడు. ఈ పాదం నాది అని అనుకున్నామనుకోండి, అది ఏడిపిస్తూ ఉంటుంది నిన్ను. ఇది దేవుడు పాదం కదా అనుకుంటే ఏడిపించదు, ఆయన చూసుకుంటాడు.

నేను ఆయన సొత్తు, ఆయన సొత్తు ఆయన కాపాడు కోవాలి, నేను కాపాడుకునేది ఏమిటి అనేటువంటి వాడు భక్తుడు. మనదంతా మనం కాపాడుకుంటూ జాగ్రత్తగా పూజలు చేసుకునేవాడు మూర్ఖుడు. ఏం సందేహం లేదు ఇందులో! నిన్ను నువ్వు కాపాడుకునేదేంది! నీ బొంధ! ఏం కాపాడుకోలేవు! నీ శరీరాన్నే కాపుడుకోలేవు, ఇంక నీ వాళ్ళని, నీ ఆస్తిపాస్తులని నువ్వా కాపాడుకునేది? వాడివాడివైతే వాడు నిన్ను చక్కగా ఉంచుతాడండి, అంటే నిన్ను బాగా ఉంచుతాడు. అవన్నీ బాగుంటయా లేదా అన్న విషయంగురించి ఆయన ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడలేదు. ఎందుకంటే, నువ్వు నాకు ముఖ్యం. నిన్ను బాగా ఉంచుతాడు.

విష్ణుమూర్తిని దక్షుడు అడిగాడట, "ఎప్పుడైనా నాకు విపత్కర పరిస్థితి కలిగినప్పుడు నువ్వు నన్ను రక్షించి ఉద్ధరిస్తావా?" అని. "తప్పకుండ ఉద్ధరిస్తాను. నువ్వు నా భక్తుడివి" అని చెప్పాడు విష్ణువు. చిట్ట చివరికి

చెయ్యకూడని పనులన్నీ చేసి, రాకూడని వాడికి కోపం రప్పించాడు. ఆయనకి రానే రాదు కోపం, వస్తే ఇంక ఎవ్వరూ ఆపలేరు ఆయన్ని కదా! తీరా ఆయన సంహారానికి వచ్చేసరికి విష్ణుమూర్తిని ప్రార్థన చేస్తాడు, "నువ్వు నాకు మాటిచ్చావు, ఇప్పుడు నన్ను రక్షించు" అని. అంటే, అప్పుడు విష్ణుమూర్తి చెప్తాడు, "నేను నిన్ను ఉద్ధరిస్తానన్నాను తప్ప, నీ ప్రాణాన్ని కాదు" అని చెప్తాడు. "ఏషాం సముద్ధర్త" – "కావాలంటే నిన్ను మృత్యువు నుంచి కూడా ఉద్ధరిస్తాను. ఇప్పుడే వెళ్లి ఆయన కాళ్ళు పట్టుకో. ఏమి ఉండదు నీకు. ఆయన మహా చల్లనివాడు. అంత చల్లని వాడు లేడు. నేనంత చల్లని వాడిని కాను. ఆయన ఎంత చలువో అంత వేడి. మయస్కరుడు కదా! 'నమః శంకరాయ చ మయస్కరాయచ'. అడ్డమైన పనులన్నీ చేసి అలాంటి వానికి నువ్వు కోపం తెప్పించావు. నిన్ను రక్షించుకుంటాను, ఈ దేహం ఉండదు పో!" అని చెప్పాడు. ఎంచేత ఇది చెప్తున్నానంటే, రక్షించడం అంటే భగవంతుని అవగాహన వేరు, మన అవగాహన వేరు. మనం రక్షించడం అంటే మన శరీరాన్ని ఎప్పుడూ అట్లా చచ్చిపోకుండా చూడమని అడుగుతూ ఉంటాం రాక్షస్సుల్లాగా కదా! అదేగా మనమడిగేది! నాకు జ్వరం రాకూడదు, తలకాయ నెప్పిరాకూడదు, కడుపు నొప్పి రాకూడదు, ఏం రాకూడదు, నేను చచ్చిపోకూడదు. అందరి రాక్షసులు అదే కదండి ప్రార్థన! ఏ రాక్షసుడు ప్రార్థన చేసినా, నేను చచ్చిపోకూడదు అని చెప్తాడు. నువ్వు చావవు రా, శరీరం పోతుంది అని చెప్పాడు ఆయన చివరికి. అదే ఉపదేశం చెవులో చెప్పేది!

భగవత్ ధ్యానమ చేసుకునేవాడికి వాడి శరీరం ఎట్లా అన్నా ఉండనీయండి, వాడికి సంబంధం లేదు. అది ఆయనది, ఆయన చూసుకుంటాడు. ఉంచుతే ఉంచుతాడు, తేసేస్తే తీసేస్తాడు, ఇది లెక్క! తన దేహం అని ఉండదు, తన ఆస్తి అని ఉండదు, తన వారని ఉండదు. అందరూ వాడి వాళ్ళే, తనూ వాడే. నేను వాడికి సంబంధించి ఉంటే చాలు, ఒకటి. నాది అంటావా అంతా వాడు చూసుకుంటాడు. నన్ను, నాది వాడికే అప్పజెప్పేసాను అనటము కైంకర్యం. నేను, నాది మొత్తం వాడికి అప్పచెప్పేసానండి. అదీ భక్తి. నేనేదో కొన్ని సంరక్షించుకొని, కొంచెం నీ దగ్గర వస్తుంటాను అంటే, కొంచెం ఏంటి, అసలు రాకని చెప్తాడు. అందుకనే భగవంతుడు ఏమంటాడు? నీవి నాకు అక్కర్లేదు, నువ్వు కావాలంటాడు. నీది నాకక్కర లేదురా! నువ్వు నా వాడివి, నీవి శాశ్వతం కాదు, నువ్వు శాశ్వతుడివి. జీవుడు శాశ్వతుడండి. దైవ, జీవ సంబంధంలో దేవుడు కోరుకునేది జీవుడినే. అతడికి ఉండేవి ఇతను ఇచ్చినదేగా.

దేహతాపం. అధిభౌతిక తాపం అని ఒకటుంది, అది దైవికము. అది దైవికమంటే రకరకాల అనుభూతుల్లో అట్లా ఇరుక్కుపోయి, glamour లో పడిపోయి, కొట్టుకు చచ్చిపోతూ ఉంటారు చాలా మంది. దైవీపరమైనటువంటి విషయాల్లో దేవుని చేరక, అందులో పడి, రకరకాలుగా పట్టీలుకొద్దున్నవాళ్ళు ఏంతో మంది విజ్ఞులు ఉంటారు. ఏదో ఒక శాస్త్రం తెలిసింది. దాన్ని ఇక వాడు ఊరికే తెగవిర్రవీగిపోతూ ఉంటాడండి. అరవై

నాలుగు విద్యలున్నాయి. ఒక్క విద్య సగం తెలిస్తే, ఇహ వాడు అక్కడ నుంచి ఊరికే తైతక్కలాడుతుంటాడు. ఒక్క విద్య, అదీ పూర్తిగా తెలీదు! అది ఏ విద్య అయినా కావచ్చు. ఇట్లా చేతులు చూసేవాళ్ళు, జాతకాలు చూసేవాళ్ళు, ఇట్లా రకరకాల విద్యలున్నాయి కదా! ఒక్క విద్య చేత నీకు దాంట్లో పడిపోయి, అదే మైమరచిపోయి, అదే అంతా అనుకుంటూ ఎంత మంది పండితులు శ్రీకృష్ణున్ని, దర్శించలేకపోయారండి.

దైవమునకు దివ్యలోకం ఒకటి ఉంది, అధిదైవికము. ఇహ ఆ తాపంలో పడ్డాడనుకోండి, వాడు బయటకి రాడు. అది జిగురులో పడ్డట్టే! జిగురులో పడ్డ ఈగ ఎట్లా బయటకి రాలేదో, ఒక్క కాలుతో తీసుకుంటుంటే రెండో కాలు ఇరుక్కుపోతూ ఉంటుంది. అందుకనే, పాండిత్యమనేటువంటిది జిగురు ఒకటి ఉంటుంది. ఇప్పుడు ఈ పురాణాలు చెప్పుకోవటం ఒకటి ఉంటుంది కదా! బోల్డుమంది ఎన్నో పురాణాలు చెపూ్తఉంటారు. ఇలా చెపూ్త ఉంటే, తదనుగుణమైనటువంటి కీర్తి వస్తూ ఉంటుంది. ఇప్పుడు నా బోటి వాడికే మన బృందంలో ఒక మాదిరి గుర్తింపు ఎందుకొచ్చింది? ఇవి చెప్పుకోటం వల్ల కదా! నేను చాలా బాగా చెప్తాను, ఇంకా బాగా చెప్తాము, ఇలాంటి మోజులో పడిపోయాం అనుకోండి, దైవాన్ని, గురువుని మరిచి ఇంకా ఇలాంటి విషయాల్లో ఇరుక్కుపోయామనుకోండి... మనం వెళ్ళకపోతే ఎలా గురుపూజలకి అనే భావం వచ్చిందనుకోండి. ఎలా ఏవిటి? నువ్వు వెళ్ళకపోతే, బాగా జరుగుతుంది అని తెలియాలి. మనం అన్ని గురుపూజలకి వెళ్ళామా? ఒకటో, రెండో మానేసినవి ఉంటాయి కదా! అప్పుడు అక్కడ ఆగిపోయినాయా గురుపూజలు? ఆగిపోలేదు, బాగా జరిగినాయి అని రిపోర్టులు వస్తాయి. ఆ మధ్య అనంతపూరు నేను వెళ్ళలేదు. కొంత రైలు కారణం, కొంత నా దేహం కారణం. మనవాడు ఒకడు వెళ్ళాడక్కడికి. అనుకుంటాండేంటి దేవుడు? ఈ రైళ్ళు అనంతపూర్ వెళ్ళవు కాబట్టి వాడిని ముందే తిరుపతి తెపిచ్చుకున్నాడు. ఆ తిరుపతి నుంచి అనంతపూరికి రైలు ఆగిపోలేదు. మేము ఇక్కడ నుంచి వెళ్ళటానికి రైళ్ళు ఎనిమిది గంటలు late అన్నారు. అనంతపూర్ నుంచి నేను వస్తాను అని అక్కడికి వెళ్ళాడు. వెళ్తే, నేను అక్కడ లేను. నేను అక్కడ లేకపోయినా అనంతపురంలో గురుపూజలు నిర్వర్తించారు. మూడు వందలమంది వచ్చారట, అద్భుతంగా జరిగిందట. ఆ ప్రాంగణం దగ్గర నుంచి, మనుషుల దగ్గర నుంచి, చెప్పిన విషయాల దగ్గర నుంచి, అట్లా చెవిలో హోరు పెట్టేసాడు వచ్చి! ఎవడో కాదు, మన రవిశంకరే! అందుకని అందరూ నవ్వుతున్నారు. దాంట్లో మనం ఏం సందేశం తీసుకోవాలి? తస్సదియ్య! మనం లేకపోయినా చాలా బాగా జరిగింది కదా! మనం అనంతపురం అంతకముందు చాలా సార్లు వెళ్ళామే, అంత బాగా జరగలేదే! ఇప్పుడు మనం అనంతపురం వెళ్ళనప్పుడు ఇంత బాగా జరిగిందేంటి? అంటే ఏమిటి అర్థం? మనమా కాదు కదా! అలా అప్పుడప్పుడు జోక్స్ వేస్తుంటాడు దేవుడు.

అందుకని, ఒక్కటి గుర్తుపెట్టుకోండి – సాధనలో వచ్చిన వారందరికీ ఓ పెద్ద అపాయం ఉన్నది. నిన్నటివరకు సి. వి. వి. తెలియలేదనుకోండి, గొడవ లేదండి. Normal Temperment ఉంటుంది. ఈ సి. వి. వి. తెలియడం, యోగం తెలియటం, లేకపోతే గురువుగారు తెలియడం, లేకపోతే ఒక పురాణం వింటూ ఉండడం చేస్తే కొత్త వికారం ఒకటొస్తుంది లోపల. ఏవిటా వికారం అంటే, ఇలా విననివాడు ఒకడు ఉంటాడు కదా! మనం వాడి యందు చూపిస్తూ ఉంటాం కదా! ప్రార్థన చేసినవాడు, ప్రార్థన చేయని వాడి యందు చూపించే చూపు ఉంటుందే, అంతకముందు అలా చూడవు కదా నువ్వు! అంతకముందు నువ్వు వాడి లాంటి వాడివే కదా! వాడు చేయలేదు, నువ్వు చేయలేదు – మీ ఇద్దరు ఫ్రెండ్స్. ఇప్పుడు నువ్వు ఒక పూట లేచావు. వాడు మాములుగానే ఎప్పుడు లేచినట్టుగానే లేచాడు వాడు. వాడు నీ పక్కకు వస్తే, నువ్వు వాడిని ఇంకో మాదిరిగా చూస్తావు. “ఏంట్రా! ఇట్లా చూస్తున్నావు?” అంటే, “ఏంట్రా! పొద్దున్నే లేవకుండా!” అంటుంటాడు వీడు ఒక్కరోజు లేచి! ఇదెందుకు వచ్చింది కొత్తగా నీలో? నువ్వు ఒక దైవీపరమైనటువంటి ఒక విషయంలో ప్రవేశించటం చేత నీలో ఇన్ని వికారాలు వచ్చేస్తుంటే, ఇప్పుడు మనలో ఎంతమంది మామూలుగా... నేను చూస్తూ ఉంటాను, బయట local లో ఉండే మనుషుల కన్నా మన వాళ్ళు తక్కువ సహజంగా ఉంటారు, వాళ్ళు ఎక్కువ సహజంగా ఉంటారు. ఎందుకంటే ఇవి అటు, ఇటు కాని కేసు ఇది! ఒక అసహజమైనటువంటి ఒక వాక్కు. వీడు మాట్లాడుతుంటే “గురువు గారు!” అంటుంటాడు. ప్రతి దానికి ఏదో ఒక రకంగా, అదొక రకమైన భాష ఉంటుంది. మీరు గుర్తించండి, మనవాళ్ళు మనతో మాట్లాడుతుంటే తెలుగు భాష అదొక తెలుగు! ఆ తెలుగు ఒక రకమైన తెగులుగా ఉంటుంది అది! ఇట్లా మాట్లాడే విధానంలోనే ఒక తెగులు ఉంటుంది. అదెలా వచ్చింది? ఇది దైవం అని తెలియటం వలన నీలో సహజత్వం పోవటం అనేటువంటిది. ఇది కొత్తగా పరిచయం అవ్వటం వల్ల, ఈ దివ్య లోకాల్లో, ఈ విజ్ఞాన లోకాల్లో, బుద్ధి లోకాల్లో ఒక బంధం ఉంది. అదొక తాపం, ఒక తాపం. “అదేంటండి! నన్ను అడక్కపోయారా ఒక్కసారి?” అంటాడు. ఎవరికన్నా జరక్కూడదంది ఏదన్నా జరిగిందనుకోండి, “ఒక్కసారి నన్ను అడక్కపోయారా? నేను జాతకం చూసి చెప్పేవాడిని కదా!” అంటాడు. ముందు అడిగితే చెప్పేవాడు కాదు. వాడికేం తెలుసు నిన్ను అడగాలని! “నన్ను అడిగితే మంచి మందిచ్చే వాడినిగా!” అంటే నిన్ను ఎందుకు అడగాలి? అడిగితే, నువ్వు మందిచ్చి, నోరుమూసుకుంటే better. వాడు మందు అడగలేదని, జాతకం నా దగ్గర చూపించుకోలేదని, నా సలహా లేకుండా పెళ్లి చేసుకున్నాడని, ఇట్లా రావండి? గురువు అనుకునేసరికి ఇవన్నీ వస్తాయి. ఇది వరకు లేవుగదరా నీకు? ఇవన్నీ ఎప్పుడు తెలిసినాయి? వాడెవడో వాడికి పిల్లాడు పుడితే, వాడు పేరు పెట్టుకుంటే నీకు కోపమొస్తుంది, “అదేంటి నాకు చెప్పకుండా” అని. మీరంతా నాకొక అలవాటు చేస్తున్నారు –పిల్లలు పుడితే నన్ను పేరు పెట్టమంటున్నారు. ఎవడో ఒకడు అట్లా నన్ను అడగలేదనుకోండి, “వీడి సంగతి మనం చూడాలి కొంచెం!” ఇలాంటివన్ని వస్తుంటాయి మనుషులకి.

ఈ అధిదైవికమైనటువంటి తాపముందే, ఇది చాలా భయంకరమైన తాపం. అది భౌతికం కన్నా వంద రెట్లు ఎక్కువుంటుంది. అటుపైన ఆధ్యాత్మిక తాపం. ఆత్మతత్త్వం తెలిసేంతవరకు మనిషి కుంటుందండి తాపం. మరి ఇలాంటి తాపాలన్నీ పోవాలంటే కృష్ణ కథలు. వాళ్ళేమీ పిచ్చివాళ్లై వేల సంవత్సరాలు పాటు నైమిశారణ్యంలో చెప్పించుకోవటంలేదు, గుర్తుపెట్టుకోండి. అన్ని తాపాలు పోతాయి నీవు ఆయన యొక్క సాన్నిధ్యంలో. నీ ఎరుకతో సంబంధం లేకుండా అందులో నిలబడి పోతావు.

అలాంటి ఒక్క వాక్యమండి అది. ఇప్పుడు మనం చెప్పుకున్నది ఒక్క వాక్యం, ఒక లైను. పద్యంలో సీస పద్యం. మరి భాగవతం చెప్పుకుంటున్నాం అంటే అలా చెప్పుకుంటే కథ అయిపోవాలని చెప్పుకోకూడదు కదా! అవుతుంది, కథ చిన్నదే! కథ చెప్పేయమంటే మూడు నిముషాల్లో చెప్పేస్తాను. ఈ సారికే మనకి రుక్మిణీకల్యాణం అయిపోతుంది. కాని, ఇలా చెప్పుకుంటే మనకి పనికొచ్చే పద్ధతుల్లో మనకి జరగాలి కదా!

"నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థంబు కలుగుచుండు". ఎంతటి శుభమైనటువంటి ఆకారం అండి భగవంతుని యొక్క ఆకారం! కృష్ణుడు కన్నా శుభమైనటువంటి ఆకారం ఉన్నదా! మొత్తం ప్రపంచంలో అన్ని దేశాల్లో ఉండే అన్ని రకాల విధానాలు చూసివచ్చిన వాడిని నేను. నేను వెళ్ళని చోటు లేదు. America ఖండంలో ఆ పైనుంచి ఈ కింద వరకు కూడా చూసాను, ఐరోపా ఖండం చూసాను. ఎక్కడ ఎన్ని రకాల ఆరాధనలో ఉన్నా, అక్కడ వాళ్ళు పెట్టుకున్నటువంటి దేవతా మూర్తులు, ప్రతిమలు వాటి గుణవిశేషములు వాటిని మీరు కృష్ణునితో పోల్చి చూడండి. అసలు శుభమైనటువంటి ఆకారం అంటే శ్రీకృష్ణుడే. సాక్షాత్తు దివ్యమూర్తి అది. కురులు ఎట్లా ఉండాలి? నుదురు ఎట్లా ఉండాలి? కనుబొమ్మలు ఎలా ఉండాలి? కన్నులు ఎలా ఉండాలి? ముక్కు ఎలా వుండాలి? చెంపలు ఎలా ఉండాలి? చెవులు ఎలా ఉండాలి? అట్లా, శిరస్సు నుంచి పాదముల వరకు అన్ని భాగములకు, వాటి యొక్క కొలతలకు ఒక శాస్త్రం ఉంది. ఆ శాస్త్రాన్ని మించి ఉంటాడండి శ్రీకృష్ణుడు. ఇలా చూడంగానే ఇంక ఏమి అక్కర్లేదండి అలాంటి రూపం. "నే నీ శుభాకార మీక్షింప" పెట్టుకుంటాం కదా! అందమైనటువంటి కృష్ణ విగ్రహాలు పెట్టుకుంటాము కదా! కన్నులు మూసుకుంటే కనబడాలండి లోపల. బయట పెట్టుకుంటే విగ్రహమే! ఏదో బంగారు కాంతి coating గే అనుకోండి ఫర్వాలేదు. అలా నవ్వుతూ, అట్లా తలకాయ పెట్టి చూస్తుంటాడు కదా! నాకు తెలుసు లేరా నీ సంగతి అన్నట్టు చూస్తూ ఉంటాడు కదా! అయినప్పటికీ ఫర్వాలేదు, నా సంగతి నీకు తెలీక, ఇంకెవడికి తెలుస్తుంది. అలాంటి చూపు ఓర చూపు కదా, చిరునవ్వు కదా, త్రిభంగి రూపం కదా! ఎప్పుడు త్రిభంగి అని అట్లా వంకరగా వెళ్తాడని అనుకోబోకండి. అసలు ఆకారాన్ని స్మరణ చేస్తేనే నీ మనసు హరింపబడుతుంది అలాంటి ఆకారం.

శోభనమైనటువంటి ఆకారం. శుభాకారమంటే అంగాగములన్నీ ఇంక అంత కన్నా అందంగా ఉండటానికి వీల్లేదండి.

అలాంటి ఆకారాన్ని చూస్తూ ఉంటే అట “అఖిలార్థంబులు కలుగుచుండు”. అఖిలార్థంబులంటే నాలుగు పురుషార్థములు – ధర్మార్థ, కామ, మోక్షములంటారు. అందరికీ అర్థము కావాలి కదా! అందరికీ సంపద కావాలిగా! అర్థకామములు ధర్మంతో కూడినవైతే నీకు సంతోషాన్ని ఇస్తాయి, ఆనందాన్నిస్తాయి. ధర్మంతో కూడకపోతే దుఃఖాన్నిస్తాయి. ఇల్లు కట్టుకొని యాతన పడేవాళ్ళుంటారు, ఇల్లు కట్టుకొని సుఖపడే వాళ్ళుంటారు. పెళ్లి చేసుకొని యాతన పడేవాళ్ళుంటారు, పెళ్లి చేసుకొని సుఖపడే వాళ్ళుంటారు. సంతానాన్ని కని యాతన పడే వాళ్ళుంటారు, సంతానాన్ని కని సుఖపడే వాళ్ళుంటారు. ధనం సంపాదించి ఆనందపడే వాళ్ళుంటారు, దుఃఖపడే వాళ్ళుంటారు కదా! అర్థ కామములు నీకు ఆనందాన్ని ఇస్తున్నాయా, ఇవ్వట్లేదా? “ఇంట్లో అన్నీ ఉన్నాయి. అల్లుడు నోట్లో శని” అని ఒక సామెత ఉంది కదా! అంటే వాడేం తినలేడు, సరిగ్గా భోజనమే చేయలేడు. అప్పుడు ఎంత ఉంటే ఏం లాభం! అర్థకామములు ఎప్పుడూ ధర్మంతో కూడి ఉన్నప్పుడు నీకు కలిగే స్థితి మోక్ష స్థితి – నిన్ను బంధించనటువంటి స్థితి. “చాలా ఇబ్బందిగా ఉందండి శరీరంలో” అంటే, “పోని, తీసేయమంటారా” అని అడిగితే ఎట్లా ఉంటుంది చెప్పండి! దేహం ఉన్నా, దేహం లేనట్లుగా ఉంటారండి. అది మోక్ష స్థితి ఉంది. ఏది ఉన్నా దాని యందు లేక, తన యందు తాను ఉండేటువంటివాడు మోక్ష జీవి. ఇప్పుడు ఒక కోటి రూపాయలు బ్యాంక్లో ఉన్నాయనుకోండి. అది మాటిమాటికీ గుర్తొస్తుందా? అది ఉంది, లేదు, అయినా వాడికేం తేడా లేదు. నీ దగ్గర లేదుగా, అక్కడెక్కడో ఉంది! అంటే feeling గే తప్ప ఏముందండి అందులో! పోని, బ్యాంకు వాడు ఉంచుకున్నాడా అక్కడ అంటే వాడెవడికో అప్పు ఇచ్చేస్తాడుగా! నువ్విలా బ్యాంకుకి ఇవ్వంగానే వాడెవడో అప్పు కొచ్చి తీసుకుపోతాడుగా!

ఎవరికి మోక్ష స్థితి అంటే, ఉన్నచోట తన యందు తాను ఉండి, ఇతరముల యందు భావన లేనివాడు. అంటే, ఏ భావము తనను బంధించనివాడు మోక్ష జీవి. తన యందు తాను ఉండి, తాను పొద్దున్నే లేచి ఒక్కడే కూర్చున్నాడనుకోండి... కొంచెం పూర్తిగా తెలివి వచ్చిన తర్వాత ఒక గంట సేపు అలా కూర్చుంటే, నీకు ఏ ఏ భావాలు పొమ్మన్నా పోకుండా నీలో ఉన్నాయో, అవన్నీ నిన్ను బంధిస్తున్నటువంటి విషయాలు. ముందు శరీరం, ఆరోగ్యం దాని గురించి వచ్చేస్తుంది. తర్వాత కుటుంబం, వారి పరిస్థితులు ఇవన్నీ గుర్తొచ్చేస్తాయి. ఆ తర్వాత మనకున్నటువంటి ఆస్తిపాస్థులు ఇవన్నీ గుర్తొచ్చేస్తాయి. ఆ తర్వాత మనల్ని ఇబ్బంది పెట్టే వాళ్ళందరు గుర్తుకువచ్చేస్తారు. ఇవన్నీ మనల్ని బంధిస్తున్నట్టు. ఇది ఎవరికి ఉండదో తెలుసా? ధర్మానన్నుసరిస్తూ, తదనుగుణమైనటువంటి అర్థమును పొందుతూ... నిన్న చెప్పుకున్నాం కదా “యదృచ్ఛా లాభ సంతుష్టో” అని.

దైవ మార్గంలో ఏం జరుగుతుందో తెలుసా? నీవు దైవాన్ని ఆరాధన చేసుకుంటూ వెళ్తుంటే, నీ సమస్త కోరికలు దైవమే తీరుస్తాడు. నీకు ఉండవలసినంత సంపద ఏర్పాటు చేస్తాడు. మాస్టర్ సి. వి. వి. వాగ్దానం అది. ఆయన ఏం చెప్పారంటే, నన్ను నమ్ముకున్నవాడికి అన్నవస్త్రాదులకు లోటుండదు. ఇంక మిగతాదెందుకు? Extra ఉంటే బీర్వాలు నింపుకోవటం, బ్యాంకులు నింపుకోవటమే కదా! తిప్పలు పట్టమే కదా!

నీ దారిన నువ్వు పనిచేసుకుంటూ నీదైన పని నువ్వు చేసుకుంటూ వెళ్తుంటే “కృషితో నాస్తి దుర్భిక్షం” – నీకు రావాలసినదంతా వచ్చేస్తూ ఉంటుంది. ఇలా ఈ ధర్మంలో పాతిక, ముప్పై ఏళ్ళు ఉన్నటువంటివాళ్ళు ఇవాళ్ళ ఏం చేసుకోవాలో తెలియనంతగా సంపదలో పడి ఉన్నారండి. “ఇదంతా ఏం చేయాలి కన్నయ్యా!” అంటూ. ఏం చేస్తావు దానిని – దానం చేసుకో, ధర్మం చేసుకో. అది మార్గం. నీవు ఎంత గురువులో ఉంటే అంత ఆయన ఇవన్నీ ఏర్పాటు చేసి, “పోని, అటు పోరా!” అని చూపిస్తూ ఉంటాడు! దారి మళ్ళించేటువంటి మార్గాలు ఉంటాయి దేవుడికి. వీడు ఎక్కువ nusense, మాటిమాటికీ మన వెంట పడ్తున్నాడంటే, ఏం చేస్తాడంటే, దాని సంగతి చూడు అంటూ వెళ్ళిపోతాడు. అంటే సంపద, పదవి వస్తాయి దారిలో. అంతే కాదు, అంగబలం, అర్థబలం, పదవీబలం. ఈ మూడు బలాలు చేర్తూ ఉంటాయి అండి దైవం దారిలో మనం వెళ్తూ ఉంటే. దాన్ని నువ్వు సద్వినియోగం చేయలేదో, ఇందులో  ఇరుక్కుపోతావు. పది మంది మన మాట వింటారట అంటే వాళ్ళకి చాలా ఎక్కువ బాధ్యత. వినకపోతే గొడవ లేదు. మనం చెప్పినమాట ఎవ్వడు వినట్లేదనుకోండి మనం సుఖంగా ఉంటాం మనం తెలుసా! మన మాట వింటూ ఉంటే ప్రతి సారి “మాస్టర్ గారు, అది ఏం చేయమంటారు? ఇదేం చేయమంటారు? ఎలా చేయమంటారు?” అంటే, మనం ఒకటి చెప్పాలి. దాని ప్రకారం వాడు చేస్తాడు. దాని బాధ్యత మనది. అడిగేవాడు తెలివి తక్కువ వాడు కాదు, చెప్పేవాడు తెలివి తక్కువ వాడు! చాలా తమాషాగా ఉంటాయి ఇవన్నీ. “ఏరా! అంత తెలివి తక్కువగా ప్రతిది ఆయన్నే అడుగుతావు?” అంటే వాడు నవ్వుతాడు. వాడికి తెలుసు ఎందుకంటే, మా ఊళ్ళో ఉన్నాడొక ఆయన. మాటిమాటికకీ దండాలు పెడుతూ, ప్రతి చిన్న విషయం అడుగుతాడు. అడిగాడు అంటే, మనకి మెలిక వేసాడనే అర్థం అంతే! సలహా చెప్పడం అంత సులభం కాదండి. దానికి బాధ్యత ఉంటుంది. వాడు “నువ్వు చెప్పావు కదా!” అంటాడు. అంగబలం బాధ్యత, అర్థబలం బాధ్యత, పదవీబలం బాధ్యత.

పదవిలో నిన్ను కూర్చోబెడితే ఎలా ఉండాలి నువ్వు అక్కడ? శునకం వలే ఉంటావా? కనకపు సింహాసమున కదా! చక్కని గురువుగారి సింహాసనం ఇది. ఇందులో కూర్చోపెట్టినవాడు ఎట్లా ఉండాలి అండి? సద్గురువు అంటే బంగారమేమిటండి, వజ్రం, ఇక అంతకన్నా పై విషయం. మరి అందులో కూర్చోబెట్టి, నిన్ను అవి ఇవి అడిగారనుకోండి! ఊరికే కూర్చోబెడ్తారేంటి! కూర్చున్నావు కదా, “నాకది చెప్పు, నాకది చేసిపెట్టు, నాకు

ఈ సలహా ఇవ్వు. మా ఊరు ఎప్పుడొస్తావు? మా ఇంటికి ఎప్పుడొస్తావు?" ఇవన్నీ అడగరా! ఇలా జరుగుతుంటే నీకు thermometer లో పాదరసం ఎక్కినట్టు ఎక్కుతుందనుకో నీకు మోక్షస్థితి ఉండదు. ఎందుకంటే, ఇట్లా మాస్టరు గారు చెప్పినట్టుగా "తుండు దులిపేసి, అలా వెళ్ళిపోయేట్టుగా ఉండాలి" – అది మోక్షం. ఇలా దులిపేసి, అలా వెళ్లిపోవాలండి. అది ఎప్పుడుంటుంది? నువ్వు ఎవ్వరితోను ఇక్కడ మెలికలు వేయించుకోపోతే, నువ్వు ఎవ్వరికీ మెలికలు వెయ్యకపోతే అప్పుడు ఉంటుంది. అవతలి వాడు నీ మీద ఎన్ని మెలికలు వేసినా, నువ్వంటూ మెలికలు వెయ్యకపోతే, అప్పుడు నీ మీద మెలికలు పడవండి. అది రహస్యం. నీ యందు ఇతరులను మెలికలు వేసే భావాలు ఉంటే, అవి తిరిగి వచ్చి, నీకే యమపాశాల్లా పడతాయి. అసలు నీ దగ్గర అలాంటిదేమి లేనప్పుడు ఎదుట వాడు ఎన్ని నీ మీద వేసినా, అవి నీ మీద పడవు – వాడూ జీవన్ముక్తుడంటే. మరి అలాంటి పరిస్థితి మనకి వస్తే బాగుంటుంది కదా! ఎందుకని? దైవాన్ని నువ్వు చూస్తూ ఉండటం చేత నీకవన్నీ ఏర్పడి, అన్నీ నీకు తృప్తినిస్తాయి.

అదే చెప్తోంది అమ్మ అక్కడ, "నే నీ శుభాకార మీక్షింపఁ". అందరిలోనూ ఉన్నాడు కదండి. ఎంత సేపని కృష్ణుని బొమ్మ దగ్గర కూర్చుని ప్రార్థన చేస్తావు? విశ్వమంతా అతడే – అదీ శుభాకారం. ఈ కనపడుతున్నదంతా అతని యొక్క రూపమే. ఎన్నిసార్లు చదివామండి విష్ణు సహస్రనామం! మొట్టమొదటి శ్లోకంలోనే మనం మొహం అలా నేలకెళ్ళి కొట్టుకుంటుంది, ఎందుకని? "విశ్వం విష్ణుః" కదా! భాగవతంలో చెప్పేది అనన్య భక్తి. కృష్ణుడంటే ఏ కృష్ణుడండి? ఇక్కడే ఒక బొమ్మ్మంటుంది, అక్కడొక బొమ్మ్మంటుంది, అక్కడ ఎత్తుకపోతున్నాడు రుక్మిణీదేవిని, ఇక్కడేవో బొమ్మలుంటాయి. అక్కడ పాండురంగడు ఎలా ఉన్నాడో చూడండి? ఐదు పూటలు భోజనం చేసేట్టుగా ఉన్నాడు! ఏ అలా ఉండకూడదా? ఇప్పుడు గణపతి ఉన్నాడు, అది విష్ణువు ఆకారం కాదా? "సర్వాకారం విష్ణుమావాహయామి" అంటాం. అన్నీ ఆకారాలు విష్ణువే కదా! కనపడుతున్నటువంటి విశ్వమును నీవు విష్ణువుగా భావన చేసుకున్నావనుకో.... అంటే, నీతో పని ఉండేవాడు నీ దగ్గర కొస్తాడు. నీ చేత పని చేయించుకునేవాడు నీ దగ్గరికి వస్తాడు. నీ కన్నా పెద్దవాడు కనిపిస్తాడు. నీ కన్నా చిన్నవాడు కనిపిస్తాడు. నీ యందు ఇష్టం లేని వాడు కనిపిస్తాడు. నీ యందు ఇష్టమున్న వాడు కనిపిస్తాడు. నిన్ను దూషించే వాడు కనిపిస్తాడు. నిన్ను ప్రేమించే వాడు కనిపిస్తాడు. వీళ్ళందరిలోనూ నువ్వు "ఏకో నారాయణో హరి" అని అలా చూడగలవా?

అలా విశ్వరూపాన్ని భగవంతునిగా ఆరాధన చేసేటువంటి వాళ్ళకి సకలార్థములు. పరీక్షిత్ అట్లా చూసాడండి. పరీక్షిత్తు కథే అది. దాంతోనే మొదలవుతుంది భాగవతం. కాటేసే పాము వచ్చినా, దాంట్లో కూడా చూసాడు. గురువుగారిలో చూశాడు, శాపం పెట్టిన కుర్రాడిలో చూశాడు, కలిలో చూశాడు, అందరిలోనూ

చూశాడు. పరీక్షిత్తు అలాంటివాడు. ఈ కనపడుతున్న దాంట్లో ఈ జామ చెట్టు, కొబ్బరి చెట్టు రూపంలో... మనకి పేరు తెలియని చెట్లు చాలా ఉన్నాయి ఇక్కడ. పేరెందుకు, రూపముందిగా! అదీ ఇదే, ఇది అదే. ఇటువంటి భావన బాగా స్థిరపడాలండి. ఇవన్నీ లేకుండా యోగం అవ్వదు. ఊరికే యోగం, యోగం అని కళ్ళుమూసుకుంటే అవ్వదు. దానికి సంబంధించిన వికాసము, జ్ఞానము కలగాలి. ఇందాక ఏం విన్నా అదిగా వినమని చెప్పుకున్నాము కదా! ఏం విన్నా అదిగానే వినపడితే తాపాలు పోతాయి. ఏం చూసినా కూడా అదిగానే కనపడాలండి. ఏం చూసినా అదిగానే చూస్తే సకలార్థాలు నెరవేరతాయి.

"నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు" – ఈ భూమి మీద, ఈ భువనంలో ఉన్నతోన్నతమైనటువంటి పదవి ఎవరు పొందుతారో తెలుసా? విష్ణు పాద సేవ చేసిన వాళ్ళు. విష్ణు పాద సేవ అంటే జీవుల సేవే. ఎంచేతంటే "పాదోస్య విశ్వాభూతాని" అని, ఈ విశ్వం అంతా కూడా భగవంతుని యొక్క పాదం నుంచి పుట్టుకొచ్చాయి. అందుకే "నీ పాద కమలసేవయు" అంటే కూడా అర్థమదే. కమలము లాగా విచ్చుకున్నటువంటిది ఈ సృష్టి. ఈ సృష్టికి ఎవరెవరు ఎంతెంత సేవ చేస్తే, అంతంత ప్రజ్ఞా పరంగా ఉన్నతమైనటువంటి స్థితిలో ఉంటారు. సేవ అంటే నీకు లాభానికి కాక ఇతరులవారికి వినియోగంగా ఉండేది, ఎదుట వారి హితమును కోరేటువంటిది, శ్రేయస్సు కలిగించేటువంటిది. ఇతరులకు హితంగా బతకటం అనేటువంటిది ఒక దీక్ష. అలాంటి దీక్ష ఉన్నటువంటివాళ్ళు భగవత్ సామ్రాజ్యంలో ప్రజ్ఞా పరంగా ఉత్తమోత్తమైనటువంటి స్థితిలోకి వెళ్తారు. అలా వెళ్లినటువంటి వాళ్ళే బ్రహ్మర్షులు, అలా వెళ్ళిన వాళ్ళే మహర్షులు. ఈ మహాత్ములందరు మొత్తం భూగోళానికే సేవ చేసి పెట్టారు. భూగోళానికే సేవ చేయటాన్ని planetary service అంటారు. అంతే కాదు, సూర్యమండలము మొత్తానికే సేవ చేసేటువంటి వాళ్ళు ఉన్నారు. అంటే, సవితృ మండలానికే సహకరించేటువంటి ప్రజ్ఞలు ఉన్నాయి. దీనికి మార్గం ఏమిటంటే, నాకెదురుగా ఉన్నటువంటివాళ్ళు భగవంతుడే అని భావన చేసి, అతని యెడల నువ్వు చూపించవలసినటువంటి ప్రేమ, ఆదరణ అందింపవలసినటువంటి సహకారము.

ఇవన్నీ ఇలా చెప్పుకుంటుంటే అర్థవంతంగా ఉంటాయి. అలా కాకపోతే మనకి అర్థవంతంగా ఉండవు. ఇవన్నీ మనం వింటున్నవే కదా! లక్ష్మీదేవి ఆయన పాదములు వద్దకు చేరి, సతతము పాదసేవ చేస్తూ ఉంటుంది కదా! మనకెలా ఇచ్చారు ఫోటో? ఎప్పుడు విష్ణుమూర్తి యొక్క పాద సేవ చేసుకుంటున్నట్టుగా ఉంటుంది అర్థాంగి. అర్థాంగి కాబట్టి నేను సగం ఉంటాననలేదు ఆవిడ. 50% నాది కదా అనదు లక్ష్మీదేవి! ఆవిడ 100% అయిపోయింది. ఇవన్నీ రహస్యాలు. శివుడు సగం శరీరం ఇచ్చేసాడు కదా! విష్ణువు మొత్తం ఇచ్చేసాడు. ఎంచేత? ఆమె చేసేటువంటిది పాదసేవ. అంచేత, ఆమె విష్ణుదేవుని శరీరంలో ఉండగలిగినటువంటిది. అంటే, ఇంక అంత

కన్నా సన్నిహితులు ఎవరున్నారండి? అందుకనే ఇక్కడ ఏమని వస్తోంది? "భువనోతత్త్వంబుఁ బొందఁ గలుగు" – భువనము, అంటే మొత్తం సృష్టి. ఈ ఊళ్ళో గొప్పవాడిని, ఈ రాష్ట్రంలో గొప్పవాడిని, ఈ దేశంలో గొప్పవాడిని, మొత్తం భూగోళానికి గొప్పవాడిని, మొత్తం సృష్టికే గొప్పవాడిని. దేనివల్ల? పాదసేవ వలన. అంచేత, లక్ష్మీదేవి మనకి విష్ణుపాద సేవ చేసుకో, నేను విష్ణు పాద సేవ చేస్తూ ఉండటం చేత విష్ణువు చెంతన ఉన్నాను అని సందేశమిస్తూ ఉంటుంది.

రుక్మిణీదేవి ఆ అంశతో పుట్టినటువంటిది కాబట్టి ఈ విధంగా చెప్పగలిగింది. నీ పాద సేవ వలన భువనములకే ఉన్నతత్త్వము, వాటన్నిటినీ అధిష్టించి ఉండగలిగేటువంటి స్థితికి నువ్వే కొనివస్తావు. మనవరకు ఏమిటో తెలుసా? ఇంతకముందు చెప్పినవి రెండు, ఇప్పుడు ఇది మూడోది. ఒకటి వినికిడి, రెండు చూపు, మూడు జీవుల సేవ. ఇవి నిర్వర్తిస్తూ ఉంటే క్రమంగా ప్రార్థనలో ప్రజ్ఞ మూలాధారం నుంచి సహస్రారానికి వెళ్ళిపోతుంది. క్రమక్రమంగా నీవెంత నిర్వహిస్తుంటే పరోపకార పరహితము, అంత నీ ప్రజ్ఞ ఊర్ధ్వముఖం చెందుతుంది. ఊర్ధ్వముఖం చెందిన కొద్దీ చిల్లర విషయాలయందు మనసు ఉండదు, అన్నీ చక్కగా నిర్వర్తింపబడతాయి.

"నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు" –భగవన్నామ సంకీర్తనలో అలాంటిది ఉంది. చక్కగా హృదయంతో దైవాన్ని పిలవగలిగితే నీకుండేటువంటి సమస్త బంధములు పోతాయి. బంధములంటే అవేవో బయట ఉన్నాయి అనుకోబాకండి, నీ లోపలే ఉన్నాయి – భావబంధం, ప్రాణబంధం, దేహబంధం. నీకీ బంధాలన్నీ ఒక్క నామస్మరణతో పోతాయి. "కలవు నా సేవ నాసేవగతిరన్యథా హరేర్నామ హరేర్నామ హరేర్నామ హేవ కేవలం". నిత్య నామ స్మరణ చేత లోపల భగవంతుని దర్శనం చేసుకుంటూ ఉంటే నీ దేహంలో భావములు కాని, ఇతరుములైనటువంటి కోరికలు కాని, నీ శరీరం కాని, నిన్ను బంధించనటువంటి ఒక స్థితి ఏర్పడుతుంది. అలా చేసుకుంటూ ఉంటుంది రుక్మిణీదేవి.

"నట్టి నీయందు నాచిత్తమనవరతము నచ్చి యున్నది". అనవరతము అనేటువంటిది ముఖ్యమైన పదం అక్కడ. ఎప్పుడు ఏం చేస్తున్నా, దినచర్య అంతా కానిస్తున్నా, నా చిత్తం మాత్రం నీతోనే అంటి పెట్టుకుంది. అంటే ఒక కన్యకి అలాంటి భావన ఒక పురుషుడి మీద కలిగితే... అలా ఉందని మాములుగా ఒక కన్య, కుల స్త్రీ చెప్పదు. నేను నిన్ను ప్రేమిస్తున్నానని చెప్పదు. మన సినిమాలు అందరూ బాగా చూస్తున్నారు కదా! I love you చెప్పవా అని వీడు వెంటపడుతూ ఉంటాడు కదా! ఆ మూడు ముక్కలు చెప్పవా అని వెంట పడుతూ ఉంటాడు కుర్రాడు, చెప్పదు కదా! చెప్పకుండా తిప్పించుకుంటూ ఉంటుంది. ఆ ఇంకా తిరగని, ఇంకా వాడికి test, ఎంత మాత్రం

వీడు మనకి లొంగుతాడో అని చూస్తూ ఉంటుంది ప్రకృతి కదా! వీడు I love you చెప్పవా అని అడుగుతూ ఉంటాడు. ఇక్కడ ఆమె రుక్మిణీదేవి చెప్తోంది, నేను సిగ్గువిడిచి, నా మానం, నా అభిమానం వదిలి I love you అని చెప్తున్నాను. అంటే, తన అభిమానం వదిలేసి తాను ఉత్తమోత్తమైనటువంటి ప్రజ్ఞ కలిగినటువంటి కన్య నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్తుంది. మాములుగా అటునుంచి ఇటు ఉంటుంది, ఇటు నుంచి అటు ఉండదు. స్త్రీ చాలా గంభీరమైనటువంటి ప్రజ్ఞ. అంచేత, పురుషుడు నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్తే నవ్వుతుంది తప్ప సమాధానం చెప్పదు. ఉత్తమోత్తమైనటువంటి సంస్కారం కలిగినటువంటి రుక్మిణీదేవి అంటోంది "నీ యాన" – నేను నిన్ను ప్రేమిస్తున్నాను, అలా చెప్పటానికి నేను ఆనలేదు, సిగ్గుపడట్లేదు అని చెప్తోంది. ఇది చాలా పెద్ద విషయం.

> "నట్టి నీయందు నాచిత్త మనవరతము
> నచ్చి యున్నది నీయాన నాన లేదు
> కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
> శ్రీయుతాకార! మానినీచిత్తచోర!"

అని పద్యం ముగిసింది. ఇక్కడ నుంచి మొదలు పెట్టుకొని సాయంత్రం చెప్పుకుందాం.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 10, 2013 సాయంకాలము – ప్రవచనము #6

"అహం బ్రహ్మ నిరాతుర్యాం" – నేను బ్రహ్మను, బ్రహ్మమును నిరాకరించకుందును గాక, "మాం మాం బ్రహ్మ నిరాతుర్యాం" – నేను బ్రహ్మమును నిరాకరించకుందును గాక, "అనిరాకరణమస్తు" అని నిత్య ప్రార్థన భక్తునికి గాని, యోగికి గాని, జ్ఞానికి గాని జరగవలసినటువంటిది. యోగం అంటే బ్రహ్మముతో కూడి ఉండడమే, బ్రహ్మమై ఉండడము. బ్రహ్మముతో కూడి ఉంటే, క్రమంగా బ్రహ్మము అవడం అనేటువంటిది జరుగుతుంది. బ్రహ్మముతో కూడి ఉండాలంటే తాను, తన తెలివి, తన చిత్తము, తన మనస్సు, ఇంద్రియ వ్యాపారములతో కలిసి మొత్తం తానూ, తన పరివారం అన్నమాట, పరివార సమేతంగా బ్రహ్మము దగ్గరగా చేరాలి. నిజానికి బ్రహ్మము ఆధారంగానే ఇవన్నీ ఏర్పడి ఉన్నాయి. బ్రహ్మము ఆధారంగా ఏర్పడినటువంటి, చైతన్యం ఏర్పాటు చేసినటువంటి, వివిధమైనటువంటి అంశములుగా మనము, మన దేహమందలి ప్రజ్ఞలు కనిపిస్తూ ఉంటాయి. ఇవన్నీ ఎవరి ఆధారంగా ఉన్నాయో, వారిని మరవకుండా ఉండటం అనేటువంటిది అభ్యాసం చేయాలి.

ఇలా బ్రహ్మమును నిరాకరించకుందునుగాక అనంగానే, అలా కృష్ణమూర్తి గారు వచ్చి ఒకసారి మైక్ అడిగారనుకోండి, ఇంత బ్రహ్మము మనకు మాయమైపోయాడు అప్పుడు! ఎంచేతంటే, కృష్ణబ్రహ్మము అనుకోవాలి. కానీ మామూలుగా అనుకోలేము కదా! ఇది ఎక్కడో ఉంటుంది, మనకి తెలియని విషయం అని అనుకుంటాం తప్ప, మన చుట్టుప్రక్కలే మనతో practical jokes వేస్తూ, మన మధ్యే, మన లోపలా, మన చుట్టుప్రక్కలా ఉంటుందని మనమనుకోము. అలా బ్రహ్మము దగ్గర చేరినటువంటి వాళ్ళు పరమగురువులు. ఎక్కడో బ్రహ్మము ఉన్నాడు అనుకుని, అదేదో ఆకాశం పైన అక్కడెక్కడో ఉందని అనుకోటం కాదు. ఇక్కడే, మన చుట్టు పక్కలే, మన వాళ్ళల్లో, మనవారు అనుకునేవారిలోను, మనవారు కాదనుకునేవారిలోను, అందరి రూపాల్లోనూ బ్రహ్మము ఉన్నాడు.

అన్నిటి యందు బ్రహ్మమును చూడడం అనేటువంటిది రుక్మిణీదేవి చేస్తోంది. ఆ బ్రహ్మమునకు పేరే కృష్ణుడు ఇక్కడ కదా! ఈ సీస పద్యం పొద్దున మనకి చాలా సేపు ఆపేసింది కదా! అందరికి కొంత నిరుత్సాహం కలిగింది, ఇలా అయితే రుక్మిణీకల్యాణం ఎప్పుడవుతుందని. మీకే కాదు, నాకూ నిరుత్సాహం కలిగింది – ఏవిటో చాలా పద్యాలు కిందటి సారీ చదువుకున్నాను, అవేవి చెప్పడానికి వీలుపడలేదు. ఈ సారి మళ్ళీ చెప్దాం అని

అనుకుంటే, ఒక్కొక్క ప్రవచనానికి ఒక్క పద్యం అయితే ఎలా అనే భావన నాకు మాత్రం రాదా! వస్తుంది. అయినప్పటికీ, రుక్మిణీదేవి కన్నా కృష్ణుని గూర్చి చెప్పగలిగినటువంటి వారు ఉన్నారని మనమనుకోకూడదు. ఎంచేతంటే, ఆయనయే ఆమెగా భాసించేటువంటి తత్త్వం అది. ఆమె సౌందర్యరాశి, ఆమె సౌందర్యం అంతా ఆయనదే! ఆయన సౌందర్యమే ఆయనకి అంకితం చేస్తోంది, కైంకర్యం చేస్తోంది. తనయందు ఉండేటువంటి సమస్తము దైవమునదే అని ఎరిగినటువంటి మహా భక్తురాలు రుక్మిణీదేవి. భాగవతంలో రుక్మిణీదేవి భక్తి మాత్రమే మనకు చెప్తారు. ఇతర భార్యాభర్తలు భాగవతంలో ప్రవచింపబడవు, వివరింపబడవు, ప్రకటింపబడవు. భాగవతంలో ఎన్నుకొన్నబడినటువంటి భాగవోతత్తములందరూ కూడా బ్రహ్మమును తెలిసి, సర్వకాల సర్వావస్థల యందు మరువక, గుర్తింపు ఉంచుకొని, ఆ బ్రహ్మమునే అన్నిటి యందు, అన్నీ సందర్భముల యందు, అన్నీ వస్తువుల యందు, అన్నీ జీవుల యందు అదే పనిగా చూస్తుండేటువంటి వాళ్ళ కథలే భాగవతంలో ఉంటాయి. అలాంటి కథలు నాయకుడు శ్రీకృష్ణుడు. మనం చెప్తున్నటువంటి విషయాలు, మనం సరిగ్గా చెప్పుకోకపోతే "ఏవిరా! అలా చెప్పావు?" అనేస్తే బాగుండదు కదా! అంచేత, మనకి భక్తి ప్రధానం. భక్తితో కృష్ణ సాన్నిధ్యంలో మనం ఆయన గూర్చి వివరించుకుంటూ ఉన్నప్పుడు మనకు జరిగేటువంటిది యోగం, చేసేది యోగం కాదు. యోగం చేసే వాళ్ళంతా అహంకారలు. భగవంతుని యొక్క స్మరణలో ఒక మధురానుభూతిలో, ఒక రసానుభూతిలో మనం ఇమిడిపోయి ఉన్నప్పుడు యోగం జరిగి ఉంటుంది అప్పటికే! అంటే, ఏది జరగవలనో అది ఉపాయం చెప్తుంది భాగవతం.

"పలికెడిది భాగవత మట
పలికించు విభుండు రామభద్రుం డఁట నేఁ
బలికిన భవహర మగు నఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?"

మనకి ఈ జన్మ ఫలించాలంటే, మన మనసు, మన అహంకారం ఈ రెండు వాటి పుట్టుకస్థానంలో కరిగిపోవాలి. అలా కరిగిపోవాలంటే భక్తి ప్రధానం. ఋషులు, మహర్షులు, బ్రహ్మర్షులు, దేవతలు చిట్టచివరికి ఎవరికి ఒకటే పెట్టుకున్నారు – భక్తి ప్రధానం. మిగతా వాటిలో అహంకారం ఉండే అవకాశం ఉంటుంది. భక్తిలో అహంకారం ఉండదు. ఎందుకంటే, భక్తిలో తాను లేనటువంటి ఒక స్థితి కలుగుతుంది. తాను లేక దైవం నిండి ఉండటమే పరిపూర్ణ యోగం. అంటే, బ్రహ్మమే తానై ఉండటం కదా! అందుకని తానుగా ప్రయత్నం చేస్తున్నప్పుడు, ప్రయత్నం చేసేవాడు ఎక్కువగా ఉంటూ ఉంటాడు. ప్రయత్నం చేసేవాడు ప్రయత్నంలోకి కరిగిపోవటం అనేటువంటిది సమాధి. ఒక్కొక్కసారి సాధన ఎంత counter productive అవుతుందో

చూడండి. ఎంతచేస్తూ ఉంటే, అంత దూరంగా ఉంటాడు దైవానికి. ఎంత దైవం దగ్గరైపోతే, తాను అందులోకి ఇమిడిపోతే, అంత తన నుంచే సమస్తం జరుగుతూ ఉంటుంది. భక్తులకు సమస్తం జరుగుతుంది, సాధకులు చేస్తూ ఉంటారు. తపస్సు చేసే వాళ్ళకి కూడా నేను దక్కను అని చెప్తాడు శ్రీకృష్ణుడు. ఎందుకంటే, వాడికి తపస్సు చేస్తున్నాను అనే ఒక భావన ఉంది కదా! "తపస్విభ్యో జ్ఞానేభ్యో అధికో" అన్నాడు. ఎవరైతే నా స్మరణలో తన్ను తాను చూస్తాడో, నన్నేకాని అన్యమెరుంగని వారిని నేను చూసుకుంటాను. ఆ విధంగా మనం కరగడానికి స్వయంగా భగవంతుడే అనుగ్రహించి భాగవతాన్ని మనకి ఇచ్చాడు. అలాంటి భాగవతంలో భగవత్ భక్తులు చేసేటువంటి ప్రశంస ఉందే, అది ఉత్తమోత్తమైనటువంటి ప్రశంస అయి ఉన్నది. ఈ పద్యం మన్ని ఇలా పొద్దున్న నుంచీ సాధిస్తోంది కదా!

"ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక
　　దేహతాపంబులు తీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల
　　కఖిలార్థంబు కలుగుచుండు
నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో
　　న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ
　　దడవిన బంధసంతతులు వాయు."

ఎంత మధురంగా ఉంటుందంటే భగవన్ నామం, లోపల స్మరణ నాలుకతో కాక మనసుతో జరుగుతూ ఉంటే... స్మరణ నాలుకతో చేయకూడదు. స్మరణ దేనికి? మనస్సుకి, నాలుకకి కాదు. లోపల "రామ రామ రామ" అని నాలుకతో తలుచుకుంటూ అనుకుంటున్నారనుకో! ఎవరీ రాముడు? అందరి యందు ఉండేటువంటి ఆత్మారాముడే కదా! అన్నిటి యందు ఉండే వాడే కదా! అలా దర్శనం చేస్తూ లోపల, నీ గుండె చప్పుడు రామ శబ్దం చేసుకుంటూ ఉందనుకోండి, వాడు రామ భక్తుడు. ప్రపంచానికి తెలీకుండా ఎప్పుడూ రాముడిని చూస్తూ ఉంటాడు, ప్రపంచాన్ని చూడడు. ఇలా కృష్ణ భక్తుడు ఉంటాడు, అలాగే అమ్మ భక్తుడు ఉంటాడు, అలాగే విష్ణు భక్తుడు ఉంటాడు. నివురుగప్పిన నిప్పు అంటారు కదా! భక్తి కలిగినటువంటివాడు అది పట్టుకుంటే కాల్తుంది, చూడటానికి బూడిద ముక్కల్లే కనిపిస్తుంది. అట్లా చేత్తో తీసుకుంటే కాల్తుంది కదా! అట్లా భక్తుడు బయటికి అతడు దర్శనం చేస్తున్నది, వింటున్నది, అందరికీ దైవమే అని భావన చేసి, వారికి తాను చూపుంచేటువంటి ప్రవర్తనము, ఇలాంటి వాటిల్లో ఉండటం చేత... ఏ ప్రొద్దంటే ప్రతి రోజు అని అర్థం. ప్రతి రోజు నామ స్మరణ

భక్తితో "దడవిన బంధుసంతతులు వాయు" లోపల నిత్యము స్మరణ జరుగుతూ ఉంటే, నీకుండేటువంటి గ్రంధులన్నీ విడిపోతాయండి. బంధములు లోపల ఉన్నాయి, బయట లేవు. బయట ఏది నిన్ను బంధించచ్చో, నీ లోపలవాటి యందు నీకు గల అనుబంధమే నీకు ప్రతిబంధము అని చెప్తూ ఉంటుంది.

నీకు లోపల ఇంద్రియములు బంధించవు, మనసు బంధించదు. నీకు ఉన్నటువంటి జ్ఞానం నిన్ను బంధించదు. భావం బంధించదు, భాష బంధించదు, దేహం బంధించదు, బాహ్యం బంధించదు. ఏవీ బంధించదు. ఎప్పుడు? నిత్యము స్మరణ ఉంటే – అంటే గుర్తుతెచ్చుకోటమే కదా! తెలిసినివారి యందు, తెలియనివారి యందు మనం చూపే చూపులో ఈ స్మరణ – ఒకడే ఉన్నాడు నీ లోపల, బయట కూడా. అలాంటి స్మరణ ఎవరైతే చేస్తారో, వారు కనులు మూసుకుంటే లోపల ఒక శ్రీకరమైనటువంటి ఆకారం చాలా సులభంగా గోచరిస్తుంది. ఆ విధంగా, "ఏ ప్రొద్దు" – ప్రతి రోజు భక్తితో – "నీ లసన్నామం" – లసన్నామమంటే చాలా రుచికరమైనటువంటి నామం.

"బంధసంతతులు వాయు. నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది" – చిత్తము మామూలుగా ఇంద్రియముల యందు పడిపోతూ ఉంటుంది బాహ్యంలో కదా! యోగమంతా కూడా చిత్తం బయటకి పోకుండా, లోపల ఉండేటువంటి దివ్యత్వానికి దర్శనం చేయటానికే ఈయబడినటువంటి సూత్రములు. అమ్మవారికి చిత్తము, అయ్యవారి యందు అసలు విడదీయటానికే వీల్లేనట్టుగా అతుక్కుపోయి ఉంటుంది. అలా అత్తుకుపోయి ఉండటం చేత, ఇంక మరి నేను, నువ్వు లేకుండా నేను ఉండలేను అనే పరిస్థితి ఉంది నాకు. ఈ మాటలు చెప్పడానికి నేను సిగ్గుపడటం లేదు అని చెప్పింది. "నట్టి నీయందు నాచిత్త మనవరతము నచ్చి యున్నది నీ యాన నాన లేదు" – నేను సిగ్గువిడిచి చెప్తున్నాను, నాకు నువ్వంటే అంత ఇష్టం. నేను నిన్ను స్మరించకుండా, నిన్ను పిలవకుండా అస్సలు ఉండలేనటువంటి ఒక పరిస్థితి నాకు ఉన్నది అని చెప్తుంది.

"కరుణఁ జూడుము కంసారి!" – నిన్న చెప్పాను కంసారి అంటే. ఎందుకంటే, నాలో కాస్తో కూస్తో అహంకారం అనేటువంటి పుల్ల అడ్డు ఉండటం చేత, నేను నిన్ను అందుకోలేను. నా అహంకారమే నేను దైవాన్ని చేరటానికి ప్రతిబంధకంగా ఉంది. ప్రతివారికీ అంతే. వారి వారి అహంకారముల కారణముగా… అది కూడా మూడు రకాలుగా ఉంటాయి అని చెప్పాను నిన్న – సాత్త్విక, రాజసిక, తామసిక అహంకారాలు. ఈ మూడు అహంకారములు మనల్ని దైవాన్ని చేరనీకుండా జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటాయి. ఇవి ఎవరివి? నీవే! నిజానికి వాటిలోంచే నువ్వు పుట్టావు. గుణముల్లోంచి పుట్టినటువంటి వాడు జీవుడు. అందుకని, ఈ మూడిటిని దాటడం కష్టం అని చెప్తుంటారు. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణుడు, "నువ్వు దాటలేవు. అవి నా ప్రకృతి యొక్క

గుణములు" అని చెప్తాడు. నా ప్రకృతి యొక్క గుణములు నా మాట వింటాయా? నీ మాట వింటాయా? తన మాటే వింటాయి. అంచేత, నువ్వు అహంకారంతో కుస్తీ పడి లాభం లేదు. అది తెలుసు రుక్మిణీదేవికి. అందుకని ఏం చేసిందంటే, అహంకార స్వరూపాన్ని ఏ విధంగా నిర్జించి జీవులను దగ్గరగా చేసుకుంటారో, అలాగే నా యందు కూడా నువ్వు కరుణ చూపించమని చెప్పింది.

కేవలం భగవంతుని కరుణ వలన భగవంతునిచే అందుకొనపడతాము తప్ప మన అర్హత వలన కాదు. అక్కడికి వెళ్ళిన తర్వాత అర్హతలు ఏమీ లేవు. ఏంటి నీ అర్హత అంటే, ఏ అర్హత లేదు, ఆయన అందుకుంటే లోపలికెళ్తాను, ఆయన అందుకోకపోతే ఇక్కడే పడి ఆయన గురించే తపస్సు చేస్తాను, ఇక్కడే ఆయన గురించే స్మరణ చేస్తూ దేహం వదిలేస్తాను అని చెప్తాడు భక్తుడు. అర్హతలు ఏమీలేవు, నాకే అర్హతలు ఉన్నాయని నేను అనుకోవటం లేదు, కేవలం ఆయన యందు నేను మక్కువ కొని ఉన్నాను. ఎంచేత? నీకు నీ అర్హతలు గుర్తు ఉంటే, నువ్వు అహంకారంలో ఉన్నట్లు. అప్పుడప్పుడు అడుగుతూ ఉంటారు, "ఏరా! నువ్వు ఏం చేసావని నీకు దర్శనం ఇవ్వాలి?" అంటే, "నేను ఇది చేశాను కదా! నేను అది చేశాను కదా! నేను గుడి కట్టిచ్చాను కదా! నేను ఆశ్రమాలు పెట్టాను కదా! అమ్మవారికి ఇవి చేయించాను కదా! అయ్యవారికి ఇవి చేయించాను కదా!" అంటే రాలేదు రాముడు. అట్లా రాడు. నువ్వు చేయించేదేంటి? నువ్వు చేయించకపోతే నాకు తక్కువయ్యిందా? రామదాసు ఆభరణాలు చెయ్యకపోతే అమ్మవారికి ఆభరణాలు ఉన్నాయిగా! రాముడు లోకానికే చక్రవర్తి. ఆయనకి ఆభరణాలు కొదవా? ఆయన గుడి కట్టమన్నాడా? నువ్వు కట్టిన గుడిలో ఉంటే ఆయనకి ఇరుగ్గా ఉంటుంది. విశ్వమే ఆయన గుడి. నీ గుడిలో నన్ను కూర్చోబెట్టి, నాకేదో చేశారంటావేంటి? "నేను చేశాను, నేను చేశాను" అంటే కనపడడు. ఎంచేత? అహంకారం వలన. ఎంతో చేసి, ఏమీ చేయనట్లుగా ఉంటాడు నిరంహంకారి. నా బొంధ! నేను ఏం చేశాను కనుక, ఇంకా ఆరాధన చెయ్యాలని అనుకుంటూ వుంటాడు. అడుగుతారట తలుపుల దగ్గర ఇద్దరు నిలబడి, అడ్డంగా బెట్టి "తమరు ఏం చేశారాని లోపలకి పంపించాలని? ఏ recommendation letter ఉంది మీ దగ్గర ఉంది?" అని. ఏమి లేదు నా దగ్గర, ఆయన కరుణిస్తే లోపలికి వచ్చేవాడినే తప్ప నాకుగా తగుదునమ్మా అని నా certificate లంటూ ఏమిలేవు నా దగ్గర. అంటే ఏమిటి? తన గురించినటువంటి భావనే లేనివాడిని, అలాంటి వాడిని వాళ్లిద్దరు లోపలికి పంపించేస్తారు.

భగవంతుడు కరుణ చూపితే భగవంతుని చేరుకోగలిగిన వాళ్ళమే తప్ప, భగవంతుని ఎట్టి పరిస్థితుల్లో నేను చేరుకుంటాను అనేటువంటి పరిస్థితిలేదు. అలా చేరుకున్నా, దేవుడితో ఉండలేవు. ఎన్నిసార్లు తలకాయ తీసి అప్పచెప్పలేదు రావణుడు శివుడికి! మాటిమాటికీ కనపడినప్పుడల్లా black mail చేసినప్పుడు, తలకాయ తీసి అక్కడ పెట్టేసేవాడు రావణాసురుడు తెలుసా! ఒకసారి మనకి సినిమాలో చూపిస్తారు. కానీ రావణుడికి తలకాయ

తీసి అక్కడ పెట్టడం మనం మాములుగా జేబులో pen తీసి అక్కడ పెట్టినట్టుగా పెట్టేస్తాడు! ఎందుకంటే, అంత విశ్వాసం ఉంది దేవుడి మీద, వాడే చూసుకుంటాడు అని. ఇలా తలకాయ తీసి పెట్టేస్తుంటే, ఆ తలకాయ పాడుకుంటూ వెళ్ళిపోతూ ఉంటుంది శివలింగం దగ్గరికి. మరి ఏం చేస్తాడు? అంత black mail చేస్తే, వచ్చేస్తాడు. కానీ ఉంటాడా? సతతము శివసాన్నిధ్యంలో ఉంటే అహంకారం ఉండదు. నా అంత శివభక్తుడు లేడు అనుకునేవాడు, శివభక్తుడు కాలేడు కదా! ఎవరు నిజమైన శివభక్తుడు? అక్కడే ఉండి, ఎవ్వరూ చూడకపోయినా, అక్కడే అంటి పెట్టుకొని, శివుని దగ్గరికి వచ్చే వాళ్ళందరినీ చూసే ఆయన ఒకాయన ఉన్నాడు – నందీశ్వరుడు కదా! గణపతికి పూజ చేస్తాం, పువ్వు పెడతాం. కుమారస్వామికి పూజ చేస్తాం, పువ్వు పెడ్తాం. అమ్మవారికి పూజ చేస్తాం, పువ్వు పెడ్తాం. అక్కడే ఉండే నందికి పువ్వు పెడ్తమా? పెట్టము. ముందు నుంచి శివుడ్ని చూసేది నందీశ్వరుడే. సతీదేవి, పార్వతీదేవీలు అంతా తర్వాత వచ్చారు. అంచేత, నందీశ్వరుడికి ఏ మాత్రం అశ్రద్ధ చేసినా, శివుడు వాళ్ళని అంగీకరించనే అంగీకరించడు. నందీశ్వరుడికి అవమానం జరిగితే తనకి అవమానం జరిగినంతగా భావిస్తాడు. ఎందుకిది చెప్తున్నానంటే, మనకి అహంకారం ఉన్నప్పుడు నందీశ్వరుడు కనపడడు. అహంకారం ఉన్నప్పుడు శత్రుఘ్నుడు కనపడడు. ఇట్లా ఉంటాయి!

ఈమె తెలిసినటువంటి వ్యక్తి కాబట్టి ఈ జీవ అహంకారాన్ని దాటించి, జీవునిగా నన్ను నువ్వు అందుకో అని చెప్పి చెప్పింది. అందుకని “కంసుడు” పదం అక్కడ వేశారు. “ఖలవిదారి! శ్రీయుతాకార! మానినీచిత్తచోర!” శ్రీయుతమైనటువంటి ఆకారం అంటే, కనపడితే శ్రీయే ఆయన, కాకపోతే బ్రహ్మము. ఆకారం అంటూ దైవం నాకు దర్శనం ఇవ్వాలంటే శ్రీయుతమై ఉండాలి. అంటే, అమ్మవారే దర్శనం ఇచ్చేది. అయ్యవారు దర్శనం ఇవ్వటానికి చోటల్లే ఉంటుందది. ఈ చోటును అనుభూతి చెందవచ్చు తప్ప, కనిపించడానికి ఏమి ఉండదు. ఆయనకి తనదైన ఆకారం ఏమీ లేదు. శ్రీతో కూడి ఉన్నప్పుడు “శ్రీయుతము”. బ్రహ్మమునకు ఆకారం లేదు. అలాంటి ఆకారం లేనివాడు, ఆకారం కోసం తనలోంచి ఒక చైతన్యాన్ని ఉద్దరింపచేసి, దాని ద్వారా తను కనిపిస్తూ ఉంటాడు. కేన ఉపనిషత్తులో ఈ విషయాన్ని మనకి చెప్తూ ఉంటారు – బ్రహ్మము నిరాకారుడు, దర్శనం ఇస్తే అది శ్రీమూర్తియే. అందుకని, అతని ఆకారము శ్రీయుతమైనటువంటి ఆకారము. “శ్రీయుతాకార” అంటే శ్రీతో కూడి ఉన్నటువంటిది. అంటే, రూప, గుణ, లక్షణములతో కూడి ఉన్నటువంటి ఒక శాల్తి అది. “మానినీచిత్తచోర!” అనేది తర్వాత చెప్పుకుందాము. ఇప్పుడు ప్రస్తుతం ప్రార్థనలోకి వెళ్దాం.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 10, 2013 సాయంకాలము – ప్రవచనము #7

మానినీచిత్తచోర అనేటువంటిది కృష్ణ నామములలో అత్యద్భుతమైనటువంటి నామం. "శ్రీమానినీమానచోర" అనేటువంటి దండకం కూడా ప్రథమ అధ్యాయంలో వస్తుంది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వారి యొక్క శ్రీయుతమైనటువంటి ఆకారములు ఎలాంటి వారినైనా సరే, వారిని వారు మరచిపోయే అంతగా ఆకర్షణతో ఉంటాయి. ఇలాంటి ఆకర్షణతో కూడినటువంటి, అందమైనటువంటి, శుభప్రదమైనటువంటి అనుభవం ధ్యానం చేయడమనేటువంటి విధానం కేవలం మన సాంప్రదాయంలోనే ఉంది. భారతీయమైనటువంటి సాంప్రదాయంలో ఈ అతిసుందరమైనటువంటి రూపమును ధ్యానం చేసేటువంటి విధానం మహర్షులు ఎక్కువగా ప్రశంసిస్తూ ఉంటారు. ఎక్కడైతే సుందరమైనటువంటి రూపము, వర్ణము, శబ్దము ఉంటాయో అక్కడ మనసు హరింపబడుతుంది. చిత్తము హరింపబడటం అనేటువంటిది జరగాలి. మానిని యొక్క మానములు కూడా అపహరిస్తారు రామకృష్ణులు.

శ్రీరాముడిని చూసినటువంటివారు, పురుషుల సైతం, మోహబడి, తమను తాము మరిచినటువంటి స్థితికి వస్తారు. స్త్రీల సంగతి చెప్పనే అక్కర్లేదు. "వీని పొందని జన్మంబు విగతఫలమని" – మిథిలలో రాముడు, లక్ష్మణ సమేతుడై, విశ్వామిత్రుడు ముందు నడుస్తుండగా, వెనక వారు తల వంచుకొని నడిచి వెళ్తూ ఉంటే, చుట్టు పక్కల మేడల్లో ఉండే స్త్రీ జనులు చూసి, "ఉంటే ఇలాంటి వాడు ఉండాలి మనకి భర్తగా, ఇంక ఎందుకు వేధవ జన్మ" అనకుంటారు. మనకి చాలా మంచి పద్యాలున్నాయి. ఈ పద్యం రామ చరిత్ర నవమ స్కంధంలో ఉంది – ఇతడు మనకి భర్తగా లేకపోతే మన జన్మ విగత ఫలం. అంటే, సరైనటువంటి గతిలేని ఫలం లాగా అయిపోతుంది.

మానవ జన్మ భగవత్ కైంకర్యము ద్వారా భగవంతుని చేరుకోటానికి నిర్దేశింపబడింది అని గుర్తించినటువంటి జాతి ఒకప్పుడు భరత జాతి, ఇప్పటి భరత జాతి కాదు. ఇప్పుడు భారతీయులు కేవలం డబ్బు సంపాదించుకోవడం కోసమే జీవిస్తున్నారు. ఇది వరకు భారతీయులు దైవమును చేరటమనేటువంటిది ప్రధానమైనటువంటి ఆశయంగా, ధర్మార్థకామములు నిర్వర్తించుకుంటూ ఉండేవారు. వాళ్ళందరికి దైవము చేరని జన్మ విగత ఫలం. అంటే, మంచి నూజివీడు మామిడిపండు... నూజివీడు మామిడిపండు మీ అందరికి విజయవాడ వాళ్ళకి తెలుసు. అవి చాలా పెద్దవిగా ఉంటాయి, చాలా రసోపేతంగా ఉంటాయి, రసం కుడా చాలా ఉంటుంది. అంత పండు మామిడి పండు ఇంకోటి ఉండదు. ఒక ఆయన అలాంటి చాలా శ్రేష్టమైన రెండు పండ్లు

తీసుకుని, ఆ పండ్లు ఎవరికిస్తే తనకి పనవుతుందో ఆయన చేతిలో పెట్టాడనుకోండి. ఏదో ఆయన మెప్పు పొందటానికి, పనిచేయించుకోడానికి అధికార్లకి, ధనవంతులకి, గురువులకి ఇట్లా పండ్లు అర్పిస్తుంటారు. ఇచ్చే పండు ఏదేదో రోడ్డు మీద దొరికిందల్లా ఇవ్వటం ఒక పద్ధతి. శ్రేష్ఠమైనటువంటి ఫలములు అర్పించడం ఒకటి. అలా ఆయన అర్పిస్తే, ఆ పుచ్చుకున్నాయన రెండు పండ్లని జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్ళాడుట. ఆ రెండు పండ్లు ఇంటికి తీసుకెళ్తే, ఇంటావిడ మూడు రోజుల్లో అమ్మాయి, అల్లుడు వస్తున్నారు, అంతవరకు దీన్ని refregirator లో పెట్టేద్దాం అంటుంది. ఎంచేత? ప్రేమ చేత. మరొక కారణం ఏంటంటే వాళ్ళిద్దరికి sugar ఉంటుంది! అందుకని వాళ్ళు పండు మొత్తం తినలేరు, కొంత తినాలని ఆశ ఉంటుంది. ఈ మూడు రోజులు refrigerator లో పెట్టారు. వచ్చిన రెండు, మూడు రోజులు అమ్మాయి వచ్చింది, అల్లుడు వచ్చాడనేటువంటి సంబరంలో పండు గురించి గుర్తుండదు. ఆ తర్వాత ఆ పండ్లు తిందామని తీసేసరికి అది కుళ్ళిపోతుంది కదా! అది విగతఫలం అన్నమాట. అంటే, ఎంత పండు అంతలాగా నూజివీడులో పెరిగి, ఎంత అద్భుతంగానో మానవుడి చేతిలో అనుభవింప పడవలసినటువంటి ఒక ఫలము, దాని గతి ఎలా వెళ్ళింది చూడండి! అది విగతి, దుర్గతి.

అలా మానవ జీవితాల్ని కూడా భగవత్ ప్రాప్తి లేనప్పుడు అవన్నీ కూడా దుర్గతి చెందినట్టుగా భావించారు మనవారు. అంటే, ఎవరు భగవంతుడ్ని ఈ మానవ శరీరం ఆధారంగా చేసుకోగలిగాడో వాడి జీవితమే ఫలించినట్టు. అలా ఫలించాలంటే మనకి ప్రధానంగా అడ్డు వచ్చేది మన మనస్సే. ముందు అడ్డోచ్చేది మనస్సు, తర్వాత అడ్డోచ్చేది అహంకారం. అహంకార, మమకారములు రెండు బాగా అడ్డు వస్తాయి. ఈ మనసు ఎత్తుకుపోయేవాడు ఎవడో ఉంటే బాగుంటుంది కదా! అహంకారం నిర్జించేవాడు, మనసును ఎత్తుకుపోయేవాడు కావాలండి. మనస్సునంత కాలం మనిషి దుఃఖ పడుతూ ఉంటాడు. అందుకనే, మనకి కృష్ణ కథలో అహంకారానికి కంసుడునుని, మమకారానికి కేశిని చెప్తూ ఉంటారు. పురాణపురుషుడు చదువుకోండి. అహంకారానికి కంసుడు, మమకారానికి కేశి ఇద్దరూ concessions కొట్టేసేవాళ్ళే! అంటే, ధర్మ వ్యతిరిక్తమైనటువంటి పనులు చేసుకుంటూ, తమను తాము నశింపచేసుకుంటూ ఉంటారు. ఎవరు ధర్మానికి వ్యతిరేకంగా జీవిస్తుంటారో, వాళ్ళందరు తెలియకే తమను తాము హత్య చేసుకుంటున్నట్టు అని చెప్తుంది భాగవతం. ఆత్మహత్యా సదృశ్యమైనటువంటిది అధర్మ నిర్వహణం. అలాంటివి చేసేటువంటివాళ్ళు తమను తమను హరించుకుంటూ ఉంటారు. అలాంటివాళ్ళు ఇక్కడ ఎవరూ ఉండరు. ఇక్కడుండే వాళ్ళంతా కూడా తమను తాము ఉద్ధరించుకుందామనేటువంటి తపనతో కదా, మరి ఆ గురుపూజలు అన్ని పెట్టుకొని మనం ఏర్పాటు చేసుకొని, సాధన మరి కొంత పదునుపెట్టుకుందాం అని కదా!

సాధన అంటే పురుష ప్రయత్నం. పురుష ప్రయత్నం అనే పదును పెట్టుకునే భాగంలో మనకి అడ్డు వచ్చేది మానమండి. మానము స్త్రీలకి ఎక్కువగా ఉంటుంది, పురుషులకన్నా కూడా. అందుకనే, వారిని మానిని అని అంటారు. “ఆమానినీ మానదో మాన్యో” అంటాం కదా! భగవంతుడు మానము లేనటివంటివాడు. అంటే, సిగ్గులేనటువంటి వాడు అని అనుకుంటాం కదా! దక్షుడు శివుడిని నువ్వు సిగ్గులేని వాడివని తిడతాడు. శిశుపాలుడు శ్రీకృష్ణుడిని నువ్వు సిగ్గులేని వాడవని తిడతాడు. సిగ్గులేనివాడు అంటే తనకుగా తాను ఒకడు ఉంటే తనకంటూ సిగ్గు ఉంటుంది కదా! తనకిగా తాను లేనటువంటివాడు వాడికి సిగ్గేమిటి? మరింత హరింపబడినప్పుడు ఇంక సిగ్గు ఎక్కడుంటుంది? పిచ్చివాడున్నాడు, వాడి మనసు హరింపబడి ఉండటం చేత, వాడు బట్టలు వేసుకున్నాడో లేదో వాడికి తెలీదు కదా! భక్తుడు కూడా దాదాపు మనస్సు హరింపబడటం చేత దేహభావన లేని స్థితులో ఉంటాడు. ఇలా జీవుల మనసును హరింపగలిగినటువంటి సమర్థత కలిగిన వాడే దైవం. అలా మనసును హరింపలేనటువంటివాడు ఎన్ని కథలు చెప్పినా ఉపయోగం లేదు, ఎంత పాండిత్యమున్నా ఉపయోగం లేదు, ఎంత జ్ఞాన బోధన చేసినా ఉపయోగం లేదు, ఎన్ని రకాలుగా యోగ సాధనలు చేయించినా ఉపయోగం లేదు. ఎంచేత? సాధన చేసుకునేటువంటి సాధకుడికి తనను తాను మరచిన స్థితి ఒకటి కలగాలి.

అలా తనను తాను మరచిన స్థితి కలిగించేటువంటి రూపం ఉండాలి. మీరు గమనిస్తే మాస్టర్ సి. వి. వి. ప్రార్థనలో మనకి అది జరుగుతూ ఉంటుంది. మాస్టరు గారి రూపాన్ని అది రాముడు, కృష్ణుడు అన్నట్టుగా మనం చెప్పలేముగాని, ప్రార్థనలో కనులు మూసుకుంటే ఐదు నిముషాలు అయిన తర్వాత మనకేం జరిగిందో తెలీదు. నీవు లేని స్థితి, నీవు లేక నీవు కోరినది అక్కడ సాన్నిధ్యమిచ్చేటువంటి స్థితి అది సులభంగా లభించేట్టుగా తన ప్రార్థనలు ఏర్పాటు చేసారు మాస్టరు గారు. కృష్ణ అనుభూతి కలిగినటువంటి మాస్టర్ ఇ. కె. గారు... మాస్టర్ ఇ. కె. గారికి చిన్నప్పటినుంచి కృష్ణ అనుభూతి చాలా ఎక్కువ. గోదా వైభవం చదువుకుంటే మీకే తెలుస్తుంది. చిన్నతనంలోనే ఆయన రస క్రీడ లాంటి అనుభూతిని ఏంతో పొందుతూ ఉండేవారు. మనసు కరిగినటువంటి సందర్భాలు ఎన్నో ఉన్నయి మాస్టరు గారికి. అలాంటి మాస్టరు గారు, మాస్టర్ సి. వి. వి. ప్రార్థనలో అదే స్థితిని, అదే అనుభూతిని, అదే రసమును, అదే రుచిని పొందారు. అంచేతే, ఆయన పుస్తకంలో ఆయన రాస్తారు – “అంతకు మునుపు పొందినటువంటి కృష్ణ సాన్నిధ్యం రుచికునూ, మాస్టరు గారి సాన్నిధ్యమునకు లేశమాత్రమైననూ భేదము వర్తింపలేదు” అని రాశారు. ఇది ఎందుకు చెప్తున్నానంటే, మానినీ చిత్తములను హరించడమంటే మనసు కలిగినటువంటి మానవులను తాను, నేను అనేటువంటి ప్రజ్ఞ నుండి వారిని హరింపచేసి, తనలో లయ చేసుకోవడం, తాము లేని స్థితి కలిపించడం. మంద్రజాలంలో ఆ వేణునాదం ఆ విధంగా గిరిశర్మకు, ప్రతీచికి, రుఖకు ఆ విధమైనటువంటి తన్మయత్వం కలిగించింది. అలాగే మాస్టర్ సి. వి. వి.

గారి ప్రార్థనలో ఇదే తన్మయత్వం కలుగుతుంది. మాస్టరు గారి యోగము పరమ భాగవత పరమైనటువంటి మార్గమది. అంచేతనే, మాస్టర్ ఇ. కె. గారు అన్నిటికన్నా విస్తారంగా భాగవత వ్యాఖ్యానం చేయటం జరిగింది. కారణం ఏమిటంటే, అది ఒక అద్భుతమైనటువంటి మార్గము. ఈ మార్గంలో సాధకుని ప్రయత్నంకన్నా దైవము యొక్క అనుగ్రహమే ఎక్కువ. ఇక్కడ ప్రయత్నం ఎంతవరకు అంటే కనులు మూసుకొని కూర్చోటమే.

అమ్మవారు అంటున్నారు: నీవు శ్రీయుతకరమైనటువంటి ఆకారం కలిగినటువంటి వాడివి, అందరి చిత్తములు హరించేస్తావు కదా, నేను ఎంత దానిని? ఇతరుల చిత్తాల కన్నా నా చిత్తమేమి వేరే చిత్తం కాదు కదా! నేను నీకు ఎప్పుడో కైంకర్యము అయిపోయాను. నువ్వు ఆ విధంగా తప్పక నన్ను వచ్చి అందుకుంటే బాగుంటుందనే ఉద్దేశ్యంతో నాకు నీ యందు ఎలాంటి మక్కువ ఏర్పడింది అనేటువంటిది మొదటి పద్యమండి. ఇంక మరి ఈ పద్యం గురించి ఎక్కువ చెప్పను. ఎందుకంటే, చెప్పాలంటే చాలా వస్తుంది. చైతన్య మహా ప్రభువు మేరు శిఖరం లాగా నిలబడినటువంటి మహాజ్ఞాని. మూడు సార్లు భరతదేశమంతా కూడా తిరిగి, పండితులనుకునే వాళ్ళందరిని జయించినవారు. రామకృష్ణనామము “హరేరామ హరేరామ” ఆ మంత్రమిచ్చింది ఆయనే. అంతటి ఆయనా శ్రీరామకృష్ణుని యొక్క రూప సౌందర్యము, గుణసౌందర్యములకు ముగ్ధుడైపోయి, ఆ నామాన్ని చేసుకుంటూ, తన్మయుడై, ఉన్మత్తుడై, అట్లా రోడ్ల మీద డాన్సులు వేసుకుంటూ తిరిగాడాయన. ఎంచేతంటే, అంతా కృష్ణమయం. మహాజ్ఞాని కూడా పొందలేడు అలాంటి స్థితిని. అలాంటి స్థితిని ఇవ్వగలడు శ్రీకృష్ణుడు. మరి మీరాబాయి అలాగే. రామకృష్ణ పరమహంస కూడా అలాగే. అంటే, వారికి ఇంక ఒంటి మీద బట్ట ఉన్నాదా అనేది తెలియదు. అదే కదా గోపికలు కృష్ణుడుని కోరుకుంటే, “నేను కావాలనుకుంటే మిమ్మల్ని మీరు మర్చిపోయిన స్థితులో నేను దొరుకుతాను తప్ప, మీరుండి నేను ఉండడం కుదరదు” అని చెప్పాడు. అభిమానం ఉందంటే సిగ్గు ఉంటుంది కదా! నేనుంటే కదా నా వంటి మీద బట్ట ఉందని తెలుస్తుంది. నేనే లేని స్థితిలో నా వంటి మీద బట్టలున్నయటువంటి స్థితి ఎక్కడుంది!

అలాంటి వాళ్ళే చాలా మంది కుంభ మేళాలో వస్తారు. వాళ్ళను చూద్దామని వెళ్తారు మనవాళ్ళు కదా! ఎందుకు కుంభమేళానికి వెళ్తారు? ఈ వంటి మీద బట్ట లేకుండా, ఎక్కడో హిమాలయాల్లో ఆ కోనల్లో ఈ లోయల్లో పడి ఉన్న వాళ్ళందరు అక్కడికి వచ్చి తన్మయమైన స్థితులోనే వస్తారు, తన్మయమైన స్థితిలోనే వెళ్ళిపోతూ ఉంటారు వాళ్ళు. వాళ్ళని చూస్తే ఒక వింత మనకి కదా! ఇట్లా వాళ్ళు మనల్ని చూడరు. ఎందుకంటే, మనమున్నామనేటువంటి భావన వాళ్ళకి ఉండదు, దైవమే ఉంటాడు. దిగంబర సన్యాసులు ఆ తన్మయ స్థితిలోకి వెళ్ళిపోతూ ఉంటారు. నేను లేనటువంటి భావమే దిగంబరత్వం. వాడి ఒంటి మీద బట్ట ఉందా, లేదా అనేది కాదు. బట్ట ముఖ్యం కాదు. బట్ట ఉన్నది, బట్ట లేదు — రెండు అతనికి సంబంధం లేదు. దేహమే లేని స్థితులో

ఉంటారు వాళ్ళు. ఎందుకంటే, "బంధసతతులు వాయు" అని చెప్పారు కదా! అలాంటి వాడివి నువ్వు. అందుకని, నేను కోరుకుంటున్నాను.

> "ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యా రూప తారుణ్య సౌ
> జన్య శ్రీ బల దాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే
> కన్యల్ గోరరు కోరదే మును రమా కాంతాలలామంబు రా
> జన్యానేకప సింహ నావలననే జన్మించనే మోహముల్."

అంది అమ్మవారు. పద్యం చదవుతుంటేనే అర్థమయిపోతుంది కదా! పోతనా మహాత్ముల వారి పద్యాలు కదా! అంత సరళంగా ఉంటాయి. భారతం పద్యాలు అంత సులభంగా అర్థం కావు. కవిత్రయం కన్నా సరళమైనటువంటివి, భక్తి పూరించి రాసినటువంటి తెలుగు పద్యాలు ఇవి. తాను రాసాననేటువంటి భావన లేనటువంటివాడు పోతన మహాత్ములు. ఆయన పలుకుతూ ఉంటాడు, నేను రాసాను. చాలా పద్యాలు ఆయన నేనెలా రాసాను అనుకున్నాడు. ఎన్నో పద్యాలు. ఇన్ని పద్యాలేంటి? ఎవరు రాసారా అనిపిస్తూ ఉంటుంది. అలాంటి స్థితి అది.

"ధన్యున్" – అంటే కృష్ణుని యొక్క గుణకీర్తనం. "లోకమనోభిరాముఁ" – లోకుల మనసులు హరించగలిగినటువంటివాడు. "గులవిద్యా రూప" – కుల విద్య యందు అంటే అతడు పుట్టినది క్షత్రియ వంశం. ఆ రాజ విద్యలే కాదు మొత్తం అరవై నాలుగు విద్యలు నేర్చుకుంటాడు. అన్నిట్లోనూ సిద్ధుడే. రూపమా పరిణయ వయస్సులో ఉన్నాడు, పెళ్లి చేసుకుందాం అనే పరిస్థితుల్లో ఉంది కృష్ణుడి యొక్క కథ. "తారుణ్య సౌజన్య" – చాలా సౌజన్య మూర్తి కృష్ణుడు. సౌజన్యమూర్తులంటే రాముడు, కృష్ణుడే, ఇంకెవరున్నారండి ఈ రోజుల్లో! చెప్తే వాళ్ళనే చెప్పుకోవాలి సౌజన్యానికి. ఇలా ఒక్కొక్కదానికి ఒక్కొక్క ఉదాహరణ చెప్పుకోవాలి. అలా చెప్పుకుంటుంటే పద్యం అవదు! మీ అందరికి రామకృష్ణుని యొక్క రుచి బాగా కలిగి, వారి చరిత్రములు చక్కగా ఎప్పుడు చదువుకుంటూ ఉంటే, లోపల ఉండే కుళ్ళంతా పోతుందండి మనిషిలో, చక్కగా తయారవుతారు. అంటే, భావపరంపరలో మనకి అక్కర్లేని చెత్తంతా పోతుంది, husk అంటారే! అట్లా గులకరాళ్ళు వేసి మోయించే డబ్బాలాగా ఉండదు మనిషి. నిండుగా ఉంటాడు, చల్లదనాన్ని ఇస్తూ ఉంటాడు. తప్పులు చేయడు. అలాంటి వ్యక్తులు వేరు.

అంతే కాదు, "శ్రీ". శ్రీయుతాకార అంది అంతకు ముందు పద్యంలో. శ్రీ అంటే లక్ష్మి, సరస్వతి, పార్వతి ముగ్గురునూ – కాళి. అన్నీ ఆయన దగ్గరే ఉన్నాయి – బలము ఉన్నది, దాన గుణము ఉన్నది, శౌర్యము ఉన్నది.

“కరుణా సంశోభితున్” అంటే కులవిద్యారూప సంశోభితుడు. తనలో కారుణ్యమైనటువంటి సంశోభం, సౌజన్యము, శ్రీ బలము, దానము, శౌర్యము, కరుణ ఇవన్నీ కలిగిన... ఇన్ని గుణాలు మొగపిల్లవాడిలో ఉంటే మేము పిల్లనిస్తాం అని ఎవరు ఎగపడరండి! మేమిస్తాం, మేమిస్తాం మా పిల్లని అని ముందుకొస్తారు కదా తల్లిదండ్రులు! తల్లిదండ్రులు పిల్లల్ని ఇవ్వటం అలా ఉంచండి, పిల్లలే ఎగబడిపోతారు! అది కదా ఇక్కడ కథ! “నీకు తెలీదమ్మా ఆ అబ్బాయి గురించి” అని చెప్తుంది కదా ఈ రోజుల్లో! “నీకు తెలీదు. వాడు చాలా మంచివాడు. నేను వంగోమంటే వంగుంటాడు, నిల్చోమంటే నిల్చుంటాడు. ఏం కావాలంటే అవి కొనిపెడ్తాడు.” అలా అనుకూలమైనటువంటి వాడు కావాలని కదా ఈ రోజుల్లో గోల! ఇలాంటి గుణాలు ఉన్నవాడు ఎక్కడ దొరుకుతాడు? ఇలాంటి గుణాలు నీకు ఉన్నయి కాబట్టి “నిన్ను నే కన్యల్ గోరరు” – ఎవరైనా కోరతారు ఇలాంటి పురుషుడిని. నేను మోహపడ్డానని చెప్పుకోవటంలో ఆశ్చర్యమేముంది అని చెప్తోందండి అమ్మవా

“నిన్ను నే కన్యల్ గోరరు కోరదే ముని రమా కాంతాలలామంబు” – లక్ష్మీదేవి నిన్ను కోరింది కదా! “రాజన్యానేకప సింహ” – అనేకమైనటువంటి రాజుల సమూహములలో నువ్వు సింహంలాంటి వాడివి అని చెప్పిందండి అమ్మ. రాజులకు తెలియదు ఆ విషయం. అప్పుడు సమకాలికంగా ఉండే రాజులు ఎవ్వరూ కూడా కృష్ణుడ్ని ఒక వీరుడిగా గుర్తించలేదు. అది చూడండి విచిత్రం! ఎంచేతంటే, అసూయ ఒక్కటే కారణం. ఎంత మనలో అహంకారముంటే అంత అసూయ ఉంటుందండి. అహంకారం లేని వాడికి అసూయ ఉండదు. మదముంటేనే మాత్సర్యం ఉంటుంది. అంటే, ఇంకొకడిని పొగుడుతూ ఉంటే, సహించలేని బుద్ధి మనలో ఉందేమో ఒక్కసారి చూసుకోండి. ఇంకొకడిని పొగుడుతున్నామనుకోండి, అది సత్యమే అయి ఉన్నప్పుడు, నీవు సహించలేని ఒక స్థితి కలిగిందనుకోండి? అసత్యమైందనుకోండి? అసత్యమైనా కూడా సహింపగలిగినటువంటి ఓర్పు ఉందా? కృష్ణుడిని పొగిడితే సహించలేనటువంటి రాజులు చాలా మంది ఉన్నారు ఆ రోజుల్లో. ఎందుకని? ఇతను ఇతర రాజులకన్నా వైవిధ్యంగా ఉండేవాడు.

గురువులలో కృష్ణమాచార్యుల వారు వైవిధ్యంగా ఉండేవారు. ఏ గురువు గారండి ఇలా హాయిగా ప్రవచనం అవ్వంగానే, ఒక gold flake ముట్టించగలిగినటువంటి ఒక ధీమంతుడు! అందులో ఎంత ధీర గుణం కావాలండి! మీరంతా ఏమైనా అనుకుంటారేమో అని చాలా మర్యాదగా ప్రవర్తించడం కాక, తాను తానుగా ప్రవర్తించగలిగినటువంటి ధీమంతులు కదా! ఆయనదైన శైలిలో ఆయన ఎంత మంది హృదయాల్ని హరించాడు ఆయన! మాస్టరు గారి స్పర్శ పొందిన వాళ్ళు ఎవ్వరూ... జన్మ జన్మలు వెంటపడి ఉంటారు, ప్రశ్నే లేదు అంతే! అలాంటి స్పర్శ అది.

అలా శ్రీకృష్ణుడు రాజులలో ఏ రాజుకి ఇలా వాడు కాదు, కాని ఈయన అందరితోను నవ్వుతూ ఉండేవాడు. అనేకమైనటువంటి రాజుల గుంపులలో నీవు ఒక్కడివే సింహము అని అమ్మవారు చెప్తోంది. సింహంతో పోల్చడానికి వీలుగా ఉండే జంతువు ఇంకొకటి లేదు కదా! "నావలననే జన్మించనే మోహముల్" – నిన్ను పొందడము నా మొహమనుకుంటున్నావేమో, మొహం కాదు, సత్యమది. పిల్ల ప్రేమిస్తుందంటే మనం పెద్దవాళ్ళు ఏమంటాం? ఇది పిల్ల, దీనికి కొంచెం తెలీదు, వ్యామోహంలో పడ్డది అంటాం కదా! ఏది వ్యామోహమో, ఏది సత్యమో ఎట్లా తెలుస్తుందండి? పెద్దవాళ్ళు అనుకుంటారు వాళ్ళకి నచ్చితే అది వ్యామోహం కాదు, వాళ్ళకి నచ్చకపోతే పిల్లది వ్యామోహం అనుకుంటారు. పిల్ల అంటుంది నాది వ్యామోహం కాదు, మీరు చూసినది వేరు, నేను చూసింది వేరు అని చెప్తోంది కదా! ఇలా జరుగుతున్నాయిగా కథలన్నీ! ఏది మోహము? ఏది సత్యము?ఇలాంటి సత్యమైనటువంటి విషయమే ఎంచేతంటే లక్ష్మీదేవే నిన్ను కోరింది. ఏ కన్య నిన్ను కోరదు? నేనెందుకు కోరకూడదు? ఇలా ఒక పద్యం.

"శ్రీయుతమూర్తి యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెఱుఁగఁ దద్భుతమైన భవత్ప్రతాపమున్."

అని అన్నది. ఎంత బాగా చెప్పింది. పురుషమూర్తి – విరాట్ పురుషుడే కృష్ణుడు. అతన్నుంచే మనమంతా వచ్చాము. సమస్త సృష్టి అతన్నించే దిగి వచ్చింది. అతను ఎప్పుడు శ్రీతో కూడి ఉంటాడు. అతడు సింహమని పై పద్యంలో చెప్పింది. "పురుషసింహమ! సింహము పాలి సొమ్ము" – నీ సొమ్మును నేను, నీ దాన్ని నేను. "సింహము పాలి సొమ్ము గో మాయువు గోరుచందమున" – సింహానికి సంబంధించినటువంటి ఒక ప్రీతికరమైనటువంటి వస్తువు ఒక నక్క కోరుకుంటే ఎట్లా ఉంటుందండి? ఆ శిశుపాలుడు ఒక నక్క అని చెప్పింది అమ్మవారు. ఎందుకని? అందరితో తిరుగుతూ ఉంటే, చూస్తూ ఉంటుందిగా, ఆ నక్క బుద్ధులు! అని చెప్పి, ఈ నక్క ఒకటి సింహం సొమ్ము ఎత్తుకుపోదాం అని చూస్తోంది. "మత్తుడు" – బాగా తెలియని స్థితిలో ఉన్నాడు. మత్తంటే తెలియని స్థితేగా! తెలీదు వాడికి, మూర్ఖుడు. వాడేం కోరుకుంటున్నాడో వాడికే తెలీదు.

రావణుడు అమ్మవారిని కోరుకుంటే అలా చూపించింది గడ్డిపోచని. "గట్టిగా చూస్తే మాడిపోతావ్. ఏంది నీ గోల!" అని చెప్పింది. "రోజు ఇంటికొచ్చి గోల చేయకు నువ్వు. గట్టిగా నేను కనె్రర చేస్తే నువ్వు మాడిపోతావ్ గడ్డిపోచ మాదిపోయినట్టు" అని చెప్పింది. రావణుడు ఎంత అమ్మవారిని కోరుకున్నాడో, అమ్మవారిని చూస్తే

అంత భయపడతాడు. ఎంచేత? అమ్మవారు అగ్నిశిఖ. అమ్మవారికి రావణుడు తన్నేదో చేస్తాడని భయం ఎప్పుడూ లేదు. మీరు రామాయణం బాగా చదువుకుంటే, రావణుడు ఎత్తుకుపోయాడు నన్ను ఏంచేస్తాడో అని భయం లేదు అమ్మవారికి ఎప్పుడు. రావణుడే కాదు, మొత్తం ప్రపంచంలో ఎవ్వరూ ఏమి చేయలేరు ఆవిడని. ఆవిడ బాధల్లా రాముడు బాధ పడుతూ ఉంటాడు తాను లేకపోవటం చేత అని. ఎంచేత? తన బాధ్యత పడి తీసుకొచ్చాడు అరణ్యానికి. "నేను వెంట పడి వస్తాను," అంటే రక్షించుకొనే బాధ్యత వహించి తీసుకొచ్చాడు. రక్షించుకోలేకపోయాను, అబల, స్త్రీ, సౌజన్యమూర్తి, సుకుమారి ఎలాంటి బాధలు పడుతుందో అని ఆయన బాధపడతాడు అని తను బాధ పడుతుంది అంతే! అది అమ్మవారి బాధ. అంతేగాని, "నేనిక్కడ ఇంతలా బాధపడిపోతునాను. ఆయనకేమి, బానే ఉన్నాడు కదా!", అది కాదు అక్కడ బాధ.

ఎంతసేపూ మన బాధ మనం చెప్పుకోవడమే! రాంగానే భార్య భర్తకి, భర్త భార్యకి అలా చెప్పేసుకుంటూ ఉంటాం కదా "నేనింత కష్టపడ్డాను, అంత కష్టపడ్డాను. మీరేం పట్టించుకుంటున్నారు?" ఇట్లా ఉంటుంది! అదేమిటది? ఆయన ఎంత కష్టపడుతున్నాడో అది తెలిస్తే ప్రేమ అవుతుంది. భర్తెంత కష్టపడుతున్నాడో తెలిస్తే ఆ భార్యకి ప్రేమ ఉన్నట్లండి. అలాగే భార్య ఎంత కష్టపడిపోతోందో అని భావించే భర్తకి ఆ భార్య మీద ప్రేమ ఉన్నట్లు. ఇద్దరూ ఎవరి వారి కష్టాలు వారు చెప్పుకుంటున్నారంటే ఇద్దరికీ ఒకళ్ళ మీద ఒకళ్లకేమి లేదు, వాళ్ళ మీదే వాళ్ళకి ప్రేమ. మన్ని మనం చాలా ప్రేమించుకుంటూ ఉన్నప్పుడు, మనం ఎంత కష్టపడుతున్నామో చెప్పుకుంటూ ఉంటాం అందరికి కదా! అలా చెప్పుకుంటుండే వాడు నిజంగా కష్టపడుతూ ఉండడు. ఎందుకంటే, ఎక్కువ feeling లో ఉంటాడు, తక్కువ పనిలో ఉంటాడు.

అమ్మవారు రాముని గూర్చి బాధ పడుతుంది. శ్రీరామచంద్రమూర్తి అమ్మవారి గురించి బాధ పడతాడు. అదీ వారి బాధ. ఏది బాధ? ఆవిడ లేదే అని కాదు, ఆవిడ ఏం కష్టపడుతోందో అన్న బాధ. రాముడు అరణ్యంలో తాను లేక ఎంత కష్టపడుతున్నాడో అన్న భావన. ప్రేమంటే మనకేం తెలీదండి. మనకేంతసేపూ demanding ఒక్కటే తెలుసు. You know how to demand, you dont know how to offer. ఆ సంస్కృతే జాతిలోంచి పోయిందేమో! "ఏమిటో! కష్టపడి వచ్చాం అక్కడ నుంచి, ఇక్కడ నుంచి" అనుకుంటున్నారనుకోండి, "అదేమిటిరా! నాకోసం కదా నువ్వు వచ్చావు" అని మాస్టరు గారు అడిగారనుకోండి, "మీ కోసమే అనుకోండి, అయినా ఇంత కష్టపడాల్సి వచ్చింది కదా!" అన్నట్టుగా అని అన్నామనుకోండి! అంటే, ప్రేమ ఉన్నచోట కష్టమెక్కడ ఉంటుందండి? అది ప్రేమికుల నడిగితే బాగా తెలుస్తుంది. పగలని లేదు, రాత్రని లేదు. ఆకలి ఉండదు, దాహం ఉండదు కదా. నిద్ర ఉండదు – ఏముండదు ప్రేమ ఉన్న చోట.

అమ్మవారు చెప్తోంది – ఈ నక్కగాడు ఒకడున్నాడు ఇక్కడ. ఈ నక్క వెధవ నన్ను పొందుదామనుకుంటున్నాడు. నేను నీ సొత్తును కదా! ఆవిడ చాలా ఆత్మధైర్యం ఉన్నది. తాను శ్రీకృష్ణుని సొత్తు, ఇతరుల సొత్తు కానే కాదు, ముమ్మాటికి కాదు. "నీ పదాంబుజ ధ్యాయినియైన నన్ను" – ఎప్పుడూ శ్రీకృష్ణుని పాదములను ధ్యానం చేస్తూ ఉంటుందటండి అమ్మవారు. అందుకనే, ఆయన హృదయంలో పెట్టుకున్నా, ఆవిడ పాదాల దగ్గర కూర్చొని అవే వత్తుకుంటూ ఉంటుంది. ఇవేం చెయ్యకుండా ఎక్కేద్దామ్మా అని చూసేవారిని ఎప్పుడు దింపేద్దామా అని చూస్తాడు. ఎందుకంటే, గుండె బరువెక్కుతుంది. ఆవిడ పాదాల దగ్గర కూర్చుంటే, ఆయన హృదయంలో పెట్టుకున్నాడు. ఒకటి గుర్తుపెట్టుకోండి, పాదముల చెంత జేరి అంటే జీవుల సేవ బాగా చేస్తూ ఉంటే... మనం కోరేది భగవంతుని పాదములే. పాదములు కోరుతుంటే, ఆయన అక్కున చేర్చుకొని, గుండెల్లో పెట్టుకుంటాడు.

"నీ పదాంబుజ ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు" – త్వరగా తీసుకెళ్ళిపోదాం అని వీడు ఒక నక్క వెధవ ఉన్నాడు. ఉన్నవాడు యధమాధముండు అని చెప్పింది. అంటే, అధములలో అధముడు మా అన్నయ్య friend. ఎందుకంటే, friends అని వస్తూఉంటారు అన్నయ్యతో ఇంటికి. అన్నయ్య friend అంటాడు, అందుకు రాడు, తన కోసం వచ్చి, అన్నయ్య friend అంటూ ఉంటాడు. బుద్ధి మంచిది కాదు. అన్నయ్య మూర్ఖుడు, వాడికేం తెలీదు కదా! వీడు "యధమాధముం డెఱుఁగఁ దద్భుతమైన భవత్ప్రతాపమున్." – నీ యొక్క ప్రతాపము, శౌర్యము, వీర్యము, నీ బలము తెలియక, నీ సొత్తైన నన్ను పొందాలనేటువంటి దుర్భావనతో ఉన్నాడని చెప్పి మరొక భావన బ్రాహ్మణుడి ద్వారా శ్రీకృష్ణునికి చెప్పింది.

"వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరిన్ జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్."

ఇది చాలా ముఖ్యము స్త్రీలకు. "వ్రతముల్" – బాగా వ్రతములు చేసి ఉండాలి స్త్రీ. ఎవరిని గూర్చి? హరిని గూర్చి. జగత్ కళ్యాణం కోసం, తనకోసం కాదు. జగత్ కళ్యాణం కోసం హరిని గూర్చి వ్రతములు చేయడం. హరిని గూర్చి దేవతారాధన చేయటం. హరిని గూర్చి గురు సుస్రూష చేయడం, హరిని మనసులో పెట్టుకొని ద్విజన్మలు – అంటే మళ్ళీ పుట్టిన వాళ్ళు, అంటే మహాత్ములు – వారి సేవ చేయడం. "బుధ" అంటే తెలిసినవారు అని అర్థం. ఇది వరకు ఇటువంటి మహాత్ములు వస్తే ఇంట్లో ఆడపిల్లల చేత సేవలు చేయించేవాళ్లండి.

సంస్కారాలు ఎట్లా వస్తాయండి? ఏం చేయకుండా గాడిద లాగా పెరిగేస్తే సంస్కారం ఎట్లా వస్తుంది? గాడిద సంస్కారమే వస్తుంది. ప్రస్తుతం మన దేశం చాలా దుస్థితిలో ఉంది. ఎందుకంటే, అన్నీ ఉన్నాయి కానీ మనకి ఏం తెలియదు, ఏం చదువుకోలేదు, ఎవరు చెప్పినా వినలేదు.

చక్కని మొగుడు రావాలంటే అమ్మాయి విష్ణు పూజ చేసుకోవాలి. పెళ్లి వయస్సు వచ్చిన దగ్గర నుంచి రోజు విష్ణు పూజ చేసుకోవాలి, బ్రాహ్మణులకు దానం చేసుకోవాలి. ఇంటికి ఎవరన్నా వస్తే, వాళ్ళకి ధనం గాని, ధాన్యం గాని పిల్లచేత ఇప్పించాలి తెలిసిన తల్లి. పిల్లచేత బియ్యం వేయించటం, ఒక పది రూపాయలు ఇప్పించటం. మహాత్ములు వస్తే పిల్ల చేత దండం పెట్టించడం, ఆశీర్వదించండి స్వామి అని. పిల్లకి పూజ నేర్పి, ఇంట్లో అమ్మాయి చేత పూజలు చేయిస్తే, ఇలాంటి వెధవలు ఇంట్లో చేరరు, చేరినా పొందలేరు. ఎలాంటి వెధవలు? ఉన్నాడుగా వీడు! ఒక example మనకి. Jeans pant రకాలు తిరుగుతూ ఉంటాయి ఊరంతాను! చింపేసుకున్న బట్టలు వేసుకొని, అదో మాదిరిగా తలకాయ దువ్వుకొని, అదొక మాదిరిగా తెలుగు మాట్లాడుతూ కదా! ఎంత భయంకరంగా తెలుగు మాట్లాడుతున్నారు మన పిల్లలు ఇప్పుడు! గుర్తుపెట్టుకోండి, భాష రాని వాడికి ఆ భాషకి సంబంధించినటువంటి సంస్కృతి రాదు. మీ పిల్లలకి తెలుగు భాష రాకపోతే వాళ్ళకి తెలుగు సంస్కృతి రాదు. ఇంగ్లీషు భాష మాత్రమే వస్తే, ఇంగ్లీషు సంస్కృతే వాళ్ళల్లో పెరుగుతుంది, బాగా స్థిరపడుతూ ఉంటుంది. మనకేం తెలీదు, fashion మనకి! మనమే మూర్ఖులైనప్పుడు మరి మంచి పిల్లలు ఎలా వస్తారు? రారు కదా!

చూడండి ఆమె చెప్తోంది “వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్” – వాళ్ళందరికి నేను సేవలు చేసినట్లయితే. “దానధర్మాదులున్ గతజన్మంబుల” – ఎప్పుడు? ఇప్పుడు కాదు, ఇదివరకు జన్మల్లో. అందుకనే, ఎవరికైనా చాలా మంచి భర్త దొరికితే “ఎలాంటి బంగారు పువ్వులతో పూజ చేసుకుందో ఆవిడ” అంటూ ఉంటారు సామెతకి. ఎన్నో వ్రతాలు చేస్తే తప్ప, మనస్సు రంజింపజేసి, తనకి ఆహ్లాదం కలిగించి, తాను వీడలేనటువంటి, ఎన్ని జన్మలకైనా వీడే నాకు మొగుడుగా కావాలి అనేటువంటి వాడు దొరకడు. మొగవాళ్ళల్లో అలాంటి వాళ్ళు అసలే అరుదు. మరి అలాంటి వాళ్ళు కావాలనుకుంటే స్త్రీలు ఏం చేయాలో ఇక్కడ చెప్పారు. అంటే, ఇవాళ ఇంటికెళ్ళిపోయి పూజలు మొదలుపెడితే, “ఏంటోయ్! ఇవాళ్ళ నుంచి విష్ణు పూజలు చేస్తున్నావు?” అంటే, “పై జన్మకి మంచి మొగుడు రావాలని చేస్తున్నాను”! “పై జన్మకి ఇంత కన్నా మంచి మొగుడు రావాలని చేసుకుంటున్నాను అండి” అని అంటే, “శుభం అలాగే రావాలి” అని చెప్పాలి మొగవాళ్ళు కదా! మనకుండే స్వభావం బట్టే – గంతకు తగ్గ బొంత అంటారు.

అలా చేసి ఉన్నట్లయితే, “నీశ్వరున్ హరిన్ జగత్కల్యాణుఁ గాంక్షించి చే సితి నేనిన్” అని అన్నది. అలా పూజలన్ని ఎందుకు చేసింది? ఏ పూజ చేసినా మనం చెప్తాం కదా లోకకల్యాణార్థం అంటూ! ఎవర్ని ఉద్దేశ్యించి? దైవాన్ని ఉద్దేశ్యించి లోక కల్యాణార్థం ఆ పైన చెప్పినవన్ని పూర్వ జన్మల్లో నేను చేసి ఉంటే, “వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక” అని అంది. మనం బాగా ఆవేశంగా పిలిచామని ఊరికే వచ్చేస్తారా ఏంటి? రారు, తెలుసా! దైవం గాని, ఋషులు గాని మనం అట్లా విసిగించేస్తే రారు వాళ్ళు. నువ్వు ఏం చేశావు? ఏ దానమన్నా చేశావా? ఏ ధర్మమన్నా చేశావా? ఏ బ్రాహ్మణుని అయినా పూజించావా? ఏ గురువుకైనా సేవలు చేసుకున్నావా? ఏ దేవతారాధన అయినా చేస్తూ వచ్చావా? ఏం లేదు కదా! ఏమి చెయ్యకుండా ఊరికే అట్లా మొండిగా “నాకు దేవుడు కావాలి, నాకు దేవుడు కావాలి” అంటే రాడండి, ఆయన గోడల్లె ఉంటాడు. ఇలా చేసుకుని ఉన్నటువంటివాళ్ళకి... ఇదంతా మనం చూపించినటువంటి సంసిద్ధత దైవాన్ని చేరడానికి. ఆ విధంగా నేను చేసి ఉన్నట్లయితే, నా చిత్తమునకు ఈశుడు... ప్రతి వారికి వారి చిత్తము ఉంది. దానిని అదిష్టించి ఉండేటువంటి పరమాత్మ మనలోనే ఉన్నాడు. అతడు అందుకుని, అతడే నీకింద పని చేసుకుంటూ ఉంటాడు. భక్తుడు చేయవలసినవన్నీ ఇక్కడ ఉన్నాయి. నేను భక్తుడను, నేను యోగ సాధకుడను, నేను సత్యాన్వేషకుడను అనుకునే వాడెవరన్న ఉంటే, వాడు చేయవలసినవి ఇవన్ని.

“చే సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్” – సంగరం జరుగుతుంది లోపల, బయటే కాదు. లోపల దేవదాన యుద్ధం జరుగుతూ ఉంటుంది సాధకుడికి. ఎంచేతంటే, ఒక పక్క స్వార్థం కొన్ని ఆలోచనలు చెప్తూ ఉంటాయి. “అలా చేస్తే మనం మటాష్ అయిపోతాం” అని చెప్తూ ఉంటుంది లోపల అహంకారం, అజ్ఞానం, స్వార్థం. మరోపక్క “ఇలా చేసుకున్నవారు బాగు పడ్డారు కదా! వాళ్ళందరు బాగున్నారు కదా! అందుకనే కదా నేను చేద్దామనుకుంటున్నాను!” అని ఒక పక్క నెమ్మదిగా ధర్మం చెప్తూ ఉంటుంది లోపల. “ఆ! అలాగే చెప్తారు. అలా చేసినవాళ్ళు తక్కువ మంది అంటారు, వాళ్ళందరు చాలా కష్టాలు పడ్డారు. అందుకని అలా చేసి ఊరికే impractical గా ఉండపోక” అని చెప్తుంటుంది. ఇటువంటి పదాలన్నీ వాడేస్తుంది లోపల తమాషాగా! ఏది భక్తుడు impractical, వీడు చాలా practical! చాలా practical గా మునిగిపోతారు తెలుసా వాళ్ళు! ఎంత practical గా మునుగుతాడంటే, వాడింత impractical అనుకునేవాడు అలా చేరి వెళ్లిపోతుంటారు! నీ తెలివి నిన్ను ముంచుతుంది. వాడి తెలివి నిన్ను తినదు. సొంత తెలివి చేస్తే ఎవడైనా పాడైపోతాడు, ఇంక ఎవర్ని ఏమంటానికి వీల్లేదు. రావణుడు అట్లాగే అయిపోయాడు కదా, సొంత తెలివే!

ఆ విధంగా "సంగరమొకటి" అంటే మనలో మనకో యుద్ధం జరుగుతూ ఉంటుంది. దేవదానవ యుద్ధం మనలో నిత్యం జరుగుతుంటుంది. "ఈ గురుపూజలకు వెళ్ళకపోతే ఏమి?" అని చెప్తుంది లోపల నుంచి. "వెళ్తేనేనా?" అంటుంది. అవన్నీ జయించుకొని కదా ఇక్కడికి వచ్చారు! ఎప్పుడూ జయించారా? ఒక్కోసారి మనం మాత్రం మానేయాలేదా గురుపూజలు! 52 గురుపూజలు జరిగినాయి, అంకెలు వేసుకుంటున్నాం కదా! ఒక గుర్తు – నీకు మాస్టరు గారు తెలిసిన దగ్గర నుంచి అన్ని గురుపూజలకి వెళ్ళావా? ఎంత వీలుపడ్డది? ఎప్పుడూ నీ మనసులో కలగలేదా "ఆ! వెళ్ళకపోతే ఏంటిలే?" అని. "ఆ! బెజవాడలో ఎండలు, ఏమెళ్తాం? ఆ! బెంగుళూరు దూరం, ఏం వెళ్తాం? శ్రీకాకుళంలో దోమలు, ఏం వెళ్తాం?" ఇట్లా చెప్తూ ఉంటుందండి లోపల. ఏమిటిది? వీడే – శిశుపాలుడు, రుక్మి, జరాసంధుడు, సాళ్వుడు. అధమాధములైనటువంటి భావములు వచ్చి, ఉత్తమోత్తమమైనటువంటి భావములని ఇలా తోసేస్తూ ఉంటాయి. ఇవన్నీ పోవాలంటే ఆ పై విధంగా చేసుకోవాలి. ఇలా చేసుకోని వాడికి మానేయటానికి ఎప్పుడూ ఏదో ఒక logic ఉంటుంది. మానేయటానికి ఎన్ని కారణాలైనా చూసుకోవచ్చు కదా! రావడానికో? ఇలాంటి పుణ్యము నీకుంటే వస్తావు. అలా చెప్పింది ఆవిడ, వీళ్ళందరు పోవాలి, ఆయన రావాలి అని.

"అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్."

అదండి మరి రుక్మిణీదేవి! I am ready, నేను వచ్చేస్తాను, నువ్వు ఎత్తుకపో – ఆవిడే చెప్పేసింది సలహా కూడా రాక్షస వివాహం అని. ఎత్తుకు పోవడం అంటే రాక్షస వివాహం. ఎందుకని? నేనే ఎత్తుకుపొమ్మని చెప్తున్నాను, బలవంతంగా ఎత్తుకు పోవటం కాదు. స్త్రీ ఒప్పుకున్నప్పుడు పురుషుడు ఆ విధంగా ఎత్తుకపోతే తప్పు లేదు, అది ధర్మం. ఎందుకని? తన మనసుని ఆ విధంగా అర్పణ చేసేసింది కాబట్టి నువ్వు ఆ విధంగా నన్ను ఎత్తుకుపో అని చెప్పింది. "అంకిలి సెప్ప లేదు" – అంకిలి సెప్ప లేదంటే అడ్డమేమీ చెప్పట్లేదు నేను, నా పక్కనుంచి ఏ విధమైనటువంటి అభ్యంతరం లేదు నువ్వు ఎత్తుకుపోతానన్నా సరే. మా అమ్మ, నాన్నలను ఒప్పించి, మా అన్నయ్యను ఒప్పించి, ఆ తర్వాత పెళ్లి చేసుకో, ఇటువంటివన్ని అలా నేను అడగట్లేదు నిన్ను, ఇలా sraight route చెప్పేస్తున్నాను అని చెప్పింది. "అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో" అంటే రేపే! ఎందుకంటే, రేపటికే పెళ్లి పెట్టేసారు వాళ్ళు. "పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్" అంటే జరాదేవ్

అనుగ్రహించేత జరాసంధుడు వరప్రసాదియై, ఒక రకమైనటువంటి మరణం లేని స్థితిలో ఉంటాడు. చీల్చేస్తే మళ్ళీ అతుక్కుపోతాడు కదా! అంచేత, జరాసుతులు అతడు.

అంటే, మనలో ఉండేటువంటి సమస్తమైనటువంటి ఇతర భావములన్నీ కూడా నీవే హరించు అని. రాక్షస వధ చేసి కదా రాముడు అమ్మవారిని తెచ్చుకుంటాడు! ఎక్కడైతే అజ్ఞానం ఉందో... నాలో ఉన్నటువంటి అజ్ఞానపు భావములు, ప్రవర్తనలు, అవన్నీ నీవే నిర్మూలించి... లోపల కథ అది. మన లోపల జరాసంధులు లేడా? నక్క బుద్ధులు ఉంటాయి కదా! అహంకారం ఉంటుంది కదా! అజ్ఞానం ఉంది కదా! మదము, మాత్సర్యం, కాపం, క్రోధం, మొహం, లోభం ఇవన్నీ ఉన్నాయి కదండి! అవి ఎప్పటికప్పుడు పుడుతూనే ఉంటాయి. "సద్యోజాతయ నమో నమః" అన్నారు కదా! మనతో సంబంధం లేకుండా మనలో ఎప్పుడూ పుడుతూ ఉంటాయట ఇవి. ఇవన్నీ నా వల్ల కాదు, నీ వల్ల అవుతుంది, అది నాకు తెలుసు. కాబట్టి నువ్వు వచ్చి, వీళ్ళందరిని నిర్మూలించి, నన్ను పట్టుకపో. ఇంక నీకు ఎవరి permission అక్కర్లేదు, నా permission నే అని చెప్పింది. మా అమ్మతో మాట్లాడక్కర్లేదు, మా నాన్నతో మాట్లడక్కర్లేదు. మా అన్నయ్యతో మాట్లాడమని చెప్పట్లేదు. అందర్ని ఒప్పించి తీసుకెళ్ళమని చెప్పట్లేదు. ఎవరి అనుమతి కావాలండి దైవం దగ్గరికి చేరడానికి?

"భద్రాది రాముని భజనకు తరలచుండ బంధుమిత్రుల ఆజ్ఞ బడయనేల" అన్నాడు రామదాసు. భజనకు వెళ్తున్నాడట. భజనకి వెళ్తుంటే "ఏమయ్యా! ఇంట్లో చెప్పావా?" అంటే, భజనకి వెళ్తుంటే ఇంట్లో చెప్పటం ఎందుకండి! సినిమాకి వెళ్తుంటే చెప్పాలి, వాడూ రావచ్చు కదా! నేను భజనకెళ్తున్నానని చెప్పక్కర్లేదు. "భద్రాది రాముని భజనకు తరలచుండ బంధుమిత్రుల ఆజ్ఞ బడయనేల" అన్నాడు రామదాసు. అంటే, నువ్వు దైవాన్ని ఆరాధన చేయటానికి ఇంకొకళ్ళ అనుమతి ఎందుకు? నీవు దైవాన్ని చేరడానికి ఇంకొకళ్ళ అనుమతి ఎందుకు? నువ్వు దైవం వాడివే కదా! నువ్వు సింహం పాలిట సొమ్ము. ప్రతి జీవుడు కూడా సింహం పాలిట సొమ్మే. అందరూ దైవం యొక్క సొత్తే. అందరి జీవులు కూడా దైవమునకు సంబంధించినవారే, దైవం నుండి వచ్చినటువంటివారే. కాకపోతే, వారిలో ఉండేటువంటి అజ్ఞానము నందు తరగతులు ఉంటాయి. బాగా అజ్ఞానంలో ఉండేవాళ్ళు, కొంత జ్ఞానంలో ఉండేవాళ్ళు ఉంటారు. ఈ అజ్ఞానాన్ని నిర్మూలించి నీవే నన్ను ఉద్దరించుకో అని చెప్పటం ఈ ప్రార్థన.

రుక్మిణీదేవి కృష్ణుని పెళ్లి చేసుకోవటం కోసం చేసింది, మనకేంటి ఈ ప్రార్థన? మనం వేరే ప్రార్థనలు చదువుకుందాం అనుకోబోకండి. ఇది మన ప్రార్థనే. అందుకనే, చిన్నప్పుడు ఈ ప్రార్థనలన్నీ పాఠ్యాంశాలుగా ఇచ్చేవారు. దురదృష్టం కొద్ది secularism పేరున ఇలాంటి అత్యద్భుతము, పవిత్రము,

సంస్కారవంతమైనటువంటి విషయములన్నీ కూడా పాఠ్యగ్రంథాల నుంచి మనమే తొలగించుకున్నాము. మన ప్రభుత్వం అంటే మనం ఎన్నుకున్న ప్రభుత్వం కదా! ఎవరికి ఏం తెలీదు! సవినయంగా చెప్పిందండి. "చేకొని పొమ్ము వచ్చెదన్" – నేను వస్తాను, నువ్వు తీసుకెళ్ళు అని.

"లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దే వచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి
గాని తే రా దని కమలనయన!
భావించితేని నుపాయంబు సెప్పెద
నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు"

"లోపలి సౌధంబులోన వర్తింపంగఁ దే వచ్చునే నిన్ను" అని నువ్వు అనుకుంటావేమో... ఎక్కడో అంతఃపురంలో ఉంటది కదా! జీవుడు ఎక్కడున్నాడు? ఎక్కడో లోపలుంటాడు కదా! వాడి చుట్టూ బోల్డు ఆవరణలు ఉన్నాయి వాడికి. లోపలి సౌధంలోనేగా జీవుడున్నాడు! అదే లోపల. అదే చెప్తున్నాను, భాగవతం చదువుకోవడం రెండు రకాలు. మనమంతా కూడా లోపల సౌధంలో, హృదయంలో ఉన్నటువంటి స్పందన లోపల, సూక్ష్మస్పందనంగా, చైతన్యవంతుడై, స్పందనాత్మక చైతన్యంగా అలా ఉంటూ ఉంటాము. దాని చుట్టూ అహంకారం ఉంటుంది. దాని చుట్టూ త్రిగుణాత్మకమైనటువంటి ఆవరణ ఉంటుంది. దాని చుట్టూ బుద్ధి ఉంటుంది. బుద్ధి తర్వాత మనసు ఆవరణ ఉంటుంది. ఆ తర్వాత పంచేంద్రియముల ఆవరణ ఉంటుంది. ఆ తర్వాత రక్తమాంసాలతో కూడిన శరీరం ఉంటుంది. ఇది సౌధం. లోపల, లోపల బోల్డు గదులున్నాయి. రాజకుమారి అంటే ఎంత లోపల ఉంటుంది? మనమంతా సహజంగా రాజకుమారులము, రాజకుమారిలము.

మనముండేది అయోధ్య, అంటే వధ్యము కానటువంటి ప్రాకారముల మధ్య ఉండే గుండె అయోధ్య. రామాయణంలో అయోధ్యే ఈ రుక్మిణీకల్యాణ ఘట్టంలో కుండిన. అలా లోపల ఉన్న జీవుడ్ని ఎలా తెస్తాడండి? గట్టిగా పీకితే చచ్చిపోతాడు తెలుసా! యముడుకి తెలుసు ఎలా తియ్యాలో మనల్ని. "అమ్మమ్మ! ఇప్పుడు కాదు సార్!" అంటే, అలాగే నవ్వుతూ తీసేస్తాడు, అయిపోతుంది. లేదా, నువ్వు మరీ గొడవ చేస్తే, మత్తిచ్చి తీసేస్తాడు. ఆయన మత్తిచ్చి తీయడమే మనకి తెలియలేక పోవడం, అదే ఎక్కువగా ఉంటుంది. మనకి తెలివి వచ్చే లోపల

బయట ఉంటాం! "వద్దని చెప్పాను కదా!" అంటే, "time అయిపోయింది నాన్నా! తీసేసాం"అంటారు. మరి ఇంక నువ్వు లోపలికి వెళ్ళలేవు కదా! నీకు లోపలికెళ్ళడం చేతనయితే ఇంక గొడవేముంది! నీకు లోపలికెళ్ళడం చేత కాలేదు, బయటకి రావడం చేతకాలేదు. ఈ జన్మకి చేత కాదు, కాబట్టి నేను తేసేసాను. బయటకి రావడం చేతనయిన వాడిని యముడు ముట్టుకోడు, వాడే వస్తాడని తెలుసు. ఎంత బాగుంటాయో తెలుసా మన కథలు! ఎక్కడా లేదండి ఇలాంటి వాఙ్మయం. నాకు తెలిసింది చాలా కొంచమే! అయినా చాలా బాగుంది వింటుంటే. నాకే బాగుంది చెప్పుకుంటుంటే! అలా time దాటేయకండి సార్ అని చెప్పండి. ఇంకా చాలా time ఉంది.

"దెత్తునేనిఁ గావలివారలఁ గలబంధువులఁ జంపి గాని తే రా దని" – ఇట్లా తేవాలంటే కాపలా ఉండేవాళ్ళు, లోపల బంధువులు ఉంటారు కదా! పెళ్ళంటే ఇంటి నిండా జనముంటారు కదా! శుభమా అని పెళ్లిచేసుకుంటూ, ఇంట్లో జొరబడి, ఇంట్లో వాళ్ళందర్నీ చంపేస్తే ఏం బాగుంటుందండి? బాగుండదు కదా! అని భావిస్తామో "గాని తే రా దని కమలనయన! భావించితేని నుపాయంబు సెప్పెద" –రుక్మిణీదేవి మనమనుకున్నంత అమాయకురాలేమి కాదు! ఆయన కెంత తెలుసో, ఆమె అంత మాత్రం తత్తుల్యం తనకీ తెలుసు కదా! కాకపోతే, బయటపడదు అంతే. ఇల్లంతా నడిపించే ఇంటావిడ బయటపడదండి, ఇంటాయన్ని ముందుపెడుతూ ఉంటుంది. ఊరికే మనమే అంతా అనుకుంటాడు, కానీ కాదు. ఒక విధంగా మొగవాడు వెర్రి వెధవ. నడిపించేది వెనకాల ఉంటుంది కదా! అది వెనకాల చూడగలిగినవాడే ద్రష్ట. ముందు కథ అందరు చూస్తారు. వీడు ఆడింపబడుతున్నాడా, ఆడుతున్నాడా అనేది లెక్క కదా! అసలు అమ్మవారికి తెలియని తెలివితేటలు ఏముంటాయి అండి? ఉంటాయా? ఆడవాళ్ళకుండేటువంటి తెలివితేటలు మొగవాళ్ళకి ఎక్కడ ఉన్నాయండి? లేవు. ఏమనుకోబాకండి! అదృష్టవశాత్తు మొగవాళ్ళు తక్కువగానే ఉన్నారు, ఆడవాళ్ళే ఎక్కువ మందున్నారు ఇక్కడ! సృష్టి స్త్రీదండి. మొత్తం సృష్టి నిర్మాణం చేసిందే స్త్రీ. ఆమె పోకడలు ఆయనకే తెలుస్తాయి, ఇంకెవరికి తెలియదు. ఎప్పటికప్పుడు, any day భార్య is a surprise to భర్త. అమ్మా! అనిపిస్తుంది. అట్లా ఉంటారు. అంత అటుపోవద్దు, అదొక పెద్ద chapter. కృష్ణమూర్తి గారు స్త్రీ మనస్తత్వం అనేటువంటిది ఎప్పుడన్నా ఒక గురుపూజల్లో పెడితే ఇంకా మూడేళ్ళ పాటు చెప్పుకోవచ్చు, అంతుంది!

ఇక్కడ ఈవిడ చెప్తూఉన్నది. మా ఇంట్లో ఒక ఆచారముంది. కులదేవత అయిన పార్వతీదేవి అమ్మవారు ఊరు బయట ఉంది. పెళ్లికూతుర్ని పెళ్లి చెయ్యడానికి ముందు కులదేవత దగ్గరకు తీసుకెళ్ళి, అమ్మవారికి పూజ చేస్తారయ్యా పెళ్లికూతురి చేత.

"నెలమి మావారుఁ బంపుదు రేను నట్లె

పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!"

ఎంత అద్భుతమండి! ఇది మనం చేయలేము. ఇంతవరకు జీవుడికి సంబంధించినవన్నీ చెప్పుకున్నాం కదా! ఇది ఆవిడే చేయగలదు. పురము వెలువడి వస్తావా? వస్తే, నువ్వు సి. వి. వి. గారి యోగంలో పండినట్టే. దాని కోసమే ఈ గొడవంత. మనది గొడవే ఎక్కువ, సాధన తక్కువ. ఇలా పురంబు వెలువడి రావడం కోసమేనండి మాస్టరు గారు అవతరించారు. మనమంతా మన, మన పొరుగుల నుండి బయటకి వచ్చి, దేవుడికి మొక్కేట్టుగా... పురములలో ఉండి దేవుడికి మొక్కడం ఒక పద్ధతి. పురముల బయటకి వచ్చి దేవుడికి మొక్కటం ఒక పద్ధతి. అట్లా నేను బయటకి వస్తాను, అప్పుడు సులభం కదా! అప్పుడు నువ్వు అంతఃపురంలో ప్రవేశించి, ఈ గోలంతా లేదు. ఎంత సులువు చెప్పిందో చూడండి!

ఎవ్వరి చేతను బాధింపపడలేనటువంటి, పరాక్రమైనటువంటి చరిత్ర కలిగినటువంటి వాడు శ్రీకృష్ణుడు. ఆయన తలుచుకుంటే ఆయన్ను ఎవరు ఆపలేరు. నువ్వు లోపలికొచ్చి కూడా నన్ను తీసుకెళ్ళగలవు. లోపలికొచ్చి తీసుకెళ్ళాలంటే ఈ హింసా కార్యక్రమం ఉంటుంది. బంధువుల్ని, మిత్రుల్ని చంపితే బాగుండదు. ఈ జైద్యుడు, గీద్యుడు వీళ్ళందరిని వేసేసుకోమని చెప్పింది. ఎందుకని? వాళ్ళందరూ ఎట్లాగో రాజులు, సైన్యంతో వచ్చారు. వాళ్ళందరికి వాళ్ళ వాళ్ళ అంతస్తుకు తగినట్టుగా విడుదులు ఏర్పాటు చేస్తారు, వాళ్ళు అందులో ఉంటారు. అంతఃపురంలో ఉండరు కదా! బంధువులు, ఆప్తులు, మిత్రులు వీళ్ళంతా లోపల అంతఃపురంలో ఉంటారు. మిగతా వాళ్ళందరికి విడిదే. లోపల వాళ్ళను నువ్వు చంపక్కర్లేదు. నేనే బయటకి వచ్చేస్తాను. ఆ సమయంలో నువ్వు నన్ను పట్టుకెళ్ళిపో బాగుంటుంది అని చెప్పింది.

ఈ లోపలి సౌధం అందులోంచి బయటకి రావడం, లేదా అందు లోపలికి రావడం. లోపలి సౌధంలోకి రాగలవంటి వాడు గురువు. నీ లోపలికొస్తాడు. లోపలికొచ్చి, మూలాధారం వరకు వెళ్తాడటండి. ప్రవేశించి, అన్ని శుభ్రంగా ఏరి పారేస్తాడు – పుచ్చులు, చచ్చులు, బొద్దింకలు, ఈగలు, దోమలు, చచ్చిపోయిన ఎలుకలు అన్ని ఉంటాయి కదా! చచ్చిపోయిన ఎలుకలు అంటే తీవ్రమైన కోరికలు – వాసన కొడ్తూ ఉంటాయి లోపల. లోపలికొచ్చి ఇలాంటివన్నీ ఖాళీ చేసేస్తాడు. మీకు తెలీదుగాని, సద్గురువు చాలా చాకిరీ చేస్తాడు. అంతా మనమే వెలిగిపోతున్నాం అని అనుకోబోకండి. ఆయన మనకి ఎంత చాకిరీ చేశాడో మనకే తెలియదు, అట్లా చేస్తాడు. అంతా అయిపోయి, చిట్టచివరికి పరీక్ష pass అయినప్పుడు అప్పుడు తెలుస్తుంది మొదటి నుంచి గురువు ఎంత

చాకిరీ చేస్తే మనం పరీక్ష pass అయ్యామో. Moderation మార్కులు కూడా వేసినట్టు కనిపిస్తుంది గురువుగారే! ఎందుకంటే, దేవుడితో మాట్లాడి, "ఒక రెండు మార్కులు కలపవయ్యా బాబు! ఇంక అంతకన్నా వాడి వల్ల కాదు. నా వల్ల కావట్లేదు" అని కూడా చెప్తాడు. ఎందుకు వస్తుందండి moderation? టీచర్లు చెప్పినా students రాయలేకపోతున్నారు. ఇంకా చెప్తారు, అయినా రాయలేదు. Percentage of pass తక్కువుగా ఉంది. Teacher "ఏదో రెండు మార్కులు వెయ్యండి sir. బతికిపోతారు" అని చెప్తారు కదా! అట్లా మన కోసం సద్గురువు కూడా దేవుడితో బేరాలు ఆడుకుంటూ ఉంటాడు. తను చేయగలిగినంత చేసి, ఇంతకన్నా వీడిలో చేయటానికి వీలు పడదని తెలిసి, ఇంక ఇక్కడ వదిలేసి, అక్కడ పట్టుకుని, అక్కడ వాడికి చెప్తాడు. He is an arbitrator between the divine and the disciple. That is the Master. That is the teacher. That is sadguru. సద్గురువు చేసేటువంటి చాకిరీ మనకి తెలియదు. ఏదో మనం చాలా చేస్తున్నాం, ఈయనేదో ఉలకట్లేదు, పలకట్లేదు అని మనం అనుకుంటాము. మనకి తెలిసి చెయ్యడు. "అన్నీ నీకు తెలిసే చెయ్యాలట్రా! బోడి!" అన్నట్టుగా ఉంటుంది. "బోడి! నీకెందుకురా! నీకేం తెలియాలిరా!" అని అనేవారు కదా మాస్టరు గారు! నీ బొంధ! నీకేం తెలుసు? నీకు తెలిసే లోపల పనిఅయిపోతే సరిపోతుంది కదా!

ఇలా లోపలికి ప్రవేశించి, మన లోపల ఉండేవన్నీ ఎన్నెన్ని మారుస్తారండి! నిన్న పొద్దున అక్కడ మోగుతుంటే చెప్పాను కదా "key frame good" అని! ఈ మొత్తం రూపం అంతా మార్చేస్తారు లోపల. పాలు, పెరుగు అయిపోతుంది. పెరుగు, వెన్న అయిపోతుంది. అలా అయిన తర్వాత కాని తెలియదు "ఓహో! ఇలా జరిగింది. మరి మనకు తెలియకుండా ఎలా జరిగింది?" అని. మనకు తెలియకుండా ఎలా జరిగిందంటే, సద్గురువు నీకు నొప్పిలేకుండా, నీకు నోటీసులు ఇవ్వకుండా చేయిస్తూ ఉంటాడు. ఎందుకని నువ్వు పిలిచావు? పిలిస్తే, పనివాళ్ళ కన్నా బాగా చేస్తాడండి పని సద్గురువు మనకు. అందుకే పుట్టాడుట. "నిజ సేవకానుసారిన్" అంది కదా ఇంతకుముందు! తనని సేవించే వాళ్ళకి సేవకుడిలా పని చేసి పెడతాడు. అర్జునుడు చేసే యుద్ధంలో అసలు దెబ్బలన్నీ ఆయనే కదండి తింటూ ఉంటాడు! అలా లోపలికి వెళ్ళి, ఒక సద్గురువు ఎన్నో రకాలుగా జీవుడిని సంస్కరించి, దైవానికి "చూడు మా candidate ఎలా ఉన్నాడో!" అని చూపిస్తాడు. "చూద్దాం! ఈ పనిలో పెట్టు, ఆ పనిలో పెట్టు. వాడేం చేస్తాడో చూస్తాను" అంటాడు. అంటే, recommendation candidate కుదరదు. అలా శిక్షణ ఇచ్చుకొని, దైవానికి చూపించి, సద్గురువు "సభాష్!" అనిపించుకుంటాడండి. దైవం మెప్పుకి శిష్యుడిని బాగుచేసుకుంటూ ఉంటాడు గురువుగారు. ఆయన బాధలు మనకేం తెలియదు కదా!

ఎంతసేపూ "ఏం గురువు గారు! నాకింకా ఇది కాలేదు, నాకింకా అది కాలేదు". నీ గోల నీది, నా గోల నాది అన్నట్టుగా ఉంటుంది! గురువు గారి గోలేమో నీకు అమరత్వం ఇద్దామని. మన గోలేమో ఇంకో రూపాయి

వస్తే బాగుంటుందని, ఇల్లు కట్టుకుంటే బాగుంటుంది, అమ్మాయికి పెళ్ళైతే బాగుంటుంది, పెళ్ళైతే పిల్లలు పుడ్తే బాగుంటుంది. "పిల్లలు లేరండి మా అమ్మాయికి!" నీ పిల్లలైపోయింది, ఇప్పుడు నీ పిల్లలకి పిల్లలు! నీ పిల్లలకి పిల్లలు, ఆ పిల్లలకి పిల్లలు – ఇక ఈ యోగం ఎప్పటికయ్యేనండి! లోపల పుట్టాలి కదా! ఈవిడ పుట్టిన మనిషి. గుర్తుపెట్టుకోండి. తానుగా పురం నుంచి బయటకి రాగలదు అనే దాంట్లో ఒక విశేషమయమైనటువంటి అర్థమున్నది – నీకు ఆ బాధ అక్కర్లేదు. నేను బయటకి వస్తాను అని చెప్పింది.

"ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులున్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!"

చూడండి ఎలా చెప్పిందో! ఇంక చివరి stroke అనమాట అది. "ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై" – తమలో ఉండేటువంటి అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేసి, ఆత్మానుభూతి పొందాలనుకునేటువంటి మహాత్ములందరు కూడా "గౌరీశుమర్యాద" – అంటే గౌరీశుడు, శివుడు వలె అని అర్థం. "నె వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే" – గంగ నీరు విష్ణు పాదం నుంచి పుట్టిందని కదా! ఆ నీరు ఎక్కడ పడాలి అనేటువంటి పరిస్థితి వస్తుంది. "ఎక్కడో పడడమెందుకు, నా శిరం మీదే పడేటట్టుగా చూడు. నా శిరస్సు మీద పడి, ఆ తర్వాత భూమి మీద పడ్తే భూమి బతికి బట్టకడుతుంది" అని భగీరథుడుడికి శివుడు చెప్పాడు. అది తను శివుడి గొప్పదనం అది. గంగావతరణం ఆ కథ మనందరికి చూచాయిగా తెలుసు. అదీ ఇట్లా చదువుకుంటే చాలా ఉంటాయి అందులో. ఆ గంగావతారణ అప్పుడు శివుడు చాలా ముచ్చట పడ్డాడట, "విష్ణు పాదం నుంచి వచ్చినటువంటి నీరు కదా! నా నెత్తి మీద పడనీయి" అని. ఇలా ఉంటుంది శివ కేశవుల యొక్క అనుబంధం.

"నె వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే" – విష్ణుదేవుని పాదముల నుండి పుట్టినటువంటి పవిత్ర జలములతో మునగాలనేటువంటి వాంఛ కలిగి ఉంటారట. అది ఒక మహా చైతన్య స్రవంతి, ఆకాశగంగ. మనం ఒక గాయత్రి మంత్రం చేస్తుంటే, అలా మహా చైతన్యం దిగి వస్తుందండి – భర్గో దేవ మండలం నంచి, సవితృ మండలం నుంచి, సూర్యమండలం నుంచి, నీ శిరస్సులోంచి అలా నీలోకి దిగి వచ్చి, నీ హృదయమంతా కూడా ఒక పెద్ద సరస్సుగా ఏర్పడుతుంది. చెయ్యటంలో స్ఫూర్తి కావాలి. స్ఫూర్తి

లేకపోతే మిగతావన్నీ వస్తాయి. స్ఫూర్తి ఉంటే గాయత్రి చాలు. మనం చేసేవాటిలో ఒక్కటి చాలు –"ఓం" చాలు, గురుప్రార్థన చాలు, గాయత్రి చాలు – దేనికదే పరిపూర్తి.

అలా అందరు వాంఛిస్తారు కదా! నీ యందు నాకున్నటువంటి ఆత్మీయ భావము ఇంక నువ్వులేకపోతే ఇది ఒక "యనుకంపన్" ఆవిడకి. "అనుకంపన్" అంటే ఇంక తాళలేనటువంటి స్థితి. "తందానాలతో పొద్దు పోవలెనా తాళజాలరాదు జాగేలరాదు" అని త్యాగరాజుస్వామి రాస్తాడు. "ఇంక చాల్లే! ఇంక నా వల్ల కాదు", ఇట్లా కబురుపెట్టింది. "విలసింపనేనినీ" – నేను నీ దగ్గరగా. "వ్రతచర్యన్" – నేను వ్రతదీక్ష తీసుకుంటాను, ఈ గాడిదెకు దొరికే ప్రశక్తే లేదు. "వ్రతచర్యన్ నూఱుజన్మంబులున్ నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!" – వంద జన్మలయినా నీ గురించే తపస్సు చేసి నిన్ను పొందుతాను తప్ప...

పార్వతీదేవీ అలాగే చేసింది తపస్సు. ఎంతెంత తపస్సులు చేస్తే దొరుకుతారండి అలాంటి వాళ్ళు! సప్తధాతువుల్లోంచి ఓజస్సు పుట్టించి, ఆ ఓజస్సులో కూర్చొని తపస్సు చేసి, ఆ తపస్సు లోంచి అట్లా ఒక్కొక్క స్థితి పొందుతూ... లలితా సహస్రనామంలో వరసగా పదహారు నామాలుంటాయి. ఇలాంటి వాళ్ళని మనం అందుకోకపోతే ఇంక ఎవరిని అందుకుంటాం అనే పరిస్థితి శివుడికి కలిగింది. ఎందుకంటే, ప్రపంచము మీద శివుడు అప్పటికే విసిగిపోయి ఉంటాడు. దక్షయజ్ఞంతో విరక్తి వచ్చేస్తోంది. అసలే వైరాగ్యం ఆయనకి. అలా ఉన్నప్పుడు ఒకావిడ వచ్చింది. నాతో నీకు వద్దని చెప్తూ ఉంటాడు శివుడు. ఎందుకంటే అది అగ్ని. అయినప్పటికీ, పెట్టుకుంది సతీదేవి. అదేదో ఒక tragedy అయిపోయింది. సరే, ఆ tragedy అవ్వగానే మళ్ళీ ఇంకో ఆవిడ తయారైంది. ఆవిడే ఇలా వచ్చింది. వస్తే, once beaten twice shy కదా! వద్దంటాడు. విష్ణుమూర్తి, బ్రహ్మదేవుడు, ఋషులు వీళ్ళెవ్వరు శివుడి దరిదాపుల్లోకి రాటానికి కూడా బయపడతారు. అటువంటి అగ్ని తేజస్సది. మరి ఎలాగో అలా అమ్మవారు... ఆవిడ మహా పర్వతానికి పుట్టినటువంటిది. హిమవత్ పర్వత పుత్రి కదా! హిమవత్ పర్వతం అంటే భూమి మీదే పెద్ద పర్వతం, ఎంతో స్థిరమైనటువంటిది పార్వతి, నగజ. నగమంటే కదలనిది, స్థిరమైనటువంటిది. భక్తిలో స్థిరత్వానికి పార్వతీదేవే చెప్పుకోవాలి. అలా ఇక్కడ అమ్మవారు చెప్తోంది – వంద జన్మలైనా సరే! నువ్వు అందుకోకపోతే, నేను వెంటనే దేహం వదిలేస్తాను, మళ్ళీ వ్రతం చేస్తాను. మళ్ళీ అందుకోవు, మళ్ళీ వదిలేస్తాను. మనం కూడా అదే చేయాలి. ఈ జన్మకి అవ్వలేదు, పై జన్మకి కూడా ఇదే చేస్తాను. ఆ జన్మకీ అవ్వలేదు, ఆ పై జన్మకీ అదే చేస్తాను. ఎన్ని జన్మలైనా సరే నిన్నే పొందుతాను తప్ప, ఇంకోటి పొందాలనేటువంటి ఆసక్తి లేని స్థితి ఎవరికైతే ఉంటుందో వారిని భక్తులు అంటారు. అంచేత, ఆ విధంగా చేస్తాను సుమా అని చెప్పింది.

"ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని
కర్ణరంధ్రబులకలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని
తనులత వలని సౌదర్య మేల
భువనమోహన నిన్ను బొడగానఁగా లేని
చక్షురింద్రియముల సత్త్వ మేల
దయిత నీయధరామృతం బానఁగా లేని
జిహ్వకు ఫలరససిద్ధియేల"

మనక్కూడానండి, ఏదో ప్రార్థన చేస్తాం, ఎక్కుతూ ఉంటుంది. ఎన్నాళ్ళు పోయినా, ఒక వినపడడంగాని, ఒక కనపడడంగాని లేకపోతే దుఃఖం రావద్దండి! ఇవాళ్ళ ప్రార్థన, కానీ నాకు ఏ విధమైన అనుభూతి లేదు, ఒక వినపడింది లేదు, ఒక కనపడింది లేదు, ఒక అనిపించింది లేదు, ప్రార్థన అయింది. బాధ రావద్దండి? నిక్కచ్చిగా చెప్పండి. అది ప్రార్థన ఎట్లా అవుతుంది? ఒక గంట సేపు ఒక ప్రార్థన చేస్తే, ఒక పూజ చేస్తే, లోపల ఏమి వినిపించలేదు, ఏమి కనిపించలేదు, ఏమి అనిపించలేదు. ఏడుపు రావద్దండి! దుఃఖం రావద్దు! ఏడిస్తే బాగుండదని బయటకి ఏడవంగాని, లోపల ఏడవద్దా! లోపల వినిపించాలి చెవులకి. లోపల కనిపించాలి కన్నులకి. లో స్పర్శ తెలియాలి చర్మానికి. లోపల దివ్య సాన్నిధ్యం కలిగినప్పుడు వచ్చే సుగంధములు వాసన చూడగలగాలి ముక్కు. లో రుచులు పొందాలి నాలుక. అలా నీకు తయారు కాకపోతే ఎందుకు అంటోంది ఆవిడ.

"ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులకలిమి యేల" — ఇంక దానికి ఎన్ని రవ్వదుద్దులు పెట్టినా ఏం ప్రయోజనం చెప్పండి! "పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని తనులత వలని సౌదర్య మేల" — ఎందుకండి ఆ శరీరం? ప్రహ్లాదుడు కూడా ఇలాంటి పద్యాలు చెప్తాడు, "కన్యాక్షునకు కాని కాయంబు కాయమే, తరణ సలిల బుద్ధి" — ఊరికే ఇట్లా నీళ్ళతో నిండినటువంటి ఒక సంచి లాంటిది, ఒక బుడగలాంటిది. అందులో ఆయన ఉంటే, అందులో ఆయన మాట్లాడుతుంటే, ఆయనే నడిపిస్తూ ఉంటే ఆనందం. లేకపోతే, ఎందుకీ శరీరం waste అని భక్తుడికి అనిపిస్తుంది. ఎంత సౌందర్యంగా ఉంటే ఏమిటి శరీరం? రుక్మిణీ కన్నా సౌందర్యవంతులు లేరు. అలాంటి ఆమె చెప్తోంది, "ఎందుకీ సౌందర్యం నాకు?" అని. తనులత లతట, తీగలాంటి శరీరమండి. మనమో! వద్దులేండి ఎందుకొచ్చింది! అయినప్పటికీ, ఆయన లోపలికి వస్తాడట, విశాలంగా ఉందని! ఎంత లావుగా ఉంటే అంత పెద్ద ఇల్లు లాగా ఉంటుంది కదా!

"నీవు పొందని జన్మంబు" అని చెప్పి చెప్పాను కదా నిన్న! భక్తులకలా ఉంటుంది – దైవానుభూతిని ఇవ్వకపోతే ఇదంతా waste, నా చూపు waste, నా చేయి waste, నా ముక్కు waste. "భువనమోహన నిన్ను బొడగానఁగా లేని చక్షురింద్రియముల సత్త్వ మేల" – నిన్ను చూడలేనటువంటి కన్నుల యొక్క గొప్పతనం ఏమిటి? ఆ కళ్ళు ఉండి ఏమి ఉపయోగం? వాటిని చూసి మురిసిపోడానికి ఏముంది అక్కడ? మురిసిపోవటానికి ఏమి లేదు. "దయిత నీయధరామృతం బానఁగా లేని జిహ్వకు ఫలరససిద్ధియేల" – నీ పెదవుల యొక్క అమృతాన్ని కోరలేనటువంటి జిహ్వ అనవసరం.

"నీరజాతనయన! నీ వనమాలికా
గంధమబ్బలేని ఘ్రాణ మేల
ధ్యనచరిత! నీకు దాస్యంబు సేయని
జన్మమేల యెన్ని జన్మములకు."

లోపల కృష్ణుడు అలా త్రిభంగియై చూస్తూ, నీలమోహన, నీలమేఘశ్యాముడై, చక్కగా నవ్వుతూ, ఇలాంటి సంపెంగ దండ లోపల వేస్తున్నాడనుకోండి... లోపల అలాంటి వనమాలి. వనమాలి ఎప్పుడూ ధరించి ఉంటాడు. లోపల వనమాలి ఉంటే నీకు వాసన తెలియట్లేదా! బాగా కృష్ణ ధ్యానం చేస్తే, లోపల ఇల్లంతా తులసీ దళాలతో నిండిపోయినంత వాసన వస్తుంది. ఎందుకని? ఆయన తులసీ దళము నందు ప్రీతి కలిగినంటివాడు. తులసీ దళములు ఎప్పుడివి? నాలుగు రోజులు fridge లో పెట్టి, వేసుకున్నవి కావు. అప్పటికప్పుడు చెట్టునుంచి కోసిన పువ్వులకను, నాలుగు రోజులు fridge లో పెట్టిన పువ్వులకను చాలా తేడా ఉంటుంది. మనకి దరిద్రంగా ఉన్నప్పుడు అట్లా fridge లో పెట్టుకొని, ఇంక రేపు మాడిపోతాయి అనుకొనేవి ఇవాళ్ళ దేవుడికి పెడుతూ ఉంటాం కదా! లేకపోతే అది వాడిపోతుంది, మనం కొన్నాం, మనకి డబ్బుల ఖర్చు! ఇదే గోల తప్ప, దేవుడికి ఓ మంచి పువ్వు పెడదాం, వాసన ఉండే పువ్వు పెడదాం అని ఉండదు కదా!

సువాసన లేని పుష్పము పూజకి పనికి రాదు. ఆ పుష్పాలు ఎంత స్వచ్ఛంగా ఉండాలి? ఎంత నిర్మలంగా ఉండాలి? అది మన దరిద్రం కొద్దీ అవి అట్లా ఉంటే, మరి అటువంటి పువ్వులన్ని మూడు రోజులు, నాలుగు రోజలు, వారం రోజులు... మా బోటివాళ్ళు బెజవాడ, రాజమండ్రి వస్తే, ఒక గంపెడు పూలు తీసుకెళ్ళి, ఆ పూలే ఒక వారం రోజులు పూజ చేసుకుంటూ ఉంటాం. ఎందుకంటే, మా ఊళ్ళో అలాంటి పువ్వులు దొరకవు. భగవంతుడు "ఏరా! న్యాయమేనా ఇది?" అని అడిగితే ఏం చెప్తారు? ఎందుకురా! ఒక ఆకు తీసిపెట్టు. పత్రం, పుష్పం, ఫలం, తోయం – ఇన్ని ఉద్ధరిణి నీళ్ళు పోయరా! అది కూడా fridge లోంచి తీసి పోయకు! fridge

లో నీళ్ళు, mineral water నాకు అక్కర్లేదురా! అప్పటికప్పుడు భూమిలోంచి పుట్టినటువంటి నీళ్ళు ఒక చక్కని మేలిమితో కూడి ఉంటాయి. అది పోయి, అది చాలు నాకు. లేదు, మొక్కకి పూలు లేవు, అలాంటి ఊరు, అలాంటి నెల అది. అప్పుడు ఆకులు పెట్టు. ఏం! ఆకులతో అందంగా అలంకరించుకోకూడదా! శివుడు చాలా కరుణామయుడు. ఆయనకి పాపం మన బాధలు తెలుసు. ఈ పూల కోసం వీళ్ళేం బాధ పడతారులే, అందుకని బిల్వపత్రం నాకు అన్నిటికన్నా చాలా ఇష్టం అని చెప్పేసాడండి. ఒక బిల్వపత్రం పెట్టి, కోటికన్యా ఫల దానం అని చదువుతూ ఉంటాం కదా! నాకే డోకు పుడుతూ ఉంటుంది! ఎందుకంటే, ఒక ఆకేసేసి, ఒక కోటి కన్యలు మనం దానం చేసినటువంటి ఫలం పొందాలంట! అంత ఆశపరులమండి మనం! భయంకరం కదా! చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. అంటే, బిల్వపత్రమైనా సరే... అది కూడా మనం ముందు రోజు కోసేసి, fridge లో పెట్టి, మరునాడు దేవుడికి పెడితే, నా దృష్టిలో అది భక్తి కాదు. భక్తి చాలా పెద్ద రసవత్తరమైన subject అది. ఆయన బిల్వపత్రం అడగడు, నీళ్ళు అడగడు, లింగం పెట్టమనడు. నువ్వు పెట్టుకున్నావు. నువ్వు పెట్టుకొని, సవ్యంగా చేసుకుంటే నీకు అనుగ్రహం. పెట్టిన గంటలో వాడిపోయే పూవులు... నిన్ననే నీళ్ళు పోసేస్తాం గంధంలో. బొట్లు పెడతాం, అది మిగిలిపోతుంది. మళ్ళీ దాంట్లోనే నీళ్ళు పోసి, తీసి మళ్ళీ పెడతామా! గంధంలో నీళ్ళు పోసినప్పుడే గంధం సువాసన వస్తుంది. మళ్ళీ ఇంకోసారి గంధం పెట్టాలంటే, గంధం పొడిలో నీళ్ళు పోయాలి. అసలు న్యాయం చెప్పాలంటే అప్పటికప్పుడు తియ్యాలి గంధం. మా తాతలు, తల్లులు అట్లా తీసుకునేవాళ్ళు గంధం. స్తోత్రం చేసుకుంటూ గంధం చేసుకోవచ్చుగా! “మీకేం సార్! చాలా చెప్తారు.” చెప్పేవాడికేం! బోల్డు చెప్పచ్చు కదా! ఏది టైము! ఒక రాయి పడేసి, ఒక గంధం చెక్క ఇస్తే, అట్లా గంధం తీస్తారు. గంధము చల్లదనాన్ని ఎవరికి? దేవుడికి కాదు మనకి! ఆయనకి సుగంధం మనం సమర్పిస్తే, మనకి చల్లదనం. మరి ఇవన్నీ ఏం తెలుసండి? ఏం తెలీదు కదా! భక్తి అంటే ఎట్లా? అక్కడ ఒక సజీవమైనటువంటి రూపం, దేదీప్యమానంగా ఉందనుకొని, చాలా వినమ్రతతో, భక్తితో, శ్రద్ధతో, ఆర్ద్రతతో పూజ చేస్తే, స్తోత్రం చేసేడప్పుడు కళ్ళు మూసుకుంటే, నవ్వుతూ కనిపిస్తాడు. లేదు జరిగేది చూడలేక, “అపచారం స్వామి! మరి ఇంతకన్నా నా వల్ల కాదు” అని కళ్ళు మూసుకొని ఒకసారి ఏడ్చేసి, స్తోత్రం చేస్తే, “ఆ! ఫర్వాలేదు. ఏం చేస్తాం! కలియుగం కదా! సరిపెట్టుకుంటానులే” అంటాడు దేవుడు. అలా ఉంటుంది. ఆయన అన్నీ సరిపెట్టుకుంటాడు. ఆయన సరిపెట్టుకుంటాడని మనం సరిపెట్టకూడదు. సత్పురుషుడు, సజ్జనుడు ఎప్పుడూ అన్నీ అట్లాగే సరిపెట్టుకుంటూ ఉంటాడు. అపచారం చేసినా సరిపెట్టుకుంటాడు కదా!

అంచేత, ఆవిడ అడుగుతోంది, “నీకు దాస్యంబు సేయని జన్మమేల యెన్ని జన్మములకు” – నీకు దాస్యం చేసే జన్మమే నాకు కావాలి. ఎన్ని జన్మలైనాసరే నీకు దాసుడుగా ఉంటే చాలు. దాసుడికుండే అదృష్టం మిగతా

వాళ్లకి లేదు. ఆంజనేయస్వామి ఉన్నారు కదా! భగవంతునికి దాసునిగా ఉండంలో ఉండేటువంటి ఆనందం ఇంక దేంట్లోంచి రాదు.

"అని యిట్లు రుక్మిణీదేవి పుత్తెంచిన సందేశంబును రూపసౌందర్యాది
విశేషంబులును బ్రాహ్మణుండు హరికి విన్నవించి కర్తవ్యం బెద్ది సేయ
నవధరింపు మని సవిరణగా మఱియు ని ట్లనియె."

"పుత్తెంచిన" అంటే సందేశమిస్తే. అంటే, గురువుగారు ఒక annex పెట్టాడు. ఆవిడ చెప్పాల్సింది ఇలా చెప్పింది అని చెప్పి, ఆయన చెప్తున్నాడు ఇప్పుడు.

"పల్లవ వైభవాస్పదములు పదములు
కనకరంభా తిరస్కారు లూరు
లరుణప్రభా మనోహరములు కరములు
కంబుసౌందర్య మంగళము గళము
మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు
చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసి తార్ధేందు పటలంబు నిటలంబు
జితమత్త మధుకర శ్రేణి వేణి"

"భావజాశుగముల ప్రాపులు చూపులు
కుసుమశరుని వింటి కొమరు బొమలు
చిత్తతోషణములు చెలువ భాషణములు
జలజనయనముఖము చంద్రసఖము."

ఎందుకంటే, ఆమె తరుపున ఈయన వకాల్తా పుచ్చుకుంటాడు. గురువుగారు కదా! నువ్వేదో తమాషాగా అనుకుంటున్నావేమో! ముఖం చూస్తే చంద్రుడిని చూడక్కర్లేదు. అన్నీ చెప్పనులెండి, ఎంచేతంటే మనకి ఇక్కడ స్త్రీ మూర్తి ఉన్నారు కాబట్టి కొన్ని చెప్తాను. ముఖం చూస్తే చంద్రుడ్ని చూడక్కర్లేదు. "చిత్తతోషణములు చెలువ భాషణములు" – మాట్లాడుతుంటే చెవులకి ఎంతో ఇంపుగా ఉంటుందట. పెళ్ళైయ్యంత వరకు ఇంపుగా ఉండి, ఆ తర్వాత కంపుగా ఉంటుంది మామూలుగా చాలా మందికి! "చిత్తతోషణములు" అలా వింటూ ఉంటే అట,

అస్సలు ఎంత ఆనందం కలుగుతుందంటే ఇంటావిడ మాట్లాడకపోతే బాధ కలుగుతుందట! అట్లా ఉంటాయి మాటలు. ఇంక చాల్లే అన్నట్టుగా ఉండవు. అలా వినకుండా తప్పించుకునేట్టుగా ఉండవు. రుక్మిణీదేవి ఎంత బాగా మాట్లాడుతుందో తెలుసా, విన్నావో నీ చిత్తం అలా ఆనందంలోకి వెళ్ళిపోతుంది. పద్యం వెనకనుంచి వస్తున్నాను.

"కుసుమశరుని వింటి కొమరు బొమలు" – మన్మధుల యొక్క బాణాల్లాగా ఉంటాయటండి ఆవిడ యొక్క కనుబొమ్మలు. చూడంగానే కనుబొమ్మలే చాలా ఆకర్షణీయంగా ఉంటాయట. తర్వాత కనులు? మన్మధునికి ఆశ్రయం ఇచ్చేట్టుగా ఉంటాయట. అలాంటి కన్నులు. అమ్మవారి కన్నులు మన్మధునికి ఆశ్రయం ఇస్తాయట. ఆమె కుమారుడేగా మన్మధుడు! అలాంటి కన్నులున్నాయి, చూసుకో! అని చెప్తున్నాడు కృష్ణుడికి. అలాగే మిగతా దేహ సౌందర్యమంతా కూడా చాలా చక్కగా వర్ణిస్తాడు. వర్ణించి, ఇలాంటి కన్య ఎక్కడా ఉండదని తెలియపరుస్తాడు. తెలియపరిచి,

"ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనకుం దగు దీవు మాయుపా
ధ్యాయుల యాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము లేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తో యరహోననఁ దెత్తు గాని వి
చ్చేయుము శత్రులన్ నుఱుముసేయుము చేయుము శోభనం బిలన్."

నీకు సరిపోయినటువంటి కన్య ఆ అమ్మాయి. "అంగనకుం దగు దీవు" – ఆవిడకి నువ్వే సరైనటువంటి పతి. నీకు ఆమెయే సరైనటువంటి సతి. "ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనుకుం దగు దీవు మా యుపాధ్యాయుల యాన" అన్నాడు. మా గురువు గారు మీద ఒట్టు వేసి చెప్తున్నాను అన్నాడు. ఈయనే ఇట్లా ఉన్నాడంటే ఇంక ఈయన గురువుగారు ఎట్లా ఉంటాడో కదా! ఈయనకి ఎంత సేవ చేస్తాడు కృష్ణుడు! ఎందుకు చేశాడో కూడా చెప్పాడు కదా! ఎలాంటి వాడివో నువ్వు నాకు తెలిసిపోయింది అన్నాడు కదా! నువ్వేమడిగినా చేస్తాను అన్నాడు కదా! అందుకని చెప్తున్నాడు. "మా యుపాధ్యాయుల యాన పెండ్లి యగు" – ఇద్దరికి పెళ్లి అవుతుంది. తప్పదు. భవిష్యవాణి చెప్పేసాడండి. "జాడ్యము లేల" – ఎందుకు ఆలస్యం చేస్తావు?

"శోభనం బిలన్" అన్నాడు. భూమి మీద ఒక జగత్కల్యాణమైనటువంటి ఒక కార్యాన్ని నిర్వర్తించు. ఆమెను నువ్వు వివాహం చేసుకోవటం జగత్ కల్యాణం. అంతేకాదు గుర్తుపెట్టుకోండి, సాంప్రదాయబద్ధంగా ఒక వివాహం జరిగితే అది జగత్ కల్యాణమైన తోడ్పడుతుంది. అది మన వివాహక్రతువులో ఉన్నది. సంస్కారవంతమైనటువంటి ఒక పద్ధతుల్లో వధూవరులు వివాహం చేసుకుంటే దాని వలన జగత్తుకు చాలా శుభం జరుగుతుంది. అలాంటిది ఇలాంటి రుక్మిణీకృష్ణుల వివాహం జరిగితే అది జగత్తుకు కల్యాణంగా

ఉంటుందని చెప్పడంలో పెద్ద ఆశ్చర్యమే లేదు. ఈయన అన్నాడు, తొందరగా మీ వారిని తీసుకొని నువ్వు వచ్చి, "శత్రులన్ నుఱుముసేయుము" – పొడి పొడి చేసేయ్ శత్రువులందర్ని. "సేయుము శోభనం బిలన్" – భూమి మీద ఒక అత్యంత శుభమైనటువంటి ఒక కార్యం నిర్వర్తించు. ఒక జీవుడిని ఒక దైవం అనుగ్రహించడం, అది భూమికే ఒక అద్భుతమైనటువంటి సందర్భం. ఒక మనిషి మహాత్ముడయితే అది భూమంతా సంతోషించేటువంటి ఒక సందర్భం. ఒక్క మనిషి మహాత్ముడైతే! మహాత్ముడవడం అంటే భగవంతునిచే పొందపడిన వాడైతే. అలా అయితే the entire planets celebrates అని రాస్తారు పరమగురువులు. భూమి, భూమ్మీద ఉండేటువంటి ఋషులు, అందరూ పండగ చేసుకుంటారటండి, మనం birthday celebrate చేసుకున్నట్టు! ఎంత అద్భుతంగా celebrate చేసుకుంటారోట. Prophecy is fulfiled. ఎందుకంటే, ఈ మనవ జాతిలో ప్రతి ఒక్క మానవుడు దైవాన్ని చేరినప్పుడల్లా కూడా అది భూమి పులకరించేటువంటి ఒక సన్నివేశం. అందుకని, ఆ ఇలాంటి శోభనం అందచేయి ఆమెనందుకొని. ఇందులో రెండు రకాలు: కన్యగా ఆమె పొందదగినటువంటిది కల్యాణం జరగటం వల్ల శుభం. రెండవది జీవిగా పరమాత్మ అనుగ్రహం పొందినటువంటి సందర్భంలో జగత్ కల్యాణం జరుగుతుంది.

> "అని యిట్లు పలికిన బ్రాహ్మణునివలన విదర్భరాజతనయ పుత్తెంచిన
> సందేశంబును రూప సౌందర్యాది విశేషంబులును విని నవధరించి
> నిజకరంబున నతని కరంబు పట్టి నగుచు నయ్యాదవేంద్రుం డి ట్లనియె."

చెప్పినవన్నీ చాలా ఓపిగ్గా, ఉత్సుకతతో విన్నాడండి కృష్ణుడు. బ్రాహ్మణుడు చెప్పే ప్రతిమాట చాలా ఉత్సాహంగా విన్నాడు. ఎందుకని? ఆమెను వివాహం చేసుకుందామని తను అనుకోవటమైనటువంటిది ముందు చదువుకున్నాం కదా! తను ఎవర్నైతే వివాహం చేసుకుందామని అనుకుంటున్నాడో ఆమె పంపించినటువంటి సందేశము తనకి ఎంత కర్ణ ప్రియంగా ఉంటుందండి! మనం ప్రేమించిన అమ్మాయే మనకి కబురు పెట్టింది, "ఎలాగైనా సరే నన్ను పెళ్లి చేసుకో. నువ్వు పెళ్లి చేసుకోకపోతే నేను బతకలేను" అని. మామూలుగా చూస్తే, అంతకన్నా ఏం కావాలండి ఎవరికైనా! రుక్మిణీదేవి చెప్పినట్లుగా ఇంతలా ఎవరు చెప్పరు అనుకోండి! కృష్ణుడు అంతకు ముందే నిర్ణయం చేసుకున్నాడు. ఎందుకని? ఆమె ఏ విధంగా కృష్ణుడి గురించి విన్నదో, కృష్ణుడు కూడా ఆమె గురించి విన్నాడు. అప్పుడే అనుకున్నాడు. ఇప్పుడు ఈయన వచ్చాడు. ఎన్నో విషయాలు చెప్పాడు. నిన్నటినుంచి నుంచి చెప్తూ వస్తున్నాడు కదా! అని విన్న తర్వాత ఆయన చేయి ఈయన చేతిలో పెట్టుకున్నాడు. అది ఎంత అదృష్టం ఆ బ్రాహ్మణుడికి! అన్నాడు.

"కన్నియమీద నా తలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదుం బరులమూఁక వధించి కుమారిఁ దెత్తు వి
ద్వన్నుత! ప్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చు కైవడిన్."

నాకు రుక్మిణీదేవి పైన చాలా గాఢమైనటువంటి తలంపు ఉంది అని చెప్పేసాడు. "కూరుకు రాదు" – నిద్ర రావడం లేదటండి ఆయనకి! అంటే confidential గా చెప్పాడు, చేతిలో చేయేసుకుని చెవిలో చెప్పినట్టు! ఏరోజు రాత్రి నిద్ర రావట్లేదుట, ఈవిడే గుర్తుకు వస్తోందట. "నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు" – తెలయందేముంది! బావమరిది మూర్ఖుడు, మావగారు మూర్ఖుడు, ఏం చేస్తావు! అప్పుడే పుట్టినటువంటి అగ్ని భయంకరంగా దహించేస్తుందో అట్లా, ఈ మూకనంతా దహించేసి... ఆమె ఎనిమిది పద్యాలు చెప్తే, ఈయన ఒక్క పద్యంలో ఇదెందుకు స్వామి, నేను అందుకే చూస్తున్నాను, పద పోదాం అని రథంలో వేసుకుని వెళ్ళిపోతాడు.

"వచ్చెద విదర్భ భూమికిఁ
జొచ్చెద భీష్మకుని పురము సురుచిరలీలం
దెచ్చెద బాలన్ ప్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్."

మెరుపులా వచ్చేస్తాడు. చదువుకుంటే ఇలాంటి పద్యాలు చదువుకోవాలండి, జన్మ తరిస్తుంది. లోపల సంస్కారాలు పెరుగుతాయి, కల్మషాలు కరుగుతాయి. అడ్డం వచ్చిన వాళ్ళందరిని కూడా మరి చిత్తకొట్టేస్తాను. చీరేస్తాను అందర్ని. ఏం చేస్తాడు? "దెచ్చెద బాలన్ ప్రేల్మిడి" – వేలు ఇచ్చి ఆమెను తీసుకొచ్చుకుంటాడటండి. నా చెయ్యి పట్టుకో. నేను తీసుకొచ్చేస్తాను. వచ్చిన వాళ్ళందర్ని చెక్కేస్తాను.

ఇది కూడా మరి ఆత్మపరంగా చాలా అద్భుతమైనటువంటి వైభవం. ఎంత భక్తుడు భగవంతుడి గురించి ఆరాటపడుతుంటాడో, అంత భగవంతుడు కూడా భక్తుడి గురించి ఆరాటపడుతూ ఉంటాడు. తన వాళ్ళు తన దగ్గరికి రావాలని కోరుకోరండి తండ్రి! "వద్దామనుకున్నాను నాన్నా! విమానం... ఏమిటో! airlines. Technical defect sir! late అయింది." అని చెప్తే, "ఫర్వాలేదు నాన్న! జాగ్రత్తగా ఉండు" అని చెప్తుంటాడు ప్రతి తండ్రి. ఏవేవో అడ్డు వచ్చేస్తుంటాయి కొడుక్కి తండ్రి దగ్గరకు రావడానికి. తండ్రి సహాయం చెయ్యడా? తన దగ్గరికి వద్దామనేటువంటి కుమారిడికి ఆ తండ్రి సహాయం చేస్తాడా, చెయ్యడా? ఏదో అంతా మనదే కష్టం

అనుకుంటాం మనం. కాదు. మన కష్టం మనం ఏర్పాటు చేసుకున్నదే. ఆయన ఇవన్నీ ఎలా చూడగలడో అలా చూస్తుంటాడు అక్కడనుంచి. "టికెట్ దొరకట్లేదు నాన్న" అంటే ఇటుపక్క open చేసేసి, ఈయనే బుక్ చేసేస్తాడు ticket, "నీకు ఫలానా flight లో seat దొరికింది. వచ్చేసెయ్యి" అని చెప్తాడు తండ్రి కదా! అటు నుంచి వాడు ఇబ్బంది పడుతున్నాడట అంటే, ఇటు కూర్చుంటాడాండి ఊరుకునే? కూర్చోడు కదా! అంతలా తాపత్రయ పడతాడు భగవంతుడు గుర్తుపెట్టుకోండి. మనకెంత ఆరాటం ఉంటుందో, అంతకన్నా ఎక్కువ ఆరాటం అటుపక్కన ఉంటుంది. నువ్వు ఒక్క అడుగు వేస్తే నేను పది అడుగులు వేస్తానురా అంటాడు. ఆ ఒక్క అడుగూ కూడా వెయ్యము మనం! ఆ ఒక్కటీ వెయ్యకుండా, వేసేసామని feel అయితే, నేను ఎట్లా చావను! ఇప్పటికే పది అడుగులు వేసేశాను, ఏడి అన్నట్లుగా ఉంటాము మనం! నువ్వు వెయ్యలేదురా! ఊరికే feeling లో ఉన్నావు అని చెప్తాడు! ఎంత బాగా చెప్తాడండి – "నాకు ఎప్పటినుంచో ఉంది. ఏనాడయితే ఆమె నా గూర్చిన భావన మొదలుపెట్టిందో ఆ నాటి నుంచి నాకు ఉంది." ఏనాడు మనస్పూర్తిగా భగవత్ ఆరాధనకని మనం సంకల్పం చేస్తామో, ఆనాటి నుంచి మన లోపలే సర్వసాక్షి అయి చూస్తూ ఉంటాడు, కావలసిన సహాయం చేస్తూ ఉంటాడు, నీలో ఉండేటువంటి సంసిద్ధతను బట్టి సద్గురువును కూడా పంపిస్తాడు. ఎన్ని రకాలుగా సహాయం చెయ్యాలని చూస్తాడో! అన్నీ అజ్ఞానంతో తోసిపుచ్చుతుంటే కూడా ఓపిగ్గా ఇంకా వేచి ఉంటాడు. సహాయం చెయ్యడానికి సంసిద్ధుడై ఉంటాడు.

"కన్నియమీద నా తలఁపు గాఢము కూరుకు రాదు" – ఆయనా నిద్రపోడు. భక్తుల విషయంలో భగవంతుడు నిద్రపోడు. చాలా అపారమైనటువంటి కరుణ కలిగినటువంటివాడు, ప్రేమ కలిగినటువంటివాడు. ఆయనకు మన ప్రార్థనలు తెలియబోవనుకోబోకండి. మన ప్రార్థనలో ఉండే శుద్ధి తెలియబోదనుకోబోకండి. భక్తి తెలియబోదనుకోబోకండి. అది ఆర్ద్రతతో చేస్తున్నావా, యాంత్రికంగా చేస్తున్నావా, యథాలాపంగా చేస్తున్నావా, అవన్నీ కనబడతాయి. ఎవర్ని మోసపుచ్చుదామని చేస్తున్నావు? నిన్ను మోసపుచ్చుకుంటావా?

ఎప్పటినుంచో నాకు ఆమె మీద కోరిక ఉన్నది. ఎందుకంటే, ఆమె పరిపూర్ణంగా, ఆమె చెప్పిన సమస్త విషయములు, ఈ ఎనిమిది పద్యములలో ఉండేవన్నీ కూడా అక్షర సత్యములు. అవి అక్షర సత్యములు అవ్వడం చేత, నాకు ఎప్పటినుంచో ఈమెను నేను చేసుకోవాని ఉంది, ఈమెను నేను దక్కించుకోవాలి ఉంది. ఈ భక్తుడిని నేను రక్షించుకుంటాను అని భగవంతుడు నిర్ణయం చేసుకుంటాడు. దానికి అడ్డువస్తూ ఉంటారు. ఒకరు భక్తి చేస్తుంటే అతడి పూర్వకర్మము, అతడి అజ్ఞానము, అతడి అహంకారము, అతడికున్న కోరికలు, అతనికున్న విముఖతలు, అవన్నీ అడ్డు వస్తాయండి. "ఇవి అడ్డు వస్తాయని తెలియాదా!" అంటున్నాడు. ఈ రోజున మనం భగవంతునికి సమర్పణ చేసుకుందాం అనేటటువంటి భావన చాలా గాఢంగా కలిగి, ఏదో ప్రారంభం

చేసామనుకోండి, మన లోపల ఉన్న దైవం అప్పుడు training మొదలు పెడతాడు. ఆ ప్రేరణ ఇచ్చేదే ఆయన. ఆ ప్రేరణ ఇచ్చిన తర్వాత, నీకు నీలో ఎన్ని అవరోధాలు ఉంటాయో – అజ్ఞానం, అహంకారం, కోరిక, విముఖత లేక ద్వేషము. అటుపైన ఇందులోనే శాశ్వతంగా ఉండి పోవాలనే కోరిక. ఇలా ఉంటాయి. మనకి మనలోనే అడ్డుపడేవి ఉన్నాయి. ఇవన్నీ నీకున్నటువంటి గాఢమైనటువంటి ఆసక్తి – దానినే fiery aspiration అంటారు, దాన్నే తపస్సు అంటారు – అలా ఉన్నప్పుడు, నీకు ఇవి అడ్డుపడుతూ ఉంటాయి కదా ఆ అడ్డుపడేవాటిని నిర్మూలించడానికి ఒకపక్క నువ్వు కృషి చేస్తుంటే, దైవం మరొక పక్కనుంచి కృషి చేస్తూ ఉంటాడు.

ఆమె రకరకాలుగా కార్యక్రమాలు, దానాలు, ధర్మాలు, వ్రతాలు, పెద్దలకి సేవలు, ఎన్నో చేసుకుంటూ వచ్చింది, ఎన్నో జన్మలనుంచి. చేసుకుంటూ రావడం చేత ఆమెకు బాగా దృఢమైన నమ్మకం కలిగింది. ఆమె చేసేటువంటి ఆ కార్యక్రమాల్లోంచి ఆమె ఉండేటువంటి దేహము విదర్భ అవుతుంది. దేహము విదర్భ కావాలి. విదర్భ అంటే చెప్పానుగా అత్యంత పవిత్రమైనటువంటి ప్రదేశము. నీవు చేసే అనంతమైనటువంటి పుణ్యకార్యముల చేత దేహం పవిత్రింపపడుతూ ఉంటుంది. భావనల చేత పవిత్రీకరింపబడుతుంది. సద్భాషణములు చెయ్యడం చేత పవిత్రీకరింపబడుతూ ఉంటుంది. సత్కార్యములు, సద్భాషణములు, సద్భావములు అలా జరుగుతున్నాయనుకోండి అప్పుడు ఈ శరీరం పవిత్రంగా పరిణమిస్తుంది. అలా పవిత్రీకరింపబడిన దేహం నీకు ఉన్నప్పుడు అప్పుడు నువ్వు విదర్భదేశంలో ఉన్నట్టు. అలా విదర్భదేశం వస్తాడు. "వచ్చెద విదర్భ భూమికిఁ" – అన్ని చోట్లకి కుదరదు. "జొచ్చెద బీష్మకుని పురము" – కుండినపురము ఉంది కదా, అంటే హృదయంలో ప్రవేశిస్తాను. ఎందుకని? భక్తుడు తన ఆరాధనా మార్గంలో హృదయం చేరువలోకి వస్తాడు. అలా రావడం చేత, "సురుచిరలీలం దెచ్చెద బాలన్ వ్రేల్మిడి" – హృదయంలో ప్రవేశించి, చెయ్యిచ్చి... అప్పుడైనా కాస్తోకూస్తో అవరోధాలు ఉంటే అక్కడ... నేను వచ్చేసాను కదా ఇంక! ఏ అవరోధం ఉన్నా వాళ్ళందరినీ చిత్తుచిత్తు కింద చిత్తకొట్టేస్తాను అన్నాడు. ఎంత బాగుంది చెప్పండి! రుక్మిణీకల్యాణము అలా ఉంటుంది!

> "అని పలికి రుక్మిణీదేవి పెండ్లినక్షత్రంబు దెలిసి దన పంపున రథసారథి
> యైన దారకుండు శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకంబులను తురంగంబు
> లం బూన్చి రథమాయత్తంబు చేసి తెచ్చిన నమోఘ మనోరథుండైన
> హరి తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి యేకరాత్రం
> బున నా నర్తకదేశంబులు గడచి విదర్భదేశంబునకుం జనియె నందుఁ
> గుండిన పురీశ్వరుం డైన భీష్మకుండు కొడుకునకు వశుండై కూఁతు

శిశుపాలున కిత్తునని శోభనోద్యోగంబులు చేయించె నప్పుడు."

రేపు వస్తాను, పై సంవత్సరం వస్తాను, ఇంకో పదేళ్ళ కొస్తాన్నని అన్నట్టుగా భగవంతుడు ఉండడు. పెండ్లి నక్షత్రంబు అడిగాడండి ఎప్పుడు పెళ్ళని. రేపే! అంచేత, ఏం చేసాడు? "పెండ్లినక్షత్రంబు దెలిసి దన పంపున రథసారథి యైన దారకుండు" – ఆయన రథసారథుడుని ధారకుండు అని పిలుస్తారు. రథాన్ని సిద్దంగా ఉంచమని చెప్పాడట. ఆ రథానికి ఎలాంటి గుఱ్ఱాలున్నాయి? శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకంబులను నాలుగు గుఱ్ఱాలు ఉన్నాయి. పరమాత్మ రథమేసుకొని బయలుదేరాడంటే నాలుగు గుఱ్ఱాలు ఉంటాయట. అవి ఏంటంటే, అహంకారము, బుద్ధి, చిత్తము, మనస్సు. ఈ నాలుగులో ప్రవేశించి బయలుదేరాదని అర్థం. నాలుగు గుఱ్ఱాల కథ ఇది. అంతఃకరణములను ఆశ్రయిస్తాడు. ఎందుకంటే, పరమాత్మ అంతఃకరణలో కూర్చోడు. అంతఃకరణములకు అతీతంగా ఉండేటువంటి బ్రహ్మము, అంతఃకరణములను ఆశ్రయించి, చతుర్భుజుడై, చతుర్ముఖుడై, చతుర్బాహువు కలిగినటువంటివాడై అని అంటూ ఉంటాం కదా! నాలుగు. అందులోనే జీవుడుంటాడు. తాను అది ధరించాడు. రథమెక్కడమంటే రెండు అర్థాలున్నాయి. మామూలుగా బయట నాలుగు అద్భుతమైన గుఱ్ఱాలతో కూడినటువంటి రథం. అది కృష్ణుడెక్కే రథం. పరమాత్మ, జీవాత్మని సంరక్షించడానికి, అనుగ్రహించడానికి అతను కూడా రథారూఢుడై మన దగ్గరకి వస్తాడండి. అందుకనే కనిపిస్తాడు. ఆయన కూడా నీతో మాట్లాడాలని అనుకుంటాడు కదా! మనసుకు ఆధారంగా చిత్తం ఉండాలి. అదొక శాల్తీ కనిపిస్తుండాలి, అదే అహంకారం. మొత్తమంతా వెలుగు నిండి ఉండాలి, అది బుద్ధి. అందుకని ఈ నాలుగు గుఱ్ఱాలు ఎక్కేసాడు. నాలుగు గుఱ్ఱాలతో కూడిన రథమెక్కాడు.

"తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి" – అట్టి బ్రాహ్మణోత్తముడిని కూడా తనతో పాటు రథమెక్కించుకున్నాడు. "నమోఘ మనోరథుండైన హరి" – రథంలో బయలుదేరాడన్నమాట. "రథారోహణంబుఁ జేసి యేకరాత్రం బున" – overnight అట్లా గరీభ్ రథ్ లో వచ్చేస్తుంటాము కదా! Overnight from west to Central India వచ్చేస్తాడు. ఎంత వేగంగా వచ్చి ఉండాలండి! ఎక్కడ ద్వారక? ఎక్కడ విదర్భ? విదర్భ అంటే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఈ రెండు కలిసే చోటది. మాకు వేరే రాష్ట్రం ఇవ్వమని అడుగుతున్నారు ఇప్పుడు విదర్భవాళ్ళు. అక్కడికి రావాలంటే మామూలుగా ట్రైన్లో overnight journey కుదరదు, పదహారు గంటలు పడుతుంది మన super fast express లో. అలాంటిది ఎక్కడుంది ద్వారక? గుజరాత్ అవతల నీళ్ళలో. అక్కడనుంచి బయలుదేరి, గుజరాత్ దాటి, మహారాష్ట్ర దాటి, మధ్యప్రదేశ్ పొలిమేరల వరకు రావాలి. అలా రావాలంటే superfast లో పద్దెనిమిది గంటలు పడ్తుంది. ఈయన తెల్లారేసరికల్లా వచ్చేసాడు బ్రాహ్మణుడిని కూడా తీసుకుని.

ఈ లోపల వస్తుంటే ఇక్కడ కొడుకు ఎలాగూ పెట్టాడు కదా ఒక పెటారం, పెళ్లి చెయ్యాలని. ఆయన బ్రహ్మవేత్త. పెళ్ళికి అన్ని సంభావాలు తీసుకుంటూ, పెళ్ళికి ఉద్యుక్తుడయ్యాడు బ్రహ్మజ్ఞాని అయినటువంటి భీష్మకుడు. బ్రహ్మజ్ఞాని కాకపోతే అలా కూతుర్ని ఎత్తుకుపోతే యుద్ధం చేయ్యోద్దండి! తాను అడ్డుపడడు. ఇలా జరుగుతూ ఉంటే ఈ లోపల మనకి పై గురుపూజలో ఏం జరుగుతుందంటే రుక్మిణీదేవి పడుతున్నటువంటి ఆందోళన, "ఘనుఁడా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో" – ఏం చెప్పాడో, ఒప్పుకున్నాడో, లేదో అని ఎంతో భక్తి, కరుణరసం కూడినటువంటి పద్యాలు వస్తాయి. దాని ముందుగా మన రౌడీలు అందరూ వచ్చేస్తారు, అది చెప్తారు. ఐదుగురు రౌడీలు ఉన్నారు, అన్నదమ్ములందరూ సైన్యం వేసుకొచ్చేస్తారు. ఆ తర్వాత రుక్మిణీదేవి యొక్క తపన ఉంటుంది. అవి చాలా అద్భుతమైనటువంటి పద్యాలు. అటుపైన అమ్మవారి ప్రార్థన ఉంది. అటుపైన రుక్మిణిని కృష్ణుడు తీసుకువెళ్తడం. ఆ పైన అడ్డువచ్చిన వాళ్ళందరిని సంహరించడం ఉంది. బావమరిదిని తలగొరగడం ఉంది. ఆ పైన కల్యాణం ఉంది. ఇంత కథ ఉంది. అంచేత, రుక్మిణీసాధన, రుక్మిణీభావన, రుక్మిణీదేవి తలంపులు, ఆరాధనా భావము, అందోళనా భావము, ఇవన్నీ ఇందులో ఏవీ concession కొట్టడానికి నా దృష్టిలో ఏమీ లేదు. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటాడు. కృష్ణుడు బయలుదేరాడు. మనము కూడా బయలుదేర్దాం, మనం మన ఊళ్ళకి. పై సంవత్సరం భగవత్ అనుగ్రహంగా దీనిని కొనసాగించుకుందాం.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 8, 2014 సాయంకాలము – ప్రవచనము #8

జగద్గురు పీఠము, విజయవాడ కేంద్రం నిర్వర్తిస్తున్నటువంటి గురుపూజా మహోత్సవములకు విచ్చేసినటువంటి సోదరసోదరీ బృందానికి నా హృదయపూర్వకమైనటువంటి నమస్కారములు. మాస్టరు గారు సంకల్పంగా అనుస్యూతంగా జరపబడుతున్నటువంటి ఈ గురుపూజలలో పాల్గొనటానికి విచ్చేసినటువంటి యోగసాధకులందరికీ కూడా మాస్టరు గారి ప్రేరణే కారణమనేటువంటిది ఒక నిశ్చితమైనటువంటి భావన, తన స్పర్శను తాను ప్రత్యేకముగా ఒక బృందపరముగా మాస్టరు గారు అందించాలి అనేటువంటి భావన. అది ఎవరెవరియందు సంకల్పిస్తారో, వారందరూ కూడా ఈ విధంగా సంవత్సరాసాంతం జరిగేటువంటి ఈ గురుపూజల్లో వారివారి అవకాశం మేరకు పాల్గొంటూ ఉంటారు. చాలామందికి ఈ గురుపూజల్లో పాల్గొనాలి అనేటువంటి ఆసక్తి ఉన్నప్పటికీ అప్పుడప్పుడు కొంత వ్యక్తిగతమైనటువంటి బాధ్యతలు లేక ప్రారబ్ధకర్మ అడ్డుపడుతూ ఉంటుంది. కొంత కొంత మందికి అలా అడ్డంకులేమి లేకుండా అన్ని గురుపూజలకి రావడం జరుగుతూ ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ మాస్టరు సి. వి. వి. గురుపూజా మహోత్సవములలో మాస్టరు గారి స్పర్శ ప్రార్థన ద్వారా, అటుపైన జరిగేటువంటి కార్యక్రమముల ద్వారా, అన్నిటికీ మించి ప్రసారముల ద్వారా బాగా లభ్యమవుతూ ఉంటుంది. శ్రమకోర్చి దూరప్రాంతాల నుంచి కూడా ఈ గురుపూజలకి వచ్చినటువంటి సోదరసోదరీ బృందానికి నా ప్రత్యేకమైనటువంటి అభినందనలు. ప్రకృతి నుండి కాల పరిస్థితుల్లో, దేశపరిస్థితుల్లో మనకున్నటువంటి క్లిష్టమైనటువంటి రవాణా సౌకర్యాల్లో ఇలా గురుపూజలకి రావడమనేటువంటిది కేవలం మాస్టరు గారి ప్రేరణ వల్లే వీలుపడుతుందని నా భావన. విజయవాడలో కొన్ని సంవత్సరాలు పాటుగా మనకి భాగవత పురాణమందున్నటువంటి ఉపాఖ్యానములు కొన్ని ప్రశంగింపబడుతూ వస్తూ ఉన్నాయి. అలా మనం ధ్రువోపాఖ్యానం చెప్పుకున్నాం, అంబరీషోపాఖ్యానం చెప్పుకున్నాం, అటుపైన కుమార సంభవం చెప్పుకున్నాం. గత రెండు సంవత్సరాలుగా రుక్మిణీకల్యాణం అనేటువంటి ఒక అద్భుతమైన ఘట్టాన్ని వివరించుకుంటూ ఉన్నాం. ఇది మూడవ సంవత్సరం. గత రెండు సంవత్సరాలుగా సాగిన కథ మీ అందరికీ సుపరిచితమే.

కిందటి సంవత్సరం చివరి ప్రవచనంలో మనం చెప్పుకున్నటువంటి ఘట్టం ఏమిటంటే, అగ్నిద్యోతనుడు అనేటువంటి బ్రాహ్మణుడు రుక్మిణీదేవి సందేశాన్ని, ఆమె యొక్క భక్తిప్రపత్తులను, ఆమె యొక్క

ప్రేమానురాగాలను, ఆమెకు కృష్ణుని యందు గల అపారమైనటువంటి ప్రీతిని, ఉన్న పరిస్థితుల్లో తనకున్నటువంటి ఆవేదనను, ఆర్ద్రతను అన్నిటినీ కృష్ణునికి తెలియపరుస్తాడు. అగ్నిద్యోతనుడు అసామాన్యమైనటువంటి ఒక బ్రాహ్మణుడు, తేజోవంతుడు, ధీమంతుడు. అతనికీ శ్రీకృష్ణునికి మధ్య చక్కని సంభాషణ జరుగుతుంది. కృష్ణుడు కూడా రుక్మిణీదేవి యందు అదే వివిధమైనటువంటి ప్రీతి కలిగి ఉండడం చేత, "పద బయలు దేరి వెళ్దాం" అని చెప్పి, అగ్నిద్యోతనుడితో కలిసి నాలుగు గుఱ్ఱములతో కూర్చినటువంటి ఒక రథమునెక్కి బయలుదేరి వచ్చినట్టుగా చెప్పుకున్నాం కిందటిసారి.

నాలుగు రథములు ఎక్కి భగవంతుడు దిగిరావడం అనేటువంటిది నాలుగు వ్యూహములతో కూడినటువంటి విరాట్ పురుషుని సంకేతిస్తున్నది అని కూడా కిందటిసారి తెలియచెప్పడం జరిగింది. రథమంటే శరీరం. దానికి నాలుగు గుఱ్ఱాలు కూర్చాడట అంటే అది సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహాలుగను, సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత కుమారులగను, ఈ విధంగా ప్రతిసారి భగవంతుడు అవధరణం చెంది భక్తుడు దగ్గరకు వచ్చినప్పుడు... అప్పటికప్పుడు నాలుగు వ్యూహములను తాను ఏర్పాటు చేసుకొని, రథమెక్కడమంటే దేహాన్ని ధరించి, భక్తుడికి దర్శనమిస్తూ ఉంటాడు అనేటువంటి ఒక సంకేతార్థంగా చెప్పుకోవడం జరిగింది. ఈ కథలో మనకి అంతర్లీనమైనటువంటి, సాధనా పరమైనటువంటి విశేషాల్ని కూడా మనం బాగా విరివిగా చెప్పుకుంటూ వచ్చాం ఇన్నేళ్ళుగాను.

ఆ విధంగా రుక్మిణీదేవి పంపినటువంటి బ్రాహ్మణుడు కృష్ణుడు యొక్క అనుగ్రహాన్ని పొంది, అనుమతిని పొంది, కృష్ణుడితో పాటుగా రథమెక్కి విదర్భ రాజధానికి పయనమై వస్తూ ఉండగా, బయలుదేరిన బ్రాహ్మణుడు అసలు అక్కడకి చేరాడో లేదో, చేరి చెప్పాడో లేదో, కృష్ణుడు సాన్నిధ్యం ఇచ్చాడో లేదో, ఇచ్చినప్పటికీ బ్రాహ్మణుడు చెప్పినదానికి సమ్మతించాడో లేదో, ఇలాంటి ఆలోచనలు రుక్మిణీదేవికి వస్తాయి. ఒక పని మీద, అదీ చాలా ముఖ్యమైనటువంటి పని మీద, తనకు ప్రాణసంకటమైనటువంటి పని మీద పంపించినప్పుడు వెళ్ళినటువంటి వాడు ఏం చేస్తున్నాడో, ఏం జరుగుతోందో అనేటువంటి ఒక ఉత్కంఠత పంపించినవారిలో ఉండడం సహజం. రుక్మిణీదేవి పరిస్థితి ఏమిటంటే, ఇంక రేపో మాపో పెళ్లి అని నిశ్చయమైంది. రాజులందరూ వచ్చి విడిది చేసారు. శిశుపాలుడికి మద్దత ఇవ్వడానికి జరాసందాధులు వచ్చారు. శిశుపాలుడు వచ్చాడు. సాళ్వరాజులు, వాళ్ళందరూ కుడా వచ్చారు. కిందటి సంవత్సరం వీళ్ళందరి గురించి చెప్పాను. మీకు భక్తి శ్రద్ధలు ఉంటే, కిందటి సంవత్సరం చెప్పినవన్నీ గుర్తుంటాయి. లేదా ఇక్కడికి వచ్చేముందే గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తారు. అలా లేకపోతే, మళ్ళీ అంతా కొత్తకొత్తగా ఉంటుంది కాబట్టి కొంచెం పరిచయం చేస్తూ ఉంటాను. మాములుగా భగవత్పరమైనటువంటి విషయముల యందు మనమంతా ఆసక్తి కలిగే ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం

కాబట్టి, ఈ కార్యక్రమాలకి వచ్చేముందే ఇంతకు ముందు ఇక్కడ ఏం జరిగింది అనేటువంటిది మనం కొంత మనసులో పునఃస్మరణ చేసుకుంటే సులభంగా ఉంటుంది.

ఈ విధంగా రాజులందరూ వచ్చేసారు. వారి వారి సైన్యాల్ని కూడా తీసుకొచ్చారు. ఎందుకంటే, కృష్ణుడేమైనా వస్తాడేమోనని వాళ్ళకొక అనుమానం ఉన్నది. అంచేత, కృష్ణుడు వస్తే, యుద్ధం చేసి, అతన్ని నిర్జించి, రుక్మిణీదేవిని శిశుపాలుడికిచ్చి పెళ్లి చెయ్యాలనేటువంటి ఒక సంకల్పంతో అక్కడ ఒక సంఘమున్నది . దానికి నాయకుడు జరాసంధుడు. ఆ జరాసంధుడు కంసుని సంహరించే సందర్భంలో కృష్ణుడు మీద వైరం పూనుతాడు. కృష్ణుడు మీద వైరం పూని, కృష్ణుడి పై దండేసి, మధురానగరానికి పదిహేడు సార్లు దండయాత్ర చేస్తే, పదిహేడు సార్లు శ్రీకృష్ణుడు జరాసంధుని సైన్యాన్నంతా వధించి పంపించేస్తూ ఉంటాడు. అంటే, ఒక్కొక్కసారి వచ్చినప్పుడుల్లా సైన్యాన్ని వధించి, జరాసంధుని వదిలేస్తూ ఉంటాడు. అప్పుడు మళ్ళీ కూడకట్టుకొని, మళ్ళీ వస్తూ ఉంటాడు, మళ్ళీ కృష్ణుడు ఓడిస్తూ ఉంటాడు. ఇలా పదిహేడు సార్లు ఓడించి, పద్దెనిమిదోసారి తాను ఓడిపోయినట్టుగా, పారిపోయినట్లుగా వెళ్లి ద్వారకలో, ద్వారకా నిర్మాణం చేసుకొని ఉంటూ ఉంటాడు కృష్ణుడు. అంచేత, పదిహేడు సార్లు ఓడిపోయినటువంటి జరాసంధునికి కృష్ణుడంటే భయంగా ఉంటుంది. అయినప్పటికీ, కృష్ణుని యందు వైరం ఉంటుంది. అతనికి తోడు శిశుపాలుడు. అలాగే, సాళ్వుడనేటువంటి మరొక రాజు. వీళ్లందరికీ దన్ను రుక్మిణి అన్నయ్య అయినటువంటి రుక్మి అనేటువంటి మరియొక యువరాజు, భీష్మకుని కుమారుడు. ఆ విధంగా వీళ్ళందరూ వారి వారి బలగాలతో వచ్చి ఉంటారు. వివాహానికి సమయం ఆసన్నమైంది. ఇంక ఒకటి రెండు రోజుల్లో పెళ్లి జరుగుతుంది.

కిందటి సంవత్సరం మనం చెప్పుకున్న కథలో రుక్మిణీదేవి ఇలా జరుగుతుందని తెలిసి, అగ్నిద్యోతనుడికి ఏం చెప్పి పంపించిందంటే, ఇలా వీరందరూ వస్తారు. నీవు వచ్చి నన్ను స్వయంవరంలో వరించినాగాని యుద్ధం జరుగుతుంది. రాజప్రసాదంలో యుద్ధం జరిగి, రాజప్రసాదంలో నా పెళ్లి కారణంగా బంధుజనులందరూ మరణించడం అనేటువంటిది నాకు ఇష్టం లేదు. కాబట్టి పెళ్ళికి తను వెళ్లేముందు, స్వయంవరానికి ముందు మా కుల ఆచారం ప్రకారం నేను ఊరి వెలుపల ఉన్నటువంటి పార్వతీదేవి గుడికి బయలు దేరి వెళ్తాను. ఆ సందర్భంలో నీవు నన్ను రాక్షసవివాహంగా ఎత్తుకొని వెళ్ళిపోయి వివాహం చేసుకోమని కబురుపెడుతుంది. కాబట్టి ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కృష్ణుడు వస్తున్నాడా, రావడం లేదా? వెళ్ళిన బ్రాహ్మణుడు ఏమయ్యాడు? ఇటువంటి సందేహాలతో ఈసారి మనకి కథ ప్రారంభమవుతుంది. అంతవరకు మనం వచ్చాం కిందటిసారి గురుపూజల్లో.

కృష్ణుడు బయలుదేరి వెళ్ళాడు అని తెలియంగానే బలరాముడు కూడా సందర్భాన్ని సమయోచితంగా ఆలోచించి, తోడు మనం కూడా ఉంటే బాగుంటుంది అనుకుంటాడు. ఎంచేతంటే, చాలామంది రాజులు అక్కడికి వస్తారు, ఈ కార్యాన్ని ప్రతిఘటిస్తారనేటువంటి ఉద్దేశ్యంతో బలరాముడు ఈ విధంగా భావన చేశాడు.

"హరి యొకఁ డేఁగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతు లెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గర మగుఁ దోడు గావలయుఁ గంసవిరోధికి నంచు వేగఁ దా
నరిగె హలాయుధుండు కమలాక్షునిజాడ ననేకసేనతోన్."

కృష్ణుడు ఒక్కడే వెళ్ళాడు. చైద్యుడంటే శిశుపాలుని యొక్క రాజ్యం, చైద్యరాజు ఆయన. అతనకి "హితానుసారులై" – మగధరాజులంటే జరాసంధి ఆదిగా గల రాజులు. "నరపతు లెందఱేని" – చాలామంది వచ్చారు వాళ్ళు. "కుమారికఁ దెచ్చుచోట సంగరమగు" – తప్పక యుద్ధమవుతుంది అని బలరాముడు చాలా నిశ్చయమైనటువంటి అభిప్రాయం కలిగి ఉంటాడు. బలరాముడు చాలా పెద్ద సేనలని తీసుకొని, కృష్ణుడు వెళ్ళిన దారిలోనే తానూ వెళ్ళటం జరిగింది.

"ఆ లోపల నేకతమున
నాలోల విశాల నయన యగు రుక్మిణి త
న్నా లోకలోచనుఁడు హరి
యాలోకము చేసి కదియఁ డని శంకితయై."

లోపల ఎంత భక్తి, ఎంత విశ్వాసము, ఎంత సమర్పణ బుద్ధి ఉన్నా, ఒక్కొక్క క్లిష్టమైనటువంటి సన్నివేశంలో భక్తుల హృదయంలో రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. ఉన్నాడో, లేడో అనిపిస్తూ ఉంటుంది. "కలడు కలండనువాడు కలడో లేడో" అని అన్నాడు గజేంద్రుడు. అంటే, సన్నివేశము యొక్క గంభీరతను బట్టి, ఎప్పుడూ భగవత్ భక్తి యందే ఉంటూ, భగవంతునికే సమర్పణ చెంది ఉన్నటువంటి సందర్భంలో కూడా భక్తుడికి లోపల రకరకములైనటువంటి భయాందోళనతో, ఆత్రుత, ఆవేదనలతో కూడినటువంటి భావాలు వస్తాయనేటువంటిది ఈ రుక్మిణీదేవి ఈ వేచి ఉండడంలో... మనిషిని పంపించింది. పంపించిన మనిషి ఏం చెప్పాడో, అక్కడ ఏం జరుగుతోందో, ఆయన ఒప్పుకున్నాడో, ఆయన ఒప్పుకోలేదో, వస్తున్నాడా, రావట్లేదో, అసలు తాను చెప్పిన కబురు చాలా అధర్మంగా ఉందని అనుకున్నాడో, ఇలాంటి భావాలన్నీ రావడం సహజం కదా! "ఏకాంతం" – ఒంటరి. ఎందుకంటే, రాజప్రసాదంలో ఎవరెవరి భవనాలు వాళ్ళకుంటాయి. రాజకుమారి

భవనంలో రాజకుమారి, రాజకుమారి చెలికత్తెలు ఉంటారు. లేకపోతే, ఒక కొలను ఉంటుంది. అందులో కొన్ని పద్మాలు ఉంటాయి. ఒక ఉద్యానవనం ఉంటుంది. అందులో కొన్ని నెమళ్ళు తిరుగుతూ ఉంటాయి. కొన్ని పెంపుడు పావురాళ్ళు ఉంటాయి. కొన్ని మామూలు పక్షులవీ ఉంటూ ఉంటాయి. ఇలా రకరకాలుగా ఒక రమ్యమైనటువంటి, హృద్యమైనటువంటి, ఒక సుందరమైనటువంటి భవనంలో సామాన్యంగా ఒక రాజకుమార్తె ఉండడం అనేటువంటిది ఆచారం. అలాగే రాణిగారికి ఒక భవనం ఉంటుంది. రాజుగారికి ఒక రాజభవనం ఉంటుంది. రాజకుమారుడుంటే ఆయనకీ ఒక భవనం ఉంటుంది. ఇదంతా ఏంటంటే, వారివారి వైభవానికి ప్రతీకగా ఉంటాయి. అందరూ ఒక హాలులో పడుకొని నిద్రపోయేట్టుగా ఉండదు! ఎవరి స్వతంత్రత వారికి ఉంటుంది. ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళాలంటే, ముందుగా కబురు పంపించడం, ఇలా ఉంటాయి.

ఆవిడ "ఏకతమ" అంటే ఒక్కతే ఉంటుంది ప్రాసాదంలో. "విశాల నయనయగు రుక్మిణి త న్నా లోకలోచనుఁడు హరి" – అంతా చూడగలిగినటువంటివాడు ఆయన, సమస్తము చూడగలిగినటువంటి కన్నులు కలవాడు. "న్నా లోకలోచనుఁడు హరి" – ఆలోకమును చేసి అంటే, బాగా ఆలోచించి... అంతా తెలిసినవాడు, అతడు ఆలోచనచేసి అసలు బయలుదేరాడా, లేదా? రుక్మిణీదేవికి ఆయనకి ఏమీ తెలియనిది లేదు అనేటువంటి ఒక నిశ్చలమైనటువంటి భావము ఒకటి ఉన్నది. అయినప్పటికీ, కదిలాడో లేడో? ఎందుకంటే, తను చెప్పింది నచ్చిందో లేదో? కదలటం దాని బట్టి ఉంటుంది కదా! తానెంత ప్రేమించినా అతని మనస్సుయందు ఏమున్నదో అనేటువంటి భావన చేత ఆ విధంగా అనుకుంది. "విశాల నయన యగు రుక్మిణీదేవి" – చాలా పెద్ద కన్నులు కలది, బాగా చూడగలిగింది అని అర్థం. పెద్ద కనులకు సాముద్రికంలో సంకేతమైనటువంటిది ఏంటంటే వారి చూపు బాగా గ్రహిస్తుంది అని అర్థం. అందుకనే, పెద్ద కనులు ఉండేట్టుగా వర్ణిస్తుంటారు. "పద్మనయనంబుల వాడు" అంటూ ఉంటాం. "నల్లనివాడు, పద్మనయనంబులవాడు" అంటే, సాముద్రికముకి ఇది ఒక సంకేతము. పెద్ద కనులు ఉంటే వాళ్ళకి గ్రహింపు బాగుంటుంది అనేటువంటి ఒక అవగాహన. ముఖంలో కన్ను ప్రధానం. ఆమె చాలా పెద్ద కన్నులు, అవగాహన కలిగినటువంటి మనిషి. మొత్తం లోకాలన్నీ చూడగలిగినటువంటి వాడు ఆయన. అలా ఉన్నటువంటివాడు, మొత్తం లోకాలన్నీ చూడగలిగినటువంటివాడు, ఏం ఆలోచన చేస్తున్నాడో అనే ప్రశ్న పుట్టింది ఆమెకి. "యాలోకము చేసి కదియఁ డని శంకితయై" – ఆలోచించి, ఇంకా కదల్లేదేమో అని కూడా ఆలోచన చేసేసింది, అలా భావన చేసుకుంది.

"లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁ డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో

భగ్నంబై చనునో విరించికృత మెబ్బంగిన్ బ్రవర్తించునో."

"లగ్నం బెల్లి" అంటే రేపే పెళ్లి. మామూలుగా ఇలాంటివి మనం చెప్పుకున్నదాని కన్నా, పోతనాత్ములు రాసిన పద్యం చదివితేనే రుచి కదా! పోతన పద్యాల్లో ఉండేటువంటి రుచి ఎలా ఉంటుందంటే, మన హృదయంలో ఉండేటువంటి కల్మషాలన్నీ కూడా కరిగించేట్లుగా ఉంటాయి ఆ పద్యాల్లో ఉండేటువంటి భక్తి, అందులో ఉండేటువంటి భావము. రేపే పెళ్లి. వివాహము దగ్గర పడ్డది.

"ఏలా రాఁడు గోవిందుఁడు ద్విగ్నం బయ్యెడి మానసంబు" – మనసులో చాలా ఉద్రేకము, గాభరా వస్తోంది, భయమొస్తోంది. ఏం జరుగుతుందో, ఏమిటో? పెద్ద పరీక్షండి. రేపు results వస్తాయి అండి. చాలా కష్టపడి చదివాం కదా! ఈ పరీక్ష pass అయితే గట్టెక్కినట్టు, pass కాకపోతే మళ్ళీ రాయటానికి లేదు. రుక్మిణీదేవి పరీక్ష ఎలాంటిదంటే, మళ్ళీ ఇంకొకడిని ప్రేమిద్దాం, వీడు కాకపోతే ఇంకోడని, ఈ attempt లో pass కాకపోతే ఇంకో attempt లో pass అవుతామని అన్నది కాదు! అది pass అవ్వాలి, వేరే మార్గం లేదు. పూర్వకాలంలో honors అనే course ఉండేది. నేను చేశాను అది. ఒక్కసారే పరీక్షకి కెళ్ళాలి. Pass అయితే అయినట్టు, లేకపోతే నాలుగేళ్ల చదువు ఏమీ కాదు. మరి అలాంటి చదువు చదువుతున్నప్పుడు అందులో పది పరీక్షలు పెట్టి, అన్నిటిలోను నలభై రావాలి, average యాభై రావాలి అని పెట్టారనుకోండి, ఎంత tension ఉంటుందండి! పోని, పరీక్ష పోతే మనిషి చచ్చిపోడు కదా! ఇది ప్రాణాలు అర్పించినటువంటి సందర్భం కదా ప్రేమంటే! ప్రేమ గురించి నేను చెప్పక్కర్లేదు కదా! బాగా సినిమాలు చూస్తున్నారు. ప్రేమ విఫలమైపోతే చాలా కష్టం, ఆ జీవితం బాగా దెబ్బ తింటుంది. అందులోను చాలా సంస్కారవతి అయినటువంటి స్త్రీ కథ.

ఆమె హృదయం ఉద్విగ్నం అయిందంటే లోపల ఎంత తపన చెందుతోందో! "ఉద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృతాంతమున్" – అసలు విన్నాడో, లేడో! ఎంతో మంది ఉన్నారు కృష్ణునికి, నేనొక్కత్తెనే కాదు. చిన్నప్పటి నుంచి ఆయన వెంట పడ్డవాళ్ళు చాలా మంది ఉన్నారు. ఇంతవరకు ఆయన ఎవరిని పెళ్లిచేసుకోలేదు కదా! ఇదే మొదటిది కదా! అప్పటికే బలరామకృష్ణుల గూర్చి దేశంలో చాలా చోట్ల అందరూ వింటూ వచ్చారు. ఈవిడ కూడా వినబట్టి కదా, ఆ విధంగా నారదుడు రాజ్యసభలో చెప్పటం చేత, తాను విని, మనస్సునందు ఆరాధన మొదలు పెట్టింది. బంధువులు, హితులు అందరు కుడా ఆయన గురించి చెప్తూ ఉంటే, విని, ఆయన గూర్చినటువంటి ఆరాధన లోపల మొదలు పెట్టింది. అయితే నాకు ఆయనే పతి అవ్వాలి అనేటువంటి భావనలో ఉన్నటువంటి మనిషికి. అతను విన్నాడో, లేడో?

"బ్రాహ్మణుండగ్నిద్యోతనుఁ డేటికిం దడసె" – ఈయన వెళ్ళిన ఆయన ఏమయ్యాడు? అసలు మనకేం కబురు లేదు, కాకరకాయ లేదు. వెళ్ళినవాడు ఏం చెప్పకపోతే, ఏరా కబురులేదు, కాకరకాయ లేదు అని అంటూ ఉంటాం కదా! కబురంటే మంచి కబురు, కాకరకాయ అంటే చేదు కబురనమాట. కాబట్టి కబురుతో వస్తాడా, కాకరకాయతో వస్తాడా అన్నట్లుగా, ఇక్కడ ఏం జరిగిందంటే, వెళ్ళినవాడు ఏమయ్యాడో తెలీదు. ఆయనేమి తిరిగివచ్చి సందేశమీలేదు, పంపించి కూడా చాలా రోజులైంది.

"నాయత్నంబు సిద్ధించునో" – నేను చేసిన ప్రయత్నము సిద్దిస్తుందో, సిద్ధించదో! "భగ్నంబై సర్వం" – అది నేను మీకు చెప్పక్కర్లేదు కదా! భగ్నమైపోయిందేమో, విఫలమైపోయిందేమో! "విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో" – బ్రహ్మదేవుడు ఏ విధంగా లిఖించి ఉన్నాడో, మనకి తెలియదు కదా! అదే తెలిస్తే మనకి గొడవేముంది! అది తెలియకే ఇంత ఇబ్బంది పడ్తున్నాం! తెలిస్తే, suspense లేదు. ఏదైనా సినిమాలో suspense ఉంటేనే రక్తి కలుగుతుంది కదా!

రుక్మిణీదేవికి కూడా పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అలాంటి సందర్భంలో ఏం చేస్తారండి? ఎవర్ని నమ్ముకున్నారో వారిని బాగా ఆశ్రయించి, ఆరాధన చేసుకుంటూ ఉండాలి. ఆ విధంగా ఏకాంతంలో భావన చేసిందటండి. అంతటితో ఆగలేదు. చాలా ఉంటుంది ఈ భావన. ఈ రోజంతా మనకి ఆ భావనే చాలు. ఈ రోజు సాయంత్రం కథలో ఉండేటువంటి కరుణా, భక్తి సాధన రేపటికి ఉండదు. ఎందుకంటే, ఈ సాయంత్రం మనకి ఈ ప్రవచనం "వస్తున్నాడు కృష్ణుడు, వచ్చేసాడు" అని చెప్పేస్తాడు. ఇవాళ్ళ అంతవరకు చెప్తాను. ఎందుకంటే, రుక్మిణీకల్యాణం మనకి అయిపోవాలి కదా! మూడేళ్ళు దాటితే మరి బాగుండదు! మనకి ధ్రువోపాఖ్యానం అలానే జరిగింది. మరీ మూడేళ్ళు కూడా సాగదీసేట్టుగా ఒకటుంది, టీవీ episodes లాగా! అలా ఉండకూడదు, బాగా సాగాలి. అలా అని మరీ వేగంగా సాగదు, మరీ నెమ్మదిగాను సాగదు. కథ కూడా ఎక్కువ లేదు. ఊరికే యుద్ధం గురించి ఇట్లా వేశాడు బాణాలు, అట్లా వేశాడు బాణాలు అని నేను ఎక్కువ చెప్పను. మనకెందుకు! బాణాలు మనకి చేత కాదు కదా! తెలుసుకున్నా, వెయ్యలేము! కాబట్టి మనం ఏం చెప్పుకుంటాం అంటే, భక్తి పరమైనటువంటి విషయం చెప్పుకుంటాం, సాధన పరమైనటువంటి విషయం చెప్పుకుంటాం.

మళ్ళీ ఇంకొక్కసారి ఇంకో భావన వచ్చింది. "ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో" – చాలా ఘనుడు ఆయన, అభూసురుడు. సామాన్యమైన వాడు కాదు. పంపించినవాడిని ఏదో సత్తు కేసు అనుకోండి. అందుకనే, ఎప్పుడన్నా, ఎవరినన్నా కబురిచ్చి పంపించాలంటే, అసలు వాడిని ఎన్నుకోవడంలోనే ఉంది నీ గొప్పతనం. రాముడు ఉంగరం ఇచ్చి ఎవరిని పంపించాడు? అందరికీ ఇవ్వలేదు కదా! చాలా మంది కోతులు వెళ్లినాయి,

ఎంతోమంది వానరులు వెళ్లారు, చాలా ధీశాలులు వెళ్లారు, బలశాలులు వెళ్లారు, సమర్థులు వెళ్లారు. వాళ్ళకెవ్వరికీ ఇవ్వలేదు. హనుమంతుడికే ఇచ్చాడు. ఇదిగో ఇతన్ని దక్షిణ దిశగా పంపిస్తున్నాను అన్నాడు సుగ్రీవుడు. అంతే, తన చేతి ఉంగరం తీసి, "ఈ ముద్రిక చూపించు" అన్నాడు. అంటే ఏమిటి? తప్పక అతను దర్శిస్తాడనేటువంటి ఒక విశ్వాసం. అమ్మను తప్పక దర్శిస్తాడనేటువంటి విశ్వాసం ఉండబట్టి కదా రాముడు ముద్రిక ఇచ్చాడు! అలాగే రుక్మిణీదేవి చాలా చక్కని అర్హత కలిగినటువంటి వాడు, పుణ్యాత్ముడు, మహాత్ముడు, జ్ఞాని, తెలిసినవాడు... ఆయన పేరులోనే ఉంది కదా అగ్నిద్యోతనుడని! అగ్నిద్యోతనుడంటే, అతను ఎప్పటికప్పుడు అట్లా అగ్నిశిఖను అధికమించినట్టుగానే ఉంటుంది.

అలాంటి వాడిని పంపిస్తే, "ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో" – ఎలా వెళ్లాడాయన? ఆయనకేమన్నా ఈవిడ గుఱ్ఱాలు arrange చేసిందా? లేదు. రథమేర్పాటు చేసిందా? రాజకుమారి కదా, అవవీ ఇవవీ ఏర్పాటు చేయద్దూ! అవన్నీ ఏర్పాటు చేస్తే ఊళ్ళో వాళ్లకి తెలిసిపోతుంది. రుక్మిణీదేవి ఎవర్నో ఒక సద్బ్రాహ్మణుడ్ని, ఒక రథమిచ్చి పంపించిందట అంటే వెంటనే ఆరా తీయరండి! రహస్యంగానే పంపించింది కదా! రహస్యంగా పంపించినప్పుడు, అతను ఎట్లా వెళ్తాడు? అతను కాలి నడకన వెళ్ళాడు కదా! కాలి నడకన అలా నడుచుకుంటూ కొండలు, మిట్టలు దాటిపోయినట్టుగా మనం కథలో చదువుకున్నాం. అలా వెళ్ళాలంటే, ఎన్ని రోజులు పడుతుందండి? అతను వెళ్ళాడో, దార్లో ఏ పులి అన్నా మింగేసిందో? పులి మింగచ్చు, పాము కాటువేయవచ్చు, తేలు కుట్టచ్చు. కాలు బెణికి, అక్కడ ఉండిపోవచ్చు. పడిపోయి, పక్క ఎముక విరగొట్టుకోవచ్చు. ఎన్ని జరగట్లేదు ఇప్పుడు మనకి? మరీ ఇంట్లోనే పడిపోయి కాళ్ళు, చేతులు విరకొట్టేసుకుంటున్నాం కదా! అసలు ఈయన వెళ్ళాడా? వెళ్ళగలిగాడా? మార్గంలో ఎక్కడన్నా, ఏ ఆపాయనికైనా గురైపోయాడా?

"నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో" – అదొకటి ఉంది కదా! "నా పరిస్థితి ఇది, నువ్వు ఇలా చేస్తే బాగుంటుంది" అని మనమొక సందేశం పంపించాం. అది ఆయనకి నచ్చాలి కదా! తప్పని అనిపిస్తుందేమో! ఎందుకు తప్పు? రెండు రకాలుగా తప్పు అని అనిపిస్తుంది. ఒక స్త్రీ సామాన్యంగా నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పి చెప్పదు. అవతల వాడు మరీ బొత్తిగా ఎన్ని రకాల సంకేతాలు ఇచ్చినా అర్థం చేసుకోలేకపోతే, ఈ చవటకి తెలియట్లేదని ఏమన్నా చెప్తే చెప్తుందేమోగాని, మాములుగా స్త్రీ చెప్పదు. స్త్రీ తత్త్వంలో అది లేదు, స్త్రీ నైజంలో అది లేదు. ఎందుకంటే, పురుషుడు positive pole. నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని పురుషుడు చెప్పగలిగినట్లుగా స్త్రీ చెప్పలేదు. స్త్రీ receptive pole, వింటుంది. విని కూడా నవ్వుతుంది తప్ప చెప్పదు. అందుకనే చూడండి మనకి పెళ్లిళ్లు చేసే పెద్దవాళ్ళు కుడా "ఏమ్మా! ఈ వివాహం ఖాయం చెయ్యనా?"

అని అడిగితే ఏం చెప్తుంది? ఇష్టమైతే "మీ ఇష్టం నాన్న!" అంటుంది. "నా కిష్టం లేదు." "తప్పకుండా చెయ్యండి. ఇంకోటి వద్దు." ఇట్లా మాట్లాడదు. తొందర పడటం అనేటువంటిది స్త్రీ లక్షణం కాదు, పురుష లక్షణం గుర్తుపెట్టుకోండి. త్వరపడని పురుషుడు, త్వరపడే స్త్రీ జీవితంలో చాలా తప్పులు చేస్తుంటారు. traffic sign ని కన్నడంలో మనం "నింతుహోయి" అంటాం కదా! "నింతుహోయి" అంటే అంటే ఆగి, చూసి, వెళ్ళమని. అందుకని, ఆగి చూసి వెళ్ళటం అనేటువంటిది స్త్రీ లక్షణం.

అలాంటిది ఇక్కడ ఏం జరిగిందండి? రుక్మిణీదేవి జీవిత సన్నివేశం అంతా తిరగపడిపోయింది. ఎందుకంటే, ఇంట్లో అలాంటి అన్నయ్య ఒకడు ఉన్నాడు. వాడు అర్థం చేసుకునే పరిస్థితులో లేడు. చెల్లెలి మనసు అడిగి, పెళ్లి చెయ్యాలనేటువంటి ఉద్దేశ్యం అతనికి లేదు. అతడికో ముఠా ఉంది కదా! అతడికో ఒక మిత్ర సంఘముంది. ప్రస్తుతం మన తెలుగు భాషలో చెప్పుకోవాలంటే ఒక తొట్టి gang అన్నమాట. అలాంటి వాళ్ళు ఒక పదిమంది చేరారు. వాళ్ళందరూ ఏ నిర్ణయం చేస్తే వీడికి అదే లెక్క. వాళ్ళ స్నేహం కోసం తన చెల్లెల్ని బలిచేయడానికి సిద్దంగా ఉన్నాడు. అదీ పరిస్థితి. తాను ఈ విధంగా కబురు పంపిస్తే... ఇదేమిటిది ఈ అమ్మాయి? ఇలా ఎవరన్నా పంపిస్తారా? సంస్కారవంతులు పంపిస్తారా? పైగా రాజకుమారి. అలా చేస్తుందా? రెండోది, స్వయంవరం కదా! తానొచ్చి కూర్చునప్పుడు తన మెడలో దండ వేసి అతన్ని వరిస్తే ఇంక ఇబ్బందేముంది? కాని ఇబ్బంది ఉంది. ఎందుకని? ఏ ఇంట్లో పెళ్లి జరగాలో ఆ ఇంట్లో హింస జరుగుతుంది. ఆమె ఎంత ఆలోచించింది! పెళ్లి మండపంలో హింస జరిగి నెత్తురు పారితే ఏం బాగుంటుంది? ఎంచేతంటే, నువ్వు స్వయంవరానికి వచ్చినప్పుడు నిన్ను నేను వరించినా, అక్కడుండే వాళ్ళు పడనీక అప్పటికప్పుడు కత్తులు దూస్తారు. కాబట్టి ఈ విధంగా, నేను నీకు ఈ సలహా ఇస్తున్నాను అని కూడా చెప్పిందావిడ. ఇట్లా రెండు రకలుగా ఆమె చెప్పి పంపించటం చేత ఆవిడకి లోపలే కొంచెం భయమొచ్చింది. "ఇది విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో". వచ్చాడేమో? వచ్చి ఇంకా కబురు రాలేదేమో? ఎందుకంటే, రేపు వివాహమంటే, రేపు స్వయంవరమంటే ఇవ్వాళ్ళటికి రావాలిగా!

"విచ్చేసెనో యీశ్వరుం డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో" – అదొక పెద్ద విషయం. ఈ సృష్టి అంతా ఈశ్వరాధీనమై నడుస్తూ ఉంటుంది కదా! ఈశ్వరాధీనమై నడిచే సృష్టిలో ఇలా జరగాలని జీవుడు కోరుకోవడం ఒకటుండగా, జరగడం, జరగకపోవటం అనేటువంటిది ఈశ్వరుని యొక్క సంకల్పం బట్టి ఉంటుంది తప్ప, ఆ జీవుల సంకల్పం బట్టి ఉండదు. జరిగితే ఈశ్వర సంకల్పం. జరక్కపోయినా ఈశ్వర సంకల్పమే! ఈశ్వరుడు నేను అనుకున్నట్లుగా అతను సంకల్పించి ఉన్నాడా, లేక ఆయన మరొక రకంగా ఉన్నాడో నాకు తెలీదు కదా! చాలా పనుల్లో ఈశ్వరానుకూలత మనకి తెలియదు కదా! మన కర్తవ్యం మనం చేస్తూ

ఉంటాం. నా తమ్ముళ్ళిద్దరూ ఇవాళ్ళ నాకన్నా గంటన్నర ముందు విశాఖపట్టణంలో బయలుదేరారు. ఇక్కడికి నాకన్నా రెండున్నర గంటల ముందు వచ్చేస్తాను అని ఉద్దేశ్యపడ్డారు. ముందు వచ్చి, ఏదో పక్కన పుణ్యక్షేత్రాలు చూసుకొని వచ్చేయచ్చు అని అనుకున్నారు. అది తమాషాగా ఎలా జరిగిందో చూడండి! వాళ్ళకే నవ్వు వచ్చింది. "మీకన్నా ముందు వెళ్లిపోదాం అనుకున్నాం మాస్టారు. మీకన్నా ముందైతే బండి ఎక్కాం తప్ప, మీకన్నా అరగంట వెనగ్గా విజయవాడ వచ్చాం" అన్నారు. ఇట్లా ఉంటాయి మనకి. చిన్న చిన్న విషయాల్లోనే మనకి ఈశ్వరుని యొక్క సంకల్పం మరొక రకంగా ఉన్నదని తెలుస్తూ ఉంటుంది కదా! కొన్ని పనులు అవుతూ ఉంటాయి, కొన్ని పనులు కావు. ఇది వరకు ఇదే పని ఇలా అయ్యింది, అదే పని ఈసారి అలా అవ్వదు. దీన్ని ఎవరు చెప్పగలరు? అంచేత, రుక్మిణీదేవి ఇలా అంటోంది. ఇవన్నీ ఇలా ఉండగా కృష్ణుడికి ఇష్టముందా?

"యీశ్వరుం డనుకూలింపఁ దలంచునో తలఁపడో? యార్యామహాదేవియున్ నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో" అని అటు వెళ్ళిపోయింది అమ్మవారు. "ఆర్యాయై నమః" అని అంగపూజలో చేస్తుంటాం కదా! అసలు అమ్మవారికి నా గురించినటువంటి భావన ఎలా ఉందో? అసలు నన్ను రక్షించాలని ఆవిడకి తెలుసో, తెలియదో! మొత్తం జగత్తంతా రక్షిస్తుండేవాళ్ళు, ఇంత particular గా ఇప్పుడు రుక్మిణీదేవి పెళ్లి గురించి ఆలోచన చేసే పరిస్థితి ఉందో లేదో అక్కడ కదా! అంటే, ఎలా ఉంటాయో భావాలు చూడండి. ఒక పక్క తను నమ్ముకున్నటువంటి ప్రేమికుడు, తను కోరుకున్నటువంటి పురుషుడు. మరొక పక్క ఈశ్వరుడు, ఇంకొక పక్క అమ్మవారు. సంకల్పం అంటే అమ్మవారే! "రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నా భాగ్య మెట్లున్నదో" – అంతే కదా చివరికి! ఎటు తిరిగి మన భాగ్యం ప్రకారమే మన పనులు అవుతాయి తప్ప ఇంకోటి జరగదు. మన భాగ్యం ఎట్లా ఉంటే పనులు అట్లా జరుగుతాయండి. అదే ఇంకొంచెం చేదుగా చెప్పుకోవాలంటే, మన మొహాన ఏం రాసిపెట్టుంటే అట్లా జరుగుతూ ఉంటుంది. అంతేగా! మన రాత మార్చేవాడు ఎవడున్నాడు? నువ్వే రాసుకున్నావు. నువ్వు ఇది వరకు చేసిన పనుల వల్ల ఆ రాత ఏర్పడుతుంది. ఇప్పుడు ఆ పని మార్చలేవుగా! ఇప్పుడు నీకు జరగటం జరక్కపోవటం అనేటువంటిది ఇది వరకు నీవు చేసినదాన్ని బట్టి ఉంటుంది. ఆ కారణం చేత ఆవిడ చివరికి ఏమనుకుందంటే, నా తల రాత ఎట్లా ఉందో? నా భాగ్యం ఎట్లా ఉందో? అనేటువంటి ఒక భావన చేసుకుంది. అలా కాసేపు నిట్టూర్పు విడిస్తూ ఉంటుంది.

ఆ పైన మళ్ళీ ఇంకో భావన కలుగుతుంది. "పోఁ డను బ్రాహ్మణుందు" – ఈ బ్రాహ్మణుడు వెళ్ళే ఉండడు, ఇంటికి వెళ్ళిపోయి ఉంటాడు. ఈ రోజుల్లో మనం పని చెప్తే, వాళ్ళు ఇంటికెళ్ళిపోతారు కదా! ఇంటికెళ్ళిపోయి ఈయన మరునాడు మళ్ళీ కనపడినా, వాడికి గుర్తుండదు మనం చెప్పిన పని. ఏమయ్యా ఏం చేశావంటే,

మర్చిపోయాను సార్ అనదు! ఇది అంత చిన్న విషయం కాదనుకోండి. అసలు ఈయన వెళ్ళాడో, లేదో? ఆయనకే నచ్చలేదేమో కదా!

"పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికి వాసుదేవుఁడున్
రాఁ డను నింకఁ బోయి హరి రమ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁ డను రుక్మికిం దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁ డను గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్."

"పోఁడను బ్రాహ్మణుండు" ఎట్లా వస్తాయో చూడండి భావాలు? ఆందోళనలో ఉన్నప్పుడు మనిషికి రకరకాలుగా భావాలు వస్తాయి. "యదుపుంగవు వీటికి పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికిన్" — వీటికి అంటే ఇంటికి. "వాసుదేవుఁడున్ రాఁడను" — ఇంక ఆయన రానన్నాడేమోలే, మనకేం తెలుసు? రానన్నాడేమో! లోపల భయం చేత, ఆందోళన చేత, ఆత్రం చేత ఇలా అనిపిస్తూ ఉంటుంది. పోని, ఇంకొకళ్ళని ఎవరినన్నా పంపిద్దామంటే, ఇంకెవరు బంధువులు కూడా ఆవిడకి లేరట. పంపించడానికి సమయము లేదు, ఒకటి. రెండోది, పోనీ, పంపించి చెబ్దామా అంటే ఇంకొకళ్ళెవరు బంధువులు కూడా లేరావిడకి. ఎందుకంటే, అంతా అన్నయ్య security check లో ఉంటారు. ఏద్దైనా, ఈయన వేదబ్రాహ్మణుడు కాబట్టి ఈయన జోలికి ఆయన పోయుండడు. అందుకనే, ఈయనని పట్టుకుంది ఆవిడ. ఈ సందర్భంలో ఇంకొకళ్ళని ఎవర్నన్నా పంపించి కబురు పంపిద్దామా అంటే ఇంకెవ్వరు లేరట.

రుక్మిణికి వాళ్ళ అన్నయ్య రుక్మి ఉన్నాడు కదా! వాడు అనుకున్న పని వాడు చేసేసుకోవచ్చు. ఎంచేతంటే, కృష్ణుడు ఇంకా రాలేదు కదా! "దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు నున్నాడు" — ఆ శిశుపాలుడికి ఇవ్వాలనేటువంటి మహా ఉత్సాహంతో ఉన్నటువంటి తన అన్నయ్య రుక్మికి ఇంక ఏ విధమైనటువంటి అడ్డంకి లేదు. ఇంక యదేచ్ఛగా, వాడు అనుకున్నట్టుగా నిర్వర్తించుకుంటాడు.

"గౌరి కీశ్వరికి నావలనం గృపలేదు నేఁ డనున్" — ఇంక మనసు అటుపోయింది. ఎందుకంటే, రేపు పొద్దున అమ్మవారి గుడికి వెళ్తుంది. అప్పుడు కదా విషయం తెలుస్తుంది! ఒకవేళ ఇక ఏదన్న జరిగితే, ఇక అదే last chance కదా! కనపడితే అక్కడ కనపడాలి ఆయన కదా! "గౌరి కీశ్వరికి నావలనం గృపలేదు నేఁ డనున్". ఇంతవరకు కబురు రాలేదండి! రేపు పెళ్లి. అంటే, రేపు పొద్దున గుడికెళ్తాం. తలంటు పోసుకొని, ఆభారణాలు ధరించుకొని అమ్మవారి దుర్గ గుడికి వెళ్తానరన్నమాట. ఆ వెళ్ళే దార్లోనో, వచ్చే దార్లోనో ఆయన కనపడాలి, తనని తీసుకెళ్ళాలి. ఇంతవరకు ఏ కబురు లేదు. అలాంటి పరిస్థితుల్లో ఎలా ఉంటుందండి! ఇవన్నీ

మాకు పది, పదకొండు, పన్నెండు సంవత్సరాల్లో ఈ పద్యాలన్నీ మాకు పాఠంగా ఉండేవి. ఇందులో చాలా కంఠస్థం చేస్తుండేవాళ్ళు. "ఘనుఁ డా భూసురుఁ డేఁగెనో నడుమ మార్గశ్రాంతుఁడై దలచెనో", ఇలాంటి మంచి పద్యాలన్నీ కంఠస్థం చేయించేవారు. అంత చక్కనైన పద్యాలన్నీ మనకి ఊరికే అర్థం తెలిస్తే చాలన్నట్టుగా ఉండేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కూడా లేవనుకుంట.

ఈ పద్యం చదువుకుంటే భావనలోకి ఎంత బాగా చక్కగా మనం ప్రవేశించగలుగుతున్నామ్మో చూడండి! అందుకని చదువుకోవాలి బమ్మెర పోతన మహాత్ముని యొక్క పద్యాలు. తెలుగు రాని వారికి తెలుగుదేశంలో పుట్టడం వలన వారికి చాలా దురదృష్టం అవుతుంది – సందేహం లేదు. ఎప్పుడూ చెప్తూ ఉంటాను. ఎందుకంటే, పోతన పద్యాలు చదువుకోలేరుగా వాళ్ళు! పోతన పద్యాలు చదువుకోలేకుండా తెలుగుదేశంలోనే పుట్టానుట అంటే ఒక మహోన్నతమైనటువంటి అవకాశాన్ని అట్లా చేజేతులా జారవిడుచుకుంటా అని అర్థం. భాగవతం సంస్కృతంలో రాసి ఉండచ్చు. కాని తెలుగులో రాసినదాంట్లో ఉండేటువంటి రసము, భక్తిరసము ఇంక ఎక్కడా కనపడదు. ఇంక ఏ గ్రంథంలోనూ కనపడదు. అంచేత, భాగవతం అంటే తెలుగు భాగవతమే! అది తెలిసిన వారికే తెలుస్తుంది దాని రుచి. అందులో ఇలాంటి పద్యాలు కోకొల్లలు ఉంటాయి మనకి. ప్రతి ఘట్టంలోనూ ఉంటాయి. వీటన్నిటినీ పూర్వకాలంలో వాళ్ళు కంఠస్థం చేసేవాళ్ళు. పొద్దున లేచిన దగ్గరనుంచి కార్యక్రమాలు చేసుకుంటూ వరుసగా ప్రహ్లాద ఉపాఖ్యానం చదివేసుకోవడం, వామనోపాఖ్యానం చదివేసుకోవడం, గజేంద్రమోక్షం చదివేసుకోవడం, రుక్మిణీకల్యాణం చదివేసుకోవడం ఉండేది. పుస్తకాలు పట్టుకొని చదువుకోవడం కాదు, నోటికొచ్చేసుండేవి. చిన్నప్పుడే అమ్మమ్మలు, తాతమ్మలు, తాతలు, తాతయ్యలు పక్కల్లో పడుకోబెట్టుకొని పిల్లలకి నేర్పించేవాళ్ళు. మేమంతా అమ్మమ్మ, తాతయ్యల ఒళ్ళల్లోనే నేర్చుకున్నాం. "ఎవ్వనిచే జనించు జగనవ్వవని లోపలినుండు లీనమైనట్టు". ఇప్పుడు అలా చెప్పటానికి తండ్రికీ రాదు, తాతకూ రాదు కదా!

మనం ఒక సద్గురువు పరంపరకు సంబంధించి, ఆయన ఆశ్రయంలో జీవించి జీవితాల్ని వికసింప చేసుకుందాం అనుకునేటువంటి వాళ్ళందరం కూడా తప్పక ఇలాంటి చేతనోద్ధారకమైనటువంటి పద్యాలు చదువుకోవాలి. అంటే, మన చేతస్సును చక్కగా ఉద్ధరిస్తాయి. వాటిలో ఉన్నటువంటి కల్మషాలన్నీ తీసేస్తాయి. ఇలాంటి పద్యాలు చదువుకోవాలి. చదువుకోవాలంటే, మనకి రాదు కాబట్టి టీక కూడా ఉంటుంది. టీక ఉన్నది తెలుసుకుంటే మనం కొంచెం కుస్తీపట్టచ్చు. కొన్నాళ్ళు అట్లా చేస్తే ఆ తర్వాత నెమ్మదిగా పద్యాలు విడమరచి చదువుకుంటే అర్థమైపోతాయి పోతన పద్యాలు. ఇప్పుడు నేను చదువుతుంటే మీకు అర్థమైతున్నాయి కదా! ఎక్కడ ఆపాలో తెలియకుండ చదివామనుకోండి, ముందుది వెనకాల, వెనక్కి ముందు కలిపేసి, అప్పుడు అర్థం కాదు.

లేకపోతే పద్యాలు బాగా అర్థమవుతాయి. కొన్నికొన్ని పద్యాలు క్లిష్టంగా ఉంటాయి. ముందు అర్థమయ్యే పద్యాలన్నీ బాగా చదువుకోవచ్చు. అర్థం కానివి టీక పెట్టి చదువుకోవచ్చు. ఇలా కొంత ప్రయత్నం చేయచ్చు. ఇలా చేస్తే ఏం జరుగుతుంది అంటే, ఒక్కటి కచ్చితంగా చెప్పగలను. మనం ఎంతో సాధన చేసి, మనలో ఉండేటువంటి ఈ చైతన్యాన్ని శుద్ధ పరుచుకుకొని, కిల్బిషాలన్నీ వదిలించుకుందామనేటువంటి ప్రయత్నం ఉంటుందే, అవి కేవలం వీటి పారాయణ వల్ల, చాలా అర్థవంతగా పారాయణ చేస్తే కరిగిపోతుంది. అంత అద్భుతమైనటువంటి పద్యాలు ఇవి. ఎంచేత, "పలికించెడి రామభద్రుండు" కదా! సాక్షాత్తు శ్రీరాముడే ఇదంతా రాశాడు, నేను ఊరికే వాహికగా ఉన్నాను. Iam only a medium అన్నాడు. గుర్తుపెట్టుకోండి మాస్టరు సి. వి .వి. గారు వచ్చిన తర్వాత ఈ mediums వచ్చినాయి అని అనుకోబోకండి. ఎప్పుడు భక్తులందరూ భగవంతుని medium సే. భగవంతుడికి భక్తుడు వాహిక. అలాంటి వాహిక లోంచి ఇలాంటి పద్యాలు మనకి జాలువారినప్పుడు... అది పలికింది భగవంతుడే. అందుకనే, అన్నమాచార్యుల కీర్తనలు కూడా మనకి అంత బాగుంటాయి. ఎంచేత? ఆయనే కూర్చుని రాయించుకున్నాడు కాబట్టి.

> "చెప్పదు తల్లికిం దలఁపుజిక్కు దిశల్ దరహాస చంద్రికం
> గప్పదు వక్త్రతామరస గంధసమాగత భృంగ సంఘమున్
> రొప్పదు నిద్రఁ గైకొని దురోజ పరస్పరసక్త హారముల్
> విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్."

ఒక యువతికి, ఒక కన్యకు అత్యంత సన్నిహితమైనటువంటి వారు ఎవరండి? ఒక most confidential, చాలా అంతరంగికమైనటువంటి విషయాలు తెలియపరచాలంటే ఒక కన్య ఎవరికి చెప్పుకుంటుంది? అందరితోను చెప్పుకోలేదు కదా! చాలా సన్నిహితమైనటువంటి స్నేహితురాలు ఉంటే చెప్పుకుంటుంది. లేదా తల్లికి చెప్పుకుంటుంది. ఎందుకని? తల్లే దగ్గర, తండ్రి కాదు. తల్లి ఎలా ఉండాలంటే, తన సంతానం తనతో communicate చేయటానికి ఉత్సహించేట్టుగా తయారు చేసుకోవాలి పిల్లల్ని. అంతేగాని, అమ్మకి చెప్తే కోప్పడుతుంది అని ఉందనుకోండి, అమ్మకి చెప్పడం మానేశారంటే పిల్లలు ఆ తల్లి పోషణ సరిగ్గా లేదని అర్థం. తల్లికి చెప్పకుండా తండ్రికి చెప్తున్నారంటే.. తండ్రి దగ్గర అవ్వటం అనేటువంటిది ఎప్పుడు జరుగుతుందంటే, తల్లి అంత దగ్గరగా చేరదీయక పోవటం వల్ల. తల్లి క్రమశిక్షణ పేరున మాటిమాటికీ వద్దు, మాటిమాటికీ కాదు, మాటిమాటికీ కూడదు, ఇట్లా చెప్తూ ఉందనుకోండి అప్పుడు నెమ్మదిగా పిల్లలు తండ్రి పంచన చేర్తారు. మామూలుగా ఏదైనా పిల్లలు తల్లికే చెప్పుకుంటారు. మొట్టమొదట తల్లి, తర్వాత తండ్రి.

ఇక్కడ ఏం జరుగుతోంది? “చెప్పదు తల్లికిం దలఁపుజిక్కు దిశల్” – రకరకాలుగా చిక్కుగా లోపల భావాలు వస్తున్నాయి కదా! కొన్ని భావాలు ఇప్పుడు చెప్పాం కదా! మూడు, నాలుగు పద్యాలు. అమ్మా! నాకిట్లా బాధ కలుగుతోందమ్మా, నేనిట్లా చేశాను అని చెప్పదు, ఒకటి. ఆవిడ అర్థం చేసుకుంటుందో లేదో, రెండు. ఆవిడకి tension వస్తే, ఆమె వెళ్లి నాయనకి చెప్పేస్తే? లేకపోతే, తల్లికి కొడుకు దగ్గర. అందుకని కొడుకుకి చెప్పేస్తే అదంతా పాడైపోతుంది. మాములుగా ఏం జరుగుతుందంటే, తల్లికి కొడుకు, తండ్రికి కూతురు దగ్గరగా ఉంటూ ఉంటారు. తండ్రి కూతురు మీద ఎక్కువ పెట్టుకుంటూ ఉంటాడు. తల్లి కొడుకు మీద ఎక్కువ పెట్టుకుంటూ ఉంటుంది. ఇదొక సహజగుణాలివన్నీ. అందుకని ఏదైనా ఉంటే తల్లి కూతురుతో share చేసుకుంటుంది, కూతురు తల్లితో share చేసుకుంటుంది. తల్లి కోపిష్టిది అనుకోండి, ఇంక వాళ్ళకి పాపం దారుండదు. తండ్రి కోపిష్టి అనుకోండి, తల్లి అన్నా ఉండనుకోవాలి. ఇద్దరూ కోపిష్టి అనుకోండి, ఇక ఏం చేయలేం! ఇంక ఊళ్ళో చెప్పుకోవాలి అంతే! అలాంటి పరిస్థితి కలగకూడదు కదా! అలా పిల్లలకి అలాంటి పరిస్థతి కలగకూడదంటే, తల్లితండ్రులు వాళ్లతో ఎలా ఉండాలండి? They must be the friendliest parents. స్నేహితులను మరిపించేట్లుగా ఉండాలి తల్లితండ్రులు తప్పు, ఆంక్షలు పెట్టి, క్రమశిక్షణ అనే బాధలు పెట్టి, మానసికంగా వారికి భయం కలిగించి, లేకపోతే సాన్నిహిత్యాన్ని కోల్పోయినట్లయితే అటుపైన ఆ పిల్లలు ఈ తల్లితండ్రులతో ఏమీ చెప్పుకోరు. చెప్పుకోకపోవటం వల్ల పిల్లలు ఏ దిశగా వెళ్తున్నారో, తల్లితండ్రులకు కూడా తెలియదు.

ఇప్పుడు ఏం జరిగింది? ఈవిడ రాజకన్య. రాజులకి రహస్యమెక్కువ. అదొకటి ఉంది కదా! అందుకనే, రాజరహస్యం అంటూ ఉంటాం. ఒకటి గుర్తుపెట్టుకోండి. సుక్షత్రియుడు లోపల ఏం ఆలోచిస్తున్నాడో ఎవ్వరికి ఏం తెలియదు. పురాణాలు చదువుకుంటే బాగా తెలుస్తాయి. భారతం చదువుకుంటే అందులో వ్యాసుడు చెప్తాడు. బ్రాహ్మణుడి ఆలోచనంతా బయటే ఉంటుంది, రాజు ఆలోచనంతా లోపలే ఉంటుందని ఒక కథ చెప్తారు ఉదంకోపాఖ్యానంలో. ఇప్పుడు ఆ కథలో వెళ్ళవద్దు, మనకు ఈ కథ సాగాలి కాబట్టి. అందుకనేమిటంటే, రహస్యగోపనము అనేటువంటిది రాజుల్లో చాలా ఎక్కువ. అందుకనే రాజరహస్యమంటారు. వాళ్ళు ఏదీ బయటకి చెప్పరు. వాళ్ళు బయటకి చాలా ప్రశాంతంగా నవ్వుతూ ఉంటారు. లో లోపల చాలా అలోచిస్తూ ఉంటారు. దానికి విరుద్ధంగా ఉంటాడు బ్రాహ్మణుడు. బయటకి ధాం ధూం, అంటూ ఉంటాడు. లోపల చాలా ప్రశాంతంగా ఉంటాడు. ఎందుకంటే, చిన్న చిన్న చిరాకులకు ఊరికే టపాకాయ పేలినట్టుగా పేలిపోతూ ఉంటాడు. కొంచెం ఉప్పు ఎక్కువైతే అరుస్తూ ఉంటాడు, కొంచెం కారం తక్కువైతే అరుస్తూ ఉంటాడు. కొంచెం ఏదో జరగాల్సిన పని చిన్న చిన్నవే సరిగ్గా జరగకపోతే ధాం, ధూం అంటూ ఉంటారు. వీళ్లంతా బయటకి ధాం అనేవాళ్ళు లోపల హాయిగా ఉంటారు. బయటకి చాలా calm గా ఉండేవాళ్ళకి లోపల సముద్రం లోపల

ఉండేటువంటి అలజడి ఉంటుంది. అందుకనే మనకి సామెత చెప్తారు, గంభీరమంటే సముద్రమే అని. అది లోతుల్లో విషజంతువుల దగ్గర నుంచి అన్నిటిని లోపల దాచుకొని, బయటకి ఆహ్లాదంగా మనకి అలల్ని ఇస్తూ, చల్లని గాలినిస్తూ ఉంటుంది. లోపలంతా హాలహాలం. ఇప్పుడు ఈ రుక్మిణీదేవి అంతా లోపల పెట్టేసుకుంది రాజకన్య అవ్వటం చేత !

అంటే, కొంచెం అట్లా దీనంగా మొహం పెట్టుకుందనుకోండి. "ఏమిటే? అలా ఉన్నావు?" అని అడుగుతారు కదా! అందుకని, బయటకి నవ్వుతూ "దరహాస చంద్రికలు", అంటే చిరునవ్వు చిందిస్తూనే ఉండండి బయట. లోపల ఇంత బరువు పెట్టుకొని, బయటకి చిరునవ్వులు చిందిస్తూ ఉందిట.

"గప్పదు దరహాస చంద్రికం వక్త్రతామరస గంధసమాగత భృంగ సంఘమున్ రొప్పాదు" – అంటే ఏమిటో? ఆమె అందానికి తన చుట్టూ ఉన్న ఉద్యానవన్నాల్లో ఉండేటువంటి ఆ తేనటీగలు, అవి ఇవి వచ్చి చేర్తుంటే, ఆ ముప్వర్లకు అవి కూడా తోలదట. "నిద్రఁ గైకొనదు" – సమస్య ఉంటే నిద్రపోయేవాళ్ళు ఎట్లా ఉంటారు చెప్పండి! సమస్యుంటే వాడు నిద్రపోయాడట అంటే వాడికి సమస్య కాదని అర్థం కదా! ఏమిటి సమస్య? తన జీవన సమస్యే. జీవన మరణ సమస్య అంటారు చూశారా! life and death issue ల్లాంటివి వచ్చినప్పుడు నిద్రపోలేరు కదా! ఇంట్లో ఎవరికో అంత గొప్పగా లేదట, కొంచెం ఇబ్బందిగా ఉంది, ఏమో ఏం జరుగుతుందో అన్నట్టుగా ఉండేవారు నిద్రపోరు కదా! "నిద్రఁ గైకొనదు"– నిద్రరాదు. "దురోజ పరస్పరసక్త హారముల్ విప్పదు" – గుండెల మీద పడినటువంటి హారాలు చాలా ఉంటాయి, రాజకుమారి కదా! రేపు పెళ్లి అవుతుందట అంటే, ఇవ్వాళ్ళ బోల్డు సింగారం చేస్తారు. ఆ గోలుసులన్నీ చిక్కుబడిపోయినటండి. ఆ చిక్కులు తీసుకోవట్లేదట. ముంగురుల చుట్టూ తేనటీగలు తిరుగుతున్నాయట. భ్రమరములంటాము, వాటిని పంపించదట, అమ్మతో చెప్పుకోదట.

"సక్త హారముల్విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులు ద్రిప్ప దెప్పుడున్" – కృష్ణుడు వచ్చే మార్గము వైపు సూపు. "సూపు" అంటే మనకొక ఇల్లుందనుకోండి. అక్కడ gate దగ్గర ఇంటాయన వస్తుంటే ఇంటావిడ gate వైపే చూస్తూ ఉంటుంది కదా! ఇప్పుడు flat లు కాబట్టి ఆ గొడవ లేదు! కనపడదు gate లోకి వస్తే! మామూలుగా ఏం జరుగుతుందండి? అట్లా gate వైపే చూస్తూ ఉంటారు మనకి కావాలసిన వాళ్ళు వచ్చేవరకు కదా! అలా మనసు పెట్టుకుంటారు. మాములుగా ఎలా ఉంటుందంటే, ఇప్పుడు మనం ఇంట్లో కూర్చున్నామనుకోండి. మన పిల్లవాడే ఉద్యోగం చేసుకొని ఇంటికి వస్తున్నాడనుకోండి! ఈ రోజుల్లో ఉద్యోగాల నుంచి అందరూ late గా వచ్చేవాళ్ళే కదా! ఎవరూ అయిదు గంటల కల్లా office మూసుకుని ఇంటికి వచ్చే

రోజులు లేనేలేవు. రాత్రి ఎనిమిదింటిదాకా, తొమ్మిదింటిదాకా, పదింటిదాకా ఎందుకండి అంతసేపు ఉద్యోగాలు? వాడు వస్తున్నాడు అంటే... మురళి నవ్వుతున్నాడు. మాటిమాటికీ ఇదొకటి చెప్తున్నాడు ఈయన. మనందర్ని ఉద్యోగాలు మానేయమని చెప్తున్నాడేమో అని ఒక ఆలోచన! మానేయండి వెధవ ఉద్యోగాలు! అందులో చెప్తున్నాడేమో అని అనుకోవడం ఎందుకు? మన జీవితానికి పనికిరానివి మానేసుకోటం చాలా మంచిది. వేరే మార్గం చూసుకోవటమే. అక్కడెక్కడో horn కొట్టాడనుకోండి. ఇప్పుడు తపోవనంలోకి తిరుగుతూ horn ఇస్తే, ఇంట్లో ఉండే వాళ్ళు అబ్బాయి వస్తున్నాడండి అని వాళ్ళ అమ్మగారు, మా ఆయన వస్తున్నారండి అని horn నే గుర్తుపట్టేస్తారు. అన్ని అదే కారణం. ఈ horn వాళ్ళకి తెలుస్తుంది తెలుసా! అట్లాగే ఎవరి భర్త scooter sound భార్యకి తెలుస్తుంది, భర్త car horn భార్యకి తెలుస్తుంది. అట్లా ఉంటాయి కదా! ఎంచేత? వాళ్ళ కోసం చూసేటువంటి ఆ ఎదురు చూపుందే, అది కారణంగా వాళ్ళు ఉండడం భౌతికంగా ఇక్కడ ఉంటారు గాని, ఆ corner లో ఏ సందు తిరిగి కారో, scooter లోపల సందు తిరిగి వస్తుందో అక్కడే ఉంటుంది మనకి. ఇక్కడకొచ్చి gate కొచ్చి horn కొట్టినా విననివాళ్ళు ఉన్నారనుకోండి, లోపల అలాంటి ఇంట్లోకి వెళ్ళటంకన్నా అలా వెళ్ళిపోతే సుఖం కదా! అంటే, మనం ఇంటికి వచ్చామో లేదో దానికి పెద్ద తేడా లేదనుకోండి, అలాంటి ఇల్లు ఎందుకండి?

ఇక్కడ విషయమేమిటి? కృష్ణుడు వస్తున్నాడేమో అని రాజప్రాసాదాల పైకెళ్ళి అక్కడ నుంచి అలా చూస్తూ ఉంటుందట. "కృష్ణమార్గత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్". ఇది మనకి చాలా ముఖ్యమైనటువంటి విషయం. కృష్ణుడు వచ్చే మార్గం ఒకటి ఉంది కదా! మనలో కూడా కృష్ణుడు వచ్చే మార్గమున్నది. ఆ మార్గం వైపు కన్నులు తిప్పి చూస్తూ ఉండడం అనేటువంటిది సాధన. ఆ మార్గమెలా ఉంది? నీ శిరస్సు లోంచే దిగివస్తాడు. నీ సహస్రారమందు నారాయణుడై ఉన్నటువంటివాడు, నీ లోపలికి వాసుదేవుడై దిగి వచ్చినటువంటివాడు, అతడు హరియై నీకు హృదయంలో దర్శనం ఇస్తాడు. అంచేత, నువ్వు ఎటు చూస్తూ ఉండాలి? అంతరంగం చేరి, అంతరంగమందు ఊర్ధ్వముఖుడవై ఉండాలి. అంటే, కన్నులు మూసుకొని నీవు హృదయంలో ఉన్నట్టుగా భావన చేసుకొని, ఈ ఊర్ధ్వము అయినటువంటి శిరస్సు నుండి కృష్ణుడు వచ్చేటువంటి కాంతుల కోసం వేచి ఉండాలి. ఎందుకంటే, కాంతి దర్శనం అవుతుంటే, ఆ తర్వాత కృష్ణ దర్శనం అవుతుంది. కృష్ణుడంటే కనపడని వాడు అని అర్థం. కనపడని వాడు ఎలా కనిపిస్తాడు? అతని కాంతి దర్శనం అయితే అతను వచ్చినట్లు లెక్క. కృష్ణ కాంతి అంటే నల్లనీలం లాగా ఉంటుంది కదా! అలాంటి కాంతి నువ్వు చూడటం అనేటువంటి విషయమునందు నీకు బాగా రుచి కలిగితే, ఇంక ఇవన్నీ సరిగ్గా ఉందా, లేదా? ఈ దండ, ఈ గుండి సరిగ్గా పెట్టుకున్నామా లేదా? సరిగ్గా దువ్వుకున్నామా? ముందుకు పడిపోయిందా? ఇవన్నీ ఉండవు కదండి భక్తుడికి! అంటే, భక్తుడు భగవంతుని

కోసం ఎదురు చూస్తున్నాడనుకోండి... అంటే, రుక్మిణీదేవి, కృష్ణుడు. ఆమె భక్తురాలు, ఆయన భగవంతుడు. భగవంతుడ్ని పిలిచింది భక్తురాలు.

అగ్నిద్యోతనుడు గురువులాంటివాడు కదా! అతడి ద్వారా కబురు పంపించింది. సద్గురువే కదా సంధానకర్త! కిందటి సారి కూడా మీకిక్కడ చెప్పాను. ఆయన బ్రహ్మగారు. అంటే, మనకి విష్ణువుతో పెళ్లి కుదురుస్తాడు. అంచేత, ఆయన చేతే కబురు పంపించింది. ఆయన చక్కగా ఆయన కార్యం నిర్వర్తించాడు. తప్పక నువ్వు స్వీకరించవలసినటువంటి స్త్రీ ఆమె అని, యువతి ఆమె అని, కన్య ఆమెని. ఆయన అలాగే అన్నాడు కదా! కాబట్టి, తండ్రి కుదిర్చిన తర్వాత అటుపైన జరగవలసిందేంటంటే, భగవత్ స్పర్శ కోసం గురువు సహకరిస్తూ ఉంటాడు. మనకి భగవత్ స్పర్శ కలగాలనేటువంటి తపన మనకన్నా మన సద్గురువుకు ఎక్కువుంటుందండి. అదొకటి గుర్తుపెట్టుకోండి. ఎందుకని? తను ఇద్దరి మధ్యా మధ్యవర్తిగా వర్తిస్తున్నాడు కదా! మధ్యవర్తిగా వర్తిస్తున్నటువంటి సద్గురువు తనని ఆశ్రయించినటువంటి ఒక సదాచార సంపన్నుడైనటువంటి శిష్యునికి భగవత్ స్పర్శ కలగాలనేటువంటి సంకల్పం చేయటమే కాకుండా, తదనుగుణమైనటువంటి ప్రయత్నం కూడా చేస్తూ ఉంటాడండి.

మనం సద్గురువును ఆరాధన చేసి, బ్రహ్మము నందు లగ్నం చేస్తాం మనస్సు. "గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః". సద్గురువు ద్వారానే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, దానికి అతీతమైనటువంటి బ్రహ్మమును నేను దర్శనం చేసుకుంటాను. వారందరి రూపంలోనే నాకు నా గురువు సాక్షాత్కరించి, నాకా మార్గాన్ని దర్శనం చేసేటువంటి విధానాన్ని నేర్పాడు అని తెలుసుకుని ఉండాలి.

ఇప్పుడు ఈమె ఏం చేస్తోంది? అలా కృష్ణుడు వచ్చే దారి పక్కకు చూస్తుంది అంటే రెండు రకాలుగా చెప్పుకోవచ్చు మనం. ఒకటి, అలాగ ఇందాక చెప్పినట్టుగా ఆ దారి వైపే బాగా రాజప్రాసాదంలో పై గవాక్షానికి వెళ్ళిపోయి, ఆ ఉన్నతమైనటువంటి గవాక్షంలోంచి, రాజవ్యూహంలో ఎవరొస్తున్నారో చూస్తూ ఉన్నది అని. రెండోది, లోపల శ్రీకృష్ణుని యొక్క స్పర్శ కోసం వేచి ఉండడం. మూడవది, మనకి అలా జరగటం కోసం మనం అంతరంగమనేటువంటి దాంట్లో ప్రవేశించి, దైవాన్ని ఆశ్రయించినటువంటివాడు బాహ్యమందు ఎలా ఉంటాడో అనేటువంటి విషయం కూడా ఒకటి చెప్తోంది ఈ పద్యం మనకి. అంటే, మాటిమాటికీ అమ్మతో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండదు. ఎప్పుడైతే భగవత్ దర్శనమునందు బాగా అనురక్తి కలిగి, ఒక విహ్వలమైనటువంటి స్థితి ఉన్నదనుకోండి, ఊరికే కూర్చుని పోచు కబుర్లు చెప్పుకోము కదండి!

మనకిది ఊరికే past time – అప్పుడప్పుడు గురువుగారు కార్యక్రమం చెయ్యకపోతే, ఆయనేమన్నా అనుకుంటాడేమో అని ఒక పరిస్థితి! లేదా, ఏదో కొంత దాని యందు అనురక్తి ఉంది గాని, ఇంక మిగతా విషయములు యందు కూడా మనకి అనురక్తి ఉంది. ఏం సందేహం లేదు! వేలు విడిచిన బావమరిది కూతురు పెళ్లికెళ్లామనుకోండి మనం! అనురక్తేగా! సంఘమందు అనురక్తి ఉన్నప్పుడు, దైవమునందు అనురక్తి ఉన్నప్పుడు, ఆ రెండిటికి తేడా ఈ పద్యాల్లో తెలుస్తుంది. ఆవిడ ఏం చేస్తోంది? సరిగ్గా తలకాయ దువ్వుకోవట్లేదు. అలాగే, నగలు సర్దుకోవట్లేదు. వాళ్ళతోను వీళ్ళతోను ముచ్చటించటంలేదు, ఏమి చేయట్లేదు. ఎందుకంటే, ఇది అనురక్తి ఎక్కువగా ఉంది.

అశోకవనంలో అమ్మవారిని హనుమంతుడు చూస్తాడు. ఎలా ఉంటుంది ఆవిడ? నార చీరలు ధరించి, నగలన్నీ చెట్లకి పెట్టేసి, శిరోజములు కూడా సంస్కరించుకోకుండా, అట్లా రామస్మరణ చేస్తూ, తదైక దృష్టితో ఉన్నటువంటి అమ్మవారిని చూస్తారు హనుమంతుడు కదా! అంటే, భక్తుల లక్షణాల్లో ఇల్లాంటివి, అంటే బాహ్యమైనటువంటి విషయములయందు ఆసక్తి, తగ్గుతూ అంతరంగ పరమైనటువంటి విషయములయందు ఆసక్తి పెరిగి ఉండడం చేత, బాహ్యవిషయములందు శ్రద్ధగా వాటియందు వర్తించడమనేటువంటిది ఉండదు అని చెప్పుకుంటానికి ప్రాతిపధికగా ఇలా ఒక పద్యం ఇచ్చారు.

> "తుడవదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
> ముడవదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన దన్న మేమియుం
> గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
> నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్."

ఆవిడకి కళ్ళెంబడి నీళ్ళు వస్తున్నాయట. అది తుడుచుకోవట్లేదట. "కొప్పుఁ జక్కఁగా ముడవదు" – పెళ్లి కూతురు ఎన్ని రకాలుగా అలంకారం చేసుకోవాలి? అయినా ముడుచుకోదు. "నెచ్చెలిం గదిసి ముచ్చటకుం తగదు" – రాజప్రాసాదంలో బోల్డు మంది చెలులు ఉంటారు. వాళ్లతో బోల్డు కబుర్లు సరదాగా చెప్పుకోవాలి కదా! ఎవర్ని పిలవదట, ఎవరితోను మాట్లాడదట. "అన్న మేమియుం గుడువదు" – అవన్నీ ఏర్పాటు చేసేస్తారండి. మనమంతా ఇంతింత చిన్న చిన్న ఇల్లు కాబట్టి అందరం అక్కడే ఇరుక్కుంటాం. రాజప్రసాదం కదా! రాకుమారి గారికి భోజనం అంటే ఓ పది మంది వచ్చేస్తారు. అన్నీ అక్కడ పెట్టేస్తారు, వాళ్ళు వెళ్ళిపోతారు.

"దన్న మేమియుం గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్ నొడువదు" – పెద్దవాళ్ళందరూ ఇంట్లో పావురాలు పెంచుకుంటారు కదా! రామదాసు కథ విన్న తర్వాత ఎవరూ పావురాలు

పెంచడం మానేశారు! పావురాన్ని 14 రోజులు పంజరంలో పెడితే, పద్నాలుగు ఏళ్ళు జైల్లో పెట్టారని మనవాళ్ళు ఏదో ఒక విషయం చెప్పారు. ఉన్న కథ నాకు తెలియదు గాని పావురాలన్నీ బతికిపోయినాయి! ఇది వరుకు ఏం చేసేవారు? ఓ పావురాన్ని పెంచి, దానికి పద్యాలు చెప్పించి, అది ఆ పద్యం తెలియచెప్తుంటే తను వింటే ఆనందం కదా! మనం మాములుగా ఒక పది పావురాలు పట్టుకొని, ఓ పంజరంలో పెట్టుకొని, దానికి "రామ రామ" అని నేర్పిస్తే అది "రామరామ" అంటే, మనం విని ఊరుకుంటామా? వచ్చిన ప్రతివాడికి అది వినిపించాల్సిందే! అట్లా రుక్మిణీదేవి పద్యాలు చెప్పేది పావురాలకి. చెప్తే, అవి మళ్ళీ తిరిగి ఆ పద్యాలు చేప్పేస్తుండేవి. అలాంటిది ఇప్పుడు చేయటం మానేసిందటండి. "గీరముఁ జేరి" – కీరమంటే పావురం. "పద్యమున్ నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్" – ఎవ్వరితోనూ ఇంక ఏమి లేదని అనుకుని, అట్లా దీనంగా, మౌనంగా ఆయన రాకకోసం ఎదురుచూస్తూ అలా ఉండిపోయిందట.

"మృగనాభి యలఁదు మృగరాజ మధ్యమ
జలగములు నాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి
పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన
హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ
తొడవులు తోడవదు తొడవుతొడవు"

"మృగనాభి యలఁదు మృగరాజ మధ్యమ" – చక్కగా అద్దుకోదట బొట్టు. "జలగములు నాడదు జలజగంధి" అంటే నీళ్ళు పోసుకోటం కూడా interest లేదు. "ముకురంబు సూడదు ముకురసన్నిభ" – చాలా సార్లు అద్దంలో చూసుకోవాలి కదా పెళ్లికూతురు! పెళ్ళికూతురు కాకపోయినాగాని, యుక్తవయస్సు వచ్చినటువంటి కన్య ఎన్నిసార్లు అద్దంలో చూసుకుటుంది? ఈ రోజుల్లో ముసలాళ్ళే బోల్డు అద్దాల్లో చూసుకుంటూ ఉంటారు కదా! ఎక్కడ అద్దం కనబడితే అక్కడ మన్ని చూసుకోవడం అనేది మనం చేస్తూనే ఉంటాం కదా! Lift లో అద్దం, bedroom లో అద్దం, bathroom లో అద్దం, drawing room లో అద్దం, train లో అద్దం. అన్నీ చోట్లా అద్దాలే కదా! ఎందుకంటే, బాగా చూసుకుంటాం మన్ని మనం అని! అంటే ఆత్మదర్శనం అన్నమాట! అలా ఏర్పాటు చేసినా ఇక్కడ పెళ్ళికూతురు అయినప్పటికి కూడా ఈమె "ముకరంబు సూడదు ముకురసన్నిభ ముఖి పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి" – పూలు పెట్టుకోవట్లేదు.

"వనకేళిఁ గోరదు వనజాతలోచన హంసంబుఁ బెంపదు హంసగమన" — ఆ కొనలలో హంసలు ఉంటాయి. ఆ హంసలతో ఆడుకోవడం, దానికేదో పెట్టడం, హంసల్ని పోషించడం అనేటువంటి ఒక కార్యక్రమం ఉంటుంది బాగా మనకి సంపద ఉంటే. కొంత మంది ఏదో చిన్న చిన్న గ్లాసులు పెట్టుకొని అందులో చేపల్ని పోషిస్తూ ఉంటారు కదా! అంచేత, హంసల జోలికి పోవట్లేదు. వాటికేమి అన్నం పెట్టట్లేదు, వాటిని పెంచట్లేదు.

"లతలఁ బోషింపదు లతికాలలితదేహ" — చాలా లతవంటి సున్నితమైనటువంటి, సన్నమైనటువంటి దేహం కలిగినటువంటి రుక్మిణీదేవి, ఆ లతల దగ్గరికి వెళ్ళటం గాని, వాటిని సవరించటం గాని, వాటి పువ్వుల్ని చూడడం గాని, వాటికి పోషణ చేయటం గాని చెయ్యట్లేదు. వీళ్ళందరూ ఏమిటంటే వాళ్ళు చెయ్యక్కర్లేకపోయినా, వాళ్ళు ఉల్లాసంగా ఉంటే మామూలుగా ఇలాంటివి చేస్తారు. ఇంతమంది పనిమనుషులున్నా మన పని మనం చేసుకుంటూ ఉంటాం మనకి ఉల్లాసంగా ఉంటే కదా! నీరసంగా ఉంటే, ప్రతి పని పనిమనిషి చేస్తుంది కదా అని వదిలేస్తూ ఉంటాం! పనిమనిషి ఉంటే, మన పని మానేయమని ఎవరన్నా చెప్పారా! ఇది పనిమనిషి చేస్తుంది కదా అని అనుకుంటుంటే, మన పని పనిమనిషి చేసిందానికిను, మన పని మనం చేసుకున్నదానికిను చాలా తేడా ఉంటుంది. మనము ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్నామనుకోండి మనమే చేసుకుంటాం. ఇక్కడ పరిస్థితి ఏమిటి? చాలా మంది ఉన్నప్పటికీ, ఈమె ఉత్సాహంగా చేస్తుండేది ఇది వరకు ఇవన్నీను. పావురంతో మాట్లాడటం, హంసల్ని పెంచటం, పూలమొక్కల్ని పోషించటం — ఇప్పుడు అవన్నీ మానేసింది.

"తొడవులు దొడవదు తొడవుతొడవు" — మామూలుగా మాటిమాటికి బట్టలు మార్చాలి కదా! స్త్రీలు ప్రత్యేకించి పురుషులకన్నా చాలా సార్లు వస్త్రాలు మారుస్తూ ఉంటారు. ఎందుకంటే, అది అలంకార గుణం అది. అది వాళ్ళకి సహజంగా ఉండడం చేత, మగవాళ్ళు ఒక దుస్తులు వేసే లోపల, వాళ్ళు మూడు సార్లు దుస్తులు మారుస్తారు. వీళ్ళు సన్యాసల్లె పొద్దున వేస్తే, రాత్రి వరకు ఇందులోనే ఉంటాడు. వాళ్ళు పొద్దున వేసింది మధ్యాహ్నం వెయ్యరు, మధ్యాహ్నం వేసింది సాయంత్రం వెయ్యరు, సాయంత్రం వేసింది రాత్రి కట్టరు. అందులో functions ఉన్నాయంటే, ఇంక చెప్పనే అక్కర్లేదు కదా! ఏవో రకరకాలుగా మారుస్తూ ఉంటాం, అదొక సరదా. వస్త్రధారణమనేటువంటి అనేది స్త్రీ తత్త్వంలో ఉంది. అమ్మవారివన్నీ అవరణలే కదా! ఆవరణలకు పెట్టింది పేరు అమ్మవారు. ఏ ఆవరణాలు లేనివాడు అయ్యవారు, ఆయన దిగంబరుడు. ఆయనకు ఆరణాలు ఏమి లేవు. ఆవిడే ఆయనకి ఆవరణ. స్త్రీల విషయంలో మాటిమాటికీ వస్త్రాలు మార్చటమనేటువంటిది న్యాయమే, అది గుర్తుపెట్టుకోండి. ఆ విషయంలో మనం కుల స్త్రీలను ఏ విధంగాను అపహాస్యం చేయాలిసినటువంటి అగత్యం లేదు. అది సహజమైనటువంటి గుణం. అలా మార్చాలి కదా! అందులో పెళ్ళికూతురు కదా! అందులో

చిన్నవయస్సులో ఉన్నటువంటిది కదా! ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా మార్చుకోవాలి. “తడవుతడవు” మార్చాల్సినటువంటి “తొడవులు” ఏమి అసలు తొడుక్కోవట్లేదు.

“తిలకమిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవుమాలి యనుచు”

ఆ కమలాలు ఉండేటువంటి ఆ గృహంలోకి వెళ్లదట. “గారవించి తన్నుఁ గరుణఁ గైకొన కరుణతో” – తనను అందుకోవటానికి వనమాలి... “వనమాలి” అంటే తులసిమాల ధరించినటువంటివాడు. పుష్పమాల వేరు, వనమాల వేరు, తులసిదళం అది. ఆ బృందావనంలో కుంజ వనం. కుంజ వనం, బృందావనం అక్కడ ఏం పెంచుతారంటే, తులసి చెట్లు పెంచుతుంటారు. కృష్ణుడు వస్తాడని ఆ గోపికలందరూ ఎప్పుడు వాటి దళాలన్నీ తీసి, దండలుగా కడ్తూ ఉండేవాళ్ళు. కృష్ణుడు ఎప్పుడూ పుష్పమాలలు వేసుకోలేదు, తులసీమాలనే వేసుకున్నాడు. అంచేతే, ఆయన్ని వనమాలి అన్నారు. తులసిని అనుగ్రహించటం చేత విష్ణువుకి కూడా వనమాలి అని పేరు వచ్చింది. తులసి పేరు బృంద. అందుకని బృందావనము అన్నారు. తులసి అంటే పవిత్రమైనది అని తెలియచేస్తుంది, ఆమె పేరు బృంద. జలంధరుడి భార్య. ఆమె మహాపతివ్రత. లోక కల్యాణార్థం ఆమె యెడల విష్ణువు ఒక రకంగా ప్రవర్తించి, అటుపైన అనుగ్రహించి, శాశ్వతంగా ఎప్పుడూ తన భక్తురాల్ని ధరిస్తున్నట్లుగా వనమాలి వేసుకుంటూ ఉంటాడు. అందుకనే,

“వనమాలీ గదీ శారఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ
శ్రీమన్నారయణో విష్ణు ర్వాసుదేవో అభిరక్షతు”

అనేటువంటి ఒక్క శ్లోకం 108 శ్లోకాల్లో అది ఒక్కటి చేసుకున్నా చాలని చెప్తారు. అది మహామంత్రం. అట్లా ఎప్పుడు రక్షిస్తూ ఉండుగాక అని విష్ణువును ప్రార్థించే చిట్ట చివరి శ్లోకం. అలాంటి వనమాలి వేసుకునేటువంటి ఈ కృష్ణుడు సాక్షాత్తు మహావిష్ణువే. “తగవు” అంటే ఇది న్యాయమైనది. అంటే, ఇలా రుక్మిణి చెప్పినట్లు చేయటం తగును అనిపించట్లేదేమో ఆయనకి. అతనికి “తగవు మాలి” అన్నది. “గరుణఁగైకొన్న” – నేను కవి కాదు, పండితుడ్ని అంతకన్నా కాదు కాని కరుణ అన్న పదము వీటిలో చాలా సందర్భోచితంగా కనిపిస్తున్నది. ఎందుకంటే, కరుణ ఎక్కడ ఉంటుందంటే, రక్షించడం అనేటువంటి, ఒక ఆదుకోవడం అనేటువంటి, ఒక రక్షణం కలిగినటువంటి వాడు దైవం. ఆర్తితో పిలిస్తే ఆదుకోవాలి. మరి తప్పా, రైటా అనే ప్రశ్న

కాదక్కడ. తప్పా, రైటా అని మీమాంస చేస్తే అతను దైవం కాడు. తప్పో, రైటో! ఆర్తితో పిలుస్తోంది. తప్పైతే తర్వాత సరిదిద్దికుంటాను. ముందు రక్షిస్తాను. రైటైతే ఎలాగు రక్షించాలి. అందుకనే, "కారుణ్యపయోనిధి" అంటాం రాముడ్ని కదా! కారుణ్యపయోనిధి కదా దైవము. అందుచేత, కరుణ ఉన్నచోట ఇక్కడ రైట్లు, తప్పులు ఏమున్నాయ్యండి! మీకు ఎదుట వాడియందు దయ, కరుణ, ప్రేమ ఉంటే, అప్పుడు నువ్వు తప్పులు చూడవు. కరుణలేకపోవటం చేతనే ఇది న్యాయం కాదు అనే ఉద్దేశ్యంతో ఈయన రావడం లేదు అనేటువంటి భావనతో ఏమి అలంకరించుకోకుండా, అన్యమైనటువంటి విషయములయందు ఏ మనస్సు పెట్టకుండా ఆ విధంగా కృష్ణుడు గూర్చి భావన చేస్తూ, అతడు వస్తూ ఉండేటువంటి దారివైపు చూస్తూ ఉండిపోయింది.

"మలఁగున్ మెల్లనిగాలికి బటురట న్మత్త ద్విరేఫాలికిం
దలఁగుం గోయల మ్రోఁతకై యలఁగు నుద్యత్కీరసంభాషలం
గలఁగున్ వెన్నెలవేఁడిమి న్నలఁగు మాకందాంకుర చ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానల శిఖా దోదూయమానాంగి యై."

"మలఁగున్ మెల్లనిగాలికిన్" – అలా చల్లగా గాలి వస్తే కృష్ణుడు వచ్చాడేమో అని కంగారు పడిపోతోందిట. ఓ చల్లని గాలి ఉన్నట్లుండి వచ్చిందనుకోండి, అవన్నీ చిహ్నాలు భగవంతుడు రావటానికి. Fan పెట్టుకొని continous గా చల్లటి గాలి తెప్పించుకుంటూ కృష్ణుడు వచ్చేసాడనుకుంటే అది అవివేకం! ఇలా బాగా ఉక్కగా ఉన్నప్పుడు, మధ్యలో తెలియకుండా ఉన్నట్టు ఒక్కసారి అలా పిల్లగాలి వచ్చి వెళ్లిందనుకోండి, అందరికి స్వేద తీర్చిందనుకోండి, అది భగవంతుని యొక్క ఆగమనంగా తెలియాలి. అలాగే, అంతరంగమందు ధ్యానం చేసేటువంటి వారికి కూడా లోపల అలాంటి స్పర్శ లభిస్తూ ఉంటాయి. అప్పుడు అది భగవంతుని యొక్క సాన్నిధ్యము కలుగుతోంది అనేటువంటి భావన ఒకటి చక్కగా ఏర్పడుతుంది. "న్మత్తద్విరేఫాళికిం దలఁగుం" – తుమ్మెదలు చేసే అల్లరికి ఏ మాత్రం disturb కావట్లేదట. మనకు తుమ్మెదల వరకు అక్కర్లేదు, దోమలు చాలు కుట్టడానికి కదా! తుమ్మెదలు వచ్చి, అలా ఝూంకారం చేస్తూ మన చుట్టూ తిరుగుతున్నాయి అనుకోండి... అంతకన్నా మించి దోమ తిరిగింది అనుకోండి, మనకి వెంటనే, చాలా త్వరగా, ఆ ధారణ, ఆ ఏకాగ్రత తగ్గిపోతుంది కదా! అది జరగట్లేదట ఆవిడకి. "గోయిలమ్రోఁతకై యలఁగు" – కోయిల కూస్తే చిరాగ్గా ఉంటుందటండి ఆవిడకి. మామూలుగా కోయిల కూస్తే బాగుండాలి కదా! కాని అంత కన్నా ఉత్తమోత్తమమైనటువంటి విషములయందు మనసు లగ్నమై ఉండడం చేత ఈ మామూలుగా బాహ్యప్రపంచంలో ఆహ్లాదం కలిగించేవేవీ ఆమెకు ఆహ్లాదం కలిగించట్లేదు అని అర్థం.

"యలఁగు నుద్యత్కీరసంభాషలం" – తను వెళ్ళి పలకరించకపోతే పావురాలు వచ్చి పలకరిస్తున్నాయి. వాటికి అలవాటు చేయటం చేత, అది ఏం చేస్తుందంటే మనం వేరే ధ్యాసలో ఉన్నప్పుడు అవి వచ్చి పలకరిస్తుంటే మనకి ఎలా ఉంటుంది? కోపం వచ్చేసేది పావురాళ్ళ మీద. "గలఁగున్ వెన్నెలఁవేడిమి" – వెన్నెల వేడిగా ఉంటుందటండి. వెండి వెన్నెల జావిరి అంటాం కదా! అది వేడిగా ఎవరికో ఉంటుందో తెలుసా? బాగా తాపముతో గాధ చెందుతున్నటువంటి వారికి వెన్నెల వేడిగా ఉంటుంది. "న్నలఁగు మాకందాంకుర చ్ఛాయకుం" – ఉద్యానవనంలో మామిడి చెట్టు నీడలో నిలబడటానికి కూడా ఆవిడికి ఇష్టంగా ఉండడం లేదట! మనసులో భావన అనేటువంటి శిఖలు అంటే జ్వాలలు, మనసు నిండా చాలా విపరీతంగా మదనపడుతూ "మనోభవానల శిఖా దోదూయమానాంగియై" – లోపల అలా నిప్పులా మంటలు మండుతున్నట్టుగా ఉంటే వెన్నెల ఏమి నచ్చుతాయి? పావురాల మాటలు ఏమి నచ్చుతాయి? కోకిల పాటలు ఏమి నచ్చుతాయి? ఇలా తుమ్మెదలు తిరుగుతూ ఉంటే చుట్టూ చూసి ఆనందించేటువంటి పరిస్థితి ఎక్కడుంది? ఏమి లేదుగా!

ఈ విధంగా, ఇంక ఆవిడ ఒకే ఒక భావమునందు మనసు లగ్నము చేసి, ఇంక ఇతర భావములు లేనటువంటి ఒక స్థితిలోకి వచ్చేస్తుంది ఆవిడ. అనన్యచింతన అంటాం కదా! ఆహ్లాదకరమైనటువంటి విషయములందు ఆసక్తి లేదు. తనయందు తనకి ఆసక్తి లేదు. ప్రకృతి యందు ఆసక్తి లేదు. పరిసరముల యందు ఆసక్తి లేదు. ఏమిటయ్యా ఆసక్తి అంటే ఆయన రావాలి, నన్ను తీసుకెళ్ళాలి. వస్తే కోరుకోవాలసింది అదే! ఏదో పదిహేను నిమిషాలు ప్రేయర్ చేసి, నా duty నేను చేశాను, వస్తే వచ్చాడు, లేకపోతే లేదు, నాకు పనులు ఉన్నాయి, చేసుకుందాం అనుకునే పద్ధతుల్లో ఉంటే అది భక్తి కాదు కదా! "అయ్యో! ఈ పూట ప్రార్థన అయిపోయింది. మనకేమి మాస్టరు గారి స్పర్శ అనిపించలేదే" అనేది కావాలి. ఇలా ప్రార్థనలు అయిపోతూ ఉన్నాయి, పది సంవత్సరాలు అయిపోయింది, ఇరవై సంవత్సరాలు అయిపోయింది, ముప్పై సంవత్సరాలు అయిపోయింది, నలభై సంవత్సరాలు అయిపోయినవాళ్ళు ఉన్నారు. నా వరకు మాస్టరు గారు పరిచయమై నలభై నాలుగో సంవత్సరం నడుస్తోంది. "ఏమైందిరా? ఏమన్న అయిందా? ఇట్లా స్పర్శ లభించిందా లేదా? ఇంతేనా? ఇంతకన్నా ఏమి లేదా?" – నా అంతటి వాడిని చేస్తానన్నారు కదా మరి సాధకులైనవాళ్ళకి ఈ భావాలన్నీ రావద్దండి! ఏదో ఇట్ల సరదాగా భోజనాలు చేసి... కృష్ణమూర్తి గారు భోజనాలు బాగా పెడతారు. మనం భోజనాలు చేసేస్తాం, వెళ్ళిపోతూ ఉంటాం. టిఫిన్లు పెడతారు, భోజనాలు పెడతారు. మనని ముప్పొద్దులా మేపుతారు అంటారు చూశారా అట్లా, మనకి మార్గంలో భోజనాలకి కరువు లేకుండా మాస్టరు గారు బాగా అనుగ్రహించారు. ఇది ఇప్పుడే కాదు, మొదట్నుంచి ఉంది. మాస్టరు ఇ. కె. గారి చిన్నతనంలో కూడా "అక్కిడికెళ్తే భోజనాలు బాగుంటాయి. అవి తినేసి పోదాం రా!" అని పట్టకెళ్ళారు ఆయన్ని ఒకదా! వీటితోనే తృప్తి

పడిపోతామా? భక్తుడనేటువంటి వాడు అలా తృప్తి పడడు. యోగ సాధకుడు అలా తృప్తి పడిపోతే ఇంక నీకు యోగప్రక్రియ ఎలా జరుగుతుంది? మనం బోల్డు కార్యక్రమాలు పెట్టేసుకొని, అందులో మనమే మునిగిపోయి, ఏది చెయ్యాలో అది చెయ్యకుండా మిగతావన్నీ చేస్తున్నామనుకోండి! ఆయన పేరున railway station కెళ్ళి, train ఎక్కకుండా, ఇంక మిగతా పనులన్నీ చేస్తూ ఉంటే, railway station లో ఎంత కాలముంటే ఏం లాభం? Train ఎక్కలేదు కదా! ఎన్ని train లు వచ్చినాయి, ఎన్ని train లు వెళ్లిపోయినాయి? అంటే, ఎన్ని ప్రేయర్ల కాలం ఉదయపు సంధ్యా, సాయంసంధ్యా వచ్చాయి? ఎన్ని ప్రేయర్లు జారిపోయినాయి? ఎన్ని ప్రేయర్లు జరిగినాయి? ఒక్క ప్రేయర్ చాలదండి గట్టిగా! కానీ, అలా ఎందుకు ఉండడంటే ఈ తపన లేక. అందుకనే మాస్టరు సి. వి. వి. గారు భక్తి లేని యోగము సిద్ధించదు అని చెప్తారు. దేనికి నువ్వు యోగము చేస్తున్నావు? దైవముతో యోగము చెందడానికి యోగం చేస్తున్నావు.

జీవుడు దైవంతో ముడిపడి, శాశ్వతంగా దైవమే తానుగా, తానై దైవమేమో అనేటువంటి ఒక అనుభూతిని పొందుతూ జీవించేటువంటి వరకు కూడా అతడు తృప్తి పడకూడదే! మనం తృప్తిగా బతికేస్తున్నామంటే ఇంక మనకి అప్పుడు కృష్ణుడు రాడు కదా! ఇక్కడ కృష్ణుడు అంటాం, ఇంకోచోట విష్ణువు అంటాం, ఇంకోచోట శివుడంటాం, మరోచోట అమ్మవారంటాం. పేరేమి పెట్టుకున్నా, దైవీతత్త్వము నీ యందు బాగా ఏర్పడాలంటే నీ స్వభావము దైవీస్వభావమై పోవాలి. అలా దైవీస్వభావమైపోకుండా ఉండటానికి కారణమేమిటంటే, మనం బాగా బయట ప్రపంచంలో విస్తరించుకోవటమే. క్లుప్తంగా కుటుంబ పోషణము, వృత్తి, సంఘధర్మము – ఈ మూడు క్లుప్తంగా నిర్వర్తించుకుంటూ, నీ కార్యం నువ్వు చేసుకుంటూ ఉంటే అదో పద్ధతి. ఎక్కడ function ఉన్నా మనం వెళ్లిపోవాలనే పద్ధతుల్లో... మనకి సంఘం చాలా పెద్దది. ఎన్నో కేంద్రాలున్నాయి. అన్ని చోట్లా పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి కదా! అన్ని చోట్లా భారతాలు జరుగుతూ ఉంటాయి, అన్ని చోట్లా ఉపనయనాలు జరుగుతూ ఉంటాయి, అన్నీ చోట్ల షష్టిపూర్తులు జరుగుతూ ఉంటాయి, అన్ని చోట్ల గురుపూజలు జరుగుతూ ఉంటాయి. ఎన్నిటికెళ్తావు? గురుపూజలకి వెళ్ళు, ఇంక మిగతావన్నీ తీసెయ్యి. ఎంచేతంటే, వాళ్ళు పిలవటం సహజం. నీకేది ముఖ్యము? ఇది కాక బంధువులుంటారు. మన సంఘానికి సంబంధం లేకుండా, మనకి బంధువులు ఉంటారు, మిత్రులుంటారు. సంఘంలో మనకి లావాదేవీలకు సంబంధించినటువంటి మనుషులుంటారు. వీళ్ళందరి కోసం మనం తిరిగామనుకోండి, అప్పుడు ఏమైపోయింది? అలా వెళ్లి రావడంలో మూడు నాలుగు రోజుల్లో ఏం జరిగింది మనలో? సాధన జరుగుతుంటే ఎక్కడ తిరుగుతున్నా ఫరవాలేదు. ఎక్కడ తిరుగుతున్నా, లోపల అతన్నే స్మరిస్తున్నాను అన్న భావన ఉందనుకోండి ఎక్కడ తిరిగినా ఒకటే. అంతరంగ సాధన అతి ముఖ్యం అని తెలియచేస్తుంది.

ఇప్పుడు ఈయన చెప్పిన పద్యాలన్నీ కూడా రుక్మిణీదేవి ఎలా ఉన్ముఖమై ఉన్నదో చెప్తున్నాయి. అంతేగాని, alternatives, plan b లు ఆలోచించడం లేదు. ఇప్పుడు మనకి కుర్రాళ్ళందరికీ ఏంటంటే, planb, planc, plan d అంటూ ఉంటారు. అంటే ఇది కాకపోతే అది, అది కాకపోతే ఇది. అసలు ఎందుకు కాదు? ముందే కాదనుకుంటే ఎట్లా? ఈ పెళ్లి కాకపోతే ఇంకో పెళ్లి, ఇది కాకపోతే ఎవడ్ని చేసుకుందాం అని ఆలోచిస్తుందదు. ఇది అయ్యేంత వరకు దీని సంగతిని చూడాలి.

"ఇట్లు హరిరాక కెదురుచూచుచు సకలప్రయోజనంబులయందును
విరక్తయై మనోజానలంబునం బొగిలెడి మగువకు శుభంబుఁ జెప్పు
విధంబున వామలోచనభుజంబు లదరె నంతఁ గృష్ణు నియోగంబున
వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచిన నతని ముఖలక్షణంబుపలక్షించి
యా కలకంఠీ మహోత్కంఠతోడ నకూరీతయై మొగం బునం జిఱు
నగవు నిగుడ నెదురు సని నిలువంబడిన బ్రాహ్మణుం డి ట్లనియె."

ఇంతకుమించి ఆ విషయములయందు అంత రక్తి లేదు. "మనోజానలంబునం" అంటే మనస్సులో పుట్టినటువంటి మంట, జ్వాలలు. "మనోజానలంబునం బొగిలెడి మగువకు" – బాగా ఆ మంటల్లో మండిపోతున్నటువంటి ఆమెకు "శుభంబుఁ జెప్పు విధంబున వామలోచనభుజంబు లదరె". అంటే, వామవురువు భుజము, వామలోచనములు కన్నులు. అంటే, కుడి తొడ అదిరిందటండి, కుడికన్ను అదిరిందటండి. కుడి భాగము అదిరితే మొగవాళ్ళకు శుభము. ఎడం భాగం అదిరితే ఆడవాళ్లకు శుభము. ఇక్కడ ఈవిడికి ఏం జరిగింది? వామలోచనము, వామభుజము అదిరింది. ఏదన్నా కార్యము జరుగుతుందా లేదా అని తెలియటానికి ఇవి సూచనలు. కుడి కన్ను అదిరిందనుకోండి మొగవాడికి శుభసూచకం. ఎడం కన్ను అదిరిందనుకోండి స్త్రీకి శుభసూచకం. కుడి భుజం అదిరిందనుకోండి పురుషుడికి శుభ సూచకం. ఎడమ భుజం అదిరిందనుకోండి స్త్రీకి శుభసూచకం. అలా కన్ను, భుజము, తొడ, ఇవి మనం ఏదైనా కొన్ని విషయముల యందు పరమర్శించి, చాలా ఆత్రుతతో ఉన్నప్పుడు ఇవి అదిరితే, ఈ విధంగా అది మనకి కొంత ఆనందం కలిగిస్తుంది. ఎంచేతంటే, ఏదైనా ఒక పని యందు మన మనసు లగ్నమై ఉన్నప్పుడు, ఈ ప్రపంచంలో మనం గమనిస్తుంటే కొన్ని సందేశాలు వస్తూ ఉంటాయి. అలా మనం ఎదురు చూస్తున్నప్పుడు ఒక ఆవు అలా వెళ్లిందనుకోండి శుభసూచకం. ఒక జంతువు ఎడమ నుంచి కుడికెళ్ళిందనుకోండి అది శుభ సూచకం. అది తెల్లటి జంతువు అనుకోండి మరీ శుభసూచకం. ఇట్లా కొన్ని కొన్ని శకునాలు మనకు చెప్తూ ఉంటారు. ఇటువంటివన్నీ కూడా మనకి పురాణాల్లో తెలుస్తూ ఉంటాయి.

"నంతఁ గృష్ణు నియోగంబున వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచిన" – ఈవిడ కదలటమేంటి, వెంటనే ఆయన కనిపించాడండి. అగ్నిద్యోతనుడు బ్రాహ్మణుడు వచ్చాడు. "నతని ముఖలక్షణంబుపలక్షించి" – ఇంకా ఆయన మాట్లాడలేదు. మనకి ఆత్రంగా ఉంటుంది కదా! అంచేత, ఆయన ముఖం చూసింది ఓసారి, శుభసందేశం ఇచ్చేట్టుగా ఉందా, మరొకరకంగా ఉందా అని.

"యా కలకంఠీ మహోత్కంఠతోడ నకూలీతయై మొగం బునం జిఱు నగవు నిగుడ నెదురు సని నిలువంబడిన బ్రాహ్మణుం డి ట్లనియె" –ఆయన కనపడంగానే గభాలున వెళ్ళిపోయింది. మామూలుగా రాజకుమారి అయితే కదలదు, వాడేవస్తాడు కదా అని. మనకి బాగా ఆత్రంగా ఉన్నప్పుడు మనం వెళ్ళిపోతాం కదా! మాకు పూర్వకాలంలో ఇంటికి పేపర్ వస్తుంది. పరీక్ష result ఇంటి కొచ్చిన paper లో చూసుకోవచ్చు. కానీ మేము అందరమునూ అక్కడ ఆంధ్రపత్రిక, ఆంధ్రా ఆఫీసు దగ్గరకి వెళ్ళిపోయే వాళ్ళం! పొద్దున్న లేచిన దగ్గర్నుంచి, అక్కడ ఒక 200, 300 మంది ఆ paper లు print అవుతుంటే, మొదటి paper ఒకరు పట్టుకుంటే, ఒక paper చుట్టూ ఎంతమంది చేరిపోయి, నానా గొడవ పడిపోయేసరికి, సరిగ్గా చూసుకోకుండా "నువ్వు pass అవ్వలేదురా!" అని ఒకడు చెప్తే, ఈ లోపల వీడు బాధ పడిపోతుంటే, "అరె! తప్పు చూశాను రా! నువ్వు pass అయ్యావురా!" అని మళ్ళీ చెప్పి... నాకయింది అట్లా! అందరం అక్కడ ఆంధ్రపత్రిక ఆఫీసుకి వెళ్ళిపోయాం. అందరం అక్కడ చూశాం. "నువ్వు SSLC తప్పావురా! నీ number లేదు" అన్నాడు. అదేంటి number లేకపోవటంమేంటి? స్కూల్ లో class first అనే పేరు నాకు. Number లేదంటే ఎంత అన్యాయం అయిపోతాం! దిగులుగా తిరిగి వచ్చేస్తున్నాను. Ravindra cool drinks దగ్గరికి వచ్చేసరికి మళ్ళీ వాడే పరిగెత్తుకుంటూ వచ్చేశాడు. మీకందరికి తెలుసు కదా రవీంద్ర cool drinks! "Sorry రా! నేను ఇట్లా తప్పుగా చూశాను, నువ్వు pass అయ్యావు" అన్నాడు. వీడి దుంపదెగ అనుకున్నాం. అక్కడి నుంచి ఇంటికి కాస్త ఆనందగా వెళ్లాం. ఎందుకు ఆంధ్రపత్రిక ఆఫీసుకి వెళ్ళడం? ఇంటికి paper వస్తుంది కదా! ఇంటికి paper వస్తుంది. నీ number నువ్వు చూసుకోవచ్చు. కాని ఆత్రం అలా ఉంటుంది కదా! అందుకని ఈవిడ అలా గబగబా పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయి, ఆయన ముందు నిలబడ్డదండి. "బ్రాహ్మణుం డి ట్లనియె" – ఆయన అన్నాడట.

"మెచ్చె భవద్గుణోన్నతికి కమేయధనావళు లిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునకుం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా!"

నిన్ను మెచ్చుకున్నాడు తల్లి అన్నాడు. ముందు ఆ మాట కదా చెప్పాలి! “నేను ఎలా వెళ్ళానంటే, ఇలా చాలా కష్టపడ్డాను, దారంతా ముళ్ళు గుచ్చుకున్నాయి” అని అలా… చాలా మంది అసలు విషయం చెప్పకుండా, వెళ్ళిన పని అయిన తర్వాత చెప్పకుండా, వీడంతా దానికి buildup ఇస్తూ ఉంటాడు. చాలా buildup ఇస్తాడు. కాని నిజంగా సత్పురుషుడైతే ఏం చేస్తాడో తెలుసా? ముందు శుభమైనటువంటి వార్త చెప్పి, తర్వాత మిగతా విషయం చెప్తాడు. హనుమంతుడు ఏం చెప్పాడు రాముడికి చూడంగానే? దిగిదిగంగానే హనుమంతుడు రాముడు ముందు దిగి, దండం పెట్టి, సీతను చూశాను అని చెప్పాడు. అప్పుడు బాగుంటుంది కాని “మరి నేను ఇలా వెళ్ళాము. మేమంతా ఇట్లా కోతుల మధ్య discussion. చివరికి అందరు నన్ను వెళ్ళమన్నారు. నేను వెళ్ళాను. ఇక్కడ వెతికాను, అక్కడ వెతికాను. ఇట్లా రావణాసురుడి మందిరంలోకి వెళ్ళాను. బోల్డు మంది కన్యలున్నారు. అందులో వెతికాను, ఇక్కడ వెతికాను” అవన్నీ చెప్తూ ఉంటే ఈ వినేవాడికి ఎట్లుంటుందండి! అలా చెప్పేటంటి వాళ్ళు కుసంస్కారులు. ఎదుటవారిని ఉత్కంఠలో పెట్టి ఆనందించే బుద్ధి ఉంటుందే… రేపు పొద్దునకి పిల్లవాడికి ఇవ్వటానికి గిఫ్ట్ ఇంటికి తెచ్చాం అనుకోండి. వాడు “ఇవ్వాళ్ళే ప్యాకెట్ తీసి చూపించవా నాన్న” అంటే “రేపు చూడాలి” అన్నారనుకోండి! రేపు చూడడమేంటి? ఇప్పుడు చూడకూడదా! వాడికి ఎప్పుడు ఆనందం కలిగితే అప్పుడు – అది ముఖ్యం. వాడు ఆనందం పడడానికే కదా ఒక gift తెస్తాం! అలా మంచి విషయం ఊరించి, ఊరించి చెప్పకూడదు. ముందు చెప్తే వాడు ఉపశమనం చెందుతాడు, ఆనందం పడతాడు. అప్పుడు నువ్వు ఎన్నెనా చెప్పవచ్చు. అందుకనే “మెచ్చె భవద్గుణోన్నతికి’ అన్నాడు. నీ యొక్క గుణములకు, ఉన్నతమైనటువంటి నీ గుణాలకి చాలా మెచ్చుకున్నాడు తల్లి అని అన్నాడు.

“కమేయధనావళు లిచ్చె నాకుఁ దా వచ్చె సుదర్శనాయుధుఁడు’ – వచ్చేశాడు అంటున్నాడు. అది చాలదు! అది అనంగానే ఆవిడకి ఎంత పొంగిపోతుందో, ఆనందపడుతుందో. ఇలాంటి పద్యం చదువుకుంటేనే మనకి హృదయము పొంగుతుంది. ఎప్పుడు హృదయం పొంగుతుందో, అప్పుడు హృదయంలో కల్మషాలన్నీ పోతాయి. అందుకే కళ్ళెంబడి నీళ్ళు వస్తాయి కదా! అసలు ఇలా కళ్ళెంబడి నీళ్ళు వచ్చే ఘట్టాలు ఎన్ని ఉంటాయి జీవితంలో? అందుకనే నలదమయంతుల కథ, హరిశ్చంద్రుడి కథ, రాముని కథ, యుధిష్ఠిరుని కథ చదువుకుంటూ ఉంటే కవులు రాసినవి, వాళ్ళు వేసే పదజాలమంతా నీ లోపల నుంచి అలా పొంగుకొస్తుంది దుఃఖం. అప్పుడు కల్మషాలన్నీ పోతాయి. మనకి తోచిందేదో మన భాషలో చెప్పేశామనుకోండి అది వేరు. ఇలా చెప్పగలమా! ఎంత బాగుంది చూడండి పద్యం.

నీ మొత్తం సర్వస్వం ఫలించింది దైవమే వచ్చేస్తే ఇంక మనకి ఫలించనది ఏముంది? ఇన్నాళ్ళు ఇన్ని జన్మలుగా మనం చేసుకున్నటువంటి పుణ్యము, దాని వలన మనకి ఏర్పడినటువంటి భాగ్యము ఏమిటంటే అది

సంస్కారం. అలాంటి సంస్కారములతో కూడి, నువ్వు అతనిని గూర్చి చేస్తున్నటువంటి ఆరాధనల యొక్క ఫలితమంతా కూడా... జన్మ జన్మల ఫలముల భాగ్యమది. ఆ భాగ్యము ఈ రోజుతో నీకు ఫలించింది. వచ్చేశాడు, ఉన్నాడు అక్కడ అని చెప్పాడు.

అప్పుడు అమ్మవారు రుక్మిణీదేవి ఇలా అంటోంది:

"జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశంముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీ కృపన్ బ్రదికితిన్ నీ యట్టి పుణ్యాత్మకుల్
గలరే దీనికి  నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!"

అలాంటి బ్రాహ్మణుడికి ఏమిస్తే ఋణం తీర్తుందండి! గురువుకి ఏమిస్తే ఋణం తీరుతుంది? రుక్మిణీదేవి ఎలాంటి వార్త ఈయన తెచ్చి ఇచ్చాడు. తోడ్కొని వచ్చాడు కదా! చూడండి ఎంత గొప్ప విషయమో! సద్గురువు యొక్క ప్రయత్నం చేత సదాచార సంపన్నుడైనటువంటి శిష్యునికి భగవత్ దర్శనం జరగటమనేది మనకి ముఖ్యం. తోడ్కొని తీసుకొచ్చాడు కదా! ఎవరు ఎవర్ని తోడ్కొని తీసుకొచ్చారండి? నిజం చెప్పండి. భగవంతుడే బ్రాహ్మణుడ్ని రథంలో ఎక్కించుకొని వచ్చేశాడు కదా! "పద వెళ్దాం నా రథంలో" అన్నాడు అంతే తప్ప, "నేను వెళ్తాను, నువ్వు తర్వాత రా" అని చెప్పలేదుగా! "నువ్వు ఎలా నడిచి వచ్చావో, అలాగే నడిచి వచ్చేసేయ్. ఈ లోపల నేను వెళ్ళిపోతాను" అని చెప్పలేదు కదా దేవుడు! అంటే, ఎంత శ్రమ పడ్డాడు సద్గురువు? సద్గురువు దైవమునకు ఒక భక్తుని, ఒక శిష్యుని యొక్క సద్గుణములన్నీ తెలియజెప్పి, అతడు నీ కరుణకు అర్హుడు అని చెప్పి అక్కడ వాదిస్తాడు మన కోసం. అదే చెప్తాడు అక్కడ, కిందటి గురుపూజల్లో మీరు వింటే! "నీకు సరియైనటువంటి భార్య ఆమె. అతనికి ఆమె, ఆమెకు నీవు ఇంక అంతకన్నా లేదు" అని చెప్పి విపరీతంగా రుక్మిణీదేవి గుణాలు పొగుడుతాడు కదా! అట్లాగే సద్గురువు మనల్ని దైవము దగ్గర సమర్దిస్తూ ఉంటాడు. మన వద్దకు వచ్చి, మనకి ప్రోత్సాహం ఇస్తూ ఉంటాడు. ఈ కార్యక్రమమంతా అలా జరిగి జరిగి, జీవుడు, దేవుడు వీరిరువురూ ఒకటయ్యారనుకోండి, అప్పుడు ఆ గురువుకి ఏమిస్తే ఋణం తీర్తుంది!

"జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి" – నీతో పాటు తీసుకొచ్చావు. "నా సందేశముం జెప్పి నన్ నిలువంబెట్టితి" – నేను బతికాను, ఇదే జరగకపోతే నేను ఉండేదాన్ని కాదు అంటుంది. "నీకృపన్ బ్రతికితిన్ నీయట్టి పుణ్యాత్మకుల్ గలరే" – ఇంతకన్నా పుణ్యాత్ములెవరుంటారు నాకు. "నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర" – ఇలా తెచ్చాడు కాబట్టి మనం ఇలా మెడలోంచి తీసి ఇలా ఇచ్చేశామనుకోండి, అట్లా ఇచ్చేయగలమా!

ఏం చేస్తే తీరుతుందండి? నీ ప్రాణం నిలపెట్టినవాడికి నువ్వు ఏమిస్తే అవుతుంది? ఏమిచ్చినా సరిపోదు కదా! అందుచేత, నేను ఇవ్వగలిగినదానిని కాదని ఒప్పుకుందనమాట. నీకు నేను ఏమి ఇవ్వగలిగిన దానిని కాదు. అంచేత, మనస్ఫూర్తిగా దండం పెట్టుకుందండి.

"నం జలిఁ గావించెద భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!" – నువ్వే నా బంధువు అనుకున్నాను, నీకే అన్నీ నేను చెప్పుకున్నాను. "చింతామణి" అంటే ఏ కోరిక అడిగితే ఆ కోరిక తీర్చేది చింతామణి. అది భూమి మీద శంబల గ్రామంలో ఉంది. అప్పుడప్పుడు శ్రావస్య గుహలకు పట్టుకొస్తూ ఉంటారు. అది సనత్కుమారుడి ఆధీనంలో ఉంది. అప్పుడప్పుడు మైత్రేయ ఆధీనంలోకి తీసుకొస్తారు. Nicola Roerich అనేటువంటి ఆయన దాన్ని దర్శించి బొమ్మ వేశాడు. ఆ చేతిలో చింతామణి పట్టుకొని మైత్రేయ మహర్షి బయటకి వస్తుంటే, వెనుక మరువు, దేవాపి మహర్షులు గుహలోంచి బయటకి వస్తున్నట్టుగా ఉంటుందది. ఇలాంటి చింతామణి ఏం చేస్తుందది? నువ్వేం కోరితే అది ఇస్తుందది. చింతామణి, కామధేనువు, కల్పవృక్షము ఇవన్నీ కోరిన కోరికలు తీర్చేవి. అవి మహాత్ముల దగ్గర ఉంటాయి.

ఆమె ఇప్పుడు ఈయన్ని ఏమని పొగిడిందంటే, నువ్వు నాకు ఉన్నటువంటి ఒకే ఒక బంధువువి, సద్బంధువువి. సద్బంధువంటే? అందరి బంధువులు సద్బంధువులవుతారా? "సత్" అంటే దైవము, సత్యం. అదే శివము, సుందరము. అలాంటి తత్సంబంధంగా నువ్వు నాకు బంధువు, సత్బంధువు. సత్యము ఆధారంగా ఇప్పుడు మన బంధువులుగా ఉన్నాం. మనమంతా బంధువులమే! మాస్టరు గారు అనేవారు "అందరూ ఒకరికొకరు బంధువులే" అని. ఎంచేత? సత్యమునందు ఆసక్తి గొని, ఆ మార్గములో నడవాలనే నిర్ణయం చేసుకున్న వాళ్ళం కాబట్టి. బంధువుల కన్నా ఆత్మబంధువుల యందు ప్రీతి ఎక్కువ ఉంటుంది, గురుబంధువుల యందు ప్రీతి ఎక్కు ఉంటుంది. అందులోనూ, ఈయన చింతామణి, "సద్బంధుచింతామణి!" అంచేత, నేను నీకు దండం పెట్టగలను నాయనా! అంతకన్నా నేను ఏం చేయలేను అని చెప్పింది. అప్పుడు ఆ విధంగా ఆవిడకి ఉత్కంఠ అంతా తీరిపోయింది. ఆనందం బాగా పెల్లుబుక్కింది. అప్పుడు,

> "అని నమస్కరించె నంత రామకృష్ణులు తన కూఁతువివాహంబునకు
> వచ్చుట విని తూర్యఘోషంబులతో నెదుర్కొని విధ్యుక్త ప్రకారంబునం
> బూజించి మధుపర్కంబు లిచ్చి వివిధాంబరాభరణంబులు మొదలైన
> కానుక లొసంగి భీష్మకుండు బంధుజన సేనా సమేతులైన వారలకుఁ
> దూర్ణంబున సకలసంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి

విడియించె నిట్లు కూడిన రాజుల కెల్లను వయో వీర్య బలవిత్తంబు లె
ట్లట్ల కోరిన పదార్థంబు లెల్ల నిప్పించి పూజించె నంత విదర్భపురంబు
ప్రజలు హరిరాక విని వచ్చి చూచి నేత్రాంజలులం దదీయవదన కమల
మధు పానంబు సేయుచు."

వచనం అన్నమాట అది. ఆవిడ నమస్కరించింది. అక్కడికి ఆ ఘట్టం అయిపోయింది. "రామకృష్ణులు తన కూఁతువివాహంబునకు వచ్చుట విని" – బలరాముడు, శ్రీకృషుడు తన కుమార్తె వివాహ సందర్భంగా వచ్చారని విన్నాడు భీష్మకమహారాజు, రుక్మిణీదేవి తండ్రి. "తూర్యఘోషంబులతో నెదుర్కొని" – తూతులు పట్టుకొని మేళం, వాయిద్యం, ఈ రాజులు, వచ్చినవాళ్ళందరికీ పట్టుకొని వెళ్ళిపోయి, అక్కడ వాళ్ళ దగ్గరికి వెళ్లి, వాళ్ళను ఆహ్వానించడం అన్నమాట. "నెదుర్కొని విధ్యుక్త ప్రకారంబున" – అంటే ఎలా చెయ్యాలో ఆ విధంగా. "యధావిధిగా పూజించి మధుపర్కంబులిచ్చి" – మధుపర్కంబులంటే తియ్యని పానీయము ఇచ్చి, "వివిధాంబరాభరణంబులు" ఇచ్చి అంటే వస్త్రాలు ఆభరణంబులు కూడా ఇచ్చారట. వచ్చిన ప్రతివాళ్ళకీ ముందే gifts ఇచ్చేశారండి. బట్టలు పెట్టేశారు, ఆభరణాలు ఇచ్చేశారు. చల్లని పానీయం, తీయని పానీయం ఇస్తూ, వాటితోనే బట్టలు పెట్టేశారు. ఆభరణాలు కూడా పెట్టేశారు. వచ్చిన రాజబంధువులందరికినీ "మొదలైన కానుక లొసంగి భీష్మకుండు బంధుజన సేనా సమేతులైన వారలకుఁ". ప్రతి రాజు ఆయన వెంట ఆయన బంధుజనం, సేనలు, వాళ్ళందరికి సంపూర్ణంగా "సకల సంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి". ఇంత మంది ఉండటానికి చూపించాలిగా చోటు, విడిది కదా! ఊరికే పిలుస్తే కాదు కదండి. పెళ్ళికి పిలిస్తే అయిపోయిందా? వచ్చిన వాళ్ళందరికీ చోటు చూపించాలి. ఉన్నంతలో ఏదో రకంగా వాళ్ళని సత్కరించాలి. ఈయన రాజుగారు కాబట్టి ఆ విధంగా ఏర్పాటు చేశాడు.

"నివేశంబులు కల్పించి విడియించి" అంటే, విడిదిలో వాళ్ళు సుఖంగా వసించేట్టుగా చూసేంతవరకు... "అదుగోనండి మీ room, అటువెళ్ళిపోండి" అని చెప్పటం కాదు. "విడియించె నిట్లు కూడిన రాజుల కెల్లను వయో వీర్య బలవిత్తంబు లెట్లట్ల కోరిన పదార్థంబు లెల్ల నిప్పించి పూజించె" – వాళ్ళకి ఏమేమి కావాలో బాగా కనుక్కొని, తరిచి తరిచి అడిగి, అన్నీ ఇచ్చి పూజించాడటండి. "అంత విదర్భపురంబు ప్రజలు" – ఆ విదర్భపురంలో ఉండేటువంటి ప్రజలందరికీ రామకృష్ణులు వచ్చారు అనేటువంటి వార్త పొక్కి, వాళ్ళందరూ వాళ్ళని చూడటానికి వచ్చారు. "వచ్చి నేత్రాంజలులం" – కళ్ళతోనే, చూపులతోనే దండాలు పెట్టేస్తున్నారట. దగ్గరగా కనపడరు కదా! అందుకని చూపులతోనే దండం పెట్టేశారు. "నేత్రాంజలులం దదీయ వదనకమల మధుపానంబు సేయుచు" – వాళ్ళిద్దర్ని చూసి, అలా అమృతం తాగినట్లుగా ఆనందిస్తున్నారట.

కృష్ణుడు కదా! చాలా వింటారు చిన్నప్పటినుంచి రకరకాలుగా ఈయన చేసిన లీలలు. మొట్టమొదట సారి శ్రీకృష్ణుడు మధురాపురం వెళ్ళినప్పుడు అక్కడ మేడలోను, మిద్దెల్లో ఉండేవాళ్ళు ఆయన్ను చూసి "వీడే ఆ అందగాడు! ఆ పూతన పాలు తాగి, దాన్ని చంపేశాడు." అట్లా ఎన్ని పద్యాలు రాస్తాడో పోతన! అవి చదువుకుంటూనే అలా ఒళ్ళంతా గగురుపడుస్తుంది. అటువంటి పద్యాలు ఇక్కడ చెప్తున్నాడు. వీళ్ళందరూ చూసి, ఇట్లా అనుకుంటున్నారనమాట. ఏమనుకుంటున్నారంటే, "తగు నీ చక్రి విదర్భరాజసుతకుం" – ఈయనే తగినోడు. ప్రజలకి వాళ్ళ opinions వాళ్ళకి ఉంటాయి కదా! అందర్ని చూస్తారు కదా, వింటారు కదా! ఈయన గురించి చాలా విన్నారు అందుకని వచ్చారు. చూడంగానే ఆనందం వేసింది. ఆ రూపముఖంలోంచి వచ్చినటువంటి ఆ సౌందర్యాన్నంతా చూసి అట్లా కళ్ళతోనే తాగేశారు.

> "తగు నీ చక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం
> దగు నీ చక్రికి నింతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం
> దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా దర్పాహతారాతియై
> మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్ మాపుణ్యమూలంబునన్."

ఈ శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవికి సరియైనటువంటి వాడు. అట్లాగే రుక్మిణీదేవి శ్రీకృష్ణునికే సరియైనటువంటి భార్య. "నింతమంచి దగునే" – అంతా మంచి జరుగుతుంది ఆయనకి. చాలా బాగుంది కదా! అంటే, మనం ఊరికే made for each other అంటాం కదా! సంవత్సరం తర్వాత చూస్తే మొగుడు, పెళ్ళాం కొట్టుకుంటూ ఉంటారు! అంటే, made for each other for fight అని తర్వాత రాసుకోవాలి కదా! ఇక్కడ made for each other సరళ సరళ. ఎప్పుడు ఏ సరళ లేదు కదా మొత్తం కథలో! రుక్మిణీదేవి కృష్ణుని మీద అలిగిందిటా అన్నది లేదు. రుక్మిణిని శ్రీకృష్ణుడు కోపడ్డాడట అనేది లేదు. ఎముండవు?

"దాంపత్య మీ యిద్దఱిం దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా" అన్నాడు. ఓహో! వీళ్ళిద్దరికీ నిజంగా దాంపత్యాన్ని ఏర్పాటు చేసినటువంటి ఆయన విధాత ఒకడు ఉన్నాడు కదా! ఆయన చాలా నేర్పరి. ఎంతలా కూర్చాడో! ఎంచేత? యదుపురంలోంచి ఆయనలా పుట్టుకొచ్చాడు. ఈ విదర్భలో ఈవిడిలా పుట్టుకొచ్చింది కదా! వీళ్ళిద్దరూ కలిసేట్టుగా తయారు చేశాడు. మధ్య రాయబారం నడిపించాడు. ఇదంతా జరిగింది బ్రహ్మలిఖితమే కదా! కాబట్టి ఆయన చాలా నేర్పరి అంటున్నారు.

"దర్పాహతారాతియై మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్" – ఈ అహంకారుల యొక్క అహంకారాన్నంతా హరించి... "దర్పహతారాతియై" అంటే, ఈయనొచ్చాడు కదా! బోల్డు మంది candidates

వచ్చారు. ఎంతో మంది రాజులొచ్చారు. శిశుపాలుడికి మద్దత్తుగా అందరికన్నా కొంచెం బాగా భయంకరమైనటువంటి అహంకారంతో ఉన్నటువంటి జరాసంధుడు వాళ్ళున్నారు కదా! వాళ్ళందరి యొక్క అహంకారాన్ని హతం చేసి, "మగఁడౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్" –రుక్మిణీదేవికి ఇతడే మగడవుతాడు. వాళ్ళందరి అహంకారం ఖచ్చితంగా తీసేస్తాడు రేపు అని చెప్పుకుంటున్నారు వాళ్ళు. "మాపుణ్యమూలంబునన్" – అది మేము చూస్తాం మా పుణ్యం, అలాంటి పుణ్యం మాకుంది. అంటే రుక్మిణీకల్యాణం మనం చెప్పుకుంటున్నాం, వాళ్ళు చూస్తారు కదా!

ఈ విధంగా మనం ఇక్కడ ఆగితే బాగుంటుంది. మిగతాది రేపు చెప్పుకుంటాం. రేపు ఆవిడ పొద్దున్నే బయలు దేరడం ఉంటుంది. సగంలో ఆపకూడదు ఎప్పుడు కూడా. ఎక్కడ ఆపాలో తెలిసి ఆపాలి పురాణం. ఇది మనకి ప్రవచనం. ఇది పురాణ కాలక్షేపం కాదు కదా!

రుక్మిణీదేవి పాత్ర మనకి తలమానికమైనటువంటి పాత్ర. భగవంతుడినే పెళ్ళాడిందట అంటే ఎంత గొప్ప విషయం కదా! అలాగే గోదాదేవి చెప్తాం. అలాగే అమ్మవారు సీతాదేవి. అలాగే పార్వతీదేవి, శివుడ్ని మెప్పించి పెళ్లి చేసుకుంది. ఈ కథల్లో దేని చేత మెప్పిస్తారు వాళ్ళని? అందం చేత మెప్పించలేదు, శక్తి చేత మెప్పించలేదు. కేవలం భక్తి చేతనే. కేవలం భక్తి చేత తప్ప ఇంక దేని చేత కుదరదు. భగవంతుడిని మెప్పించలేం. అందుకనే "సర్వేశ్వరుండగు శౌరికింకరు చేయుధనముకలరే భక్తిధనముగాక" – నేనింత శక్తివంతుడ్ని అని చెప్పటానికి ఏం లేదు. ఆయన సర్వశక్తిమంతుడు కదా! నేనింత అందమైన దానిని అని చెప్పటానికి ఏం లేదు. అన్నీ అందాలు ఆయన దగ్గరే ఉన్నాయి. నా దగ్గర ఎన్ని గుణాలున్నాయి అని చెప్పటానికి ఏం లేదు. అన్నీ గుణాలు ఆయన నుంచి వచ్చినవే. కాబట్టి దేంతో మెప్పిస్తావు? ఆయన దగ్గర లేంది నీదగ్గర ఏముందని మెప్పిస్తావు ఆయన్ని? ఆయన్ని మెప్పించటానికి నీ దగ్గర ఉండవలసింది భక్తి ఒక్కటే. భక్తి చేతనే భగవంతున్ని మెప్పించవచ్చును. "మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద" – నన్నెక్కడ ఆర్తితో, భక్తితో ఆరాధన చేస్తూ ఉంటారో అక్కడ నేనుంటాను. Logic ఉండేచోట, intellectuals ఉండేచోట, పాండిత్యం ఉండేచోట, శక్తిసామర్థ్యాలు ఉండేచోట మనకంత interest లేదు అని చెప్పాడు దైవం. ఈమె దేని చేత మెప్పించింది? తన భక్తి చేత రుక్మిణి ఆ విధంగా భగవంతుడిని మెప్పించి, తన ఇంటికి రప్పించుకొని, ఆయన చేత తోడ్కొని పోవబడింది.

రేపటి కథ ఇంత భక్తి రస ప్రధానంగా మనకి కనిపించదు. ఈ గురుపూజల్లో నా దృష్టిలో ఇవ్వాళ్ళ ప్రవచనం మనకందరికి చాలా relevant. మనవాళ్ళు కొంత మంది రేపు పొద్దునొస్తారు. వాళ్ళందరికీ మీరేం చెప్పాలంటే, ముందు నిన్నటిది విని, అప్పుడు ఇవ్వాళ్ళది వినమని చెప్పాలి. ఎప్పుడు మనకి మొదటి ప్రసంగం

వినకుండా, రెండో ప్రసంగంలో చేరేవారికి అది అంతగా ఊపునివ్వదు, స్ఫూర్తినివ్వదు. మొదటి ప్రసంగం విని, వెళ్ళిపోయినా ఫర్వాలేదేమోగాని, రెండో ప్రసంగంలోకి చేరితే అయోమయంగా ఉంటుంది. మొదటి ప్రసంగం నుంచి చివరి ప్రసంగం వరకు ఉంటే అద్భుతం. లేదా, కొన్ని కొన్ని పరిస్థితుల్లో అన్నిటికీ ఉండలేకపోతే, ముందు ప్రసంగం ముందు జరగాలి. ప్రాతిపథిక అక్కడ ఏర్పడుతుంది. అంచేత, తర్వాత వచ్చిన వాళ్ళు ఏం చేయాలి? ఇంక మానేయాలా? ఎలాగో మొదటి ప్రసంగంకి రాలేదు కాబట్టి అని మానేయక్కర్లేదు. ఎందుకని? ఇలాంటివన్నీ (recording) ఉన్నాయి కాబట్టి వినచ్చు. పూర్వకాలమైతే గురువుగారు ఏం చెప్పారని పొరపాటున అడిగితే ఎవడో వాడికి తోచింది వాడికి చెప్పేసేవాడు, అయిపోయేది కదా! మేధస్సు ఉండేవాళ్ళు, ఉన్నది ఉన్నట్టుగా చెప్పగలిగి ఉండేవాళ్ళు ఆ రోజుల్లో. ఏది ఏమైనప్పటికీ మన ఆర్తిని బట్టి.

ఈ రోజుతో రుక్మిణి మనసు చల్లబడ్డదండి. అది ముఖ్యం కదా! ఆరాటంలో ఉన్నటువంటి ఒక అద్భుతమైనటువంటి ఒక భక్తురాలి యొక్క మనస్సు చల్లబడ్డది. వస్తే ఏం చేస్తాడో ఆవిడకే తెలుసు. అసలు రావడంవరికే కదా మనకి! వస్తాడో రాడో అని కదా! వచ్చేశాడు. ఇంక రేపేముంటుంది? తయారౌతుంది, గుడికి వెళ్తుంది. తిరిగి వస్తూ ఒక్కొక్కళ్ళని ఓర కన్నుతో చూస్తుంది. కనపడతాడు. ఇవన్నీ రేపు చెప్పుకుందాం. ఇప్పుడే చెప్తే బాగుండదు. పద్యం చెప్పి చెప్తేనే బాగుంటుంది ఎంత చెప్పినా, రేపు చెప్తాను కదా! పద్యం చెప్పకుండా చెప్పుకుంటే భాగవత రస అనుభూతి మనకుండదు. నువెన్ని సార్లైనా ముందు చదువుకుని ఉండవచ్చు భాగవత పద్యాలు. కానీ పద్యం చదివి, మనకి వచ్చిన తెలుగులో... ఎందుకంటే, తెలుగు పండితులంకాము. పద్యం ఎట్లా చదవాలో మనం చూస్కొని, చదువుకొని... కొన్ని కొన్ని పదాలు తప్ప చదువుకుంటూనే అర్థం అయ్యేపోయేట్లుగా లేవు పద్యాలు. సాయంత్రం పూట అలా భాగవతం మనం చదువుకున్నామనుకోండి ఆ రోజులో ఉండేటువంటి కలికల్మషమంతా హరింపబడుతుంది. అందుకనే పడుకునేపోయే ముందు భాగవతము అన్నారు. ఎందుకని? కలికల్మషహరణం అయిన తర్వాత నీవు నిద్రలోకి వెళ్తే, నీకు కృష్ణుని యొక్క అనుభూతి లభించవచ్చును. ఎంచేత? కనులు మూసుకున్నా, కనులు తెరిచినా నాకు ఆయనే కనపడాలనేటువంటి ప్రార్థనలు ఉంటాయి దాంట్లో. “కనులుమూసినా ఎప్పుడు విచ్చినప్పుడున్” అన్నారు. ఈ విధంగా ఈ రోజు మనం ఈ ఘట్టంతో పూర్తిచేసుకొని, రేపు ఉదయం మళ్ళీ మిగతా కథ చెప్పుకుందాం.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 9, 2014 ఉదయము – ప్రవచనము #9

మాస్టరు సి. వి. వి. గురుపూజా మహోత్సవములకు విచ్చేసినటువంటి సోదరసోదరీ బృందమునకు హృదయపూర్వకమైనటువంటి నమస్కారములు. రుక్మిణీ కల్యాణ ఘట్టం మనం వివరించుకుంటూ ఉన్నాము. విజయనామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, దశమి, గణపతి పూజ, అనంతరం గురుప్రార్థన, అటుపైన ప్రవచనము.

గణపతి పూజలో ఉండే అంతరార్థమేమిటంటే, అతడు ఇహపరములకు కూడా సులభమైనటువంటి మార్గాన్ని ఏర్పరచగలవంటి దివ్యప్రజ్ఞ. సమస్త గురుపరంపర, సమస్త దేవతా పరంపర గణపతి యందు ఆసీనులై ఉంటారు. గణపతి బాహ్య ప్రపంచంలో మనకి వలసినటువంటి సిద్ధికి, బుద్ధికి, అలాగే అంతరంగ ప్రపంచంలోనికి ప్రవేశించటానికి కావలసినటువంటి ఉపదేశమునకు, అటుపైన అంతరంగ మార్గములో ప్రవేశించేటువంటి విధానమునకు అధిష్టానమైనటువంటి ప్రజ్ఞ. అతడు యోగమునకు గురువు, యోగవిద్యకు గురువు, అన్నీ విద్యలకు గురువు. అన్నీ విద్యలు ఆయన బొజ్జలో ఉన్నట్టుగా కూడా పోతనా మహాత్ములు మనకి ఒక పద్యం ఇచ్చి ఉన్నారు. గణపతిని మనం యోగపరంగా ఆరాధన చేసుకోవటంలో ఇది ముఖ్య ఉద్దేశ్యం. దేహాత్మభావం నుంచి జీవాత్మ భావంలోకి మనం ప్రవేశించటానికి వీలు కల్పించేటువంటి ఒక దేవతామూర్తిగా గణపతిని మనకు ఋషులు అందించారు. అంటే, మనం ఎంత బాగా సాధన చేస్తున్నప్పటికీ బాహ్యం మరవలేకపోతూ ఉన్నాం కదా! ఎంత బాగా రెండు పూటల మనం ప్రార్థనలు చేస్తూ, సత్కార్యాలు చేస్తూ ఉన్నప్పటికీ కూడా బాహ్యమును మరవలేనటువంటి ఒక స్థితి మనలో ఉన్నది. అంటే ఏమిటి? దేహ సంబంధంగా మనకి ఈ ప్రపంచంతో ఏర్పడినటువంటి విషయముల మీద ఉన్న ఆ విషయాశక్తి నుంచి మనంగా మనం బయటపడినటువంటి అంత తీవ్రమైనటువంటి సాధన మనకి లేదు కదా! అలాంటి ఆ విషయములయందు ఆసక్తి కలిగినవారికి అతడు ఆ విధమైనటువంటి బుద్ధిని కలిగించగలడు.

ఋషులందరూ కూడా యోగవిద్యకు ఆరంభంలో గణపతి ఆరాధనను వారు ఇస్తూ ఉంటారు. అంచేత, మనం ఈ గణపతి ఆరాధన ఏర్పాటు చేసుకున్నాం. అన్ని బృందాలలో కూడా ఈ గణపతి ఆరాధన కుటుంబంగా చేసుకుంటూ ఉంటే, ఆ కుటుంబంలో చాలా చక్కని వృద్ధి ఉంటుంది. చిన్న పిల్లలకి బాగా నచ్చేటువంటి దైవం.

హనుమంతుడు, గణపతి వారిరువురు జగద్గురు పరంపరలో చాలా ఉన్నతోన్నతమైనటువంటి స్థానంలో ఉన్నటువంటివారు. హనుమంతుడు, గణపతి, దత్తాత్రేయుడు, కపిలుడు వీరి నలుగురి గురించి ఎప్పుడు చెప్తూ ఉంటాను నేను. రోజూ గణపతి పూజ ఒక పన్నెండు నిమిషాలకన్నా పట్టదు. మనం ఉత్సాహం కొద్దీ అందులో ఉపనిషత్తు ఒకటి చేస్తూ ఉన్నాము. అంతేగాక కొంత శక్తి కూడా బాగా మనకి ఏర్పడాలనే ఉద్దేశ్యంతో శరవణభవుడిని కూడా ఆయనతో పాటు ఆరాధన చేసుకుంటూ ఉన్నాం. అంచేత, సుబ్రహ్మణ్య స్వామి, గణపతి వీరి ఆరాధన మనం క్రమంగా ఒక పుష్కర కాలం నుంచి మన కార్యక్రమంలో భాగంగా చేసుకున్నాం. ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే యోగప్రవేశము, యోగము నందు సిద్ధి. జీవునికి వృద్ధి కలగాలంటే గణపతి ఆరాధన మనకు చాలా ముఖ్యంగా పనికి వస్తుంది, అనుపానంగా ఉంటుంది. అలాగ మనకు ఆరాధనా విధానం మన యోగ విధానంలో ఒక భాగంగా ఉన్నది. మాస్టర్ ఇ. కె. గారు మనకు ఒక సమగ్రమైనటువంటి ఒక యోగ విధానాన్ని ఇచ్చారు. మాస్టర్ సి. వి. వి. ప్రార్థనతో పాటుగా దేవతారాధన ఇచ్చారు. "తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటీ నందన నీకు మ్రొక్కెదన్  ఫలితము సేయవయ్య" అని మనము పద్యం చదువుకుంటూ ఉంటాం. బమ్మెర పోతనాత్యులు వారు రాసినటువంటి భాగవత పద్యమే ఇది.

ఈ గణపతి పూజ పన్నెండు నిమిషాల కన్నా పట్టదు. పదహారు నామాలు చదువుకోవాలంటే రెండు నిముషాలు కూడా పట్టదు. "షోడశైతాని నామాని యః పఠే చ్ఛృణుయాదపి. విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమేతథా. సంగ్రామే సర్వకార్యేషు విఘ్నస్తస్య నజాయతే" – ఇలా మనం చదువుకుంటూ ఉంటాం కదా! ఏంటి సంగ్రామమంటే? మనకి మనమే చాలా పెద్ద అడ్డు. మన స్వభావాన్ని దైవీ స్వభావంగా మనం మలుచుకోవటంలో మన భావములే మనకి అడ్డుగా ఉంటాయి. మనం ఏర్పరుచుకున్న అలవాట్లే మనకి అడ్డుగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో మనకి సహాయం కావాలి. బాగా అన్నీ రకాలుగా కట్టపడ్డవాడు, బంధింపబడ్డవాడు తనకి తానుగా పురోగమించేద్దాం అనుకోవటం అవివేకం. మనకి ఋషులు ఎన్ని రకాలుగా సహాయం అందించారో, అన్ని రకాలుగానూ సహాయం అందుకొని, ముందుకు పోతూ ఉండడమే. ఆ దృష్టితో మనం ఈ గణపతి పూజను మనం గురుపూజల్లో ఏర్పాటు చేసుకున్నాము. కేవలం గురుపూజలకే పరిమితం చేయకుండా, ఇంట్లో కూడా చేసుకోవాలి.

ఇంట్లో ఒక గణపతి ఉండాలి. ఆ గణపతికి చిన్న పిల్లల చేత ఈ పదహారు నామాలుని చెప్పించి, దండం పెట్టించాలి. వీలుంటే, ఒక అరటిపండు అక్కడ పెట్టించాలి. అరటి పండో, బెల్లం ముక్కో, రెండూ పెడ్తే మరీ మంచిది. అరటిపండు, బెల్లం ముక్క, దీపం, ధూపం. ఇవి మీరు ఏర్పాటు చేసి, పిల్లలచేత "వెలిగించరా!" అంటే వాడు ఉత్సాహంగా వెలిగిస్తాడు. ఈ నామాలు చెప్పిస్తూ ఉండాలి. "సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః,

లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః, ధూమకేతు ర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః, వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః". ఈ నామాలు చిన్నప్పుడే జపించడం మొదలు పెడితే, వాడి తత్త్వంలోకి పదహారు నామాలు కాస్త వెళ్తే, గణపతి లోపల క్రమంగా పెరుగుతాడు. పెరిగి, నీ చేత ఈ పదహారు నామాలకే నిన్ను పరిమితం చేయడు. "ఈ పదహారు నామాలు కాదురా! ఇంకా ఇవి చదువుకో" అని లోపల నుంచి మీకే ఉత్సాహం పుడుతుంది. ఈ సద్గుణాలు కాని, సదాచారపరమైనటువంటి ఆచారాల్లో కాని, ఈ ఆరాధనలలో కాని, దుర్గుణాల్లో కాని ఒక నైజ గుణం ఉన్నది, అంటే స్వతసిద్ధంగా ఉండే గుణం. ఒక సద్గుణం లోపల ప్రవేశింపజేస్తే, క్రమంగా అది ఇంకొకటి పట్టుకొస్తుంది, అది ఇంకొకటి పట్టుకొస్తుంది. దుర్గుణమైనా అంతే! ఒక దుర్గుణం మొదలు పెడితే దాంట్లోంచి ఇంకోటి, దాంట్లోంచి ఇంకోటి, అలా వచ్చేస్తాయి. అన్నీ అవి గొలుసులే.

చాలా మంది కుర్రవాళ్ళు సంతానం కన్నవాళ్ళు ఉన్నారు కాబట్టి చెప్తున్నాను పనికొచ్చే విషయం. ఈ పదహారు నామాలు వాడికి ఏడేళ్ళు వచ్చేటప్పుటికే నేర్పించాలి. తరతరాలుగా కుటుంబాలు బాగుండాలంటే, ఇంట్లో సాంప్రదాయం ఉండాలి. ఇంట్లో సాంప్రదాయం ఉండాలంటే ముందు ఒక గణపతి బొమ్మ, ఆ గణపతికి పిల్లవాడి చేత చేయించటం ఉండాలి. వినాయక చవితి నాడు ఊరికే హడావిడి చేసేసుకోవడం కాదు. ఆ ఒక్కపూటా హడావిడి చేస్తే కుదరదు. రోజు పదహారు నామాలు పడుకోబోయే ముందు చెప్పించేస్తే నోటికొచ్చేస్తుంది. చిన్నతనంలో వచ్చినంత సులభంగా పెద్దయిన తర్వాత కంఠస్తం చేయలేము కదా! ఇప్పుడు కొత్తగా ఒక స్తోత్రం నేర్చుకోమంటే అది అంతంత మాత్రంగానే బుర్రలో ఇమిడి ఉంటుంది. ఎందుకంటే, బుర్ర నిండా మిగతావన్నీ చేరిపోయి ఉంటాయి కదా! చిన్నతనంలో ఎన్ని నేర్చుకోగలిగితే అంత మంచి జరుగుతుంది. చిన్నతనంలో వేసంకాలం సెలవలు, సీతాకాలం సెలవులు, ఇవన్నీ పాడు చేసుకోకుండా ఏవో కొత్త స్తోత్రాలు నేర్చుకోవచ్చును. సెలవల్లో ఈ home work, ఈ project చేయమంటారు కదా! బుక్కులు పట్టుకొని ఇవేవో చేస్తుంటారు. అలాగే ఇది కూడా ఒక project పెట్టుకోవటమే. ఈ సెలవల్లో నేను ఇవి నేర్చుకుంటాను. మా చిన్నతనంలో ఈ సెలవల్లో "శుద్ధ బ్రహ్మ పరాత్పర రామ" నోటికి వచ్చేయాలి అని పెట్టుకునే వాళ్ళం. 108 నామాలు అది. నోటికి వచ్చేసేవి, alternative లేదు. ఈ సెలవల్లో దాశరధి శతకంలో పాతిక పద్యాలు నోటికొచ్చేయాలి అని పెట్టుకున్నాం. లేకపోతే, వేమన శతకంలో పాతిక పద్యాలు, ఇట్లా ఏదో ఒక syllabus మనగ్గా మనం ఏర్పరుచుకోవాలి. ఎందుకంటే, ఇవన్నీ మన మీద ఎవరూ ఏర్పరిచేవి కావు.

చిన్నతనంలో ఇలాంటివన్నీ మనకి లోపలికి వెళ్తే, ఆ బీజాలు క్రమంగా లోపల వృద్ధి చెందుతాయి. అలాంటి వాళ్ళు ఎట్టి పరిస్థితుల్లోనూ సంస్కారముల నుండి తప్పిపోరు. సంస్కారం నుండి తప్పిపోయే ఒక ప్రమాదం ఇప్పుడు చాలా ఎక్కువగా ఉంది. ఒక్కొక్కటి ఒక్కొక్కటి సంస్కారముల్లో మనం పెరుగుతూ ఉంటే,

క్రమంగా ఆరాధనా కార్యక్రమాలకి, సద్గురు కార్యక్రమాలకి మన కట్టూ, బొట్టూలో కూడా తేడా వస్తుంది. కట్టులో తేడా, బొట్టులో తేడా, భాషణంలో తేడా, ఇట్లా మన అప్రయత్నంగా లోపల నుంచి సంస్కరింపబడుతుంటాం. అలా సంస్కరింపబడాలంటే ఏదో ఒక దైవీపరమైనటువంటి కార్యక్రమం చిన్నప్పటి నుంచి అతి స్వల్పంగా, అతి లఘువుగానైనా పిల్లలకది పరిచయం చేస్తుండాలి తల్లితండ్రులు. మనం కూడా చేసుకుంటూ ఉండాలి. ఖాళీ సమయాల్లో ఈ విధంగా సద్వినియోగం చేయటమనేటువంటి ఒక దృష్టి, దృక్పథం ఏర్పరుచుకోవాలి.

ఇవాళ్ళ ఇక్కడ ఇద్దరు దంపతులు, రెండు జంటలు పూజ చేశారు. నిన్న రెండు జంటలు పూజ చేశారు. బాగుంది కదా! ఎన్ని జంటలు ఆ విధంగా వచ్చి పూజ చేయగలిగితే అంత మంచిది. ఇలా పూజ చేసిని వాళ్ళను మీరు చూస్తే, అటుపక్క కూర్చున్నటువంటి దంపతి సాంప్రదాయమైనటువంటి బట్టలతో కూర్చున్నారు. ఇటు పక్కన కూర్చున్న దంపతిలో పురుషుడు ఏదో pant, belt ఇవన్నీ పెట్టుకొని కూర్చున్నాడు. అతను regular గా గణపతి పూజ చేస్తున్నాడనుకోండి, క్రమంగా pant వద్దులే, పైజమా లాల్చి వేసుకుందామనో, లేదా పంచకట్టు కడదామనో, లేతే లుంగీ కట్టుకుందామనో అలాంటి భావం వస్తుంది. అంతే కాదు, క్రమంగా ఇంకా ఏమొస్తుందంటే ఏదో నల్ల pant, ఎర్ర pant, పచ్చ చొక్కా వేసుకోటం కాకుండా, అందలో నెమ్మదిగా మనకి లోపలనుంచే ఒక రకమైనటువంటి స్పూర్తి వస్తుంది, తెల్లటి బట్టలు వేసుకుందాం మాస్టరు గారి కార్యక్రమాలకి అని. తెల్లటి భావాల కోసం ప్రయత్నం చేసేటువంటి వాళ్ళం క్రమంగా... అంటే, అందర్నీ తెల్లని బట్టలు వేసుకోమని నేను చెప్పట్లేదు. ముదురు రంగులు కాకుండా లేత రంగులు వేసుకోవాలి. ఇలా వస్తుంది. ప్రతిరోజు మనం తలంటి స్నానం చేద్దాం అనిపిస్తుంది. ఇలాంటి సంస్కారాలు చిన్నప్పటి నుంచి మన లోపల నుంచి వస్తే మనకి సులభం. బయటనుంచి అవి బాగా మనం వత్తిడి చేస్తుంటే అవి ఎక్కవు కదా! ఏర్పరచాలంటే, చిన్నతనంలోనే ఈ నామావళి కొంచెం వారికి బాగా నేర్పాలి, దీపం పెట్టడం నేర్పాలి, అగరొత్తు వెలిగించడం నేర్పాలి, బెల్లం ముక్క పెట్టడం నేర్పాలి. ఆ విధంగా మనం నేర్పుకుంటూ ఉండాలన్నమాట. సరే, ఇది ఇలా ఉండగా, మన రుక్మిణీకల్యాణం కథలో ఏం జరిగింది నిన్న?

శ్రీకృష్ణుడు వచ్చాడని చెప్పి తెలిసింది రుక్మిణీదేవికి. కొంత శాంతించింది. ఆ రాత్రి శుభ్రంగా నిద్రపోయింది ఆమె. ప్రజలందరూ కూడా సంతోషంగా నిద్రలోకి వెళ్లారు కదా! ప్రజలందరూ ఏమని భావన చేశారు?

> “తగు నీ చక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం
> దగు నీ చక్రికి నింతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం

దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా దర్పాహతారాతియై
మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్ మాపుణ్యమూలంబునన్."

అని చెప్పి వాళ్ళందరూ అంటారు. ఆ రోజు రాత్రి విదర్భ రాజధాని అంతా కూడా ఒక రకమైనటువంటి ఆనందంలో ఉంది. ఈ జరాసందాధులు, శిశుపాలుడు వీళ్ళందరికీ మాత్రం లోపల గుబులుగా ఉంది. రుక్మి, జరాసంధుడు, శిశుపాలుడు, సాళ్వుడు వీళ్ళందరికీ లోపల గుబులు మొదలైంది. ఎంచేత? వీళ్ళు ఎవరు వస్తే మనం సిద్ధంగా ఉండి పిల్లను కాపాడుకోవాలి అని అనుకుంటున్నారో అలాంటి వాడు వచ్చేశాడు. కాబట్టి మర్నాడు వాళ్ళందరునూ చాలా సంసిద్ధులై ఉండాలి. ఎందుకంటే, ఊహించని విధంగా ఆయన కార్యాన్ని నిర్వర్తిస్తారు. కృష్ణుడి యొక్క గొప్ప విశేషమేమంటే expect the unexpected అని. You cannot expect the unexpected. ఏదైనా జరగవచ్చు, ఎలా అయినా జరగవచ్చు అని భావన. ఏం జరుగుతుందో తెలియదు. ఇలాంటి ఉత్కంఠతో వాళ్ళందరూ నిద్రలోకి వెళ్ళటం జరిగింది.

ఆ మరునాడు పొద్దున్నే రుక్మిణీదేవి గౌరీపూజ చేయడానికి దేవాలయానికి బయలుదేరేటువంటి సందర్భం ఏర్పడి ఉంటుంది.

"సన్నద్ధులై బహుశస్త్రసమేతులై
బలిసి చుట్టును వీరభటులు గొలువ
ముందట నుపహారములుఁ గానికలుఁ గొంచు
వర్గంబులై వారవనిత లేఁగఁ
బుష్ప గంధాంబర భూషణ కలితలై
పాడుచు భూసురభార్య లరుగఁ
బణవ మర్దళ శంఖ పటహ కాహళ వేణు
భేరీ ధ్వనుల మిన్ను పిక్కటిలఁగ"

"దగిలి సఖులు గొలువఁ దల్లులు బాంధవ
సతులుఁ దోడ రాఁగ సవినయముగ
నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క
బాల చికుర పిహిత ఫాల యగుచు."

రుక్మిణీదేవి అమ్మవారి దేవాలయానికి వెళ్తున్నది. నగరం బయట ఉంటుంది ఆ దేవాలయం. ఆ దేవాలయానికి రాజకుమారి వెళ్తున్నది. ముందు చాలా శస్త్రాస్త్రములతో security ముందు నడుస్తోంది. ఈ నృత్యాలు, కార్యక్రమాలు నిర్వర్తించేటువంటి స్త్రీలు ప్రతి సంఘంలో కూడా కొంతమంది వారవనితలు అంటూ ఉండటమనేటువంటిది ఆచారం ఉన్నది – అప్పటికీ ఉంది, ఇప్పటికీ ఉంది. ఈ వారవనితలను దేవాంగనాలు, దేవునికి సమర్పింపబడ్డవారని అంటారు. వారందరు రకరకాల హారములు, కానుకలు పళ్ళాల్లో పెట్టుకొని, గుంపులుగుంపులుగా వాళ్ళముందు వెళ్తున్నారటండి. "బుష్ప గంధాంబర భూషణ కలితలై" – బాగా పువ్వులు పెట్టుకొని, సుగంధ పరిమళములు వెదజల్లేట్లుగా రాసుకొని, అలాంటి సుగంధ పరిమళాలన్నీ కూడా ఒక పళ్ళెంలో పెట్టుకొని, బాగా అలంకరించుకున్నటువంటి వారు చక్కని దివ్యమైనటువంటి, దైవీసంబంధమైనటువంటి పాటలు పాడుకుంటూ వెళ్తునారు. "భూసురభార్య లరుగఁ" – వారి వెనకాల అంటే ఈ బ్రాహ్మణ స్త్రీలందరూ కూడా, ముత్తైదువులందరూ కూడా చక్కగా పూజకి కావాలిసినటువంటి సామాగ్రినంతా పళ్ళాల్లో తీసుకొని ముందు నడుస్తున్నారట.

"బణవ మర్దళ శంఖ పటహ కాహళ వేణు భేరీ ధ్వనుల మిన్ను పిక్కటిలఁగఁ" – వారి వెనకాల అన్నిరకాల మంగళ వాయిద్యాలు, మీరు ఊహించుకున్న అన్ని రకాల మంగళవాయిద్యాలతో వెళ్తునారు. మంగళ వాయిద్యాలు ఎందుకు వాయిస్తారంటే ఇతర శబ్దములు, పొర్లు మాటలు, ఇలాంటివి వినపడకుండా ఉండడానికి. పెళ్ళప్పుడు కూడా మనకి ముహూర్తం సమయంలో ఎవడో ఎక్కడో తుమ్మచ్చు కదా! ఇంకొకడు దగచ్చు కదా! మరొకడేమో "అది కాదు గాని" అని మాట్లాడుతూ ఉండచ్చు. పెళ్ళికొచ్చిన వాళ్ళంతా పెళ్లి చూడరు కదా! ఏవో పొర్లు మాటలు ఉంటాయి. లేకపోతే పక్కనుంచి ఏదో అరవచ్చు. ఒక పిల్లి కూత వినపడచ్చు కదా! లేక ఒక కుక్క ఏడుపు వినపడచ్చు. కొన్ని పక్షుల కూతలు శుభశకునాలు. కొన్ని పక్షుల కూతలు అంత శుభశకునాలు కావు. ఇలాంటివన్నీ ఏవీ వినపడకుండా ఉండాలనుకున్నప్పుడు మనం ఏం చేయాలి. ఇంక వేరే శబ్దాలు వినపడకుండా ఉండేట్టుగా మనమే శుభశబ్దాలు ఏర్పాటు చేసుకోవాలి. మంగళవాయిద్యముల ఒక ముఖ్య ఉద్దేశ్యం అదే. శుభకార్యమప్పుడు ముందు ఏం చేస్తారంటే, మంగళవాయిద్యాలు ఏర్పాటు చేసుకుంటారు. ఇతర అమంగళమైనటువంటి శబ్దములు వినపడకుండా ఉండటానికి, ఒకటి. అమంగళమైనటువంటి విషయాలేవీ కూడా ఈ కార్యక్రమంలోకి చొరపడకుండా ఉండటానికి, రెండు. అందుకని మృదంగం ఇలాంటివి ఉన్నాయే ఇవన్నీ శివపరమైనటువంటివి. ఆ తర్వాత వేణువు, వీణ ఇలాంటివన్నీ విష్ణుపరమైనటువంటివి.

ఇలాంటివన్నీ రకరకాలుగా ఏర్పాటు చేసుకొని వాళ్ళు ముందు నడుస్తూ ఉంటే "దగిలి సఖులు గొల్వఁ" – చెలికత్తెలందరూ కూడా ఆవిడని జాగ్రత్తగా అలంకారం చేసుకుంటారు కదా! అవన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదో,

అవన్నీ వాళ్ళు చూసుకుంటూ ఉంటారన్నమాట. "దల్లులు బాంధ వసతులుఁ దోడ రాఁగ" – ఆమె యొక్క తల్లులు అంటే తల్లి, తల్లి యొక్క సోదరీమణులు, లేక తండ్రి తాలూకు వాళ్ళు, మాతృసమానురాలైన వాళ్ళందరూ కూడా తోడుగా వస్తుంటే "సవినయముగ నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క బాల చికుర పిహిత ఫాల యగుచు". "బాల చికుర పిహిత ఫాల యగుచు" అంటే చిగురు ఆకులతో కూడినటువంటి లతల్లాగా చిన్న చిన్న ముంగురులు ఉంటాయి చూశారా! అవన్నీ నుదురు మీద పడుతున్నాయి అన్నమాట. అంటే, ముందుకు పీక్కుని పెట్టుకుంటూ ఉంటారు కదా! కొంతమందికి సహజంగా అలా ఉంటాయి. కొంతమంది పీక్కుని పెట్టుకుంటూ ఉంటారు! ఈ కన్ను మీద పడి, వెనక్కిలా అంటూ, లేకపోతే ఇటు పడితే, ఇలా అంటూ ఉంటారు! కన్ను మీద పడకూడదు. కంటికి ఏదీ అడ్డు ఉండకూడదు.

ఇంకో ముఖ్యమైన విషయం చెప్పదల్చుకుందేమిటంటే "నగరు వెడలి నడిచె" – పురము వదిలి వెళ్ళిందదండి. ఇక్కడ ఆ ఉద్దేశ్యం అలా కాకపోయినా మనం అర్థం చెప్పుకోవాలి. మన సాధానపరంగా మనం చూసుకుంటున్నప్పుడు నీ నగరం వదిలి వెళ్లి పిలిస్తే తప్ప నగజాతకు మొక్కలేవు, అంటే అమ్మవారికి మొక్కలేవు. అమ్మ తొమ్మిదో ఆవరణంలో ఉంటుంది. ఎనిమిదో ఆవరణ వరకూ నువ్వు ఉంటావు. ఎనిమిదో ఆవరణలో అహంకార పురుషుడు. ఏడో ఆవరణలో బుద్ధిననుసరించి, ఆరో ఆవరణలో మనసును పట్టుకొని, మిగతా ఐదు ఆవరణలోనూ పంచభూతాలతో కూడినటువంటి శరీరంలో జీవిస్తూ ఉంటాడు. మన పంచభూతాత్మికమైనటువంటి దేహం – అవి ఐదు ఆవరణాలు – పదార్థము, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం. అది దాటి ఆరో ఆవరణ మనస్సు. ఏడవ ఆవరణ బుద్ధి. ఎనిమిదో ఆవరణ నేనున్నాను అనుకునేటువంటి జీవుడు. ఈ మొత్తం ఆవరణలోనే వాడు జీవిస్తూ ఉంటాడు. తొమ్మిదవ ఆవరణలోకి వెళ్ళటమంటే ఈ ఎనిమిది ఆవరణలను దాటి వెళ్ళాలి.

అందుచేతనే, ప్రధానంగా దేహాత్మ భావముండేవాళ్ళు ఆరాధనలు చేయలేరు అని చెప్తారు. నీకు దేహాభిమానమున్నదనుకోండి నువ్వు ఆరాధనకి తగవు. ఆరాధన చేసేవాళ్ళు ఎట్లా ఉంటారు? నిద్ర లేదు రాత్రి అని ఉండదు వాళ్లకి. పొద్దున ప్రార్థన చేసుకుంటూ ఉంటే ఇట్లా బెజవాడలో నిన్న రాత్రి నిద్రపట్టలేదు అని ఉండదు. నిన్న భోజనం పడలేదు అని ఉండదు. నిన్న చదువుకున్నాం కదా పద్యాలు! ఎలా ఉంది ఆవిడ? ఆవిడ నిద్రపోలేదు, అన్నము తినలేదు, ఈ బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా కృష్ణుని చూచే మార్గం మీద తదేకమైనటువంటి దృష్టి పెట్టుకొని ఉన్నది కదా! దానికి ఇక్కడ నేను అనుసంధానం చేస్తున్నాను. అలా ఉంటేనే నగరు వదలగలరు. మాకు అమ్మవారి దర్శనమైంది అంటామే, తన్మయ స్థితిలో దర్శనాలు అవుతాయి.

తన్మయ స్థితి అంటే మనం కరిగిపోయిన స్థితిలో – కాసేపు ఒక్క క్షణం పాటు, ఆ తర్వాత మళ్ళీ మనం పురంలోకి వచ్చేస్తాం.

నిన్న మనం చదువుకున్నటువంటి పద్యాలన్నిటిలో అమ్మవారి భక్తి యొక్క పరాకాష్ఠ ఎలా ఉన్నది అనేటువంటి విషయాన్ని మనం గమనించి ఉన్నాం. ఆ బాహ్యమైనటువంటి విషయములు ఎంత అద్భుతమైనవాటికి కూడా ఆకర్షింపబడక, కృష్ణుని గూర్చియే భావన చేస్తున్నటువంటి సందర్భంలో, అగ్నిద్యోతనుడు అనేటువంటి బ్రాహ్మణుడు వచ్చి సందేశమందిస్తాడు, “కృష్ణుడు వచ్చాడు” అని. తానిప్పుడు వచ్చినవాడి దగ్గరకు తాను వెళ్ళాలి కదా! తనని చేరాలి, తనవంతు ప్రయత్నం తను చేయాలి. ఆయన వంతు ప్రయత్నం ఆయన చేయటానికి సిద్ధంగా ఉన్నాడు. ఇది ఒక భక్తుడికి, భగవంతునికి మధ్య జరిగేటువంటి ఘట్టాలుగా కూడా మనం తీసుకొని చెప్పుకుంటేనే మనకి ఉపయోగపడుతుంది. లేకపోతే, రుక్మిణిదేవి కృష్ణుని చేరటమనేటువంటిది ఆ స్థితిలో ఉండేటువంటి ఒక ప్రజ్ఞకు అంత కష్టం కాదు. మనకు అన్వయించుకుంటూ మనం చెప్పుకుంటూ ఉంటాం కాబట్టి అన్నీ విషయాలు, ఈ విధంగా బయటకి నడిచి రావాలంటే అందరి యొక్క ఆశీర్వచనంతో నడిచి వస్తుంది, ఒకటి. ఆవరణలు దాటి వస్తోంది, రెండు.

ఇంకొక ముఖ్య విషయమేమిటంటే రుక్మిణీదేవి విషయంలో, “నన్ను నువ్వు తీసుకవెళ్ళుగాని మా ఇంట్లో వాళ్ళకి ఏ కష్టం కలిగించకు” అని చెప్పింది కిందటి సంవత్సరమే కదా! మా అన్నయ్య ఒకడు ఉన్నాడు దీనికి అడ్డంగా. అందుకని సులభంగా జరగదు. అంతమాత్రం చేత అంతఃపురంలో కొట్లాటలు వద్దు. కోటలో యుద్ధం వద్దు. పెళ్లి చేసుకునే సందర్భంలో కోటలో యుద్ధం వద్దు. కోట అంటే మన శరీరమే. యోగం మనం చేసుకుంటున్నామనుకోండి దేహానికి ఇబ్బంది కలగకుండా యోగం చెయ్యాలి. అంటే, దేహాన్ని శుష్కింపచేయటం, దేహాన్ని రొష్టు పెట్టడం, దేహాన్ని బాగా నలగకొట్టేయటం, దాన్ని బాగా అశ్రద్ధ చేయటం అలా చేయకూడదు. ఎలా చెయ్యాలంటే నీలో స్ఫూర్తి పెరుగుతున్నకొద్దీ, కొన్ని మామూలుగా నువ్వు చేయవలసినటువంటి పోషణలు చేయకపోవడం వేరు, నువ్వే కావాలని మానేయడం వేరు. ఇలా భాగవత ఉపాఖ్యానం మనం చెప్పుకున్నట్టు ఆ చెప్పుకోవడంలో బాగా తన్మయత్వం చెంది, ఫలహార వేళ దాటిపోయిందనుకోండి, లేకపోతే భోజనం వేళ దాటి పోయిందనుకోండి, అలా దాటిపోటం వేరు. అవన్నీ మానేసి కూర్చుందాం అని కూర్చోటం వేరు. ఈ రెండిటికి చాలా తేడా ఉంది. నీవు దైవానికి దగ్గరగా వెళ్తూ ఉండటం చేత కొన్నికొన్ని విషయముల యందు, దేహము దాని యొక్క హక్కులను కోరదు. హక్కులను కోరదు, అది సహకరిస్తూ ఉంటుంది. అలాంటి సహకారాన్ని అందుకుని, నీవు సాధనలో ముందుకు వెళ్తూ ఉండాలి తప్ప, దాన్ని శుష్కింపచేసి, దాన్ని రొష్టుపెట్టి, దాన్ని బాధ పెడితే అవ్వదు.

ప్రకృతిని బాధ పెట్టి పురుషుడి దగ్గరకి చేరలేము. నీలో ఉండేవంటి ఆవరణములన్నీ కూడా నీకు సహకరించాలి, అది ఒకటి. రెండవది, దైవారాధన చేసుకునేటువంటి వారు, దైవాన్ని చేరుకోవాలనేటువంటి తపన కలిగినటువంటి వారు ఇంట్లో వారెవ్వరికీ కూడా ఇబ్బంది కలిగించకూడదు. ఇంట్లోవారికి ఇబ్బంది కలిగించేటువంటి సాధన చేయకూడదు. పొద్దున్నే మూడింటికే లేచి, నేను కూర్చుని సాధన చేస్తాను అన్నావనుకో, చేసుకో – కాని దాని వలన ఇంకొకళ్ళకి ఇబ్బంది కలగకూడదు. నాకప్పుడు వేడి నీళ్ళు కావాలి కదా, కాబట్టి ఇంట్లో ఎవరన్నా వేడి నీళ్ళు పెట్టివ్వటానికి వాళ్ళు లేవాలని, లేకపోతే, మనకి లేవంగానే కాఫీ తాగకపోతే జరగదు కదా, అందుకని మన కాఫీ కోసం ఇంటావిడ కూడా నాలుగింటికే, మూడున్నరకో లేవాలని, ఇలా పెట్టుకున్నామనుకోండి, అలా కుదరదు. నీ యోగ సాధన ఇంకొకరికి ఏ విధమైనటువంటి అసౌకర్యములు కలిగింపరాదు, ఒకటి. నీ యోగ సాధన నీ దేహం యొక్క పరిపూర్ణ సహకారంతో నిర్వర్తించుకోవాలి, రెండు. అంటే, నీ లోపలి ప్రకృతినిగాని, నీ చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రకృతినిగాని, నీవు హింసించి యోగం చేయటానికి వీల్లేదు. అలా చేస్తే అది పాషండ మార్గమన్నారు. అలా భీష్మించుకొని చేస్తే అది పాషాండ మార్గం. ఆ మార్గంలో ఎక్కువ దూరం పోలేమని చెప్తారు.

అందుకనే, సనాతన ధర్మంలో బౌద్ధ మతం పాషండ మతం అని చెప్పారు. ఎంచేతంటే, నీవింట్లో కూర్చొనే దైవ సాన్నిధ్యాన్ని పొందవచ్చు అని భార్య చెప్తూ ఉండగా, భార్యని, పిల్లవాడ్ని, రాజ్యాన్ని, తల్లితండ్రుల్ని, అందర్ని దుఃఖపెట్టేటువంటి పద్దతుల్లో ఇల్లు వదిలి వెళ్లి, చాలా సంకల్పబలంతో తపస్సు చేసి సిద్ధిపొందిన తర్వాత బుద్ధుడికి ఏం తెలుస్తుందంటే, అదంతా చేయకుండానే ఇది జరిగి ఉండేది, మనం ఇంట్లోనే కూర్చుని చేయవచ్చును అని తెలిసింది. అందుకనే, సనాతన ధర్మంలో ఆ మార్గాన్ని అంతగా మనం ఆచరించము. ఋషిప్రోక్తమైన మార్గంలో అన్నిటినీ మన్నించుకుంటూ వెళ్ళడమే – నీ ప్రారబ్దకర్మను నువ్వు ఏ విధంగా మన్నించాలో ఆ విధంగా మన్నిచుకుంటూ, నీ సాధన నువ్వు చేసుకుంటూ ఉండడమే. “కర్మతంత్రుఁ డగుచుఁ గమలాక్షుఁ గొల్చుచు నుభయ నియతవృత్తి నుండెనేనిఁ జెడును గర్మమెల్ల శిథిలమై మెల్లన ప్రభలమైన విష్ణుభక్తి చెడదు” – క్రమంగా కర్మ జారిపోతూ ఉంటే, దైవభక్తి పెరుగుతూ ఉంటే, నీవు దైవానికి చేరువయ్యే మార్గంలో నీకు అన్నీ అనుకూలంగా తయారవుతాయి. ఏవి ప్రతికూలంగా ఉన్నాయో అవన్నీ అనుకూలం చేసుకుంటూ ముందుకు సాగాలి తప్ప, ఎక్కడిక్కడివి విధ్వంసం చేసుకుంటూ ముందుకు సాగితే అది యోగం కాదు, అది ఒక భీభత్సమైనటువంటి ఖాండవం. అందుకని, మన ఋషుల యోగమార్గంలో భీభత్సం లేదు, ప్రశాంతతే ఉంటుంది. ప్రశాంతంగా సాగుతూ వెళ్తూ ఉంటారు.

ఈ "నగరు వెడలి నడిచె" అని ఈమె వెళ్ళడమంటే ఈ విధంగా మనం యోగపరంగా అర్థం చేసుకోవాల్సింది. "తన గృహము" – తన గృహమంటే తన దేహమే ఒక గృహము. గృహమునందు ఉన్నటువంటి ఆవరణములన్నిటిని చక్క దిద్దుకుంటూ వెళ్ళాలి. వాటికి వేటికీ ఇబ్బంది కలగకూడదు, అదొకటి. రెండొవది, తన వారెవ్వరికీ తన వలన ఇబ్బంది కలగకూడదు. మనం యోగసాధన చేస్తుంటే, మన ఇంట్లో వాళ్ళందరూ మన ప్రవర్తన వలన దుఃఖ పడున్నారనుకోండి... వారికి ఇబ్బంది కలగని ప్రవర్తన ద్వారా మనకి యోగం సాగాలి తప్ప, వారిని ఇబ్బంది పెట్టే పరిస్థితుల్లో సాగకూడదు.

అందుకని, రుక్మిణీదేవి కబురుపెట్టింది – రాజప్రాసాదంలో వద్దు, కోట లోపల వద్దు, కోట బయటకి వస్తాను నేను, నన్ను నువ్వు తీసుకెళ్ళు అనడంలో అర్థమేమిటంటే మనం కూడా అలా ప్రయత్నం చేయాలండి. మన ప్రయత్నం ఎలా ఉండాలి? ఇంకా మనకు ఈ ఆవరణలే దాటలేమనేటువంటి వాళ్ళని అవన్నీ చీల్చేసి తీసుకెళ్లవలసినటువంటి అవసరం లేదు భగవంతుడికి. అలా చేయరు కూడా. ఎందుకంటే, హింస అనేటువంటిది కార్యక్రమంలో లేదు. అహింస అనేటువంటిది ప్రధానం. హింసింపబడకుండా సాధన సాగాలి. పండితే హింస లేదుగా! పండకపోతేనే హింస. నల్లగా, ఇంత లావుగా ఉండేటువంటి ఒక పెద్ద చెట్టు కొమ్మలోనుంచి తెల్లటి మృదువైన పువ్వు వస్తుంది కదా! దాన్నించి పువ్వు అదే వచ్చిందా, నువ్వు పీకితే వచ్చిందా? దానంతట అదిగా వస్తే, అది రాల్తే నువ్వు పుచ్చుకోవాలి. పీకకూడదు ఎక్కడ నుంచి కూడా. రాలిన పువ్వులే పూజకు వాడేవారు. అలాగే, ఫలములు వృక్షంలోంచి ఏ విధంగా బయటకు వస్తున్నాయి? వృక్షం లోంచి క్రమంగా ఒక పుష్పం లాగా పుట్టి, అందులోంచి ఒక పిందెవచ్చి, ఆ పిందె పెరిగి పెద్దదై, ఆ తర్వాత అది పండిన తర్వాత అది రాలిపోతుంది కదా! అలా ఇవన్నీ ఎన్ని ఆవరణములు దాటుకొని, ఫలంగాని, పుష్పంగాని, వృక్షంలోంచి బయటకి వచ్చింది. ఎక్కడైనా హింస ఉన్నదా అందులో?

ఇలా ఎంత సున్నితంగా ఏర్పడుతూ వస్తుందో తెలియాలంటే ఒక పూల మొక్క పెంచాలి, ఒక పండు మొక్క పెంచాలి. ఇప్పుడు ప్రస్తుతం మనం కలికాలం, రాక్షసజాతి ఉండటం చేత కోసి, పిల్లల్ని బయటకి తీస్తున్నాం. డాక్టర్ల convenience ప్రకారం కదా! ఎప్పుడు బయటకి వస్తే అప్పుడు సహకరించి, బిడ్డను బయటకి తీయటం కాదుగా ఇప్పుడు! ప్రకృతి సహకారమును అనుసరించి, అది ఎప్పుడు బయటకి వస్తే అప్పుడు పుట్టినవాళ్ళు ఇదివరకు అంతానూ. ఇప్పుడు అందరూ కూడా morning time డాక్టర్స్ convenient కాబట్టి ఆ time లో పుట్టుకొస్తారు! ఎందుకంటే, కోసి తీస్తున్నాం! కోసి తీసే విధానం ప్రకృతి సహజం కాదు. కోసి తీస్తే ఎట్లా ఉంటుంది? సరే, అది అలా ఉంచండి. ఊరికే మీకు చెప్తున్నాను. మన పరిస్థితులు ఎలా మారిపోతున్నాయో మనకి తెలియాలి కదా! ఏ విధంగా ఒక పుష్పము వృక్షం నుంచి చక్కగా వచ్చి, ఆ తర్వాత బయటపడుతుందో,

ఏ విధంగా ఒక ఫలం ఆ విధంగా వృక్షం నుంచి వస్తుందో, అలాగే ఒక జీవుడు తల్లి గర్భంలోంచి ఆ విధంగా వస్తాడు. దాని కనుగుణమైనటువంటి పద్ధతులన్నీ వదిలేసి, మనకి time లేదు కాబట్టి, అర్ధరాత్రి నేను పురుడు పోయలేనండి అని చెప్పేయటం ఒక పద్ధతి. అసలు ముందే చెప్పేస్తారు సిసేరియన్ మంచిది అని! All children are cesarean children. అందరు cesear సే ఇప్పుడు! Caesar అన్న పేరు ఎలా వచ్చిందో తెలుసా? ఇట్లా scissoring చేసి తీసారట మొట్టమొదటిలో ఒకడ్ని. Scissoring, cesarean అంటే the product that came out of scissoring, కత్తిరించి తీశారు. అలా వచ్చాడు Julius Caesar. అప్పటినుంచీ ఈ cesarean అనేటువంటి విషయం మనకి వచ్చేసింది. అందుకని, ఇప్పుడు scissoring గే ఎక్కువ అన్నిచోట్ల! పాశ్చాత్త దేశాల్లో ఇప్పుడిప్పుడే cesarean లోంచి బయటకి వచ్చేద్దాం, let it be natural అని మళ్ళీ వెనక్కొస్తున్నారు వాళ్ళు. వాళ్ళేం చేస్తే మనం అది చేస్తాం తప్ప, మనకుండే జ్ఞానం మనం ఎన్నడో వదిలేశాం, మరిచిపోయాం, దార్లోనే అక్కడ పారేసాము!

అలా ప్రకృతి సహజంగా లోపల దివ్యదేహం ఏర్పడటం అనేటువంటిది ఒక కార్యక్రమం. మనం అది మర్చిపోకూడదు. అసలు ఈ గురుపరంపర యోగంలో మనం చేరాటానికి ముఖ్య ఏమిటంటే మన యందు ఒక పుష్పం పుట్టాలి, లేకపోతే ఒక పండు పండాలి. అలా పండడానికి చేసే సాధనలో... సాధన ఎంత శ్రద్ధాభక్తులతో చేసినా, అది రజోగుణప్రవృత్తితో కూడిన విపరీతమైన సాధన కాకూడదు. విపరీతమైతే ఏమవుతుందంటే దేహం ఇబ్బంది పడుతుంది, ఒకటి. రెండొవది, నీ చుట్టూ ఉండేవాళ్ళు ఇబ్బంది పడతారు. ఈ రెండూ లేకుండా సాగిందే సాధన. అలా జరిగిందనుకోండి, దానికి మళ్ళీ ఫలితాలుంటాయి, పర్యావసానాలుంటాయి. మనం consequences అంటాం కదా! నీవు నిర్వర్తించినవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించకుండా, నీవు యోగసాధన పేరున కొంచెం ఒక extremist గా, ఒక fundamentalist గా పనిచేస్తున్నావనుకో... అతివాదమంటారు దాన్ని. అతి వాదం ఉండకూడదు యోగంలో, సామ్యవాదం ఉండాలి, సమభావం ఉండాలి.

ఈ రుక్మిణీకల్యాణంలో ఇలా అన్వయించుకొని, రుక్మిణి పరిస్థితుల్లో మన్ని పెట్టుకొని చెప్పుకుంటే తప్ప ఈ కథ మనకి బాగా అర్థం కాదు. అందుకని, ఆమె కబురు పంపించింది, "నేను నగరంలోంచి బయటకి వస్తాను స్వామి! నువ్వు నన్ను తీసుకెళ్ళు" అని. మనం కూడా పురంలోంచి బయటికి వచ్చి, ఏ హృదయమన్నా చేరకపోతే, అంతకన్నా కిందనుంచి మనని పీకలేడు. పీకితే, చచ్చిపోతాడు జీవుడు. హృదయమన్నా చేరాలి, భ్రూమధ్యం చేరడం ఉత్తమము. చేరితే, ఆయన సహస్రారం ద్వారా ప్రవేశించి నిన్ను అందుకుంటాడు. సహస్రారం ద్వారా ప్రవేశించేటువంటి దివ్యప్రజ్ఞ హృదయం వరకు రాదు. ఇది ఒక యోగ ప్రక్రియ. మనం కొన్ని ఆవరణలు దాటి సిద్ధంగా ఉండాలి. అప్పుడు కొన్ని ఆవరణలలో అతడు ప్రవేశించి, మనల్ని అందుకుంటాడు అని తెలియాలి –

అది యోగం. నువ్వు ఒక అడుగేస్తే, నేను పది అడుగులు వేస్తానని చెప్తాడు. ఆ ఒక్క అడుగు గురించే మాట్లాడుతున్నాను.

పువ్వు రాకముందే చెట్టులోనుంచి పీకలేవు కదా నువ్వు! ఇంకా పిందెగా ఉండగానే నువ్వు తీసుకున్నా నీకు అది ఉపయోగపడదు. పిందె క్రమంగా వికసించి, పుష్పం అవ్వాలి. ఆ పుష్పం కూడా సులభంగా మనం ఇలా ముట్టుకుంటే చేతిలోకి వచ్చేట్టుగా ఉంటే అప్పుడు మొక్కకి నెప్పి కలగదు కదా! ఇలా మనం గిల్లేసి తీస్తుంటాం కదా! కొన్ని కొన్ని రావు, అప్పుడు అలా లాగుతూ ఉంటాం! యోగప్రక్రియ అలా జరగకూడదు. అది ఎలా ఉండాలి? Iam ready, I offer myself, నీ పూజకి నన్ను నేను సంసిద్ధంగా ఉంచుకున్నాను అనే పద్ధతిలో పువ్వు ready గా ఉంటుంది. ఆ రోజుకి వదిలేస్తే సాయంత్రం కింద పడిపోతుంది – పూలమొక్కల నుంచి పువ్వులు కింద పడ్డట్లు. పారిజాతాలన్నీ కిందే పడుతుంటాయి. అవి ఎక్కువ సేపు ఉండవు. సంసిద్ధమైనవన్నీ మూలం నుంచి బయటకి వచ్చేస్తాయి. మన జీవప్రజ్ఞ ఎక్కడో మట్టిలోకి తలక్రిందలుగా పడుంటుంది. ఎన్ని చెప్పినా, ఎన్ని సంవత్సరాలనుంచి యోగం చెప్పుకున్నా, ఎంతసేపు మనకి మన సంపాదన, మన కూడబెట్టుకోవడాలు, మన ఆస్తులు, వాటిని పెంపొందించుకోవడాలు, అది ఇక్కడ పెట్టాలా, అక్కడ పెట్టాలా, ఎంత ధర ఉంది, ఈ గోలే! బయట విషయాల్లోనే అలా ఉంటే ఇంక దేహం విషయాల్లో ఎలా ఉంటాము?

దేహపదార్థం నుంచి నీవు క్రమంగా దైవస్ఫూర్తితో ఊర్ధ్వగతి చెందుతూ ఉంటే, కొన్ని ఆవరణలు నీకుగా నువ్వు దాటాలి. కొన్ని ఆవరణలు నువ్వు దాటితే, కొన్ని ఆవరణలు నేను దాటుకొని వచ్చి, నిన్ను అందుకుంటాను అనేటువంటి విషయం ఈమె “నగరు వెడలి నడిచె నగజాతకును మ్రొక్క” అన్న దాంట్లో ఉందండి. అమ్మవారికి పూజ చేసేటప్పుడు నవ ఆవరణ పూజ చేస్తారు కదా! అందుకనే అష్టమి నాడు, దుర్గ అష్టమి నాడు అహంకారాన్ని బాగా మర్దిస్తుంది. నవమి నాడు మహర్నవమి అది. అమ్మవారికి చేరువ అవుతాము. దశమి నాడు చేరిపోతాం. ఇప్పుడు ఈ విధంగా ఆవిడ బయటకి వచ్చింది.

> “మఱియు సూతమాగధవందిగాయక పాఠకజను లంతంత నభినందించు
> చుం జనుదేర మందగమనంబున ముకుంద చరణారవిందంబులు
> డెందంబునఁ దలంచుచు నిందుధరసుందరీ మందిరంబు సేరి సలిల
> ధారాధౌత కరచరణారవిందయై వార్చి శుచియై గౌరీసమీపంబునకుం
> జనియె నంత ముత్తైదువ లగు భూసురోత్తముల భార్యలు భవసహిత

యైన భవానికి మజ్జనంబు గావించి గంధాక్షతంబు విలిడి వస్త్రమాల్య
భూషణాదుల నలంకరించి ధూపదీపంబు లొసంగి నానావిధోపహారంబులు
సమర్పించి కానిక లిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి
రప్పుడు."

ఆవిడకు కృష్ణస్మరణ ఒకటే program కదా! "సూతమాగధవందిగాయక పాఠకజను లంతంత నభినందించుచుం జనుదేర" – పొగడ్తలు పొగిడేవాళ్ళుంటారు, వందిమాగధులు. రాజులకి ఎప్పుడూ చుట్టూ పొగిడేవాళ్ళు కొంతమందుంటారు. మనవాళ్ళు కూడా యధాశక్తి ఏర్పాటు చేసుకుంటూ ఉంటారులెండి! మన్ని విమర్శించే వాళ్ళు మన దగ్గర పెట్టుకోము కదా! మన్ని పొగిడేవాళ్ళనే మన చుట్టూ పెట్టుకుంటూ ఉంటాం. పాటలు పాడే వాళ్ళు పాడుతున్నారట, వేదపాఠాలు చదివేవారు చదువుతున్నారట, అభినందించేవాళ్ళు అభినందిస్తున్నారట. "మందగమనంబులు" – నెమ్మదిగా. "ముకుంద చరణారవిందంబులు డెందంబునం దలంచుచు" – హృదయమునందు భగవంతుడి యొక్క పాదపద్మములను బాగా స్మరణ చేసుకుంటూ, "నిందుధరసుందరీ మందిరంబు" చేరి. "ఇందుధరుడు" అంటే శివుడు, చంద్రశేఖరుడు. చంద్రశేఖరుడంటే అందరికి తెలుసు. ఇందుధరుడు అని పెట్టుకుంటే సరిపోతుంది. "ఇందుధర్" అని పెట్టుకుంట కొత్తగా ఉంటుంది! ఎందుకంటే, పాత పేర్లు పిల్లలు ఒప్పుకోరుగా! ఎవరన్నా పేరుపెట్టండి, అంటే ఇలాంటివేవో వెతుక్కుంటూ ఉండాలి. "ఇందుధర్" అన్నామనుకోండి, "అదేంటి సార్?" అంటే "అదే, చంద్రశేఖరోయ్!" అని చెప్పాలి. "నిందుధరసుందరీ మందిరంబు" – ఇందుధర సుందరి ఆవిడ. అంటే, శివునికి ప్రీతికలిగించేటువంటి అమ్మవారు కదా!

"నిందుధరసుందరీ మందిరంబు సేరి సలిల ధారాధౌత కరచరణారవిందయై" – ముందు గుడిలోకి వెళ్ళంగానే చేతులు కడుక్కుంది. సలిలములంటే నీళ్ళు. వాటితో "ధౌతం" – కడుక్కోవటం. "ధౌత కరచరణారవిందయై" – చేతులు కడుక్కుంది. అంటే, మనం ఏం చెయ్యాలో చెప్తుంటాయి. గుడికెళ్తే లోపలికెళ్ళి ముందు ఏం చెయ్యాలి? కాళ్ళు, చేతులు కడుక్కోవాలి. ఇంట్లో కడుక్కున్నాం కదా అంటే మరి రోడ్డు మీద నడిచాం కదా అని చెప్తారు. అందుకని, ఇది చదువుకుంటే ఏమవుతుందంటే కొన్ని కొన్ని సంస్కారాలు మనకి తెలుస్తూ ఉంటాయి. గుడి ఆవరణంలో ప్రవేశించి, ఏదో ఒక మూల ఉంటుంది, అలా కాళ్ళు, చేతులు కడుక్కొని, వీలుంటే కొంచెం కన్నులు కూడా కడుక్కొని, కొన్ని నీళ్ళు నెత్తి మీద వేసుకొని, అప్పుడు గుడిలోకి వెళ్ళటం ఆచారం.

"భవసహితయైన భవానికి" అంటే అక్కడ గుడిలో శివుడు, పార్వతి ఇద్దరు ఉన్నారు. "మజ్జనంబు గావించి" – స్నానం చేయించి, అభిషేకం చేశారన్నమాట. "గంధాక్షతంబు విలిడి" – గంధము, అక్షింతలు. "వస్త్రమాల్య భూషణంబుల నలంకరించి" – బ్రాహ్మణుల భార్యలు వివరంగా గుడిలో పూజ చేశారండి. "నలంకరించి ధూపదీపంబు లొసంగి నానావిధోపహారంబులు సమర్పించి" – నైవేద్యం కూడా పెట్టారు. "కానిక లిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి రప్పుడు" – వాళ్ళంతా బాగా పూజచేసుకున్నంత సేపు ఆమె కూడా దండం పెట్టుకొని కూర్చుంది. ఆ తర్వాత మొక్కించారు. మొక్కితే అప్పుడు ఆ అమ్మవారు ఏం భావన చేసిందో మనకి ఇచ్చారండి. ఆ పద్యం దాదాపు నేను తెలుగు వాడిని అనుకున్న ప్రతివాడికి వచ్చి ఉండేది ఇది వరకు. ఇప్పుడు కూడా వింటే అవును, మాకు తెలుసులెండి అని మీరంటారు. అలాంటి పద్యమది. ఇది కంఠస్తం చెయాల్సిన పద్యం. మనకు కూడా పనికొచ్చే పద్యం.

> "నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
> మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటి పె
> ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయు మమ్మ నిన్
> నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!"

రోజు ఇలాంటి పద్యం తెలుగులో ఒకటి చదువుకుంటూ ఉంటుంటే అమ్మ అనుగ్రహం చాలా సులభంగా లభిస్తుంది. సంస్కృతం ఏదో చదువుకుంటాం గాని అది అర్థం చేసుకొని చదువుకుంటే గాని అందులో భావగంభీరత మనకి అందదు. ఇలాంటి పద్యం ఉందనుకోండి, చదువుకుంటేనే మనకి లోపలనుంచి ఒక రకమైనటువంటి భక్తి హృదయంలో, హృదయాన్ని ధరింప చేసే విధంగా ఉంటాయి ఈ పద్యాలు.

"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్" – సనాతులంటే ఎప్పుడు ఉండేవాళ్ళని అర్థం. పార్వతీపరమేశ్వరులంటే ప్రకృతి–పురుషులు. వారు ఎప్పుడూ ఉన్నారు. సృష్టి ఉన్నప్పుడూ ఉన్నారు, సృష్టి లేనప్పుడూ ఉన్నారు. అయ్యవారులోంచి అమ్మవారు వచ్చింది అని చెప్తుంటామే... అయ్యవారులోంచి అమ్మవారు, అయ్యవారు, ఇద్దరూ ఒకేసారి బయటకి వస్తారు. అంతకముందుండే తత్త్వమే. అందుకనే, వాళ్ళిద్దర్లో ఎవరు ముందు, ఎవరు వెనుక అనేటువంటిది లేదు. విద్యుత్తు manifest అయితే AC, DC current గానే manifest అవుతుంది. ఇంకోరకంగా manifest అవ్వదు కదా! అంటే, ప్రకృతి లేనిది పురుషుడు లేడు, పురుషుడు లేనిది ప్రకృతి లేదు. వీళ్ళిద్దరిలో ఎవరు గొప్ప అంటే, ఇద్దరూ సరిసమానమైనటువంటివారు. వారిరువురు సనాతనులే అయి ఉండటం చేత మనం ఎలా భావన చేయాలి? అమ్మవారి పూజ చేస్తే అయ్యవారి

పూజ చేయాలి. అయ్యవారి పూజ చేస్తే అమ్మవారి పూజ చేయాలి. వీళ్ళిద్దరూ ఒక్కటే అనేటువంటి భావన ఎప్పుడూ ఉండాలి.

అందుకనే, మన పూజా విధానంలో పురుషసూక్తం-శ్రీసూక్తం, లక్ష్మీఅష్టోత్తరం-నారాయణ కవచం ఇచ్చారు కదా! దీని తర్వాత అది, దాని తర్వాత ఇది. లేకపోతే, ఇది ముందు చదవచ్చు, అది తర్వాత చదవచ్చు. ఎలా అయినా చేసుకోవచ్చు. ప్రకృతి పురుషులను సమానంగా ఆరాధన చేయటం యోగావిధానం. అందుకనే, ప్రతి దేవాలయంలో కూడా అమ్మవారున్న చోట అయ్యవారుంటాడు. అయ్యవారున్న చోట అమ్మవారుంటారు. అయ్యవారిని చూశాం కదా, అమ్మవారిని చూడక్కర్లేదు అనడానికి వీల్లేదు. అయ్యవారిని చూశాం కదా, అమ్మవారిని చూడడం ఎందుకులే అనుకోగూడదు. ఇద్దర్నీ చూడాలాట. ఇంకో రహస్యం చెప్పనా, అసలు ఏదైనా ఒక విగ్రహం ఉంటే అది అమ్మవారే. ఎందుకంటే, అయ్యవారికి రూపం లేదు. అమ్మవారిలో అయ్యవారుంటారు. రూపం అమ్మవారిది. అందు వశించేటటువంటి వాడు అయ్యవారు. అతను పురుషుడు, ఆమె పురము అయి ఉండటం చేత వాళ్ళెప్పుడు ఏకకాలంలో అవతరిస్తారు సృష్టి యందు. సృష్టి లేనప్పుడు తత్త్వంగా ఉంటారు. ఇది బాగా తెలియాలి.

"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్ మిమ్ముఁ పురాణదంపతుల" –ఇంతకన్నా ముందు దంపతి లేదు. అందుకనే, మనకి పెళ్ళప్పుడు పెళ్లికూతురు చేత గౌరీపూజ చేయిస్తారు. ఎందుకు చేయిస్తారంటే, ఆవిడే అందరికన్నా ముందు నుంచి ఉంది. "పురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ" – ఎప్పుడు నేను మిమ్మల్ని భజన చేస్తూనే ఉంటాను కదా! "మేటిపెద్దమ్మ" – చాలా పెద్దమ్మ అంటే అమ్మనుగన్న అమ్మ, అమ్మలకు అమ్మ. మొట్టమొదట ఎవరు అంటే ఆదిపరాశక్తి, పరా ప్రకృతి అయినటువంటి తల్లి. "దయాంబురాశివి గదమ్మ!" – అది కావాలి. ఎందుకంటే, జీవుల యెడల మనం దయ చూపిస్తున్న కొద్దీ మన యందు అమ్మ దయ చూపిస్తుంది. జీవుల యెడల మనం ఎంత దయ చూపిస్తే, అమ్మ మన యందు అంత దయ చూపిస్తూ ఉంటుంది.

"దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయుము" – అది కూడా కోరాలి మనం, నాకు నా స్వామిని నీవు ఏర్పాటు చేయమని. ఎందుకంటే, ఆమె తలచుకుంటే తప్ప కార్యం సిద్ధించదు, సంకల్పం ఆవిడదే. అంచేత, అమ్మవారి ప్రార్థన ప్రధానమైనటువంటి ప్రార్థనగా మన సాంప్రదాయంలో ఏర్పరచారు. ఏ పని కావాలన్నా అమ్మవారిని ప్రార్థన చేసుకోవాలి. ఆవిడ సంకల్పిస్తే ఎలాంటి కార్యాలైనా అవుతాయి. ఇక్కడ హరిని పతిని చేయటం ఏమిటి? కృష్ణుడిని పతిని చేయాలి కదా! అంటే, కృష్ణుడు, హరి అనేది ఒకటే. "హరి" అన్న పదానికి

ప్రత్యేకమైనటువంటి అర్థం దిగివచ్చేవాడని. దిగి రానివాడిని మనం పట్టుకోవాలంటే కష్టం కదా! దిగి వచ్చేవాడిని హరి అంటారు. ఎవరైతే ఆవరణలోకి దిగిరాగలడో వాడిని "హరి" అంటాం. గజేంద్రుడిని రక్షించాలని దిగి వస్తాడు. "భగవంతుడు హరియై దిగివచ్చుట" అనేటువంటిది ఒక heading పెట్టి భాగవత రహస్య ప్రకాశంలో మాస్టారు వివరం ఇచ్చారు. ఎప్పుడైతే సర్వవ్యాపియైనటువంటి దైవము ఒక సన్నివేశం కోసం దిగివస్తాడో అప్పుడు అతడు "హరి" అవుతాడు. ఇట్లా దిగి వచ్చి, మనల్ని అందుకొని వెళ్ళాలి కదా! భక్తుడు తానుగా భగవంతుని దగ్గరకు చేరలేడు. భగవంతుడు వచ్చి, తనను తీసుకువెళ్ళాలి అనేటువంటి పద్ధతుల్లో ఉంటాం. మనం భగవంతుని దగ్గరకు చేరటం అనేటువంటిది అహంకారం, అది అయ్యే పని కాదు. సూర్యుడు దగ్గరికి మనం వెళ్ళలేం. సూర్యుడు కిరణముల ద్వారా వచ్చి మనల్ని అందుకోగలడు. అంచేతే, మన సాంప్రదాయంలో పెళ్ళికొడుకు పెళ్ళికూతురు ఉన్నటువంటి ఊరికి వచ్చి, పెళ్ళికూతుర్ని తీసుకొని వెళ్ళాలి. ఎందుకంటే, పెళ్ళికొడుకు విష్ణుస్వరూపుడు. హరి మనకి హరి ముఖ్యం. హరి అంటే దిగివచ్చేవాడు అని అర్థం. మనం ఉన్నచోటులోకి అతను దిగిరావాలి. అలా దిగివస్తేనే కార్యక్రమం. అలా దిగిరాకపోతే, మనకిగా మనం వెళ్ళలేం. అలా ఎవరైతే దిగిరాగలడో, వాడు వచ్చి నన్ను అందుకునేట్టుగా చూడమని చెప్తోంది రుక్మిణీదేవి. హరి దిగిరావడానికి మనము అమ్మవారిని ప్రార్థన చేస్తాము. అమ్మవారే హరి. హరి రూపంలో రూపంలో దిగివచ్చేది ఆమే.

"నమ్మినవారి కెన్నటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!" అంది. నిన్ను నేను నమ్ముకున్నాను. నాకు హరి పతిగా కావాలి అని కోరుకుంతోంది. మనం కూడా అదే కోరుకుంటున్నాం. ఇప్పుడు మాస్టర్, మాస్టర్ అంటుంటాం కదా! ఏమిటి మాస్టర్? దిగి వచ్చి, మనల్ని తీసుకువెళ్ళి, బ్రహ్మం దాకా తయారుచేస్తున్నట్టు బాధ్యత వహించేటువంటి మాస్టర్ హరియే. మనం పిలవంగానే వచ్చి, మన హృదయంలో కూర్చొని, మన లోపల చేయవలసినటువంటి మరమ్మతులన్నీ చేసి, మనల్ని తనతో పాటు తీసుకెళ్ళేవాడు హరేగా! మనం వేరు వేరు పదాలు వాడుకోవటం చేత, అంతా వేరు వేరు అనుకుంటున్నాం. కానీ, వేరు కాదు, అదంతా ఒకటే. ఎవరు దిగి వచ్చి, మనల్ని ఉద్ధరిస్తాడో, వాడల్లా హరే నండి. హరి గురువు కూడా, గురువు హరి కూడా.

> "అని గౌరీదేవికి మ్రొక్కి పతులతోడం గూడిన బ్రాహ్మణభార్యలకు
> లవణా పూపంబులును దాంబూల కంఠసూత్రంబులను ఫలంబులు నిక్షుదండం
> బులు నిచ్చి రుక్మిణీదేవి వారలం బూజించిన."

అమ్మవారికి మ్రొక్కిన తర్వాత ఆ బ్రాహ్మణ స్త్రీలందరిని పూజించిందట. మనక్కూడా ఆచారంలో పెద్ద ముత్తైదువులకి తాంబూలం ఇప్పిస్తారు. ఇక్కడ ఏం చేశారు? వాళ్ళకి తయారు చేసిన పిండి వంటలతో సహా తాంబూలాలిప్పించి... కంఠసూత్రం అంటే మంగళసూత్రం. వారిని యధావిధిగా సత్కరించి, ఆ తర్వాత పండ్లిచ్చి, చెరుకు గడలిచ్చి.... చెరుకు గడ దేనికి ప్రసిద్ధి అంటే అది చాలా తీపితో కూడినటువంటిది కాబట్టి. తీపి పదార్థమైనటువంటి చెరుకు గడనిస్తే మనకి జీవితంలో ఏది తియ్యటి అనుభవమో, అది మనకి దక్కడానికి సంకేతం. మనం ఏది అందిస్తే, అది మనకు అందుతూ ఉంటుందండి. అందుకే స్వీట్లు పంచుతూ ఉంటాం కదా! ఎంచేత? మన జీవితం మధురంగా ఉండాలంటే స్వీట్లు పంచుతాం. అంతేగాని, కాకరకాయలు, అలాంటివి పంచుకోరు కదా! అవి కావాలనుకుంటే కొనుక్కుంటారు! "మీకు sugar కదండి, ఒక kg కాకరకాయ పట్టుకొస్తాను!" అని ఎవరూ రాలేదు నా దగ్గరికి! గురువుగారికి sugar. వారికి కాకరకాయ ఇద్దాం, లేదా వేపపండ్లు ఇద్దాం, వేపచిగురు ఇద్దాం. ఇలా పెట్టుకోరుగా! ఆయనకి sugar. అయినప్పటికీ కూడా మనం ఇవ్వాల్సింది తీపే అని తీపిస్తారు. ఎందుకని? వాళ్ళు జీవితంలో తీపి కోరతారు కాబట్టి. మనం ఏమిస్తే, మనకది వస్తుంది. "ఇక్షుదండములు" – వీళ్ళందరికి చెరుకుగడలు. అమ్మవారికి ప్రీతికరమైనది చెరుకు గడలు. అమ్మవారు అందరికి మధురమైనటువంటి జీవనం ఉండాలని కోరుకుంటూ, అవి ఎప్పుడు పట్టుకొని ఉంటుంది.

"వార లుత్సహించి వలనొప్పి దీవించి
సేస లిడిరి యువతి శిరమునందు
సేస లెల్లఁ దాల్చి శివవల్లభకు మ్రొక్కి
మౌననియతి మాని మగువ వెడలె."

వాళ్ళు అక్షింతలు వేశారట, అనుగ్రహించారట. గుర్తుపెట్టుకోండి, ముత్తైదువులకి మనం ఏదన్నా చేసేటప్పుడు వాళ్ళు సంతోషించేట్లుగా చేయాలి. సీతాదేవి ఋషి భార్యలందరికీ తిలకం అద్దుతుంటే, ఒక ఋషిపత్నికి కొంచెం నెప్పి పుట్టేట్టుగా అద్దిందట. అంచేత, ఆ సంవత్సరం ఆ విధంగా కష్టపడాల్సి వచ్చింది. బొట్టు చాలా జాగ్రత్తగా పెట్టాలి. ఒక పుణ్య స్త్రీ, మరొక పుణ్యస్త్రీకి తిలకం అద్దేటప్పుడు చాలా సున్నితంగా పెట్టాలి. ఎంచేత? నువ్వు ఏది కోరుకుంటున్నావో అది నీకు లభ్యం కావాలంటే, నీవు పెట్టిన తీరుతో అవతలవాళ్ళు సంతోషించాలి తప్ప దుఃఖపడకూడదు. అలా ఇంత పెట్టామనుకోండి, అది వచ్చి అవతల వాళ్ళకి కళ్ళల్లో పడ్డదనుకోండి, నీకు ఫలం దక్కదు. "వివాహం తర్వాత నీకు చాలా కష్టాలుంటాయి తల్లి!" అని ఆ ఋషిపత్ని చెప్తుంది. అంటే, శాపం కాదు. అది జరిగిన సన్నివేశం లోంచి ఆమె చూసి చెప్పేసింది. అమ్మవారి వైవాహిక

జీవితమంతా కూడా ఏముంది? అరణ్యాలకి వెళ్ళిపోయింది. అటుపైన తిరిగివచ్చినా, మళ్ళీ అరణ్యాలకే వెళ్ళిపోయింది కదా! ఈ ముత్తైదువులకి మనం ఇచ్చేటువంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి.

"వార లుత్సహించి వలనొప్ప దీవించి" – వాళ్ళందరూ బాగా ఉత్సాహంగా దీవించారు. జరగబోయే సన్నివేశం ఎవరికి తెలియదు. కేవలం ఆవిడకే తెలుసు, ఆయనకే తెలుసు. ఇంకెవ్వరికి తెలీదు. పెళ్లికూతురికి జరగబోయే విషయం తెలుస్తుందండి. కానీ, ఎలా జరుగుతుందో తెలియదు, ఎలా వస్తాడు? ఇప్పుడు రావాలి కదా! వచ్చి తన్ని తీసుకెళ్ళాలి కదా! అంచేత, వాళ్ళందరికీ భక్తిగా దండం పెట్టుకుంది. ఆ తర్వాత నెమ్మదిగా ఇంక మాట్లాడటం మొదలు పెట్టింది. "మౌననియతి మాని మగువ వెడలె" – బయలు దేరి వచ్చిన దగ్గరనుంచి అంతవరకు మౌనంగానే ఉంది. అమ్మవారికి మొక్కుకోవటం తప్ప, అది కూడా భావమే, మన లాగా బయటకి చదవలేదు పద్యాలు! రుక్మిణి భావాన్ని ఇక్కడ ఆవిష్కరించారు అంతే.

"ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు
తెఱంగున మృగధరమండలంబు నిర్గమించి చరించు మృగంబు
చందంబునఁ గమలభవనర్తకుం డెత్తిన జవనిక మఱుఁగు దెరలి పొడసూపిన మోహినీదేవత
కైవడి దేవ దానవ సంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్య
మాణ పన్నగేంద్ర పాశ పరివలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల
మంథాన మథ్యమాన ఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవ మధ్యంబున
నుండి చనుదెంచు నిందిరాసుందరీవైభవంబున బహువిధ ప్రభా భాస
మానయై యిందుధర సుందరీ మందిరంబు వెలువడి మానస కాసార
హేమకమల కానన విహరమాణ మదరరాళంబు భంగి మంద
గమనంబునఁ గనక కలశ యుగళ సంకాశ కర్కశ పయోధర భార
పరికంప్య మాన మధ్యయై రత్నముద్రికాలంకృతంబైన కెంగేల నొక్క
సఖీలలా మంబు కైదండ గొని రత్ననివహ సమంచిత కాంచన కర్ణపత్ర మయూఖంబులు
గండభాగంబుల నర్తనంబులు సలుప నరవింద
పరిమళ కుతూహలావతీర్ణ మత్తమధు కరంబులమాడ్కి నరాళంబులైన కుంతలజాలంబులు
ముఖమండలంబునం గ్రందుకొన సుందర
మందహాస రోచులు దిశలందు బాలచంద్రికా సౌందర్యంబు నావహింప
నధర బింబఫలారుణ మరీచి మాలికలు రదన కుందకుట్మంబుల

కనురాగంబు సంపాదింప మనోజాతకేతన సన్నిభంబైన పయ్యెదకొంగు
దూఁగ సువర్ణమేఖలాఘటిత మణికిరణపటలంబుల కాల శక్రచాపజనకం
బులై మెఱయఁ జెఱుకువిలుతుం డొర వెఱికి వాఁడియడిదంబు
జళిపించిన ధగధగాయానంబులగు బాణంబుల పగిది సురుచిర
విలోకన నికరంబులు రాజవీరుల హృదయంబులు భేదింప శింజాన
మంజు మంజీర నినదంబులు చెవుల పండువులు సేయఁ బాద
సంచారంబున హరిరాక కెదురుచూచుచు వీరమోహినియై చనుదెంచు
సమయంబున.”

ఇదంతా ఏమిటంటే, ఈ అమ్మవారు నడిచొచ్చే విధానం అంతా కూడా వర్ణిస్తారు ఇక్కడ. చిట్టచివరికి ఏముంటుందంటే ఇందులో “వీరమోహినియై చనుదెంచు సమయంబున” అంటే ఒక వీరమోహినిగా ఆమె నడిచి వస్తుండేటువంటి సందర్భం అంతా కూడా వివరిస్తారు. మరి ఇలాంటి దాంతో మనం ఉండాలి. అంతలా చదువుకోలేము ఈరోజు. ఎందుకంటే, ఉండేటువంటి ప్రశాంతమైన వాతావరణమంతా కూడా ఈ రోజున మాస్టరు గారు మనకు ఈ విధంగా మనకు ఏర్పాటు చేశారు. ఆ విధంగా నడిచి వస్తుందట. “వీరమోహినివలె” ఆమె నడిచి వస్తోంది.

“అళినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరిన్
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభ కుంభస్తనిన్
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభో జాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్.”

ఆమె నెమ్మదిగా నడిచి వస్తుంటే ఈ పులులన్నీ ఆడుతున్నాయటండి. నల్లనైన ముంగురులు అలా అలలాడుతూ ఉంటే ముఖం చంద్రబింబం లాగా ఉందిట చూడ్డానికి. లేడి కన్నులు చూచినట్లుగా అట్లా పక్క చూపులు చూస్తూ నడుస్తోంది. నడిచి వెళ్తోంది, కానీ ఎక్కడున్నాడో చూడాలి కదా! అందుకని లేడికన్నుల్లోంచి, ఇలాంటి కన్నులతో అటుపక్క ఇటుపక్క చూస్తూ ఉన్నది. పగడము వంటి పెదవి కలిగి ఉన్నదట అంటే, ఎర్రని పెదవులు కలిగి ఉన్నది. కోకిల కంఠస్వరం వంటి కంఠస్వరం లాగా ఉన్నదిట అమ్మవారు. అంటే, కంఠం బట్టి కంఠస్వరం చెప్పారు ఇక్కడ, పాటలు పాడుకుంటూ రాలేదావిడ! మాములుగానే వచ్చింది.

మదపుటేనుగులాగా వయ్యారంగా నడుస్తోందట అండి. ఏనుగు నడిస్తే వయ్యారంగా ఉంటుందా అనుకుంటాం. ఏనుగు నడుస్తుంటే వెనకనుంచి చూడండి. ఆ వయ్యారంలో ఒక రకమైనటువంటి ఠీవి ఉంటుంది. అందుకనే "గజగమనము" అంటారు. కొంతమంది నడుస్తూ ఉంటే, ఆ నడుము ఇలా ఇలా ఊగుతూ ఉంటుంది వెనకాల. అందరికీ అట్లా ఊగదు. కొంతమందికే ఊగుతుంది. ఎవరికైతే మదగజగమనం ఉన్నదో వాళ్ళు చాలా ఐశ్వర్యవంతులు. మీరు ఏనుగు నడుస్తుంటే వెనక నుంచి ఎప్పుడన్నా చూడండి. చూస్తే, మీకు అవగాహన కలుగుతుంది – ఓహో! ఇలా ఉంటుందా మదగమనం అంటే అని. అలా ఆమె నడుచుకుంటూ వెళ్తుందండి. నడుము చూడబోతే సన్నగా ఉందిట. అంతా వర్ణించట్లేదులెండి. అంత వర్ణించే అవకాశం కూడా కనపడట్లేదు! నడుము చాలా సన్నగా ఉందిట. "మృగరాజమధ్యమ సింహం" నడుములాంటి నడుము. గమనమేమో "గజగమనము". "నీలమోహిని" – నడిచివస్తుంటే, వాళ్ళంతా విభ్రాంతులైపోయారటండి. ఆమె సౌందర్యానికి ముగ్ధులై, అటుపక్క, ఇటుపక్క చేరినటువంటి రాజులందరూ, వారి వారి సైన్యాలన్నీ వెనుక rows లో ఉంటాయి. ముందు row లో వీళ్ళంతా ఆయుధాలు ధరించి ఉన్నారు.

> "మఱియు నయ్యింతిదరహాస లజ్జావనోకంబులం జిత్తంబు లేమఱి
> ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు విడిచి గౌరవంబులు మఱచి
> చేష్టలు మాని యెఱుక లుడిగి యాయుధంబులు దిగవైచి గజ తురగ రథా రోహణంబులు
> చేయనేరక రాజు లెల్ల నేలకు వ్రాలి రా యేణీలోచన
> తన వామకర నఖంబుల నలకంబులు దలంగం ద్రోయుచు నుత్తరీ
> యంబు చక్క నొత్తుచుఁ గడకంటిచూపులం గ్రమంబున నా రాజ
> లోకంబు నాలోకించుచు."

అలా నడిచి వెళ్తుంటే, "నయ్యింతి దరహాస లజ్జావనోకంబులం జిత్తంబు లేమఱి" – ఆవిడ సిగ్గుతో, సన్నటి చిరునవ్వుతో, అలా అలా కన్నులు తిప్పుతూ నడిచివెళ్తూ ఉంటే, వాళ్ళ చిత్తంబులు ఏమరుపాటు చెందినాయి. మామూలుగా చెప్పాలంటే వాళ్ళకి మతిపోయింది! "ధైర్యంబులు దిగనాడి" అంటే దున్నేస్తాం, పొడిచేస్తాం, తన్నేస్తాం అంటూ ఉన్నటువంటిది అంతా వారికి జారిపోయింది. అంటే, అతిలోకసౌందర్యవతిని చూసినటువంటివాడు ఎంత వీరుడైనా అలా నీరు కారి పోవాలట. మన తెలుగు భాషలో చెప్పాలంటే నాలుక వెళ్ళపెట్టి, సొంగకారుస్తున్నాడంటారు చూశారా! అలా ఉంది ఆమె సౌందర్యం. వాళ్ళందరికీ ఏం జరిగిందండి? "జిత్తంబు లేమఱి ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు విడిచి" అంటే బెట్టుకూడా పోయిందండి వాళ్ళకి. "గాంభీర్యంబులు విడిచి గౌరవంబులు మఱచి" అంటే step by step ఎలా దిగిపోయారో చూడండి. ముందేమో

ఈమె వెళ్ళిపోయింది. ఇంక మనసు ఏమరుపాటు వచ్చేసింది, ధైర్యం దిగనాడిపోయింది. ప్రతి వాడికీ లోపల వాడిదైన పట్టు ఒకటి ఉంటుంది కదా, పైగా రాజులు. ఆ పట్టు వీడిపోయింది. ఇహ వాళ్ళకుండే గౌరవ మర్యాదాలు కూడా మరిచిపోయి చూస్తున్నారటండి. ఆమె సౌందర్యం ముందు అంతలాగా వాళ్ళు దిగజారిపోయి, అట్లా నోళ్ళు వెళ్ళపెట్టుకొని చూస్తున్నారనమాట. వాళ్ళ వెనకాల ఉండే భటులు ఇదేంటి మా గురువుగారు ఇలా అయిపోయాడు అనుకోవాలి కదా! "ఇంతే నాయన!" అనిపించదు. అంటే ఒక పురుషుడు, ఒక స్త్రీ పక్క కొంత వెకిలిగా, మర్యాదకూడ మర్చిపోయి చూస్తున్నాడనుకోండి ఎట్లా ఉంటుందండి అది? అలా తయారయ్యారు వీళ్ళందరూ. "చేష్టలు మాని యెఱుక లుడిగి యాయుధంబులు దిగవైచి" –ఆయుధాలన్నీ పడిపోయినాయట. చేతులో ఉండే ఈ విల్లు, గద అన్నీ నేలమీద పడిపోయినాయి. "గజ తురగ రథా రోహణంబులు సేయనేరక" – ఇప్పుడు వాళ్ళ పరిస్థితి ఏంటంటే, ఇప్పుడు వాళ్ళు గబాల్న ఒక గుఱ్ఱం కూడా ఎక్కలేరు. ఏనుగు మీద, గుఱ్ఱాల మీద వస్తారు కదా! నిలబడ్డారు. ఇప్పుడు కాసేపట్లో ఏదన్నా అవతల వస్తే, వీళ్ళు గుఱ్ఱము ఎక్కలేరు, ఏనుగు ఎక్కలేరు, రథమెక్కలేరు. ఈ సన్నివేశం ఊహించుకుంటేనే చాలా బాగుంది కదా!

ఆవిడ ఏమి చేసిందంటే, కొంగు రథం పైన నుంచి పడుతుంది కదా! ఈ ఎడం వైపు కొంగునట్లా సవరించుకుంటూ, వాళ్ళందరినీ అట్లా చూసిందటండి. వీళ్ళంతా స్వయంవరం కొచ్చిన రాజులు కదా! ఆమె స్వయంవరం కోసం వచ్చినటువంటి రాజులు, అలా బారులు తీరి, అట్లా దేభ్యం ముఖాలు వేసుకొని, అంతా నీరసం కారిపోయినట్టుగా, కోళ్లల్లే వేలాడ్తూ ఉన్నారండి అందరూ. అది ఆవిడ ఆలోకించిందట, చూసిందట. మరి స్వయంవరం అంటే అదే! పూర్వకాలంలో రాకుమారి వస్తూ, అందర్నీ చూసి చూడకుండా చూస్తూ, అందులో ఏవికారం లేకుండా ఉన్నటువంటి వాడిని వరిస్తుంది. తనను చూసి వికారం చెందేటువంటి వ్యక్తిని వరిస్తే ఉపయోగం లేదు. తనకుండేటువంటి రూప, గుణ, లావణ్యానికి లొంగనివాడు తనకి భర్తగా వస్తే తనను ఎట్టి పరిస్థితులోనైనా రక్షించుకోగలడు. తనకన్నా బలహీనుడు తనకి భర్తగా వస్తే ఉపయోగమేముందండి! మీ ఇంట్లో పనివాడు లాగా వాడుకోవాలి అంతే! అంతకన్నా పనికిరాదు కదా! అప్పుడు రుక్మిణి చూసిందటండి.

"కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశ దే
హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్."

ఈ పద్యం ఒకటి కంఠస్తం చేసుకోవాలి. “కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావలగ్ను” – ఎలా ఉన్నాడట ఆయన? చంద్రబింబంలో ఉండే చంద్రబింబంలో ఉండే పదహారు కళలు ఆ ముఖంలో ఉన్నాయట. నడుము చూడబోతే సింహం నడుములాగా సన్నగా ఉందిట. విశాలమైనటువంటి కన్నులు. “నవాంభోజదళాక్షుఁ” – చాలా పెద్ద కన్నులు కలవాడు, విశాలమైనటువంటి కన్నులు కలవాడు. అందమైనటువంటి రొమ్ము. ఛాతి చాలా విశాలంగా ఉండి, నీలంగా ఉందిటండి. అంటే పచ్చని వాడు కాదుగా! “పచ్చని వాడు పద్మనయనంబులవాడు” అని చదువుకోము కదా! “నల్లని వాడు పద్మనయనంబులవాడు”. అలాంటి అందమైన రొమ్ము, నల్లని మొబ్బు వంటి దేహము, ఏనుగు తొండం లాగా ఉన్నాయట చేతులు. అంటే, బలంగా ఉన్నాయట. “మేఘసంకాశ దేహు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్” – పట్టుపంచె కట్టుకున్నాడటండి. చాలా అద్భుతమైనటువంటి ఆభరణాలు ధరించి ఉన్నాడట. “ఘనభూషాన్వితుఁ గంబుకంఠు” – శంఖం లాంటి కంఠం అట కృష్ణుడిది. శంఖం లాంటి కంఠం అంటే సన్నని కంఠం. లావుగా ఉండి, ఇక్కడ సన్నగా ఉంటుంది ఇలా. దానికి వ్యతిరేకంగా ఉంటే దాన్ని స్థూలఖాయం అంటారు. “విజయోత్కంఠున్” – ఎప్పుడు వీళ్ళందరినీ జయించేద్దామా అనేటువంటి ఒక దృక్పథంలో ఉన్నాడు. ఇప్పుడున్న ఈ పరిస్థితుల్లోంచి ఆమెను తీసుకొని వెళ్ళాలి కదా! అంచేత, విజయోత్సాహంతో ఉన్నాడట. అంతేకాదు, “జగన్మోహనున్” – ఆయన జగన్మోహనుడు. అంటే, జగన్మోహనుడు కనపడాల్సినంత పరిస్థితి లేదు ఇక్కడ. ఎందుకంటే, రుక్మిణీదేవి అందానికే వీళ్ళంతా జారిపోయారు. కృష్ణుడు అందానికి మొత్తం లోకమంతా ఆ విధంగా మైమరచిపోయింది. అలా ఎవరిని చూస్తే లోకమే మైమరచిపోతుందో, అలాంటివాడిని తాను ప్రేమించింది రుక్మిణీదేవి. ఆమె ఆ విధంగా శ్రీకృష్ణుడిని చూడడం జరిగింది.

నా గొంతు పోతోంది తప్ప పాఠం ఏమి అయ్యేట్టుగా లేదు. మనం ఒక పని చేద్దాం, మధ్యాహ్నం పాదపూజ బదులు ఈ కార్యక్రమం పెట్టుకుందాం. పెట్టుకుంటే, మనకి సవ్యంగా సాగుతుంది. లేకపోతే, ఉన్న స్ఫూర్తి కూడా పోవడమే కాకుండా, గొంతు కూడా పోతుంది. ఈ విధంగా కృష్ణుడిని రుక్మిణీదేవి దర్శించింది. అక్కడికి ఆపుదాం. మనకి climax లో anti climax వస్తుంది. అది తమాషా!

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 9, 2014 మధ్యాహ్నము – ప్రవచనము #10

"కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశ దే
హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్."

ఈ పద్యం చదువుకుందామని కొంత ప్రయత్నం పొద్దున్న జరిగింది. రుక్మిణి చూసిందిటండి. ఇంతకు ముందు చూడలేదు కదా ఎప్పుడూ! వినడమేగా! ఆ ముఖం చూసిందట. చూస్తే, అది చాలా చంద్రమండల ముఖం అది. చంద్రమండలం అంటే ఇరవై ఏడు నక్షత్రాల్లో తిరుగుతూ ఉంటాడు ఆయన. చంద్రుడుకున్న అన్నీ కళలు ఆ ముఖంలో గోచరించాయి. ముఖానికి ఎప్పుడూ చంద్రుడే చెప్తారు, సూర్యుడిని చెప్పరు. ఎంచేతంటే, చూస్తే ముఖం ఆహ్లాదంగా గోచరించాలి కదా! ఒకటి నాలుగు సార్లు చూద్దాం అనిపించేట్టుగా ఉండాలి తప్ప, ఒక్కసారి చూస్తే కల్లోకొచ్చేట్టుగా ఉండకూడదు కదా! ఎన్నాళ్ళనుంచో కృష్ణుడు గూర్చి తాను కలగంటోంది. ఇప్పుడు నిజంగా చూస్తే ఎలా ఉంటుంది? "గంఠీరవేంద్రావలగ్నం" – ముఖం చూసింది, నడుం చూసిందట. ఎంత అందమైన ముఖమది! ఎలాంటి నడుమున్నదో కదా! ఆ నడుము ఎట్లా ఉందంటే, సింహము నడుము వలె ఉందిటండి. సింహం నడుము ఎందుకు చెప్తారంటే, సింహం ఛాతి ఎంత విశాలంగా ఉంటుందో నడుము అంత సన్నగా ఉంటుంది. ఛాతికన్నా నడుము ఎక్కువ ఉందనుకోండి అది దేహపరంగా అవలక్షణం. ఛాతి కొలతలు తీసుకొని, నడుము కొలత తీసుకోండి. ఛాతి కొలత, నడుము కొలత కన్నా ఎక్కువుండాలి. ఛాతి చాలా విశాలంగా ఉండి, నడుము చాలా సన్నగా ఉందనుకోండి, వారు చాలా పటుత్వం కలిగినటువంటి దేహం కలిగినవారై, బలిష్ఠమైనటువంటి దేహంగలిగినవారై ఉంటారు. "కంఠీరవం" అంటే సింహం. దాని యొక్కనడుము లాంటి నడుము కలిగి ఉన్నాడట. ముఖం ఏమో చాలా అందంగా ఉందిట.

"నవాంభోజదళాక్షున్" – అప్పుడే విచ్చుకున్నటువంటి కలువ లేక తామర పువ్వుల యొక్క దళాలుంటాయి చూశారా, అంత విచ్చుకున్నటువంటి దళం పెద్దదిగా, అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. అలాంటి కన్నులు కలిగి ఉన్నాడట. "జారతవక్షున్" – వక్షము చాలా విశాలమై గోచరించిందట. "మేఘసంకాశ

దేహున్" – దేహమంతా కూడా ఒక రకమైనటువంటి శ్యామల వర్ణమది, నలుపని అనడానికి లేదు. తెల్లవాళ్ళ మధ్యలో నల్లవాడండి ఆయన. అంతే తప్ప, అంత నల్లవాడు కాదు. తెల్లవాళ్ళ మధ్యలో నల్లవాడు. ఛామన చాయ అంటారు చూశారా అలా ఉన్నాడనమాట. మాములు రాజుల మధ్యలో కొంచెం ఓ వంద తక్కువుంటాడట. ఎందుకంటే, ఆ రంగులో అలాంటి గోపనం ఉంటుంది. అంటే, ఎవ్వరికీ తెలియదు. ఈ నీలం ఏమిటంటే, లోతు తెలియని తెలుపది. లోతు తెలియని తెలుపు నీలం. అందుకనే, ఆకాశం నీలం అంటూ ఉంటాం కదా! ఎందుకు? లోతు తెలీదు. అది ఎలా ఉంటుందంటే, అది తెలుపనడానికి వీల్లేదు, మరీ నల్లటి నీలం అనడానికి వీల్లేదు. అలాంటి నీలచ్ఛాయ దేహం అంటండి.

"నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం"– నగారాతి అంటే కొండలకి శత్రువు ఒకడు ఉన్నాడట. పూర్వకాలం ఈ కొండలన్నీ, పర్వతాలన్నీ వాటికి రెక్కలుండి, ఎగురుతూ ఉండేవి అవి కూడా. మరి పర్వతాలు ఎగురుతూ అట్లా అట్లా తిరుగుతూ వాటికి తోచినప్పుడల్లా ఇలా భూమి మీద దిగినాయి అనుకోండి, అక్కడ ఊళ్ళో మనుషులందరూ పచ్చడయిపోతారు కదా! ఆ కొండల యొక్క రెక్కలను తెగగొట్టటానికి ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని బలంగా వాడాడట. ఎవరి బాహుబలం చేత కొండల యొక్క రెక్కలు తెగి పడిపోయినాయో, అలాంటివాడు ఎక్కేటువంటి ఏనుగు. అది ఐరావతం కదా! ఆ ఐరావతం తొండం ఎంత లావుగా, బలంగా ఉంటుందో, అలా ఉన్నాయటండి ఆయన చేతులు. పొద్దున చప్పుడు కాబట్టి, నాకు అరవ లేక, ఏనుగు తొండం లాగా బలంగా ఉండే చేతులు అన్నాం కదా! సామాన్యమైన ఏనుగు కాదది. అది ఇంద్రుడెక్కే ఏనుగు. అలా అంటే, మనకి ఎలా తెలుస్తుందండి? మనం చూడలేదు కదా! అంటే, చాలా బలిష్టంగా ఉంది అని అర్థం చేసుకుందాం. అతడు అటువంటి బాహువులు కలవాడని.

"చక్రిన్" – ఆయన అప్పుడప్పుడు చక్రం ధరిస్తూ ఉంటాడు. ఎప్పుడూ ఉండదు చక్రం చేతిలో. ఈ "చక్రి" అనే పదం హస్తమునందు చక్రం ధరించినవాడని కదా! అంతేకాదు, మొత్తం చక్రం తిప్పేవాడు కూడా వాడే. అది సృష్టి చక్రాన్ని తిప్పేటువంటి తత్త్వమది. తత్త్వమే రూపుకట్టుకొని వస్తే కృష్ణుడవుతాడు. అలాంటి "జక్రిఁ బీతాంబరున్" – ఆ నీలదేహం మీద పచ్చని వస్త్రం వేస్తే ఎలా ఉంటుందో బాగా ఆలోచించండి! చాలా బాగుంటుంది. అంటే హిరణ్యమైనటువంటి రంగు, లోపల నీలమైనటువంటి రంగు. అలాంటి రంగుతో కూడినటువంటి వస్త్రాలు ధరించాడు. "ఘనభూషాన్వితుం" – బాగా ఆభరణాలు ధరించాడు. "గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్" – జగన్మోహనంగా ఉన్నాడాయన. అలాంటి వ్యక్తిని చూసి ఆమె సంతోషించింది.

"కని తదీయ రూప వయో లావణ్య వైభవ గాంభీర్య చాతుర్య
తేజోవిశేషంబులకు సంతసించి మనోభవ శరాక్రాంతయై రథారోహణంబు
గోరుచున్న యవ్వరారోహం జూచి పరిపంథిరాజలోకంబు చూచుచుండ
మంద గమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి ఫేరవంబుల
నడిమి భాగంబుగొని చను కంఠీరవంబు కైవడి నిఖిల భూపాలగణంబుల
గణింపక దృణీకరించి రాజకన్యకం దెచ్చి హరి తన రథంబు
మీఁద నిడికొని భూనభోంతరాళంబు నిండ శంఖంబు
పూరించుచు బలభద్రుండు తోడనడవ యాదవవాహినీ పరివృతుండై
ద్వారకానగర మార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశు లయిన రాజు
లందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక."

ఏం చూసింది? రూపం చూసింది. చాలా లావణ్యంగా ఉంది. అమితమైనటువంటి, సుకుమారమైనటువంటి స్థితిని "లావణ్య" అంటారు. అందుకని "లావణ్య" అని పేరు భవిష్యత్తు కూడా అలోచించి పెట్టాలి. లావణ్య అని పేరు పెట్టుకుంటే, ఆ తర్వాత మనిషి పిప్పళ్ళ బస్తాలాగా ఉందనుకోండి! అలా బాగుండదు, ఉండకూడదు కదా! అందరూ వెక్కిరిస్తారు కూడా. "ఎందుకు నాకిలాంటి పేరు పెట్టారు" అని ఆ అమ్మాయి కూడా కోప్పడుతుంది వాళ్ళ అమ్మా నాన్నని. "ఏం మీరేమంత లావణ్యంగా ఉన్నారని, నేను లావణ్యంగా పుడ్తాను. నాకెందుకు లావణ్య అని పేరు పెట్టారు?" అని అడిగితే ఏం చెప్పలేం! కొన్ని కొన్ని పేర్లు తొందరపడి పెట్టకూడదు. అలా చాలా పెట్టేసుకుంటారు లెండి!

రూప లావణ్యం. అది చాలా వైభవంగా ఉందిటండి. "వైభవం" అన్న పదానికి జ్యోతిషశాస్త్రంలో ఒక అర్థముంది. ఎవరి జాతక చక్రమందు బృహస్పతి, శుక్రుడు, సూర్యుడు, ఇంద్రుడు, ఈ నలుగురు చాలా ఉచ్చస్థితిలో ఉంటారో వాళ్ళదటండి వైభవమంటే! శుక్రుడు, బృహస్పతి ఇద్దరూ గురువులే. సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు ఇంతమంది ఉచ్చదశలో ఉంటే, ఇంక ఆ మనిషి వైభవం పట్టలేని వైభవంగా ఉంటుంది. అలాంటి వైభవంతో ఉన్నాడట. ఆయన గంభీరంగా ఉన్నాడట. గంభీరంగా అంటే అర్థమేంటో తెలుసా? చాలా లోతు తెలియని వ్యక్తి అని అర్థం. అంటే, మనిషి లోతు తెలియదు అన్నట్టుగా ఉంటుంది. "చతురత" అంటే, అది ఒక రకమైనటువంటి నిపుణత్వమది. అంటే, చేతలు గాని, మాటలుగాని అనూహ్యంగా ఉంటాయి. అలా ఉంటేనే అది చతురత. "తేజోవిశేషంబులకు" – విశేషమైనటువంటి తేజముంది. ఈ విశేషాలన్నీ చూసేసిందిట రుక్మిణీదేవి. ఒక్కసారి అలా కనపడంగానే అన్నీ గ్రహించేసింది.

"సంతసించి మనోభవ శరాక్రాంతయై" – లోపలనుంచి ఇహ మన్మధుని బాణాలు బాగా టప, టప వేసేస్తున్నాడటండి ఆవిడ మీద. అంటే, ఇంక తట్టుకోలేనంత ఆకర్షణ కలిగిందని అర్థం. తట్టుకోలేనంత ఆకర్షణ లోపలినుంచి వచ్చేసింది. ఇంక తాళలేని పరిస్థితి అనమాట. "రథారోహణంబు గోరుచున్న" – ఇంక ఎలా చూసిందంటే, ఇంకేమిటి ఆలస్యం, ఎత్తుకెళ్ళిపో అని చూసిందన్నమాట. అంటే ఆ చూపులో అంత ఆత్రుత కనిపించింది. ఎంచేత? లోపల నుంచి మన్మధుడు పద పదమంటున్నాడు కృష్ణుడు మీదకి. అలా కోరుకుంటున్నారు. అలా "గోరుచున్న యవ్వరారోహం జూచి" – వరుడిని దగ్గరికి చేరేటువంటి ఉద్దేశ్యంతో ఉన్నటువంటి రథమెక్కడానికి సిద్ధంగా ఉన్నటువంటి రుక్మిణీదేవిని చూచాడటండి.

"పరిపంథిరాజలోకంబు చూచుచుండ మంద గమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి" – మధపుటేనుగులాగా నడిచాడట ఆయన. ఈమె నెమ్మదిగా నడుచుకుంటూ వస్తుందట. ఆయన చాలా నెమ్మదిగా నడుచుకుంటూ వస్తున్నాడట. రాజులందరూ ఎలా ఉన్నారో పొద్దున generator చప్పుడులో చెప్పుకున్నాం. వాళ్ళంతా ఎలా చేష్టలు ఉడిగిపోయారో, ఐదు రకాల పతనాలు చెప్పారక్కడ. వాళ్ళు అట్లా ఊరికే ఉన్నారు తప్ప, జీవన్ముక్తులు అన్నట్టుగా చేష్టలు ఓడిగిపోయి ఉన్నారు అమ్మవారిని చూసి. ఈయన వస్తుంటే అసలు వాళ్ళకి ఏమి చలనం లేదు.

"గంధసింధురంబు లీలం జనుదెంచి ఫేరవంబుల నడిమి భాగంబుగొని" – ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసాడట. ఆవిడది చాలా సన్న నడుము కదా! సన్నటి నడుము చుట్టూ ఏనుగు తొండం లాంటి చేయి వేసాడు. వేసి, అలా ఎత్తుకున్నాడు. ఆ బొమ్మే పెట్టాం కిందటి ఏడాది, అంతకిందటి ఏడాది గురుపూజల్లో. ఈపాటికి ఆవిడ నడుముకి నొప్పి వచ్చేసుంటుందని కృష్ణమూర్తి గారు ఈ బొమ్మపెట్టారు! మొదటి సంవత్సరం పెట్టారు, రుక్మిణీకల్యాణం మనకి కథ పూర్తిగా అవ్వలేదు! రెండో సంవత్సరం కూడా పెట్టారు! ఇప్పుడు మూడో సంవత్సరం ఇంక లాభం లేదని దండలేసుకోవడం పెట్టేశారు! చూడంగానే అన్నాను "ఏమిటి? మరి ఇంక ఈ సంవత్సరంలో ఇది పూర్తి అయిపోవాలి అనే మాటని ఇలా చెప్పరా?" అని. అంటే,  "అలా అని మీరే అన్నారు" అని చెప్పాడు ఆయన. ఆయన గుర్తుపెట్టుకుంటారు కదా! అంచేత, అలా వాటు వేసుకున్నాడండి చేత్తో. వేసుకొని, అలా ఎత్తుకున్నాడు. ఎత్తుకొని,  రథంలో కూర్చోబెట్టేసాడు. "నడిమి భాగంబుగొని చను కంఠరవంబు కైవడి" – సింహం లాగా అట. అంటే, సింహము లేడి పిల్లని ఆ మధ్య భాగంలో నోటితో పట్టేసుకునట్టు. పట్టేసి తీసుకెళ్ళిపోతుంది, తర్వాత భోజనం చేస్తుంది. అక్కడే భోజనం చేయదు పులిలాగా. పులి పద్ధతి వేరు, సింహం పద్ధతి వేరు. పులికి కొంచెం తొందర బాటు, లేకితనం అన్నీ ఉంటాయి. ఆకలికి లేకపోయినా తింటూ ఉంటుంది.

సింహం అట్లా కాదు. ఆకలి వేస్తేనే తింటుంది. ఎక్కడపడితే అక్కడ తినే type కాదు. తీసుకెళ్ళి, తన గృహా ప్రాంతంలో భోజనం చేస్తుంది.

"కంఠరవంబు కైవడి నిఖిల భూపాలగంబుల గణింపక" — అసలు వాళ్ళక్కడ ఉన్నట్టే లెక్క కాదండి ఆయనకి. They don't exist. మొత్తం ఈ రాజులు, వాళ్ళ సమూహాలు, వాళ్ళ సైన్యాలన్నీ అక్కడ ఉన్నా, to him they didn't exist. అందుకనే, ముందు చూశాడు కదా! చూస్తే, వాళ్ళందరూ మనం చిన్నపిల్లలప్పుడు ఆడుకుంటూ ఉంటాం, statue అంటే వాడు నిలబడిపోతాడు కదా! అన్నీ బొమ్మలే! అలా నిలబడి పోయింది. "గణింపక తృణీకరించి" అంటే, వాళ్ళను బొత్తిగా గడ్డిపోచలతో సమానంగా చూశాడు అని చెప్పటానికి తృణీకరము అంటారు. "రాజకన్యకం దెచ్చి హరి తన రథంబుమీఁద నిడికొని భూనభోంతరాళంబులు నిండ శంఖంబు పూరించుచు" — అది రథంలో కూర్చోపెట్టుకున్న తర్వాత, ఆకాశం, భూమి నిండిపోయే అంత గట్టిగా ఆయన శంఖం ఒక్కసారి ఊదాడట.

"బలభద్రుండు తోడనడవ యాదవవాహినీ పరివృతుండై ద్వారకానగర మార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశు లయిన రాజు లందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక" — అప్పుడు వాళ్ళకి కొంత ఇంద్రియాలు పనిచేయటం మొదలుపెట్టి, "ఒరేయ్! ఇదేంటిరా! అందరము ఇక్కడున్నాం!" అనుకున్నారు. ఆయుధాలు జారిపోయినాయి. వాళ్ళే జారిపోయారు అన్ని రకాలుగా కదా! అప్పుడు జరాసంధుడికి ముందు మెలుకువ వచ్చింది అందరి కన్నా. తెలివివచ్చిందంటాం మనం విశాఖపట్టణంలో. అప్పుడు తెలివొచ్చింది ఆయనకి.

> "ఘనసింహంబులకీర్తి నీచమృగముల్ గైకొన్నచందంబునన్
> మనకీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
> చనుచున్నా రదె శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ కాల్పనే
> తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ క్రంతలన్."

వారికి రోషం వచ్చేసింది. మంచి సింహం యొక్క కీర్తిని ఒక నీచమైన మృగం యెత్తుకుపోయిను విధంగా ఎత్తుకుపోతున్నాడు కృష్ణుడు అని జరాసంధుడు అంటున్నాడు. ఎవరు ఘనమైనటువంటి సింహం? ఎవరు నీచమృగాలు? బాగా చేతన అధోగతికి జారివెళ్ళిపోతే నీచమంటారు కదా! అంతకముందు వరకు వీళ్ళంతా చాలా నీచమంటే, ఆ విధంగా చేతనలు ఉడికిపోయినటువంటి వాళ్ళు వీళ్ళు. మెలుకువ రాగానే అవతల వాళ్ళని నీచులన్నారు. ఎందుకంటే, వాళ్ళ స్వభావమది. "గోపకుల్ చనుచున్నా రదె" — ఈ గోపకులందరూ కూడా

పట్టుకొని వెళ్లిపోతున్నారు. "శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ కాల్పనే" అన్నాడు. ఇంకెప్పుడు రా మీ శౌర్యం? ఆయన బయలుదేరి వెళ్ళిపోయాడు. ఎందుకు కాల్చుకోడానికా ఈ శస్త్రాస్త్రాలన్నీ అన్నాడు?

ఇప్పుడు మనం ఈ రుక్మిణీ అనేటువంటి కన్యను అతను నుండి మళ్ళీ తిరిగి సంపాదించుకోకపోతే, విడిపించి తెచ్చుకోలేకపోతే, మొత్తం ఈ భూమి మీద మనుషులందరూ కూడా "నగరే ధాత్రీజనుల్ గ్రంతలన్" అంటే గల్లీల్లో నవ్వుకుంటారని చెప్పాడు. "గ్రంతలం" అంటే చిన్న చిన్న సందులలో. అంటే, చిన్న చిన్న సందుల్లో కూడా నవ్వుకుంటారట. అంటే, అన్ని చోట్ల నవ్వుకుంటారనేగా అర్థం. ఇప్పుడు ఆ అమ్మాయిని, ఆ రాజకూతుర్ని, మనం విడిపించకపోతే, ప్రతి చిన్న సందులో కూడా మన గురించి నవ్వుకుంటారు. కాబట్టి, ఇంక పదండి అని మొదలు పెట్టాడు.

"అరి బలభట సాయకముల
హరిబలములు కప్పఁబడిన నడరెడుభీతిన్
హరిమధ్య సిగ్గుతోడను
హరివదనముఁ జూచెఁ జకిత హరిణేక్షణ యై."

సరే, వీళ్ళు బయలు దేరారు. అంటే, కోలాహలంగా ఉంటుంది. వీళ్ళందరూ, సైన్యమంతా కలిసి వెళ్ళిపోతున్నారు. యాదవ సైన్యం బలరాముడి యొక్క ఆధ్వర్యంలో బయలుదేరి, ద్వారకా నగరం వైపుకి వెళ్ళిపోతున్నారు. రథమెక్కిన తర్వాత, అప్పుడు మొఖం దగ్గరగా చూసిందటండి. అంతవరకు close look లేదు కదా! ఈ హడావిడిలో రథంలో తాను, ఆయన ఉన్నారు కదా! అప్పుడు దగ్గరగా చూసేసరికి, అప్పుడు బిత్తర చూపులు వచ్చేసినాయి ఆవిడకి. కృష్ణుడ్ని దగ్గరగా చూస్తే, బెదిరిన లేడి ఏ విధంగా చూస్తుందో అలాంటి చూపులతో కృష్ణుడ్ని అట్లా చూసిందటండి.

"చొచ్చెద రదె యదువీరులు
వ్రచ్చెద రరిసేన నెల్ల వైరులు పెలుచన్
నొచ్చెదరును విచ్చెదరును
జచ్చెదరును నేఁడు చూడు జలజాతాక్షీ!"

అని అన్నాడాయన. ఆయన రథంలో ఎక్కించ్చుకుని పెట్టుకున్నాడు. ఇంక మరి ప్రతాపం చూపించాలి కదా! ఆ గంభీరమైనటువంటి కృష్ణుడ్ని చూసి ఈవిడ విలవిలలాడిపోయింది, భయపడిపోయింది.

అప్పుడు ఆయనన్నాడు, "ఇదుగో వస్తున్నారు! వాళ్ళందరూ శత్రుసైన్యాలన్నీ..." నొచ్చెదరంటే వేసిన బాణాలు బాగా గుచ్చుకుంటాయి. ఆయుధాలన్నీ బాగా నొచ్చుకోవడం జరుగుతుంది. "విచ్చెదరు" – కాళ్ళు, చేతులు ఊడిపోతూ ఉంటాయి కదా! యదువీరుల బలం అలాంటిది. యదువీరులు చాలా బలమైనటువంటి వాళ్ళు. అందుకే దుర్యోధనుడు వాళ్ళ కోసం మోహపడతాడు. "పదివేల మంది యదువీరులు ఒక పక్క, నేనొక్కడిని ఒక పక్క. ఏం కావాలో చిన్నవాడివి కాబట్టి ముందు నువ్వు కోరుకో" అని అర్జునిడితో చెప్పాడు. అలా అంటే, దుర్యోధనుడు బయపడ్డాడు, అర్జునుడు పదివేల వీరుల్ని కోరుకుంటాడేమో అని. "నేను యుద్ధం చేయను, ఊరికే ఉంటాను. వాళ్ళు పదివేల మంది యుద్ధం చేస్తారు. ముందు చిన్నవాడిని ఎవరు కావాలో కోరుకోని, లేకపోతే చిన్నవాడిని చేసి అన్యాయం చేశాము అని మనిద్దరినీ అంటారు" అని చెప్పి, కృష్ణుడు అర్జునుడికి ముందు అవకాశమిస్తే, అర్జునుడు పదివేల వీరుల్ని కోరుకుంటాడేమో అని దుర్యోధనుడు బయపడ్డాడండి. అంతటి వాళ్ళు ఆ యదువీరులు అందరూ, సామాన్యులు కాదు. అందుకని, వీడు చెప్తున్నాడు – అదుగో యదు వీరులందరూ ఉన్నారు. ఈ యదు వీరులున్నారే, అంటే శత్రువీరులు, వాళ్ళందరూ నొచ్చెదరు, విచ్చెదరు, చచ్చెదరు. కొంతమంది they get hurt. కొంతమంది కాళ్ళు, చేతులు, తలకాయలు పోతాయి. కొంత మంది చచ్చిపోతారు చూడు అని చెప్పాడు.

"అని రుక్మిణీదేవిని హరి యూఱడించె నంత బలభద్రప్రముఖులైన
యదువీరులు ప్రళయవేళ మిన్నునం బన్ని బలుపిడుగు లడరించు పెను
మొగిళుల వడువున జరాసంధాది పరిపంథిరాజచక్రంబు మీఁద నవక్ర
పరాక్రమంబున శిఖిశిఖా సంకాశ నిశిత శిలీముఖ నారాచ భల్ల ప్రముఖంబు
లైన బహువిధ బాణ పరంపరలు గురియ నదియును విదళిత మత్త
మాతంగంబును విచ్ఛిన్నతురంగంబును విభిన్నరథవరూథంబును
వినిహత పదాతి యూథంబును విఖండిత వాహ వారణ రథారోహణ
మస్త కంబును విశకలిత వక్షో మధ్య కర్ణ కంఠ కపోల హస్తంబును విస్ఫోటిత కపాలంబును
వికీర్ణ కేశజాలంబును విపాటిత చరణ జాను జంఘంబును
విదళిత దంత సంఘంబును విఘటిత వీర మంజీర కేయూరంబును
విభ్రష్ట కుండల కిరీట హారంబును విశ్రుత వీరాలాపంబును విదార్యమాణ
గదా కుంత తోమర పరశు పట్టిస ప్రాస కరవాల శూల చక్ర చాపంబును
వినిపాతిత కేతన ఛ్ఛత్ర చామరంబును విలూన తనుత్రాణంబును

విలీయమాన ఘోటక సంఘ రింఖా సముద్ధూత ధరణీపరాగంబును
వినష్ట రథ వేగంబును వినివారిత సూత మాగధ వంది వాదంబును
వికుంఠిత హయహేషా పటహ భాంకార కరటి ఘటా ఘీంకార రథనేమి
పటపటాత్కార తురగ నాభిఘంటా ఘణాత్కార వీరహుంకార భూషణ ఝణఝణాత్కార
నిస్సాణ ధణధణా త్కార మణినూపురక్రేంకార
కింకిణీ కిణకిణాత్కార శింజనీటంకార భట పరస్పర ధిక్కార నాదంబును వినిర్భిద్యమాన
రాజసమూహంబును విద్య మాన రక్తప్రవాహంబును
విశ్రూయమాణ భూత వేతాళ కలకలంబును విజృంభమాణ ఫేరవ కాక
గృధ్ర కంకాది సంకులంబును బ్రచలిత కబంధం బును బ్రభూత పలల
గంధంబును బ్రదీపిత మేదో మాంస రుధిర ఖాదం బును బ్రవర్తిత
ఢాకినీప్రమోదంబును నై యుండ నప్పుడు."

ఇంక ఇవన్నీ ఏముందిలెండి! వరుసగా వీళ్ళందరూ బాణాలు వేస్తుంటే, అది ఆకాశంలోంచి పిడుగులు పడుతున్నట్టుగా ఉన్నాయటండి. తమ్ముడొక్కడే వెళ్ళాడని బలరాముడు కూడా వచ్చాడు కదా! వీళ్ళు బాణాలు వేస్తుంటే, బలరాముడు తన సహచర్యలతో అవన్నీ సరాసరి పిడుగులుపడ్డట్టుగా పడి, వాళ్ళ రథాలు విరిగిపోయినాయి, గుఱ్ఱాలు చచ్చిపోయినాయి, ఏనుగులు కిందపడిపోయినాయి. మనుషులు రకరకాలుగా ఛిన్నాభిన్నంగా, వాళ్ళు అందరూ ఓడిపోవటం జరుగుతుంది. మొత్తం సేనంతా ఆ విధంగా చిత్తుచిత్తు కింద కొట్టారంటారు చూశారా! అంటే, వంద రన్స్ లోపలే all out అయిపోయారంటే ఎలా ఉంటుంది అట్లా!

"మగిడి చలించి పాఱుచును మాగధముఖ్యులు గూడి యొక్కచో
వగచుచు నాలిఁ గోల్పడినవానిక్రియం గడు వెచ్చ నూర్చుచున్
మొగమునఁ దప్పిదేరఁ దమ ముందటఁ బొక్కుచునున్న చైద్యుతోఁ
బగతుర చేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే."

అయిపోయింది యుద్ధం, ఎక్కువ సేపు పట్టలేదు. చాలా సేపు జరుగుతుందనుకున్నారు యుద్ధం. ఇంతమంది రాజులొచ్చారు కదా! చాలా సేపు జరగద్దండి యుద్ధం! ఉన్నట్టుండి ఊరినిండా గభగభా ప్రకృతి నుంచి పిడుగులు పడిపోయినాయి అనుకోండి, ఎట్లా అయిపోతుంది? ఎంతసేపు పడాలండి? ఇహ, ఈ మిగిలిన వాళ్ళు, ఈ శిశుపాలుడు, ఆయన అనుచరులు "మగిడి చలించి పాఱుచును" అంటే వెనక్కి పరిగెత్తారు. పోనీలే!

నువ్వన్నా బతికావు అనుకున్నారటండి వాళ్ళు. జరాసంధుడు మొదలగు కృష్ణుడు విరోధులైన రాజులందరును కృష్ణుని సైనికుల దెబ్బకు తాడలేక, వెనుకకు తిరిగి పరిగెత్తి పోవుచూ, ఒక ధావన చేరుకొని, దుఃఖపడుచూ, తన యెదుట పెళ్ళామును పోగొట్టుకొనిన వాని వలె మొగము వేల వేసుకొని, వేడి నిట్టూర్పులు విడుచుచున్న శిశుపాలుని చూచి ఊరడించువారై, “ఓ! శిశుపాల, నీవు పగవారి చేత చిక్కుకొని ప్రాణములు పోగొట్టుకొనక క్షేమముగానున్నావా?” అన్నారట. ఎలా అయిపోయిందో చూడండి? పాపం వాళ్ళు ముందు మూడు రోజుల నుంచి, నాలుగు రోజుల నుంచి చాలా preparation లో ఉన్నారు కదా! అదంతా చాలా తక్కువ time లో ఒక ఘడియ కాలమంటాం, అంటే ఇరవైనాలుగు నిమిషాలు అనుకోండి.

సరే, ఈయన వెనక్కొస్తే ఆయన కనపడ్డాడట. ఎవరు? జరాసంధుడు, వాళ్ళందరూ కూడా పారిపోయి వచ్చేశారు. జరాసంధుడికి పారిపోవటం కొత్త కాదు. అది బాగా నేర్చుకున్నాడాయన. కృష్ణుడే నేర్పాడు. ఇప్పుడు జరాసంధుడే చెప్పుకుంటాడు అది. “బగతుర చేతిలోఁబడక ప్రాణముతోడుత నున్న వాఁడవే” – బతికున్నావు, అంతే చాలన్నాడు. అసలు చచ్చిపోతే ఇంకేం చేస్తావు అని చెప్పాడు.

> “బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండినఁ
> బ్రతుకు గలిగెనేని భార్య గలదు
> బ్రతికితీవు భార్యపట్టు దయ్యు మెఱుంగు
> వగవ వలదు చైద్య వలదు వలదు.”

ఓడిపోయినవాళ్ళు తత్త్వం చెప్తున్నాడు! ఒక్కోళ్ళు ఒక చోట కూర్చొని ఒకళ్ళకొకళ్ళు ఓదార్చుకుంటున్నారండి. ఒకళ్ళకొకళ్ళు చూసి బాగా ఓదార్పు మాటలు చెప్పుకుంటున్నారు. ఇంతకి ఎక్కువ effect అయ్యింది ఎవరు? శిశుపాలుడు. ఆయన కోసమే కదా వీళ్ళంతా మోపు చేశారు. నీకెందుకు, మేమున్నాం కదా! నీదే రుక్మిణి! అన్నట్టుగా అందరూ బాగా ప్రోత్సహించారు కదండి శిశుపలుడిని! అన్నిపక్కల నుంచి చాలా రాజులు, వారి సైన్యమంతా వచ్చి చేరారు కదా! ఇది ఏంటి ఇట్లా అయిపోయింది? Double century కొడ్తాడంటే, వెళ్ళంగానే మొదటి ball కే clean bowled అయిపోతే, వాడు తిరిగొస్తుంటే వాడికి ఎట్లా ఉంటుందండి? pavillion కొచ్చిన తర్వాత, వాడిని ఎవరో ఒకడు సముదాయించకపోతే చచ్చిపోతాడు కదా! అందుకని, ఈయన సముదాయిస్తున్నాడు ఈ విధంగా.

“బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన” – ఒంట్లో ప్రాణాలంటూ ఉంటే “బ్రతుకు గలిగె నేని భార్య గలదు”. రుక్మిణీదేవి లేకపోతే నేను చచ్చిపోతాను అన్నట్టుగా, అంత విపరీతంగా ప్రేమించిన వాడేం కాదు కదా!

వాళ్ళదంతా రాజకీయం. ఎవరు ఏ రాజకుమార్తెని పెళ్లిచేసుకుంటే ఏ రాజు మన బలంలో చేరతాడు, ఇది కదా లెక్క! ఎక్కువ రాజుల పెళ్ళిళ్ళు అట్లాగే ఉంటాయి. ఆ పరరాజ్యంలో ఒక కుమార్తె ఉన్నది. మరొక దగ్గర కుమారుడున్నాడు. వివాహం చేస్తే ఏమవుతుంది, రెండు రాజ్యాలు ఒక్కటై పోతాయి కదా! అలా ఉంటాయి తప్ప, ఇలా రుక్మిణీదేవి లాగా, ఇంక మరి కృష్ణుడు లేకపోతే నేను బతకను అన్న పరిస్థితి కాదుగా శిశుపాలుడిది! అందుకని ఏం చెప్పాడు? ఈ భార్య కాకపోతే ఇంకొక భార్య. "బ్రతికితీవు భార్యపట్టు దైవ మెఱుంగు" – నీకు భార్యంటావా, అది దేవుడికి తెలుసులే, ఆయన చూస్తాడు. God knows అంటాం కదా! "దైవ మెఱుంగు వగవ వలదు చైద్య వలదు వలదు" అన్నాడు. అంటే ఏడ్చేవాడిని, ఏడవబోకురా! ఇంకో పెళ్ళాం దొరుకుతుంది అని చెప్పాడండి.

అంటే రుక్మిణి దొరకడంలోను, ఇంకొకళ్ళు దొరకడంలోను చాలా తేడా ఉంటుంది, తెలుసా! కొందరి జాతకాలకి వివాహమైన తర్వాత చాలా వృద్ధి ఉంటుంది తెలుసా! ఎందుకంటే, భార్య సంసారానికి ఎంత హేతువో, ముక్తికి కూడా అంతే హితువు. మన ప్రారబ్ధం బట్టి అది. ఎవరెవరికి ఎలాంటి భార్య వచ్చినా, భర్త వచ్చినా, ఇద్దరూ కలిసి ముక్తిమార్గంలో నడవడం ఆనందం అనుకోండి. ముక్తి హేతువు – ఒకొళ్లొకళ్ళు బాగా support చేసుకుంటారు. చాలా ముక్తి పథంలో నడిచేటువంటి స్త్రీని ఒక పురుషుడు పెళ్లి చేసుకుంటే, ఆమె యొక్క సంస్కార బలం చేత అతడు కూడా క్రమంగా మార్గంలోకి వచ్చినటువంటి సన్నివేశాలు చాలా ఉంటాయి. అందుచేత, ముక్తికాంత పోయిందని బాధపడకు అంటున్నాడు. అంటే, ముక్తికాంత వీడికి ఎలాగు దక్కదు అని! వీడికున్న పరిస్థితికి, సంస్కారానికి దక్కేది కాదు ఆమె. ఇంకోటి ఏదన్న దక్కుతుందిలే, ఏం ఫర్వాలేదు, ప్రస్తుతానికి మన పరిస్థితి ఈ విధంగా ఉంది కాబట్టి దీనికి నువ్వు ముందు ఈ పరిస్థితిని అంగీకరించమని చెప్పాడండి.

"వినుము. దేహధారి స్వతంత్రుండు గాఁడు. జంత్రగాని చేతి జంత్రపు
బొమ్మ కైవడి నీశ్వరతంత్ర పరాధీనుండై సుఖదుఃఖంబులందు
నర్తనంబులు సలుపుఁ దొల్లి నేను మధురాపురంబుపైఁ బదియేడు
మాఱులు పరాక్రమంబున విడిసి సప్తదశవారంబులు చక్రిచేత బరాజిత బలచక్రుండనై
కామపాలు చేతం బట్టుబడి కృష్ణుండు కరుణసేసి విడిపించి పుచ్చిన వచ్చి
క్రమ్మఱ నిరువదిమూఁ డక్షౌహిణులం గూడుకొని పదునెనిమిదవమాఱు
దాడిచేసి శత్రువులం దోలి విజయంబు చేకొంటి నిట్టి జయాపజయంబు
లందు హర్షశోకంబులం నేనెన్నండునుం జెంద నేఁటిదినఁబున నీ కృష్ణు

నెదిరిపోర మన రాజలోకం బెల్ల నుగ్రాక్షుల గూడికొని పోరినవోదుదు
మింతియగాక దైవయుక్తం బయిన కాలంబునం జేసి లోకంబులు
పరిభ్రమించుచుండు నదియునుం గాక."

ఏ స్వతంత్రం మనం ఉందనుకుంటున్నాం గాని, ఏమి లేదురా! అని చెప్పాడు. జరాసంధుడు మహాజ్ఞాని. జ్ఞానులకైనా అహంకారం కలిగినప్పుడు ప్రవర్తన మరొక రకంగా ఉంటుంది. తన అల్లుడిని చంపాడు కాబట్టి వాడి మీద వైరం తప్ప, వాడు ఎందుకు చంపాడు అనేది చూడాలి కదా! అంతకముందు తన అల్లుడు కంసుడు చేస్తున్నటువంటి పనులన్నిటినీ జరాసంధుడు చాలా గ్రహించేవాడు. కంసుడికి నువ్వు చేసేపనులన్నీ నువ్వు నా అల్లుడని చెప్పుకోవటానికి నాకు సిగ్గుచేటుగా ఉంటోదన్నట్టుగా చెప్తుండేవాడు అల్లుడికి. అంత పెద్దవాడాయన. జరాజయ కృపతో జీవిస్తున్నటువంటివాడు జరాసంధుడు. చాలా బలుడిచ్చి బలవంతుడయ్యాడు. భావిభారత సామ్రాజ్యానికి తాను చక్రవర్తి అవ్వాలనేటువంటి ఆశ ఉండేది. చాలా బలమైనటువంటివాడు. అల్లుడు చేసే పనులు చూస్తుంటే, మరీ ఊరకుక్కలా చేస్తున్నాడనిపిస్తుండేది. తన స్థాయికి తగినటువంటివాడు తనకు అల్లుడు దొరకలేదే అని బాధ పడేవాడు. అలాంటి అల్లుడిని కృష్ణుడు సంహరించటం చేత, తన కుమార్తె పరిస్థితిని చూసి కృష్ణుడు మీద వైరం పెంచుకున్నాడు. మనకి వైరం ఎవరిమీదన్నా పెరిగితే వాడితో ఎవరకి వైరం ఉంటుందో వాళ్ళందరినీ మనం పోగేసుకుంటాం కదా! అలా అందర్నీ ఒక గుంపు చేసుకున్నాడు. కాని, తెలియనివాడు కాదు. అంచేత, ఏమంటున్నాడంటే "జంత్రగాని చేతి జంత్రపు బొమ్మ" – బొమ్మలాడించే వాడు ఒకడుంటాడు కదా! బొమ్మలాడించేవాడు ఆడిస్తుంటే బొమ్మలు ఆడుతూ ఉంటాయి. రంగులరాట్నం ఎక్కామనుకోండి, ఎక్కి కూర్చుంటే తిప్పేవాడిని బట్టి కదా మన తిరుగుడంతా! అట్లాగే సృష్టి చక్రమందు జీవులందరూ కూడా ఒకడు తిప్పుతుంటే అందులో అందరూ తిరుగుతున్నారు రా! అంత పెద్ద స్వతంత్రమేమి లేదు.

"నీశ్వరతంత్ర పరాధీనుండై నర్తనంబులు సుఖదుఃఖములందు సలుపు" – అంతా ఈశ్వరేచ్ఛ వల్ల జరుగుతుంది. సుఖదుఃఖాలు ఈశ్వరేచ్ఛ అని చెప్పాడు. "దొల్లి ఇది వరకు నేను మధురాపురంబు పై పడి బదియేడు మాఱులు పరా క్రమంబున విడిసి సప్తదశ వారంబులు చక్రి చేత నిర్మూలిత బలచక్రుండనై" – ఇంతకముందు పదిహేడు సార్లు పరాక్రమంతో పట్టాడటండి మధురాపురం మీద. ఎందుచేత? కంసుడ్ని సంహిరించినటువంటి కృష్ణుడు అక్కడ ఉన్నాడు కాబట్టి జయించాలి. "సప్తదస వారంబులు" – పదిహేడు వారాలు.

"చక్రిచేతం నిర్మూలిత బలచక్రుండనై" –వెళ్తే, కృష్ణుడు పదిహేడు సార్లు శుభ్రంగా జరాసంధుడిని ఓడించేసి, అతడి సైన్యాలన్నిటినీ హరించేసి, అతన్ని మాత్రం వదిలేసేవాడు. ఎందుకలా చేశాడు? జరాసంధుడు మరణము భీముడు చేతిలో నిర్ణమై ఉన్నది. జరాసంధుడు, దుర్యోధనుడు, కీచకుడు, బకాసురుడు. ఈ ఐదుగురులో ఎవరు ఎవర్ని మొదట చంపితే, ఇహ వాళ్ళే మిగతా వాళ్ళందర్నీ కూడా చంపుతారని ఉంది. వాళ్ళు పంచ వాయువులు. వీళ్ళందరూ వాయుపుత్రులే, పంచవాయువులు. ఇందులో ఏ వాయువు మిగతా వాయువులు వాళ్ళు వీళ్ళందరూ వాయుపుత్రులే పంచవాయువులు. ఇందులో ఏ వాయువు మిగతా వాయువుల్లో ఒక దాన్ని హరిస్తే, ఆ వాయువే అన్ని వాయువుల్ని హరిస్తుందని ఒక కథ ఉన్నది. కథే కాదు, అందులో సత్యమున్నది. అది యోగపరంగా మనం పంచప్రాణాలు గురించి ఎప్పుడో చెప్పుకున్నప్పుడు చెప్పుకోవచ్చు. మొట్టమొదట భీముడు, బాకాసురుడ్ని జయిస్తాడు. కాబట్టి అప్పుడే నిర్ణయమైపోతుంది. ఈ కథ ఎప్పుడు జరుగుతుంది? అంచేత, కృష్ణునికి తెలిసి, అతనిని మాత్రం సంహరిచకుండా వదిలేస్తే ఏం చేస్తాడు? మాటిమాటికీ సైన్యాలు తెస్తూ ఉంటాడు. అంటే, ఎవరెవరైతే అధర్మానికి పాలుపడతారో వాళ్ళందరూ అతనితో చేర్తారు కదా! అధర్మం ఆచరించేటువంటి రాజసమూహాలను వారి సేనలతో పాటు సంహరిస్తూ, జరాసంధుడ్ని వదిలేసేస్తారు. వదిలేస్తే, వాడు మళ్ళీ పోగేసుకొని మళ్ళీ వస్తాడు. మళ్ళీ వస్తే, మళ్ళీ వాళ్ళందర్ని సంహరించి, వీడ్ని పంపించేశాడు. ఇట్లా పదిహేడు సార్లు జరిగింది. పదిహేడు సార్లు ఇలా ఓడిపోయాను, పద్దెనిమిదో సారి నేను గెల్చానంటున్నాడు. ఇప్పుడు అది చెప్తున్నాడు చైద్యుడికి. అంటే 17 grand slam finals లో ఓడిపోయాడండి. ఒక grand slam finals కి కృష్ణుడు ఆడలేదు, ఆయన వెళ్ళిపోయాడు. ఆయన పారిపోయాడు కావాలనే. Title వీడికి వచ్చేస్తుంది కదా! అది చెప్తున్నాడిక్కడ. అంటే, ఈశ్వర ఆధీనంగా ఎట్లా ఉంటుందో – పదిహేడు సార్లు ఓడిపోయిన వాడిని గెలవటమేమిటి, ఇప్పుడు గెలిచానంటాడు.

"బలచక్రుండనై కామపాలు చేతం బట్టువడి కృష్ణుండు కరుణసేసి విడిపించిన పుచ్చిన క్రమ్మఱ నిరువదిమూఁ డడక్షౌహిణులం గూడికొని పదునెనిమిదవమాఱు దాడిచేసి శత్రులం దోలి విజయంబు చేకొంటి" – పద్దెనిమిదో సారి ఇరవైమూడు అక్షౌహిణుల్ని తీసుకువెళ్ళాను. వెళ్తే, అప్పుడు నాకు జయం కలిగింది. "నిట్టి జయాపజయంబులందు హర్షశోకంబులు జెంద నేనెన్నండునం" – అందుకని అన్నీ సార్లు ఓడిపోతే మరి ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో? మరి మీరందరూ ఉన్నా కూడా ఇట్లా ఎందుకు ఓడిపోయామని వాడు అడక్కుండానే చెప్పుకుంటున్నారనమాట.

ఈ రోజున రుద్రుడు, ఉగ్రాక్షుడు, మూడోకన్నువాడు కూడా వచ్చి మనతో చేరి పోట్లాడినా ఇవ్వాళ్ళ మనం కృష్ణుడిని గెలవలేము అని చెప్పాడు. ఒప్పుకున్నాడండి. కాని, ఒక్కొక్కరోజు అట్లా ఉండదంటాడు. పదిహేడు

సార్లు నేను ఓడిపోయాను, పద్దెనిమిదో సారి మరి నేను గెలిచాను. ఇవ్వాళ్ళ ఆ కృష్ణుడ్ని గెలవడం మన వల్ల కాదు. మన వల్ల కాదంటే, ఏమయినా అంటాడేమో అని చెప్పి శివుడ్ని కూడా కలుపుకున్నాడు! అదెందుకండి అక్కర్లేని మాట! కృష్ణుడితో శివుడు యుద్ధం చేయడు కదా! ఎందుకట్లా చెప్పుకున్నాడు? అంటే, నేనే కాదు, వాడైనా ఓడిపోతాడు ఇవాళ్ళ కృష్ణుడి చేతిలో అని చెప్తే వీడికి ఊరట కరుగుతుందని. వాడు ఓడిపోతాడో లేదో నీకెట్లా తెలుస్తుంది? మనం ఊరడింపుకు చెప్పే మాటలు ఇట్లా కలిపేస్తుంటాం కదా! ఇంకా continue చేస్తున్నాడు ప్రవచనం శిశుపాలుడికి.

> "తమకుం గాలము మంచిదైన మనలం ద్రైలోక్యవిఖ్యాతి వి
> క్రములన్ గెల్చిరి యాదవుల్ హరిభుజాగర్వంబునన్ నేఁడు కా
> లము మేలై చనుదెంచెనేని మనమున్ లక్షించి విద్వేషులన్
> సమరక్షోణి జయింత మింతపనికై శంకింప నీ కేటికిన్."

ఇవాళ్ళ వాళ్ళ time బాగుందయ్యా అని చెప్పాడు. "తమకుం గాలము మంచిదైన" అవ్వటం చేత వాళ్ళకి "ద్రైలోక్యవిఖ్యాత విక్రములన్" విక్రములతో గెలిచారట వాళ్ళు. చాలా గొప్పగా గెలిచారు ఇవాళ్ళ. "యాదవుల్ హరిభుజాగర్వంబునన్" – కృష్ణుడు తోడుండగ ఈ విధంగా యాదవులు మనల్ని ఎందుకు కానట్టుగా చిత్తుచిత్తుగా కొట్టేశారు. ఈ రోజున చాలా గర్వంగా పోట్లాడారు. "కాలము మేలై చనుదెంచనేని" – మనకి మంచి రోజులు వస్తే... ఈ రోజు ఇలా జరిగింది. ఇంకో రోజు ఇలా జరుగుతుందని ఏమి లేదు. అందుకని, ఇంకో రోజు మనదై వస్తుంది, మంచి రోజులు వస్తాయిలే, బాధపడకు అని చెప్పాడు. "శంకింప నీ కేటికిన్" అని చెప్పాడు.

> "అని యిట్లు జరాసంధుండు నతని యొద్దిరాజులును శిశుపాలుని పరి
> తాపంబు నివారించి తమ తమ భూములకుఁ జనిరి. శిశుపాలుండు
> ననుచర సేనా సమేతుండై తన నగరంబునకుం జనియె. నంత రుక్మి
> యనువాఁడు కృష్ణుండు రాక్షసవివాహంబునం దన చెలియలిం గొని
> పోవుటకు సహింపక నేకాక్షౌహిణీబలంబుతోడ సమరసన్నా హంబునం
> గృష్ణుని వెనుదవిలి పోవుచుఁ దన సారథితో ని ట్లనియె."

వీళ్ళందరూ ఆగిపోయారండి. ఇవాళ్ళ ఫలాక్షుడు వచ్చినా మనం గెలవలేము, కాబట్టి ఇంక వద్దని విజ్ఞత కలిగి వాళ్ళంతా వెళ్ళిపోతే, వీడొకడున్నాడు మూర్ఖుడు. అంటే, ఇతడు ఎంత మూర్ఖుడో తెలుస్తుంది. అంతమంది

మహావీరులు ఇవాళ్ళ time బాలేదు, మనం వద్దు అనుకున్నారు. వీడేంటి? రోషం. ఎందుకంటే, proposals రుక్మిది కదా! రుక్మే కదా అతడు స్నేహితుడికి చెప్పాడు, "మా చెల్లెల్నిచ్చి పెళ్లి చేస్తాను నీకు" అని. ఇంట్లోనేమో అమ్మ నాన్నతో బాగా పాషాణంగా వాదించి ఒప్పించాడు. ఇప్పుడు కథంతా ఇలా అయిపోయింది కదా!

"బల్లిదు నన్ను భీష్మజనపాల కుమారకుఁ బిన్నచేసి నా
చెల్లెలి రుక్మిణిం గొనుచుఁ జిక్కని నిక్కపు బంట పోలె నీ
గొల్లఁడు వోయెడిన్ రథముఁ గూడఁగఁ దోలుము తేజితోల్లస
ద్భల్ల పరంపరన్ మదముఁ బాపెదఁ జూపెద నా ప్రతాపమున్."

"బల్లిదు నన్ను" – చాలా బలమైనవాడట వాడు! ఇలా మాట్లాడే వాళ్ళు ఎవరూ పైకిరారనేది మనకి తెలిసిన విషయం కదా! చాలా తేజస్సుతో కూడినటువంటి, ఉల్లాసంతో కూడినటువంటి విపరీతమైనటువంటి బాణముల పరంపర వరసగా గాభాగాభా కృష్ణుడు మీద వేసి, అతడి మదం అణిచేస్తాడటండి. "జూపెద నా ప్రతాపమున్" అన్నాడు. మరి కనీసం driver తో అన్నా చెప్పకపోతే వాడు తోలడు కదా! బలవంతుడగు భీష్మక మహారాజు కుమారుడైన నేను ఒకడున్నాడనేటువంటిది విచారింపక, నా చెల్లెలైన రుక్మిణిని ఎత్తుకొని మహాసూరుడు వలె పరిగెడుతున్నాడు. నీవు శీఘ్రముగా రథమును తోలుము. వాడిగా చేయబడినటువంటి బాణముల చేత మదము అణిచి, నా ప్రతాపంబును కనిపింప చేస్తాను అని చెప్పాడు.

"అని యిట్లు రుక్మి యనువాఁడు హరికొలంది యెఱుంగక సారథి
నదలించి రథంబు గూడం దోలించి గోపాలక వెన్నుముచ్చ నిమిష
మాత్రంబు నిలు నిలు మని తిరస్కరించి బలువింట నారి యెక్కించి
మూఁడు వాఁడితూపుల హరి నొప్పించి యి ట్లనియె."

గభగభా రథం తోలాడు, దగ్గరగా వెళ్ళాడు. మిగతావాళ్ళు ఎవ్వరు దారిలో లేరు కదా! వెన్నను దొంగిలించేటువంటి వాడా, ఓ నిమిషమాత్రం నిలువు అని చెప్పి, నారి సరికి ఒక బాణం తర్వాత ఒక బాణం, ఓ మూడు బాణాలు వేసి ఆయనకు గుచ్చుకున్నేట్టుగా కొట్టాడటండి.

"మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ
నేపాటిగలవాఁడ వేది వంశము
మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి
వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు

మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు
మాయ గైకొని కాని మలయ రావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు
వసుధేశుఁడవు గావు వావి లేదు"

"కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు."

మూడు బాణాలు వేసి ఈ విధంగా మాట్లాడాడు. ఈ పద్యంలో చాలా తత్త్వం ఉంటుంది. ఈ పద్యం కూడా చిన్నతనంలో పిల్లల చేత కంఠస్తం చేయించేవాళ్ళు. "మా సరివాఁడవా మాపాపఁ గొనిపోవ" – మాతో సమానమైనటువంటి వాడివి కాదు అన్నాడు. నిజమే! నీ కన్నా చాలా గొప్పవాడు కదా! కేవలం ఆమె కోరుకోబట్టి వచ్చాడు గాని, ఆయనకి కోరికేముందండి? భీష్మకుడికిగాని, రుక్మికిగాని అందే విషయమా కృష్ణుడు! "నేపాటిగలవాఁడ వేది వంశము" అంటే నువ్వు ఎంతటి వాడవో తెలీదుగా! ఇంతటి వాడు కృష్ణుడు అని ఎవ్వరు చెప్పలేరు. అంతటి వాడాయన! ఏ వంశము? ఏదో ఉత్తమోత్తమైనటువంటి వంశాల్లో పుడ్తాడని అందరు ఊహించారట. ఈయన బాగా చాలా ఆమ్ ఆద్మీ పార్టీ లాంటి వంశంలో పుట్టాడు. చాలా సర్వసామాన్యమైనటువంటి వంశంలో పుట్టాడండి. అందుకనే, దశమ స్కంధంలో వస్తుంది – "శీలము గల కులమున ఏలా పుట్టెను హరి" అని ఉంటుంది పద్యం. అంటే, శీలముగల కులమంటే మచ్చ ఉన్నటువంటి వంశము అని అర్థం. మచ్చగల వంశంలో పుట్టాడేంటి భగవంతుడు అని. ఏదైతే ఏవిటంట! దిగివచ్చినవాడు ఎలాంటివాడు! మట్టిలో మాణిక్యముందేమిటంటే, మట్టిలో ఉండకపోతే మీ ఇంట్లో iron shape లో ఉండదు కదా! "ఎందు జన్మించితివి" – నువ్వు ఎట్లా పుట్టావు? ఎక్కడ పెరిగితివి? నీ నడవడి తెలీదు, నీ పుట్టుక తెలీదు. అసలు భగవంతుడికి పెరగడం అంటే ఏముండదు కదా! అంటే పెరగడం, తరగడం లేనటువంటివాడు.

"మానహీనుఁడవు" – మానమంటే కొలత. కొలతలకందరు. కొలతలకందనటువంటి వాడు. "మర్యాదయును లేవు" – సంఘంలో బతికేవాళ్ళకి మర్యాద. కానీ, దానికి అతీతమైనటువంటి వాళ్ళకి మర్యాదతో సంబంధం లేదు. "మాయ గైకొని కాని మలయ రావు" – అంటే మాయ ధరిస్తేనే కనిపిస్తాడు, లేకపోతే కనిపించడు. "నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు వసుధేశుఁడవు గావు వావి లేదు" – నువ్వు

రాజు కాదు కదా! మా అమ్మాయిని ఏదో రాజుకిచ్చుకుందాం అనుకున్నాను. నువ్వు రాజువు కాదు. ఎంచేత? కంసుడిని వధించి, రాజ్యాన్ని మళ్ళీ తాతగారికిచ్చేస్తాడు, "నువ్వే రాజువి, నువ్వే పరిపాలించు, మనకి రాజ్యం వద్దు" అని. "వసుధేశుఁడవు గావు వావి లేదు" – అలాంటిది నువ్వు గుణరహితుడవు. గుణరహితుడంటే మూడు గుణములకు అతీతమైన తత్త్వమది. దానికి గుణముండదు. మూడు గుణాల్లో ఉంటే ఈ తమోగుణమా, రజోగుణమా, సత్త్వగుణమా అని చూసుకోవాలి. అన్ని గుణాలకి అతీతుడైనటువంటివాడు గుణహీనుడంటే తప్పేముంది? నిందాస్తుతి అంటారు. నింద చేసినట్లు కనిపిస్తుంది, కాని స్తుతి చేసినట్లుంటుంది. "విడువు విడువ వేని విలయకాలముగా" అంటే ఇంక ప్రళయం సృష్టించేస్తున్నాను అంటున్నాడండి. తన బాణాలతో ప్రళయం సృష్టించేసి, నీ గర్వమంతా హరించేస్తాను అని చెప్పి రుక్మి పలికితే... అని పలికిన ఈ ఒక్క వాక్యం చదివి, మనం ఆపేసుకోవచ్చు ఇప్పుడు. సమయం కూడా సరిపోతుంది.

> "అని పలికిన నగధరుండు నగి యొక్క బాణంబున వాని కోదండంబు
> ఖండించి యాఱు శరంబుల శరీరంబు దూఱనేసి యెనిమిది విశిఖం
> బుల రథ్యంబులం గూల్చి రెండమ్ముల సారథింజంపి మూడు వాఁడి
> తూపులం గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్క విల్లందినం ద్రుంచి
> వెండియు నొక్క ధనువు పట్టిన విదళించి క్రమంబునఁ బరిఘ పట్టిస
> శూల చర్మాసి శక్తి తోమరంబులు ధరియించినం దునుకలు చేసి క్రమ్మఱ
> నాయుధంబు లెన్ని యెత్తిన నన్నియు శకలంబులు గావించె నంతటం
> దనివిజనక వాఁడు రథంబు డిగ్గి ఖడ్గహస్తుండై దవానలంబుపైఁ
> బడు మిడుత చందంబునం గదిసిన ఖడ్గ కవచంబులు చూర్ణంబులు
> చేసి సహింపక మెఱుంగులు చెదర నడిదంబు పెఱికి జళిపించి వాని శిరంబు తెగ వ్రేయుదు
> నని గమకించి నడచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణార విందంబులు పట్టుకొని
> యి ట్లనియె."

ఒక్కసారి నవ్వాడట కృష్ణుడు. "నగి యొక్క బాణంబున వాని కోదండంబు ఖండించి" – ఒక్క బాణం వేశాడు, మొత్తం ఆ విల్లు విరిగిపోయిందండి. "యాఱుశరంబుల శరీరంబు దూఱ నేసి" – ఆరు బాణాలు ఒక్కసారి వదిల్తే, మొత్తం రుక్మి శరీరంలోకి గుచ్చుకుపోయినాయి. "యెనిమిది విశిఖంబుల రాథ్యంబులం గూల్చి" – ఎనిమిది బాణాలు ఒక్కసారిగా వేస్తే, రథం మొత్తం ముక్కలు ముక్కలుగా అయిపోయింది, గుఱ్ఱాలన్నీ పడిపోయినాయి. "రెండమ్ముల సారథిం జంపి" – ఓ రెండు వాడికి వేశాడు. "మూఁడు వాఁడి తూపులఁ

గేతనంబుఁ ద్రుంచి" అంటే రథం పైన ఉంటుంది కదా! ప్రతి వాడు ఒక జెండా పెట్టుకొస్తాడు కదా! ఎవరి పార్టీ వాడిది, వాడికొక జెండా కదా! అంటే, వాడు ఉపాసన బలం కొద్దీ వాడు పెట్టుకుంటాడు. ఒక్కొక్కడు ఒక్కొక్క హేతనం. దాన్ని "మూఁడు వాఁడి తూపులఁ గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్కవి ల్లందినం" – మళ్ళీ ఈ లోపల ఇంకో విల్లందుకున్నాడట రుక్మి. "విదళించి క్రమంబునం బరిఘ పట్టిస శూల చర్మాసి శక్తి తోమరంబులు ధరియించినం దునుకలు చేసి" – ఆ తర్వాత పెద్ద గద పట్టుకున్నాడట, విసిరేద్దామని. దాన్ని ముక్కలు ముక్కలు చేసేశాడట. "క్రమఱనాయుధంబు లెన్ని యెత్తిన నన్నియు శకలంబులు కావించె" – వాడేం పట్టుకుంటే దాన్ని ముక్కలు ముక్కలుగా కొట్టేసాడండి అది. "నంతటఁ దనివి సనక వాఁడు రథంబు డిగ్గి దనివి సనక" – అంతటతో వాడు ఊరుకోవచ్చు కదా! ఏం పట్టుకున్నా కొట్టేస్తున్నాడు కదా! నువ్విట్లా ఎత్తే లోపల ముక్కలైపోతోంది అది. అంత వేగంగా అటునుంచి బాణాలు వచ్చేస్తున్నాయి. ఇంక ఊరుకోవచ్చు కదా! రథమైపోయింది, గుఱ్ఱాలు, సారథి అయిపోయారు. తనకా ఆరుబాణాలు గుచ్చుకున్నాయి. ఏం పట్టుకుంటే అది విరిగిపోతుంది. పట్టుకొని ఇట్లా ఎత్తే లోపల అది విరిగిపోతోంది.

"ఖడ్గకవచంబులు చూర్ణంబులు" – సహింపక, ఆ కత్తి పట్టుకొని అలా పరిగెత్తుకొని వచ్చేస్తున్నాడట ఆవేశంగా. పరిగెత్తుకొస్తుంటే కత్తి విరిగిపోయింది, కవచాలు ఊడిపోయినాటండి కొట్టిన దెబ్బలకి. అట్లా కొట్టాడు. "మెఱుంగులు చెదర నడిదంబు వెఱికి జళిపించి వానిశిరంబు తెగవ్రేయ నని గమకించి నడచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణార విందంబులు పట్టుకొని యి ట్లనియె" – అయిపోయింది వాడికి, కవచాలు ఊడదీసేశాడు. ఆ పట్టుకొస్తున్న ఖడ్గం కొట్టేసాడు. వీడికి ఇది కాదు, వీడికి ఇంకా బుద్ధి రాలేదని వీడి తల తీసేస్తాను అని కృష్ణుడు రథం దిగిపోయాడు. ఎందుకంటే, మూర్ఖత్వంలో పరాకాష్ట చూపించాడు. ఎవడూ చూపించనంత మూర్ఖత్వం చూపించాడు.

అంచేత, అలా వస్తుంటే, పాపం! పెళ్ళికూతురు ప్రాణనాథుడితో వెళ్తుంటే ఇలాంటి పరిస్థితులు ఎవరికన్నా వస్తాయా అండి! వెంటనే ఆయన కాళ్ళు పట్టుకుందట.

"నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామలకీర్తిశోభిత! సర్వలోకశరణ్య! మా
యన్న యీతఁడు నేడు చేసె మహాపరాధము నీ యెడన్
నన్ను మన్నన చేసి కావు మనాథనాథ! దయానిధీ!"

నువ్వు ఈశ్వరుడివి. నువ్వే సమస్తానికి దేవదేవుడివి అని తెలుసుకోలేక “యో సన్నుతామరకీర్తిశోభిత” – చాలా నిర్మలమైనటువంటి కీర్తితో ఎప్పుడూ పొగడబడుతూ, పుణ్యశ్రవణ కీర్తణుడు అని అంటారు. అట్లా పొగుడుతూ ఉంటారు. అంతటివాడు ఆయన అని అన్నది. అనాతనాథుడివి నువ్వు. చాలా దయ కలిగినటువంటివాడివి. నీకేమాత్రం నన్ను మన్నన చేద్దాం అని నీకనిపిస్తే, ఈ మూర్ఖుడిని ఇంతటితో మరి ఇంకేం చేయబోకు అని అడిగింది. “కల్ల లే దని విన్నవించుట గాదు” – మా అన్న తప్పు చెయ్యలేదు అని నేను అనట్లేదు. అన్న చేసింది మహా అపరాథం. నువ్వు ఎంతటి వాడివో తెలీకుండా, నీ మీదకు దూకుతున్నాడు వాడు. పైగా ఎన్నిసార్లు ఓడిపోతున్నా, మళ్ళీ మీదమీదకు వస్తున్నాడు. అంతే కాదు, చాలా దుష్టుడు తెలుసు తనకి.

> “కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ! యీతనిన్
> బ్రల్లదుం దెగఁజూచితేనియు భాగ్యవంతుల మైతి మే
> మల్లుఁ డయ్యే ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితు లైన మా
> తల్లిదండ్రులు పుత్ర శోకము దాల్చి చిక్కుదు రీశ్వరా!”

ఈ బ్రల్లదుడ్ని, ఈ దుష్టుడ్ని, ఈ దురాచారుడ్ని నువ్వు చంపేస్తే, తలకాయ తెగవేస్తే... అక్కడ ఇంట్లో అమ్మా నాన్న, వాళ్ళకేం అభ్యంతరం లేదు కృష్ణుడు తీసుకెళ్ళడం. కృష్ణుడు కదా! ఇప్పుడే పెళ్లి. పెళ్లి కూతురికి పెళ్లి చేస్తే, కొడుకు పోయాడని అంటే అది ఎంత బాధ తల్లిదండ్రులకి? తల్లిదండ్రులు చాలా బాధ పడ్తారు. ఈ సందర్భంలో ఇలా కృష్ణుడు మా అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని అమితమైనటువంటి ఆనందంలో మా తల్లిదండ్రులుండగా, ఉన్న కొడుకు చచ్చిపోయాడనేటువంటి దుఃఖంలో పడిపోతారు. ఈ శుభసమయంలో ఇలాంటి దుఃఖం నా తల్లిదండ్రులకు కలిగించటం న్యాయం కాదు కదా! అందుచేత, నా మీద నీకు ఏ మాత్రం దయ ఉన్నా, కరుణ ఉన్నా, నేను నన్ను అనాథగా భావించి, అనాథులకు నీవు నాథుడివి కాబట్టి, వీడిని ఈ రోజు ఈ విధంగా చంపకుండా వదిలేయమని చెప్పి కోరుకుంటోంది.

> “అని డగ్గుత్తికతో మహాభయముతో నాకంపితాంగంబుతో
> వినత శ్రాంత ముఖంబుతో శ్రుతిచల ద్వేణీ కలాపంబుతోఁ
> గనుదోయిం జడిగొన్న బాష్పములతోఁ గన్యాలలామంబు మ్రొ
> క్కిన రుక్మిం దెగ వ్రేయఁ బోక మగిడెం గృష్ణుండు రోచిష్ణుఁడై.”

అర్థమైపోయింది కదా మీకు! ఆవిడ మరి కన్నీళ్ళు పెట్టేసిందండి. కన్నీళ్ళు పెడితే, గొంతు బాగా డగ్గుత్తిక అయిపోయింది. భయంతో వణికిపోతోంది ఆవిడ, అన్నయ్యని చంపేస్తాడేమో అని. కళ్ళ నిండా నీళ్ళు

వచ్చేస్తున్నాయి. అట్లా కళ్ళెంబడి నీళ్ళు పెట్టుకుని, కృష్ణుడి కాళ్ళ మీద పడి, మా అన్నయ్యను రక్షించు అని అడిగితే ఆయన ఇంక ఏం మాట్లడతాడండి! అంచేత, ఆయన క్రమంగా తన యొక్క ప్రతాపాన్ని తగ్గించుకొని, చేయబోయే పనిని ఉపసంహరించుకుని...

> "ఇట్లు చంపక బావా రమ్మని చిఱునగవు నగుచు వానిం బట్టి బంధించి
> గడ్డంబును మీసంబునుం దలయును నొక కత్తివాతి
> యమ్మున రేవులు వాఱఁ గొఱిగి విరూపింజేసె
> నంతట యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి తత్సమీపంబునకు
> వచ్చి రప్పుడు హతప్రాణుండై కట్టుబడి యున్న రుక్మిం జూచి కరుణజేసి
> కామపాలుండు వాని బంధంబులు విడిచి హరి డగ్గఱి యి ట్లనియె."

మరి ఇంకా కోపముంటుంది. ఎందుకంటే, అంత రెచ్చకొట్టిన తర్వాత, ఆ కోపం తగ్గడం కష్టం. ప్రతాపవంతులు బాణం ఎక్కుపెట్టిన తర్వాత, ఇప్పుడు చాలు, ఉపసంహరించు అంటే అలా కుదరదు, ఇది ఎక్కడో అక్కడ విడవాలి దీన్ని, చెప్పమని చెప్తూ ఉంటారు మీకు కథల్లో. ఇది ఇంత ప్రతాపంతో వాడిని టకటక ఏవి కాకుండా నిహస్తుడ్ని చేసినటువంటి వాడిని, తన మీద యెగబడి తనని చంపాలని వస్తున్నటువంటి వాడిని, చంపక వదలడానికి చాలా ఉపసంహారం కావాలి. సరే, ఈమె కాళ్ళ మీద పడ్డది. ఒళ్ళంతా ఒణుకుతోంది, కళ్ళెంబడి నుంచి నీళ్ళు వస్తున్నాయి. చెప్పిన విషయం కూడా బాగుంది. మా అమ్మనాన్న నా పెళ్ళయిందని సంతోషిస్తుంటే, వీడు పోయాడని ఏడవాల్సి వస్తుంది కదా! అందుకే కదా ఈవిడ అసలు బయట తీసుకెళ్ళిపోమంది! నేను ఊరు బయటకు వస్తాను, తీసుకెళ్ళమని అడగడానికి కారణమిదే. ఏమిటంటే, తన గృహంలో తన వారు మరణించచ్చుగా, ఇతరులు మరణించచ్చుగా, అందుకు కదా ఆవిడ అడిగింది! వీడు చచ్చిపోతే ఇప్పుడు అమ్మ నాన్న ఏడుస్తారు కదా! ఇన్ని రకాలుగా చెప్తే, ఇంక ఆయన కాదనలేకపోయాడు.

"గడ్డంబును మీసంబును దలయును ఒక కత్తి వాతియంబున రేవులు వాఱఁ గొఱిగి విరూపింజేసె" — అది చేశాడండి. అంటే, మామూలుగా గొరిగితే ఫర్వాలేదు తెలుసా! ఇప్పుడు మనమంతా చేయించుకోవట్లేదా! సత్యప్రసాద్ అలాగే వచ్చాడుగా ఈ సారి గురుపూజలకి! తల నీలాలు ఇచ్చుకుంటూ ఉంటారు దేవుడికి. అలా చేయలేదు కృష్ణుడు. బాగా పదునుగా ఉన్నటువంటి కత్తి ఒకటి తీశాడట. తీసి, "రేవులు వాఱ" అంటే మీరు నదిలో రేవులు చూస్తే, అట్లా పరలుపరలుగా గీతలు పడి... ఇప్పుడు west లో fashion వచ్చింది. India లో కూడా బొంబాయి అటువంటి చోటలకెళ్తే కనిపిస్తాయి. అట్లా గీతలు గీతలుగా మధ్యలో దార్లు వదిలేసాడండి.

అట్లా గీసేశాడు మొత్తమంతా కూడా! మీసం గీసేసాడు, గడ్డం గీసేసాడు. ఇట్లా గీతలుండేట్టుగా గీసాడండి. వికారంగా కురీపిని చేశాడట.

"యదువీరులు పరసైన్యంబులం బాఱఁ దోలి తత్సమీపంబునకు వచ్చి రప్పుడు" – అప్పుడు వీళ్ళంతా వచ్చేశారు. అక్కడ పనైపోయింది కదా! వస్తే, బలరాముడు చూశాడు. చూసి, ఇదేవిటిరా అని ఆయనకు బాధ వచ్చింది. బలరాముడు ఆయన చాలా మెత్తట్టి హృదయమున్నవాడు. గభాల్న కోపమొస్తుంది, గభాల్న చల్లారిపోతాడు, గభాల్న కరుణ వచ్చేస్తుంది, గభాల్న అనుగ్రహం వచ్చేస్తుంది. అంతా గభలున వచ్చేస్తుంది. అంతకముందు రుక్మి ఏం చేసాడో తెలియదు కదా! ఇప్పుడు వాడు బావమరిది కదా! అంచేత, వాడిని వచ్చి చూస్తే, ఈ విధంగా చాలా నైపుణ్యంతో తల మీద శిల్పం చెక్కినట్టు చెక్కేశాడు. అది చూసి బలరాముడు అప్పుడు శాంత వచనాలు పలుకుతాడు.

అది మనం సాయంత్రం చదువుకుందాం. ఇప్పుడు నాకు బాగా ధైర్యంగా ఉంది, మనం సాయంత్రం ప్రవచనంలో ఈ రుక్మిణీకల్యాణం పూర్తి చేయగలం అని. ఈ గుండు వరకు పొద్దున చేద్దామనుకున్నాను! అది కూడా ఒక రకంగా ఆశే! ఎందుకంటే, ఇప్పుడు గంట చెప్పాను. అప్పుడు గంట చెప్పుంటే తొమ్మిదయ్యేది. మనం అప్పుడప్పుడు తొమ్మిది వరకు చెప్పుకుంటూనే వచ్చాం. ఇప్పుటిలాగా మిట్టమధ్యాహ్నం పూట చెప్పుకోం మనం. అంచేత, ఇప్పుడు చెప్పుకోవడం జరిగింది.

"కొందఱు రిపు లని కీడును
గొందఱు హితు లనుచు మేలు గూర్పవు నిజమీ
వందఱి యందును సముఁడవు
పొందఁగ నేలయ్య విషమబుద్ధి ననంతా!"

నువ్వు అందరితో సమబుద్ధితో ఉంటావు కదా! వీడికెందుకు ఇట్లా చేశావు అని అడిగాడు. ఏదో ఆవిడ వదిలేయమంది కదా! నువ్వు వదిలేస్తే సరిపోయేది కదా! ఇంత పని ఎందుకు చేశావు అని. వాడు ఇప్పుడు ఇంటికెళ్ళడు కదా! ఇంకోచోటికెళ్ళి మిగతావి కూడా కత్తరించేసుకొని వెళ్ళాలి కదా! ఆ విధంగా ఎందుకు చేశావు అని ఒక మాట అని రుక్మిణీదేవిని కొంత ఓదారుస్తాడు. ఇలా కృష్ణుడిలా చేశాడని బాధపడుతుందేమో అని తను భావించి కొన్ని ఓదార్పు మాటలు రుక్మిణీదేవికి చెప్తాడు. చెప్పి, ఆ తర్వాత వాళ్ళందరూ ద్వారక నగరం వైపుకి బయలుదేరి వెళ్తారు.

అప్పుడు బలరాముడు చెప్పినటువంటి స్వాంత వచనాలు కొన్ని మనం సాయంత్రం చదువుకుంటాం. ఆ తర్వాత కల్యాణ ఘట్టం. రామకల్యాణం లాగా ఉండదు ఘట్టమిక్కడ. చాలా సులభంగా పెట్టేశారు. అంచేత, ఆ ఘట్టం చెప్పుకొని, ఈ సాయంత్రం ప్రవచనంతో మనం ఈ రుక్మిణీకల్యాణం కథను ఈ విధంగా పరిపూర్ణం గావించుకుందాం. పొద్దున్న ఒక్క పద్యంకే అన్యాయమైపోయింది. “నమ్మితి నామానంబున యుమామహేశులన్” అన్నాడు. అది అలాగే ఉండనీయండి. మనకు కూడా చరిత్రలో బాగుంటుంది అట్లా ఉంటే generator చప్పుడుతో! మిగతాదంతా మనకి పూర్తిగానే ఈ రోజున ఈ కార్యక్రమం సాగింది. ఇంక భోజనం కార్యక్రమం అయింది కదా మనకి! నెమ్మదిగా లేచి భోజనాలకి ఉపక్రమించండి.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## ఫిబ్రవరి 9, 2014 సాయంకాలము – ప్రవచనము #11

ముప్పై ఏడవ మాస్టర్ సి. వి. వి. గురుపూజా మహోత్సవములు విజయవాడ కేంద్రంలో కొనసాగుతూ వచ్చినాయి. 1978 వ సంవత్సరం నుంచి విజయవాడలో గురుపూజా మహోత్సవములు ప్రారంభింపబడ్డాయి. 2014 కి ముప్పై ఆరు సంవత్సరాలు పూర్తయ్యి, ముప్పై ఏడవ గురుపూజ మనం నిర్వర్తించుకుంటూ ఉన్నాము. విశేషమేమిటంటే ముందు సంవత్సరాల్లో విజయవాడలో గురుపూజ మార్చి నెలలో మూడవ ఆదివారం అప్పుడు ఉంటూ ఉండేది. 1984 వ సంవత్సరంలో మార్చి 16 న అర్ధరాత్రి 2 గంటలకి మాస్టరు ఇ.కె గారు దేహత్యాగం చేస్తే, పదిహేడు నుంచి ఇక్కడ గురుపూజలు. అంతకు ముందే నిర్ణయించబడినటువంటి తేదీలో ఇక్కడ పదిహేడు, ఆదివారం రోజున గురుపూజలు. అప్పుడు ఆదివారమే చేస్తుండేవారు. తర్వాత శనివారం నేను జోడించాను, మూడు ప్రార్థనలు, మూడు ప్రవచనాలు ఉండాలనే ఉద్దేశ్యంతో. తెల్లవారితే శనివారం అనంగా మాస్టరు గారు పరమపదించారు. ఆదివారం నాడు గురుపూజలు. శనివారం సాయంత్రం మాస్టరు గారు పార్థివ దేహానికి దహన సంస్కారాలు కావించి మేమంతా విశాఖపట్టణంలో ఇంటికొచ్చిన సందర్భంలో, సూర్యఅప్పయ్య గారు సాయంత్రంకి రాధమాధవం వచ్చారు. “ఇప్పుడు మమ్మల్ని ఏమి చేయమంటారు. రేపు గురుపూజలు” అని అడిగారు? తెల్లవారితే గురుపూజలు.

ముందు రోజు సాయంత్రం మాస్టరు గారు దేహత్యాగం చేశారు. దహనక్రియలు అయిపోయినాయి. శుక్రవారం తెల్లవారితే శనివారం అనంగా, రెండు గంటల సందర్భంలో మాస్టరు గారు దేహం చాలించారు. ఆ రోజంతా వచ్చిన వారందరికీ శనివారం దర్శనం చేసుకున్నారు, నమస్కారం చేసుకున్నారు. సాయంకాలం దహన క్రియలు కావించేసాము. అక్కడే ప్రార్థన చేశాము. మాస్టరు గారు యొక్క పార్థివ దేహానికి దహన క్రియలు ఏర్పాటు చేసి, అక్కడ చితి బాగా అంటుకొని జ్వాలలు పైకి లేస్తున్న సందర్భంలో, ఆ రోజు ఫాల్గుణ పౌర్ణమి అయి ఉండటం చేత సూర్యుడు అస్తమిస్తుంటే, చంద్రుడు ఉదయిస్తూ ఉంటే, ఆరుగంటల సమయంలో మొట్టమొదటి సారిగా మేమంతా శివస్థానము లేక శివభూమి లేక స్మశానము నందు ప్రార్థన చేశాం. చేసి, ఇంటికి వచ్చాము.

ఇంటికి వచ్చేసరికి, సూర్యఅప్పయ్య గారు వచ్చారు మధ్యాహ్నం బయలుదేరి హుటాహుటిగా. “రేపు పొద్దున గురుపూజలు కదా! ఇప్పుడు మమ్మల్ని ఏమి చేయమంటారు సార్?” అని అడిగారు. అంటే, “మాస్టరు

గారు ఉన్నట్లుగానే చేసేయ్" అని చెప్పాను. "మాస్టరు గారు లేరనే భావన వద్దు. దేహంలో లేరు, కానీ ఉన్నారు. అంచేత, మీరు ఈ రాత్రికి రాత్రి విజయవాడ వెళ్ళిపోండి. పొద్దున్నే యథాతథంగా గురుపూజలు నిర్వహించండి" అని చెప్పాను. ఎంచేతనంటే, అప్పుడే సాయంకాలం స్మశానంలో చేసిన ప్రార్థనలోంచి వచ్చినటువంటి ఒక విశిష్టమైనటువంటి స్ఫూర్తి ఆ విధంగా నానుంచి ఆ భావనను ప్రకటింపచేసింది. అదే విధంగా సూర్యఅప్పయ్య గారు విజయవాడ వచ్చి, ఆ మర్నాడు గురుపూజలు నిర్వహించారండి.

విజయవాడ సోదరబృందం ఎప్పటికీ ఈ విషయంలో వారి యొక్క ధీరత్వం, స్థితప్రజ్ఞత్వం చిరస్థాయిగా జగద్గురుపీఠంలో ఉండిపోయేట్లుగా జరిగింది ఆరోజు. అప్పటి నుంచి, అంటే ఒక కుదుపు కుదిపిన సందర్భంలో కూడా, గురుపూజలు ఆగలేదు. మాస్టరు గారి యొక్క principle of continuity అంటే అలా ఉంటుంది. మాస్టరు సి. వి. వి. గారి మార్గంలో ఏ కార్యక్రమానికి మరణముండదు, ఆగిపోవు. ప్రారంభించటమే తప్ప, ఆగిపోవటమంటూ ఉండదు. అది చక్కగా సాగిపోతూ ఉంటుంది. అమరత్వం అనేటువంటిది ఆ విధంగా సిద్ధిస్తూ ఉంటుంది. ఒకరి నుంచి ఒకరు, ఒకరి నుంచి ఒకరు అట్లా అందుకుంటూ, శాశ్వతంగా ఈ యోగజీవన ఘట్టం అలా నదీప్రవాహం సాగరసంగమం చేరినట్టుగా, అందరూ బ్రహ్మమయం అయ్యేంత వరకు కూడా మాస్టర్ సి. వి. వి. గారి గురుపూజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడ ప్రారంభం చేసినా, అది ఆగవు అనేటువంటిది మనకి కనిపిస్తుంటుంది. ఎంచేతంటే, ఇద్దరు, ముగ్గురు, నలుగురు, ఐదుగురు, ఆరుగురు, ఏడుగురున్నా కూడా గురుపూజలు నిర్వర్తించినటువంటి సందర్భాలు పూర్వం నుంచీ ఉన్నాయి. మొట్టమొదటి సారిగా మాస్టరు సి. వి. వి. గారు ప్రార్థన చేసినప్పుడు ఒక ఐదారుగురున్నారు. అలా మాస్టర్ యం. యన్. గారు ప్రార్థన చేస్తున్నప్పుడు ఐదారుగురున్నారు. ఆయన course లు ఇస్తున్నప్పుడు అలాగే ఉన్నారు.

అంతరాయం లేక అనుస్యూతంగా సాగిపోయేటువంటి ఒక విధానం విజయవాడ గురుపూజల్లో ఆ విధంగా సిద్ధించింది. 1978 లో మొట్టమొదటి సారి మాస్టరు గారు విజయవాడ గురుపూజలు లబ్బీపేటలో ఉన్నటువంటి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వర్తించారు. దానికి ఎదురుగుండా కల్యాణమండపం ఉండేది. అక్కడ రెండు సంవత్సరాలు నిర్వర్తించారు. అటుపైన CVR GMH స్కూల్లో నిర్వహించారు. అటుపైన, క్రమంగా ఈ సత్యనారాయణపురంలోనే railway colony లో ఉండేటువంటి ఒక విద్యాలయం ప్రాంగణంలో గురుపూజలు. అటుపైన, క్రమంగా మనం అక్కడనుంచి T. T. D. కళ్యాణమండపానికి కెళ్ళాం. అటుపైన, గాంధీనగర్ లో ఉండేటువంటి జింఖానా వారి club ప్రాంగణంలో గురుపూజలు నిర్వర్తించాం. మధ్యలో ఒకసారి lorry owners association లో కూడా గురుపూజలు నిర్వర్తించాం. ఇన్ని రకాలుగా కాలము సర్పము వలె, అలా అలా మెలికలు తిరుగుతూ నడుస్తుంటే, ఎక్కడో అక్కడ గురుపూజలు మాత్రం

నిర్వర్తించుకుంటూ, ఈ శిశువిద్యామందిరం చేరాము. ఇప్పుడు ఇక్కడ నిర్వర్తిస్తున్నాం. ఇప్పటికీ 37 సంవత్సరములు నుండి నిర్వర్తింపబడుతున్నది.

గురుపూజలు అనంగానే అందరిలోను మాస్టరు గారు ఎన్నుకున్నటువంటి కార్యవర్గ మొకటుంటుంది. ఆ కార్యవర్గం ఎట్టి పరిస్థితుల్లోనూ, జీవన సమస్యలు ఏ విధంగా ఉన్నా సరే, ఆ సమయానికి వాళ్ళందరూ సంసిద్ధులైపోతారు. వారి వారి జీవితాలు అద్భుతంగా ఉండటం చేత రావటం కాదు కార్యక్రమాలకి! ఏ పూటకాపూట, ఒడుదుడుకులతో. ఏదో శీలలు ఊడిపోయిన ఒక ఎద్దు బండి చక్రాలకు, శీలలు ఊడిపోతుంటే, బిగించుకుంటూ నడిచినట్టుగా ఉంటే బండి ఆగదండి! ఎంచేతంటే, అన్నీచోట్ల అందరు కార్యకర్తలు, వారి యొక్క సన్నిహిత సంబంధం నాతో ఉంటుంది. వారి వారి జీవితాల్లో ఎలాంటి కష్టనష్టాలు, దుఃఖాలు, ఆపదలు ఎదుర్కొంటూ, అనుభవిస్తూ ఉన్నప్పటికీ, మాస్టరు గారి కార్యక్రమం అనేసరికి అలా వారి యొక్క కర్మానుగుణమైనటువంటి మేఘాలన్నీ పక్కకి తొలగిపోయి, కార్యక్రమానికి సంసిద్ధమైపోతారు.

అలా మన కృష్ణమూర్తి గారు నిజానికి ఈ సారి గురుపూజల్లో మామూలు మనుషులైతే “ఈ సారికి మీరు ఎవరన్నా చేసుకోండయ్యా! నేను ఇంట్లో కూర్చుంటాను” అని చెప్పాలి. అలాంటి సందర్భంలో, ఆయన దేహం ఏ మాత్రం సహకరించకపోయినా, బాగా ఒంటినిండా నెప్పులు ఉన్నా, ఎప్పుడూ ఉండేటువంటి మౌనం ప్రసాదిస్తూ, వారు గురుపూజలు నిర్వహించారు. ఎన్నెన్ని చక్కని ప్రవచనాలు సాగినయో, ప్రార్థనలు సాగినయో! ఈ యోగజీవనంలో బాహ్యజీవన సంగతి ఎలా ఉన్నా, అంతర్గత జీవితంలో మాత్రం ఇలా అనుస్యూతం మాస్టరు గారిని అంటిపెట్టుకొని, నిరంతరంగా గురుపూజలలో పాల్గొంటూ ఉండే వారందరికీ కూడా, అంతరంగ జీవనంలో మాస్టరు గారు పరిపూర్ణంగా వారిని కటాక్షిస్తూ ఉంటారు అనేటువంటిది కనిపిస్తూ ఉంటుంది. ఎంచేతంటే, బాగా సుఖాల్లోకి జారబడిపోయిన వాళ్ళు రాలేకపోవచ్చేమో గాని గురుపూజలకి, కాస్తోకూస్తో కష్టాలు, నష్టాలు, రోగాలు ఉన్నటువంటి వాళ్ళందరూ ఎప్పుడు వస్తూనే ఉన్నారు గురుపూజలకి! నిజానికి ఎవరు మానేస్తారంటే, ఇలాంటి వాళ్ళు మానేయాలి. కాని, ఇలాంటి వాళ్ళు వస్తూ ఉంటారు. అన్నీ బాగున్న వాళ్ళు రారు. అది విచిత్రం కదా! ఇది ఎప్పటికప్పుడు చూస్తుంటే, ఈశ్వరానుగ్రహం లేక మాస్టరు గారి అనుగ్రహము ఏ విధంగా ఉన్నది జీవుని యందు గమనిస్తూ ఉంటే, చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఎంతోమంది ఇంకా ఏం వెళ్తాంలే గురుపూజలకి అనుకుంటూనే గురుపూజలకి వచ్చేస్తారు. ఆ బెజవాడలోనా అనుకోవటం, ఒక్కొక్కసారి మొత్తం ఊహా చిత్రం పడిపోతుంది. అయినప్పటికీ, బయలుదేరి వచ్చేస్తారు. Reservations దొరకలేదు, ఫరవాలేదు, ఆ time కి దొరుకుతాయి, అట్లా ఉంటుంది మనస్సు. Reservations లేకపోయినా, బయలుదేరే

సరికి సంసిద్ధత చూపిస్తే, అప్పటికప్పుడు ఎంతోమందికి ఏన్నో రకాలుగా చాలా చక్కని సౌకర్యాలతో ప్రయాణం మాస్టరు గారు ఏర్పాటు చేసిన సందర్భాలు ఎవర్ని అడిగినా చెప్తారు. అలాంటి మన గురుపూజలివి.

ముప్పై ఏడవ గురుపూజ నిర్వర్తింపబడుతుంటే విజయవాడ కేంద్రం యొక్క ప్రాశస్త్యం ఒక్కసారి మనం గుర్తుతెచ్చుకోవాలి అనేటువంటి ఉద్దేశ్యంతో ఈ నాలుగు విషయాలు చెప్తున్నాను. ఎంచేతంటే, ఒక పుష్కరకాలం నుంచి కొత్తతరం ఒకటి బాగా చేరింది కదా! వాళ్ళందరికీ ప్రతిచోట పునాదులు ఎట్లా పడ్డాయో కొంత తెలిసి ఉండాలి కదా! ఇక్కడ పునాదులు మర్చిపోయి, ఇంక ఆ పైన కట్టినటువంటి అంతస్తులన్నీ చూసుకుంటూ ఉంటే ఉపయోగం అంతంత మాత్రంగా ఉంటుంది. అంచేత, ఈ రోజు ప్రార్థనలో ఈ విధమైనటువంటి భావన కలిగింది. అది కారణంగా మీ అందరికి విజయవాడ కేంద్రం యొక్క ప్రాశస్త్యం చెప్పాను. కొన్ని కొన్ని ప్రదేశాలు మాస్టరు గారు ప్రత్యేకంగా ఎన్నుకుంటారు. ఇదిగో కృష్ణాతీరం, రాజమండ్రి గోదావరి తీరం. ఈ నదీ తీరముల యందుడేటువంటి కేంద్రాలు మాస్టరు గారు చాలా ప్రత్యేకమైనటువంటి ప్రజ్ఞా స్థాపనం చేస్తూ ఉంటారేమో అనిపిస్తూ ఉంటుంది.

అలాంటి సందర్భంలో మనం ఈ రోజున ఈ రుక్మిణీకల్యాణ ఘట్టాన్ని పరిపూర్ణం గావించుకుంటూ ఉన్నాము. రుక్మి అనేటువంటి రుక్మిణి అన్నగారికి చేయవలసినటువంటి పరాభవం శ్రీకృష్ణుడు చేయటం జరుగుతోంది కదా! ఎంతో చక్కగా, నైపుణ్యంతో, అన్నీ విద్యల్లో ఆరితేరినటువంటి కృష్ణుడు ఈ గుండు గొరగటం విద్యలో కూడా రకరకాల డిజైన్లు వాడి నెత్తిమీద ఏర్పాటు చేస్తూ, కత్తితో గుండు చేశాడట. ఇట్లా ఈ రకంగా గుండు చేసినటువంటి కథ మనకి ఎక్కడా కనిపించదు కదా! అశ్వద్ధామకు కూడా గుండు గీయిస్తాడు కృష్ణుడు. ఆయనకి సరదా అనుకుంటాను! అశ్వథామ ఉపపాండవులందర్ని చాలా దుర్బుద్ధితో, కఠినమైనటువంటి హృదయంతో అర్ధరాత్రి శిబిరంలోకి చొరబడిపోయి వాళ్ళని చంపేశాడు. అటుపైన బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడు. దాన్ని ఉపసంహరించటానికి అర్జునిడి చేత బ్రహ్మాస్త్రం ప్రయోగింపచేస్తాడు శ్రీకృష్ణుడు. అప్పుడు అశ్వద్ధామ దాన్ని ఉపసంహారం చేసుకోలేకపోతే, తానే ఉపసంహరిస్తాడు. అటుపైన అశ్వద్ధామకు భీముడు చేత గుండు చేయిస్తాడు. ఎంచేతంటే, పరాక్రమవంతులకి ప్రాణం తీయడం కన్నా ఈ విధమైనటువంటి శిరోజములను నిర్మూలించుట అనేటువంటిది మానము. అంటే, మానం పోయి బతకడం కన్నా చచ్చిపోవటం మంచిది అని. అందుకనే, ఓడిపోయిన రాజు యుద్ధంలో చచ్చిపోవటానికి సహిస్తాడు తప్ప, శత్రువులకి పట్టుబడి, అతడి చేత అవమానింపబడడానికి ఉత్సహించడు, ఏ మాత్రం దానికి అంగీకరించడు. యుద్ధంలో మరణిస్తే వీర స్వర్గం ఒకటుందని భావించి అక్కడే మరణిస్తాడు. శత్రువులకి చిక్కి, అవమానింపబడటం, తన ముందు తన వారిని అవమానం చేస్తుంటే చూడడం అనేటువంటిది కష్టమైన విషయం. ఎలాగూ రుక్మిని సంహరించాల్సినటువంటి

పరిస్థితి ఉన్నది. అతని సంస్కారం అలాంటిది. రుక్మిణీదేవి వేడుకోవటం వల్ల ఈ విధంగా ఓ చక్కని డిజైన్ లో, నదీతీరంలో ఉండేటువంటి ఇసక రేవులు ఏ విధంగా రేవు వల్లె ఏర్పడుతూ ఉంటాయో, అలా గుండు తయారు చేసేసి ఉంచాడు.

అప్పుడు బలరాముడు వచ్చాడు. బలరాముడు వచ్చి, "ఇదేం పనిచేశావు?" అని అన్నాడు కదా! తప్పు కదా! బావమరిది కదా! ఇంకా పెళ్ళికూడ అవ్వలేదు. పెళ్లి చేసుకోవడానికి తీసుకువెళ్తూ ఉన్నాడు. వీడు వధార్హుడే సందేహం లేదని చెప్పింది అమ్మవారు. వధార్హుడేగాని నా తల్లితండ్రులని మనసులో పెట్టుకొని ఇతన్ని నీవు క్షమించమని కోరింది. బలరాముడు అంతకుముందు వృత్తాంతం జరుగుతున్నప్పుడు అతడు లేడు కనక, వచ్చినప్పుడు ఇది చూచి కొంత బాధ పడ్డాడు. అరె! పెళ్ళికూతురు అన్నగారు కదా! అలాంటి వాడిని ఈ విధంగా చేశాడే అని ఈ పద్యం చెప్పాడు. ఇది పొద్దున్నది మధ్యాహ్నం చదువుకున్నాము మనం.

"కొందఱు రిపు లని కీడును
గొందఱు హితు లనుచు మేలు గూర్పవు నిజమీ
వందఱి యందును సముఁడవు
పొందఁగ నేలయ్య విషమబుద్ధి ననంతా!"

వీళ్ళు నా హితులు కాబట్టి వీళ్ళకి మంచి చెయ్యాలి, వీళ్ళు నాకు శత్రువులు కాబట్టి వీళ్ళకి కీడు చేయాలి అనే భావన లేనివాడివి కదా! ఎవరెవరు ఏ విధంగా వారి వారి కార్యములు నిర్వర్తించారో తదనుగుణమైనటువంటి కర్మ వాళ్ళని వరిస్తుంది. దానిని సాక్షీభూతుడిగా చూస్తూ ఉంటాడు. రక్షణ కోరిన వాడికి రక్షణ ఇస్తూ ఉంటాడు. వీడి విషయంలో ఎందుకిట్లా చేశావు? అని అడుగుతాడు. ఎందుకిట్లా చేశాడో మళ్ళీ బలరాముడికే తెలుస్తుంది తర్వాత. అలా జరగవలసింది కాబట్టి అలా చేశాడు అంతే! చాలా విషయాల్లో మనకి ఎందుకిలా జరిగిందని అనుకుంటాం కదా! అలా జరగాల్సి ఉంది. దేశ పరిస్థితులు చూసుకున్నామనుకోండి, రాష్ట్ర పరిస్థితి చూసుకున్నామనుకోండి, ప్రత్యేకంగా తెలుగువారు అందరం, మన రాష్ట్ర పరిస్థితి, దేశ పరిస్థితి మొత్తం చాలా అస్తవ్యస్తంగా ఉంది. ఎందుకిలా ఉంది? ఏది ఎలా జరగాలో, అది దైవ సంకల్పంగా జరుగుతూ ఉంటుంది. దాంట్లో మన ఫలానుభావం ఉంటుందే, అదంతా మన పాపపుణ్యములు బట్టి ఉంటుది.

రుక్మి శిక్షింప అర్హుడు కాబట్టి శిక్షించాడు తప్ప, కేవలం వాడి మీద ఒక విధమైనటువంటి ద్వేషంతో చేయలేదు. కృష్ణుడు ఏం చేశాడు? ఆమె ఎప్పుడైతే రుక్మిణీదేవి కోరిందో, అప్పుడు ఉపసంహరించుకున్నాడు ఆ సంహరించే కార్యక్రమం నుంచి. అప్పుడు ఏం చేశాడు? నవ్వుతూ పిలిచాడు కదా! బావా రమ్మని, "చీఱి" కదా!

బావగారు! రండని నవ్వుతూ పిలిచాడు. అంత లోపల ద్వేషము, పగ, కసి, కక్ష ఉంటే చక్కగా నవ్వుతూ పిలవము కదా! ఈయన చక్కగా పిలిచి, ఒళ్లో కూర్చోపెట్టుకోలేదుగాని, అంత ముద్దు చేసి గుండు చేసేశాడండి. కాబట్టి విషమ బుద్ధి లేదక్కడ. కాకపోతే, బలరాముడు వచ్చి చూసినప్పుడు అలా కనిపించింది. రుక్మిణీదేవి బాధ పడిపోతోందేమో అనుకొని, బలరాముడు బాధపడి, కొంత వేదాంత బోధ చేస్తాడు. ఈ వేదాంత బోధ రుక్మిణీదేవికి అవసరమని నేను అనుకోవట్లేదు, మనందరికి అవసరము. అందుకని మనం చదువుకుంటాము. ఎంచేతంటే, ఏమైందో రుక్మిణికి తెలుసు. అసలు ఉరిశిక్ష వెయ్యాల్సిన వాడిని, ఉరిశిక్ష వేయకుండా, గుండు గీసి పంపించేస్తున్నాడు. ఇంక అంతకన్నా కోరేదేముంటుంది? ఉరిశిక్ష కాకపోతే next ఏం చేయాలి? Next life imprisonment, శేషజీవితమంతా కూడా కారాగారం కదా! అది కూడా లేదు ఇక్కడ. అప్పటికే ఆవిడ చాలా సంతోషిస్తుందని నేను భావిస్తున్నాను. అతడు మరణానికే అర్హుడని చెప్పిందిగా! అతడు వధార్హుడే, కాదని నేను అనడం లేదని చెప్పింది. అంచేత, ఆమె దుఃఖపడేటువంటి సందర్భం అక్కడ లేదు, కానీ చూసే వాళ్ళకి అలా అనిపించి.

> "తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు నె
> గ్గాడం జూడకు మమ్మ పూర్వభవ కర్మాధీన మై ప్రాణులం
> గీడున్ మేలును జెందు లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
> తోడంబుట్టువు కర్మశేష పరిభూతుం డయ్యె నేఁ డియ్యెడన్".

అని చెప్పాడు. అంతకముందు తమ్ముడితో ఎందుకట్లా కసిగా వాడి గుండు గీశావురా అన్నవాడు, ఇక్కడ ఏం చెప్తున్నాడు? పూర్వకర్మానుభవం చేత జీవులకు మేలు, కీడు జరుగుతూ ఉంటుంది. ఇలా జరిగిందని మా తమ్ముడు మీద నువ్వు కోపం పెట్టుకోవద్దు. కోపం పెట్టుకునే పరిస్థితి లేదక్కడ. ఎంచేత? తనని అనుగ్రహించినవాడు. లేకపోతే తనే ఉండేది కాదు కదా! కృష్ణుడు ఆ విధంగా వచ్చి తనని రక్షించకపోతే, తానే ఉండేది కాదు కదా! తాను కోరడం చేత, తన అన్నగారి యొక్క ప్రాణములు హరించకుండా వదిలేశాడు కదా! ఇంక అంతకన్నా ఏం కోరుతుందండి? కానీ, ఈయనేమన్నాడు? వాడికీ విధంగా రాసి పెట్టి ఉంది అని. చెప్తుంటాం కదా మనం కూడా! మనకి జరిగినప్పుడు మనం అంగీకరించలేము. కానీ, ఇంకొకరికి జరిగినప్పుడు చెప్పటానికి మనకొస్తాయి! అంటే ఏం జరుగుతుంది? చాలా మహత్తరమైనటువంటి, అనన్యమైనటువంటి భక్తిలో ఉండేవాళ్ళు తప్ప, తమకొచ్చిన కష్టాన్ని తాము ఈశ్వరుని యొక్క అనుగ్రహంగా భావించలేరు. అది చాలా కష్టమైన విషయం. జరుగుతున్నప్పుడల్లా అలా అనిపించదు. జరిగిపోయిన తర్వాత అనిపించవచ్చు. ఇంకొకరు కష్టంలో ఉంటే, ఈ మాట చెప్పడానికి తప్పకుండా ఉపశమనం కలిగిస్తుంది. చాలా కష్టం వచ్చింది. ఆ కష్టంలో

ఉన్న వాళ్ళకి ఉపశమనం వాక్యాలు అందరూ పలకలేరు కదా! అలా తప్పించుకు తిరుగుతారు! ఎలా వెళ్ళాలి, ఎలా face చేయాలా అనుకుంటారు. ఏం మాట్లాడాలో తెలియదు కదా! ఏం మాట్లాడతారు? ఓ పెళ్లి జరిగిందండి. ఉన్న ఒకే కూతురుకి పెళ్లి చేశాడండి. పెళ్ళైన తర్వాత పదహారు రోజులలో కొడుకు చచ్చిపోయాడంటే అది ఎంత దుఃఖం? అలాంటి వారితో ఏం మాట్లాడతావు నువ్వు? ఏదో మరి ఆ సమయానికి ఉపశమనం వాఖ్యాలు నాలుగు చెప్పాలి, అంతే కదా! మనం చెప్పినంత మాత్రాన అతను సర్దుకుంటాడా? కాలం వల్ల సద్దుకుంటాడు. క్రమంగా ఎంత కష్టాన్నైనా జీవుడు నెమ్మదిగా మింగుతాడు. అలా జరుగుతుంది.

ఈ కీడు, మేలు మా కృష్ణుడు చేశాడని నువ్వు అనుకోబోకు. వాడి కున్నటువంటి కర్మ ప్రకారం ఈ విధంగా అతడు అవమానింపబడ్డాడు తప్ప, దీని గురించి నువ్వు కృష్ణుని మీద ఏవిధమైనటువంటి కోపము తెచ్చుకోబోకు తల్లి అని చెప్పి, కాబోయే మరదలకి బావగారు ఓ చిన్న హితోపదేశం చేశాడు. సందర్భం ఏదైనా మనకి చాలా ముఖ్యం కదా! జీవితంలో కష్టాలు, నష్టాలు రానివాళ్ళు ఎవ్వరూ ఉండరు. జీవితంలో అన్ని నవరసాలు, షడ్రుచులు అంటాం కదా – చేదు ఉంటుంది, వగరు ఉంటుంది, తీపి ఉంటుంది, పులుపు ఉంటుంది, ఉప్పు ఉంటుంది కదా! అన్నీ ఉంటాయి. కానీ, ఒకరికి కష్టం వచ్చినప్పుడు రెండోవారు ఉపశమనంగా కొంత తత్త్వబోధ చేయటం వల్ల వాళ్ళకు ఉపశమనం కలుగుతుంది. "పుణ్యాత్ముడు తల్లీ! ముందుగా వెళ్ళిపోయాడు", అని చెప్తాడు కాస్త తొందరగా వెళ్ళిపోతే! నీలో కల్మషం ఉంటే "అర్థాంతం చావు చచ్చాడు వాడు" అంటాం కదా! మన బుద్ధే అది. కొన్ని జన్మ పరంపరలు గాభగాభా జరిగిపోవటం కూడా పరిణామ దశలో చాలా మంచి విషయం. ఎప్పుడూ వెళ్ళిపోయిన వాళ్ళు పుణ్యాత్ములే. వీడు వెళ్ళిపోలేదు, దురదృష్టవంతుడు అంతే! రుక్మి వెళ్ళిపోవకపోవడం వల్ల కదా ఈ మాటలన్నీ కూడా వినాల్సొచ్చింది! అక్కడే ఉన్నాడు కదా! వాడూ వింటున్నాడు. ఏమని వింటున్నాడు? వీడు చేసుకొన్న దాన్నిబట్టి, వీడికి ఇదొచ్చింది అని వింటున్నాడు కదా!

"చంపెడి దోషము గలిగినఁ
జంపఁ జనదు బంధుజనులఁ జను విడువంగాఁ
జంపిన దోషము సిద్ధము
చంపను మఱి యేల మున్న చచ్చినవానిన్"

బంధుజనులను దోషమున్నా కూడా వాళ్ళను చంపగూడదు అని అంటాడు ఈయన. అందుకే, భారత యుద్ధంలో కౌరవులకి, పాండవులకి మధ్య యుద్ధం జరుగుతుంటే, బలరాముడిని అడుగుతాడు శ్రీకృష్ణుడు, "ఏమి అన్నయ్య! నీ పరిస్థితి ఏంటి?" అంటే "నాకొద్దురా! నేను చూస్తూ చూస్తూ బంధుజనులను అలా

చంపలేనురా!" అంటాడు. బంధువుల్ని చంపలేదు ఆయన. కంసుడిని కూడా మేనమామ అని ఆయనను చంపలేదుగా! బంధుజనులను చంపగూడదు అనేటువంటి సిద్ధాంతం మీదే బలరాముడు భారతయుద్ధంలో పాల్గొనడు. ఎంచేత? ఆయనకో క్లిష్ట సమస్య వచ్చేసింది. అందరూ బంధువులు, ఒకటి. దుర్యోధనుడు తన శిష్యుడు. తన దగ్గర గదాయుద్ధం నేర్చుకున్నాడు. కాకపోతే, ధర్మమేమో పాండవుల వైపు ఉంది. కాబట్టి, తన శిష్యుడు దుర్యోధనుడు వచ్చి అడిగితే తను అధర్మం వైపు యుద్ధం చేయలేడు. శిష్యుడు అడిగితే కాదనలేడు. ప్రతి వాళ్ళకి శిష్యుడంటే కొంచెం weakness ఉంటుంది కదా! ఏ weakness లేనివాడు కృష్ణుడొక్కడేనండి. ఒకవేళ అర్జునుడే పదివేల మంది యాదవుల్నడిగి, దుర్యోధనుడే కృష్ణుడిని అడిగి ఉంటే, కృష్ణుడు ఇటు ఉండి, దుర్యోధనుడు వాళ్ళని ఓడించేసేవాడు. ఏం సందేహం లేదు. కృష్ణుడు అంతపని చేయగలడు. కర్ణుడికి శల్యుడు చేసినటువంటి పని, కృష్ణుడు పరిపూర్ణంగా కౌరవులలో చేసి ఉండేవాడు. ఎంచేతంటే, ధర్మరక్షణకు ప్రధానం ఆయనకు.

అవునండోయ్! నిన్న, ఈ రోజు పొద్దున్న మీకు పాఠం చెప్పేటప్పుడు రామచిలకని పావురం అన్నాను. కీరమంటే రామచిలక. పావురాల్ని పంజరాల్లో పెట్టుకొని మాటలు చెప్పడం ఉండదు. రామచిలకతోనే పలికిస్తాం. అదొకటి మీరు తర్వాత అప్పు సచ్చు కింద మార్చుకోండి! అంటే అచ్చుతప్పనమాట. పుస్తకం ముద్రణలో అచ్చుతప్పులని వేయబోయి, అప్పుసచ్చులని వేసాడు అది కూడా! అంటే, అది కూడా తప్పే వేశాడాయన! అంచేత, అచ్చుతప్పుల్ని, అప్పుసచ్చులని అనడం ఒక పరిపాటి వచ్చింది. అలా కీరములంటే రామచిలకలు. కీరవాణి అంటే రామచిలక గొంతు నుంచి వచ్చేటువంటి పాట. వాణి అంటే ధ్వని.

సరే అది అలా ఉండగా, ఈ బలరాముడు బంధుజనులను చంపకూడదు అన్నాడు. అక్కడ బంధుజనుల్ని చంపలేనటువంటి ఉద్దేశ్యంతోనే తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు బలరాముడు. "ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగుతూ ఉంటే నువ్వు ధర్మం పక్కన పని చేయాల్సినటువంటి వాడివి. బంధుజనులను అడ్డుపెట్టుకొని వెళ్ళిపోయావు. నీకు తెలీదా జ్ఞానం?" అని తర్వాత కృష్ణుడు అడుగుతాడు. "ఎవరు బంధువు, ఎవడు బంధువు కాదు? తత్త్వం తెలిసినవాడివే మరి ఎందుకిలా తప్పించుకున్నావు నువ్వు?" అని అడుగుతాడు చివరిలో. అప్పుడేమి మాట్లాడలేకపోతాడు బలరాముడు. ఆయన సిద్ధాంతమిది.

ఇంక ఈ రుక్మిని చంపాల్సిన అవసరం లేదు. వీడు చచ్చిపోయిన వాడితోనే సమానం. ఎందుకంటే, ఒక క్షత్రియుడికి ఆ విధంగా తలగొరిగితే, వాడిని సంహరించేసినట్టే అనే ఉద్దేశ్యంతో! రాజులకి మీసాలు గొరిగినా

ప్రాణం తీసినట్టేనండి. తలనీలాలు తీసేసినా ప్రాణం తీసేసినట్టే. ఎందుకంటే, వాళ్ళ పరాక్రమానికి అవి చిహ్నాలై ఉండటం చేత.

"బ్రహ్మచేత భూమిపతుల కీధర్మంబు
కల్పితంబు రాజ్యకాంక్షఁజేసి
తోడిచూలు నయినఁ దోడఁబుట్టినవాఁడు
చంపుచుండుఁ గ్రూరచరితుఁ డగుచు."

అసలు బ్రహ్మరాసిన రాతలోనే భూమిని పరిపాలించే పాలకులు ఉంటారే, వాళ్ళకి ఈ ధర్మమొకటి కల్పితంగా ఉంటుందట. ఏమిటంటే, వాడు తోడబుట్టినవాడైనా, మన పదవికి వాడు అడ్డు వస్తాడు అనుకుంటే, వాడిని చంపేయటం అనేటువంటిది పరిపాలకులకి రాసిపెట్టినటువంటి ఓ ధర్మం కలిపించాడు బ్రహ్మదేవుడు. పాలకులకి అలాంటి రాజ్యకాంక్ష ఉంటుంది. అది ఎంత కాంక్షంటే, ఆ కాంక్షకి అడ్డొస్తే, తమ్ముడైనా, అన్నయైనా, తండ్రైనా, చెల్లెలైనా, అక్కైనా! కంసుడదే కదా మరి దేవకీదేవిని సంహరించటానికి పూనుకుంటే వసుదేవుడు రక్షించుకున్నాడు. ఎందుకని సంహరించదలచాడు? తన ప్రాణానికి కీడు తెచ్చేటువంటివాడు ఈమె గర్భంలో పుడతాడు అని తెలియటం చేత. ఇలాంటిది ఒకటి రాసేశాడు బ్రహ్మదేవుడు, పాలకులకి ఆ విధమైనటువంటి నైజం ఉంటుంది.

"భూమికి ధనధాన్యములకు
భామలకును మానములకుఁ బ్రాభవములకుం
గామించి మీఁదు గానక
శ్రీ మదమున మానధనులు చెనకుదు రొరులన్."

బాగా దురభిమానం కలిగినవాడు భూమికోసమైనా సరే చంపేస్తాడటండి. భూమి తగాదాల్లో చంపుకోవటాలు ఉండవు? సీమరాజకీయాలన్నీ అట్లాగే పుట్టినాయి – భూమి తగాదాలే, చంపుకుంటూ ఉంటారు. ధనధాన్యములకు చంపుకుంటారు. భామల కొరకు అంటే, తను ప్రేమించిన అమ్మాయి ఇంకొకడిని పెళ్లిచేసుకుంటుందనే సందర్భంలో వాడిని చంపడమో, లేక కసి తీరకపోతే ఆ అమ్మాయినే చంపెయ్యడమో, మొహం మీద acids పోసెయ్యటమో, ఇలాంటివన్నీ చూస్తున్నాం కదా! ఇవన్నీ ఎవరికుంటాయి అంటే, బాగా కామించినటువంటి వాళ్ళకి ఉంటాయి. ఇలాంటి ధర్మాలు కొన్ని చెప్పాడు, అందుకని చదువుతున్నాను.

భామలకు, మానములకు, తమ ప్రాణానికి ఏదైనా తేడా పద్దది, లేదా తమ కీర్తికి తేడా పద్దదనుకో, అలాంటి తేడా పడే సందర్భంలో, సమస్త కీర్తి కాపాడుకోవటం కోసం, తమ మానం కాపాడుకోవటం కోసం.... ప్రాభవములకు అంటే, చాలా కీర్తి వస్తుందన్నా చెస్తాడట ఆ పని, కీర్తిపోతుందన్నా చంపేస్తాడట. “గామించి మీఁదు గానక” అంటే తర్వాత వచ్చేటువంటి ఫలితములు అప్పుడు వాళ్ళకి కనపడవు. మొట్టమొదట క్షత్రియుల గురించి చెప్పాడు. రెండోసారి కామకుల గురించి చెప్పారు. కామకులకు ఇది ఉచ్ఛము, ఇది నీచము అని ఏం అనిపించదు. Desire knows no decency అని ఒక వాక్యం రాశారు. అడుక్కుతినేవాడికి మర్యాదేముందండి!

ఇంద్రుడు వృత్రాసురుడిని సంహరించాలంటే, దధీచి మహర్షి యొక్క వెన్నెముకను నువ్వు తెచ్చుకోవాలి, నువ్వు దాంతో ఆయుధం తయారు చేసుకుంటే, అదే వజ్రాయుధం, అప్పుడు నువ్వు వృత్రుడిని గెలవగలుగుతావు అని చెప్తే, ఈయన వెళ్ళి ఎలా అడుగుతాడండి “కొంచెం మీ వెన్నెముక ఇచ్చేస్తారా?” అని. ఏదో వేలు అడిగాడంటే అది వేరే సంగతి. అదేదో కాలి వేలో, చేతి వేలో, చెవి అడిగాడట అంటే అర్థం, ముక్కడిగాడట అంటే అర్థం, ఒక కన్ను ఇమ్మంటే అర్థముంది. బొత్తిగా సరాసరి ఆయన వెన్నెముక ఇచ్చేయమన్నాడండి! వెన్నెముక ఇచ్చేస్తే ఇంకేముంది! ఎంచేత? ఆ వెన్నెముకలో అద్భుతమైనటువంటి తపశ్శక్తి ఉంది. ఆయన సుషుమ్నలో ఉండేటువంటి ఆ శక్తి ఆ వెన్నెముకకు కూడా పట్టేసిందిట. కాబట్టి, అది తెచ్చుకుంటే బాగుంటది నువ్వు అని అంటే, అది అడగటానికి వెళ్ళిపోయాడండి ఈయన! అదెట్లా అడుగుతాం అన్నారు మిగతా దేవతలు. బాగుండదు కదా! అంటే, అడిగేవాడికి ఉచ్ఛనీచాలు ఉండకూడదు అని ఇంద్రుడు నీతి చెప్తాడు. మనకవసరం కాబట్టి వెళ్ళి అడిగేయడమే! ఇస్తే ఇస్తాడు, లేదంటే తిడతాడు అంతే కదా! అడగటంలో తప్పేముంది! చాలా మంది అలాంటి logic తో అడిగేస్తుండరూ! కాముకులు, వాళ్ళ పని కోసం ఏమైనా చేస్తారు. అని చెప్పి ఇంకోటి చెప్పాడు.

> “వినుము. దేవ మాయం జేసి దేహాభిమానులైన మానవులకుఁ బగవాఁడు
> బంధుం డుదాసీనుం దను భేదంబు మోహంబున సిద్ధం బయి యుండు జలాదుల
> యందుఁ జంద్రసూర్యాదులును ఘటాదులందు గగనంబును బెక్కులై
> కానంబడు భంగి దేహధారుల కందఱకు నాత్మ యొక్కండయ్యును
> బెక్కండ్రై తోఁచు నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్య ప్రాణ
> గుణాత్మకంబై యాత్మ యందు నవిద్య చేతఁ గల్పితంబై దేహిని
> సంసారంబునం ద్రిప్పు సూర్యుండు తటస్థుండై యుండం బ్రకాశ
> మానంబులైన దృష్టి రూపంబులుంబోలె నాత్మ తటస్థుండై యుండ

దేహేంద్రియంబులు ప్రకాశమానంబు లగు నాత్మకు వేఱొక్కటితోడ
సంయోగవియోగంబులు లేవు వృద్ధి క్షయంబులు చంద్రకళలకుంగాని
చంద్రునికి లేని కైవడి జన్మనాశంబులు దేహంబునకుంగాని యాత్మకుఁ
గలుగనేరవు నిద్రబోయినవాఁ డాత్మను విషయఫలానుభవంబులు
చేయించు తెఱంగున నెఱుక లేని వాఁడు నిజము గాని యర్థంబు లందు
ననుభవము నొందుచుండుఁ గావున."

"దేవ మాయం జేసి దేహాభిమానులైన మానవులకు" – మనకన్నీ దేహం వల్లే కదా ఈ బంధుత్వాలు కాని, ఒకరితో ఒకరికి ఏర్పడినటువంటి సంబంధాలు కాని, ఒకరితో ఒకరు అభిమానం! దేహమే లేకపోతే ప్రపంచంలో దేనితోనూ బంధం లేదు, సంబంధము లేదు. బంధం లేకపోతే మంచిదే, సంబంధం కూడా ఉండదు. జీవుడొక్కడే కదా! వచ్చుచూ పోవుచున్న వాడు ఒక్కడే! "పాపపుణ్యఫలమందిన నొక్కడే కానరాడు వేరొక్కడు వెంటవెంటి భవనల్లనయ క్రుపచూడవయ నీటక్కరి మాయలన్ని భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధి" అంటాడు. ఒక్కడే! ఇవన్నీ మాయచేత కల్పింపబడుతూ ఉంటాయి కదా! పై జన్మకి ఈ బంధుత్వాలు ఇట్లా ఉండవు, ఇంకో రకంగా ఉంటుంది. ఇప్పుడు కిందటి జన్మలో మనతో మన తమ్ముడో, మన అన్నయ్యో, మన అమ్మో, మన నాన్నో, మన అక్కయ్యో, మన చెల్లెలో, మన భార్యో, మన భర్తో, అలా అన్న వాళ్ళందరూ ఇప్పుడు వేరేవేరేగా ఇక్కడ కనిపిస్తుండచ్చుగాని వాళ్ళెవరో తెలియదుగా కదా! ఇట్లా పూర్వజన్మల్లో మనతో సోదరులుగా ఉండేవాళ్ళు, సోదరీమణులుగా ఉన్నటువంటివాళ్ళు, కొంతమంది ఉండి ఉండవచ్చు. ఈ జన్మకే తెలుసు. పై జన్మకి మళ్ళీ తెలియవు కదా! కానీ, ఈ సంబంధం దేని వల్ల ఏర్పడ్డది? దేహం వల్లే ఏర్పడ్డది. దేహమే లేకపోతే ఇవన్నీ లేవు.

ఎంత దేహాభిమానం ఉంటే, అంత బంధు బంధం ఉంటుంది. బంధుప్రీతి అంటూ ఉంటాం. అది ప్రీతి, అంటే బీరకాయ పీచు లాంటిది! కొబ్బరికాయ పీచు అంటే ఇంకా బాగుంటుంది! అది ఎప్పటికీ తెగదు. వాళ్ళు వీళ్ళను పీకుతూ ఉంటారు, ఇటుఅటు, అటుఇటు ఇట్లా పీకుతూ ఉంటారు. పీకులాటతో అయిపోతూ ఉంటుంది కదా కాలం! ఇదంతా లేకపోతే ఏం బాగుంటుంది? బాగుండదు! ఇవి ఉండాలి, ఉంటేనే రుచి. అంటే, పొడిమెతుకల్లే బతికితే బాగుండదు కదా! పక్క మెతుకుతో అంటి ఉంటేనే తింటానికి బాగుంటాయి. బాగా ఎండిపోయిన అన్నం తినంగా! గురుపూజల్లో వాళ్ళు పొద్దున్నే తొమ్మిదింటికే వండేసి వెళ్ళిపోయాడనుకోండి, మరి ఒంటిగంటకి అన్నం తినాలంటే తల ప్రాణం తోక్కొస్తుంది! ఎంచేత? నోట్లో ఉండే లాలాజలం ఆ ఎండు మెతుకులు లాగేసి, మన నోరంతా పొడయిపోతుంది, ఇంక నవల్లేము. అందుకనే, ఇంత పొడి మెతుకులు కాస్త కష్టమమ్మా, కొంచెం వేరే ఏమన్నా ఉంటే చూడండి అని చెప్తూ ఉంటాం కదా! అలాగే పొడిపొడిగా

జీవించకూడదు, తడిగానే జీవించాలి. తడితగుల్తూ ఉంటేనే బాగుంటుంది. కానీ, ఇదంతా తాత్కాలికము అని తెలుసుండాలి. అయినప్పటికీ, ఇందులో రసమున్నది కాబట్టి అనుభవిస్తున్నాను. కాని ఇది ఎప్పుడూ ఇలాగే ఉండదు కదా అని తెలిసి ఉండటం అనేటువంటిది ఉన్నప్పుడు, నీకు ఉభయకుశలోపరి ఉంటుంది. ఉత్తరంలో ఉభయకుశలోపరి అని రాసుకుంటూ ఉంటాం కదా! అంటే, మేము కుశలంగా ఉన్నాము, మీరు కూడా కుశలంగా ఉన్నారనే మేము భావిస్తున్నాం అని. అలా ఆటలో దిగకపోతే ఆనందం లేదు. దిగితే చిక్కులొస్తాయి అని ఆడకపోతే బాగుండదు. ఇది ఆట కదా అని గుర్తుంచుకొని ఆడితే మనం out అయిపోయామనుకోండి అంత బాధుండదు. వెళ్ళంగానే out అయిపోతూ ఉంటాం కదా! ఆటే కదా! ఆటలో ఉద్రిక్తత కలిగితే, ఓడిపోతుంటే, రోషం వస్తూ ఉంటుంది. గెలుస్తుంటే అభిమానం పెరుగుతూ ఉంటుంది, దురభిమానం అయిపోతుంది. ఇవన్నీ కాకుండా, ఈ వాడుకోవటం అనేది ఉండాలి. ఇవన్నీ వస్తాయి కాబట్టి నేను ఆడను అనకూడదు. ఆడతాను గాని, ఇది ఆటని తెలిసి ఆడతాను అని ఆడేటువంటివాడికి రసానుభూతి ఉంటుంది. అలా అని అందులో దుఃఖపడడాలు అలాంటివి ఉండవు.

ఇప్పుడు రుక్మిణీదేవికి ఇదంతా ఎందుకండి? శుభమా అని కృష్ణుడ్ని పెళ్లిచేసుకుందాం అని వెళ్తూ ఉంది. ఏదో దార్లో అడ్డమొచ్చింది, దార్లో వీళ్ళందరూ అడ్డుపడ్డారు. ఆ కథ పూర్తి అయిపోయింది. ఇంక పెళ్లి కోసం మెట్టింటికి వెళ్తోంది. పెళ్ళిచేసుకునేటువంటి పిల్లకి ఈ వేదాంతం అంతా ఎందుకు చెప్పాడో బలరాముడు? బావగారు మహాజ్ఞాని అని తెలియాలనేమో! మా బావగారు చాలా మహాజ్ఞాని అని అనుకోవాలని చెప్పాడంటారా? లేకపోతే, మనకోసం ఇది చెప్పాలని బమ్మెర పోతన గారు ఈ విధంగా ఏదో రాశాడా? అక్కడక్కడ ఏం చేస్తాడంటే కొంత చూస్తూ ఉంటాడు మనకోసం. లేదా, అంతలా నువ్వు కృష్ణుడిని నమ్మబోకు, వాడితో కష్టం అని చెప్తున్నాడా? చిన్నప్పటినుంచి చూస్తాన్నాడు కదా కృష్ణుడ్ని. ఎట్లా ఉంటాడో తెలియదు కదా! అందుకని, ఊరికే వాడితో నువ్వు పెనవేసుకోబోకు, చాలా ఇబ్బంది పడిపోతావు సుమా అని చెప్తున్నాడా? ఆవిడ అవన్నీ దాటేసిన మనిషి. ఎందుకంటే రుక్మిణీదేవికి కృష్ణుడితో ఎప్పుడు ఏ సమస్యా లేదు. మిగతా భార్యలకి వచ్చినాయి తప్ప ఆవిడకి లేవు. అయినప్పటికీ, ఈ విధంగా ఆయన చెప్తున్నాడు. మనం వింటున్నాం!

“జలాదుల యందుఁ జంద్రసూర్యాదులు” — అక్కడ ఒక చెరువుంది, అక్కడ ఇంకోచోట ఒక చెరువుందండి. చంద్రుడు ఏ చెరువులో కనిపిస్తాడంటారు? అన్నీ చెరువుల్లో ఉన్నాడుగా! చంద్రుడు ఒకే చంద్రుడు అన్నీ చెరువుల్లోనూ గోచరిస్తున్నాడు గాని అన్ని చంద్రులు లేరు కదా! ఒకే సూర్యుడు బెంగుళూరులోనూ ఉన్నాడు, విజయవాడలోనూ ఉన్నాడు, హైదరాబాద్ లోనూ ఉన్నాడు, విశాఖపట్టణంలోనూ ఉన్నాడు. ఎవరెవరు ఏ ఊరులో ఉన్నారో, వారి వారి ఊర్లో వాళ్ళకి రోజు సూర్యోదయం అవుతూనే ఉంటుంది కదా! ఒకే ఊళ్ళో, ఎవరి

కిటికీ తెరుచుకుంటే వాళ్ళ తూర్పు కిటికీల్లోంచి వాళ్ళింట్లోకి సూర్యకిరణాలు వస్తూనే ఉంటాయి. ఇంత మందికి ఇన్ని సూర్యుడులున్నారా? సూర్యుడు ఒకడే. ఒకే చంద్రుడు ప్రతిబింబం చేత ఇన్ని తటాకాలుగా దర్శించినట్టు, ఒకే ఆత్మ ఇన్ని దేహాల్లో ప్రతిబింబిస్తూ ఉన్నది అని చెప్తున్నాడు బలరాముడు. ఒకే ఆత్మ, ఒకడే విశ్వాత్మ. అది ఇన్ని శరీరాల్లోను ప్రతిబింబిస్తూ ఉంటే, ప్రతివాడు నేను అనుకుంటూ ఉంటాం. ఇన్ని నేనులు లేవు, ఒకటే నేను ఉంది. అంతా ఒకటే నేను. కాని ఆ నేను ఇన్నిట్లో పడితే ఇన్ని నేనులుగా అనిపిస్తుంది తప్ప నిజంగా ఉన్నదొక్కటే కదా! ఒక్కడే కదా సూర్యుడు! "ఒక సూర్యుండు సమస్త జగతికిన్ తాను ఒక్కొక్కడే గోచరించు" అని పద్యముంది. ఎవరి సూర్యుడు వారికి కదా!

"బెక్కులై కానంబడు భంగి దేహధారుల కందఱికి నాత్మ యొక్కండయ్యును" – అందరి దేహాల్లోనూ ఒకే ఆత్మ వెలుగుతూ ఉంటే, ఒక్కొక్కడు తానొక్కక్క ఆత్మ అనుకుంటం చేత ప్రత్యేక ఆత్మ అయ్యాడు, అహంకారి అయ్యాడు. అహంకారమంటే నేనొక్కడిని వేరుగానున్నాను అనేటువంటి భావన. ఇప్పుడు తటాకాల్లో ఇన్నిట్లోనూ ఒకే చంద్రుడు ప్రతిబింబిస్తున్నాడు అని తెలుసుకోవటం మనకంత కష్టమైన విషయం కాదు. ఆకాశంలో ఉన్న ఒకే చంద్రుడు ఇన్ని తటాకాల్లోనూ ప్రతిబింబించి, ప్రతి తటాకంలో ఉన్నట్టుగా గోచరిస్తూ ఉన్నాడు. అలాగే, ఒకే ఒక విశ్వాత్మ ఇన్నీ దేహాల్లోనూ ప్రతిబింబిస్తూ, ఇందరిలోనూ తాను ఒక్కొక్కడై ఉన్నట్టుగా గోచరిస్తూ ఉన్నాడు అని చెప్తున్నాడు. అది ఎంత చక్కని ఉపమానం కదా!

"నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్య ప్రాణ గుణాత్మకం బయి" అంటే దీంట్లో పదార్థముంది. అంటే, పంచభూతాలతో కూడినటువంటి పదార్థం, ప్రాణమున్నది, మూడు గుణాలు ఉన్నాయి. మూడు గుణములు, ఐదు భూతములు – మొత్తం ఎనిమిది. ఇవన్నీ చక్కగా కూడి ఉండటానికి ఒక ప్రాణ స్పందన. దీనికి మొదలుంది, చివరుంది. పంచభూతములు, త్రిగుణములు, ప్రాణముతో కూడినటువంటి దేహమేదైతే ఉందో, దానికి తుది, మొదలు ఉన్నాయి.

"నవిద్య చేతఁ గల్పితంబై దేహిని సంసారంబునం ద్రిప్పు" –ఇందులోకి దిగి ప్రతిబింబవశాత్తు దిగివచ్చినవాడు, దీని యందు మోహపడి, తటాకంలో చంద్రుడున్నాడు అని భ్రమపడితే ఎట్లా ఉంటుందో, అట్లా భ్రమ పడిపోతాడు. భ్రమపడిపోయి, అలా గింగరాలు తిప్పుతూ ఉంటుంది. ఇదంతా నాది, నేను, నావారు. నేను, నాది, నావారు – ఈ మూడి చుట్టే తిరుగుతూ ఉంటుంది. అసలు నువ్వు లేవురా అని చెప్తుంది. నువ్వు ఉన్నావు అనుకుంటున్నావు తప్ప ఉన్నది ఒక్కడే! మామూలుగా ఇది వింటూ ఉంటే రుక్మిణీదేవి ఏం అనుకోదు. ఇదేంటండి ఇప్పుడు సమయం, సందర్భం... ఏం గురుపూజలా? ప్రవచనం చెప్పుకోవటానికి కాదుగా! రోడ్డు మీదున్నారు

కదా! కాకపోతే ఏంటంటే, కవులుగాని, మహర్షులుగాని సందర్భోచితంగా కొంత ఇలా మన బోటి మోహబుద్ధి కలవారికి, దేహాభిమానం కలిగినటువంటి వాళ్ళకి బోధ చేయాలి కదండి. అలాంటి బోధలు వస్తున్నాయి అనుకోవాలి.

"నెఱుకలేనివాఁడు నిజముగాని యర్థంబునందు" – ఇదంతా నిజమనుకొని, ఏదేదో రకరకలుగా పగలు, రాత్రి పనిచేసుకుంటూ, ఏదో కింద పడుతూ, మీద పడుతూ.... జీవితం ఎంత క్లుప్తం చేసుకుంటే, అంత ఎక్కువ అనుభూతి చెందవచ్చు. జీవితం ఎంత మల్చుకుంటే, అందులోకి ఇంకిపోతాం అంతే కదా! ఉన్నది చెంబుడు నీళ్ళు. దాంతో ఇక్కడ పోశామనుకోండి, ఇక్కడ ఆ కాస్తలోనే ఇంకిపోతాయి. నీళ్ళు ఇంకిపోయే మట్టిలో ఎంత నీళ్ళు పోసినా అంతా పుచ్చుకుంటుంది కదా! అంటే, నీ జీవ శక్తి ఉందే, దాన్నంతా ఈ పదార్థమైనటువంటి ప్రపంచంలో, వాటిని పొందాలనేటువంటి దృష్టితో నువ్వు చేసేటువంటి కార్యక్రమములన్నీ కూడా అవి నిరర్థకమైనటువంటి కార్యక్రమములు అయి ఉంటాయి.

ఇవ్వాల్టికి ఇంత చేశాం, రేపు ఇంకా ఇంత చేయాలి, ఎల్లుండికి ఇంతవుతుంది, ఆ తర్వాత మనం ఇలా ఇంత fixed deposit వేసుకోవచ్చు, ఆ పైన ఏదో flat కొనుకోవచ్చు, ఆ తర్వాత అందులో అట్లా ఉంటాం, ఇట్లా ఉంటాం, ఇట్లా అనుకుంటూ ఉంటారు కదా! అలా జరుగుతుందా? ఏదో అడ్డు వచ్చేస్తుంది కదా! ఎప్పుడు మనం flat కొనుక్కుందాం అనుకున్నా, మనం పోగేసుకున్న దానికన్నా ఒక పది లక్షలు ఎక్కువే ఉంటుంది flat. అందరి అనుభవమదే! స్థలం కూడా అంతే! మనం అనుకున్న దానికన్నా కొంచెం ఎక్కువ ధర ఉంటుంది. ఆ ధరకి మనం చేరే సరికి స్థలం ధర ఇంకొంచెం పెరుగుతుంది. ఎప్పుడూ దానికీ మనకీ ఒక బెత్తెడు తేడా ఉంటూనే ఉంటుంది కదా! ఎప్పటికి కొంటావు నువ్వు? ఎప్పుడు అందులో ఉంటావు? ఇంక నుంచి హాయిగా ఉందామనే పరిస్థితేముండదుగా! ఎంచేత? ఈ పదార్థమైనటువంటి ప్రపంచంలో నీకు ఆ విధమైనటువంటి మోహం కలుగుతూ ఉంటుంది.

అంచేత, "ఈ విధంగా తిరిగాడుతూ ఉంటాడమ్మా! ఇప్పుడు వీడికి గుండు కొడితే ఏం పెద్ద point ఏముందిలే!" అని చెప్తున్నాడనమాట. దేహాభిమానం ఉండటం చేత కదా అంతలా గింజుకోవాలి! లేకపోతే గుండుకి ఏంటండి బాధ? ఈ మధ్య fashion అయిపోయింది గుండు చేయించుకోవటం. ఇదివరకు ఏదో తీర్థయాత్రలకి వెళ్తే గుండు చేయించుకునేవాళ్ళు. ఇప్పుడు ఎవర్నైనా చూసి, తిరుపతి వెళ్ళావా అని అడగటానికేమి లేదు! ఎందుకంటే, ఊరికే సరదాగా కొట్టించేసుకుంటున్నారు గుండ్లు. ఒక విధంగా మంచిదే, జుట్టు మీద

అభిమానం లేదన్నమాట. లేదా, అది సరిగ్గా పెరగట్లేదు! కారణాలేమైనా జుట్టు విషయంలో అభిమానం తగ్గిపోయింది. మంచి విషయమే కదా! అలాంటివే ఇవన్నీ కూడా అని చెప్తున్నాడు.

"అజ్ఞానజ మగు శోకము  విజ్ఞాన విలోకనమున విడువుము" – ఇలాంటి విజ్ఞానం మనకున్నప్పుడు ఏం జరుగుతుందంటే, అజ్ఞానం లోంచి బయటికి వస్తాము. ఇప్పుడు బలరాముడు చెప్పేదానికి ప్రయోజనం ఏముందంటే, "నిత్యానిత్యమస్తు వివేకమని" ఒకటి చెప్తూ ఉంటారు ఇది నిత్యం, ఇది అనిత్యమని. "దేహినిత్యుడు, దేహములు, అనిత్యాలు" అంటూ అన్నమాచార్యుల వారు కీర్తన రాశారు. నువ్వెన్నో సంపద పోగేసుకున్నామండి. ఇవన్నీ మనతో రావు కదా! ఇవన్నీ ఇక్కడ వదిలేసి వెళ్ళిపోవాల్సిందే కదా! ప్రతి రూపాయి నుంచి మనమే సంపాదించినా, అది కోటి రూపాయలు దాటిపోయినా, అది నీతో రాదు. నేనే కష్టపడి సంపాయించాను అనుకున్నా, అయ్యుండచ్చు గాక, అయినా రానంటుంది. "ఎంతో ప్రేమగా చూస్తాను. మా ఆవిడ నాతో రాదంటారా?" అని అడిగారనుకోండి, రాదు! అలాగే పిల్లలు, అలాగే బంధుజనులు, అలాగే ఆప్తులు, అలాగే ప్రియులు. ఏవి రావు కదా నీతో! ఇలాంటి విషయం మధ్య మధ్యలో మనకి గుర్తనుకోండి, అంతలా ఆరాటపడిపోయి, పేడ బెల్లం కలిపేసుకొని బతికేటువంటి పరిస్థితికి రాము అని చెప్తున్నాడు ఇక్కడ బలరాముడు.

> "అజ్ఞానజ మగు శోకము
> విజ్ఞాన విలోకనమున విడువుము నీకుం
> బ్రజ్ఞావతికిం దగునే
> యజ్ఞానులభంగి వగవ నంభోజముఖీ!"

"అజ్ఞానజ మగు" అంటే అజ్ఞానం చేత పుట్టినటువంటిది శోకము. "శోకము విజ్ఞానవిలోకనమున విడువుము" – నువ్వు ఈ కష్ట సమయంలో జ్ఞానం తెచ్చుకున్నావనుకో, అప్పుడు ఈ శోకం నుంచి బయటపడేటువంటి అవకాశం నీకు ఏర్పడుతుంది. "నీకుం బ్రజ్ఞావతికిం దగునే యజ్ఞానులభంగి వగవ, నంభోజముఖీ!" అని అన్నాడు. నువ్వు అజ్ఞానుల్లాగా కాదు. నువ్వు ఈ విధంగా బాధపడటం అనేటువంటిది తగునా! కాదని చెప్పాడనమాట.

> "ఇట్లు బలభద్రుచేతఁ దెలుపంబడి రుక్మిణీదేవి దుఃఖంబు మాని యుండె
> నట రుక్మి యనువాఁడును బ్రాణావశిష్టుండై విడువంబడి తన విరూప
> భావంబునకు నెరియుచు హరిం గెలిచికాని కుండినపురంబు జొర నని
> ప్రతిజ్ఞ సేసి తత్పుర సమీపంబున నుండె నివ్విధంబున."

ఇది చూడండి! జుట్టు పెరిగిన తర్వాత ఇంటికెళ్ళచ్చు కదా! ఇప్పుడు నాకు జుట్టు తీసేశాడు కాబట్టి ఇప్పుడు నేను ఇక్కడే ఉండిపోతాను. నేను విదర్భ రాజధానియైన కుండినపురంబు వెళ్ళను. ఇక్కడే ఉండిపోయి ఏం చేస్తాడట వాడు? కృష్ణుడు మీద గెల్చిన తర్వాత ఇంటికెళ్తాడటండి. అంటే, ఇంటికెళ్ళడని అర్థము. ఇంటికెళ్ళేదేముంది? అన్నయ్య ఇంటికి రాకపోతే, మిగతా తమ్ముళ్ళు కూడా సంతోషిస్తారక్కడ, రాజ్యానికి ఒకడు తగ్గాడు కదా! ఇంకా ముగ్గురున్నారు వాడి తమ్ముళ్ళు. చిట్టచివరిది కదా ఈవిడ రుక్మిణి. అయి ఉండటం చేత, ఈయన ఈ విధంగా ఇవే పిచ్చి పిచ్చి... అంటే, అవన్నీ వాళ్ళకి ప్రతిజ్ఞల్లాగా ఉంతాయి. ఈ ప్రతిజ్ఞకి అర్థం లేదు. నువ్వు ఎప్పటికీ గెలవ లేవు కదా! అలాంటి వాడివి, ఇది పోగొట్టుకొని, అటు రాజ్యము పోగొట్టుకున్నాడుగా! అది చూడండి.

"విరూప భావంబునకు నెరియుచు" –గుండైపోయిందని దుఃఖ పడుతున్నాడట. "హరిం గెలిచికాని కుండినపురంబు చొర నని ప్రతిజ్ఞ సేసి తత్సమీపంబున నుండె" – ఆ దగ్గరలో ఉన్నాడట, suburbలో. అంటే, విజయవాడకి కంకిపాడు, రామవరంపాడు ఇలా ఉంటాయి, ఊళ్ళోకెళ్ళడానికి వీలుగా city bus లు నడుస్తూ ఉంటాయి! అలా దూరంగా ఉండిపోయి, ఇంటికి రానని చెప్పేశాడు. సరే ఉంటే ఉన్నాడు ఏమిటి ఇప్పుడు? ఇంక వాడి కథ ఎక్కడా కనిపించదు.

"రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెల్చి రాజస మొప్పన్
రాజిత యగు తన పురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్."

ఇది బమ్మెర పోతన stamp పద్యం. ఇలా చాలా పద్యాలుంటాయి. ఇది ఆయన పక్కి. ఇలా ఒక శబ్దం తీసుకుంటే, దాన్నే రకరకాలుగా అర్థాలు వచ్చేట్టుగా దాన్ని వాడ్తారు. "రాజీవలోచనుఁడు హరి" – రాజీవమంటే ఏంటి? పద్మదళం. రాజీవలోచన అంటే పద్మదళం వంటి కళ్ళు. పద్మముల వంటి కన్నులు అని కాదు, పద్మదళమది. రాజీవమంటే పద్మమే. కాబట్టి, అలాంటి విచ్చుకున్నటువంటి కన్నులు గలది. "హరి రాజసమూహములను గెలిచి" – చాలామందిని గెలిచాడు కదా! "రాజస మొప్పన్" – రాజీవము, రాజు, రాజసము."రాజిత యగు తన పురికిని" – రాజిత అంటే బాగా కాంతులతో కూడినటువంటి పురమది, ద్వారకాపురం. అద్భుతమైనటువంటిది ద్వారకాపురం. ద్వారకాపురి యొక్క వైభవం తెలియాలంటే, భారతంలో యుద్ధిష్టిరుడి కోసం నారదుడు వర్ణిస్తాడు. ఎందుకంటే, మయసభ చూసి మురిసిపోయి ధర్మరాజు ఇలాంటిది

ఎక్కడున్నా ఉందా అంటే, చాలా చెప్పుకుంటూ, ద్వారక కూడా చెప్తాడు. అది విశ్వకర్మ నిర్మాణం. సాక్షాత్తు సృష్టి నిర్మాణం చేసినటువంటి వాడే విశ్వకర్మ. The great architect of the universe అంటారు. అలాంటి వాడు నిర్మించి ఇచ్చాడు ద్వారకాపురం. "రాజిత యగు తన పురికిని రాజానన" – ఈ రాజెవరు? చంద్రుడు. నెలరాజా, వెన్నెలరాజా అంటుంటాం కదా! రాత్రికి ఆయనే రాజు కదా! చంద్రబింబం లాంటి ముఖం కలిగినటువంటి ఆవిడ్ని "దెచ్చెబంధురాజి నుతింపన్" – బంధువులందరూ కూడా బాగా సంతోషించారటండి.

"అంత నయ్యాదవేంద్రుని నగరంబు సమారబ్ధ వివాహకృత్యంబును
బ్రవర్తమాన గీత వాద్య నృత్యంబును బ్రతిగృహాలంకృత విలసితాశేష
నరనారీ వర్గంబును బరిణయ మహోత్సవ సమాహూయమాన మహీపాల
గజఘటా గండమండల దానసలిలధారా సిక్త రాజమార్గంబును బ్రతిద్వార
మంగళాచార సంఘటిత క్రముక కదళికా కర్పూర కుంకుమాగరుధూపదీప
పరిపూర్ణకుంభంబును విభూషిత సకల గృహవేదికా కవాటదేహళీ
స్తంభంబును విచిత్ర కుసుమాంబర రత్నతోరణ విరాజితంబును
సముద్ధూత కేతన విభ్రాజితంబును నై యుండె న య్యవసరంబున."

"అంత నయ్యాదవేంద్రుని నగరంబున" – వీళ్ళు అన్నీ బాగా సంభరంగా ఏర్పాట్లు చేసుకుంటారు. విపరీతంగా, మొత్తం ద్వారకానగరమంతా కూడా దేదీప్యమానంగా వెలిగిపోయేట్లు పువ్వులతోనూ, ఆ మామిడి రెమ్మలతోనూ, ఎంత బాగా అలంకారం చేసుకోగలరో, అంత బాగా అలంకారం చేసుకున్నారండి. అందరూ చక్కగా ముందు ఊరు అలంకారం చేసుకొని, వాళ్ళని వాళ్ళు అలంకారం చేసుకున్నారు. వారి గృహాల్ని అలంకారం చేసుకున్నారు, అంత సంతోషం. ఊరంతా పెళ్లి సందడిలో ఉంది. అంటే, ప్రతివారు వారివారికి వస్త్రాభరణాలు కొనుక్కున్నారు. ప్రతివారు వారి వారి ఇళ్ళను చక్కగా రంగులవి వేయించుకొని, రంగవల్లులు చేత తెచ్చుకొని, చక్కగా మకరతోరణాలు కట్టుకొని, అద్భుతంగా ఏర్పాటు చేసుకున్నారు. అలాగే వీధులన్నీ కూడా అలంకారం చేశారు. ఎంచేత? వాళ్ళందరికీ శ్రీకృష్ణుడంటే అంత ఇష్టం కాబట్టి.

"ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్ మాన వై
భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం
ధవ సత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్."

ఎలాంటి రుక్మిణి ఆవిడ? సాక్షాత్తు పరాప్రకృతియే కదా! ఎంచేత? ఆవరణం దాటి బయటకోచ్చేసి, కృష్ణుడిని పొందింది. మిగతా భార్యలకందరికీ ఇలా ఉండదు కదా! అందుకని ఈవిడతో ఎవరు సమానం కాదు. మహాలక్ష్మియే ఆ విధంగా మహావిష్ణువు కృష్ణుడిగా అవతరించిన సందర్భంలో, ఆయనని తిరిగి పొందటానికి ఈ విధంగా జన్మించినటువంటిది. సహజంగా బంగారు దేహం కలిగినటువంటిది రుక్మిణి అంటే అర్థమది. రుక్మిణీదేవి అనగా బ్రహ్మవిద్య. దానిని వివాహము చేసుకొనినవాడు బ్రహ్మవేత్తయైన శ్రీకృష్ణుడే కాని మరొకడు కాదు. శిశుపాలుడు, జరాసంధుడు మొదలైన అజ్ఞానులు కారని భావం. అంటే ఆవిడని వివాహం చేసుకోవటానికి వాళ్ళకి అర్హత లేదు. “ధృవకీర్తి” అంటే ఈ ధృవుడు, ధృవనక్షత్రం ఉన్నంత కాలం ఈ రుక్మిణీకల్యాణ కథ అలా నిల్చిపోతుంది. అటువంటి పెళ్ళిట అది. మనం నిలబెట్టుకోకపోతే, మన సంస్కారాలన్నీ పోతాయోమో అని భయపడుతూ ఉంటారు. అదేం భయం అక్కర్లేదు. సత్యాన్ని నిలబెట్టాల్సిన అవసరం లేదు, సత్యం నిలబడే ఉంటుంది. దాన్ని అనుసరించే వాడిని కాపాడుతుంది. ధర్మాన్ని నిలబెట్టేవాడు రక్షింపబడతాడు తప్ప, ధర్మాన్ని ఎవ్వరూ ఏమి చేయలేరు. అలాంటి సత్యమది. అంచేత, ఆ కీర్తి ఎల్లకాలం ఉంటుంది.

వైభవము, గాంభీర్యము కలది, అష్టైశ్వర్యములు కలది. ఎమన్నాడిక్కడ? “హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్” అన్నాడు. అంటే, కృష్ణుడు మనసు అపహరించింది రుక్మిణి. అందుకనే కదా ఆయన కూడా బ్రాహ్మణుడు వస్తే సంతోషిస్తాడు! అందుకనే “కళ్యాణమస్తు” అనంగానే చిరునవ్వు నవ్వుతాడు, ఆహా! మనకి పనికొచ్చిన వార్త తెచ్చాడు అని మీకు మొదటి సంవత్సరంలో చెప్పాను. “నిజ చేతోహారిణిన్” అంటే తన యొక్క మనస్సును హరించినటువంటిది అమె.

“వైభవ గాంభీర్య విహారిణిన్” – వైభవమంటే పొద్దున చెప్పాను. లోతైనటువంటి గాంభీర్యంతో, వైభవంతో ఎప్పుడూ సంచరించేటువంటి ఆమె. “సంపత్కారిణిన్” – సకల సంపత్తు, సంపదలను ఇచ్చేటువంటిది కదా! “అశ్వదాయిాచ గోదాయి ధనదాయి మహాధనే. ధనంమే జుషతాం దేవీం సర్వ కామార్థసిద్ధయే” అని అంటాం కదా! అంతేకాదు, సోమపానం కూడా చేయించగలదు అని చెప్పుకుంటాం. “ధనమగ్నిర్ధనం వాయుర్ధనం సూర్యోధనం వసుః ధనమింద్రో బృహస్పతి ర్వరుణం ధనమశ్నుతే వైనతేయ సోమం పిబసోమం పిబతు సోమినో” అంటాం. అమృతతుల్యమనైటువంటి ప్రజ్ఞ అది.

“సంపత్కారిణిన్ సాధు బాంధవ సత్కారిణి” – సాధుజనులందరికీ కూడా సాధుత్వం చేత బాంధవత్వం. సాధుజనులు సాధువుల్నే కోరుకుంటూ ఉంటారు. సాధువులంటే సన్యాసులు కాదు. సాధువులు అంటే సున్నితమైనటువంటి మనస్సు కలవారు. మాటతోగాని, చేతతోగాని ఇతరులను హింసించనటువంటి వారు.

అలాంటి వాళ్ళందరి చేత సత్కరింపబడుతున్నది పుణ్యచారిణి. అంతేకాదు, వాళ్ళందరికీ సత్కార్యములకు సహాయం చేస్తుంది. "మహాదారిద్ర్యసంహారిణిన్" – అందుకనే ఎక్కువ ఏం చెప్తారో తెలుసా? ఎగపడి లలితాసహస్రనామం చేయకండి, లక్ష్మీసహస్రం చేసుకోండి అని పెద్దవాళ్ళు చెప్తారు. ఎందుకంటే, లలితాసహస్రనామం మహాశక్తివంతమైనటువంటి స్తోత్రమది. అందులో తంత్రమున్నది, మంత్రమున్నది, యోగమున్నది, అత్యార్థములు కోకొల్లలుగా ఉన్నది. మహాశక్తివంతమైనటువంటిది, మనం పట్టగలిగింది కాదు. సామాన్యులు అయినటువంటి వాళ్ళు చేసుకోవాలసినటువంటిది లక్ష్మిసహస్రం చెప్పారు. రెండు ఒకటే కాని, ఒకటి పరాశక్తి, ఒకటి సంపశక్తి. మనకి శుభములు కూర్చేటువంటిది లక్ష్మి. "దారిద్ర్యసంహారిణిన్ సువిభూషాంబర ధారిణిన్" – చాలా విశిష్టమైనటువంటి అమ్మవారి అలంకారం. చాలా అద్భుతం, మహాలక్ష్మికి కదా! లక్ష్మి అలంకరణ.

"గుణవతీచూడామణిన్" అంటే గుణములు ఎవరికన్నా ఉన్నయ్యా అంటే అమ్మవారితో పోల్చిచూసుకోవాలసిందే! లక్ష్మీదేవి లాగా ఉంటుందండి అంటాం కదా! లక్ష్మి సమానురాలు అంటూ ఉంటాం కదా! అంటే ఏమిటి? ఎవరిని పోల్చుకోవాలన్నా అమ్మవారితో పోల్చుకుంటారు. ఆవిడే చూడామణి, దాంతో పోల్చిచెప్పుకుంటాం. అంటే, గుణములు ఎవరితో పోల్చిచెప్పుకుంటారో, వాళ్ళు ఎంతటివాళ్లై ఉండాలి? రామునితో పోల్చి చెప్పుకోవటం, కృష్ణునితో పోల్చి చెప్పుకోవటం, అమ్మవారితో పోల్చిచేప్పుకోవడం ఉంటాయి కదా! గుణములకు మరి ఆమె రుక్మిణిన్. అంటే, బంగారు కాంతి కలిగినటువంటిది. అలాంటి ఆమెను, అంటే సాక్షాత్తు మూలప్రకృతిని ఆ విధంగా శ్రీకృష్ణుడు పెళ్లి ఆడాడు అనేటువంటిది ఆ పద్యం.

"సతులుం దారును బౌరులు
హితమతిఁ గానికలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నత వర్ధిష్ణులకును మా
నిత రోచిష్ణులకు రుక్మిణీ కృష్ణులకున్."

బాగా బహుమతులు వాళ్ళ వాళ్ళ ప్రీతి కొద్ది ఇచ్చుకున్నారు.

"హరి పెండ్లికిఁ గైకేయక
కురు సృంజయ యదు విదర్భ కుంతి నరేంద్రుల్
పరమానందముఁ బొందిరి
ధరణీశులలోన గాఢ తాత్పర్యములన్."

వీళ్ళంతా కూడా శిష్టాచారులైనటువంటి రాజసంఘాలు. ఈ పెళ్లి జరగడం వల్ల ఎలాంటి polarizations జరుగుతాయో చూసుకుంటారండి వాళ్ళు. ఎంతసేపు వాళ్ళ పని అది – పొత్తు. మనకదే కదా గోలంతా! ఎవడు ఎవడితో పొత్తు కుదుర్చుకుంటాడని కదా! ఇప్పుడు ఈ వివాహం వల్ల ఎలాంటి polarizations జరుగుతాయి అనేటువంటిది వీళ్ళందరు ఆలోచించారట. అందుకనే కదా, బలరాముడు యొక్క కుమార్తెను, లక్ష్మణ కుమారుడు పెళ్లి చేసుకుంటే, యాదవులంతా తమవైపు ఉంటారనే ప్రయత్నం. ఇలా కొన్ని కొన్ని ప్రయత్నాలు. ఆ రాజవంశాల్లో ఏంటంటే, ఈ వివాహబంధం ద్వారా there will be new alignments. అవి వాళ్ళు ఆలోచించుకొని సంతోషించారాట.

"హరి యీ తెఱఁగున రుక్మిణి
నరుదుగఁ గొనివచ్చి పెండ్లియాడుట విని దు
ష్కరకృత్య మనుచు వెఱఁగం
దిరి రాజులు రాజసుతులు దిక్కుల నెల్లన్."

కృష్ణుడు ఈ విధంగా పెళ్లి చేసుకున్నాడని కొంతమందికి ఇది చాలా సంభమాశ్చర్యాలు కలిగించిందట. ఎందుకంటే, అరుదుగా ఇట్లా ఎత్తుకొచ్చి, పెళ్ళిచేసుకోవడం జరుగుతుంది. సులభమైన పని కాదిది. "వెఱఁ గందిరి" – రాజులందరూ ఆశ్చర్యపడిపోయారట. రాజులు ఆశ్చర్యపడటం సరే! రాజసుతులు మనం కూడా ఇలాంటిదేదన్నా చెయ్యగలమా అని పోటీ చూసుకుంటారు కదా! పెళ్లి కావాలసిన రాజకుమారులకి ఇది ఒక parameter, ఒక benchmark కదా! మనమిలా చేయగలమా అని అనిపిస్తూ ఉంటుందన్నమాట. అన్నీ దిక్కుల్లో కూడా ఈ విధంగా ఈ వార్త పెల్లుబిక్కుపోయి బాగా, it was the talk of the nation and neighboring nation. దేశమే కాదు, చుట్టుపక్కల దేశాల్లో కూడా చాలా కాలం ఇది ఒక పెద్ద వార్తగా చెపుకున్నారటండి.

"అనఘ! యాదిలక్ష్మి యైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు."

ఈ విధంగా పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు అట్లా ఊళ్ళో తిరుగుతూ ఉంటే, ఊళ్ళో వాళ్ళందరూ చూసి ఆనందిస్తూ ఉంటారు. వాళ్ళు కూడా friends ఇంటికి, చుట్టాలింటికి, వాళ్ళింటికి, వీళ్ళింటికి వెళ్తూ ఉంటారు

కదా! మరప్పుడు ఈ రాజవీధుల్లో తిరుగుతున్నప్పుడు చూసి, ఊళ్ళో వాళ్ళందరూ కూడా చూసి చాలా సంతోషించడమే కాదట, వాళ్ళకి భయం కూడా పోయిందిటండి. ఎంచేతంటే, సమస్తం – ప్రకృతి, పురుషులు – ఇక్కడే ఉంది. అంతకుముందు ఆయన ఉన్నాడు. ఇప్పుడు ఆమె కూడా చేరింది. ఇంక భయానికి తావేముంది అని చెప్పి వాళ్ళు సంతోషించారటండి.

"కువలయ రక్షా తత్పర!
కువలయదళ నీలవర్ణ కోమల దేహా!
కువలయనాథ శిరోమణి
కువలయజన వినుత విమల గుణసంఘాతా!"

"ఊరిని, భూమిని పరిపాలించుట యందు ఆసక్తి కలవాడవును, నల్లకలువ రేఖల వలె నీలవర్ణము, మనోజ్ఞమైన దేహము కలవాడవును, రాజశ్రేష్టుడవును, భూమిలో నుండు సకల జనుల చేత కొనియాడబడిన సర్వజ్ఞత్త్వము, సర్వేశ్వరత్త్వము, సర్వభౌక్తత్త్వము, సర్వకర్తుత్త్వము, సర్వపాలకత్త్వము, సర్వసంహారకర్తము మొదలైన మంచి గుణముల సమూహములు కలవాడివైన ఓ స్వామి!" అని చెప్పి దీనికి తాత్పర్యం. ఎవరిది ఈ కీర్తన? కృష్ణుడిని ఆ విధంగా కీర్తించుకున్నారట ప్రజలందరూ, ఇలాంటి కృష్ణస్వామి మన దగ్గర ఉన్నాడు అని. భయం పోయింది. "కువలయ రక్షా తత్పర" – కువలయం అంటే భూమండలం. "కువల రక్షా తత్పర! కువలయదళయదళ నీలవర్ణ కోమల దేహా!" – మన భూమి బయట నుండి చూస్తే ఎలాంటి కాంతిలో ఉంటుందో… ఇప్పుడు మనకి తెలుస్తోంది కదా! బొమ్మలు తీస్తున్నారు కదా space లోంచి! ఎలా ఉంటుంది? Violet కాంతితో ఉంటుంది. నీలి bluish violet కదా! Pink violet కాదు. అలా ఉంటాడు కృష్ణుడు.

"కువలయనాథ" – భూమికి నాధుడవు, శ్రీభూసమేతుడివి కదా! "కువలయనాథ! శిరోమణి కువలయజన వినుత విమల గుణసంఘాతా!" – కువలయ జనులంటే, మనమే భూమి మీద ఉండేటువంటి వాళ్ళం. మన అందరిచేత ఎప్పుడూ కీర్తింపబడేటువంటి వాడివి. "విమల గుణసంఘాతా!" – చాలా నిర్మలమైనటువంటి విమలం అంటే, మలము లేనిది అని నిర్మలము అని అర్థం. అటువంటి గుణముల సమూహములు కలిగినటువంటి వాడివి నీవు అని చెప్పి కృష్ణుడిని ఉద్దేశ్యించి ద్వారకాపురంలో ఉండే ప్రజలందరూ కూడా చక్కగా కీర్తించుకుంటూ, ఆనందంగా, భయం లేకుండా బతుకుతూ ఉన్నారటండి.

"సరసిజనిభ హస్తా! సర్వలోకప్రశస్తా!
నిరుపమశుభమూర్తీ! నిర్మలారూఢకీర్తీ!

పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!
గురుబుధజన తోషీ! ఘోరదైతేయశోషీ!"

ఈ రెండు పద్యాలు కృష్ణుడ్ని ఉద్దేశ్యించి ప్రజలు పలికినటువంటివి. మనం కూడా కంఠస్తం చేసుకోవచ్చు. "సరసిజనిభహస్తా" అంటే కమలములను గోరిన హస్తములు కలవాడా అని. బాహువులు చాలా బలంగా ఉనప్పటికీ, ఏదీ ఐరావతం తొండం లాగ, చేతులు సున్నితంగా ఉంటాయి. "కువలయజనిభహస్తా! సర్వలోకప్రశస్తా!" – ఒక్క భూమే కాదు, అన్ని లోకాల్లోనూ ప్రశంసింపబడుతూ ఉంటాడు. "నిరుపమశుభమూర్తీ" – ఇంకో ఉపమానం లేదటండి. ఇంత శుభంగా మౌక్తి ఉంటుందని. కృష్ణుడు ఎంత అందంగా ఉంటాడు అని చెప్పాలంటే ఇంకో ఉపమానం లేదు. ఎంత అందంగా ఉంటాడంటే, కృష్ణుడంత అందంగా ఉంటాడని చెప్పాలంతే! ఇంకో పోలిక లేదు. అది ఎందుకిలా చెప్పానంటే, రాముడి అందం గురించి అడుగుతారు తులసీదాసుని. ఎంత అందమైనటువంటివాడు రాముడు? ఇంకో దాంతో పోలిక చేసి చెప్పమని. అంటే, ఆయనకి దేంతో పోల్చాలో తెలీదు. కవి కదా! కబీర్ను అడిగాడట ఆయన. రాముడి అందం దేంతో పోలిస్తే బాగుంటుంది అని. రాముడి అందం దేంతో పోల్చాలంటే, రాముడితోనే పోల్చాలి అని చెప్పాడాయన. అంటే రామకృష్ణాదుల రూపము ముందు భూమి మీద అంత పరిపూర్ణమైనటువంటి రూపములు గోచరించవు. "నిరుపమశుభమూర్తీ" – అన్నీ శుభములు కూడినటువంటి మూర్తి. అందుకని వాళ్ళని పెట్టుకుంటాం. పరిపూర్ణమైనటువంటి శుభములు కలిగించేటువంటి మంగళప్రదమైనటువంటి మూర్తులను, విరాట్పురుషుల మూర్తులే సాక్షాత్తు. అంటే పొట్టి కాదు, పొడవు కాదు, నలుపుగాదు, పసుపుగాదు, లావుగాదు, సన్నముగాదు. మరీ లతల్లాగా అట్లా కమిలివాడిపోయేట్లుగా ఉండదు, అలా అని బండగా ఉండదు. మరి ఏం చూసుకున్నా అన్నిట్లోనూ ఇంకోరకంగా ఇది ఉండటానికి వీల్లేదన్నట్లుగా ఉంటుంది అలాంటి మూర్తి.

"నిర్మలారూఢకీర్తి" – అలా పొగుడుతూ ఉంటే, ఎంత కీర్తంటే అది నిర్మల ఆరూఢ పరిశుద్ధమును నిలకడగలది. నిలకడగలది అయిన కీర్తి గలవాడా! పరిపూర్ణమైనటువంటి కీర్తి నిలకడగా ఉంటే కీర్తి. మామూలుగా కీర్తికి గూడా హెచ్చుతగ్గులుంటాయి. హెచ్చుతగ్గులు లేని కీర్తి కలిగినటువంటివాళ్ళు. "పరహృదయవిదారీ" – శత్రువులకు గుండెల్లో గుబులు పుట్టేస్తుంది అంటారు చూశారా! చాలా హృదయవిదారత అయిపోతుంది కృష్ణుని నామం. కంసుడు ఆ విధంగా బాధపడి చచ్చిపోతాడు కదా! నిజానికి కంసుడికి చంపే అంతటి పరిస్థితే రాదు కృష్ణుడు. ప్రతిక్షణం కొంచెం కొంచెం చచ్చిపోతూ ఉంటాడు కంసుడు. ఎంచేతంటే, ఏది కదిలినా కృష్ణుడేనేమో అని అనుకుంటూ భయపడి పోతూ ఉంటాడు, గజగజలాడ్తూ ఉంటాడు. కృష్ణుడు కనపడి, మీదకి ఒక్కసారి ఒక్క సింహం లాగా లంఘించి, ఆయన మీద పడే సరికి, దానికే ఆయన

ప్రాణం పోతుంది. అంత భయం. కృష్ణుడు అంటే దుష్టుల హృదయంలో అంత భయం. అంచేతే, ఈ రాజులందరూ కూడా కృష్ణుడు గురించి భయపడే కాపాడుకోవటానికి చాలా ప్రయత్నం చేశారు. రుక్మి యొక్క ప్రోత్సాహం చేత, శిశుపాలుని యొక్క ఉత్సాహం చేత వచ్చారు గాని ఏమైంది? ఏమి కాలేదు కదా!

"పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!" – భక్తులకు, భక్తలోకానికి ఎప్పుడు ఉపకారం చేస్తూ ఉంటాడు. "గురుబుధజనతోషీ" అంటే సద్గురువులు, బుధులు అంటే తెలిసినవారు, జనులు అంటే సామాన్యజనులు. వాళ్ళందరికీ ఈయన్ని చూస్తే ఒక ఆనందం, ఒక సంతోషం. వాళ్ళు తలుచుకుంటే ఆనందం, కృష్ణుడు విగ్రహం చూస్తేనే ఆనందం, ఫోటో చూస్తే ఆనందం. ఏం చూసినా కొంతమందికి ఈయనను చూస్తుంటేనే ఆనందం కలుగుతుంది కదా! అందుకనే, అందరి దగ్గర కృష్ణుని యొక్క చిత్రపటాలు చాలా ఎక్కువగా ఉంటూ ఉంటాయి. రకరకాల భంగిమల్లో ఉంటూ ఉంటాయి. "ఘోరదైతేయశోషీ" – దైత్యులకు మాత్రం చాలా భయంకరంగా కనిపిస్తూ ఉంటాడట. వాళ్ళకి నాలుక పిడచకట్టిపోతుంది. ఒళ్ళంతా కంపించి, భయం వచ్చేసి, ఆ మాట వింటేనే గజగజలాడిపోయేటువంటి మూర్తిట.

అలాంటి శ్రీకృష్ణుడిని, రుక్మిణి తన భక్తి చేత మెప్పించి, వివాహం కావించుకున్నటువంటి కథ ఇది. ఈ దశమస్కంథంలో, పూర్వభాగంలో చిట్టచివరి ఘట్టం. దీంతో దశమస్కంథం పూర్వభాగమైపోతుంది. ఆ తర్వాత మనం ఉత్తరభాగంలోకి ప్రవేశించడం జరుగుతోంది. ఈ రుక్మిణీకల్యాణం మన విజయవాడ గణపతి సోదరులైనటువంటి కృష్ణమూర్తి గారి యొక్క మేధస్సులోంచి ఈ ఘట్టం మనమంతా ఒకసారి యధాశక్తి వినాలనేటువంటి సంకల్పం ఒకటి జరగటం చేత, అది ఈ మూడు సంవత్సరాలు మనం ఈ విధంగా నిర్వర్తించుకున్నాము. ఇటువంటి ఘట్టాలు మనం చదువుకున్నప్పుడల్లా, విన్నవారందరికీ కూడా చక్కని శుభములు కలుగుతాయి. మళ్ళీ దారి తప్పిన వారికి దారి దొరుకుతూ ఉంటుంది. ఇటువంటి ఫలాలన్నీ ఉంటాయి. ఏదేమైనప్పటికీ పురోగతి బాగుంటుంది. ఈశ్వర అనుగ్రహం లభిస్తుంది. అలాంటి రుక్మిణీకల్యాణం ఘట్టాన్నిఈ రోజు మనము ఇక్కడ పరిపూర్ణంగావించుకున్నాము.

**స్వస్తి**

# రుక్మిణీ కల్యాణము

## పద్యములు

పలికెడిది భాగవత మట
పలికించు విభుండు రామభద్రుం డ౦ట నేఁ
బలికిన భవహర మగు న౦ట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?

## రుక్మిణీకల్యాణ కథా ప్రారంభము

ఆ వనజగర్భు పంపున
రైవతుఁడను రాజు దెచ్చి రాముని కిచ్చెన్
రేవతి యనియెడు కన్యను
భూవర మున వింటి కాదె బుద్ధిం దెలియన్.

తదనంతరంబ.

ఖగనాథుం డమరేంద్రు గెల్చి సుధ మున్ గైకొన్నచందంబునన్
జగతీనాథులఁ జైద్యపక్షచరులన్ సాళ్వాదులం గెల్చి భ
ద్రగుఁడై చక్రి వరించె భీష్మకసుతన్ రాజీవగంధిన్ రమా
భగవత్యంశ భవన్ మహాగుణమణిన్ బాలామణిన్ రుక్మిణిన్.

అనిన రా జి ట్లనియె. మున్ను రాక్షసవివాహంబున స్వయంవరంబునకు
వచ్చిన హరి రుక్మిణిం గొనిపోయె నని పలికితివి కృష్ణుం డొక్కరుం
డెవ్విధంబున సాళ్వాదులం జయించి తన పురంబునకుం జనియె
నదియునుంగాక.

కల్యాణాత్మక మైన విష్ణుకథ లాకర్ణించుచున్ ముక్తవై
కల్యుం డెవ్వఁడు తృప్తుఁ డౌ నని వినంగాఁ గ్రొత్త లౌచుండు సా
కల్యం బేర్పడ భూసురోత్తమ యెఱుంగం బల్కవే రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్.

భూషణములు చెవులకు బుధ
తోషణములు లనేక జన్మ దురితౌఘ విని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమను గుణభాషణముల్.

అని రా జడిగిన శుకుం డి ట్లనియె.

వినుము విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొక దొడ్డరాజు గలఁ డాతని కేవురు పుత్రు లగ్రజుం
డనఘుఁడు రుక్మి నాఁ బరఁగు నందఱకుం గడగొట్టు చెల్లలై
మనుజవరేణ్య! పుట్టె నొకమానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై.

బాలేందు రేఖ తోఁచిన
లాలితయగు నపరదిక్కు లాగున ధరణీ
పాలుని గేహము మెఱసెను
బాలిక జన్మించి యెదుగ భాసుర మగుచున్.

మఱియు దినదిన ప్రవర్ధమానయై.

వేర్వేర బొమ్మలపెండ్లిండ్లు సేయుచు
 నబలలతోడ వియ్యంబు లందు

గుజ్జెనగూళ్ళను గొమ రొప్ప వండించి
          చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెఱసి
రమణీయ మందిరారామ దేశంబులఁ
          బువ్వుఁదీగెలకును బ్రాది వెట్టు
సదమల మణిమయ సౌధభాగంబుల
          లీలతో భర్మడోలికల నూఁగు

బాలికలతోడఁ జెలరేగి బంతు లాడు
శారికా కీర పంక్తికిఁ జదువు సెప్పు
బర్హి సంఘంబులకు మురిపములు గఱుపు
మదమరాళంబులకుఁ జూపు మందగతులు.

అంత.

దేవకీసుతుకోర్కి తీగెలు వీడంగ
          వెలఁదికి మైదీగె వీడఁ దొడఁగెఁ
గమలనాభుని చిత్త కమలంబు వికసింపఁ
          గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ
          బొలఁతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ
          జలజాక్షి మధ్యంబు సన్న మయ్యె.

హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మనయనువలనఁ బ్రమదంబు నిండార
నెలఁతయౌవనంబు నిండి యుండె.

ఇట్లు రుక్మి రుక్మకథ రుక్మబాహు రుక్మకేశ రుక్మనేత్రు లను నేవరకుం
జెలియ లైన రుక్మిణీదేవి తన యెలప్రాయంబున.

తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచునున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూప బల గుణాదులు
విని కృష్ణుఁడు తనకుఁ దగిన విభుఁ డని దలఁచెన్.

ఆ లలన రూపు బుద్ధియు
శీలము లక్షణము గుణముఁ జింతించి తగన్
బాలారత్నముఁ దన కి
ల్లాలుగఁ, జేకొందు ననుచు హరియుం దలఁచెన్.

అంత.

## రుక్మిణి అగ్నిద్యోతనుఁదను బ్రాహ్మణుని గృష్ణునివద్దకుఁ బంపుట

బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు సేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్తపు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై.

అన్న తలంపు దా నెఱిఁగి యన్నవనీరజగంధి లోన నా
పన్నత నొంది యాప్తుఁ డగు బ్రాహ్మణు నొక్కనిఁ జీరి గర్వసం
ఛన్నుఁడు రుక్మి నేఁడు ననుఁ జైద్యున కిచ్చెద నంచు నున్నవాఁ
డెన్నివిధంబులం జని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే.

అయ్యా! కొడుకు విచారము
లయ్యయు వారింపఁజాలఁ డటు గాకుండన్
నెయ్య మెఱిఁగించి చీరుము
చయ్యన నిజ సేవకానుసారిన్ శౌరిన్.

అని కొన్ని రహస్యవచనంబులు చెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకా నగరంబునకుం జని ప్రతిహారులవలనఁ దనరాక యెఱింగించి యన్నగ ధరుం డున్న నగరు ప్రవేశించి యందుఁ గనకాసనాసీనుం డయి యున్న పురుషోత్తముం గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవించిన ముసిముసి నగవులు నగుచు బ్రహ్మణ్యదేవుం డైన హరి తన గద్దియ దిగ్గిన డిగ్గి బ్రాహ్మణుఁ గూర్చుండ నియోగించి తనకు దేవతలు సేయు చందంబునం బూజలు చేసి సరస పదార్థసంపన్నంబైన యన్నంబుఁ బెట్టించి రెట్టించిన ప్రియంబున నయంబున భాసురుం డైన భూసురుం జేరి లోకరక్షణ ప్రశస్తం బయిన హస్తంబున నతని యడుగులు పుడుకుచు మెల్లన యి ట్లనియె.

జగతీసురేశ్వర! సంతోషచిత్తుండ
వైయున్న నీ ధర్మ మతిసులభము
వృద్ధసమ్మత మిది విత్త మెయ్యది యైనఁ
బ్రాపింప హర్షించు బ్రాహ్మణుండు
తన ధర్మమున నుండుఁ దరలఁ డా ధర్మంబు
గోరిక లతనికిఁ గురియుచుండు
సంతోషి గాఁ డేని శుక్రుఁ డైన నశించు
నిర్ధనుండైనను నిద్రవోవు

సంతసించనేని సర్వభూత సుహృత్త
ములకుఁ బ్రాప్తలాభ ముదితమాన

సులకు శాంతులకును సుజనులకును గర్వ
హీనులకును వినతు లే నొనర్తు.

ఎవ్వనిదేశమం దునికి యెవ్వనిచేఁ గుశలంబు గల్గు మీ
కెవ్వనిరాజ్యమందుఁ బ్రజ లెల్ల సుఖింతురు వాఁడు మర్త్రియుం
డివ్వనరాశిదుర్గమున కె ట్లరుదెంచితి వయ్య! నీవు లే
నవ్వులు గావు నీతలఁపునం గలమే లొనరింతు ధీమణీ!

అని ఇట్లు లీలాగృహీతశరీరుం డైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ
సురవరుం డతనికి సవినయంబుగా ని ట్లనియె. దేవా! విదర్భదేశాధీశ్వరుం
డైన భీష్మకుం డను రాజు గలం డా రాజు కూఁతురు రుక్మిణి యను
కన్యకామణి గల దయ్యిందువందన నీకుం గైంకర్యము సేయం గోరి
వివాహమంగళ ప్రశస్తం బయిన యొక్క సందేశంబు విన్నవింపు మని
పుత్తెంచె నవధరింపుము.

**ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక**
**దేహతాపంబులు తీఱిపోవు**
**నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల**
**కఖిలార్థంబు కలుగుచుండు**
**నే నీ చరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనో**
**న్నతత్త్వంబుఁ బొందఁ గలుగు**
**నే నీ లాసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ**
**దడవిన బంధసంతతులు వాయు.**

**నట్టి నీయందు నాచిత్త మనవరతము**

నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీచిత్తచోర!

ధన్యున్ లోకమనోభిరాముఁ గుల విద్యా రూప తారుణ్య సౌ
జన్య శ్రీ బల దాన శౌర్య కరుణా సంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు కోరదే మును రమా కాంతాలలామంబు రా
జన్యానేకప సింహ నావలననే జన్మించనే మోహముల్.

శ్రీయుతమూర్తి యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్నవాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్.

వ్రతముల్ దేవ గురు ద్విజన్మ బుధ సేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరిన్ జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితి నేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశ ముఖ్యాధముల్.

అంకిలి సెప్ప లేదు చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయ శౌర్యమే
యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్.

లోపలి సౌధంబులోన వర్తింపంగఁ
దే వచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి
గాని తే రా దని కమలనయన!
భావించితేని నుపాయంబు సెప్పెద
నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

నెలమి మావారుఁ బంపుదు రేను నట్లె
పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!

ఘను లాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులున్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా!

**ప్రాణేశ! నీ మంజుభాషలు వినలేని**
**కర్ణరంధ్రబులకలిమి యేల**
**పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని**
**తనులత వలని సౌదర్య మేల**
**భువనమోహన నిన్ను బొడగానఁగా లేని**
**చక్షురింద్రియముల సత్త్వ మేల**
**దయిత నీయుధరామృతం బానఁగా లేని**
**జిహ్వకు ఫలరససిద్ధియేల**

**నీరజాతనయన! నీ వనమాలికా**
**గంధమబ్బలేని ఘ్రాణ మేల**
**ధ్యనచరిత! నీకు దాస్యంబు సేయని**
**జన్మమేల యెన్ని జన్మములకు.**

అని యిట్లు రుక్మిణీదేవి పుత్తెంచిన సందేశంబును రూపసౌందర్యాది విశేషంబులును బ్రాహ్మణుండు హరికి విన్నవించి కర్తవ్యం బెద్ది సేయ నవధరింపు మని సవిరణగా మఱియు ని ట్లనియె.

పల్లవ వైభవాస్పదములు పదములు
కనకరంభా తిరస్కారు లూరు
లరుణప్రభా మనోహరములు కరములు
కంబుసౌందర్య మంగళము గళము
మహిత భావాభావ మధ్యంబు మధ్యంబు
చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసి తార్ధేందు పటలంబు నిటలంబు
జితమత్త మధుకర శ్రేణి వేణి

భావజాశుగముల ప్రాపులు చూపులు
కుసుమశరుని వింటి కొమరు బొమలు
చిత్తతోషణములు చెలువ భాషణములు
జలజనయనముఖము చంద్రసఖము.

ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనకుం దగు దీపు మాయుపా
ధ్యాయుల యాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము లేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తో యరహానఁ దెత్తు గాని వి

చ్చేయుము శత్రులన్ నుఱుముసేయుము చేయుము శోభనం బిలన్.

## శ్రీకృష్ణుండు కుండిననగరంబునకు రథారూఢుండై చనుట

అని యిట్లు పలికిన బ్రాహ్మణునివలన విదర్భరాజతనయ పుత్తెంచిన సందేశంబును రూప సౌందర్యాది విశేషంబులును విని నవధరించి నిజకరంబున నతని కరంబు పట్టి నగుచు నయ్యాదవేంద్రుం డి ట్లనియె.

కన్నియమీద నా తలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నా వివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదుం బరులమూఁక వధించి కుమారిఁ దెత్తు వి
ద్వన్నుత! ద్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చు కైవడిన్.

వచ్చెద విదర్భ భూమికిఁ
జొచ్చెద భీష్మకుని పురము సురుచిరలీలం
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్.

అని పలికి రుక్మిణీదేవి పెండ్లినక్షత్రంబు దెలిసి దన పంపున రథసారథి యైన దారకుండు శైబ్య సుగ్రీవ మేఘ పుష్ప వలాహకంబులను తురంగంబు లం బూల్చి రథమాయత్తంబు చేసి తెచ్చిన నమోఘ మనోరథుండైన హరి తానును బ్రాహ్మణుండును రథారోహణంబుఁ జేసి యేకరాత్రం బున నా నర్తకదేశంబులు గడచి విదర్భదేశంబునకుం జనియె నందుఁ గుండిన పురీశ్వరుం డైన భీష్మకుండు కొడుకునకు వశుండై కూఁతు శిశుపాలున కిత్తునని శోభనోద్యోగంబులు చేయించె నప్పుడు.

రచ్చలు గ్రంతలు రాజమార్గంబులు

విపణిదేశంబులు విశదములుగఁ
జేసిరి చందనసిక్త తోయంబులు
గలయంగఁ జల్లిరి కలువడములు
రమణీయ వివిధతోరణములుఁ గట్టిరి
సకల గృహంబులు చక్కఁ జేసి
కర్పూర కుంకు మాగరుధూపములు పెట్టి
రతివలుఁ బురుషులు నన్ని యెడల.

వివిధవస్త్రములను వివిధమాల్యాభర
ణానులేపనముల నమరి యుండి
రఖిల వాద్యములు మహాప్రీతి మ్రోయించి
రుత్సవమున నగర మొప్పియుండె.

అంత నా భీష్మకుండు విహితప్రకారంబునం బితృదేవతల నర్చించి
బ్రాహ్మణులకు భోజనంబులు పెట్టించి మంగళాశీర్వచనంబులు
చదివించి రుక్మిణీదేవి నభిషిక్తంజేసి వస్త్రయుగళభూషితం గావించి రత్న
భూషణంబు లిడంజేసి ఋగ్యజుస్సామధర్వణ మంత్రంబుల మంగళా
చారంబు లొనరించి భూసురులు రక్షాకరణంబు లాచరించిరి
పురోహితుండు గ్రహశాంతికొఱకు నిగమనిగదితన్యాయంబున
హోమంబు గావించె మఱియు నా రాజు దంపతుల మేలుకొఱకుఁ
దిల ధేను కలధౌత కనక చేలాది దానంబులు ధరణీదేవతల కొసంగెను. అయ్యవసరంబున.

బంధులఁ గూడి కృష్ణబలభద్రులు వచ్చినఁ బాఱదోలి ని
ర్బంధర వృత్తిఁ జైద్యునికి మానినిఁ గూర్చెద మంచు నుల్లస
త్సింధుర వీర రథ్య రథ సేనలతోఁ జనుదెంచి రా జరా
సంధుఁడు దంతవక్త్రుఁడును సాల్వ విదూరక పౌండ్రకాదులున్.

మఱియు నానాదేశంబుల రాజు లనేకు లేతెంచి రందు శిశుపాలు
నెదుర్కొని పూజించి భీష్మకుం డొక్కనివేశంబున నతని విడియించె
నంతఁ దద్వృత్తాంతంబు విని.

హరి యొకఁ డేఁగినాఁడు మగధాదులు చైద్యహితానుసారులై
నరపతు లెందఱేనిఁ జనినారు కుమారికఁ దెచ్చుచోట సం
గర మగుఁ దోడు గావలయుఁ గంసవిరోధికి నంచు వేగఁ దా
నరిగె హలాయుధుండు కమలాక్షునిజాడ ననేకసేనతోన్.

ఆ లోపల నేకతమున
నాలోల విశాల నయన యగు రుక్మిణి త
న్నా లోకలోచనుఁడు హరి
యాలోకము చేసి కదియఁ డని శంకితయై.

లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁ డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో.

ఘను డా భూసురు డేగెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపడో యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నా భాగ్య మెట్లున్నదో.

అని వితర్కించుచు.

పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవు వీటికి వాసుదేవుఁడున్

రాఁ డను నింకఁ బోయి హరి రమ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁ డను రుక్మికిం దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁ డను గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్.

చెప్పదు తల్లికిం దలఁపుజిక్కు దిశల్ దరహాస చంద్రికం
గప్పదు వక్త్రతామరస గంధసమాగత భృంగ సంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొని దురోజ పరస్పరసక్త హారముల్
విప్పదు కృష్ణమార్గగత వీక్షణపంక్తులు త్రిప్ప దెప్పుడున్.

తుడవదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడవదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన దన్న మేమియుం
గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్.

మృగనాభి యలఁదు మృగరాజ మధ్యమ
జలగములు నాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి
పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన
హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ
తొడవులు తోడవదు తొడవుతొడవు

తిలకమిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవుమాలి యనుచు

మఱియును.

మలఁగున్ మెల్లనిగాలికి బటురట న్మత్త ద్విరేఫాలికిం
దలఁగుం గోయల మ్రోఁతకై యలఁగు నుద్యత్కీరసంభాషలం
గలఁగున్ వెన్నెలవేఁడిమి న్నలఁగు మాకందాంకుర చ్ఛాయకుం
దొలఁగుం గొమ్మ మనోభవానల శిఖా దోదూయమానాంగి యై.

ఇట్లు హరిరాక కెదురుచూచుచు సకలప్రయోజనంబులయందును
విరక్తయై మనోజానలంబునం బొగిలెడి మగువకు శుభంబుఁ జెప్పు
విధంబున వామలోచనభుజంబు లదరె నంతఁ గృష్ణు నియోగంబున
వేగంబున బ్రాహ్మణుండు సనుదెంచిన నతని ముఖలక్షణంబుపలక్షించి
యా కలకంఠీ మహోత్కంఠతోడ నకూరీతయై మొగం బునం జిఱు
నగవు నిగుడ నెదురు సని నిలువంబడిన బ్రాహ్మణుం డి ట్లనియె.

మెచ్చె భవద్గుణోన్నతికి కమేయధనావళు లిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునకుం గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా!

అనిన వైదర్భి యి ట్లనియె.

జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశంమ్ముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీ కృపన్ బ్రదికితిన్ నీ యట్టి పుణ్యాత్మకుల్
గలరే దీనికి  నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ! సద్బంధు చింతామణీ!

అని నమస్కరించె నంత రామకృష్ణులు తన కూఁతువివాహంబునకు వచ్చుట విని తూర్యఘోషంబులతో నెదుర్కొని విధ్యుక్త ప్రకారంబునం బూజించి మధుపర్కంబు లిచ్చి వివిధాంబరాభరణంబులు మొదలైన కానుక లొసంగి భీష్మకుండు బంధుజన సేనా సమేతులైన వారలకుఁ దూర్ణంబున సకలసంపత్పరిపూర్ణంబులైన నివేశంబులు కల్పించి విడియించె నిట్లు కూడిన రాజుల కెల్లను వయో వీర్య బలవిత్తంబు లె ట్లట్ల కోరిన పదార్థంబు లెల్ల నిప్పించి పూజించె నంత విదర్భపురంబు ప్రజలు హరిరాక విని వచ్చి చూచి నేత్రాంజలులలం దదీయవదన కమల మధు పానంబు సేయుచు.

తగు నీ చక్రి విదర్భరాజసుతకుం దథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి నింతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా దర్పాహతారాతియై
మగఁ డౌఁగావుతఁ జక్రి యీ రమణికిన్ మాపుణ్యమూలంబునన్.

అని పలికి రా సమయంబున.

సన్నద్ధులై బహుశస్త్రసమేతులై
          బలిసి చుట్టును వీరభటులు గొలువ
ముందట నుపహారములుఁ గానికలుఁ గొంచు
          వర్గంబులై వారవనిత లేఁగఁ
బుష్ప గంధాంబర భూషణ కలితలై
          పాడుచు భూసురభార్య లరుగఁ
బణవ మర్దళ శంఖ పటహ కాహళ వేణు
          భేరీ ధ్వనుల మిన్ను పిక్కటిలఁగ

దగిలి సఖులు గొలువఁ దల్లులు బాంధవ

సతులుఁ దోడ రాఁగ సవినయముగ
నగరు వెడలి నడచె నగజాతకును మ్రొక్క
బాల చికుర పిహిత ఫాల యగుచు.

మఱియు సూతమాగధవందిగాయక పాఠకజను లంతంత నభినందించు
చుం జనుదేర మందగమనంబున ముకుంద చరణారవిందంబులు
డెందంబునఁ దలంచుచు నిందుధరసుందరీ మందిరంబు సేరి సలిల
ధారాధౌత కరచరణారవిందయై వార్చి శుచియై గౌరీసమీపంబునకుం
జనియె నంత ముత్తైదువ లగు భూసురోత్తముల భార్యలు భవసహిత
యైన భవానికి మజ్జనంబు గావించి గంధాక్షతంబు విలిడి వస్త్రమాల్య
భూషణాదుల నలంకరించి ధూపదీపంబు లొసంగి నానావిధోపహారంబులు
సమర్పించి కానిక లిచ్చి దీపమాలికల నివాళించి రుక్మిణీదేవిని మ్రొక్కించి
రప్పుడు.

**నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ముఁ పురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటి పె**
**ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయు మమ్మ నిన్**
**నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!**

అని గౌరీదేవికి మ్రొక్కి పతులతోడం గూడిన బ్రాహ్మణభార్యలకు
లవణా పూపంబులును దాంబూల కంఠసూత్రంబులను ఫలంబులు నిక్షుదండం
బులు నిచ్చి రుక్మిణీదేవి వారలం బూజించిన.

వార లుత్సహించి వలనొప్పి దీవించి
సేస లిడిరి యువతి శిరమునందు
సేస లెల్లఁ దాల్చి శివవల్లభకు మ్రొక్కి

మౌననియతి మాని మగువ వెడలె.

ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు
తెఱంగున మృగధరమండలంబు నిర్గమించి చరించు మృగంబు
చందంబునఁ గమలభవనర్తకుం డెత్తిన జవనిక మఱుఁగు దెరలి పొడసూపిన మోహినీదేవత కైవడి దేవ
దానవ సంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్య
మాణ పన్నగేంద్ర పాశ పరివలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల
మంథాన మథ్యమాన ఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవ మధ్యంబున
నుండి చనుదెంచు నిందిరాసుందరీవైభవంబున బహువిధ ప్రభా భాస
మానయై యిందుధర సుందరీ మందిరంబు వెలువడి మానస కాసార
హేమకమల కానన విహరమాణ మదరరాళంబు భంగి మంద
గమనంబునఁ గనక కలశ యుగళ సంకాశ కర్కశ పయోధర భార
పరికంప్య మాన మధ్యయై రత్నముద్రికాలంకృతంబైన కెంగేల నొక్క
సఖీలలా మంబు కైదండ గొని రత్ననివహ సమంచిత కాంచన కర్ణపత్ర మయూఖంబులు
గండభాగంబుల నర్తనంబులు సలుప నరవింద
పరిమళ కుతూహలావతీర్ణ మత్తమధు కరంబులమాడ్కి నరాళంబులైన కుంతలజాలంబులు
ముఖమండలంబునం గ్రందుకొన సుందర
మందహాస రోచులు దిశలందు బాలచంద్రికా సౌందర్యంబు నావహింప
నధర బింబఫలారుణ మరీచి మాలికలు రదన కుందకుట్మంబుల
కనురాగంబు సంపాదింప మనోజాతకేతన సన్నిభంబైన పయ్యెదకొంగు
దూఁగ సువర్ణమేఖలాఘటిత మణికిరణపటలంబుల కాల శక్రచాపజనకం
బులై మెఱయఁ జెఱుకువిలుతుం డొర వెఱికి వాఁడియడిదంబు
జళిపించిన ధగధగాయానంబులగు బాణంబుల పగిది సురుచిర
విలోకన నికరంబులు రాజవీరుల హృదయంబులు భేదింప శింజాన
మంజు మంజీర నినదంబులు చెవుల పండువులు సేయఁ బాద
సంచారంబున హరిరాక కెదురుచూచుచు వీరమోహినియై చనుదెంచు
సమయంబున.

అళినీలాలకఁ బూర్ణచంద్రముఖి నేణాక్షిం బ్రవాళాధరిన్
గలకంఠిన్ నవపల్లవాంఘ్రియుగళన్ గంధేభ కుంభస్తనిన్
బులినశ్రోణి నిభేంద్రయాన నరుణాంభో జాతహస్తన్ మహో
త్పలగంధిన్ మృగరాజమధ్యఁ గని విభ్రాంతాత్ములై రందఱున్.

మఱియు నయ్యింతిదరహాస లజ్జావనోకంబులం జిత్తంబు లేమఱి
ధైర్యంబులు దిగనాడి గాంభీర్యంబులు విడిచి గౌరవంబులు మఱచి
చేష్టలు మాని యెఱుక లుడిగి యాయుధంబులు దిగవైచి గజ తురగ రథా రోహణంబులు చేయనేరక
రాజు లెల్ల నేలకు వ్రాలి రా యేణీలోచన
తన వామకర నఖంబుల నలకంబులు దలంగం ద్రోయుచు నుత్తరీ
యంబు చక్క నొత్తుచుఁ గడకంటిచూపులం గ్రమంబున నా రాజ
లోకంబు నాలోకించుచు.

కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశ దే
హు నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్.

## కృష్ణుఁడు శత్రురాజులను చూచుచుండ రుక్మిణీదేవిని గొనిపోవుట

కని తదీయ రూప వయో లావణ్య వైభవ గాంభీర్య చాతుర్య
తేజోవిశేషంబులకు సంతసించి మనోభవ శరాక్రాంతయై రథారోహణంబు
గోరుచున్న యవ్వరారోహం జూచి పరిపంథిరాజలోకంబు చూచుచుండ
మంద గమనంబున గంధసింధురంబు లీలం జనుదెంచి భేరవంబుల
నడిమి భాగంబుగొని చను కంఠీరవంబు కైవడి నిఖిల భూపాలగణంబుల
గణింపక దృణీకరించి రాజకన్యకం దెచ్చి హరి తన రథంబు

మీఁద నిడికొని భువనభోంతరాళంబు నిండ శంఖంబు
పూరించుచు బలభద్రుండు తోడనడవ యాదవవాహినీ పరివృతుండై
ద్వారకానగర మార్గంబు వట్టి చనియెనంత జరాసంధవశు లయిన రాజు
లందఱు హరిపరాక్రమంబు విని సహింపనోపక.

ఘనసింహంబులకీర్తి నీచమృగముల్ గైకొన్నచందంబునన్
మనకీర్తుల్ గొని బాలఁ దోడ్కొనుచు నున్మాదంబుతో గోపకుల్
చనుచున్నా రదె శౌర్య మెన్నఁటికి మీ శస్త్రాస్త్రముల్ కాల్పనే
తనుమధ్యన్ విడిపింపమేని నగరే ధాత్రీజనుల్ క్రంతలన్.

అని యొండొరులఁ దెలుపుకొని రోషంబులు హృదయంబుల నిలుపుకొని సంరంభించి
తనుత్రాణంబులు వహించి ధనురాది సాధనంబులు
ధరియించి పంతంబులాడి తమతమ చతురంగబలంబులం
గూడి జరాసంధాదులు యదువీరుల వెంటనంటఁ దాఁకి నిలునిలు
మని ధిక్కరించి పలికి యుక్కుమిగిలి మహీధరంబుల మీఁద సలిలధారలు
కురియు ధారాధరంబుల చందంబున బాణవర్షంబులు గురియించిన యాదవ
సేనలం గల దండనాయకులు కోదండంబు లెక్కిడి గుణంబులు
మ్రోయించి నిలువంబడి రప్పుడు.

అరి బలభట సాయకముల
హరిబలములు కప్పఁబడిన నడరెడుభీతిన్
హరిమధ్య సిగ్గుతోడను
హరివదనముఁ జూచెఁ జకిత హరిణేక్షణ యై.

ఇట్లు చూచిన.

చొచ్చెద రదె యదువీరులు

ప్రచ్చెద రరిసేన నెల్ల వైరులు పెలుచన్
నొచ్చెదరును విచ్చెదరును
జచ్చెదరును నేఁడు చూడు జలజాతాక్షీ!

అని రుక్మిణీదేవిని హరి యూఱడించె నంత బలభద్రప్రముఖులైన
యదువీరులు ప్రళయవేళ మిన్నునం బన్ని బలుపిడుగు లడరించు పెను
మొగిళుల వడువున జరాసంధాది పరిపంథిరాజచక్రంబు మీఁద నవక్ర
పరాక్రమంబున శిఖిశిఖా సంకాశ నిశిత శిలీముఖ నారాచ భల్ల ప్రముఖంబు
లైన బహువిధ బాణ పరంపరలు గురియ నదియును విదళిత మత్త
మాతంగంబును విచ్ఛిన్నతురంగంబును విభిన్నరథవరూథంబును
వినిహత పదాతి యూథంబును విఖండిత వాహ వారణ రథారోహణ
మస్త కంబును విశకలిత వక్షో మధ్య కర్ణ కంఠ కపోల హస్తంబును విస్ఫోటిత కపాలంబును వికీర్ణ
కేశజాలంబును విపాటిత చరణ జాను జంఘంబును
విదళిత దంత సంఘంబును విఘటిత వీర మంజీర కేయూరంబును
విభ్రష్ట కుండల కిరీట హారంబును విశ్రుత వీరాలాపంబును విదార్యమాణ
గదా కుంత తోమర పరశు పట్టిస ప్రాస కరవాల శూల చక్ర చాపంబును
వినిపాతిత కేతన చ్ఛత్ర చామరంబును విలూన తనుత్రాణంబును
విలీయమాన ఘోటక సంఘ రింఖా సముద్ధూత ధరణీపరాగంబును
వినష్ట రథ వేగంబును వినివారిత సూత మాగధ వంది వాదంబును
వికుంఠిత హయహేషా పటహ భాంకార కరటి ఘటా ఘీంకార రథనేమి
పటపటాత్కార తురగ నాభిఘంటా ఘణాత్కార వీరహుంకార భూషణ ఝణఝణాత్కార నిస్సాణ
ధణధణా త్కార మణినూపురక్రేంకార
కింకిణీ కిణకిణాత్కార శింజనీటంకార భట పరస్పర ధిక్కార నాదంబును వినిర్భిద్యమాన
రాజసమూహంబును విద్య మాన రక్తప్రవాహంబును
విశ్రూయమాణ భూత వేతాళ కలకలంబును విజృంభమాణ ఫేరవ కాక
గృధ్ర కంకాది సంకులంబును బ్రచలిత కబంధం బును బ్రభూత పలల
గంధంబును బ్రదీపిత మేదో మాంస రుధిర ఖాదం బును బ్రవర్తిత

ఢాకినీప్రమోదంబును నై యుండ నప్పుడు.

మగిడి చలించి పాఱుచును మాగధముఖ్యులు గూడి యొక్కచో
వగచుచు నాలిఁ గోల్పడినవానిక్రియం గడు వెచ్చ నూర్చుచున్
మొగమునఁ దప్పిదేరఁ దమ ముందటఁ బొక్కుచునున్న చైద్యుతోఁ
బగతుర చేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే.

అని మఱియును.

బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండినఁ
బ్రతుకు గలిగెనేని భార్య గలదు
బ్రతికితీవు భార్యపట్టు దయ్య మెఱుంగు
వగవ వలదు చైద్య వలదు వలదు.

వినుము. దేహధారి స్వతంత్రుండు గాఁడు. జంత్రగాని చేతి జంత్రపు
బొమ్మ కైవడి నీశ్వరతంత్ర పరాధీనుండై సుఖదుఃఖంబులందు
నర్తనంబులు సలుపుఁ దొల్లి నేను మధురాపురంబుపైఁ బదియేడు
మాఱులు పరాక్రమంబున విడిసి సప్తదశవారంబులు చక్రించేత బరాజిత బలచక్రుండనై
కామపాలు చేతం బట్టుబడి కృష్ణుండు కరుణసేసి విడిపించి పుచ్చిన వచ్చి
క్రమ్మఱ నిరువదిమూఁ డక్షౌహిణులం గూడుకొని పదునెనిమిదవమాఱు
దాడిచేసి శత్రువులం దోలి విజయంబు చేకొంటి నిట్టి జయాపజయంబు
లందు హర్షశోకంబులం నేనెన్నండునుం జెంద నేఁటిదినఁబున నీ కృష్ణు
నెదిరిపోర మన రాజలోకం బెల్ల నుగ్రాక్షుల గూడికొని పోరినోడుదు
మింతియగాక దైవయుక్తం బయిన కాలంబునం జేసి లోకంబులు
పరిభ్రమించుచుండు నదియునుం గాక.

తమకుం గాలము మంచిదైన మనలం ద్రైలోక్యవిఖ్యాతి వి

క్రములన్ గెల్చిరి యాదవుల్ హరిభుజాగర్వంబునన్ నేఁడు కా
లము మేలై చనుదెంచెనేని మనమున్ లక్షించి విద్వేషులన్
సమరక్షోణి జయింత మింతపనికై శంకింప నీ కేటికిన్.

అని యిట్లు జరాసంధుండు నతని యొద్దిరాజులును శిశుపాలుని పరి
తాపంబు నివారించి తమ తమ భూములకుఁ జనిరి. శిశుపాలుండు
ననుచర సేనా సమేతుండై తన నగరంబునకుం జనియె. నంత రుక్మి
యనువాఁడు కృష్ణుండు రాక్షసవివాహంబునం దన చెలియలిం గొని
పోవుటకు సహింపక నేకాక్షౌహిణీబలంబుతోడ సమరసన్నాహంబునం
గృష్ణుని వెనుదవిలి పోవుచుఁ దన సారథితో ని ట్లనియె.

బల్లిదు నన్ను భీష్మజనపాల కుమారకుఁ బిన్నచేసి నా
చెల్లెలి రుక్మిణిం గొనుచుఁ జిక్కని నిక్కపు బంట పోలె నీ
గొల్లఁడు వోయెడిన్ రథముఁ గూడఁగఁ దోలుము తేజితోల్లస
ద్భల్ల పరంపరన్ మదముఁ బాపెదఁ జూపెద నా ప్రతాపమున్.

అని యిట్లు రుక్మి యనువాఁడు హరికొలంది యెఱుంగక సారథి
నదలించి రథంబు గూడం దోలించి గోపాలక వెన్నముచ్చ నిమిష
మాత్రంబు నిలు నిలు మని తిరస్కరించి బలువింట నారి యెక్కించి
మూఁడు వాఁడితూపుల హరి నొప్పించి యి ట్లనియె.

మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ
    నేపాటిగలవాఁడ వేది వంశము
మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి
    వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు
    మాయ గైకొని కాని మలయ రావు

నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు
వసుధేశుఁడవు గావు వావి లేదు

కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువవేని విలయకాల
శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు.

అని పలికిన నగధరుండు నగి యొక్క బాణంబున వాని కోదండంబు
ఖండించి యాఱు శరంబుల శరీరంబు దూఱనేసి యెనిమిది విశిఖం
బుల రథ్యంబులం గూల్చి రెండమ్ముల సారథింజంపి మూడు వాఁడి
తూపులం గేతనంబుఁ ద్రుంచి మఱియు నొక్క విల్లందినం ద్రుంచి
వెండియు నొక్క ధనువు పట్టిన విదళించి క్రమంబునఁ బరిఘ పట్టిస
శూల చర్మాసి శక్తి తోమరంబులు ధరియించినం దునుకలు చేసి క్రమ్మఱ
నాయుధంబు లెన్ని యెత్తిన నన్నియు శకలంబులు గావించె నంతటం
దనివిజనక వాఁడు రథంబు డిగ్గి ఖడ్గహస్తుండై దవానలంబుపైఁ
బడు మిడుత చందంబునం గదిసిన ఖడ్గ కవచంబులు చూర్ణంబులు
చేసి సహింపక మెఱుంగులు చెదర నడిదంబు పెఱికి జళిపించి వాని శిరంబు తెగ వ్రేయుదు నని
గమకించి నడచుచున్న నడ్డంబు వచ్చి రుక్మిణీదేవి హరిచరణార విందంబులు పట్టుకొని యి ట్లనియె.

నిన్ను నీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామలకీర్తిశోభిత! సర్వలోకశరణ్య! మా
యన్న యీతఁడు నేడు చేసె మహాపరాధము నీ యెడన్
నన్ను మన్నన చేసి కావు మనాథనాథ! దయానిధీ!

కల్ల లేదని విన్నవించుట గాదు వల్లభ! యీతనిన్
బ్రల్లదుం దెగఁజూచితేనియు భాగ్యవంతుల మైతి మే

మల్లుఁ డయ్యె ముకుందుఁ డీశ్వరుఁ డంచు మోదితు లైన మా
తల్లిదండ్రులు పుత్ర శోకము దాల్చి చిక్కుదు రీశ్వరా!

అని డగ్గుత్తికతో మహాభయముతో నాకంపితాంగంబుతో
వినత శ్రాంత ముఖంబుతో శ్రుతిచల ద్వేణీ కలాపంబుతోఁ
గనుదోయిం జడిగొన్న బాష్పములతోఁ గన్యాలలామంబు మ్రొ
క్కిన రుక్మిం దెగ వ్రేయఁ బోక మగిడెం గృష్ణుండు రోచిష్ణుఁడై.

ఇట్లు చంపక బావా రమ్మని చిఱునగవు నగుచు వానిం బట్టి బంధించి
గడ్డంబును మీసంబునుం దలయును నొక కత్తివాతి
యమ్మున రేవులు వాఱఁ గొఱిగి విరూపింజేసె
నంతట యదువీరులు పరసైన్యంబులం బాఱఁదోలి తత్సమీపంబునకు
వచ్చి రప్పుడు హతప్రాణుండై కట్టుబడి యున్న రుక్మిం జూచి కరుణజేసి
కామపాలుండు వాని బంధంబులు విడిచి హరి డగ్గఱి యి ట్లనియె.

తల మనక భీష్మనందనుఁ
దలయును మూతియును గొఱుగఁ దగవే? బంధుం
దలయును మూతియు గొఱుగుట
తల తఱుఁగుటకంటెఁ దుచ్ఛతరము మహాత్మా!

కొందఱు రిపు లని కీడును
గొందఱు హితు లనుచు మేలు గూర్పవు నిజమీ
వందఱి యందును సముఁడవు
పొందఁగ నేలయ్య విషమబుద్ధి ననంతా!

# సహోదరుని భంగమునకు భిన్న యగు రుక్మిణీదేవిని బాలభద్రుం డూరార్చుట

అని వితర్కించి పలికి రుక్మిణీదేవి నుపలక్షించి యిట్లనియె.

తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు నె
గ్గాడం జూడకు మమ్మ పూర్వభవ కర్మాధీన మై ప్రాణులం
గీడున్ మేలును జెందు లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మశేష పరిభూతుం డయ్యె నేఁ డియ్యెడన్.

చంపెడి దోషము గలిగినఁ
జంపఁ జనదు బంధుజనులఁ జను విడువంగాఁ
జంపిన దోషము సిద్ధము
చంపను మఱి యేల మున్న చచ్చినవానిన్.

బ్రహ్మచేత భూమిపతుల కీధర్మంబు
కల్పితంబు రాజ్యకాంక్షఁజేసి
తోడిచూలు నయినఁ దోడఁబుట్టినవాఁడు
చంపుచుండుఁ గ్రూరచరితుఁ డగుచు.

భూమికి ధనధాన్యములకు
భామలకును మానములకుఁ బ్రాభవములకుం
గామించి మీఁదు గానక
శ్రీ మదమున మానధనులు చెనకుదు రొరులన్.

వినుము. దేవ మాయం జేసి దేహాభిమానులైన మానవులకుఁ బగవాఁడు
బంధుం డుదాసీనుం డను భేదంబు మోహంబున సిద్ధం బయి యుండు జలాదుల
యందుఁ జంద్రసూర్యాదులును ఘటాదులందు గగనంబును బెక్కులై

కానంబడు భంగి దేహధారుల కందఱకు నాత్మ యొక్కండయ్యును
బెక్కండ్రై తోఁచు నాద్యంతంబులు గల యీ దేహంబు ద్రవ్య ప్రాణ
గుణాత్మకంబై యాత్మ యందు నవిద్య చేతఁ గల్పితంబై దేహిని
సంసారంబునం ద్రిప్పు సూర్యుండు తటస్థుండై యుండం బ్రకాశ
మానంబులైన దృష్టి రూపంబులుంబోలె నాత్మ తటస్థుండై యుండ
దేహేంద్రియంబులు ప్రకాశమానంబు లగు నాత్మకు వేఱొక్కటితోడ
సంయోగవియోగంబులు లేవు వృద్ధి క్షయంబులు చంద్రకళలకుంగాని
చంద్రునికి లేని కైవడి జన్మనాశంబులు దేహంబునకుంగాని యాత్మకుఁ
గలుగనేరవు నిద్రబోయినవాఁ డాత్మను విషయఫలానుభవంబులు
చేయించు తెఱంగున నెఱుక లేని వాఁడు నిజము గాని యర్థంబు లందు
ననుభవము నొందుచుండుఁ గావున.

అజ్ఞానజ మగు శోకము
విజ్ఞాన విలోకనమున విడువుము నీకుం
బ్రజ్ఞావతికిం దగునే
యజ్ఞానులభంగి వగవ నంభోజముఖీ!

ఇట్లు బలభద్రుచేతఁ దెలుపంబడి రుక్మిణీదేవి దుఃఖంబు మాని యుండె
నట రుక్మి యనువాఁడును బ్రాణావశిష్టుండై విడువంబడి తన విరూప
భావంబునకు నెరియుచు హరిం గెలిచికాని కుండినపురంబు జొర నని
ప్రతిజ్ఞ సేసి తత్పుర సమీపంబున నుండె నివ్విధంబున.

## శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని బెండ్లియాడుట

రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెల్చి రాజస మొప్పన్
రాజిత యగు తన పురికిని

రాజాననంc దెచ్చె బంధురాజి నుతింపన్.

అంత నయ్యాదవేంద్రుని నగరంబు సమారబ్ద వివాహకృత్యంబును ప్రవర్తమాన గీత వాద్య నృత్యంబును ప్రతిగృహాలంకృత విలసితాశేష నరనారీ వర్గంబును బరిణయ మహోత్సవ సమాహూయమాన మహీపాల గజఘటా గండమండల దానసలిలధారా సిక్త రాజమార్గంబును ప్రతిద్వార మంగళాచార సంఘటిత క్రముక కదళికా కర్పూర కుంకుమాగరుధూపదీప పరిపూర్ణకుంభంబును విభూషిత సకల గృహవేదికా కవాటదేహళీ స్తంభంబును విచిత్ర కుసుమాంబర రత్నతోరణ విరాజితంబును సముద్ధూత కేతన విభ్రాజితంబును నై యుండె న య్యవసరంబున.

ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతోహారిణిన్ మాన వై
భవ గాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం
ధవ సత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్య సంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్.

సతులుం దారును బౌరులు
హితమతిఁ గానికలు దెచ్చి యిచ్చిరి కరుణో
న్నత వర్ధిష్ణులకును మా
నిత రోచిష్ణులకు రుక్మిణీ కృష్ణులకున్.

హరి పెండ్లికిఁ గైకేయక
కురు సృంజయ యదు విదర్భ కుంతి నరేంద్రుల్
పరమానందముఁ బొందిరి
ధరణీశులలోన గాఢ తాత్పర్యములన్.

హరి యీ తెఱఁగున రుక్మిణి

నరుదుగఁ గొనివచ్చి పెండ్లియాడుట విని దు
ష్కరకృత్య మనుచు వెఱఁగం
దిరి రాజులు రాజసుతులు దిక్కుల నెల్లన్.

అనఘ! యాదిలక్ష్మి యైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు.

అని చెప్పి

**కువలయ రక్షా తత్పర!**
**కువలయదళ నీలవర్ణ కోమల దేహా!**
**కువలయనాథ శిరోమణి**
**కువలయజన వినుత విమల గుణసంఘాతా!**

**సరసిజనిభ హస్తా! సర్వలోకప్రశస్తా!**
**నిరుపమశుభమూర్తీ! నిర్మలారూఢకీర్తీ!**
**పరహృదయవిదారీ! భక్తలోకోపకారీ!**
**గురుబుధజన తోషీ! ఘోరదైతేయశోషీ!**

ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతం బయిన శ్రీమహాభాగతం బను మహాపురాణంబు నందు దేవకీదేవి వివాహంబును గగనవాణీ శ్రవణంబును గంసోద్రేకంబును వసుదేవ ప్రార్థనయును యోగమాయా ప్రభావంబును బలభద్రుని జన్మంబును బ్రహ్మాది సుర స్తోత్రంబును గృష్ణావతారంబును ఘోష ప్రవేశంబును యోగనిద్రా చరితంబును నంద పుత్రోత్సవంబును బూతనా సంహారంబును శకట భంజనంబును దృణావర్తు మరణంబును గ ర్గాగమనంబును నారాయణాది నామ నిర్దేశంబును బాలక్రీడయును మృ

దృక్షణంబును  వాసుదేవ వదనగహ్వర విలోక్యమా నాఖిల లో కాలోకనంబును  నవనీత చౌర్యంబును యశోదా రోషంబు  నులూఖల బంధనంబు  నర్జునతరుయుగళ నిపాతనంబును  నలకూబర మణిగ్రీవుల శాప మోక్షణంబును  బృందావన గమనంబును  వత్స పాలనంబును  వత్సాసుర వధయును  బకదనుజ విదారణంబు  నఘాసుర మరణంబును  వ త్సాపహరణంబును  నూతన వత్స బాలక కల్పనంబును  బ్రహ్మ వినుతియు  గో పాలకత్వంబును  గార్దభాసుర దమనంబును  కాళియ ఫణి మర్దనంబును  గరుడ కాళియ నాగ విరోధ కథనంబును  బ్రలంబాసుర హింసనంబును  దవానల పానంబును  వర్షర్తు వర్ణనంబును  శరత్కాల లక్షణంబును  వేణు విలాసంబును  హేమంత సమయ సమాగమంబును  గోపక న్యాచరిత హవిష్య వ్రతంబును  గాత్యాయనీ సేవనంబును  వల్లవీ వస్త్రాపహరణంబును  విప్రవనితా దత్తాన్న భోజనంబు  నింద్రయాగ నివారణంబును  నంద ముకుంద సంవాదంబును  పర్వత భజనంబును  బాషాణ సలిల వర్షంబును  గోవర్ధ నోద్ధరణంబును వరుణకింకరుండు నందుని గొనిపోయిన హరి తెచ్చుటయును  వేణు పూరణంబును  గోపికాజన ఘోష నిర్గమంబును  యమునాతీర వన విహరణంబును  గృ ష్ణాంతర్ధానంబును  ఘోషకామినీ గ ణాన్వేషణంబును  గోపికా గీతలును  హరి ప్రసన్నతయును  రాస క్రీడనంబును  జలకేళియును సర్పరూపకుం డైన సుదర్శన విద్యాధరుండు హరిచరణ తాడనంబున నిజరూపంబు పడయుటయును శంఖచూడుం డను గుహ్యకుని వధించుటయును  వృషభాసుర విదళనంబును  నారదోపదేశంబున హరి జన్మకథ నెఱంగి కంసుండు దేవకీవసుదేవుల బద్ధులం జేయుటయును  ఘోటకాసురుం డైన కేశియను దనుజుని వధియించుటయును  నారద స్తుతియును  వ్యోమదానవ మరణంబు  నక్రూ రాగమంబు  నక్రూర రామకృష్ణుల సల్లాపంబును  ఘోష నిర్గమంబును  యమునా జలాంతరాళంబున నక్రూరుండు హరి విశ్వరూపంబును గాంచుటయు  నక్రూర స్తవంబును  మథురానగర ప్రవేశంబును రజక వధయును  వాయక మాలికులచే సమ్మానంబు నొందుటయును  కుబ్జా ప్రసాద కరణంబును ధను ర్భంగంబును  గంసు దుస్స్వప్నంబును  గువలయాపీడ పీడనంబును  రంగస్థల ప్రవేశంబును జాణూర ముష్టికుల వధయును  గంస వధయును  వసుదేవదేవకీ బంధ మోక్షణంబు  నుగ్రసేను రాజ్య స్థాపనంబును  రామకృష్ణులు సాందీపుని వలన విద్య లభ్యసించుటయును  సంయమనీ నగర గమనంబును  గురుపుత్ర దానంబు  నుద్ధవుని ఘోష యాత్రయును  భ్రమరగీతలును  గు బ్జావాస గమనంబును  గరినగరంబునకు నక్రూరుండు చని కుంతీదేవి నూరార్చుటయును  గంసభార్య లగు నస్తి ప్రాప్తులు జరాసంధునకుఁ గంసు మరణం బెఱింగించుటయును  జరాసంధుని దండయాత్రయును మథురానగర నిరోధంబును  యుద్ధంబున జరాసంధుండు సప్తదశ వారంబులు పలాయితుం

డగుటయును నారద ప్రేరితుండై కాలయవనుండు మథురపై దాడివెడలుటయును ద్వారకానగర నిర్మాణంబును మథురాపుర నివాసులం దన యోగబలంబున హరి ద్వారకానగరంబునకుం దెచ్చుటయును కాలయవనుడు హరి వెంటజని గిరిగుహ యందు నిద్రితుండైన ముచికుందుని దృష్టి వలన నీఱగుటయును ముచికుందుండు హరిని సంస్తుతి చేసి తపంబునకుం జనుటయును జరాసంధుండు గ్రమ్మఱ రామకృష్ణులపై నేతెంచుటయును ప్రవర్షణ పర్వతారోహణంబును గిరి దహనంబును గిరి డిగ్గనుఱికి రామకృష్ణులు ద్వారకకుం జనుటయును రుక్మిణీ జననంబును రుక్మిణీ సందేశంబును వాసుదే వాగమనంబును రుక్మిణీ గ్రహణంబును రాజలోక పలాయనంబును రుక్మి యనువాని భంగంబును రుక్మిణీ కల్యాణంబును యను కథలుఁ గల దశమస్కంధంబు నందుఁ బూర్వభాగము సమాప్తము.

## సంపూర్ణము